MADRAS GOVERNMENT ORIENTAL MANUSCRIPTS

SERIES No. 60

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No.
10119

పతివ్రతా చరిత్రము

PATIVRATĀ CARITRAMU

EDITED BY

T. CHANDRASEKHARAN, M.A., L.T.,

Curator, Government Oriental Manuscripts Library, Madras

AND

the Staff of the Library

(*Under the orders of the Government of Madras*)

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10119

958

Price Rs. 4-20

894.8273
PAT

Rathnam Press (Branch),
65, Tiruppalli Street,
Madras-1.

AOOA104B139

INTRODUCTION

The present publication, PATIVRATĀCARITRAMU, is based on two manuscript copies available in the Government Oriental Manuscripts Library, Madras, and described under D. No. 1104 and 1105. D. No. 1105 is a palm leaf manuscript, while the other is on paper. The paper manuscript contains some brief notes in English written by Mr. C. P. Brown. Both the manuscripts are incomplete and contain the same extent.

PATIVRATĀCARITRAMU is a fine composition in Dvipada metre describing the greatness of "PĀTIVRATYA". The last story in this work as printed is numbered as 32 but eleven stories are missing within these 32 stories. So only twenty-one stories are brought to publication.

The name of the author is not known. It can be inferred however, by his style etc., that he should have flourished after Prabandha Poets. As the final colophon is not available, it is difficult to say how many stories he had written.

The work is closely modelled on Pālavēkari Kadirīpati's Śuka Saptati except that the author has refined the base erotic love of the novel. The pattern is identical in both, but each has a different motive and import. In Śuka Saptati, when a rich merchant goes abroad on one of his trade-trips, his beautiful wife, goaded on by a chamber maid of the king, tries to meet him in his palace; a parrot, reared as a pet, protects her chastity by engaging her every night with an ingenious story and thus keeps her at home till her master returns. The present work also moves on the same lines.

The stories of this work are gathered from many sources. The introduction and the story of Puṣpadanta are taken from Bhaṭṭa Sōma Dēvā's Kathā Saritsāgara. Some stories are found in Dharma Vyādha Upākhyāna (Mahā Bhārata), Bhōjarājīya, Simhāsana Dvātrimśati and Kēyūrabāhu Caritra. Others, like the stories of Arundhatī and Lōpāmudrā, are taken from Purāṇas. The story, resembling that of Sumati, who, by her supreme power of Pātivratya, stopped the day break to protect the life of her husband, has its source in the Mārkaṇḍēya Purāṇa. Durmēdha, the husband of the chaste

lady, is a close parallel to Guṇanidhi of Kāśīkhaṇḍa and Nigama Śarmā of Pāṇḍuraṇga Māhātmya. There are a few other popular stories also. All are absorbingly well written.

The narrating parrot in this work was no ordinary parrot. He was Sukīrti, the minister of a king by name Caṇḍa Pratāpa. He was well versed in all the arts, but having been under the spell of a curse which he brought on himself from a sage called Dalabhōji, he assumed the form of a parrot retaining all his mental powers. No wonder he was very shrewd and attractive in his talk even as a parrot and kings and chieftains came to hear him! This parrot, again is a close parallel to Śucimukhi as drāwn by Pingali Sūranna in his Prabhāvatī Pradyumna.

A merchant by name Dhanadatta bought this parrot. The parrot, in its turn, ordered some changes in its master's shop thus bringing on a boom in his business. But, its master was not happy for all the money, for, his son Kubēra Datta had fallen on evil ways neglecting his own beautiful young wife. How the parrot skilfully brought the young couple together makes an interesting reading.

The verse is sweet and simple. The poet has a flair for Śabdālaṁkāras. One relishes the sayings and idioms aptly used. Some of the words used in this work are taken as authoritative in Śabda Ratnākara. The influence of the great masters like Nannaya, Tikkana and Mukku Timmana is apparent.

Bhārat is a land famous for sages and Pativratās. The ideal of such life sustains not only individuals but the country as a whole. It is hoped that this book will be enjoyed by many of our devoted womenfolk.

My thanks are due to Pandits Sris M. Sarabhesvara Sarma and T. Sridharamurthy who prepared the press copy, did the collation and corrected the proofs.

Government
Oriental Manuscripts
Library, Madras-5.
22—4—1958

T. CHANDRASEKHARAN,
Curator.

LIBRARY OF REVIEW

మున్నుడి

మదరాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున నీపతివ్రతా చరిత్రమునకు రెండు మూలప్రతు లున్నవి. అవి డి. నెం 1104, 1105 లలో వర్ణితములు. అందు మొదటిది కాగితపుఁబ్రతి. రెండవది తాళపత్ర ప్రతి. కాగితపుఁ బ్రతియందు నెడనెడ బ్రౌనుదొరగారి యాంగ్లవివృతు లున్నవి. గ్రంథపాత ముభయప్రతులందు సమానము.

పతివ్రతాచరిత్రము పాతివ్రత్య ప్రభావమును బ్రకటించు ప్రశస్త ద్విపదకృతి. ఇందు ముప్పది రెండుకథ లున్నట్లు తెలియ వచ్చుచున్నది. కాని మూల ప్రతులయందుఁ బదునొకండుకథలు లుప్తములగుటచే నిరువది యొక్క కథలు మాత్రము ప్రకటింపఁబడెను.

ఈ కృతికర్తనామము తెలియవచ్చుట లేదు. కవితారీతులను బట్టి యీతఁడు ప్రబంధకవులకుఁ దరువాతివాఁడని యూహింపవలసి యున్నది గ్రంథాంత్యభాగము లేకుండుటంజేసి యీకవి యెన్నికథలు వ్రాసెనో తెలియ కున్నది.

పాలవేకరి కదిరీపతినాయక ప్రణీతమగు శుకసప్తతి (నీచ) శృంగార కథలు గలదగుటచేఁ బవిత్రమగు పతివ్రతాచరిత్రమును వ్రాయుతఱిం పీకవికిఁ గల్గినట్లు తోఁచుచున్నది శుకసప్తతియందు వణిగ్వరుఁడు దేశాంతర వ్యాపారగతుఁ డైనప్పుడు దూతికాప్రేరణమున నవైశ్యసుందరి రాజునభి మతము దీర్పఁ బోనుద్యమించును. ఆకాంతభావ మెఱిఁగి యయ్యింటి చిలుక బుద్ధిచెప్పి పతివచ్చునందాఁక (డెబ్బది దినములు) రేలెల్లఁ గథలతోఁ గాలహరణము చేయుచు నామెశీలమును గాపాడును. పతివ్రతా చరిత్రమునం దును కథ యిదేరీతి సాగినది. ఇందలి కథలన్నియుఁ జిలుకయొక్క "సదాశివ జటాజూట కలిత గంగాతరంగ ఘుమంఘుమోక్తుల" వెలువడినవే. ఈ కారణ ములచే నీ గ్రంథముకూడ శుకసప్తతివంటిదే. కాదు—శుకసప్తతియే!

ఇందలి కథలన్నియు ననేకగ్రంథములనుండి సంగ్రహింపఁ బడినట్లు తోఁచుచున్నది. అవతారికయుఁ బుష్పదంతుని వృత్తాంతము భట్టసోమదేవుని కథాసరిత్సాగరనుండలిది. నీ యెట్టిచూపునకుఁగొంగఁగానన్నకథకు మూలము భారతమందలి ధర్మవ్యాధోపాఖ్యానము. పతియనుమతిగాంచినసతి కథవంటిది భోజరాజీయమందును గలదు. సులోచనకథ సింహాసన ద్వాత్రింశతిలోనిదై యున్నది. కేయూరబాహుకథ కేయూరబాహు చరిత్రమునుండి యుద్ధరింపఁబడినది. అరుంధతి లోపాముద్ర మొదలగువారి కథలు పురాణ గృహీతములు. తెల్లవార కుండశపించిన సాధ్వికథ సుమతికథ వంటిదై యున్నది. అట్టి కథ మార్కండేయ పురాణమందును జూపట్టుచున్నది. ఈ కథయందలి దుర్మేధుఁడు కాశీఖండము పాండురంగమాహాత్మ్యములయందలి గుణనిధి నిగమశర్మలకు సైదోడు. విరళముగ జనులు చెప్పుచుండు చేపనవ్వినకథ, పులిని జంపినవానికిఁ బుత్రికనిచ్చు రాజుకథ మొదలగునవియు నిందుఁ గొన్ని కలవు. శయ్యాగానమ్మను కథకుఁ గ్రిందిశ్లోకమాధారము.

శయ్యా గానం చన్దనం చారుహాసో।
వీణా వేణుఃసున్దరీ యాచనారీ।
నభ్రాజన్తే ద్యూత్పిసాతురాణాం ।
సర్వారంభా స్తణ్డులప్రస్థమూలాఃI

ఈ కథలన్నియు నుత్తమసంవిధానములు గలవై రసవంతములై శ్రవణపేయములై యున్నవి. అరుంధతీదేవికథయందు నింద్రియ నిగ్రహముయొక్క ప్రభావము, సావిత్రికథయందు స్త్రీకిఁగల మృత్యువుతోనైన నెనుబొక్కనుశక్తి, కాళిగుడిలోఁ బతినివరించినసతికథలోఁ గొడుకుప్రాణము కంటె సతికి మానమే ప్రాణమనునీతి, బుద్ధికర్మములకథలోఁ గర్మముయొక్క యద్వితీయశక్తి, లోపాముద్రకథలోఁ బడఁతికిఁబతితోడిదేలోకమను నాదర్శము, మానవతికథయందు స్త్రీమానమునకు రక్షకుఁడు పురుషుఁడా? లేక స్త్రీయా యనుసమస్యకుఁ జక్కని సమాధానము, కిరాతసతికథలో నన్యదానములకంటె నన్నదానమునకుఁ గల వైశిష్ట్యము, ద్రౌపదీదేవి పూర్వజన్మ కథలో ద్రౌపది పంచవల్లభ యగుటలోఁగల రహస్యము చక్కఁగ రూపింపఁ

బడినవి. ఇట్లు కథలన్నియు లోకవ్యవహార సాధనభూతములు సంశయ విచ్ఛేదకములు సదుపదేశకములునై యున్నవి:

చండప్రతాపుని మంత్రివరుఁడగు సుకీర్తి సకలకళావిశారదుఁడు మేధావి, ఇతఁడు దళభోజిమునీంద్ర శిష్యశాపముచేఁ జిలుకతనముఁ బ్రాపించియుఁ దొంటి ప్రజ్ఞావైభవమును గోల్పోవనివాఁడు. ఈచిలుక మంజు భాషల వివిధేతిహాసములు ధర్మశాస్త్రము లుపన్యసించును. అందలి రహస్యములు విశదీకరించును. దీని వీక్షించుటకుఁ బలుకులను వినుటకు మన్నీలు, దొరలు, సామంతులు, మంత్రులు, ఎన్నికగలరాజులే క్రిక్కిఱియు దురన్నచో దాని పాండిత్యము ప్రజ్ఞాకౌశల మెట్టిదోకదా!

ఈచిలుక కొన్నివిషయములలోఁ బ్రభావతీప్రద్యుమ్నమందలి శుచిముఖికి నుద్ది యగుచున్నది. శుచిముఖి వచోనిపుణత్వమందు, సత్కథారచనలయందు, నీతివిచారత్వమునందు, బహుశ్రవావలోకచణతయందు నెందును సాటిలేనిది. వీనులకు సుధారసములసోనలు వర్షించు మృదులసుస్వరఘణితి గలది. అటు దేవకార్యము ఇటు ప్రభావతీప్రద్యుమ్నుల సమాగమము తన ప్రజ్ఞాకౌశల్యముచే జోడించి యింద్రోపేంద్రుల మన్నన వడసినది. పతివ్రతా చరిత్రమందలి చిలుకయు విద్యావైదుష్యమునఁ గార్యసాధక నైపుణ్యమున శుచిముఖితో నెంతమాత్రమును దీసిపోవునది కాదు. ధనదత్తునికిఁ దా నమ్మినఁడు పోయిన తరువాత నతనివ్యాపార మభివృద్ధియగుటకు నంగడిలోఁ గ్రొత్తమార్పులు తెచ్చిపెట్టెను. గడియలో వెయ్యార్లు గడన కాఁజొచ్చెను. ధనదత్తుఁడు ధనమునకుఁ దోడయ్యెను. కాని యతఁడేదో మానసికవ్యథ ననుభవించుచున్నట్లు శుకము తెలిసికొనెను. అతనికుమారుఁడు కుబేరదత్తుఁడు. విటనట వారనారీ పరాయణుఁడు. భార్య సౌందర్యరాశి. ఆమెను గన్నెత్తి చూడఁడు. చూచియే యుండలేదు. వీరిద్దరికిఁ గలయిక గలుగునెట్లు? వీరి సంసారము మూడుపూవులాఱుకాయ లగునెన్నఁడు? ఈ సందర్భమునఁ జిలుక చూపించినతేర్పు అసమానము. కుబేరదత్తుఁడు ఇలువీడలేదు. ధనదత్తుఁడు చిలుకను దనపాలిటి దైవమని తలంపని నిమిసము లేదు.

పతివ్రతా చరిత్రమందలి కవిత సరళము సుందరము మధురము. శబ్దా
లంకారములపైఁ గవికిఁ గొంత మోజు. అపూర్వములైన నానుడులు జాతీ
యములు పాలుతోఁ జక్కెరవలె భావములతో బెరసియున్నవి. ఇందలి
ప్రయోగములు శబ్దరత్నాకరకర్త గ్రహించునంతటి ప్రామాణికత్వమును
బడసియున్నవి. (చూ. శ. ర. 17 పుట. అచ్చాళు. అచ్చము+ఆళు=
జంజాటము లేనివాఁడు. ఆళు. అన్య, దే)

కొన్నిపట్టుల గ్రంథాంతర సాదృశ్యములు చూపట్టుచున్నవి.

అలినీలవేణి!

దీని కులంబేమి దీని పేరేమి
యీనాతిపతి యెవ్వఁ డిన్నినాళ్లాయె
నిచ్చటి కరుదెంచి యేపని సేయు
నిచ్చంద్రముఖి దెల్పు మిదియెల్ల ననిన (ప. చ. పు. 121)

ఇయ్యరవిందగంధికుల మేమి చరిత్రము చంద మెద్ది పే
రెయ్యది నాథుఁడె వ్వఁడిది యెచ్చట నెప్పుడు నుండు నిట్లు దా
నియ్యెడ కేగుదేవలయు టేపనిసేయఁగఁ బూని దీనిపై
నెయ్యము కల్మి యేకొలఁది నీమది కింతయు నాకుఁ జెప్పుమా

(భారతము. వి. పర్వ. 2 ఆ. ప. 40)

నీమంత్రి సత్తముం డీతఁ
డేనా! మహామహుండెపో యటంచు. (ప. చ. పుట 161)

వీరెవ్వరయ్య! ద్రుపదమ
హారాజులె! యిట్లు కృపణులయి పట్టువడన్
వీరికి వలసెనె! యహహా! మ
హారాజ్యమదాంధకారమది వాసెనొకో!

(భారతము. ఆది. పర్వ. 6 ఆ, ప. 89

పల్లవ గ్రాసకషాయ

కలకంఠ కలకంఠి గతి నిట్టులనియె. (ప. చ. పుట. 126)

బాలపల్లవ

గ్రాస కషాయకంఠ కలకంఠవధూ కలకాకలీధ్వనిన్,

(పారిజాతాపహరణము)

నాఁటికే యొక్కఁక్షణమ్ము గావించె. (ప. చ. పుట. 176)

రాత్రిరేవ వ్యరంసీత్. (ఉ. రా. చరిత్ర)

భరతభూమి పతివ్రతాకరము. హరిహరబ్రహ్మలఁ బురుటిబిడ్డలఁ జేసి జోలఁబాడిన పురంధ్రీలలామ లెందఱో మనదేశమును బావనమొనర్చి యున్నారు. అట్టి పతిదేవతా దివ్యచరిత్రలను జదివి వారి నాదర్శముగఁగొని తమ జీవితమును దేశమును ధన్యతమము గావించు వర్తనము వనితాలోక మున కావశ్యకమైయున్నది. అట్టివారికీ గ్రంథము మిక్కిలి తోడ్పడఁ గల దని యాశింప వచ్చును.

"యత్రనార్యస్తు పూజ్యన్తే రమన్తే తత్రదేవతాః"

ఈ గ్రంథమును తదితర ప్రతులతో సరిపోల్చి ముద్రణ ప్రతిని తయారు చేయుటలోను, పూర్ఫులు సరిదిద్దుటలోను నాకు తోడ్పడిన పండితులుగా బనిచేయుచున్న శ్రీ. మ. శరభేశ్వరశర్మకి, శ్రీ. తి. శ్రీధరమూర్తికి నాకృతజ్ఞత తెలియ జేయుచున్నాను.

24-4-1958

తి. చంద్రశేఖరన్.

విషయసూచి

		పుట.
1.	అవతారిక	1
2.	పుష్పదంతుని కథ	2
3.	చండప్రతాపుని కథ	10
4.	ఆరుంధతీదేవి కథ	33
5.	సావిత్రి కథ	40
6.	"కరాగ్రేకంకణం" అన్నకథ ...	49
7.	"శయ్యాగానం" అనినవనిత కథ ...	59
8.	పతియనుమతి గాంచిన సతి కథ ...	70
9.	తెల్లవారకుండ శపించినసాధ్వి కథ ...	80
10.	మానవతి కథ	93
11.	విధి విధాతల కథ	110
12.	సులోచన కథ	125
13.	కాళిగుడిలో సతి పతిని వరించిన కథ ...	133
14.	కలభాషిణి కథ	166
15.	బుద్ధి కర్మముల కథ	186
16.	రాజశేఖరుని కథ	200
17.	కొండగుమ్మడి కాయల కథ ...	232
18.	నీ "ఎఱ్ఱచూపునకు కొంగఁగా" నన్న కథ ...	240
19.	గంధర్వ కన్య కథ	247
20.	లోపాముద్ర కథ	256
21.	కేయూర బాహుని కథ	264
22.	శుకగాంధర్వ కథ	288
23.	కిరాతసతి కథ	298
24.	ద్రౌపదీదేవి పూర్వ జన్మకథ	305

పతివ్రతాచరిత్రము

శ్రీమహితమహర్షి సేవ్యమై వెలయు । నైమిశారణ్యపుణ్యక్షేత్రమునను
శౌనకాదికమునీశ్వరులొకనాఁడు । జ్ఞానియౌ రౌమహర్షణిఁ జూచి యనిరి
మును శైలసుతకు శంభుఁడు పూర్వకథలు।వినిపించెనని బుధుల్ వివరింప మేము
వినియుందు మాకథల్ వివరింపవలయు । ననిన సూతుం డామహర్షుల కనియె
శ్రీకరచిరతపస్సిద్ధుల ఘనతఁ । జేకొన్నశివయోగసిద్ధులచేత
లోకబాంధవనిభాలోకంబుగని వి । లోకింపఁదగు భక్తలోకంబుచేత
దరము చూపెడు నిజోదరము చీఁకట్లఁ । దఱుము మాణిక్యకందరములచేత
నొనరు నీలప్రభావనము లార్యాభ । వనములౌ శృంగారవనములచేత
సరసిజప్రముఖకేసరములరుచి వి । సరములఁ బచ్చనౌ సరముల చేత
డంబుగా నుడులకూటంబుల నాయి । తంబులౌ రత్నకూటంబుల చేత
ప్రాఁగెంపురంగు కెంబట్టులపరపు । బాగొందనగు రచ్చపట్టులచేత
సరిలేని సిరులూని సవురొందు రజత । గిరియందు శరదిందుకిరణబృందముల
హసియించు పసమించు నంగంబు మెఱయ । నసమానలసమానహరినీలకాంతి
గదుదెప్ప మెడకప్ప కరమొప్పగులుక । నిడికెంపు జడగుంపు నెఱిసంజకావి
తలపింపఁ బలుసంపదల మించు యక్షు । కులనేత బలుభూతకోటితోఁగొలువ
నజముఖుల్ గజముఖుండాదియౌదొరలు।భజియింప నొకనాఁడుభద్రాసనమునఁ
బేరోలగంబుండి భృంగిహాస్యంబు । భూరిహాస్యంబునఁ బ్రొద్దుపుచ్చుచును
తుంబురు నారదాదులపాట వినుచు । శంబరాంతకుకాంతఁ జక్కఁదనాన
నగజాలు రుద్రకన్యా సహస్రములు । తగునూడిగంబు లెంతయు భక్తిసేయ
విలసిల్లు తనభర్త విశ్వైకర్త । ఖలదైత్యభటహర్త ఘనగుణోద్ధర్తఁ
గనుగొని హిమశైలకన్యాలలామ।తనహస్తములు మోడ్చి తగుభక్తి మ్రొక్కి
మొలక లేనవ్వు కెమ్మోవిపైఁ జిలుక । తళుకుఁజెక్కుల రత్నతాటంకరుచులు
తళతళగులుక చెంతల చిల్కతనదు । పలుకుఁజక్కెర యంచు బాళి వహింప
వినయంబు ప్రియమును విస్తరిలంగ । ఘనసుధామధురవాక్ప్రౌఢి నిట్లనియె

శివ శంకర మహేశ స్థిరసత్ప్రకాశ । యవధారు పరమేశ యాకాశకేశ
సకలలోకములకు సాక్షివి కర్త । వలంకకృపఁ బ్రోచు నాదిదేవుఁడవు
ఈ వెఱుంగనికథ లీప్రపంచమున । లేవుగదా కబళీకృతగరళ !
యే నెన్నడునుగాని యెఱుఁగనియవియు । వీనులవిందు గావించునట్టివియుఁ
గదువిచిత్రములు నౌ కథలాలకింపఁ । బొడమెఁ గౌతూహలంబు మనంబునందు
వినదగుధర్మముల్ వివిధవ్రతములు । మనురహస్యములు సమస్తతంత్రములు
నానతిచ్చితిరికదా యింక వింత । లైనకథల్ రహస్యంబుగా నాకు
వినిపింపవలెనని వేడుచునున్న । తనదేవి మోమునెత్తమ్మి లేనగవు
మొనయ వీక్షించి శంభుఁడు బోటి నీవు । వినినికథల్ గలవే ! ప్రపంచమున
నీవెఱుంగనికథ లేమున్నవైన । నే వినింతుఁ గొన్ని విశేషకథలు
వెలఁది రేపటినుండి విందుఁగాకనుచు । పలికి మర్నాఁడు రేపటిపూట గౌరి
బంగాహు పనులయుప్పరిగపై తావి । చెంగల్వవిరులమించిన చప్పరంబు
లో విడికెంపుమేల్తూఁగుటుయ్యాల । నావేళవసియించి యలరుచు గిరిజ
వామాంకముననుండి వలనొప్పువినఁగ । నామహేశ్వరుఁడు బాహ్యద్వారసీమ
నందీశునునిచి యెంతటివారినైన । నిందురానియ్యకుమీ యనిపనిచి
యతివిచిత్రతరంబులై యింపొనర్చు । కతలు సెప్పఁదొడింగెఁ గడురహస్యముగ

పుష్పదంతుని కథ

ఆయెడఁ బుష్పదంతాహ్వయప్రమథ । నాయకుం డభవు సందర్శించుకొఱకు
వడిఁ బాఱుదెంచి యవ్వాకిలిఁజొరఁగఁ । గడగిన నంది యెక్కడఁబోయెదీవు
నెలమిఁ బుత్రులనైన నిందురానీయ । వలదని సెలవిచ్చె వామదేవుండు
దేవికేమొ హితోపదేశమీవేళఁ । గావింపుచున్నాఁడు కడురహస్యముగ
నీకుఁబోఁగూడదు నిలువుమటన్నఁ । బోకనిల్చి వచించెఁ బుష్పదంతుండు
ఇదియేమి! నందీశ యెఱుఁగవే మమ్ము।మదనారి శయనించు మంజుతల్పమున
నవనవంబుగ మహానందుండు నేను । వివిధ ప్రసూనముల్ విస్తరించుటలు
ఏకాంతభక్తుల మీయీశ్వరునకు । మాకును నొకయడ్డమా! యిదేమయ్య
కన్నపుత్రులకన్నఁ గడుగారవించి।మన్నింపుదురు మమ్ము।మామహేశ్వరులు

అని చనవరిగాన నలపుష్పదంతుఁ । డనియెడిపెక్కువాక్యము లాలకించి
యేల రెట్టించెద విదివేళగాదు । చాలు నింటికిఁబొమ్ము చనవరివౌట
యెఱుఁగనొ! సంవాదమేల నంచవలఁ । జొఱనీని నందికేశుని యాజ్ఞదాటఁ
దనకుఁ గూడమిఁ బుష్పదంతుండు మఱలి । చని కొంతవడి కదృశ్యప్రకారమున
వాయువువలె బహిర్ద్వారంబుసొచ్చి । పోయె మాయావిధంబున మీఁదుగనక
అతఁడిట్లు శంభుసేవాధికుండయ్యు । మతకరియై తనమాయపెంపునను
హరుఁడార్యకెఱిఁగించునవి యాలకించు । కొఱకు లోపలఁజొచ్చి గొబ్బున నరిగి
విరిచప్పరంబునవ్రేలెడు పువ్వు । సరమునఁ దేఁటియై సయ్యన వ్రాలి
హరుఁడు నాఁటికిఁదెల్పు నకథలెల్ల । గురుబుద్ధియై పూసగ్రుచ్చినయట్లు
విని గ్రహియించి యవ్వేళకింటికిని । జనియె శంభుఁడు కథల్ చాలించెఁ గనుక
చని తనప్రియయైన జయకుఁదానాఁడు! వినినట్టి కథలెల్ల వేడ్కతోఁ దెలిపె
దినదినమ్మును మహాదేవుఁడీచంద । మున నపూర్వమ్ములై పొసఁగుసత్కథలు
లలనామణికి సప్తలక్ష లింపుగను । దెలిపె నన్నియు స్వబుద్ధివిశేషమునను
నెంతయుఁ దమి గ్రహియించి యాపుష్ప । దంతుండు తనతలోదరి కెఱిఁగించె
నీచందమునఁ బరమేశుచే గట్టు । డాచూలి బహువిచిత్రకథాచయంబు
విన్నవై యెవ్వాఁడువినని యావింత । లన్నియు నావయస్యల కెఱిఁగించి
యాశ్చర్యహర్షధుర్యలఁ జేతు ననుచు । నిశ్చయించి సమాధినిష్ఠుఁడై శివుఁడు
నలరెడు నొక్కసాయంతనవేళ । బలితంపు విడికెంపుపని మేడమీఁద
చందురాతిన్నెపై సవరొందుమేలి । కుందనంపుమెఱుంగుకోట్లరాణించు
సకినల పట్టెమంచంబుపై వింత । రకమొందు నికరంపురాయంచగఱుల
పానుపుపైఁ బొంకపఱచిన మల్లె । పూనెఱతాని గుప్పునఁగుప్పు జిలుగు
చలువదువ్వలువపై సరిలేనిమిసిమి । తలగడమీఁద నందంబుగా నొరగి
రమణియొక్కతె కప్పురపువిడెముసఁగ । కమలాక్షియొక్కతె కాళంజిఁబూన
వెలఁదులు నిద్దఱు వీచోపులిడఁగ । సొలపులాడి యొకర్తు సురటి వీవఁగను
కీరవాణియొకర్తు గిండిధరింప । చేరి పావడయొక్కచెలి పూని గొలువ
విద్యాధరి యొకర్తు వీణవాయింప । గద్యపద్యముల నొక్కతె ప్రస్తుతింపఁ
గొలువున్నయద్దేవిఁ గొలువ నేతెంచె । నలపుష్పదంతుని యంగన యపుడు

వచ్చి యద్దేవికి వలగొని మ్రొక్కి। హెచ్చు మచ్చికను రావే! జయ యనుచు
నంబ రావింపఁ దదంఘ్రుల యంతి । కంబునఁ దగు హొన్నుగద్దియ నుండి
పడతుక శ్రీగౌరిపాదముల్ తొడల । నిడుకొని యొత్తుచు నెలమిఁ గొల్వఁగను
చరణమ్ములొత్తెడు జయ మోము చూచి।గిరికన్య పలికె మిక్కిలిప్రమోదమున
వినవిన నింపుగా వింతలౌ కథలు । వనిత నీకేమైన వచ్చునే యనిన.
ఏనేమి యెఱుగుదు నీశ్వరి ! మీర । లానతిచ్చిన విందుననక యబ్బోటి
పతిచేతఁదాఁవిన్న బహుకథలందు । సతికిఁ గొన్నిక్రమంబెసంగ విన్పింప
తప్పక జయఁజూచి తరుణియిట్టి కథ । లెప్పుడు వింటి నీకివి యెన్నివచ్చు
ననవిని జయ పల్కె నమ్మరో ! యిట్టి । ఘనకథల్ పెక్కులఁటులు వచ్చుననిన
పవనసంచలిత దీపజ్వాలవోలె । శివ బుద్ధి చలియింప శీఘ్రంబె లేచి
యోగమంటపమున నున్నశంకరుని । నాగకేయూరుని నందివాహనునిఁ
జేరి కందోయికెంజిగి లోహితోత్ప । లారూఢిఁ దెగడఁబేరలుక నిట్లనియె
ఓదేవ! నీవెంతయును సత్యవాది । వౌదువు నేఁడది యంతయుఁదెలిసె
వనితలతో మృషావాదిగావచ్చు । నని యానతిచ్చితో? యదియును గాక
నన్ను వంచనచేసి నాచిత్తమరయ । నున్న యెన్నికయొ! నినొ్నకఁడన నేర
దొరలమాటలును వెదుళ్లపందిళ్లు । శరణాగతప్రియ ! చక్కనగాదె
నావిని శంభుఁడెంతయు వెరగంది । యీవేళ నోబాల యీకోపమేల!
నే యసత్యమ్ము నాయెడఁగంటి తెల్వ । వే యని కరమున నింతి రాఁదిగిచి
తొడమీద నిడుకొని తొయ్యలినొసట । నడరెడి ముంగురు లమర దువ్వుచును
నల్లన నవ్వుచు నడిగిన ప్రాణ । వల్లభుతో హైమవతి యిట్టులనియె
గరళకంఠ! యపూర్వకథలు మున్నె వ్వ।రెఱుఁగనియవి నాకు నెఱిఁగింపు మనిన
నంద ఱెఱిఁగినయవి యానతిచ్చి । రందున నలిగి యిట్లాడగావలసె
నావిని శంభుఁడోనలినాయతాక్షి ! । యీ వింతకథ లేవయస్యలచేత
నీవువింటివి నేఁడు నిజముగాఁదెల్పి । యీవెలందిని బిల్వనంపు మిందనిన
ధవళాక్షి యను పుష్పదంతునిభార్య । యవు జయ కీకథ లన్నియువచ్చు
అది యెవ్వరెఱిఁగింప నాలకించినదొ । యదిగాన నివి రహస్యములుగావనుచు
మిమ్ము దూఱితినన్న మృత్యుంజయుండు । సమ్మఖంబునకు నజ్ఞయను బిల్పించి

ఈకథ లెవ్వారలెఱిఁగించినాఁడ । నీకు నిక్కము దెల్పు నీలోత్పలాక్షి
కల్లలాడిన నల్క గదురునటన్న । తల్లడపడి యది తనువు వడంక
కరములుమోడ్చి యీకథలెల్లదినము । పురహర ! మీబంటు పుష్పదంతుండు
వరుస నెక్కడ విని వచ్చునో యెఱుఁగ । నెఱిఁగించు నాకు పదేసి పదేసి
యిరువది ముప్పది యిటుపెక్కునాళ్లు । లెఱిఁగింప వింటి ననేకసత్కథలు
అక్కథల్ మాయమ్మ యడుగఁగాఁ గొన్ని।తక్కక తెల్పితి ధవళాంగ! యనిన
పుష్పాస్త్రుదమనుఁ డప్పాలతుకమగని । పుష్పదంతుని రయంబునఁ బిలిపించి
నీకాంతకీవు విన్పించినయట్టి । యీకథ లెక్కడ నాలించినావు
కలది కలట్టె నిక్కము తెల్పుమనిన । తలఁకున వాఁడు వందనమాచరించి
గడగడ భణఁకుచుఁ గాలకంధరుని । బొడఁగని పలికె నోభూరిప్రకాశ !
ఆకలధౌతహార్మ్యమున మాయమ్మ । కేకతంబున మీర లెఱిఁగించుకథలు
వినగోరి నేరాగ వెస నడ్డగించె । నను నందు రానీక నందీశ్వరుండు
మంచిదే యని పోక మాయావి నగుచు । వంచనఁజొచ్చితి వాయురూపమున
నటుసొచ్చి సువివితానాంతరస్ఫురిత । పటుమధువ్రతరీతిఁ బ్రాపించి యుండి
నానాఁటి కగజ కానతి యిచ్చుకథలు । నే నాలకించి నా నెలతఁకు జయకు
దినమును దెల్పుదు దేవాదిదేవ । విని యది యంబకు వివరించెనేమొ
యిది కల్లగాదన్న నిందుశేఖరుఁడు । తుదమొదల్గనక తం దూఱిన సతిని
నవ్వుచుఁజూచి మిన్నక నన్నుదూఱి । తివ్విధంబెఱుఁగక యింతి నీవనిన
నాగ్రావకన్య మహాగ్రహవ్యగ్ర । తాగ్రస్తయై పుష్పదంతుని కనియె
ఓరి ! దుర్మద ! ప్రమథోత్తములందు । పేరును బెంపును బెరసియుండుచును
మర్యాద యెంచక మాయాస్వరూప । ధుర్యత మమ్ము దోడ్తోడ వంచించి
యేకతంబున నుండి యీశుండు దెల్ప । నాకథలెటువలె నాలించినావు
అంతఃపురంబు మాయాజ్ఞ లేకిటుల । దంతిముఖాది, పుత్రకులును జొరరు
కడు శివద్రోహివి గావున నిన్ను । కడఁగి శపించెదఁ గష్టాత్మ ! వినుము
నీవు రాక్షసుఁడవై నిర్జనారణ్య । మావాసముగ నిల్చియూఁకట నొగిలి
పెద్దగాలంబు తపింతుగాకనుచు । గద్దించి శపియింపఁ గళవళమంది
మారుమాటాడ సమర్థుండుగాక । నీరుకన్నుల జాఱ నివ్వెర నున్న

వాని సఖుండన వలనొందు నల మ । హానందుఁ డేతెంచి యంబకు మ్రొక్కి-
తల్లి ! నిన్ సేవించు దాసుని మీఁద । సెల్లునే కోపంబుసేయ నీలీల
తగిన విచిత్రకథల్ స్వామిదెలుపఁ । దగిలి యాలింపఁగాదా ! సేవకులకు
అది తప్పుగాఁగొని యాసురయోని । నుదయింపుమని తిట్టు టుచిత మే మీకు
కొంచెపు పనికింత కోపంబు మది వ । హించినఁ గాదన నెవ్వరున్నారు
కలకాలమును సేవగావించుటకును । ఫలమటవమ్మ శాపంబొసంగుటలు
తగినభక్తుండొక తప్పుఁజేసినను । తగదె క్షమింప నో తల్లి యటంచు
నాక్షేప మొనరించు నమ్మహానందు । నీక్షించి మది కోప మినుమడి కాఁగ
కన్నుల కెంజాయ గడలు కొనంగ । నన్న గేంద్ర కుమారి యనియె నోరోరి
చెడుగవై మమ్మునిక్షింప వచ్చితివె । యొడయని సేవ కర్హుఁడవు గావింక
నీవు మనుష్యయోని జనింపుమనిన । నావేళ భయకంపితాత్ముఁడైవాఁడు
చండికి నీశ్వరేశ్వరునకు నెఱఁగి । మండాడఁబోయిన మఱియొండు దగిలె
నెన్నాళ్ల కీశాప మెడయు మీపాద । సన్నిధిఁబెడఁ బాసి చరియింపఁగలమె !
శాపమోక్షంబు ప్రసాదింపుమనుచు । నాపుష్పదంత మహానందు లడలి
వేఁడిరై కన్నీరు వెడలఁ గాసిలుచు । వాడిన శివుఁడు శాపవిముక్తి నింక
వీరిపై కృపయుంచి వివరింపుమనినఁ । గూరిమిపొడమి యకోమలి యనియె
పుడమి రత్నావతీ పురమున వైశ్య । కొడుకవై మఱి రత్నగుప్తనామమున
జనియించి నీవు నిర్జనవనభూమి । దనుజుఁడౌ నీ పుష్పదంతునిచేత
గ్రహియింపఁబడి వీఁడు గణియించుకథలు । రహి విందువందున రాక్షసత్వంబు
విడిచి యెప్పటివలె వీఁడు మేమున్న । యెడకునేతెంచు నయ్యోడు లక్షలగు
కతలు లిఖించి లోకములఁ బ్రఖ్యాత । గతి నించి శాపమోక్షముఁ జెంది నీవు
నరుదెంచె దిటకు మహానంద యనుచు।గిరిజ యానతియీయఁ గేల్దోయి మొగిచి
వారి యనుజ్ఞ చే వసుధ జన్మించి । యీరీతి వర్ధిల్లి రది యెట్టులనినఁ
బురపురఁ బొక్కుచుఁ బుష్పదంతుండు । పురహారుసతి శాపమున నొక్కయడవి
రక్కసుండై మహోగ్రతఁ బ్రవర్తిలుచు । నక్కడి మృగముల నాహరింపుచును
బశుపక్షిమనుజులఁ బట్టుచుఁ గ్రూర । దశఁ జరియించెఁ దత్కాలంబునందుఁ
గలఁడు రత్నావతీకటంబునందు । కులపావనుఁడు ధర్మగుప్తుఁడన్వేరి

యూరవ్యశేఖరుం డొకఁడు ధర్మాజ్ఞ । నారంభుఁడై మించు నవైశ్యమణికి
నా మహానందుఁడ య్యగజశాపమున । భూమిపై రత్నగుప్తుఁడన జన్మించి
బాలత్వమునసే కపర్దిపై భక్తి । గీలించి శమదమాకృతి యాత్మఁడనఁగ
యూవనం బొదవినయపుడును బుధుల । సేవ మానక కులోచితవణిగ్ధర్మ
శాలియై యొకకొన్ని సమలు వర్తించె।నాలోన నొక్కనాఁడయ్య యనుజ్ఞ
బరదేశముల ప్రియంపడి కొనఁదగిన । సరకులు పెరికెల సాగించి కొనుచు
నితరభూముల విక్రయించి యనేక । గతుల లాభముగాంచి కలిగినధనము
తన తండ్రికడకంపి దానధర్మములు।నొనరించి యనుచరవ్యూహంబు ముందు
వెనుక రా నొకఁడు నవ్వినంబు సొచ్చి । చనుచు మార్గము దప్పి శాంభవీశ్లిష్ట
రక్షోవరాన్వితారణ్యంబు సేరె । నాక్షణంబున నొక్కయశ్వత్థవృక్ష
శాఖల వ్రేలు రాక్షసుఁడు వీక్షించి । నాఖరక్షుధదీర్ఘ నాపాలిభాగ్య
దేవత వీనిఁ దోడ్తెచ్చెనటంచుఁ । ద్రోవ కడ్డముసొచ్చి తొడిబడ మ్రింగఁ
గడఁగిన వైశ్య శేఖరపుత్రుఁడనియె । జడత నాఁకటగాని సాధుహింసనము
గావింపఁ జనునె భక్ష్యములు భోజ్యములు । నీవడిగినవెల్ల నేఁడె తెప్పింతు
గనుదనియఁగ రాశిగా సమ్మ్నఖమున।నునిచిన మృదులాన్న మోయున్న!తినుము
నను విడువుమటన్న నవ్వి రాక్షసుఁడు । మనుజమేదోరక్త మాంసముల్ చేతఁ
జిక్కియుండఁగ దీనిఁ జేకొనకింక । నొక్కెడ నిను విడ నుపహారములకు
మనసొగ్గునే యెట్టి మతిహీనుఁడైన । తనచేతఁ జిక్కినదాని వర్జించు
కాలివానికిఁ బెనంగదలంచునోటు । చాలు నీమాట లీక్షణమున నిన్ను
తలఁబుచ్చకయె మ్రింగెద నటంచుఁబట్టి।బలిమి నీడ్వఁగ వైశ్యబాలకుండనియె
హరహర యింతమూర్ఖ్యము వూనఁదగునె।యెఱుకమైఁ జూచిన నీశ్వరేశ్వరుఁడు
నెల్లప్రాణులయందు నేకాత్ముఁడగుచు । నుల్లసిల్లుచునుండు నోదానవేంద్ర!
తనవలె సకలభూతముల నీక్షించు । ఘనుఁడు సాయుజ్యమ్మ్నగను శివునందు
నేనురాకున్న నీకెటుల నీక్షుత్తు । మాను నించుకఁ జిమింపవకట నీవు
అని శివస్మరణసేయఁగ వాని సంగ । తిని దానవునకు జాతిస్మృతివొడమ
తనలోనఁ దా పుష్పదంతాహ్వయుండ।ననియు మహానందుఁడ వైశ్యుఁడనియు
తెలిసి ఘోరని యేడ్చి దీనత నతని । నెలమిఁ గౌఁగిటఁ జేర్చి యిట్లని పలికె

నోయి మహానంద యో సదానంద । యో యురుగుణబృంద యోధర్మకంద
నానిముత్తమ్ముగా నాఁడు శర్వాణి । తోనీవు కలహించి దూఱు చెందితివి
నాకతంబున నీకు నరజన్మ మొదవె । నీకతంబున శాపనిర్ముక్తిగలుగు
నాకిఁక దడవేల నాఁడు నేవిన్న । యాకతలెల్ల నీ వాలింపుమన్న
నతఁడును సుజ్ఞానమావిర్భవింప । మతి నుత్సహించి యోమహానీయశీల !
ఏడులక్షల కత లీవు దెల్పుటకు । నేడాదిపట్టు నేనెటు లన్నినాళ్లు
నిరశనత్వంబున నిద్దుర లేక । చరియింతు నీయొద్ద జడవృత్తిఁజేసి
మానుషజన్మ సంబంధంబు వలన । నేనంటి నీమాట నీతోడ ననిన
నగి పుష్పదంతుఁడన్నా !శంకయేల । యగజాకటాక్ష మాహాత్మ్యంబు వలన
నీకు నాఁకలి దప్పి నిద్దుర జడత । లేకుండు నాకథల్ లెస్స యూకొనుము
కలవీ వనంబున ఘన భూర్జపత్ర । ములు పచ్చికస్తూరి పొదలు నిప్పాదల
నవిగొని నే దెల్పునట్టి సత్కథలు। సవరొంద వ్రాయుమా! చతురాత్మయనుచు
నన్నియు జతగూర్చి యావైశ్యుఁ దనదు । సన్నిధి నిడికొని శంకరాభిహిత
సప్తలక్షకథా వ్రజంబునుదెలిపె । సుప్తిలేకతఁడు వించు లిఖంచుకొనఁగ
నాఱేడు నెలలకీ యనువున కథలు । తీఱవ్రాయింప నద్దేహంబుమాని
తనరూపుగని పుష్పదంతుండు ప్రమథు।లనుసరింపఁగ విమానారూఢుఁడగుచు
నావైశ్యుఁగాంచి యన్నా పాపముక్తి । నీవలన ఘటిల్లె నిద్దురవోక
చనుమింటికడకు మజ్జనభోజనంబు । లొనరించి సుఖనిద్ర యొందుమచ్చోట
హరుని చెంగటికి నే వరిగెద నీవు । ధరనిక్కథల్ ప్రసిద్ధతనందఁజేసి
యరుదెమ్మ్ల కొన్నాళ్లకని ప్రబోధించి । పరమేశుగూర్చి తపంబుగావించి
చరితార్థయైయున్న జయతోడఁగూడి । పరమోత్సవంబున భవుఁజేరియుండె
నిటరత్నగుప్తుండు నెలమితో నాత్మ।కటకంబునకుఁ బోవఁగడఁగి యీ కథల
పొత్తరల్గొని మార్గమున నొకసరసి । హత్తి కృతస్నానుఁడగుచుఁ దత్తీర
వనభూమి ఫలములవ్వారిగామెక్కి । తన శ్రాంతిదక్కి చంద్రశిలావితర్ది
దళముల పొత్తర తలక్రింద నునిచి । నెలకొని శయినించి నిద్దురఁజెందె
కమల సౌగంధికగంధసమీర । సముదారతర శైత్య సౌరభ్యమాంద్య
గతులనెమ్మెయిఁగ్రమ్మ్లఘుర్మాంబుబిందు।తతులుదొలంగనిద్రాసౌఖ్య మొంది

నెలలుకొన్ని క్రమింప నెరిదప్పి యతని । తలక్రిందనున్న పత్రములపొ త్తరలు
వడలి నల్దిక్కుల వాయువశమునఁ । జెదరిన వేఁటవచ్చిన శకాధిపుఁడు
నయ్యాకు లొకకొన్ని యనుచరసమితి । సయ్యనఁ దెచ్చినఁ జదివి యాకథల
సారస్యమున కాత్మ సంతోషమంది । చేరువదవ్వులఁ జెదరిన పర్ణ
చయములు గూర్చి లక్షకథల్ సమగ్ర । మయిన పల్లకివీఁద నక్కట్టి యునిచి
తనపురంబున కేగి తత్కథలెల్ల । ననఘుఁడౌ క్షేమేంద్రుఁడను మౌనిచెంత
నిలిపిన నాతఁడన్నియుఁ జదివికొని । భళి మంచికథలని పరితోషమంది
యారాజుఁబ్రార్థింప నా లక్షకథలు । ధారదప్పక సంస్కృతమునఁ గావించె
నప్పురాణము భూమి నందందు వెలసె । నప్పుడు కొన్నాళ్లక వైశ్యసుతుని
తలక్రిందనున్న పత్రములపొ త్తరలు । నలుగడఁజెదర గంధర్వులుగొన్ని
గరుడులుకొన్ని రాక్షసులొకకొన్ని । యురగులుగొన్ని సాధ్యులుమఱిగొన్ని
యమరులుగొన్ని విద్యాధరుల్ గొన్ని।క్రమమునఁ గొనుటలోకము లెల్లనిండె
అంతనిద్దుర దేఱి య వైశ్యసుతుఁడు । చింతించి తలక్రిందఁజేర్చినకథల
పొ త్తరల్ కానక పొగులుచునున్న । య త్తెఱంగెఱిఁగించె నాకాశవాణి
యావాక్యములు విని యతఁడు హర్షిం చి।దైవయోగమున కథల్ ఖ్యాతిఁజెందె
నింతియచాలు నింకేమిటికింక । సంతాపమని తన జనకునిఁజేరి
కొన్నేండ్లువర్తించి కులములో ఖ్యాతి । గన్నవాఁడై శంభుకారుణ్యమునను
శాపంబు దీఱిన స్వస్వరూపంబు । ప్రాపించి పరమేశుపజ్జకు నరిగె
ననిసూతుఁ డెఱిఁగింప నాశౌనకాదు । లని రోమహాత్మ మున్నంబకు శివుఁడు
తెలిపినకథల నాదిమకథయెద్ది । తెలుపవే యన నక్కథికుఁ డిట్టులనియె
అంబకు లోకరక్షావలంబకును । త్ర్యంబకుఁడాది నిట్లని సెప్పఁదొడగె
పరమవై భవమునఁబంటవలంతి । భరియించు మణిమయాభరణంబు లీల
బంగారుమేడలఁ బరగువాడలను । శృంగారవనముల శ్రితపవనముల
మహితతోరణముల మదవారణముల । రహిమించు వీథుల రత్నవేదులను
అమరుపేఁటలను మిన్నాగుకోటలను । సుమవితానముల భాసురవితానముల
భవనికేతనముల పటుకేతనముల । జవరాంద్రహేలల చంద్రశాలలను
అనఘశృంగములఁ జెన్నగు నలంగముల।బలువైన దళముల బలుకొ త్తళముల

అసఘులౌ పాఱుల నత్యుదారులను । సనయభూరమణుల సద్వైశ్యమణుల
బహువీరభటులను పటువీరభటుల । నహితులడాకల నడఁచుమూఁకలను
దీపించు చంద్రావతీనామపురము । భూపాలకృత పుణ్యములకు దాపురము

చండప్రతాపుని కథ

ఆపురంబేలు న్యాయమునఁ జండప్ర । తాపభూపాలుండు దర్పితారాతి
జాలవిభాళుండు సత్యధర్మైక । శీలుండు సంతతాశ్రిత కృపాళుండు
ఆ యినుండెపుడు నర్థార్థిదారిద్ర్య । మాయాంధకారసంపత్తి మాయించు
నారాజు విద్వజ్జనాలోకవికచ । కైరవామోద సంఘటకుఁడై మించు
ఆప్రజానేత సత్యావనోత్సాహ । ధీప్రాప్తభాపారతిన్ ప్రబవర్తిల్లు
నీరీతి సద్గుణాన్వితుఁడై మెఱయు । నారాజచంద్రుని యర్ధాంగలక్ష్మి
చారుశీలానామ సాధ్వీలలామ । శౌరి కిందిరవోలె సతతంబు మెలఁగు
నతనికిఁ గలరు మహామాత్యవరులు । ద్యుతివిభావసులు నిర్దోషమానసులు
కీర్తిమంతుఁడు చారుకీర్తియు దేవ । కీర్తి మఱియు సత్యకీర్తి సుకీర్తి
యలపృథుశ్రవుఁడు మున్నైన పదుంద్రు । బలభేదిగురునిభప్రతిభలమీఱి
సలలితప్రీతి నచ్చండప్రతాపుఁ । గొలుతురు నయమార్గకుశలత లొదవి
యలికాత్మునకు దశహస్తముల్ వోలి । యలమంత్రులెపుడు సహాయులై మెలఁగ
కరవాలమొక్కటి ఖరకరుకరుణ । వరముగాఁ బడసె నవ్వసుమతీశ్వరుఁడు
ఆ మహీతలభర్త యాదిత్యదత్త । హేమమాలిక ధరియించి తత్కాంతి
మండలం బఖిలభూమండలి నిండ । రెండవ మార్తండురీతి వెలుంగు
ఆ మణిమాలిక నతనితాతకు న । భోమణి కరుణించెఁ బూర్వకాలమునఁ
గావున నది కులాగత యాట నతఁడు । నేవేళ ధరియించి యిలయేలుచుండు
నతనిపట్టపుదేవి హరరాణిఁగూర్చి । సతతంబువ్రతములు సలుపుచు వెలయు
నక్కాలమున శౌర్యమడర నుజ్జయిని । తక్కక పాలించు ధారణీశ్వరుఁడు
విక్రమకేసరి విమతేభహరణ । విక్రమకేసరి వేగరుల్ దెలుప
చండప్రతాపుని-సామ్రాజ్యలక్ష్మి । చండాంశుదత్తకాంచనహారమహిమ

విని సహింప కసూయ విరివిగా మదిని । తనచెంత కొక్కదూతను బిల్చిపలికె
వేగరి రారోరి వేగ నీవిపుడె । యేగి చంద్రావతి కేలికయైన
చండప్రతాపుని చక్కని నిల్చి । నిండుకొల్వున్న వానికి నిట్టులనుము
ఉజ్జయినీనాథుఁ డొడయుండు నాకు । ముజ్జగమ్ములఁ గీర్తి ముంచినాఁడతఁడు
కృతిమూళి విక్రమకేసరి శౌర్య । జిత హేళి యతని గొల్చి తదీయకరుణ
బ్రతికిన నృపతులు పదివేలుగలరు । మతినిది తలపోసి మహినాథ ! నీవు
కానుకగా నీదుకంఠహారంబు । మానృపాలునకిచ్చి మన్ననగనుము
హారమిచ్చిన మంచిదటుగాక రణ వి । హారమెంచిన మంచిదని చెప్పిరమ్ము
చనుమననాఁడేగి చండప్రాప । జననాథజంభారి సన్నిధిఁబలికె
నీకడ కుజ్జయినీనాథుఁడనుప । నాకార్యమెటిఁగింప నరుగుదెంచితినీ.
అతఁడు నీమెడ రత్నహారంబొసంగి । బ్రతుకుమటంచుఁ దెల్పఁగఁబంచె నన్ను
ఆరీతి నీకున్న నతనికి నీకు । ఘోరాహవంబగు గోరనౌ పనికి
గొడ్డలి యేల చేకొనుము నాపలుకు।గొడ్డుసేయక యన్నఁ గువలయేశ్వరుఁడు
పకపక నగి మంచిపని కంపె నిన్ను । వెకలియై మీరాజు విపరీతబుద్ధి
ఇది వినాశమునకు హేతువటంచు । మదినెఱుంగఁడు పొలుమానిసిఁబోలి
వేలువాచిన రోలువిధమాయెనన్న । రోలువాచిన నెంతయాపగుఁజెపుమ !
కప్పగంతుల వార్థి గలఁగునే నిన్న । కుప్ప నేఁడాల్లెంత కొరగామిఁదలఁచె
తన ప్రతాపంబెంత తాననెంత । నను దనుగొలువు మన్నాఁడెంతవింత
హార మీకున్న గయ్య మొసంగు మనుట । సారంబు మాకది సంతోషమయ్యె
రమ్మను రణము ఘోరమ్మనుప్రాణ । మిమ్మను మాచేతి హేతికి భీతి
గ్రమ్మిన శరణొంది కానుకలిచ్చి । మమ్మునేవించి నెమ్మది మను మనుము
తమి నపుంసకుఁడు కాంతనుగోరినటుల । కుమతియై హారమ్ముగోరె మీరాజు
ఇమ్మాట లెల్లమీయేలినవాని । సమ్మఖమ్మునఁ జెప్పి సమ్మతంబైన
పనిసేయు మనుమని బహుమతివాని । కనుపమభూషాంబరాదులొసంగి
పనిచినవాఁడును పతిచెంతకరిగి । జననాథుఁడాడిన చందమ్ము దెల్ప
వీక్షలశిఖులుట్ట విక్రమకేస । రిక్షితీంద్రుండు మంత్రిజనమ్ము జూచి
వింటిరే సభవాహ ! విభవదర్పమున । దంటయై చండ ప్రతాపుఁడాడినది

హారమాత్రంబు మేమడిగిన నియ్య । నేరక తనప్రోలు నిఖలరాజ్యంబు
ధనవస్తువాహనోత్కరముతోఁబ్రాణమునునియ్యఁదలఁచెదుర్బుద్ధియైయనుచు
మనుకొని రణభేరి మ్రోయింపఁబనిచి । యనికి జత్తాయత్తమై బయల్దేరి
మంతురుల్ దొరలు సామంతులు హితులు । చెంతలఁగొలువ రాజితరత్నఖచిత
కేతన పటపటాత్కృతి కింకణీర । వాతత ద్వాదశహయహేషితోగ్ర
ఖరతరఖుర సముత్కరఘట్టనోత్థ । నిరవద్యపెటపెట నినదానుకారి
ఘనచక్రషట్క ఘుర్ఘురదీర్ఘఘోష । జనితాష్టదిక్సామజశ్రవోబధిర
కలనా ధురంధరకాంచనరథము । వెలయు వేడుక నెక్కి వీరభటాళి
యార్భటుల్ తౌరంగికాదభ్రచాప । నిర్భరటంకారనినదముల్ మత్త
కరటి ఘీంకారముల్ కాంచనగ్రావ । సురథ నిస్వానవిస్ఫారణమ్ము లెనసి
భూనభోభాగముల్ బూరటిలంగ । సైనిక సింహగర్జలు వందిజనుల
సాహోనినాదముల్ సందడిలంగ । బాహుభవాయుధ ప్రభలు మిన్ మ్రింగ
బలసముద్ధత రజఃపటలి చీకటుల । బలియింప లయకాలభైరవస్ఫూర్తి
దీపింపఁ జంద్రావతీపురిమీఁద । నాపార్థివుఁడు వచ్చు నవసరమ్మ్మనను
చారులుదెల్పఁగాఁ జండప్రతాప । ధారుణీనేత శాత్రవురాకయెఱిఁగి
అలచారుకీర్తి మున్నగుమంత్రివరుల । పిలిపించి యవ్వార్త పెరిమతోఁదెలిపి
వారితో సైనికవరులతో బిరుదు । వీరులతో భటశ్రేష్ఠులతోడ
గజహయరథ సముత్కరముతోనపుడె । నిజపురివెలువడి నిర్ఘాతపాత
దారుణనిర్ఘోషధర్షణోదీర్ణ । భేరీధణంధణల్ పెల్లుగామొరయ
నరిసేనఁదాఁకిన నయ్యురువాఁగు । దొరలును దొరలు మంతురులు మంతురులు
తౌరంగికులు మహాతౌరంగికులును । తేరులవారును తేరులవారు
వారణారూఢులు వారణారూఢు । లారభటులఁ గ్రూరులగు వీరభటుల
వీరభటుల్ దాఁక విచ్చుకత్తులను । శూరులైనఱికుచు శూలంబులెత్తి
పొడుచుచు సురియులఁబొదవుచు గదల।నడఁచుచుఁ బరశువులడరి వ్రేయుచును
పట్టిసములఁదొట్రుపఱిచుచుఁగశలఁ । గొట్టుచు నీటెలఁ గూలగ్రుమ్మ్మచును
ప్రాసముల్ నిగిడించి పంది బల్లెముల । వ్రేసి కటారుల విదళించినొంచి
పేరులువాడుచుఁ బెక్కుచందముల । నారెండుతెగల వారటులఁబోరఁగను

తెగుహారుల్ దిర్దిరఁదిరుగు నేనుఁగులు। నొగులు తేరులుమ్మొగినుగ్గై నభటులు
ఛిన్నమ్ములగుకాళ్లు చినిఁగినజోళ్లు । భిన్నమ్ములగు వ్రేళ్లు పిగిలినతోళ్లు
సడలినసొమ్ములు జాఱునెమ్ములును । వెడఁగులౌమెడలును విరిగినతొడలు
పాఱెడినెత్తురుల్ పలలాశదిశలఁ । బాఱెడు భూతముల్ భయముఘటింప
పోరుఘోరంబైన భూపాలురిరువు । రోరసిల్లక తాఁకి రుగ్రహుంకృతులఁ
గినుకతో విక్రమకేసరియపుడు । తన తేరుచండప్రతాపునిమ్మాఁదఁ
బరపించి హయముల పదిమార్గణముల । శరపంచకంబున సారథి నొంచి
యొకకోల నాతనియురమునొప్పింప । మొకమెట్టఁ బాఱ నమ్మార్గన్యుఁడలిగి
విలునారిసారించి విలయకాలాగ్ని । వలె నుగ్రుఁడై రెండు వాఁడిబాణముల
ఆరాజుకేతనంబవనిపైఁగూల్చి । సారథి మూఁడింటఁ జక్కఁగావించి
హయములఁ బండ్రెంట నవనిపైఁగూల్చి।భయదాస్త్రమేసి చాపము నుగ్గుఁజేసి
సునిశితాస్త్రద్వయి జోడుచించినను । దనమేన నవరక్తధారలుదొరుఁగ
విక్రమకేసరి వీడని భుజప । రాక్రమంబున ఖడ్గహస్తుఁడై ధరకు
సరగున లంఘించి చండప్రతాపు । శరములు పలకచే జడియుచుఁగదిసి
కరవాలమున వ్రేయఁగడఁగినరాజ । వరుఁడు ఖడ్గము ద్రుంచివైచికేడెంబు
పరియలుచేసి పైఁబడి వానిరెండు । కరములు బిగఁబట్టికాంచనరథము
పైకితాఁగొనిపోయిబలువైనత్రాళ్ల । వీఁకతోబంధించి వెసఁ గూబరమున
నంటగట్టించి జయానకార్భటుల । మింటఁబ్రతిధ్వనుల్ మిక్కుటంబుగను
వందిమాగధుల కైవారంబులొలయ । ముందరవెనుక బల్మూఁకలు నడువ
పదువురుమంత్రులు పరమానురాగ । మొదవగాఁ దను నుచితోక్తులఁబొగడ
నలరుచుఁబురిఁజేరి హర్మ్యవాసినులు । చెలువొప్ప ముత్యాలసేసలుసల్లఁ
జని తేరుడిగ్గివాజారంబుసొచ్చి । కనకపీఠిక నోలగంబుననుండి
విరిచికట్లనుబడి విన్ననైయున్న । యరిరాజుగని మందహాసంబుతోడ
నేమి విక్రమకేసరీ ! కంఠమాలి । కామణిఁ గామించి కాకైతివిటుల
పరులసొమ్ముల కాసపడి దుండగములు । దొరకొనిసేయంగ దొరలకు నగునె
చేతఁజిక్కిననిన్ను ఛేదింపనొల్లఁ । గాతరత్వముమాను గాచితిననుచు
తనుగొల్చువారలద్దయకుఁదద్దయును । దనరఁగీర్తింప నాతని విడిపించి

ఘనభూషణాంబర గంధమాల్యములు। నెనరుతో నిచ్చిమన్నించి వీడ్కొలిపె
అట్టిదకాదె దయాళుకానృపులు । పట్టువడినవాని భంజింపరెందు
ఖిన్నుఁడై విక్రమకేసరి యంత । కన్నవారలు కేరగాఁ బ్రోలు వెడలి
చెన్నేది చని హతశేష సైన్యములు । కొన్ని యాడాడ తన్గూడి కొల్వఁగను
నుజ్జయినికిఁ బోయి యసురసురనుచు । సెజ్జపైమైవై చి శివశివాయింత
యాగడంబై తిగా యహితునిచేత । నేగతి బ్రదుకుదు నిఁక సిగ్గులేక
వెతదీఱఁ బ్రాయోపవేశంబుచేసి । శితిమూర్తి కొప్పగించెద శరీరంబు
ననియుద్యమము సేయునతని యుద్యమము।విని మంత్రనిధియను విప్రపుంగవుఁడు
నతని పురోహితుఁడప్పుడెవచ్చి । క్షితినాథ ! యిదియేమిసేయఁబూనితివి
శివుఁడుశంభుఁడు సదాశివుఁడు మాధవుఁడు । భవుఁడభవుండు నీపాలిటఁగలఁడు
హరుని నమ్మినవారి కాపదల్గలవె । కరమొప్పు ధర మహాకాళేశ్వరుండు
తారకేశుఁడు వియత్తలమున నధికుఁ । డారసాతలమున హాటకేశ్వరుఁడు
కడుఁబ్రసిద్ధుండు ముక్కంటి మూఁడెడల।కొండయుఁడై భక్తుల కొసఁగు కోరికలు
కావున శ్రీమహాకాళేశుఁబూజ । గావింపు రేపాదిగా క్షమానాథ !
ఒకయేఁడు గొలువుమార్యులఁ గూడి నీకు।సకలశాత్రవరాజజయమిచ్చుశివుఁడు
అని పురోహితుఁడు హితార్థంబుదెల్ప । విని యమ్మహీపతి విశ్వాసమొదవ
నతనిఁబూజించి తదాజ్ఞమర్నాఁడు । క్షితిసురోత్తముల విశిష్టులఁగూడి
యామహాకాళేశు నాలయంబునను । నేమంబుతోఁ దపోనిష్ఠవహింప
జపము ధ్యానమ్ము తచ్చరణపూజనము । విపులభక్తి నానరుచ్చవేదోక్తవిధిని
నభినవక్షీరతైలాజ్యాదికముల । నభిషేచన క్రియ లమ్మహేశునకు
నానరింపఁ బంచె నహోరాత్రములును।పనిఁబూని పూజించుఁ బదియాఱువగల
నీరీతి నొక్కయేఁ డిభచర్మవసను । గూరిచి భజియింపఁగువలాప్తధరుఁడు
బనువనినెక్కి- డా పలిచక్కినున్న । కుసుమకోమలి మెఱుంగుల రంగుగులుక
విమలాంగరుచి పండువెన్నెలల్ గాయ । నమరాపగామణి యూదల మ్రోయ
మువ్వన్నెపచ్చడంబు భుజాగ్రమొరయ । నవ్వలివ్వలఁ బ్రమథాధిపుల్గొలువ
నొకనిశావేళ నయ్యుజ్జయినీంద్రు । నకుఁ బ్రసన్నుండైన నవనవప్రీతి
భయమునువినయమ్ము భక్తియు మెఱయ।జయకాముఁడమ్మహీశ్వరుఁడట్లలేచి

పెక్కువంచనము లర్పించిఫాలమునఁ । జక్కనంజలిఁ జేర్చి చతురోక్తిఁబొగడె
శరణుగౌరీనాథ శాంతిసనాథ । శరణుచంద్రకలాప చైతన్యరూప
శరణుమన్మథభంగ సదయాంతరంగ । శరణు వార్ధినిషంగ సత్యప్రసంగ
నన్ను నవ్యాజబాంధవుఁడవై ప్రోవ । సన్నిధిఁబెన్నిధి సరణిఁదోఁచితివి
నిన్ను సన్నుతి సేయ నేనెంతవాఁడ । నన్న, శంకరుఁడు నీయభిమతంబేమి
వివరింపుమనిన నవ్విశ్వేశ్వరునకు । సవినయస్ఫురణ నుజ్జయినీశుఁడనియెఁ
జండప్రతాపుని సంగ్రామభూమి । ఖండించి జయమందఁ గాంక్షచేసితిని
ఇంతమాత్ర మొసంగి తేని నాపాలి । కెంతేని బ్రహ్మాండ మిచ్చినట్లనిన
హరుఁడు నవ్వుచుఁ బల్కెనక్కట నీకుఁ । గరమల్లి యేతప్పు గావించె నతఁడు
అనిదానవిద్వేష మతనిపైఁజేసి । యని నొచ్చివచ్చితి వదియునుగాక
చేతఁజిక్కిన నిన్ను జెడఁజూడ కెలమి । చేత రక్షించె నాక్షితివరోత్తముఁడు
హరిభక్తుఁ డరిజైత్రుఁడాదిత్యదత్త । వరరత్నహారభాస్వర ఖడ్గధరుఁడు
అతని పట్టపుదేవి యతిసాధ్విగనుక । క్షితినెవ్వరికి వాని గెలువగారాదు
సాధువర్తనుఁడౌట చాలఁజెప్పితిమి । యేధమానద్వేష మెడవీడవేని
గద యొక్కటిచ్చెదఁ గైకొనిదాని । మొదట వేయక రాజముఖ్యునిసేన
చేత నీసేన నొచ్చినవేళ శత్రు । జేతయై యతఁడు హెచ్చినవేళఁజూచి
ఇది ప్రయోగింపు మహీనసత్త్వమున।పొదివి వారి సైన్యముగ సంహరించు
దొలితాఁకునన వానిఁ దునిమెదననుచు । బలుగదవైచినఁ బగతునిచేత
నది ఖండఖండమ్ములగు సుమీ యనుచు । గదయిచ్చి మదనారికనఁబడకరిగె
దేవుఁడంతర్ధిఁ జెందిన సమయమున । నావిక్రమమ్మగేంద్రుఁ డానందమంది
హితులమంత్రులఁ బురోహితుల రావించి । శితికంఠుఁడెలమినిచ్చినగదఁజూపి
యొకశుభవేళ రణోద్యోగమూని । సకలసేనలు వెంటఁ జనుదేరవెడలె
నావార్త వేగు వారహుదెంచితెలుపఁ । దావిని చండప్రతాపభూవిభుఁడు
తనమంత్రివరుల కందఱి కవ్విధంబు । వినిపించి యిఁకనొండు వినుఁడని పలికె
హరుఁడొసంగినగద యది రిత్తసనుచె । పటుతెంచి మనసేనఁ బరిమార్చుగాక
అందున నపజయంబగు నవశ్యంబు । దండడివచ్చినఁ దప్పింపరాదు
ఒకయుపాయం బిప్పుడూహించితెలుపుఁ । డకలంకమతులార యనవారిలోనఁ

చారుకీర్తి సుబుద్ధిసంపన్నుఁడగుట । ధారుణీభర్తతోఁ దగనిట్టులనియె
మనపురిలో నింకమణివస్తువాహా । ధనభూషణాంబరోత్కరముంపరాదు
చారుశీలాముఖ్యజలజలోచనలఁ । జేరికొ బంధులఁ జెలుల నీక్షణమె
పగఱకుఁ జొఱరాక బహుదుర్గ మార్గ । మగు కోహళ మహర్షియాశ్రమస్థలిని
జే రిచి మనము నిశ్చింత నేతెంచి । యారూఢి బలయుక్తి నచ్చాళిగాఁగ
ననికి సన్నద్ధులమై యుందమవల । ననుభవింపుదము రై వాజ్ఞ నయ్యెడిది
ఆనిన నందఱు మెచ్చి రధిపుఁడాలాగె।యెనరింత మని కోహళోపాంతమునకు
దాను మంత్రులునేఁగి తపసిదర్శించి । యానిశ్చయము దెల్పి యమ్మానియాజ్ఞఁ
దనవారినెల్లఁ దద్వని నొక్కదుర్గ । ముననుంచి ధనరత్నములు నందె దాఁచి
చంద్రావతికి వచ్చి చతురంగసైన్య । సాంద్రకోలాహలస్ఫారుఁడైయుండె
అటుల విక్రమసింహుఁడభవప్రదత్త । పటుగదాభీలుఁడై పౌరుషంబమర
నడగొండల బెడంగునఁజెలంగుకరులు।వడిఁ బవమానుకైవడి మీఱుహరులు
నలరోహణాద్రుల ట్లమరు తేరులును । ప్రళయభైరవ సముద్భటులైనభటులు
లెక్కకెక్కువయై చలింపక కొలువ । నొక్కమహారథంబుద్ధతినెక్కి
చండప్రతాపభూజాని పట్టణము । దండ భండనకాంక్షుఁదగదండువిడిసె
చంద్రావతీశుండు సముదారహార । సాంద్రచక్రాష్టకోచ్ఛ్రియ పద్మరాగ
ఘటితధ్వజానేకఘంటికాచ్ఛత్ర । పటలవైదూర్యకూబరశోభమాన
గారుడోపలవర్ణ కమనీయతురగ । చారుచామీకరస్యందనంబెక్కి
దశదిశ లద్రువనుద్భట వృత్తిమంత్రి।దశకంబు వెనుకముందరఁ భార్మ్యములను
బహుళ సేనాపరంపరలతోఁ గొలువ । నహితునిపైఁజని యదరంట దాఁకి
యరదముల్ తుండించి హారులఖండించి।కరులఁ ద్రుంచిభటప్రకాండంబుఁ ద్రెంచి
మన్నీల నొంచి సామంతులజించి । వెన్నాడిరధికులవి ముఖులఁ జేసి
యార్చినఁ జెలరేగి యారాజుమంత్రు । లేర్చినభటులతో నేపగ్గలించి
పరసేన తటిమిన భయమంది వార । లరిగి విక్రమసింహు నంచెలఁజేర
వెరవకుండని వారి విముఖత మాన్పి । హరి శరభము దాఁకు ననువునఁ గనలి
చండప్రతాపుని శరముల నొంచి । కాండమొక్కటి వైచి ఖండించి సూతు
వెస వానిమంత్రుల విముఖులఁ జేసి।యసమాస్త్ర రిపు దత్తమగుగదాయుధము

బిరబిరఁ ద్రిప్పి యప్పృథినీశుమీఁదఁ । బరువడి వైచిన ప్రళయాగ్నిశిఖలు
గ్రక్కుచు నమ్మహాగద పైకిరాఁగ । గ్రక్కున రవిదత్తఖడ్గ మంకించి
గద పదితునుకలుగా నటుకుటయు । నది యమోఘముగాన నందొక్క తునుక
చండప్రతాపువఱుము దాఁక నతఁడు । గండారి త్రెళ్లె నొక్కటఁ దేరిమీఁద
నత్తేరు గొనిపోయె హరులు భీతిల్లి । యత్తఱిఁ గోహళు నాశ్రమంబునకు
నచ్చోటి వటభూరుహంబుల నడుమ । చొచ్చి గుఱ్ఱము లీడ్చుచో రథస్తంభ
గత కేతనంబు శాఖలఁ జిక్కుకొన్న । కతన రథంబుపోక మఱిట్టె నిలిచెఁ
బగ్గముల్ ద్రెంచుక పరువునఁబోయి । యగ్గుఱ్ఱములు కోహళాశ్రమసవిధ
గిరిహాంతరవీథిఁ గీడ్పడియున్న । తెఱఁగెల్ల నద్ధరాధిపుదేవి చూచి
పతిరథ్యములు తొట్రుపడి వచ్చెనృపతి।మృతుఁడయ్యెనో యని మిగుల శోకించి
ప్రొద్దుగ్రుంకిన కతంబునఁ దమంబడర । నెద్దియుఁగానక నేడ్చుచుఁ బోయి
వటభూరుహముల క్రేవలఁబలాపించి।యట దేహముత్యజింతు నని నిశ్చయించి
యొకయూడఁ గుత్తుక నురి వెట్టుకొనఁగ । నికటరథస్థుండు నృపతి యాలోనఁ
దెప్పిరి యప్పురంధ్రీమణిఁ గదిసి । యొప్పునే యిప్పని యువిద నీకనుచు
మెడ యురిఁ దప్పించి మెలఁత నూరార్చి।కడుఁ బ్రేమతో కొని కదలి యాక్షణమె
యలకోహళునిఁ జేరి యతఁ డూరడింప । బిలములో పురము ప్రాపించి వర్తించె
నగ్గద శకలమ్ము లందందఁ దాఁకి । మ్రొగ్గె సేనలు కొన్ని మూర్ఛిల్లెఁ గొన్ని
పదుగురు మంత్రులు బలుమూర్ఛఁ బొంది।పదిదిక్కులను దూర పదములఁ బడిరి
వారిలోన సుకీర్తి వరపుణ్యమూర్తి । యారాజమంత్రులం దగ్రేసరుండు
గదతున్క తాఁకున గతప్రజ్ఞుఁడగుచు । మదమతి నాలుగామడ పోయి పడియె
పడి తత్సమీప తాపసవనాంతరము । కడఁ జూడ నింపైన కమలాకరంబు
చేరువ యగుటఁ దచ్ఛీకరశిశిర । మారుతాంకురముల మై సేదదేరి
యొక్కింత ప్రొద్దున కొయ్యన లేచి । యెక్కడవచ్చితి నిదియెంత దవ్వో
అక్కటా నృపతి యేమాయె నెఱుంగ । తక్కినమంత్రు లేస్థలములఁ బడిరో
దైవయత్నంబిది తప్పింప వశమె । యీవేళ నిటవసియించి తర్వాతఁ
గ్రమమునఁ దెలిసెదఁ గార్యమ్ము లనుచుఁ।గమలాకరమునసోత్కంఠుఁడై మునిఁగి
సమయోచితక్రియల్ సలిపి యాచెంత । నమరు తపోవనం బల్లనఁ జొచ్చి

యదిదళాద మునీంద్రునాశ్రమంబగుట।మది నెఱుంగమిన య్యమాత్యపుంగవుఁడు
నాఁకటిపెల్లున నచటి కపిత్థ । మాకంద కదళికా మాతులుంగాది
ఫలములు గొని భుజింపఁగ నొక్కవట్టుఁడు । దళభోజి శిష్యుఁ డుద్ధతినంపువచ్చి
కనుగొన మిణుగుర్లు గపుర నిట్లనియె। చనునె మునీశ్వరాశ్రమములు సొచ్చి
యడుగక ఫలము లాహా! కోసి నమల।నొడయుండవే! యీమహోద్యానమునకు
నీపాపఫలమున నిఁక చిల్కతనము । ప్రాపించి తిరుగుము బహువత్సరములు
పోరోరి యని కోపమున శాప మొసఁగ।నారాజమంత్రి భయభ్రాంతుఁ డగుచు
నామునితనయున కంజలిచేసి । యీమహాత్మక మ్రుధాయోగమ్ము కతన
నెఱుఁగక చేసితి నీయపరాధ । మరయక శపియించు టర్హమే ! నీకు
యీపద మీఁదనే యీపద లొదవె । శాపమోక్షంబు ప్రసాదింపు మనిన
శాపమియ్యనె కానిశాపంబు దీర్ప । నోప మద్గురుఁడోపు నోమంత్రితిలక !
యతనిఁ ప్రార్థనసేయు మనివటుండనగ।హితశీలుఁడు దళాదుఁ డేతెంచె నపుడె
ఏతెంచిన మహర్షి కెదురేగి ప్రొక్కి । యాతఁ డవ్వటుశాప మంతయు నొడివి
యెయ్యదిగతి బుద్ధియెయ్యది యాన । తియ్యవే! మాయయ్య హేమాద్రిధైర్య!
అని వేఁడుకొను మంత్రి నతఁ డాదరించి । మనికితపడనేల మహనీయశీల
దైవకృతం బిది తప్పింపరాదు । నీవు కేవలుఁడవె నిర్మలమతివి.
నిన్ను నేనెఱుఁగుదు నేఁడాదిగాఁగ । నన్న యీరాఁటి హాయనముల దాఁక
చిలుకవై మెలఁగుము శ్రేయమ్ము మీఁద।గలిగెడు నని భావికార్యముల్ దెలిపి
శుకశాల్మలికిఁ బొమ్మ శుకరూపమూని । యిఁక తామసంబేల నిచ్చోట ననిన
బలువైన యీఁకల పంచవర్ణములు । గళము చక్కదనంబు కన్నులతేఁట
పగడంపుజిగి ముక్కు ప్రతిలేని ఱెక్కు । తగ గొప్పచిలుకయై తాపసోత్తముని
కరుణ జాతిస్మృతిఁ గన్నవాఁడగుట।నురుభక్తిప్రొక్కి యయ్యోగి వీడ్కొలుప
గగనభాగమున కుత్కటసత్వరమున । నెగసి శాల్మలిఁ జేరనేఁగి యాచెట్టు
నడికొమ్మ నెక్కియుండఁగ నంతఁ గొంత । వడికి దిక్కుల మేసి వచ్చేఁ గీరములు
లక్షకీరమ్ము లీలాగున వచ్చి । యక్షీణమతిశాలి నక్కీరమాళి
పొడగని సంతోషమున ప్రొక్కి మాకు।నొడయుండవై యేడనుండి యిచ్చటకు
విచ్చేసినా వని వినయమ్ముతోఁడ । నచ్చిలుకలు పల్క నతఁడు మీవంటి

బందుగుల్ గూడి యిప్పట్టున నునికి । ముందునే విని ప్రియంబున వచ్చినాఁడ
నెగులెల్లఁదీఱెఁ గంటికిఁ గనుఱెప్ప । పగిది నన్ జేకొని పాలింపుడనుచు
నాచిలుక పల్కిన నలరి యచ్చోటి । రాచిలుకలనియె మారాజవు నీవు
నినుగొల్చి యిదిమొదల్ నీయాజ్ఞలోన । పనివడి సంచరింపఁగఁగల మనుచు
నతిగౌరవంబున నన్నిచిలుకలును । హితలీల భాషింప నెంతయు నలరి
యుచితకథాగోష్ఠి నుండె నారేయి । యెచట నేగతి వసియించిన ఘనుఁడు
ఘనతచే నుండు లాఘవమొందఁ డతివ । విను మిట్లు శాల్మలీవృక్ష్మ్మునందుఁ
గమియించె నొకకొంతకాల మచ్చిలుక।ప్రమదంబుతో శుకప్రతతి తన్ గొలువ.
ఇందిరావతియన నెసఁగు పట్టణము । నందుఁ జంద్రాభరణాఖ్య భూవిభుఁడు
చిలుకలపైఁ బ్రేమ చిగురొత్త మించి । చిలుకలఁ బట్టి తెచ్చినవాని కిత్తు
కోరినధనము పలుకలునేర్చు మరుని । వారువం బొకటిచ్చువానికి నూఱు
వరహా లొసంగెద వంచనలేక । యరిగితెం డనుచు వనాటులఁ బనుప
వారు నానాశైల వనదుర్గభూము । లారసి తిరుగగా నందొక్కబోయ
బూరుగఁజిల్కల పోబడి యెఱిఁగి । చేరి యక్కడనున్న చిలుకలఁ జూచి
మేయఁబోయిన వేళ మేకులు గొన్ని । యాయెడ గ్రహియించి యరిగి యాచెట్టు
మొదటనుండియుఁగ్రమంబునగొమ్మలున్న।తుదదాఁక మెట్లుపొందుగసంఘటించి
పైకొమ్మలకు నెక్కి బలువైన యురులు । నాకడఁ గీలించి యాచెట్టు డిగ్గి
వాఁడేగె మరువారువంబులు గుంపు । గూడి యన్నియుఁ బ్రొద్దు గ్రుంకినయంత
నెప్పటివలెఁ గొమ్మలెక్కి యయ్యురులు । తప్పక తగిలినఁ దపతప మనుచు
తెక్కలార్చుచు వగరింపుచు నుండె । చిక్కినయ్యరియందె చిలుకలదొరయు
నాసమయంబున నాచిలుకలెల్ల । నోసామి యిది విడునుపమ యెట్లనుచుఁ
దను వేఁడుకొన నమాత్యశుకంబు వలికె।వినుఁడు బాంధవులార! వెతఁ జెంద నేల
కట్టిడిపై వేఁటకాఁడు వేకువనె । చెట్టుక్కనెడ మీరు చేష్టలు మాని
మెడలు వ్రేలగవైచి మిన్నక యుండు।డొడలఁ బ్రాణములు లేకున్నచందమునఁ
జిలుకలన్నియును జచ్చినవో యటంచు।కలఁకఁజెందుచు వేఁటకాఁ డురుల్ వాపి
ధరణి నన్నియు వేయుతఱి లెక్కదప్ప । కెఱిఁగి యందఱిము బిట్టెగసి పోవుదము
ఈయుపాయము మది నిడుఁడని చిలుక । రాయఁ డాడిన శుకప్రతతి యట్లుండె

మఱునాఁడు బోయ సంభ్రమమున వచ్చి । తరువెక్కి చేష్టలుదక్కి యున్నట్టి
శుకములఁ గని వగచుచు నురుల్ వాపి । యొకటొకటినిఁబట్టి యుర్విపై నేయ
లక్షకీరములు నిలాస్థలిఁ బడుట । నాక్షణమ్మున గని యవి బోయవంక
ధర జాఱిపడివచ్చెఁదమదొర యనుచు।బరచె నభ్రమచాయ భ్రమచెంద బోయ.
ఆవింతఁ జూచి యూరా యెంతమాయ । గావించె నీచిలుకలగుంపు లనుచు
శబరుఁ డాకీరరాజముఁ బట్టినీవె । సొబగులు నేర్పితీశుకముల కిన్ని
నిన్ను ఁదెచ్చెదనని నిర్బంధపఱుప । నన్నీచుఁ జూచి శుకాగ్రణి పలికె
నీవేల బేలవై నేఁడలిగెదవు । నోవెట్టి ననునొంప నొదవునె మేలు
నన్ను జేపట్టు మెంతయు లాభ మొదవు । నెన్నికీరములున్న నేమి ఫలమ్ము
నేనృపుండైన నూఁతేఁబదు లిచ్చుఁ । గాని నీకిట నధిక మొసంగలేదు
నరుగు మిద్రావతి కమ్ము మచ్చోట । హరువొందు ధనదత్తుఁ డనువైశ్యమణికి
నతఁడు నీకిచ్చు సహస్రనిష్కములు । మతి నమ్ము మింక నామాట యటంచు
మాయురే! యీచిల్క మంచిదటంచు । బోయకు విశ్వాసపుట్ట భాషింప
నాఁడింటిలో నొక నవపంజరమున । వాఁడు మెల్లనఁ గీరవరము గొంపోయి
యుంచి మేతలువెట్టి యురుధనాపేక్ష । ముంచ నింద్రావతీపురమున కేఁగి
ధనదత్తుఁడున్న సద్మముఁ జేరి యతని । గని మ్రొక్కి రాజశుకంబు చూపినను
ఆవైశ్యరత్న మూరా యని చిలుక । నావేళఁ గని తెక్క లలరి దువ్వుచును
మాటలాడించిన మాధుర్యధుర్య । చాటుగాథా సుధాసారంబు జాఱఁ
బలుకులఁ గపురంపు పలుకులఁ జిలుకఁ । బలికిన నాసెట్టి భ్రమపుట్టి యిట్టి
కీరవరేణ్య మీశ్వరి నెందుఁగలదె! । సారంబు నవసుధాసారంబు దీని
పలుకు పల్కులబోటి పాణిపద్మమునఁ । గులుకు చిల్కకు నిట్టికుశలత లేదు
ఇది దేవతాశుకంబే యని మెచ్చి । హృదయమర్మము బోయ కెఱుఁగరానీక
దీనికి వెలయేమి తెలుపరా యనిన । నేనెఱుంగుదునె సామీ దీనిక్రయము
పదివేలొసంగినఁ బదిలక్షలిడిన । నిది దొరకునె భూమి నెవ్వారికైన
నీవంటి బహు భాగ్యనిధులకుఁ గాక । యేవైశ్యులకు దీని నేనేల యిత్తు
ననువేళ శుకరత్న మవైశ్యుఁ జూచి।యనఘ! యీతనికి సహస్రనిష్కములు
తగుకోక లిచ్చి డెందము కందళింప । నగధీర! పనుపు మింతప్రయత్న మేల

నాకోస మిచ్చుధనంబు నిక్కముగ । నీకొక్క తృణములో నేఁగూర్తు ననిన
సూరవ్య శేఖరుం డుత్సాహ మంది । కీరరాజంబు పల్కిన చందమునను
బోయకు భోజనంబును గోక లొసఁగి । వేయినిష్కము లిచ్చి వీడ్కొల్పె నపుడు
తదనంతరంబున ధనదత్తుఁ డల్ల । మదను తేజీ గొని మందిరంబునను
తనకులాంగనకును దన బాంధవులకుఁ । దనపరిచరుల కాదరమునఁ జూపి
రత్నకీలిత పంజరంబు దెప్పించి । యత్నమ్ముతోఁ జిల్క నచ్చోట నుంచి
పంచదారయుఁ బక్వఫలములు పాలు । మంచి పదార్థముల్ మాటిమాటికిని
బెట్టించి ముంజేత బెరసిన కీర । పట్టభద్రుని మంజుభాషలఁ జొక్కి
యదిదెల్పు వివిధేతిహాసముల్ వినుచు । సదమల ధర్మశాస్త్రంబు లూహొనుచు
నవని నేరికిఁ దెలియని రహస్యములు । వివరింప నాశ్చర్య వివశుఁడై దాని
తోడిదే లోకమై దొరకొని ముచ్చ । టాడుచుఁ గొన్నినా ళ్లలరుచు నుండె
నంతట నొకనాఁ డాచిల్క పలికె । సంతోష మెసఁగ వైశ్యవతంసుఁ జూచి
నాయందుఁ బ్రేమయుండగ నిచ్చినావు । వేయువరా లల్ల వేఁటకానికిని
నాయప్పతోఁగూడ నమితమాద్రవ్య । మోయయ్య నీకు నేనొనఁగూర్తు నిదిగొ
నీయింటిచెంత ననేకశిల్పములు । మాయుచే యని ప్రజల్ మదిమెచ్చ నొక్క
యంగడిఁ గట్టించి యందుఁ బెట్టింపు । మంగుగా నీయింట నడవిపడ్డట్టి
పట్టాంబరమ్ములు బహుభూషణములు । కట్టాణిముత్యాలు గారుడాశ్మములు
గురుతరవజ్రముల్ గోమేధికములు । సరసిజరాగముల్ చందనతరులు
మొదలైన సరకులు ముకురాదికములు । నదిగాక తక్కుపదార్థమ్ము లుంచి
పాయ కంగడినేరుపరులను లెక్క । వ్రాయువారి నమర్పు వైశ్యవంశేంద్ర!
అపుడు చూచెదవు నేనాఁడు బేరమ్ము । లిపుడు నీతోఁ దెల్పనేల యటన్న
నావైశ్యుఁ డౌగాక యని చిల్కయనిన । శీవి నంగడియుఁ గట్టించి యచ్చోట
నడవులౌ తనయింటి యఖిలవస్తువులు । నిడఁబంచి తగువారి నేర్పాటు చేసె
శుకలలామం బొకశుభవేళ విప్ర । నికరార్చన మొనర్ప నియమించి మంచి
శకునముల్ గని మెచ్చి సంతోషమెచ్చి । సుకరమా నంగడిఁజొచ్చిమాణిక్య
మయపీఠిక వసించె మహనీయబుద్ధి । యయిన వైశ్యమణింది యర్థదత్తుండు
పరిపరి సరకులు పచరింపఁ జెంత । కరణంబు ఘంటంబు కవిలెయుఁ బూని

వసియింపఁ దన యిరువంకల నిరువు । రసమాస్త్రీదీమంబు లన నుల్లసిల్లు
కొమరుబ్రాయపు వెలగుబ్బెత లుండి । క్రమమొప్ప జంత్రగాత్రములమ బాట
పాడుచు రక్తి సంపాదింపగుంపు । గూడి వీక్షుల ప్రజాకోటి వీక్షింప
మన్నీలు దొరలు సామంతులు మంత్రు । లెన్నికగలరాజు లెలమి నచ్చిలుక
పలుకులు వినుకాంక్షఁ బటములు రత్న।ములు గొనితెచ్చు నెపంబున నందువచ్చి
యంగట వసియింప నాయాయిఘనుల । సంగతో క్తి సుధారసంబులఁ దేల్చి
హారకేయూర రత్నాంబర గంధ । సార కాశ్మీరాది సారవస్తువులు
వారివారికిని విల్వలుదీర్చి యిచ్చి । వారిచ్చు రొక్కములు వ్రాయించుకొనుచు
గడియలో వెయ్యార్లు గడియించునేర్పు । కడఁకయు మాటలకఱదలు బెరయ
లక్షోపలక్ష లీలాగు గడించె । నక్షయమతిశాలి యక్కీరమూళి
తనయింట వస్తుసంతతులెల్ల నమ్మి।ధనరాసులొనఁగూర్చె తగు నుపాయమున
నిది చిల్క యనవచ్చునే! నన్నుబ్రోవఁ । గదిసిన దైవంబె కాఁబోలు ననుచుఁ
దనరుచు నొకనాఁడు ధనదత్తుఁ డింట । కనకపంజరమునఁ గడువేడ్క నున్న
చిలుక రాఁదిగిచి ముంజేత నుంచికొని । యెలమి లాలింపుచు నిట్లని పలికె
నాపుణ్యఫలమున నామందిరంబు । ప్రాపించితివి నీవు పతగవంశేంద్ర!
నీకతంబున నా కనేకసంపదలు । చేకూఁతె నిన్ నుతిసేయఁగాఁ గలనె
ఐన నింకొకవేడ్క యంతరంగమున । మానకున్నది వినుమా! వినుపింతు
తనపుత్రుఁడు కుబేరదత్తాహ్వయుండు । వినయ దాక్షిణ్య వివేకవర్జితుఁడు
కన్నతల్లిని నన్ను గైకొనఁ డింట । నున్నసొమ్మొకవేశ్య కొసఁగుచున్నాఁడు
ఊప్పుసేయదు చూడనొప్పదు రూపు । మొప్పె మందులమారి మొఱకు బజారి
తన వలచినవనితయె కదా రంభ । యనుమాట నిజమైన దామూర్ఖునందు
ఇంటికి నొకవేళ యేతెంచు దొంగ । బంటుకైవడిఁ గనబడఁడు మాకెపుడు
సుమము లమ్మెడుచోట జూదంబుచోట । క్రమమేది కుంచెనక త్తెల యిండ్ల
గందవడమ్మి నంగళ్లవసించు । పొందుసేయును మందబుద్ధులతోడ
తనయిల్లెఱుంగఁడు తనసొమ్ముజూడఁ । డనదయై తిరిగెడు నదియునుగాక
నాకోడలున్న దింటను నీవుగనవొ । కాక యాబిడరేక గలదె లోకమున
మదిరాక్షి యది పుష్పమంజరి యనెడి । చదరాలు జవరాలు సన్మార్గరాలు

దాని మోమెన్నఁడు తాఁజూచియెఱుఁగఁ । డానాతి వీనికె ట్లజుఁడు గూరిచెనో
మొక్కలీఁ డెట్లేలు ముదిత చెంకాయ । కుక్కకబ్బినఁ జవిగొన నెట్లునేర్చు
నట్టిమూర్ఖుని సుగుణాన్వితుఁ జేసి । యెట్లుపాలించెదో యెఱుఁగ నీమహిమ
హీనభామిని గోష్ఠి యెడఁబాపి కూర్పు । మా నయేతరుని కులాంగనతోడ
నని పెక్కుభంగుల నాత్మజుచంద । మనువందఁ దెల్పు వైశ్యాగ్రణిఁ జూచి
యూనెఱువాది మహాశుకం బనియె । నౌనయ్య ! యిన్నాళ్లయ్యే నేవచ్చి
యెన్నఁడు వివరింప వీవిచారంబు । మున్నె తెల్పిన ముదంబు ఘటింతు నీకు
నిప్పుడేమాయె వాడింటికి నచ్చి । నప్పుడె తెల్పు మొయ్యనఁ జేరఁబిలిచి
యొకనేర్పు సేసెద నుడుగుమీ చింత । లిఁక నని నమ్మికలిచ్చి వీడ్కొలిపె
నంత మేఘాక్రాంతమై యొప్పె నభము । సంతసం బొసఁగెఁ గర్షకులకు నభము
అందంద నెరసి చల్లారె దావంబు । కందళ త్తరులక్ష్మి గాంచెదావంబు
నెనసెఁ బశ్చిమదిశ నింద్రచాపలత । జనియించె విరహిణీసతికిఁ జాపలత
పరివేషగతి మించె భానుబింబంబు । హరియించె నింద్రపాభ బింబంబు
తఱచయ్యె హంససంతతి కలజల్లు । మురుసిచ్చె నెమలిగుంపుల కలజల్లు
తమముచే రేలీలఁ దాల్చె నా పగలు । భ్రమణంబుతో నిండి పాఱె నాపగలు
అట్టి వర్షావేళ నవైశ్యశాలి । పట్టి భోజనము సల్పఁగ నొక్కనాఁడు
పగలింటి కరుదెంచి పరితుష్టిగాఁగ । తగు భక్ష్యభోజ్యముల్ తల్లి వడ్డింప
భుజియించి వెలువడిపోవ నుంకించ । గజకరోపమ జలోత్కటధార లెసఁగ
నురుములు మెరుములత్యగ్రముల్ గాఁగ।కురియసాగెను వాన కుతలంబు గరఁగ
నావానలో వెలయాలి యింటికిని । బోవఁగూడక మొగంబునఁ దెల్వి తప్పి
దిక్కుమొకంబు రీతిని సందుగొందు । లొక్కటఁ జూచుచు నున్న యాసన్న
తలిదండ్రు లెఱిఁగి యాప్తజనంబు గూడి । పలుమాటలాడి కోపమున నిట్లనిరి.
వానలో నైన నిల్వఁగరాదె యింట । కానవా ! నీతోడి ఘనవైశ్యసుతుల
నంగడిబేరమో యర్థార్జనాప్ర । సంగమో వలసిన సరకుసప్పటలు
గూర్చుటో యిదియేమిగుణ మింకనెపుడు । నేర్చెదో నీజాతి నీతిప్రస క్తి
యింట నుండెడుచిల్క నిన్నినాళ్లాయె । కంటివే వింటివే కటకటా ! దాని
మాట లీవెక్కడిమానిసి విచట । నేఁటి కించుకసేపు నిలిచి కన్గొనుము

అని దూతివాని నొయ్యనఁ దోడితెచ్చి । రొనరికతోఁ జిల్కయున్న యంగడికి
అత్తటి చిల్క హాస్యముతోఁ గుబేర । దత్తునిఁ గని చాలతడవుల కౌర
కంటిమిగా సెట్టిగారినెచ్చోట । నుంటిరో! యిన్నినా ళ్లోహోరె! కొంత
కరుణపుట్టెనొ మీశుకంబుపై నింత । యరమరికైన మాకాదరువేది
నీసొమ్ము నీయిల్లు నీవు పరాకు । చేసి యన్యునివలె చెంగియాడెదవు
తల్లియుం దండ్రి పెద్దలు గృహభార। మొల్లక తిరుగ నయ్యో బాలకుఁడవె?
పో! నీవెఱుంగవె బుద్ధిమంతుఁడవు । నే ననవలసంటి నీకంటు వలదు
అన్న! నీతోడ నేకాంతంబులాడ । నున్నది యొకకార్య మొద్దికి రమ్ము
అని చెంతల వసించునందటిఁ బోవఁ । బనిచి సుధామధుప్రాయోక్తిఁ బలికె
అవునోయి నీవేమొ అలివేణినొకతెఁ । దవిలి యున్నావట తథ్యమా యేమి
ఏపాటిచక్కని దేమిజవ్వనియె । ఆ పద్మలోచన యభిధాన మేమి
వారకామిని కేడవలపు నీవేల । యోరక తిరిగెద వూరెల్లఁ దెగడ
నీరూపరేఖకు నీగుణమునకు । చారువివేకి! నీజవ్వనంబునకు
నక్కరూపపు వెలయాలేమి తగునె । యెక్కడఁబుట్టె నీ కీవెట్టిమరులు
అక్కటా! నినుజూచి యంగజుబారిఁ । జిక్కి సొక్కినదొక్క చివురాకుబోణి
యదియేమొ సామాన్యురాలని నీవు । మది నెంచఁబోకుమీ మనపురంబేలు
రాజశేఖరుపుత్రి రమణీయగాత్రి । రాజితమణిపుత్రి రసికతాధాత్రి
మదనరేఖానామ మహనీయధామ । యది రేఁబగల్ విరహాగ్నిచేఁ బొగిలి
నినుగూర్చు మనుచును నేనున్నయెడకుఁ । బనుచుచున్నది తన బాలికామణుల
గడియకు పదిమార్లు కలికిదూతికలు । నడతు రంగడికి నన్నా! వేయునేల
నే నిన్ను గనరాక యీమాట యెవరి । తో ననరాక కుందుచునుందు మదిని
నాకన్నులాన కందర్పునితోడు । నీకుమరుల్గొని నెలలురెండయ్యె
వానకతంబున వచ్చితి విటకు । గాన నీతోఁ దెల్పగా సందుగలిగె
నిచ్చోట వసియింపు మెందఱు చెలులు । వచ్చెదరో చూడు వరుసతో నేఁడు
అని ప్రబోధించిన నవైన్యసుతుఁడు । మనసిజునకుఁ జిక్కి మాయలదిలుక
పలుకులు నిజమని భావించి నమ్మి । చిలుక! నిక్కము వలచినదె రాక న్నె
యెన్నఁడు ననుఁజూచె నిది నిజంబైన । నున్నకాంతల గోష్ఠియొల్ల నీతోడు

ఎన్నఁడు ననుగూర్చె దిందీవరాక్షి । నిన్ను నిక్క-మునమ్మి నిలతునా ! యిండె
అనినఁ గీరవతంస మాత్మహార్షించి । తనయురిఁ జిక్కె- నితండని యెంచి
యనియె నిట్లనుచు నుద్యానమార్గమునఁ।జనుచున్న నిన్నొక సమయంబునందుఁ
గనుగొన్నదఁట ! రాజకన్యాలలామ । విను మదిమొదలుగా విరహార్తి చెంది
దూతికామణుల నాతోఁ దెల్పఁబనిచె । నీతోడు బొంకైన నేను తెల్పుదునె
యొక రెండుమూఁడునా ళ్లుండు మిచ్చోట । సకియ రప్పింతు నీ సదనంబునకును
వెలయూలి నిజముగా విడిచినఁగాని । నలినాక్షి రాదింను నమ్మిక యిమ్ము
ఇదిగొ వచ్చెదరీడ కింతిదూతికలు । పదరక చూడు నాపజ్జ నీవుండు
మనిన వైశ్యకుమారుఁ డానందమంది । వినుమ కీరలలామ ! వెలయూలిగొడవ
విడిచితి నీయాన వెడవిల్తునాన । మడికాసుగట్టులు మన్నినయాన
మా గురువులయాన మాతండ్రియాన । వేగుర వినుటీవు వినుట నాబాస
యనిన మంచిదియని యతని లాలించి । తనచెంత నిడుకొని తగినవస్తువులు
వానిచే నమ్మించి వచ్చినధనము । చేనందికొనఁజేసి చెల్ల ! యిన్నాళ్లు
ఈలాభ మెఱుఁగలే కితరునిలీల । కాల మజ్ఞులఁగూడి గడపితి వనుచు
చూఱుకుపుట్టఁగ నాడుచును మహోత్సాహ।భరితుఁజేయుచు మంచిప్రజ్ఞనీదనుచు
వినుతి గావింపుచు వివిధవస్తువులు ।గొన నంగడికి వచ్చుఁగుసుమకోమలుల
చెవులలో నొకకొన్ని చెప్పి వీడ్కొలిపి । యవుర రాజకునూరి యతనుకటూరి
యెంత మోహించిన దిచ్చ నీమూఁద । కాంతల బడిబడిగా నంపసాగె
నిపుడు వచ్చిన చెల్కలెవ్వరో యనకు । చపలాక్షి పనిచిన సకియలు సుమ్ము
అని చెప్పి నాఁటికి నానాఁటికేయి । వినవిన నింపుగా వింతలౌ కథలు
వినుపించి నవ్వించి వేడుకసేయ । తన కిన్నినాళ్లీకథల్ వినుమేలు
గలుగదాయె నటుంచుఁ గడుఖేద మొందె । నల సెట్టికొడుకంత నామజునాఁడు
ధనదత్తుతో నేకతమునఁ గోడలికి । మునుమూపె సింగారములు సేయఁబనిచి
తోఁటతెచ్చిన నొక్క తొయ్యలితోడ । మాటలాడుచుఁ గేళిమందిరంబునకు
వచ్చినట్లుగ సేయవలె నని తెలుప । నచ్చతురత కాతఁ డచ్చెరువంది
యటువలెఁ గావింప నాళులఁ బంచె । తటుకునఁ గీరరత్నము వైశ్యుఁ జూచి
జలకమ్మునాడి భోజనము గావించి । చలువలు రత్నభూషణములు దాల్చి

గంధ మాల్యాద్యలంకారమ్ము లూని । బంధురప్రేమ నీపడకింటిలోన
నలఱపాన్పున నుండు మంతటిలోన । తొలిజామునన రాచతొయ్యలి వచ్చు
వచ్చిన యచ్చెలి వాంఛలీడేర్చి । చెచ్చెర నొకజాముసేపులోఁ బనుపు
"మఱునాఁడు నెప్పటిమాడ్కి- నే తెంచి।మఱకేళి నినుదేల్చు మగువ" యటంచుఁ
బనిచిన నానందభరితుఁడై మమత । పెనగొన నటులఁ గుబేరదత్తుండు
పడకయిల్ పాన్పును బాగు గావించి । తొడిపూసికట్టి య త్తొయ్యలి యెప్పు
డే తెంచునో యని యెదుఱ చూడంగ।నాతొయ్యలికి మున్నె యవ్వ్యాళ్యనింటి
చెలులు సంపఁగినూనెచేఁ దలయంటి । యలఱుచు గందంపుటకలి పెట్టి
చలువ గొజ్జఁగినీట జలకమ్ములార్చి । వలిపెంపుఁ జలువపావడఁ దడి యొత్తి
జిగి బుఱసాపనిచీర గట్టించి । సొగసుగా నుదుటఁ గస్తురిరేఖ దీర్చి
పునుగు జవ్వాది కప్పురము కస్తూరి।మొనయు గంధము పొంకముగ మేన నలఁది
యంగుగా నాణిముత్యపు మించుపనుల । కంగులరవిక చన్గవనొప్పఁ దొడిగి
పంజులకమ్మలు పాపటబొట్టు । మంజుల నవరత్నమాలికాతతులు
పచ్చలకడియాలు బవిరులు తీఁగె । మెచ్చులబుగుడలు మేలినీలంపు
ముంగర బంగారు ముంగామురములు । నుంగరంబులతెగ లుదరిఘుంటికల
మొలనూలు మంజీరములు గిల్కుమట్టి।యలును బొబ్బిలికాయ లాదిగాఁగలుగు
ఘనభూషణములను గైసేసి కెంపు । మినుకుటారతులెత్తి మృష్టాన్నభుక్తి
సమకూర్చి పుష్పమంజరికి ధమ్మిల్ల । సముదార పుష్పమంజరికిఁ గప్పురము
వీడియం బొసఁగుచు వెనువెంటఁ గొంద।ఱూడిగం బమరసేయుచుఁ గొల్చిరాగ
సొలపుతోఁ బడకయిల్ సొచ్చి యక్కలికి।చిలుక మున్ దెలుపుట సిగ్గరితనము
నడలించి విభుఁడున్న చలువపానుపున।కడువేగఁ గూర్చుండి కరముపైఁ గరము
తొడఁదొడపైఁ జేర్చి దొరకెబో! నెట్టి । కొడుకు నేఁడని నవ్వుకొనుచు నీవలచు
తెలిగంటిఁ బోలనైతిన! యిన్నినాళ్లు । చలముజేసితి వెంత జాణవు నీవు
నిదె నేఁడు చిక్కితి వెందుఁబోయెదవు । మదమెల్లఁ దీర్చెద మసలక యనుచుఁ
గొదమగుబ్బలతొమ్మ్రగ్రుమ్మ నెమ్మోము। గదియమోమునఁ జేర్చి కడిమిఁగెమ్మోవి
మొనపంట నొక్కుచు మొలక లేనవ్వు। లెనయఁ గౌఁగిటఁజేర్చి యేమిరాసామి!
వన్నెకాఁడా! వలవంతచే రాచ । కన్నె యేమాయెనోగద యనకున్న

నినునమ్మవచ్చునా నేఁడని కొసరి । కొనగోరఁ జెక్కుఁనొక్కుఁచుఁ బొలయలుక
యలవడ నవలిమోమైనఁ గోపంబు । నిలుపకె నామీఁద నీచిత్తమేను
తెలియకుండితి చిల్క దెలుపఁగా మొన్న । తెలిసితి వలచితి తెఱవ ! నీమీఁద
నని వాఁడు తగినసైయ్యపుమాట లాడి । వనిత మేకొని కూడి వలపుతో వేఁడి
కళలంటి రతికేళిఁ గరఁగించి దాని । నలయించి సొలయించి యానందలీల
పరవశంజేసి తాఁ బరవశుండయ్యె । మఱి కొంతవడికి నమ్మానినీమణియు
రహిమించు పతి పునారతి కిచ్చగింప । సహజ కామోద్రేక సంపర్కమంది
పరిపరినేర్పుల బంధభేదముల । బెరసి మెప్పించిన పెద్దయు నలరి
యీలాగు దినదిన మింపుతో నన్ను । నేలెనో వెలయాలియింటి కేగెదవో
నీ యిచ్చుఁ గలమాట నిజముగాఁ దెల్ప । రా యని పల్క నారాజీవగంధి
చెక్కిలి నొక్కుఁచుఁ జెలువ నిన్ బాసి ! యొక్కక్షణంబైన యోర్వలే నింక
నెప్పుడువచ్చేద వింటికిఁబోయి । చెప్పవే యని వేఁడుచెలువునిఁ జూచి
నేఁటికిఁ బోనిమ్ము నృపమూళి రచ్చ । కూటంబునందుండి కొలువుచాలించి
యంతఃపురంబున కరుదెంచువేళ । యంతకుమున్నె నే నందుండవలయు
రేపు మాపటికి నీరీతి నేతెంతు । నీపడకింట నీ వెటుఁబోక నుండు
ముండెదనని బాస యొసఁగక పోవ । నొండేల నినుబాసి యోనాథ యనుచు
పలుమాటలాడిన బాసలిచ్చుచును । వలపునఁ బొమ్మని వాక్రువ్వలేక
యెట్టకేలకు సెలవిచ్చిన నదియు । నిట్టలంబగు ప్రేమ నిలుబాసి యవల
నెల దోఁటలోఁ జొచ్చి యెపుడు దానున్న । నిలయంబు ప్రాపించి నెమ్మదిలోన
రాచిల్క కతమున రమణునిఁ గూడి । యీచందమున సుఖయింపఁగాఁ గంటి
తిలకింప నాభాగ్యదేవత గాని । చిలుకగాదని నుతిసేయుచు నుండె
ప్రియకాంత చనినఁ గుబేరదత్తుఁడును।శయనించి యొకనిమిషము యుగంబుగను
దోఁచిన దానిసుద్దులె తలంపుచును । రాచకన్నియఁ గూడి రహిఁ జెందఁగంటి
దొరకునే యిది యెంతదొడ్డవారికిని । పరమోపకారి యీ బంగారుచిలుక
నాపాల గల్గియుండగ నింతసుఖము । ప్రాపించెనని యెంచి పరితోషమందె
నీరీతి దినదిన మింటిలోనున్న । యా రాజబింబాస్య యాత్మనాథునికి
పగలెల్లఁ గానుపింపక రాత్రియైన । సొగసుతోఁ బడకిల్లు సొచ్చిమోహమున

సమరతిక్రీడల సరిప్రొద్దు దాఁక । రమియించి నిజమందిరమునకుఁ బోవు
రతిఁ జొక్కి వైశ్యపుత్రకుఁడునిద్రించు।నతివ రాజకుమారి యని భ్రాంతుఁడగుచు
దినమును జిలుకవద్దికి వచ్చి దాని । తనువిలాసమ్ములు దాని ముచ్చటలు
తెలుపఁగ నాలని తెలియనందులకుఁ । జిలుక నవ్వుచు వానిఁ జెంతనుంచికొని
పగలెల్ల నంగడిపనికి లోఁబఱచు । తగులెంచి రేలు బి త్తరికి లోఁబఱచు
ఆజేడుమాసమ్ము లరిగిన నంత । తా రాజపుత్రిచందమున వల్లభుని
బ్రమయించు నవైశ్యభామిని చిలుక।యమరిక నొకయుపాయము ప్రబోధింప
నొక రేయి పతిఁగూడి యుండి లేనవ్వు। మొకమునఁ దులకింప ముదమొప్పఁబలికె
వల్లభ ! చంద్రికావతియను పురికి । నెల్లి నీవును నేను నింపతోఁ గూడి
చని యటఁ దిరునాళ్ల సాగుచున్నదఁట । కనుగొని వత్తముగాక వచ్చెదవె!
అనినఁ గుబేరదత్తాహ్వయుం డనియె । వనజాక్షి! మాయత్తవా రుందు రచట
నిను రాజసుతఁ గూడి నే నందుఁజనిన । మనసున మాయత్తమామ లోహతురె!
తమపుత్రి నేలఁ డీతఁడు పరాంగనల । రమియించి తిరిగెడి రవ్వాఁడనుచు
దూఱుచుందురు వారు తోయ్యలి !యనిన।నారాజముఖ పల్కె నందులకేమి
యే రాజసుతనౌట యెఱుఁగరే నన్ను । గూరిచి నిన్నాడఁ గొంకుదు రాత్మ
జడియకు మిఁక రేపుసందెప్రొద్దునన । వడి నేను పైనమై వచ్చెద నీవు
పల్లకి జతచేసి భటులతోఁ గూడి । యుల్లాసము వహించి యుండు మటంచుఁ
బలికి పోయిన వైశ్యబాలుఁ డామాట।చిలుకతోఁ దెల్పె నచ్చిలుకయు మున్నె
పుట్టినింటికి నలపుష్పమంజరిని । నెట్టనఁ బంపఁగా నేర్పు చింతించి
ధనదత్తుఁగని యేకతమున నిట్లనియె । విను మొక్కకమ్మ,నీ వియ్యంకునికినిఁ
బనుపు డీ తెఱఁ గేరుపడ వ్రాసి యనినఁ । బనిచె నందున రాచపట్టి యటంచు
రాకన్నియ యనిగౌరవము సేయుండు।మీకన్యయనుమాట మిగుల గోప్యముగ.
వియ్యంకుఁ డెటేఁగి యేవిధమున నైన । నియ్యెడ మాపుత్రి నేలినఁ జాలు
మాయల్లుఁడనుచు సమ్మదము వహించె।నాయెడ సతిఁగూడియవైశ్యసుతుఁడు
భటులు కొందఱు గొల్వఁ బల్లకి యెక్కి । యట నత్తవారింటి కరిగిన వాఁడు
తము కుమారిని రాజతనయగా నెంచి । ప్రమదంబొనర్చిరా భ్రాంతచిత్తునకు
నీకుఁ బ్రియంబై న నెలఁతయె సుమ్ము । మాకూఁతురని యత్తమామలు పల్క

వాఁడు వేఁడుకపడి వారింట నుండె । నేఁడెనిమిదినెల లింతలోనచట
జనులెల్ల నొకరాజసతిఁ గొనివచ్చె । మన రత్నదత్తు జామాత యటంచు
నాడుకోఁగా భయమంది యందుండఁ । గూడక ధనదత్తుకొడుకు రాచిలుక
పనుపున మరల నప్పుడుచుతోఁ గూడి । కొని తనప్రోలికి గొబ్బున వచ్చె
వచ్చి యిచ్చెలువ కే వలచియున్నాఁడ । నెచ్చోటికేఁగక యింటి లోపలనె
ఓచిల్క ! యిది నిల్చునుపమ దెల్పుమన । నా చిత్తజుని తేజి యతని కిట్లనియె
నీవేల యీవేళ నెగులుచెందెదవు । భావింపు మిది రాజభామిని గాదు
మదిరాక్షి యలపుష్పమంజరి నీదు । సుదతి నీవెన్నఁడు చూడకుండుటను
రాకన్నెయని నిన్ను భ్రాంతునిఁ జేసి । యీకన్నెఁ గూర్చితి నే నుపాయమున
నీసొమ్ము నినుజేరె నీకేల వంత । యీసుందరిని గూడి యింపొందు మనిన
నదుదంది సంతోష మావహిలంగఁ ! బెరిమ నుప్పొంగి కుబేరదత్తుండు
పలుమాఱు చిలుకను పదివేలచంద । ములఁ గొనియాడుచుఁ బుష్పమంజరికి
మేలువాఁడై తనమేడలఁ జంద్ర । సాలలఁ గేళికాసదనంబులందు
విహరింపుచును దనవిత్తంబెఱింగి । గృహకృత్య మరయుచు కీరంబు బుద్ధి
తా జవదాటక తలిదండ్రు లలర । రాజితసౌఖ్యాభిరాముఁడై యుండె.
ధనదత్తుఁ డింతితోఁ దగువారిఁ గూడి । కనకావతికి వర్తకము సేయనేఁగె.
ఆపుర మేలెడియవనీశ్వరుండు । రూపమన్మథుఁడు విరోధిభీకరుఁడు
మదసేనుం డొక మాపటిపూట । వదలనివేడ్కతో వాహ్యాళి వెడలి
విపణివీథుల వచ్చువేళ నవైశ్య । చపలాక్షి పుష్పమంజరి మేడమీఁదఁ
జెలులతో నుండుటఁజేసి యారాజ । వలశాసనునిఁ జూచె వాతాయనమున
చూచిన యాచెల్వ సొగసు బంగారు । మైచాయ క్రొమ్మించుమాడ్కి నల్లడల
ధళధళమన నద్భుతముఁజెంది నృపతి । కళవళపడి మోహకాంక్షలు నిగుడ
దానిబంగరుమేను దానిలేఁగాను । దానికన్నులబెళ్కు- దాని నున్బలుకు
దానిగుబ్బలతీఱు దానినూఁగారు । దాని చెక్కులతీవి దానికెమ్మోవి
తిలకించి పులకించి తియ్యవిలాకని । యలరుతూఁపుల నొచ్చి యాచెల్వ మెచ్చి
యెవ్వతో! దీనిపేరేమొ ప్రాణేశుఁ । డెవ్వఁడో! దీని కిడెవ్వరియిల్లో!
తెలియగావలె నంచు దృష్టిమరల్చి । కెలకుఁలవారి నీక్షించు నాలోన

నలపుష్పమంజరి యా భావమెఱిఁగి । నిలువక యిటిలోనికిఁ జనెనంత
ధరణీశుఁ డడుగఁ జెంతల నున్న వార।లెఱిఁగించి రధిప ! యీ యిందుబింబాస్య
ధనదత్తుకోడ లుత్తమవైశ్యకులజ । ధనదుఁబోలు కుబేరదత్తు నాలనుచు
విని రాజచంద్రుఁ డవ్విమలాంగియందు । మనసునాఁటగ నందు మసలక యపుడె
తననగరికిఁ బోయి తాఁబవ్వళించు । కనకసౌధాంతరాగారమ్మునందు
విరులశయ్య శయించి విరహానలంబు । దరికొనఁ దాలిమిదక్కి యవ్వేళ
దూతిక నొక్కతెఁ దోడ్తేరఁ బనిచి । యాతన్వితోఁ దనయంతరంగంబు
దెలుప నచ్చెలి పలెక్క దేవ! యవైశ్యుఁడిలుఁబాసి పదిపూట లైందేనిఁ జనిన
దాని బోధించి మీదయ కర్హ్యా రాలి । గా నొనరింతు వాక్రొవ్వుచే ననిన
నదియ మంచి యుపాయమని దానిఁ బనిచి।మదనసేననృపాలమణి మఱునాఁడు
కొలువుండి తనచెంతకుఁ గుబేరదత్తుఁ । బిలుపించి బహుమతింబ్రీతిగాన్పించి
యిష్టగోష్ఠి వసించి యిట్లని పలికె । శిష్టవర్ణితశీల ! స్థిరకీర్తిలోల !
మున్ను మణిద్వీపమునను నుండి మణులు । కొన్ని దెచ్చిరి వర్తకులు మాకుఁ బ్రీతి
మగఱాలు కెంపులు మౌక్తికావళులు । తగు నింద్రనీలరత్నములు పచ్చలును
గోమేధికాదులు గొనితేరవలయు । నామణుల పరీక్ష లన్నియు నీకు
కరతలామలకముల్ గద రేపటికిని । దటిగాంచి తరియొక్క తరలిపొమ్మనినఁ
దప్పించుకొనరాక తానొకరీతి । నొప్పి యవైశ్యముఖ్యుఁడు మంచి దనుచు
నృపతి వీడ్కొని తనయింటికి వచ్చి । కృపణుఁడై చిలుకతో నిట్లని పలికె
శుకశిఖామణి!యొక్కచోద్యంబు వినుము।మకరాంకనిభుఁడైన మనయూరిరాజు
నను నేఁడు పిలిపించి నవరత్నసమితి । గొనితేరఁ బనిచె నకూపారమునను
బొలుచు మణిద్వీపమునకు రాజాజ్ఞ । చులుకసేయుట బుద్ధిచొప్పు గాదనుచుఁ
గోరినపని కియ్యకొని వచ్చినాఁడ । నేరీతిఁ బోవుదు నీయింతిఁ బాసి
నిను నొంటిగా డించి నే నెట్లులోర్తు । ననిన వైశ్యునిఁజూచి యచ్చిలుక పలికె
కపటవర్తనుఁడుభూకాంతుండు నేఁడు।నెపమొక్కటి గణించి నిన్నుఁబొమ్మనియె
పొమ్మని దొరపల్కఁ బోకుండరాదు । కొమ్మనుబాసి యేగుట తగదైన
నెన్నినాళ్లకు వత్తు వచటికిఁ దెల్పు । మన్న డెబ్బదినాళ్లి కరుదెంతు ననుచు
నతఁడు పల్కిన మంచి దైననేమాయె । నతివఁ గాపాడెద నందాఁకనేను

గడువుదప్పకరమ్ము గ్రక్కుననుచు। నొడివిన వైశ్యుఁ డెంతో సంతసించి
మగువఁ గాపాడు మేమరక రేవగలు। ఖగరాజ! నీ వేడుగడయును మాకు
చలచిత్త లటుగాక జవరాండ్రవగలు। తెలిసియుందువునీకుఁ దెలుప నేమిటికి
నని పుష్పమంజరి నటకు రప్పించి। తనయత్నము కుబేరదత్తుండు దెలుప
పతిఁ బాయఁజాలక పద్మాయతాక్షి। వెతఁజెంది కన్నీరు వెల్లువగట్ట
వగచిన నెలలోన వత్తు నీకేల। వగపని యూరార్చి వనిత కచ్చిలుక
నప్పగించి పయోరుహాక్షి నచ్చిలుక। కొప్పగించి శుకేంద్రుఁ డొసగుదీవెనలు
గైకొని మంచిలగ్నమ్మున వెడలి। యాకంధిఁ దరియెక్కి యవ్వైశ్యుఁడరిగె
పతిచన్న రాచిలుక పలుకులఁ గొంత! వెతమాని ధృతిఁబూని విరిబోణి యున్న
మధురవాణీ ఖ్యాతి మహిమ గన్దూతి। యధిపతి యానతి నమ్మరునాఁడు
పుష్పమంజరి గృహాంబునకు నేతెంచి। పుష్పబాణవ్యథా పూరితయైన
దాని భావమెఱింగి తనకు సన్మాన। మానెలంతుక చేసి యర్ఘ్యపీఠమునఁ
గూర్చుండ నియమింపఁ గూర్చుండి దాని।గూర్చి ప్రియోక్తి నక్కొమలి పలికె
నేల జాలి వహించెదే! ముద్దరాల। బాలవు గోలవు పతిఁబాసి యొంటి
నిలువనోపక యార్తి నివ్వటిలంగ। వలవంతఁ జిక్కుభావము గానిపించె
పనిగల్గి పతి దూరభారంబు చనిన। వినుజవ్వని! వహించి విరహభారంబు
పాయంబు నీవయో! పాన్పుపాల్సేసి।యోయక్క యెటువలె నోర్చెదో! యింక
మచ్చిక ముచ్చటల్ మదినిగరంగ। పచ్చవిల్తుని బారి పడనేల నీకు
కంటి కింపైచక్కని మగవాని। నింటికిఁ బలిపించి యేలుకోరాదె?
అది పతివ్రతల కర్హమె యనవలదు। మదిరేక్షణ! యహల్య మఘవునిఁదొల్లి
కూడియుండదె! తార గురు నెడఁబాసి। వేఱుక చంద్రుతో విహరింపలేదె
వ్యభిచరించినదోష మడఁగు నంపైన। నిభరాజగమనల కేటి మర్యాద
దిననష్టి చేసి పతివ్రతాభావ। మెనసి గాసిలిన నీకేసౌఖ్య మొదవు
నేకతంబున నీకు హితవుదెల్పుటకు। నీకడ కే గమనించితి నతివ
నాలుగునాళ్లి ముందర రాజవీథి। హాళిగా వాహ్యాళి నరుదెంచుచుండి
మదనసేనక్షమామండలేశ్వరుఁడు। మదిరాక్షి నినుఁజూచి మరులుగొన్నాఁడు
జలకంబులాడఁడు చలువగలుగట్టఁ। డెలమితో భుజియింపఁ డింతసేపైన

కొలువుండుటకు మదిఁగోరఁడు నిన్నె । తలఁపుచునున్నాఁడు తవిలి చేఁబవలు
సరసుండు కొకోక్క శాస్త్రకోవిదుఁడు । కరిమూన కళలంటి కరగించఁగలము
నిమిషమాత్రంబు మానృపతికొఁగిటను । దమినున్న నదియకదా జన్మఫలము
నేటి మాఁపటికి నేనిను బిల్వఁపత్తు । బోటి రమ్మ రహస్యముగ రాజు కడకు
నిరుచెవి యెఱుఁగరాదిది మంజువాణి । యెఱుగుదో నావిధం బెఱుఁగవో కాక
అని పెక్కుభంగుల నది ప్రబోధింప । విని పుష్పమంజరి వికవికి నవ్వి
మధురవాణివి గాన మధురవాక్యముల । నధికచాతురి మీఱి నాడితి విప్రము
కులకాంతలకు మాకుఁ గూడునె యిట్టి । పలువసేతలు! రాజు పాటిదప్పినను
పామరులు తరిమి పైఁబడిన వారాశి । యే మేరఁదప్పిన యేమనఁగలము
మా కన్నిటికిఁగర్త మాయిలువేల్పు । శ్రీకరఘణితి రాచిలుక; నీయింట
నున్న రాచిలుక సెలవ్వీసఁగిన పత్తు । నిన్నేల వలదన్న నేను రావెఱతు.
అని ప్రొద్దుగ్రుంకిన యందాఁక జరపి । ననబోణిమిన్న సంధ్యాసమయమున
దానివెంటనె వచ్చి తనచెంత నిలువ । నా నెలంతుకతో శుకాగ్రణి పలికె
నెక్కడి కేగెదే! యిందీవరాక్షి । యిక్కాంత యెవ్వరే! యిగురాకుబోడి
ఎవ్వరు పిలిపించి రేమీ ప్రయత్న । మివ్విధం బెఱిఁగింపవే! యని యడుగ
ఆపుష్పమంజరి యనియె నోచిలుక । యీపురం బేలెడి న్నృపతి నన్నేమొ
చూచినాఁడట మొన్న చూచిన మొదలు।రాచిలుక హుమాయిరౌతుచే బడలి
నన్ను బిల్చుక రమ్మనంగ వచ్చినది । యిన్నాతి, నీ వానతియ్య కేపనియు
నేము సేయముగదా! యిఁకనాకు బుద్ధి।యేమి దెల్పు మటన్న నెలనవ్వునవ్వి
చిలుక యిట్లనియె రాజీవాక్షి! నిజమె । పలికితి విదివిన్నఁ బరితోషమయ్యె
కల్లలాడక మది కలదికలట్టె । పల్లవాధర! నీవు పలుకుటవలన
నిను చాలమెచ్చితి నీవుదూతికయు । నెనసి యీ నిల్వుకొల్వుల చేసెదరు
పోవలసిన వెక్కు పోదురుగాని । యీవేళఁ గూర్చుండు డించుకసేపు
కలికి రాజానతి గాదనరాదు । కలకంఠులకు నేడుగడ గదా! విభుఁడు
పతిఁ బాసి వేఱొక్కపతిఁ జేరుచెల్ల । సతుల కర్హమె! యిది జాతిధర్మంబె
వనిత! యెన్నఁడు పతివ్రతల సత్కథలు।వినినదానవు గాదు వినదు దూతికయు
నే నొకకథ మీకు నెఱిఁగింతు నిపుడు । వీనులవిందుగా విందురు గాక

ఆదివసాధ్వియై యమఱ నఱుంధ । తీదేవి కథ విన్న తీఱు దోషములు
అనిన విస్మయమంది యూరాజదూతి । విన పుష్పమంజరి విమలాంగిఁ జూచి
చతురాననాంగనాంచత్పాణిపద్మ । గత రత్నకంకణగానానుకారి
పరివాదినీస్వరప్రస్థితగీత । సురుచిర మధురోక్తి శుకరత్న మనియె

అరుంధతీ దేవి కథ

ఆదిమబ్రహ్మ మనోంబుజాతమునఁ । బ్రాదుర్భవించె నే పరమతపస్వి
కౌశికు బ్రహ్మర్షిఁ గావించె నేమ । హాశమూధికుని సత్యవచోనిరూఢి
యురగాధిపతి తాల్చు నురుభారమెల్ల। భరియించె నేమూని బ్రహ్మాండంబు
కలశజుండు వహించు గౌరవంబూని । తులకించె నేమహాత్మ్యని కమండలువు
మహనీయమార్తండమండలద్యుతులు । వహియించె నేమునీశ్వరు కావిపంచె
అట్టి వసిష్ఠమహర్షి శేఖరుఁడు । పుట్టిన మొదలు తపోనిష్ఠఁ బూని
బహుకాలము తపింపఁ బరమేష్ఠి వచ్చి । బహుమాన పూర్వకఫణితి నిట్లనియె
పట్టి ! నీ వుగ్రతపః ప్రభావమున । దిట్టవై మముగెల్చితివి నిక్కువముగ
నిను బురోహితునిగా నెమ్మది నెంచి । నను వేఁడె నిక్ష్వాకునరవరోత్తముఁడు
చాలింపుమిఁక బ్రహ్మచర్యవ్రతంబు । పాలింపుము గృహస్థపరమధర్మములు
అనఘ! పత్నీహీనుఁడై యుండఁ జనదు । నినువంటి మునిమౌళి నీ విధి దెలిసి
తగుకన్య నొకతె నుద్వాహంబు గమ్ము।పొగడొందెవవు జగమ్ముల నందువలన
నని యానతిచ్చిన యంభోజభవుని । గనుగొని యమ్మునిగ్రామణి వలికె
నా నెమ్మదికివచ్చు నాతి యేజాతి । దైన నే పరిణయంబగుదు నిందులకు
ననుమతి గావింపుఁడనిన నాలాగె । యొనరింపుమని ధాత యుడువీథి నరిగె
నా వశిష్ఠుఁడును గన్యక నరయుటకు । నావేళ పయనమై యతిశుభ్రమైన
యిసుక మానెడు గ్రహియించి కట్టుకొని।వసు రుద్ర సిద్ధ భాస్వరు లున్న చోట్ల
గరుడ గంధర్వ యక్షశ్రేష్ఠులున్న । యిరవుల నింద్రాదు లెసఁగు లోకములఁ
జరియించి యెచ్చటెచ్చటఁ బెండ్లిలేని। చిఱుతకన్యలఁ జూచి చేరి యా యిసుక
వండిపెట్టరె ! యన్న వారి నవ్వుచును । పొం డిదియేమి తపోనిధుల్ మీర్ధ

యినుక వంటకము సేయింతురో కాక । పొసఁగదు మాచేత భువనత్రయమున
విన్నది లే దిట్టివింత యటన్న । నున్నతలోకమ్ము లొగి దిగి వచ్చి
పాతాళలోకముల్ పరికించి యచట । నేతరుణియుఁ దన కిసుకపాకంబు
సేయ నొల్లమి తెలిసి ధరిత్రియందు । పాయక తిరిగి ద్వీపము లెల్ల వెదకి
యల్లొనేరెదుదీవి కంతట వచ్చి । యెల్ల దేశంబు లందెసఁగు కన్నియలఁ
బొడగని యావిధంబునఁ బల్కరింప । జడదారి యిది యేటి చాదస్తమనుచు
సారెకుఁ గేరిన సకలజాతుల కు । మారికామణుల నిమ్మాడిక్ శోధించి
వేసర కమ్మాని వెలివాడలందు । భాసిల్లు పడుచులఁ బరికింతు ననుచు
నూరూర వెలివాడ లొయ్యనఁగదిసి । యారీతి నడుగ నంత్యజుల కన్యకలు
పకపక నగుచు నొప్పని మాటలాడ । నొక యగ్రహారపరోపాంతసీమ
గనుపట్టు నొక గట్టుకడ నొప్పుతాళ । వనవీథి చండాలవాటిక యొకటి
యాలోకన మొనర్చి యట నాటలాడు । బాలలఁ గొందఱఁ బరికించి యతఁడు
పలికె దగ్గఱఁ జేరి బాలికలార । యిలయెల్లఁ దిరిగి యే నిటకు వచ్చితిని
దెచ్చితి నిసుక మీతెగ నెవ్వతైన । చెచ్చెరఁ బాకంబుసేసి యీవేళ
మా కిడఁగలరె సమ్మతిఁ దెల్పుఁడనిన । నాకన్యకలు చాల నాశ్చర్యమంది
యొండొరుఁ జూచుచు నూరకయున్న । వండిపెట్టిద నని వారిలో నొక్క
కన్నెపాయముది చక్కనిమోము గలది । చిన్నారి పలుకులచిలుకఁ బోలినది
యరుదెంచి యమ్మని యడుగుల కెరఁగికరములు ముకుళించి కడుభక్తిఁ బలికె
పరతత్త్వనిధి మీతపఃప్రభావమున । స్థిరలీల నేమైన సేయ నోపుదుఱు
యిసుక నన్నముసేయు నెంతమాత్రంబు । వెస వంటఁజేసి నివేదింతు మీకు
నిప్పించుఁడని చేట యెత్తుక వచ్చి । యప్పుణ్యకడ నిల్వనతఁడు మున్ బంచె
చెఱఁగునఁ దా ముడిచిన తెల్లయిసుక । పొరిఁబొరిఁ చేటలోఁ బోసిన నదియు
పతిభక్తిఁ జేకొని యర్థక్షణంబు । హితశీల వసియింపు డీచెట్టునీడ
సరసిలో నిడె నేను సాన్ననంబొనర్చి । మఱివంటచేసెద మసలకయనుచు
భోరున నిసుక గొంపోయి రోట నిడి । తా రోకలి గ్రహించి దంపెడువేళ
నువ్వి జగద్రక్ష నువ్వి పద్మాక్ష । నువ్వి రమాధీశ సూర్యప్రకాశ
నువ్వి భక్తవిధేయ సుగుణధౌరేయ । నువ్విమేఘశ్యామ సురసార్వభౌమ

తపసికై యిసుకయే తండులమ్ములుగ । నిపుడు పాకముసేయ నేను పూనితిని
నాభక్తి నిజమైన నాపూను పూన్కి । యేభంగి నైనచో నీడేర్పు మనుచు
నిసుక దంపఁగఁ దపు డెసఁగినఁ జెరిగి । వెసలలోఁ బోసి యవ్వేసలయుఁ గొనుచు
కొలనికట్టను నిల్పి కొలనఁ దా మునిగి । కొలనినీళ్లను కడుగోరంగఁగడిగి
తగునీళ్లతోఁ బాత్ర దాలిపైనుంచి । జగదీశు వెన్నుని సన్నుతింపుచును
కలయఁబెట్టుచు దర్వికైకొని భక్తి । గలదాననేని యీఘనుఁడు నాపూజ
కైకొనఁగలఁడేనిఁ గరుణనన్న మగు । గా కిసుక యటంచు గంధవహాప్తు
కడునేమమున వేఁడగాఁ గొంతవడికి । నుడుకుచుఁ దుకతుక నోగిరంబయ్యె
నెడనెడ గంజెల్ల నిగిరి ధావళ్య । మడర రాజాన్నమై యటిక నిండుటయుఁ
గన్నె సంతోషించెఁ గన్నియఁజూచి । కన్నుల హర్షాశ్రుకణములు దొరుగ
నవ్వసిష్ఠుఁడు తనయాత్మ నుప్పొంగె । పువ్వులు గురిసి రప్పాలఁతిపై సురలు
అల బాల యవ్వేళ నమ్మానినిమ్రోల । నిలిచి యన్నంబయ్యె నిర్మలాచార
భుజియింపవలవదే ప్రొద్దుఁబోయెనన । నజసూతి పలికె నోయరవిందనయన !
నిన్ను బెండ్లాడక నీవిడినట్టి । యన్నంబు భుజియించు టర్హమే మాకు
నీతల్లిదండులు నిన్నియ్యకున్న । నేతెఱంగున గ్రహియింతు నీపాణి
వారలఁ బిల్వము వడి నీడకనిన । వాహను వచ్చిర వ్వార్త యెఱింగి
వచ్చి దవ్వుల మునీశ్వరునకు మ్రొక్కి । యిచ్చిన్నిపడుచు మీ కేపనిఁ జేసె
చండాలవాటికాసవిధదేశమున । నుండుటర్హంబె మీ కోమునిచంద్ర !
కులహీనులముతాముగురుధైర్య!బ్రహ్మ।కులజులుమీరుమీకునుమాకునెటుల
జెలిమియూ తాము భాషింప నర్హులమె । తలఁప లౌకికవిరుద్ధంబిదియేల
నా విని యమ్మునినాథుఁ డిట్లనియె । మీవచనము మేలు మృషగాదు వినుఁడి
ధరనెంచ జాతి ప్రధానంబె! గుణమె । కరము ప్రధానంబుగాఁ గంద్రు బుధులు
ఇది దూష్య మనుచు మేమెఱుఁగకున్నామె । పదివేలసుద్దులుపలుక నేమిటికి
ఈకన్నె మాకు విూరిచ్చిన దీనిఁ । జేకొని సుపవిత్ర సేయ నోపుమము
ఇచ్చెదరో! యట్టునిటులాడి త్రోసి । పుచ్చెదరో! యన్న బుద్ధి భీతిల్లి
యియ్యకుండిన శపియించు నిమ్మాని । యియ్యెడనిచ్చు టే హితకార్యమనుచుఁ
దమ బంధువులఁ గూడి తమరు యోజించి।విమలాంగి నవ్వచోవిభుకుమారునకు

ధారవోసిన ముహూర్తంబున సురల ! ధార మ్రోసెఁ బ్రసూనధారతో దివిని
తనకామధేనువుఁ దలఁచి రప్పించి । వనిత గుంధుని పుత్రివండినయట్టి
యన్నంబు క్షీరధారావళిఁ గూర్చి।యన్నయాభ్యుఁడు వహ్నికాహుతుల్ చేసి
అక్కన్నె దోకొని యటఁ బోయిపోయి।యొక్క పుణ్యక్షేత్ర మొయ్యనఁ జొచ్చి
యటఁ గమండలువుంచి యద్భుతస్థైర్య । పటుధైర్యశీల నబ్బాల నీక్షించి
యోకన్యకామణి యొక్కింతసేపు । మాకమండలువుపై మరలని దృష్టి
యేకాగ్రమతి నిల్పి యేమరకుండు । మీకడ నటువోయి యేతెంతు ననుచు
దాని నియోగించి తపముగావింప । మానససగసి కవ్మానీంద్రుడుఁ డరిగె
నక్కన్నెయును మది నళుకింత లేక । యొక్కడిపని యిది యెంత లేదనక
నొంటిగా నెటుల నిందుండుదు ననక । జంటగా మాటాడు సఖులు లేరనక
నాఁకలి దప్పుల నలయక సోల । కీకడ కతఁ డెప్పుడేతెంచు ననక
గజసింహశార్దూలగండభేరుండ । భుజగాది బాధలుపొందునో యనక
వానకు నెండకు వలికి గాడ్పునకు । మేనోమికొనక కంపిల్ల కుల్లమునఁ
దల్లిని దండ్రినిఁ దలఁపక బెదర । కిల్లునువాఁకిలి యెంచక యొకట
నేకాగ్రదృష్టి ననేకకాలంబు । లాకమండలువు దా నరయుచునుండెఁ
గలశంబు స్థిరదృష్టిఁ గనుగొనుచున్న । చెలువకు వాయువుల్ చెదరక నిలిచె
వాయువుల్ నిలిచినవరుసతోఁజిత్త । మేయెడఁ జలియింప కేకాగ్రమయ్యె
మనసు నిల్చినచోఁ గ్రమక్రమంబునను।దనయంత నింద్రియోత్కరమును నిలిచె
తలఁపుతో నింద్రియతతి నిగ్రహంబు । గలుగుట నక్కన్యకావతంసంబు
కలశంబు లక్ష్యంబుగా నిరీక్షింప । బలునిష్ఠ నుగ్రతపంబయ్యె నదియె
మునికమండలువున మొనసిన దృష్టి । యనయంబు చలియింప కమితకాలంబు
కపగూడి యేకమై కనుగొన కితర । వివిధవస్తుశ్రేణి వెగటింత లేక
కాయంబు మఱచి యొక్కట సురల్ సేయు । మాయల బెదరక మానంబు విడక
శయములు ముకుళించి చరణముల్ సమము।లయి మున్ను నిల్పినట్లమర నిల్పున్న
స్థిరమనోదృష్టి భాసితమహాయోగ । పరిణతి వెలయు నబ్బాల చూడ్కులను
దొలితొలిఁ బ్రభవించె ధూమసంహతులు।చెలరేగి పొగలతో సెగలుద్భవించెఁ
సెగలతో భుగభుగ శిఖలుప్పతిల్లె । గగన మంతయుఁ గీలికామాలికలను

ధగధగధగ మండె దశదిశల్ నిండి । పొగలేని మంటలు భువియెల్ల నెరసి
తరువులుగాలె పొదల్ మాఁడి వ్రాలె । చెరువులు దొరువు లచ్చెరువుగా నింకె
నాపగల్ వ్రమ్మె మర్త్యావళి గుందె । తాపసతతి యెదల్ తల్లడముండె
సురకోటి బెదరె నాసుర పేటి చెదరె । నురగాదికలోమ్మ్ లొక్కట నదరె
సప్తసముద్రముల్ సలసల నుడికె । సప్తాశ్వముఖుల తేజంబులు నుడిగె
చదల నిల్వక యుడుల్ జలజలరాలె । పొదల కెల్లెడఁ బంచభూతముల్ సోలె
ఆదిమఘోణిపై నహిరాజు గూలె । భేదిల్లెఁ గూర్మంబు పృథుశక్తి తూలె
వ్రాంచితాజతనూజభాషితవ్యాజ । చాంచల్యరహిత పంచమకులోద్భూత
కన్యకాదృష్టియోగమహత్త్వజనిత । వన్యాగ్నితులిత వైశ్వానరశిఖల
జగములు పొగుల నా సకలదేవతలు । దిగులొంది చని బ్రహ్మదేవుని గాంచి
యో భారతీనేత యోదయాన్వీత । ఓ భక్తమందార యో శుభాకార
యివెయొక్కవడిమంటలెగసిభూమ్యాది। భువనపంక్తులఁగ్రమ్మిపొగయింపసాగె
నీ మంట లెక్కడి వేకారణమున । నీమూడ్కిఁ బొదివె నీరేడులోకములు
నీ మహోపద్రవం బెడబాప కుఱుక । స్వామివార లుపేక్ష సలుపఁగా దగునె
యిఁకఁ దామసించిన నెల్లలోకముల । కొకట నాపదవచ్చు నుడుగు నీదృష్టి
కారుణ్యరసదృష్టి గలయ నీదృష్టి । నారసి యీమంట లార్పవే యనినఁ
దమ్మిచూలి యొకింతతడవు చింతించి । యమోఘానిసహితులౌ నమరుల కనియె
ననఘాత్మలార మహాతపోనిష్ఠుఁ । డనఁగ మించు వసిష్ఠు నాజ్ఞ మస్తమున
ధరియించి యొక్క యంత్యజపుత్రి యిపుడు । సరిలేని భక్తి నజ్జటి కమండలువు
తిలకింపఁ దద్దృఢదృష్టియోగమున । జ్వలనకీలలు పుట్టి జగమేర్చుఁ దొడిగె
నాచేత దాని మాన్పుఁ దరమ్ముకాదు । శ్రీచక్రధరునితో శివునిఁ బ్రార్థించి
వారు నేమును మీరు వడి నేఁగి కన్య।కామోక్షదృష్టియోగము మాన్పవలయు
నని వారితోఁ గూడి యబ్జసంభవుఁడు । మనసిజాంతకుఁడున్న మహీధరంబునకుఁ
జని వ్రమ్మొక్క సద్భక్తి సన్నుతుల్ సేసి । యనలకీలలు బాధలార్పవే యనిన
హరుఁడు లక్ష్మీమనోహరు తోడు లేక।హరియింపఁ దరమె యీయాపద యనుచు
బసువరాయని నెక్కి బ్రహ్మాదిదివిజ । విసరంబు తనుగొల్వ వెన్నునిం జేరి
యాకన్య వృత్తాంతమంతయుఁ దెలుప । వైకుంఠవాసుండు వారితోఁ గూడి

యాపణంబున గరుడారూఢుఁ డగుచు । యక్ష కిన్నర పన్నగామరసాధ్య
చారణ గరుడ భాస్వర విశ్వ వసు మ । హారాజిక ద్వాదశాదిత్య రుద్ర
గణములు మునులు నొక్కటఁ గొల్చిరాఁగ । గణనీయధైర్య సంకలితనిశ్చలిత
దృష్టియోగక్రియోదిత వహ్నిశిఖల । సృష్టివృష్టికి నష్టిఁ జేకూర్చుదాని
యదరక బెదరక యతినియమమున । కదలని కంబంబుగతి నున్నదాని
మానంబు శమము నేమంబుదమంబు।బూని మానులకు నద్భుతమిచ్చు దాని
కడజాతిఁ బుట్టిన కన్యకామణిని । బొడఁగని హరిహరాంభోజసంభవులు
దాని ముందర నిల్చి తమపేళ్లు నుడివి । ఓనలినాక్షి! నీయుగ్రతపంబు
నీ నిశ్చలపుదృష్టి నీధైర్యమహిమ । నీనిర్మలత మెచ్చి నిఖలదేవతలు
వరము లిచ్చెదమని వచ్చియున్నారు । మరలింపు దృష్టి కమండలం బెందు
బోవునో యని భయంబు వహింపవలదు । నీవు బాలిక వింతనిష్ఠ నీకేల!
అని పెక్కుభంగుల నాఁడు వాక్యములు । వినక వాగలదిక్కు వెలుఁది గన్గొనక
దృష్టి మరల్పక స్థిరబుద్ధి విడక । నిష్టఫలప్రదు లీవేల్పు లనక
సరకు సేయక యున్న సకలదేవతలు । వెరగొంది నెఱిఁగుంది వివిధవాద్యములు
మ్రోయించి బాల సమ్ముఖమున సద్దు । సేయించుటయు శిలాస్థితి నూరకుండె
హరియు బ్రహ్మయు వెరగందియింకెటుల।మరలించుదృష్టియిమ్మగువయటంచుఁ
దమలోనఁ దమరు సంతాపంబునంద । కమలాక్షుఁడనియె నో ఘనతేజులార
మనలఁ గైకొన దీకుమారి వశిష్ఠ । మునిశిఖామణి వచ్చి ముందర నిల్చి
పలుకరింపక మరల్పదు దృష్టి యతనిఁ।బిలుపింపుఁ డని తెల్పఁ బ్రియమంది నలువ
యమరులఁ బిలిచి హేమాద్రికి నుత్త । రమున మానససరోరాజతీరమునఁ
దపముగావించు మత్తనయు వసిష్ఠు । నిపుడె తోడ్తెండన్న నేఁగి వారతని
గని మ్రొక్కి హరిహరకమలజుల్ మిమ్ము । పనిగలదని పిల్వఁబంపినా రిపుడు
విచ్చేయుఁడనిన నవ్విధమెల్ల నాతఁ । డిచ్చలోఁ దనయోగదృష్టిచే నెఱిఁగి
యలరుచు లేచి చే యతిసరంబు । పలుమారు ద్రిప్పుచు బ్రహ్మాదండంబు
నారకచ్చడము కెందలిరాకుచాయ । మీరు పెంజడలొప్ప మేనివిభూతి
తళతళమన నత్యుత్వర నేఁగుదెంచి । జలజాక్షు నిటలాక్షు చతురాననులకు
సాష్టాంగయోగదీక్షాధ్యక్షుఁ డతఁడు।సాష్టాంగములొనర్చి హస్తముల్ మొగిచి

ముందర నిలుచున్న ముక్కంటి పలికె । నిందు దేవతలెల్ల నేతెంచి నేఁడు
ఘనుఁడ!నిన్ బ్రార్థింపఁ గాంక్షించినాఁడు।పనుపుము చూపుద్రిప్పఁగ నిక్కమారి
కన్నులు మూయక కడతేర దార్తి । కన్నెఁ బ్రబోధింపఁ గదవయ్య యనిన
హరియు బ్రహ్మయు సకలామరుల్ మునులు।పరిపరి తెఱఁగులఁ బ్రస్తుతించుటయు
నావసిష్ఠుఁడు పలెక్క నఖిలేశులార । యీవధూమణి భావమెఱిఁగెడి కొఱకు
నాకమండలువు మిన్నక చూడుమంటి । నీకన్నె యటుసేయ నిటలాగ్ని వొడమె
చూపు వారింతు నీసుదతినె కాని । యేపడంతుల నొల్ల నిది నావ్రతంబు
సుదతి సద్వంశప్రసూతఁ గావించి । కదిసి వైదికలౌకికక్రియలుమెచ్చఁ
బరిణయోత్సవ మొనర్పందగు నన్న । హరిహరబ్రహ్మాదు లప్పు డిట్లనిరి
ఏడుజన్మముల నియ్యింతిఁ బుట్టించి । పాడిదప్పక తుది బ్రహ్మవంశమునఁ
బుట్టించి యుద్వాహము ఘటించువార । మిట్టట్టనరు దాన నెల్ల లోకులును
నావిని యమ్మునినాయకుఁ డలరి । యీవిమలాంగి సయ్యన డాయఁబోయి
యిడినచూపు మరల్ప కిక్కలశంబు । పడుచ! చూచితిని మే ల్బహువత్సరములు
చాలుచాల్ నీచూష్కసడలింపు మింక।బాలికామణి!యన్న భక్తియోగమున
కనుఱెప్ప లల్లార్చి కడుఁ బ్రయత్నమున।మునిపదాబ్జములకమ్మోదితయుఁ బ్రమొక్కి
ప్రమొక్కిన చెలిఁజూచి మునినాథుఁడనియె । నిక్కారుచిచ్చులో నిందీవరాక్షి
పడుము చూతమటన్నఁ బడియె నప్పడుచు।జడదారి శూద్రాదిజాతుల యందు
నేడుమాఱులు జనియింపఁగాఁ జేసె । తోడివానులు త్రిమూర్తులు సన్నుతింప
ఘనబుద్ధి పిమ్మటఁ గర్దమబ్రహ్మ । కును దేవహూతికిఁ గూఁతురై పుట్టి
యమర నరుంధతి యనునామ మంది । సుమతియా నవ్వసిష్ఠునిఁ బెండ్లియాడె
చూపుద్రిప్పు మటంచు సురలు ప్రార్థింప । నాపొలంతుక వసిష్ఠానుజ్ఞ లేమి
యెందున జడియక యేకాగ్రదృష్టి । నందు టరుంధతి యని రెల్ల సురలు
నాయరుంధతి గూడి యార్యలు వినుతి । సేయ వసిష్ఠుండు శ్రేష్ఠుఁడై వెలసె
నీ యరుంధతికథ యెవ్వాఁడు వినిన । వ్రాయించి చదివిన వ్రాసిన జగతి
నాయురారోగ్యభాగ్యంబులు గలిగి । శ్రీయుక్తులై మహాశ్రేయ మందుదురు
అని చిల్క దెల్పిన నధికసంతోష । మున రాజదూతియుఁ బుష్పమంజరియు
విని పుణ్యకథ నేఁడు వినఁగల్గె ననుచు । వినుతించి రద్దూతి విభుపాలి కరిగె

నని శివుం డెటిఁగింప నద్రికుమారి । ఘనభక్తి నవ్వలికథఁ జెప్పుమనియె
చారుపతివ్రతాచరితంబునం దు । దారమై ప్రథమకథారత్న మమరె
శ్రీవిశ్వపతి సమంచితమతి గౌరి । కావలికథ యిట్టు లానతియిచ్చె.
మఱునాఁడు నృపదూతి మాపటివేళ । సరసోక్తిఁ బుష్పమంజరిని బోధించి
తన యుపాధికి నది తనవెంట రాగ । చని చిలుకయున్న పంజరము డాసినను
కీర మిట్లనియె నోకిసలయపాణి । యీ రేయి యెక్కడి కేగనెంచితివి
నిన్నటిమాటకా! నీవంటిసాధ్వి । కిన్నిచపుతలంపు లిపుడేలఁ. బుట్టె
పతిదక్క వేఱొక్కపతి రతియువతి । పతియైన సతి యీసపడునటె సుదతి
రాజైననేమి రేరాజైననేమి । రాజీవముఖి వలరాజైననేమి
వారి చెల్వము చెల్మి వలెనటె నీకు । వేఱెయొక్కనిఁ గోరు వెలయాలివోలె
యిల్లాలు చనునటె యిల్లెడఁబాసి । తల్లి భార్య పతివ్రతానుభావమున
పతికి నాయువుగల్గు భాగ్యంబుగలుగు । పతిని వంచనసేయు పణఁతి దేనడత
వినవటె తొల్లి సావిత్రీవధూటి । తనవిభునకుఁ జావు తప్పించి కాచె
నటువలె నుండవద్దా! యింతి కనిన । నెటువలె నాకథ యెఱిఁగింపు మనుచు
రాజదూతిక గూడి రాజీవగంధి । భ్రాజితమణిపీఠిపైనుండి యడుగఁ
జిలుక యిట్లను సదాశివజటాజూట । కలితగంగాతరంగఘుమంఘుమోక్తి

సావిత్రికథ

అగధృతి మద్రదేశాధీశుఁ డగుచు । తగు నశ్వపతియను ధరణీశ్వరుండు
గుతరకీర్తి దిక్కులఁ బిక్కటిల్ల । సిరులచేఁ గడువెలసియు నాఘనుండు
సంతానశూన్యుఁడై సంతాపమందు । యంతంతమించ బ్రాహ్మణపూజచేసి
వారిచే సావిత్రివై భవం బెఱిఁగి । కోరి యా సావిత్రిగూర్చి సద్భక్తిఁ
బదునెనిమిదియేండ్లు బలుతపంబూన । సదయాత్మయై మెచ్చి సావిత్రి యపుడు
హరినీలమాక్తికహైమప్రవాళ । శరదిందువదనపంచకకాంతి వెలయ
ఖండేందుకోటీరకమనీయరుచులు । నిండి బ్రహ్మాండంబు నిగనిగలీన
ఘనరత్నకేయూరకంకణోర్మికలు । కనకనూపురకాంచికలు ప్రకాశింప

వరదాభయాంకుశవనజాదికముల । తఱచుగ మృదుపాణిదశకంబు మెఱయ
హంసదేవునికన్య యయ్యెను దివ్య । హంసవాహనమెక్కి యారాజు ప్రేమ
నిలిచిన నాతఁడెంతే సంతసించి । బలుభక్తి వలగొని ప్రణతులుచేసి
కరములుముకుళించి గంభీరవచన । సరణి నిట్లనియెంచె జయ జగజ్జన్మ
జయ లోకపావని జయ సూర్యపుత్రి । జయజయ సావిత్రి సత్పుణ్యగాత్రి
గోత్రంబు వర్ధిల్లుకొఱకుఁ గొల్చితిని । పుత్రుని మన్నించి ప్రోవవే తల్లి
యనిన లోకేశ్వరి యద్దేవి పలికె । తనయుండు గలుగఁడిత్తఱి నీకు వినుము
ఒకపుత్రి జనియించు నుజ్జ్వలగాత్రి । పికవాణి దానినాపేరు పెట్టుమని
పలికి యాపుత్రి ప్రభావంబు వలన । గలిగెదు సుతశతకంబు నీకనుచు
నంతర్ధి చెందిన యాదేవిమాట । లింతికిఁ దెలిపి యథేచ్ఛ రాజలరె
నలరాజు భార్యయు నంతటఁ గొన్ని । నెలలకు గర్భమై నెచ్చెలుల్ ప్రోవ
నవమాసములు నిండినను శుభవేళ । నవమోహనాంగి నందని నొత్త గనియె
మాళవీదేవి, సమ్మతి నేఁటఁబెంచు । బాలికఁ బూటలోపలఁ బెంచె ననఁగ
నానాఁటఁ బోషింప నవవల్లి కరణి । చాన వర్ధిలెఁ బూర్ణశశిరేఖ జోక
సావిత్రివరమున జనియించెఁగనుక । సావిత్రి యనుపేరు చానకు నమరె
నెలఁతకు మఱిమిూఁద నిండుజవ్వనము । తులకించె మధులక్ష్మి తోఁటకుఁ బోలె
దానిసౌందర్యంబు దర్శించి చెలులు । కాన మెక్కడ నిట్టికన్నియ ననఁగ
నాటలపాటల నబ్బోటి వెలసె । మాటల తేటల మంచినీటులను
అటుల సావిత్రికి యావనస్ఫూర్తి । ఘటముగాఁ దల్లిదండ్రులు దీనికైన
పతి యెవ్వఁడోయని భావించుచున్న । సతికి సావిత్రికి సాళ్వభూభర్త
యగు ద్యుమత్సేనుని యాత్మజునందుఁ । దగిలె వినఁలిని చిత్తము వినుమతివ
సతత యాతాయాతజనముల వలన । నుతమతి సత్యవంతుని యందువలపు
చెలుల కెవ్వరికినిఁ జిత్తంబుకోర్కి । తెలియంగనీక వర్తింపుచునుండె
అంతటఁ గొన్ని నాళ్లరిగిన నటకు । శాంతిమంతుఁడు దేవసంయమీశ్వరుఁడు
చనుదెంచి మద్రభూజనపతి సేయు । వినుతిపూజనముల వేడుక సెంది
యున్నతాసనమున నుండి యారాజు । మన్నించి కుశలసంభాషణ సేయు
నంతలో సావిత్రి యయ్యెచెంగటికిఁ । గంతు పట్టువుదేవి కైవడి వచ్చి

చెలులు దవ్వులనిల్వఁ జిన్నారిసిగ్గు। వెలయ మ్రొక్కినఁ దండ్రివేడ్కతోఁ గూఁతు
నక్కున నొత్తి నిజాంకపీఠమున । మక్కువ నిడుకొని మమత ముద్దాడి
శిరము మూర్కొని తల్లి శృంగారవల్లి । వరభక్తి నిమ్మునీశ్వరుని సేవింపు
మితని దీవన నీకు నిష్టార్థసిద్ధి । యతిశయిల్లు నటన్న నల్లన లేచి
యల్ల సావిత్రి సంయమికి మ్రొక్కుటయు । పల్లవాధర మంచిపతిని బెండ్లాడి
చిరకాలము శుభంబు చెందుమటంచు । కరుణ దీవించి భూకాంతుతోఁ బలికె
బాలిక యిదిపెండ్లిప్రాయమై యుండ । నేల పెండ్లియొనర్ప వెఱఁగింపు మధిప
నావిని మద్రభూనాయకుం డపుడు । సావిత్రి నెమ్మోము సంప్రీతిఁ జూచి
తల్లి యెవ్వనివిఁాఁదఁ దగిలె నీమనసు । తెల్లంబుగా మాకుఁదెలుపవే యనిన
తలవంచి సిగ్గుచేఁ. దరళాయతాక్షి । యల సాళ్వపతిపుత్రుఁడగు సత్యవంతు
మనసుగోరెడు నక్కుమారవహ్యనకు । నను బెండ్లిసేయుము నరనాథ యనిన
నారదుఁ జూచి భూనాయకుండనియె । సారజ్ఞ నీకు ముజ్జగములు దెలియు
నాసత్యవంతుఁ డేయందంబువాఁడు। వాసికెక్కునె [వాఁడు!] వసుధ వర్ధిలునె !
యిత్తునా యతనికి నీచిన్నదాని । సత్తుగాఁ దెల్పవే సర్వజ్ఞ యనిన
నమ్మని యించుక నాత్మఁ జింతించి । రమ్మ భూపాలయారాజనందనుఁడు
సత్యవంతుఁడె యగు సత్యంబుపేర్మి । నత్యంతమతిశాలి యార్యసమ్మతుఁడు
అతనికిఁ జిత్రాశ్వుఁడను పేరుగలదు । సతత తేజోబుద్ధిశాంతివివేక
శూరత్వములు వానిసొమ్ములు సుమ్ము । వైరులచేఁ దమవసుధఁ గోల్పోయి
తల్లిదండ్రులతోడ దారుణాటవుల । నెల్ల సిరుల్ వాసి యిప్పుడున్నాఁడు
జనకుఁ డంధుఁడుగాన సతతంబు సేవ । యొనరించునేకదా!యొక్కటి కొదువ
అది యేమియనుచు నన్నడిగితివేని । మదిదాఁప కెఱఁగింతు మహినాథ! వినుము
అతఁడు సావిత్రిఁ బెండ్లాడినదినము । మితి నొక్కయేడాదిమేర నిండినను
బంచత్వమందు నిబద్ధి యీమాట । కొంచెమాయువు మంచిగుణములే తరుచు
ఇకొ్కదువయె కాని యితరంబు లేదు । నిక్కంబనిన రాజు నివ్వెరగంది
దిగులున నెగులున ధృతిఁ బాసి పలికె । మగపొడి యిదియేమి మానెడమ్మిడిని
అటులైన నతఁడేల నమ్మ వేఱొక్క । పటుతరాయుష్మంతుఁ బతిని వరింపు
నావిని సావిత్రి నరనాథుఁ జూచి । భూవర ! నామనోబుద్ధివాక్కాయ

కర్మంబు లాన్యపాగ్రణియండె నిలిచె । నర్మిలి దలఁపుదు నతఁడె భర్తయని
యితరవ్యూహులు నాకిఁక కానివావి । యతఁడె నాపతి పెండ్లియాడుదు నతని
వేఱొకరీతి భావింపకుండనిన । నారదుండనియె నోనరనాథచంద్ర
నీపుత్రి సౌభాగ్యనిధి భాగ్యకలిత । యీపె భాగ్యమున నయ్యిలరాయనికిని
గరిమ దీర్ఘాయువు గలిగినఁ గలుగు । వెరవక పెండ్లిగావింపు మటంచు
నెఱిఁగించి మాని యథేచ్ఛ నేఁగుటయు।మఱి మద్రపతి యొక్క మంచిలగ్నమున
నల సాళ్వరాజున్నయడవికిఁ బోయి । యెలమిమీఱఁగ వారలిచ్చిన యతిథి
పూజలు గైకొని పొసఁగువాక్యముల । నోజతో నారాజు నొడఁబడఁ జేసి
యాసత్యవంతున కాత్మజఁ బెండ్లిఁ । జేసి యిర్వురికిని సిరులుప్పతిల్ల
ననుపమరత్నాంబరాభరణములు । ఘనవస్తుకోటులు గరిమతో నిచ్చి
తన భార్యతోఁగూడి తనయూరికేఁగె । జననీజనకులేఁగ సావిత్రి యంత
నత్తయు మామయు నంధులు గాన । హత్తి వారికి సేవలాచరింపుచును
బతిపాదసేవ యేపట్ల నేమరక । ధృతిఁ బెండ్లియాడిన దివసంబులెక్క
మఱువక యాయుఃప్రమాణంబు పతికి । నెరవేఱ నేఁడాదినిండిన ననుచు
దినములెన్నుచుఁ బ్రవర్తిల్లఁగా నాల్గు । దినములు గొదవగాఁ దీఱెవత్సరము
నింకనాలుగునాళ్ల కీరాజసుతున । కంకురించును మృత్యువని నిశ్చయించి
వరుసఁ ద్రిరాత్రోపవాసంబు పూన । నెఱిఁగి ద్యుమత్సేనుఁ డెంతయువగచి
కోడలించిలిచి యోగుణనిధి ! నీకు । నీడ సౌఖ్యంబులే దెంతయు డస్సి
వసివాడి దుష్కరవ్రతమును బూన । పొసఁగునె ! వలదు నాబుద్ధులతల్లి !
అని నివారించు పల్కాలించి మ్రొక్కి।వనిత, యో దేవ ! నావ్రతమున మీకుఁ
గడు శుభంబగుగాని కాదువేఱొకటి । విడుమనవలదని వేఁడిన నతఁడు
నవుగాకయని యుండె నంతట మూఁడు।దివసముల్ తోడ్తో నతిక్రమించుటయు
నాలవనాఁడు కాంతామణి పతికిఁ । గాలంబుచేరికగా నిశ్చయించి
మనసున దుఃఖంబు మల్లడిగొనఁగ । ఘనత ధీరోదాత్తగాన ధైర్యమునఁ
దనపతి స్నానసంధ్యావిధుల్ దీర్చి । కొని దేవపూజయు గురునిష్ఠఁ జేసి
ఔపాసనమొనర్చి యతిశుద్ధనియతి । నాపట్ల నడవికి నరుగఁదలంచి
పయనమాటయు మద్రపతి ముద్దుపట్టి । భయభక్తుల నిజేశుపజ్జఁ గానకును

దానును బోనెంచి తమయత్తకెఱిగిప్రూని మామకుక్రమొక్కి మునుల సేవించి
వారి దీవెనలంది వారియనుజ్ఞ । వారక పతిగూడి వనమున కరిగె
వింటివే ! తెలిగంటి ! విమలాంగి మగని । జంటఁబాయక వనస్థలి కిటులేగి
తనయుపవాసంబు తనబడలికయుఁ । దనమది నెంచక దవ్వుగానేగి
యాపతివ్రత తనయాత్మలో వగపు । తోపనీయక పతితోఁ బల్కికొనుచుఁ
గొలఁకులు వనములు కుంజపుంజములు । చెలువుఁడు దెలుప నీక్షింపుచు నగుచు
ఫలములు పువ్వులు పత్రముల్ విభుని । గలసి తానును గోసి కట్టగాఁగట్టి
బుట్టలోనిడి వేత్రపాలమున నెండు । కష్టులు గొట్టుచుఁ గాంతుండు బడలి
గొడ్డలిఁ బడవైచికొని దగదొట్టి । దొడ్డచెమ్మట మేనఁదొరఁగఁ గాసిల్లి
వగరింపుచున్న యవ్వరతేజుఁజూచి । మగువ, నేజెల్ల యిమ్మాడ్కినుండుటకుఁ
గారణంబేమి చక్కనిసామి యనిన । నారాచపట్టి యిట్లనిపల్కె నపుడు
ఓరామ ! నేఁడేమియో కాని తనకు । ధీరతచెడి తలదిరుగంగఁ దొడిగె
నదరుచున్నది గుండె యదుగులునిలవు । గదిసెఁ గన్దోయి చీఁకటి మేనుఁగొచ్చె
పండఁబెట్టుము నీడపట్టున ననిన । గుండెదిగ్గన రాచకూఁతురు బెగడి
మగని నెత్తుక యొకమంజుకుంజమున । చిగురుపానుపొనర్చి శీఘ్రంబె చేర్చి
తన తొడమీఁద నాతనిశిరంబునిచి । కొని చిగురాకులుగొని విసరుచును
గళవళపడియుఁ ద్రొక్కుటపాటులేక।పలుమాఱు మోమునతప్పక చూచుచుండె
నాలోనఁ గొంతసేపరిగిన నటకు । నీలమేఘముబోలు నెమ్మేనితోడ
వాఁడికోఱల మీఱు వక్త్రంబుతోడ । వేఁడిమిగల రక్తవీక్షలతోడ
జాళువామెఱుఁగు పచ్చనిపట్టుతోడ । కాలాగ్నిఁబోలు నుగ్రత్వంబుతోడ
పాశగదాభీలబాహులతోడ । నాశాప్రచండమహాద్యుతితోడ
దక్షిణంబుననుండి తరళాక్షిచూడ్కి । కాక్షణంబుననె మహోమహుం డొకఁడు
గానుపించిన నట్టె కనుగొని యాతఁ । డేనెలవుననుండి యెచటికేగెడినొ
చూచెదగాకంచు సుదతి చింతింపఁ । నాచాయకాతఁ డుద్ధతి నేఁగుదెంచి
ముందర నిలిచిన ముదిత భీతిలక । పొందుగా విభునిఁ బాన్పున నొయ్యనునిచి
క్రమొక్కి కరాబ్జముల్ మొగిచి యిట్లనియె।నెక్కడనుండి మీరెందుఁ బోవుచును
నియ్యెడ కీవేళ నేఁగుదెంచితిరి । అయ్య ! మీ తెఱఁగు నాకానతిమ్మనిన

నమ్మహాత్ముండుపలెఁ యముఁడు నానామ।మమ్మ నీవిభుఁడు సత్యనిధానుఁడగుట
నితనిఁ దోఁకొనిపోవ నేన వచ్చితిని । సతి ! వీనికాయువు సంపూర్ణమయ్యె
నీపతిభక్తిచే నేఁడు నన్గంటి । వోపుణ్యశీల ! నీవు త్తమాంగనవు
కాలంబుదీతినఁ గాయంబు మనుపఁ । బోలునె ! హరిహరాంబుజగర్భులకును
అని మహోగ్రాకారుఁడై దండధరుఁడు । మనుజాధినాథకుమారుని మేనఁ
గలయ లింగశరీరగతుఁడైన జీవు । వెలువడఁ దీసి వేవేగఁ బాశమున
బంధించి తనదీర్ఘ బాహుపీఠమున । సంధించి దక్షిణాశాముఖుండగుచు
నొనిపోవుచుండఁ గన్గొని మద్రపుత్రి । కనుగవ శోకాశ్రుకణములు దొరుగ
తన పతిదేహంబు దగ పొదలోన । నునిచి రక్షకుఁ జుట్టు నొకగీత గీచి
చరణముల్ దొట్రిల్ల జాళువాయండె । లరుదార ఘుల్లుఘుల్లని క్రమోయుచుండ
గమనవేగంబునఁ గానసియాడ । గమనీయకంకణక్వణనంబు లెసఁగ
యముని వెంబడిఁబడి యటవేగ నరుగ।యముఁ డంతమఅలి యయ్యతివ నీక్షించి
యావేళ నోబాల యామహాటవుల । నావెంటరాఁ గారణంబేమి ! నీకు
నిలునిలు మిఁకమీఁద నీకు రారాదు । కలకంఠకంఠి యగమ్యమార్గములు
అనవిని యాబోఁటి యంజలిఁజేసి । వినయవాక్యంబులు వెలయ నిట్లనియెఁ
బరమధర్మస్వరూపక ! ధర్మరాజ । కరుణానిధాన యొక్కటి యాలకింపు
పతి పోవుచోటికిఁ బడఁతి రాకున్నె । మతిదలపోయ నీమన్ననవలన
నాపతిభక్తిచే నాకుఁజేరఁగ దు । రాపంబు లగుచోటు లవనిలోఁ గలవె
అదిగాక సకలమార్గావళిలోన । గదలని ధర్మమార్గమె పెద్దయగుట
నట్టి ధర్మము నీకు స్వాధీనమగుట । పట్టైన ధర్మదేవతవు నీవగుట
నీవంటి సద్గుణనిధిని దర్శించి । దేవ శుభంబులతెరువుఁ జేకొనక
యూరక మఱలుట యుచితమె యనిన।నారామ ప్రౌఢవాక్యములకు నలరి
యముఁ డద్భుతముగ నిట్లని యానతిచ్చె । రమణి మహాపతివ్రతవు నీపలుకు
చాతుర్యమునకు నేఁజాల మెచ్చితిని । నాతి నీమగని ప్రాణమ్ములు దక్క
నితరవరమ్ము లేమేనియు నడుగు । మతికృప నిచ్చెదనన్న మేలనుచు
మగువ యంజలిచేసి మామామగారు । విగతనేత్రుఁడుగాన వేఁడెద మిమ్ము
కన్ను లాతనికిచ్చి కరుణింపుమనిన । మన్నించి శమనుండు మంచి దాలాగె

కన్నులు మీమామగారి కిచ్చితిని । సన్నుతాంగిరో నీవు చనుమింక రాక
అని ప్రేతనాయకుం డటఁజనుచున్న । వనిత యించుకసేపు వారక నిలిచి
క్రమ్మఱి వెనువెంటఁ గదలిరాఁ జూచి।యమ్మహాత్ముఁడు పల్కె నమ్మరో నీవు
వరమందితివి యేలవచ్చెద వనిన ! తరుణి యిట్లనియె నోధర్మస్వభావ
దొరయ మీవంటిసత్పురుషులు హింసఁబొరయరు తమ మనోబుద్ధివాక్క్రియల
నేతరి దీనులనెఱిఁగి రక్షింపఁ । జూతురు కొంచెమిచ్చుట కియ్యకొనరు
కోరు నాశ్రితులకుఁ గొదువగా నీక । కోరికలిత్తురు కొనసాగ నెపుడు
సర్వజ్ఞుఁడవునీవు సకలధ్మములు । నిర్వహించఁగ ధర్మనేత వైనావు
సమబుద్ధి ప్రాణుల సంతరించుటను । సమవర్తియను పేరు సమకూరె మీకు
నెమకి భూతమ్ముల నియమింతు గనుక । యముఁడవైతివి దుర్మహాపాతకములు
శమియింపఁజేయుట శమనుఁడవైతి । వమరె దండధరాఖ్య యఘదండనమున
నొదేవతాగ్రణి యోపుణ్యమూర్తి । యే దేవతలు నీకు నీడుజోడనఁగ
యముఁడు సంతోషించి యవ్వ నీపలుకు।లమృతధారలవోలె యానందమొసఁగెఁ
గావున నీమనఃకాంతుని బ్రతుకు । నీవు గాంక్షింపక నీకుఁ గావలయు
వర మెద్దియైనను వాంఛింపు మనినఁ । దరుణి క్రమ్మఱి మ్రొక్కి దైవతారాధ్య!
మా మామ కఖిలసామ్రాజ్య మెప్పంటి । గోము కట్టడఁజేసి కోర్కె లీడేర్పు
నా విని యిచ్చితి నలినాక్షి యింక । రావలదని ధర్మరాజానతిచ్చె
సరభసగతిఁ బోవ సావిత్రి నిలువ । కరిగె నాయనవెంట నతిసంభ్రమమునఁ
జెక్కులు చెమరింపఁ జిన్నారియడుగు । లొక్కటఁ దడబడ నురుహారలతలు
పాలిండ్లపై చలింపఁగ నూర్పులడర । బాలికామణి వచ్చుభావంబు సూచి
బడలితి వెంతయుఁ బద్మాయతాక్షి । కడు దూరభూములు గడచి రానేల
నిలువు నేఁబోవలె నెలఁతరో యనిన । కలకంఠి జముఁజూది కరములుమొగిచి
ధర్మమర్మజ్ఞ! నాతండ్రి యోప్రథమ । ధార్మికమణి మహాధర్మాత్ముఁడైన
నినువంటి పెద్దలు నియతధర్మంబు । గొని నడపింతురు ఘోరతాపములు
పరిహార మొనరించి పరుల నోముదురు । కరుణాబ్ధి నీవెఱుంగని నీతిగలదె
పతి యనుగమనంబు పడఁతికి విడువ । మతియొడఁబడునె నామగని వెంబడినె
పర లెంచుటిది నాకుఁ బరమధర్మంబు । పరిహరింపకుఁ డన్న భానుజుం డలరి

భళి పతివ్రత నీదుపతిప్రాణ మొకటి । వెలిగాఁగ నడుగుము వేఱొండు వరము
అనవిని క్రమ్మఱి యమునకు మ్రొక్కి।తనుమధ్య యను నపుత్రకుఁడు మాతండ్రి
యతనికి నూఱుగురాత్మజుల్ గలుగ । హితబుద్ధిఁ గరుణింపవే ! స్వామి యనిన
నవ్వర మిచ్చితి నతివ నీవింక । దవ్వువచ్చితి నిల్వ్ తగదు రాననిన
నప్పతివ్రత పల్కె ననఘాత్మ నాకు । దప్పి యెక్కఁడిది నీదయ కల్గియుండ
నా మతి పతిపాదనలినమ్ములందు । నేమర దెప్పటి కెఱుఁగను నీవు
పతిఁ బాసిపోవుట పడఁతికిఁ దగునె ! పతియేడుగడగాదె పద్మాక్షులకును
అదిగాక సకలధర్మాధారులగుచు । సదయులౌ మిమువంటి సజ్జనాగ్రణుల
సహవాసమునఁ బాయు సకలదోషములు । వహియింపఁబడి వారివల్ల నె కాదె
ధరణి సుస్థిరలీలఁ దనరుచునుండు । తరణిచంద్రులు గతుల్ తప్పకుండుదురు
వారిరాసులు మేర వదలకయుండు । ధారుణీధరములు దలఁకకున్నవియు
పరగు సఖ్యముస ప్తపదముల మితిని । మఱి నెయ్యమగు నేఁడుమాట లాడినను
సుజను లావగవారిఁ జుట్టంబులనుచు । నిజబుద్ధినెంచి మన్నింపుదు రనఘ
నే నింతసేపు మిమ్మెడయక వచ్చి । పూని మాటాడితిఁ బ్రోవగాఁ దగదె !
నాకోర్కి దీర్చి మన్ననసేయు టిపుడు । మీకుఁ గర్తవ్యంబు మేఘప్రకాశ
ఇనపుత్ర! నీచిత్త మిఁక నాదుభాగ్య । మనిన నాధర్మాత్మఁ డాయింతి మెచ్చి
మేలుపతివ్రత ! మేలుమాయమ్మ । మేలు నీపతిభక్తి మెచ్చితి నిపుడు
వలసిన వరమిత్తువచియింపు మనిన । నలరుచు సావిత్రి యమున కిట్లనియె
కాంతుప్రాణము వెలిగా నిత్తుననుచు । నింతసే పానతి యిచ్చితివీవు
ఇప్పు డామాట లే దేవరంబైన । తప్పకిత్తు నటంచు దయను బల్కితిరి
వలసిన దేమిఁక వల్లభుప్రాణ । ములె దయసేయవే పుణ్యస్వరూప !
పతిలేని హితులేలఁ బ్రాణంబులేల । పతిలేని బ్రతుకేలఁ బ్రాభవంబేల
పతిలేని సతి నిందపాలగు గాన । పతియె మంగళ మంద్రు పడఁతులకెల్ల
రమణి యలంకారరహితయౌ గాదె । రమణునిఁ బాసిన రమణీయతేజ
యీ రాజతనయున కెలమి దీర్ఘాయు । రారోగ్య భోగభాగ్యములు మన్నించి
రక్షింపవే ధర్మరాజ ! దయాక । టాక్షవీక్షణ రక్షితాశ్రిత యనిన
యముఁడు కానిమ్ము మాయమ్మ యటంచు।భ్రమదంబుతోఁ గాలపాశమ్ము విడిచి

యాసత్యవంతుని నప్పుడెయిచ్చి । యోసతి నీవిభుఁ డుర్వీలో నింక
నుతశక్తియుక్తిననూనా తేండ్లు బ్రతుకు।సుతులనూర్జరఁ గను శుభములఁ బొందు
శతయాగములు సేయు సత్కులధర్మ । హితుఁడగు నని యానతిచ్చి వేంచేసె
విడిచినప్పుడె సాళ్వవిభునిపుత్రకుఁడు । నొడలిలోఁ బ్రాపింప నుద్యుక్తుఁడైన
యంతలో సావిత్రి యచటికి వచ్చి । కాంతుని దిరము దక్కక తోడ నునిచి
కూర్చున్నయంతలోఁ గొంతసేపటికి । వర్చస్వియగు సత్యవంతుండు బ్రదికి
గ్రక్కునలేచి దగ్గతి కాంతఁజూచి । యిక్కడఁ దడవయ్యే నే నిద్రఁజెంది
నన్నేల లేపవు నలినాక్షి నీవు । గన్నులఁ గనరాని ఘనమూర్తి యొకఁడు
నను బట్టి కొంపోయినాఁడెవ్వరతఁడు । కనుగొనఁ గలగాదు కల్లయుఁగాదు
నిక్కంబు సెప్పవే నీ వెఱింగినను । బెక్కులేమిటి కన్నఁ బ్రియకాంత పలికె
ప్రొద్దు గ్రుంకఁగవచ్చెఁ బోవలె నింటి । కద్దమరేయి పోననువుగా దనఘ
నీవడిగినకథ నేను రేపటికి । దేవ యెఱింగింతు దెల్లంబుగాఁగ
మీ తల్లిదండ్రులు మిడుకుచునుందు । రే తెమ్మ్మె నావెంట నిప్పుడె యనిన
జనపతిసుతుఁడను సత్యంబు లేదు । మునుపటివలె పాదముల వడిలేదు
తల్లిదండ్రులఁ బాసి తడవుంటి నిచట । చెల్లఁబో యిఁక నేమిసేయుదు ననుచు
వగచుప్రాణేశ్వరు వగపు వారించి । మగువ కౌఁగిటఁజేర్చి మగనిభుజంబు
మెడమీఁద జేర్చుక మెల్లన నడిచి । యడవియెల్లను దాటి యాశ్రమంబునకు
వచ్చె నంతట దృష్టివచ్చిన సాళ్వుఁ । డిచ్చలో నలుకుచు నీవిశేషంబు
కోడలిమహిమంబొ కొడుకుసత్యంబొ । పాడిదప్పని తనభాగ్యమో యనుచుఁ
గొడుకు గోడలి వెదకుచువచ్చి యెదురు । పడినవారలఁ జూచి పరితోషమందె
ఆవృద్ధులకు ప్రొద్దు యతివయుఁబతికి । సేవసేయుచు వలసిన ఫలాదులను
ఆఁకలి తీర్చి తానశనంబుగొని వ్ర । తాకలనఁ గృతార్థయై మఱునాఁడు
ఆకథ యాద్యంత మత్తమామలకు । ప్రాకటస్థితిఁ దెలుపఁగ మునులలరి
పుట్టినయింటికిఁ బొలఁతి నీ చొచ్చి । నట్టియింటికి శుభంబయ్యె నీవలన
నీవు సావిత్రివే నిజమని పొగడి । రా వేళ సాళ్వ పూర్వామాత్యవరులు
పరతెంచి దేవర! పగవారలెల్ల । పొరిఁబొరి తమలోనఁ బోరాడి దివికిఁ
బోయిరి నీరాజ్యమునకు రమ్మనుచు । నాయన నొక మదహస్తి నెక్కించి

చతురంగబలయుక్తి సత్యవంతుఁడును । సతియు సావిత్రియు సంప్రీతిరాఁగ
పట్టంబు గట్టిరి భార్యతో రాచ । పట్టియు సకలసంపదలఁ జెన్నొందె
సావిత్రి తండ్రియు శతపుత్రవంతుఁ । డై వెలసెను వింటివా! యివ్విధంబు
కావున నెప్పుడు కమలాయతాక్షి । సావిత్రివలె నీవు సౌశీల్య మూని
పతిభక్తి సలుపుము భాగ్యముల్ గలుగు । నితరబోధలు విననేల నీకనిన
ఆపుష్పమంజరి యందున నలరె । భూపదూతియుఁ జిల్కఁ బొగడుచు నరిగె
గరిమ నీసావిత్రికథ విన్నఁగలుగు । సిరులు దీర్ఘాయువు శ్రీహరికరుణ
ప్రాసినవారికి వనజాయతాక్షి । పాసిపోవును మృత్యుభయము లటంచు
పరమేశ్వరుఁడు దెల్పఁ బార్వతీదేవి । కరుణతో నవ్వలికథఁ దెల్పుఁడనియె
సరస పతివ్రతాచరితంబునందు । గరిమతో రెండవకథ పూర్తిఁ జెందె
నని శౌనకాదిమహామునీంద్రులకు । వినిపించె సూతుండు విపులవాక్ప్రౌఢి.

"కరాగ్రేకంకణం" అన్న కథ

శ్రీవిశ్వపతి సమంచితలీల గారి । కావలికథ యిట్టులని తెల్పఁదొడఁగె
నాడేలుదొర మఱునాఁడు తావలచి । నాఁడు గావున దినాంతమున దూతఁ గని
నాఁడు నేఁడును రాక నన్నేఁచసాగె । నాడువారలలోన నది చాలఁజూడు
నేఁడెటులై ననింతిని దెమ్ము తాళ।నీఁడనంగుఁ డటంచు నృపుఁడు వీడ్కొలుప
దూతిక వచ్చి తన్ దొరచేసి పిలువ । నాతిరాఁ గనుగొని నగి కీరమనియె
ముంజేతికంకణంబు దృశింపఁజూచి । యుం జెల్లునే! కోపమూనఁ దండ్రి యని
జనకుతో నని చిల్కచందంబుచెందు । తనపతి దాఁచిన దానిచరిత్ర
వింతయై యుండు నవ్విధ మెఱింగింతు।కాంత యూకొను మాదికాలంబునందు
బంగాళభూమిలోఁ బరగుశృంగార । రంగమన్ పురము శ్రీరమణి కాపురము
ఆపురంబేలు మహాసేనుఁ డను ధ । రాపాలి భుజపరాక్రమకళాశాలి
యతనికిఁ జంద్రిక యనుపేరి పుణ్య । సతికిఁ గల్గె సుతుండు చంద్రసేనుండు
జనకుండు కీర్తితేజనకుఁ డాపుత్ర । కుని బహువిధ కళాకుశలు సేయించి

శైశవంబుననె ప్రశస్త శస్త్రాస్త్ర । కౌశల్య కల్యుని గావించి పెంచె
నతనికిఁ బరిపూర్ణ యౌవనలక్ష్మి । యతిశయించిన వివాహంబు సేయుటకు
తలఁచి మహాసేనధరణీశ్వరుండు । నలుదిక్కులందుఁ గన్యల విచారింపఁ
దగువారిఁ బనిచె నంత సుధాముఁడనెడి । జగతీశసుత సుదర్శన రూపరేఖ
చెలువొందు చెలిఁగి యాక్షితిపాలు నడుగఁబిలిపించి యాలాగె పెండ్లి సేతునని
పలికె నమ్మాట భూపాలునితోడఁ । దెలిపిరా పెద్దలు తేట తెల్లముగ
నా సుధాముని సుత యందచందములు । రాసుతుఁ డాలించి రాగంబు మించి
తమతండ్రి మాగధధరణీశుమీఁద । సమరంబునకుఁ జన్న సమయంబునందు
శిల్పిచేఁ బైఁడి [వాజిని ?] సేయఁబనిచె । నల్పేతరప్రీతి నవ్వీతి నెక్కి
హేమవతీపురి కేగెద ననుచు । వ్యోమంబునకు సూత్ర ముద్ధతి నెగయఁ
బట్టినఁ దప్పి యప్పట్టణసరణిఁ । బట్టక యది దైత్యభామ కిమ్మైన
పున్నాగకాంతారమున కేఁగి యొక్కఁపొన్నపై వడిఁ ద్రావలెఁ బ్రొద్దు గ్రుంకునెడ
ఆవనంబున లోహితాక్షియన్ రాక్ష । సీవతంసమ్ము వసించిన దగుట
కృతకాద్రిపైనుండి కృత్రిమతురగ । గతుఁడైన రాచూలిఁ గాంచి విరాళి
హెచ్చి పదాతేండ్ల యెలనాగయగుచు । పచ్చవిల్తుని బాలఁబ్రహసింపఁ జాలు
చెలువంబుతోఁ దళ్కు చెక్కుటద్దముల।దులకెంచు మిహికమ్మనోయితోఁ దావి
యుప్పతిల్లెడు జాదులూని రాణించు । గొప్పపెన్నెటికప్పు గొప్పుతో సొగసు
నఁగుమోము పెకుక్కతో నాణెంపు మోవి । చిగురాకుతో గబ్బి సిబ్బెంపుగుబ్బ
చన్నుల నొక్కింత జాఱుపయ్యంట । చిన్నెతో హొన్నుతోఁ జెలిమి గన్నేని
పన్నెతో నిడువాలు వాలుగు లనఁగ । చెన్నొందు కందోయిజిగితోడ వచ్చి
కేళీసరముచెంతఁ గ్రీడింపుచున్న । కీలుగుట్టము పొన్నఁ గీలొన్నకతన
తివియగూడక వచ్చి దిగువకు వచ్చి । సువిలాసవతి దానిఁజూచి మోహించి
చెంగటి కేతెంచు పతిపాలసుతుని । నంగజాకృతిఁ జూచి యది యిట్టులయె
నెక్కడినుండి నీ విందువచ్చితివి । చక్కనిసామి ! యీ సందెప్రొద్దునను
నొంటిగా నిచ్చోట నున్నలాగేమి । వెంట నెవ్వరులేక విపినదేశమునఁ
జరియింపనేల! నాసౌధాంతరమున । కరుదెమ్ము నీసేవ యాచరించెదను
ధరధీర ! నేను గంధర్వకన్యకను । హరిణాక్షి యనుపేర నమరినదాన

లేదు వివాహంబు లీలామనోజుఁ । డా! దొరబిడ్డ నిన్నరయుచుండఁగను
నా నోముఫలమున నాకన్నుగవకు । గానుపించితివీవు కాంక్ష లీడేరె
నీనామ మెయ్యది నీకులంబేమి । యానతీవలె నన నతఁడిట్టు లనియె
శృంగారరంగపురీ భర్తసుతుఁడ । శృంగారవతి! చంద్రసేనుఁడ నా్వఁడ
కృత్రిమహాయముసై నెక్కి యాడాడ । ధాత్రి వింతలు జూడఁదలఁచి వచ్చితిని
నీ చిన్నిప్రాయంబు నీ చక్కఁదనము । చూచినప్పుడె మనోజుఁడు చెందమ్మి
దోదుమ్మిచేఁ గ్రమ్మి దొమ్మిగాఁ గ్రుమ్మెనీదయ నామీఁద నిలుపవే యనుచు
నా మాయడారి యెయ్యారంబు మీఱి। మోము మోమునఁ జేర్చి ముద్దులాడుచును
నేమిరా! నా పడకింటికి రాక । సామిగా యని గుబ్బచన్నొనలొరయ
కౌఁగిలి వదలక కనకసౌధమున । బాగొందు విరవాది పానుపునందు
నారాకొమరుఁ జేర్చి యధరంబు నొక్కి । యీర! పుక్కిటివిడె మేను దక్కితిని
పైకొని యేలరా బంధభేదముల । మేకొల్పి యని చెక్కుమీటి గాటముగఁ
జెవిలోనఁ బావురా జిలిబిలిరొదలు । కవకివల్ గొణఁగి బంగరుసామి! యీర
నీధాటి కేఁ దాళనేర్తునే వొడ్డ । మోధవు మన్మథయుద్ధమందనుచు
రతిశక్తిఁ బొగడుచు రాగాబ్ధి ముంచె । నతని గరంగించి యా గట్టివాయి
కఱివునఁబడినట్టి కానకకన్న । యరిదివస్తువు గన్నయటుల రేఁబవలు
కామరూపిణియైన గట్టిప్రాయంపు । తామసీచరి యది తనతోడఁ గూడి
పక్కఁ బాయకయుండి భక్ష్యభోజ్యాదు।లెక్కఁడు తమిఁ దెచ్చియిడుచు భోగింప
దాని మాయలఁ బడి తల్లిదండ్రులను । దానున్నయూరును దనపేరు మఱచె
హేమావతీపురాధీశుని పుత్రి । యై మించు నక్కన్య నటమున్నె మఱిచె
ధరణీశసుతుఁడు తుందనపుగుట్టుంబు । మఱిచె నిక్కరణి సమస్తంబు మఱిచి
దానవి నుడి జవదాటక యుండె । నానందమునఁ జొక్కి యాఱుమాసములు
అతఁడు గానకయుండ నపరంజితేజి । నతివ యొక్కెడదాఁచి యతనిజవ్వనము
పుంభావసంభోగములఁ జుంబనైక । గుంభనమ్ములఁ జూఱఁగొనుచు గ్రీడించె
నంతట నొక్క దినాంతమ్మునందు । కాంత యెప్పటి నిజాకారంబు పూని
వంట సేయుచునున్నవాఁడ ట్టెపడక । యింటి సోరణగంట నేర్పడఁ జూచి
పడభాకినో రేంటి బలుమొద్దువంటి । యొడలేంది పడు చన్నులూగులాగేంది

అయ్యయ్య యిది దయ్యమని భీతిఁ జెంది।యయ్యెడఁ గృత్రిమహాయము నల్గడల
వెతకి కానక యిది వేలుపుఁగొమ్మ । గతి నున్న బ్రమసితిఁ గటకటా యనుచు
మిక్కిలివెతఁ బాన్పుమీఁద మైవైచి । స్రుక్కుచునున్న రాసుతుని చెంగటికి
నిక్కంబు తెఱగంటినెలఁత చందమున । నక్కపటనిశాటి యరుదెంచి పలికె
చిన్నఁబోయితి వేమి క్షితిపాలతనయ । యిన్నెగులొందుట కేటికారణము
కావలసినరూపు గైకొననేర్చు । నావిధం బెఱిఁగి డెందమునఁ గుందెదవో
కామరూపిణులౌటఖ చరవధూటు । లేమేనులైన వహింతు రాటలకు
నరమర లిటులసేయక భోజనమున । కరుగుదెమ్మని వాని హస్తమ్మునఁ బట్టి
తోకొనిపోయి చతుర్విధాన్నములు । రాకాసి యిడ నొక్కరహి భుక్తిఁజేసి
పలలాశిభామ నిర్బంధింప నతఁడు । వలసియొల్లములుగా వలరాచకేళి
సలుపుచు నెక్కడచంపునో యనెడి । తలఁకున నిక్కంబు తగిలినట్లుండె
రాహువు గ్రసియింపరా విలోకించి । యూహఁ గలంగెడి యుడురాజు వోలె
వీక్షించి యన్నంబు విషదిగ్ధమగుట । భక్షణసేయ నొప్పనివాని పగిది
తలక్రింద భుజగ మెంతయు బుసకొట్ట । కలఁగికంటికి నిద్రగానని వాని
పరునున పాలలోఁ బాదరసంబు । విరిచినక్రియ దాని వికృతంపురూపు
పరికించినది మొదల్ భావంబు గలఁగ । వెఱచి యెప్పుడుదీని విచిడిపోదునని
తటివేచి యుండె నంతట దానికొడుకు।పరుషాత్ముఁ డనువాఁడు బహుసేనఁ గూడి
తను జూడవచ్చిన దానవి రాజ । తనయుని మెడ నౌషధపుఁదీఁగె యొకటి
చుట్టిన రాచిల్క-సొబగు వహించె । నట్టె పంజరములో నాచిల్క నుంచి
కొడుకు నెదురొక్కని కూర్మిమీఱంగ । నడుగుల వ్రాలినయతని దీవించి
యెత్తి కౌఁగిటనొత్తి యింటిలో నునిచి । యత్తనయుఁడు వచ్చినట్టి సందడిని
రాచిల్క మఱచె నారాక్షసి యల్ల । రాచబిడ్డఁడు పంజరంబు వేవెడలి
కీరమైయున్క నింగికి నుద్గమించి । చేరె సుధాముఁడన్ క్షితిపాలుపురము
హేమావతీపురం బీరీతిఁ జేరి । యామనోహరకీర మపు డింపుమీఱ
నల్ల సుదర్శన యూరామసీమ । పల్లవదళపుష్ప ఫలములవెలయు
సహకారమహిరుహ శాఖపై నెక్కి । మహనీయతత్ఫల మధురిమఁ జొక్కి
బహువచోవైచిత్రి భాసిల్లువేళ । మహిళామణుల్ పెక్కుమంది తన్గొలువ

అలసయానంబుతో నంభ్రుల యందియలునిజార్భటుల రాయంచలఁ బిలువఁ
గప్పుకేల్గొప్పుతోఁ గమ్మక్రొవ్విరుల।నొప్పు తావులు భృంగయూథంబు బిలువ
చికిలిలేనవ్వుతోఁ జిగురుకెమ్మోవి । నికరంపుజిగి పిక్కీనికరంబుఁ బిలువ
కళలూరుమోముతో కండచక్కెరలు।గిలుకు నున్ బలుకు రాచిలుకలఁ బిలువ
తలిరాకుబోణి సుదర్శనానామ । జలజాక్షి యవ్వనస్థలముఁ బ్రాపించి
చెలులార యెదుటఁ జూచితిరకొ పొగడ । యలరులు విలసిల్లె నదిదగు పొగడ
నేలాలతల మ్రోల నిదియేలఁ బాడ । నేలా! లలనలల్లి యీవేళఁజూడ
నవముగాఁ గాచియున్నవి లికుచములు । తవిలి తత్ఫలలీలఁ దగె మీకుచములు
ననిచియొప్పెడు మిళిందములఁ గేసరము । దనరె కంకేళి యీతరుల మీసరము
పెనుపొందె ననలఁ జంపేయసాలంబు । కనుగొంటిరే దానికడ రసాలంబు
ఆ రసాలముకొమ్మ నదె చూడరమ్మ । సార సుధారసాసారంబు గ్రమ్మ
పలికెడు నొక చిల్క ప్రౌఢిమచిల్క । తిలకింప మెందు నిత్తెఱఁగు రాచిల్క
పగడంపు జిగిఁ జిక్కుపఱుచనౌ ముక్కు।పొగడొందె పలువర్ణముల దీనికొక్కు
ఎందుండి వచ్చెనో యెఱుఁగ మిత్తోఁటి।కందుకొందమె మాటలాడి యిచ్చోట
ఇది చిక్కుతేచాలదే వేయునేల । పదరక పొదువుండు పట్టుడీవేళ
అని చెట్టుక్రిందికి నరిగి యాబాల । యనియె నచ్చిల్కతో ననురాగలీల
చెట్టుపై నెవ్వరిఁ జేరకిట్లున్న । నెట్టబ్బ సుఖము నీహితసూక్తి విన్న
నీరూపుగనుగొన్న నెమ్మి జనించె । రారాదె యనఁగఁ గీరంబు భాషించె
కలికి నీపలుకు లాకర్ణించినంతఁ । బులకించె మేను నిన్ బోలిన కాంత
గలదె యెచ్చటనైనఁ గాంక్షలు మాన । కెలమి వేఁడితి గాన నేవత్తుఁ జాన
యెవ్వ రర్థించిన నీవియ్యఁబోక । యవ్వలవేయక యరమరలేక
కింటికిఁ గనుఱెప్పగతిఁ బ్రోచెదేని । నంటియుండెద సందియములెల్ల మాని
చిత్రంబుగాఁ గథల్ చెప్పుంగనేర్తు । గాత్రంబునన పాడి కర మింపొనర్తు
పొలుచు యీవనమదంబునఁ బరాకైన । పొలఁతి నిన్నెడఁబాసి పోవక మాన
సీసమయంబొప్పదే యన్న నగుచు । నాసుదర్శన పల్కె నాసక్తనగుచు
నిన్నింత కొనియాడినే వేఁడుకొల్ల । కన్నడసేయుటకా? యమ్మచెల్ల!
ననునమ్మి మిది దప్ప నాకన్నులాన । నిను మోమ్మోదించక నేఁబ్రోచుదాన.

అనిన ముంజేత్రవాలినట్టి రాచిలుక । గొని ముదశ్రువులు కన్గోనల నొలుక
పేద పెన్నిధిఁగన్న పెరిమ నుప్పొంగి । యాదటఁ దనమేడ కరిగె లతాంగి
మెలఁతలతో నిట్లు మేడపై కేఁగి । చిలుక ముద్దాడుచు చేరి చెత్రలేగి
పసపులారిచి మంచి పక్వఫలాళి । రసవంతమగు చక్కెరయు నిడి బాళి
జిగిబిగిఁబ్బలఁ జేర్చి లాలించి । మగచిల్క యనియంచు మాటలాడించి
పరిహాసకథలు దెల్ప బళీ యటంచు । తరుణీమణులఁ గూడి తాఁ బ్రహసించు
అతివ పంజరము తెమ్మన్న దేకాని । సతతమ్ము మ్రొమ్మొదించదు ప్రేమఁబూని
శుకరత్న మన్నాతిఁ జూచి సంప్రీతి । నిఁకయేమి తనరీతియేఁ జిల్కనైతి
దీనికోసమెగదా దేశంబు విడిచి । దానవిచేఁబడి ధైర్యంబు గడచి
చిలుకనై యుండియుఁ జేరితి దీని । నలమెడి మేలెన్నఁడబ్బునో కాని
ఏమిసేయంగల నీమేన ననుచు । కామిని శృంగారకళలు గన్గొనుచు
నతిమోహమునబింబమనిమోవినొక్కి।నతివగుబ్బలు నఖాహతిఁజెందఁద్రొక్కి
తరుణినెమ్మోమునఁ దనమోము చేర్చి।చిరుబూతు కవకివల్ చెవిలో నొనర్చి
మగపోడుములు చిల్క మాటిక్కిరీతి । తగిలిసేయఁగ నద్భుతము సెంది నాతి
ఒకనాఁడు చెలులెవ్వ రొద్దలేనితరి । శుకము నుంజేత నుంచుకొని మైనిమిరి
యిదియేమినీచెయ్వొలెతిఁగింపుమనుచు । ముదమొప్పనడుగుచు మోముమూర్కించు
గళలగ్నమైన సూత్మ్రపుఁదీఁగ కాంచి । వలగొన్నదిది కంఠవలయమై మించి
యిది తెల్పుమని మెల్లనే తీసినంత । మదనావతారుఁడై మానిని చెంత
నిలిచినయతని మానితవిలాసంబు । బలు కంబుకంఠంబు బవిరిగడ్డంబు
నిడికన్నుఁగవజోక నిటలంబురేక । వెడఁదవక్షము వీఁక వెన్నెలడాక
గేహ నవ్వులసొంప కెమ్మోవితీరు । కారుమబ్బునుమీఱు కచములబారు
నిండుపాయముఁ జూచి నెరిఁ దలయూచిఁ । యండజవరయాన యప్పుడె లేచి
కరములు ముకుళించి కరముపోరామి । నెరయ నివ్వేర నిట్లనియె నేమిసామి
యిన్నాళ్లు చిలుకవై యింపొంది నీవు । క్రొన్ననవిలుకాని కొమరు గన్నావు
ఇపు డద్భుతంబయ్యె నిది తెల్పవలయు।చపలాక్షులకు మోహసంపద వెలయు
నీరూపు గనుగొన్న నిజమని వేఁడు । నారాజముఖికను నలరుచు వాఁడు
శృంగారరంగపురీభర్త సుతుఁడ । బంగాళరాజ్యసంపత్ కళాన్వితుఁడ

సకలవిద్యలఁ బరిశ్రమము గన్నాఁడ । సిరుల నొప్పెడు చంద్రసేనుఁ డన్యాఁడ
వినుకలి నీరూపవిభవ మూలించి । కనకాశ్వ మెక్కి దోగతి కుద్గమించి
యిందు వచ్చుచు నూత్రమే తప్పఁబట్టి । నందున నది లోహితాక్షి యున్నట్టి
పున్నాగవనములో బోడున వ్రాల । నన్నిశాటి విరాళి యడర నవ్వేళ
నను భ్రమయించి కొన్నాళ్లు భోగించి । యనిమిషాంగనరీతి నది బాళి ముంచె
దాని వైకృత మొక్కతఱి నేను గాంచి । దీనికూటమి యనీతి యటంచు నెంచి
జాటి రానున్న నాసన్న యెఱింగి । యూరకక్కసి యొకానొకప్పుడు మొఱఁగి
చిలుకగావించి యుంచెను పంజరాన । వలసిన నెప్పటివగ యేనుబూనఁ
జేయు మాయావియై చెడుగది దానిఁ । బాయుట కేను రేఁబవ లెన్నియెన్ని
తలఁపులు దలఁప నంతట దానిపట్టి । బలముతో రా వానిపై ప్రేమదొట్టి
మటుచె నన్నది నభోమార్గంబు బట్టి । యరుదెంచినాఁడ నీయం దిచ్చపుట్టి
నా మెడతీవ గనంజేసె దైవ । మేమర కిది పగల్గిడుము నా గ్రీవఁ
బనిబూని లత రాత్రి పదిలంబుసేయు।మనినఁ బ్రమోదించి యమ్మహోపాయు
లాలితాకారంబు లలితాంగి మెచ్చి । వాలుఁజూపుల మక్కువ నివాళి యిచ్చి
ఘనకుచలికుచముల్ కానుకపెట్టి । తనమోవితేనెలఁ దాపంబు నెట్టి
నామేను నీసొమ్ము నాజవ్వనమ్ము । ప్రేమ నీకిదె సమర్పించితి నమ్ము
పగలెల్లఁ జిలుకనై ప్రాణేశ కేలు । మగవాఁడవై యేలు మదిని నామేలు
నెఱిఁగి వచ్చితి విదియే బ్రహ్మఘటన । కురులు గూడనినాఁడె గురుకీర్తినటన
గరిమ దిగ్రంగభాగములఁ జెలంగ । నరులెంచ వలచితి నవమోహనాంగ !
అని తీఁగ ముంజేత నతివ కట్టికొని । వినయంబుతో వానివెంటఁ బెట్టుకొని
తనమేడఁ జేరి కాంతల కన్నొఱంగి । యనురాగమునఁ బొంగి యనఁగిపెనంగి
యామిని సురతసౌఖ్యాబ్ధి నోలాడు । మోము మోమునఁజేర్చి ముచ్చటలాడు
తెలతెలవార నత్తీఁగె గీలించుఁ । జెలువునిమెడ రాఁకసిని బ్రస్తుతించుఁ
జిలుకయాతనిభుని ముంజేత నుంచికొను।నలరి యాత్మీయభాగ్యము గణించుకొను
పగ లిట్టులుండి యాభామ యామినులు।మగనితోఁగడపు నమ్మాయ కామినులు
గాన రెవ్వ రెఱుంగకయ యుండ వన్నె । కాని కొఁగిలియాని కలసి రాకన్నె
విహరింపఁ జూలొదవెను గొన్నినాళ్లు । కహహా యిదేమియో యతివ వేవిళ్లఁ

బొరలెడి ననుచు గుంపులుగూడి సఖులు । వెరగంది రవ్వార్త వికచాబ్జముఖులు
కొందఱు దెలుప నూకొని దానిజనకుఁడందమాయె మఱేమి యక్కట తనకు
పగదాయ జనియించె బాలచందాన । తెగ్రవేయ కిఁక నెట్లు తీఱు డెందాన
పుట్టిన వగయంచుఁ బొలఁతి సౌధమున । కట్టె యుద్ధతినేఁగి యదరక్రోధమున
చిలుక ముంజేనుంచి చెలఁగి ముచ్చటలు। తెలుప నాకర్ణించు తెలిగంటి సటలు
గని యౌర్వకనియె నెక్కడి దానవీవు।తనుమధ్య చూర్ణాల్చి తలఁకకున్నావు
నిన్ను నొంపక తీరునే యపకీర్తి । యన్న నక్కన్నె యోయంచితమూర్తి!
ఘనతఁ గరాగ్రకంకణము దర్శించి । యును గోపమూనెద వుచితోక్తి డించి
పదరుదు రే! పదింబదిగ శోధించి । కద! యల్గవలయు నిక్కము నేరమెంచి
వెనుకముందర యొకవిప్రుండు ముంగిఁ । దునిమిన కథయు మత్తుఁడయి కడంగి
శునకంబుఁ జంపిన సుభటుని కథయు।వినవె! మున్ సాహసోద్ధత్తిచే వ్యథయుఁ
బాపంబు ఘటియిల్లుఁ బలుమాటలేల । భూపాల యీచిల్క బోధించుఁ జాల.
వింతలౌ కథలది వినుము గూర్చుండి।శాంతితోడ నటంచుఁ జతుర యాదుండి
కొంకకాడిన జనకుఁ డను ముంజేతి । కంకణంబరసియుఁ గనలు చేనీతి!
జనక యంచు సగంబుచదివి తాశ్లోక । మున కర్థమేమి ప్రబోధింతుగాక
అనవిని యయ్యింతి యనియె నోయయ్య।నను దెల్పుమనుట ఘనంబటవయ్య!
యకలంక వేదవేదాంతార్థనిధులు । సకలశబ్దజ్ఞానచతురులౌ బుధులు
నీదేశమున లేరె! నెమ్మిఁ బిల్పించి । యీదృతి శ్లోకార్థ మడుగు మర్చించి
వారె తెల్పెదరు తర్వాత సందియము । తీఱ మీకన్న పుత్రిక దృఢాశయము
తెలిసి ప్రియోక్తియుక్తిని గారవించి । యిలరాయఁ డాస్థానమెలమిఁ బ్రాపించి
తనదేశమునఁ బ్రోలఁ దనరు భూసురుల । ననుపమ వేదశాస్త్రార్థభాసురుల
నాఁట మర్నాఁట మన్ననఁ బిల్వఁబంచి । పాటించి వారురా భక్తిఁ బూజించి
యుచితాసనమ్ముల నునిచి పోరామి । సుచరిత్రులార యీశ్లోకార్థ మేమి
యీనతీవలయుఁ గరాగ్రే యటన్న । దీనిభావము మాకుఁ దెలియకయున్న
తెలుపుభారంబు మీఁదిగదా! యటంచుఁ । బలుకుచు వినయసంపన్నత మించు
భూనాథుగని శ్లోకము పఠింపవచ్చు । దీనిభావము లెస్స తెలియుటే హెచ్చు
ఇదిగనఁ గొన్నినా ళ్లెడయిచ్చితేని । నది నీకుఁదెల్పెద మనిన భూజాని

యదుగుత్రోయగ రామి నాధీరతతికి । గడువిచ్చె నలునెలల్ గర్భ మాస్థితికి
నడరిన కారణం బరయఁదలంచి । గడువులోఁ దప్పకాగతి యుగ్గడించి
చెప్పిన మీకు నశేషధనంబు । లిప్పింతుఁ దప్పితిరేని మనంబు
ఘనదోషదూష్యమౌ కావున నాజ్ఞ । యొనరింతు దాన మాకొదవు నవజ్ఞ
అని రాజు వారితోనని భీతిముంచె । నెనలేని మృష్టాన్నమిడి యాదరించె
నావిప్రవరులు శ్లోకార్థంబు గనిరి । భావంబు గనరాదు బహుకష్ట మనిరి
గడువును దివసమొక్కటి దప్పనిండె । వుడమిఱేఁ డెదవిని పొక్కుచునుండె
ఆరేయి శివశర్మయను విప్రమూళి । ధీరుండు తమవారి దెసఁజూచి జాలి
ధరణీసురులకు నిందటికి సంఘాత । మరణంబు లొదవె నిమ్మహినేత చేత
నేలాగు మనకని యెదఁ దాల్మితటిగి । యాలోన శౌచార్థియై యేటికరిగి
యొక పొదమాటున నుండెడివేళ । వికటదంష్ట్రాభీలవికృతాస్యలీల
నుగ్రుఁడౌ బ్రహ్మరైత్యుఁడు రావి నుండి । యగ్రస్థలి వసించి యభినవచండి
యన మించుఁదనభార్య కనియె నోకాంత । వినలేదె యియ్యూర వెలసినవింత
పలుమంది విప్రులఁబట్టి హింసించఁ । గలఁడు రేపటికి నాగ్రహము రెట్టించ
హ్రస్వారమణుఁడు కలుగానుగల్ చేసి । నారప్పుడే వారి నంజుళ్లుమేసి
మనవచ్చు మనకన్న మనుజాశి భార్య।యనియె నిదేమయ్య యసమానధైర్య
పౌరుల నేటికి భంజించ నెంచె । నీరాజు వారియం దేతప్పుగాంచె।
నానతియియ్యవే యన నప్పలాశి । దానితో ననియె కాంతరో వన్నెవాసి
గల సుధామున కొక్కకన్యక వెలయు । చెలువంబుచే నది శ్రీదేవి గెలయు
శృంగారపురమేలు క్షితినాథసూతి । శృంగారనిధి చంద్రసేనుఁ డన్ఖ్యాతి
గన్న రాకొమరుఁ డిక్కన్యఁ గాంక్షించి।హొన్నతేజీ నెక్కి యుదువీథి మించి
చనుదెంచి త్రోవ రాక్షసిమాయఁ జిక్కి । వెనుకఁ గీరాకృతివెలయ సొంపెక్కి
యారాజసుతఁ జేరె నిది వానిగ్రీవ । వేరొక్కతరిఁ దీసివేయ స్వభావ
మానితాకృతిఁ బూన మగువ హర్షించి । వానితో రేలెల్ల వలచి క్రీడించి
తెల తెలవారినఁ దీఁగె యెప్పంటి । వలె వాని మెడఁజుట్టి వదలకయంటి
చిలుక యావాని ముంజేత ధరించు । చెలులెంతు రెప్పటి చిలుకయటంచు
నది రేలు పురుషుఁడౌ నతనితోఁ గలసి । ముదమందఁగా గర్భము జనించె బలిసి

యది తండ్రి యెఱిఁగి మహారోషమె త్తి।యిదియేమియని చే వహించె బల్‌క త్తి
పదరకుమనుచుఁ గోపము నివారించి । చదరాలుగా సుదర్శన తండ్రిఁగాంచి
యో చెల్ల! కరమునన్నున్న కంకణము । చూచియుఁ గోపగించు టిదేమిగుణము
ఈయర్థ మెవ్వరినేనియు నడిగి । నాయందు నేరమున్న వధింపు గడఁగి
యన సుధీజనుల నయ్యర్థంబు నుడువుఁ।డని నాల్గుమాసంబు లతఁడిచ్చె గడువు
గడువునుదీఱె శ్లోకముభావ మెఱుఁగఁ । బడదయ్యె గాన కోపము పెచ్చుపెరుగ
నామనీషుల నొంతునని యున్నవాఁడు । భూమీశుఁ డాయర్థము వినంగలేఁడు
నీకెఱిఁగించెద నెలఁత యూకోనుము । చేకొని చిలుకయూ చెలువుని దినము
ముంజేతి కంకణంబుగ ధరియించి । రంజిలం గనియు నేరము లుగ్గడించి
కినియ నేటికి వృథా క్రోధంబువలన । తనకుఁ జూలొదవె సత్యంబను లలన
భావ మెవ్వఁడు గణింపఁగ లేఁడుగాన । నీవా ర్త గోప్యమై యిట్లుండె చాన
అని బ్రహ్మరాక్షసుం డాభావమెల్ల । వినిపింప శివశర్మ వేడ్క సంధిల్ల
శ్లోకార్థ మెఱిఁగి మెచ్చుచు వేగఁబోయి । వ్యాకులపడు తనవారి నారేయి
యూరడిల్లఁగఁ బల్క యో డక తెల్ల । వారిన నృపతి కావైఖరి యెల్ల
చెప్పిన విని చంద్రసేన రాచిలుక । యెప్పున నిన్నినాళ్లుండి మాకలుక
యెదవించితని తీఁగె యెయ్యనఁ దియ్యి।మదనునివలె నక్కుమారుఁ డఱియ్య
చారువయోరూపశాలియై మామ । గారికి మ్రొక్కిన ఘనతరప్రేమ
నతని నక్కునఁజేర్చి యారాజు కూర్మి । సుతను ముద్దిడుకొని చుట్టముల్ పేర్మి
గల మిత్రులెన్న నక్కన్యకామణికి । నల మహాసేననృపాత్మజాగ్రణికి
పరిణయం బొనరించి బ్రాహ్మణో త్తముల।కరమర్థిఁ బూజించి కనకాదికములఁ
దనియించి వీడ్కొల్పి తనయ కల్లునకు । పనితరూపవిలాసపంచభల్లునకు
ఘనభూషణాంబరగ్రామాదికములు । కనకరథంబులు గజతురంగములు
అరణంబుగా నిచ్చె నలసుదర్శనకు । దరదంబురుహాదళాతతసుదర్శనకు
నావిర్భవించెఁ జంద్రాంకుఁడన్ సుతుఁడు । భావజతులిత సౌభాగ్యసంయుతుఁడు
సతితోడ సుతుతోడ సైన్యంబుతోడ । నతఁడేఁగెఁ దనయూరి కనురక్తి తోడ
అల లోహితాక్షియు నతనిహాయంబు।నెలమి నిచ్చి యొనర్చె నెంతేఁబ్రియంబు
శుకరూపుఁడగు నిజేశు స్వరూపకలన । సుకుమారతనుఁజేసి సుభగ యాలలన

యతనిఁ బెండ్లాడి మహాసౌఖ్యమందె । పతిభక్తి నెంతేనిఁ బ్రఖ్యాతిఁ జెందె
సతియన నదిసుమీ ! సౌజన్యవసతి । యితిహాసమిది కోర్కెలిచ్చు నోసుదతి!
యని చిల్క తెల్పిన నలరి యక్కలికి । జనపతిసఖి నంపి చనియె లోపలికి
అని యానతిచ్చిన నపుడప్సరారిఁ । గని యేమి యవ్వలికథయనె గౌరి
సరసపతివ్రతాచరితంబునందు । గరిమతో మూఁడవకథ పూర్ణమయ్యె

"శయాగాన్యం" అనినవనితకథ

శ్రీవిశ్వపతి సమంచితమతి గౌరి । కావలికథ యిట్టులని తెల్పఁదొడఁగె
మఱునాఁడు దూతికామణి వెంటవచ్చి । సరస నిల్చున్న యచ్చపలాక్షిఁ జూచి
రావక్క కూర్చుండరాదటవక్క । యీవును దూతియు నిచ్చోట ననుచు
గుహరత్నపీఠులఁ గూర్చుండఁబనిచి । సుచిరవాక్పాఠి శుకరత్న మనియె
నోపుష్పమంజరి! యొరునిఁగామింప । రేపట్లను బ్రమాద మెంతవచ్చినను
బరమపతివ్రతాభరణంబు లట్టి । తెఱఁగెంచు నొకకథఁ దెలిపెద వినుము
తెలిగంటి ! పాంచాలదేశమ్మునందు । కలిమిచే విలసిల్లు గాంపిల్యపురము
ఆపురంబుసుచంద్రుఁడనుభూతలేంద్రుఁ । డాపూర్ణగుణసాంద్రుఁడై యేలుచుండు
నతనికి విజయసేనాఖ్యకుమారుఁ । డతిమోహనాకారుఁ డద్రిధీరుండు
పుణ్యవశంబునఁ బొడమి బుధాభి । గణ్యదాక్షిణ్యశృంగారనై పుణ్య
శాలియై బాహుప్రచండప్రతాప । హేళియై గురునాజ్ఞ నెల్లవిద్యలును
నయశాలియను మంత్రినందనుఁ డొద్దిక యిమెలంగఁగనేర్చి యాయుధాభ్యాస
పరతంత్రుఁడై ధనుఃపాండిత్యమహిమ । నరుఁడె కాఁబోలుననంగ ననంగ
హరుకృప శౌర్యధైర్యాదార్యగతుల । హరువొంది కొన్నేఁడు లరిగినపిదప
పరిపూర్ణయౌవనభ్రాజిష్ణుఁ డగుచు । నెఱిచందు సిరిఁజిందు నెమ్మోముతోడ
చిగురు వాతెఱితోడఁ జెలువొందు నతనిసొగసు గనుంగొనిసుదతులెన్నుదురు
సకలవిద్యావిచక్షణత నీరీతి । స్వకుమారకుఁడు నయశాలితోఁ గూడి
చరియింపఁగాఁ జూచి జనకుఁ డుప్పొంగిపరిణయం బిఁక నొనర్పఁగవలె నంచు

దన మంత్రియగు నీతిధనుతో విచారమొనరింప నత్తెఱఁ గుడిగముల్ దెలుప
విని మంత్రిసుతునితో విజయసేనుఁ డను । ననఘ! పెండిలిసేయ నాలోచనంబు
గావించెదఁ ద రాజుగారు పెండ్లైన । పోవరా దెచటి కిప్పుడె యిఁపువురము
హయములపై నెక్కి యరుగుద మెచటి । కయిన భూస్థలి వింతలరసి పిమ్మటను
చనుదెంతమని పల్క సచివకుమారుఁ । డనుకూలుఁడై మంచిదని సమ్మతించె
నిరుచెవి వినకుండ నిటుల నేకాంత । పరత మంత్రిసుతుండు పార్థివసుతుఁడు
మృగయావినోదార్థ మేఁగెద మనుచు । జగతీశుతోఁదెల్పి శరచాపఖడ్గ
కలితులై జవనకంఖాణంబు లెక్కి । వలయుధనంబు లవ్వారిగాఁ గొనుచు
బోరున నొకనాఁడు పురినిర్గమించి । దూరంపుటడవుల దూరి యాడాడ
మృగముల నెగుచుచు మృగములవెంటఁ । దగిలి రానియ్యక దవ్వులనిలిపి
హయములఁ బరపి మహారణ్యవీథి । రయమునఁ జనిరి తగంగిణుల్ గడచి
గ్రామముల్ దాఁటి పక్కణములు దూరి । జీమూతములగ్రాలు జీమూతపటలి
క్రమియించిబహునగరములు త్తరించి । యమితదేశములుఘూోషాదులుగనుచుఁ
జని రెండుమూఁడుమాసములకు నెదుర । గని హృదక్పథమున గాంధారనామ
దేశంబు ధనధాన్యదీప్ర సస్యప్ర । దేశంబు గాంచి తద్దేశవై భవము
తమలోనఁ బొగడుచుఁ దనుగతశ్రాంతి । సమధిక సవిధ కాసారకల్హార
కమలమరంద సంగతమందమారు । తములు బాపఁగ సమ్మదమున నచ్ఛోట
సవురొందు పానీయశాలఁ బ్రాపించి । జవనాశ్వములుడిగ్గి జరఠ యొక్కరిత
యన్నపానీయంబు లమరికసేయ । నన్నెలవున నుప్తులై కొంతసేపు
వసియించి లేచి యవ్వారెవ్వరేలు । వనుధయో యిది సస్యవై భవంబొంది
ముహువొందుచున్నది ముందరఁ దగిన । పురమున్నదె వసింపుటకు మాకు ననిన
నారాజసుతునితో నాయవ్వ పలికె । కారుణ్యసదన గాంధారదేశ మిది
యొక యోజనముమేఱ నున్నది రత్న । మకుటుఁ డేలెడునట్టి మందారపురము
అందు మీరరిగిన నది వసియింప । నందము గృహాములెన్నైనను గలవు
శుభముగల్గెడి నీకు క్ష్మోణీశతనయ । యభినవమందనుండ వనుచు దీవింప
నాయవ్వ కొకకొంత యర్థమర్పించి । యాయమ వీడ్కొని యశ్వంబులెక్కి
ముందరఁ జన నర్యముఁడు పశ్చిమాబ్ధియందుఁ గ్రుంకె తమంబు లానె దిక్తటుల

చారుసంధ్యారుణచ్ఛాయలు మించె । తారక లంబరస్థలిని రాణించె
ఆశేయిఁ బురిఁజొచ్చి యహగగా లేక । వా రొక్కకాళికావాసమ్ముఁ జేరి
సన్నిధిఁ గొలఁకులో సంధ్యాదినిష్ఠ । లన్నియుఁ దీరిచి యంబకు మ్రొక్కి
జయ భద్రకాళి యీశ్వరి మహాదేవి । జయ శాంభవి మృడాని జయ నీలవేణి
మమ్మ్ము రక్షింపవే మముగన్నతల్లి । నమ్మి నీశ్రీచరణములు చేరితిమి
అని ప్రస్తుతియొనర్చి యద్దేవి పాద । వనజసన్నిధిని దివాసులు పరచి
యిహపుర శయినించి యీశ్వరికథలు । గురుభక్తి నొడువుచుఁ గొంతసేపటికి
నలసి నిద్దురపోయి రానిశావేళ । అల రత్నమకుటుని యీత్మజయైన
కమలరేఖానామకన్యకామణిని । మమత మేనత్తకొమారుని కొసఁగ
సమకట్టియునికి యీశాంభవి యెఱిఁగి । కమలరేఖ నిజాంఘ్రికమలముల్ నమ్మి
వ్రతములు విహితోపవాసముల్ పూజ । లతినిష్ఠ సలుపుచు నంబ! సౌందర్య
చాతుర్యగాంభీర్య శౌర్యాదిగుణస । మేతుఁడౌ భర్తనివ్మా! నెమ్మి ననుచు
దను మదినునిచి నిత్యంబును వేఁడు । కొనుచునుండుట కృపాగుణమునఁ దలఁచి
యీపెండ్లికొడుకు విద్యావయోహృద్య । రూపహీనుండౌట రోసి వీఁడేమి
కమలరేఖకుఁదగుకాంతుఁడే!యనుచు।నమలాంగిశాంభవియీముహూర్తమున
నామేనవాని సయ్యన నాత్మధామ । సీమఁ దివాసిపైఁ జేర్చి యిచ్చోట
నిదురఁజెందిన చంద్రనృపతి కుమారు।మదనావతారుఁ బ్రేమమునఁ గొంపోయి
అప్పెండ్లి కొడుకు పర్యంకమ్ముఁజేర్చి । యొప్పులాడికి వీఁడెయొప్పనంచలరె
అప్పెండిలిముహూర్త మాసన్నమగుట । నంతఃపురమ్ములో నఖలబాంధవులు
హితులు పురోహితులెల్లను శీఘ్రు । గతి మంగళస్నాతఁ గావింపుఁ డనుచు
దివరింప నిదురఁజెందెడు సుచంద్రాత్మ । భవు లేపి కాళికాంబాప్రభావమున
వింతవాఁడనుచు వివేకింపలేక । యంత సంపఁగినూనియను దలయంటి
జాజికాయటకలిఁ జల్లి పన్నీటి । చే జలకములార్చి జిలుగు క్రొంజలువ
వలువ లొసంగి సువాసనల్ చిందు । కలపంబు లలఁది చొక్కపుభూషణముల
హారువొందఁ గైసేసి యలరులుచుట్టి । హరిణేక్షణలు కొంద ఱారతులెత్తి
యుడిగంబు లొకకొన్నియొనరింపఁబెండ్లి।కొడుకువై భవమురక్కొనఁబెండ్లిచవిక
చేరి మాణిక్యవిచిత్రపీఠంబు । పై రహి నున్నంత బాలికామణిని

పరిపరి సొగసులేర్పడఁగఁ గైసేసి । కరిరాజగమనలు కమలలోచనలు
తోకొని తెచ్చి రత్తొయ్యలి మెఱుఁగు । లాకడ నీకడ హరిదంతరములఁ
గ్రొక్కాఱు మెఱుఁగుల కొమరున నెరసె । నక్కల్కి రత్నభూషాంశువు లెనసి
గమ్మని వాసించు కలికికస్తూరి మె । క్కమ్మి రకమ్మున కల్యాణవేది
వసియించినంత వై వాహికక్రియలు । పొసఁగఁ గులోచితస్ఫురణ భూసురులు
సేయించి లాజలచేత హోమంబు । సేయించి శిఖ్రప్రదక్షిణము సేయించ
నంతఃపురము సేరినంత బువ్వంపు । బంతి సాగించి రప్పట్ల రాసుతుఁడు
నిదురమబ్బగుట పెండ్లిమహోత్సవంబు । పొదలె నిదేమి యద్భుతపుస్వప్నంబొ
నిక్కువంబో యని నివ్వెరఁజెంది । యొక్కట భుజియింప కూరకయుండె
నతఁడు భుజించినాఁడని కూర్మిసకియ । లతనిఁ దోకొనిపోయి యపరంజిమేడ
బాగైన సకినల పట్టెమంచంబు । పైఁ గుల్కమల్లెపూఁబానుపు మీఁదఁ
బఱచిన జిలుగుదుప్పటి మెప్పులెనయఁ । బరగు తలాడలు బటువుబిల్లలును
గల సెజ శయినించగా నియమించి । చెలువఁ దోకొనితేరఁ జెలు లేఁగిరంత
తలయంటికొనుటేమి తానంబిదేమి । కలపంబిదేమి యిక్కడఁ బెండ్లియేమి
యిదమిత్థ మనఁగూడ దే కాళికాంబ । పదసన్నిధి శయించి బడలియుండితిని
ఆఁకలి తఱుచై నదని తలంచుచును । రాకొమరుండు నిద్రావశుండయ్య
అంతలోఁ జెలికత్తెలరిగి రాకన్నె । నెంతయు బోధించి హెచ్చుపైఖరుల
సింగారమొనరించి చిత్తజురథము । సంగతిఁ గొనితెచ్చు చందానఁ దెచ్చి
యొకభంగిఁ బడకయిల్లొయ్యనఁ జేర్చి । యొకరొక రరిగిరొక్కొక నెపంబునను
చెలులు పోయినవెనక్కఁ జిగురాకుబోణి । జిలుగుపాన్పున నిద్రఁజెందెడు వాని
మొలకపాయమువాని ముఖవిలాసమునఁ । గిలకిల పూర్ణేందుఁ గేరెడువాని
తళుకుఁజెక్కులవానిఁ దపనీయరుచుల । వలనొందు వక్షఃకవాటంబువాని
విజయసేనునిగని విస్మయంబంది । గజయాన యితఁడు జగన్మోహనుండు
నామేనబావ యింత విలాసవంతుఁ । డే మిక్కిలి కురూపియందురు వాని
నతఁడెయ్యాతండని యనవచ్చు నెటుల । నితఁ డెవ్వరో పరమేశ్వరి కరుణ
నను వరింపఁగ వచ్చినాఁడని తలఁచి । యనురాగ మిగురొత్త నతని లేపకయె
సరస వైచిన చిటిచాపపైనుండి । పరివాదిని గ్రహించి బాగుమీఱంగ

కాయలు తనకుచకలశంబు లొరయ।తాయిగా మీటి గోటను దంత్రులెనయ
కరకంకణమ్ములు ఘలుఘల్లు మనఁగ । పరిపరి జిలిబిలిపాటలు దొరయ
నింపుగా వీణవాయింపఁగా నిదుర । మంత్రమాని నృపాలమణికుమారకుఁడు
కనువిచ్చి కమలరేఖ మొగంబుచూచి । కనకపాంచాలియో కమ్మవిల్కాని
నవమోహనాస్త్రమో నాతియాపమున।సవగొందు శృంగార చాతుర్యశయ్యె
వనజాక్షి వల్లకీవాద్యసంగతిని । అని గణింపుచునున్న యాభావమెఱిఁగి
శయ్యయు గానంబు చాటుహాసంబు । మయ్యొప్పనలఁదిన మంచిగంధంబు
వీణయు వేణువు వీక్షింపఁదగిన । యేణలోచన గల్గు టిదిభాగ్య మనుచు
సగము శ్లోకంబు పొసంగఁబాడినను । జగతీశసుతవిన సగము శ్లోకమున
నాన్నృపాలకుమారుఁడను తూత్పిపాస । లానినవారి కోయలినీలవేణి
యివియెల్ల నింపుగా వెల్లసొంపులును। భువిఁ దండులహస్థమూలముల్ సుమ్ము
నా విని యాఁకట నలగినాఁడనుచు । భావంబున నెఱింగి పద్మాయతాక్షి
అతివేగమున లేచి యాఁకట బడలి । పతియున్నవాఁడని పసిఁడిపల్లెమున
సరసభక్ష్యములు భోజ్యములు చోష్యములు । పరిపరి కూరలు పచ్చళ్ల తెగలు
పానీయములు దెచ్చి భక్తి నవ్విజయ । సేనున కవియెల్లఁ జెలువ వడ్డింపఁ
బరితుష్టిగ భుజించి పాణిపద్మములు । పరిమళోదకములఁ బ్రక్షాళితములు
గావించికొని శయ్యగ్రకుఁనఁజేరె । నావేళ సతి గిన్నియలు పళ్లెరములు
గడిగి పానుపుక్రిందఁ గ్రన్నన నునిచి । యొడయుని పాదంబు లొత్తుచుఁ గపుర
వీడియం బొసఁగెడువేళ మార్మాట । లాడక నృపసూనుఁ డలసి నిద్రించె
నితని లేపగఁ దగ దీవేళ ననుచు । పతిచెంత శయనించి బాల నిద్రించె
తెల్లవారకమున్న దేవి శీఘ్రమున । నల్ల మేనల్లుని నతివపానుపున
పడవైచి పాంచాలపతిసుతు తనదు । గుడిలోన నిడుకొని కొమ్మచిత్తంబు
తెలియుటకై మాయదీపింప నుండె । నలవియే దేవిమహత్త్వంబు దెలియ
నంతకుమున్నె పద్మానన లేచి । యంతఃపురంబున కరిగి వర్తించె
నరుణోదయమువేళ నమ్మంత్రిసుతుఁడు । నరనాథసుతు శోభనవిలాసకళలు
తిలకించి యిదియేమి తెలుపు నీమేని । కలపంబువాసనల్ కడలఁ గ్రమ్మెడిని
యీరత్నహారంబు లీహైమపటము । లీరమ్యమాల్యాదు లేడవి నీకు

నెక్కఁడికేగితి వెఱిఁగింపు మనిన । నక్కమారుఁడు వానికనియె నవ్వుచును
ఏ నిన్ను నెడఁబాసి యీరేయి నొంటి । గా నెందుఁజన నిందెకద! మేనులొరయ
శయనించియుండి యే స్వప్నంబుగంటి।నయశాలి వినుమదంతయును దెల్పెదను
అని రేయి తనవివాహక్రమం బెల్ల । వినవినవింతగా వినిపించి వెలఁది
చదివిన శ్లోకంబుసగమును దాను । చదివిన శ్లోకంబుసగమును జెప్పి
అందున నన్ను తూథాతురుం డనుచు । నిందుబింబానన యిచ్చలో నెఱిఁగి
పసిఁడిపళ్లెరమున బహుపదార్థములు । వెసఁ దెచ్చిపెట్టిన వేడ్క భుజించి
చేతులువార్చి చెచ్చెర హంసతూలి । కాతల్పమున శ్రాంతిగదురఁ గూర్కితిని
ఆలోనఁ జెలి యిచ్చినట్టి వీడియము । మేలికర్పూరంపు మించు దావులును
పుక్కిట నున్న దిప్పుడును గన్గొనుము । పక్కలోనుండి యాబాల నన్ గూర్చి
యేమనిపలికెనో యెఱుఁగ నిద్రాత । మోమయూత్సుఁడనౌట మూఢభావమున
నిన్నియు నిజమని యిందాఁకనుంటి । నన్నియు దబ్బరలయ్యె నీవేళ
మంత్రిపుత్ర యిదేమిమాయయో దైవ । తంత్రమో యటువంటితరుణి నావంటి
భాగ్యహీనున కేలఁబ్రాపించు నవని।మృగ్య మాచెలిరూప మిఁకఁ జూడగలనె!
అని విమోహాంధుఁడై యూడు రాకొమరుఁ । గని మంత్రియనియె నోకల్యాణశీల!
యిది కల్లయనఁగరా దిదినిక్కవంబె । యిది నిదర్శనమగు నిమ్మహాదేవి
కరుణించి పెండిలిగావించె నేమొ । మరుగకు మిచ్చోట మసలఁగాఁ దగదు
ఆవలఁ బోవుదమని లేచి పైన । మై వాఁడు త్వరసేయ హయముపై నెక్కి
యామంత్రిసుతుఁ గూడియవ్వలఁజనియె।భూమీశతనయుండు పూబోణి వినుము
అరిగి కేదారేశు హతనతక్లేశు । కరుణానివేశు నరకశతప్రకాశు
భజియించి యచ్చోటఁ బదిపూటలుండి । గజచర్మవసను గోకర్ణేశుఁ గాంచి
పెద్దలౌ ద్విజుల కభీష్టధనంబు । తద్దయు భక్తితోఁ దమరొసంగుచును
నెలకొని రవ్వీటినృపతి మన్నింప । నెలపూట లిచట మానినికథ వినుము
మఱునాఁటి రేయి కోమలి మేనబావ । పరిణయావసరవైభవ మొకింతయును
నెఱుఁగకుంటినో యిదియేమిమాయో యనుచు।నెరపరికము లేక యింతి సౌధమునఁ
జలువపానుపుమీఁద శయనించియున్న । చెలులు తోడ్తేర వచ్చినదై లతాంగి
నిజశయ్య శయనించి నిదురించువాని । గజచర్మసంగతాంగకముల వాని

పసరంబు వగవాని బలుదోని కడుపు । పసమించువాని నేర్పడక యొండొంటి
నొరసి యట్టయుపొట్ట యొకటైనవాని । కఱకు జుంజురువెండ్రుకల తలవాని
కనుగొని యాశ్చర్యకలితయై చెలులఁగనకాంగి చూచి యెక్కడివాఁడె వీఁడు
నలినలోచనలార నాపాన్పువిూఁద । నళుకులేక శయించి యలకుంభకర్ణు
పెనుపున గురకలుపెట్టుచున్నాఁడు । తనువెఱుంగఁడు పాడితక్కి యీవెడఁగు
నరుని చెంగటికేల ననుదోడ్తెచ్చి । తిరి తెల్పుఁడనిన భీతియు నద్భుతంబు
నగవును బెనగొన ననబోణు లనిరి । తగునటవమ్మ! యీతని నిట్లుపలుక
నిన్నరే నీదు పాణిగ్రహణంబు । పన్ని ముత్యపుఁదలబ్రా ల్వోసి నిన్ను
వలపించినాతఁ డీనగకాఁడె కాఁడె । యలిగి పలెక్కదవేమె హరిణాయతాక్షి
యీతఁడెవ్వండని యెంచక పదరి । మాతోడనన్నట్లు మాతోడ! నీవు
నెఱుఁగ కాడెదుసువిూ! యేరితోనైన । పరిహసింపుదు రపప్రథ యుప్పతిల్లు
నూరకె పతిఁజేరి యుండుమటన్న । వారిఁ గోపించి యవ్వారిజాతాక్షి
వెలుపలి కరుదెంచి విరిబోణులార । తెలివిదప్పిన మీకుఁదెలుప నావశమె
చిన్ననో చిఱుతనో! శిక్షింప నెఱుఁగ । కున్నానె పతిగానియొరుని నేనేల
నంచెదు పొండన్న నక్కల్క పల్క । లింటిలోపలి తల్లి యెఱిఁగి వే వచ్చి
సుదతి! మీమేన త్తసుతుని సువేగు । మొదటనె మీతండ్రి ముదమొప్ప నిటకుఁ
బిలిపించి ప్రజమెచ్చుఁ బెండ్లిచేసినది । తెలియవె యిపుడు బుద్ధిచలించి నీవు
యితఁడెవ్వ రేనెవ్వరే యని చెలుల । నతకరించితివట యది నాయమగునె
యిమ్మాట మీతండ్రి యించుకవినిన । నెమ్మదిఁ గోపించు నిన్నని పలుక
నెక్కడి దురోభ్రధ లీవు చేసెదవు । తక్కరిపల్కకె తరుణి నాపలుకు
ఇతఁడె నాపతియైన నెఱుఁగనో రాత్రి । కతలును నడచిన క్రమము లన్నియును
నడిగిచూడుం డితఁ డందులో నొకటి । నొడివిన నపుడు నన్ను తిరస్కరించి
నిందింపుఁడనినఁ దండ్రియు నంతలోన । నందువచ్చి యిదేమియని యవ్విధంబు
విని తనపుత్రి వివేకినీరత్న । మన్యతంబులాడ దీయన రాత్రిపనులు
నెఱుఁగునో యెఱుఁగడో యిదియడుగుదము।పర తెండనుచు నెల్లబంధుల హితుల
వియ్యంపువారల విప్రపుంగవుల । నెయ్యంబుతోఁగూడి నిజసభాస్థలికి
నా సువేగునిఁ బిల్వనంపించి మణిమ । యాసనస్థునిఁ జేసి యలమామ పలికె

నిన్నటిరేయి పెండ్లిమహోత్సవంబు । గన్నవాఁడవుగదా ! కనుగొన్న వెల్ల
వివరింపు మప్పటి వివిధభూషణము । లవిరళగంధమాల్యాంబరావళులు
నీయందుగాన మన్నియు ఁాఁచినావొ।ఓయన్న తెలుపు ముహూ_ర్తకాలమున
నడచిన వేడ్క_లన్న నతండు కాళి । గుడిలోన రేయెల్ల ఁ గూర్క_చునున్న
కతననేమియు నెఱుంగఁడుగానఁబెండ్లి। కతయొక్క_టియు నెఱుంగనటంచుఁబలికె
కమలరేఖాకన్యకను బెండ్లియైన । విమలాత్మ్ ఁ డెవ్వఁడో వేఁకువవేళ
నువిద సౌధంబుననుండి యితండె । భవనాంగణమునకుఁ బర తెంచె ననుచు
వియ్యపువారెల్ల వికటోక్తులాడ । నయ్యెడ నక్క_న్య య య్య కిట్లనియె
మేడపై వల్లకివీఁటుచు నేను । పాడినపాటకుఁ బ్రత్యు_త్తరంబు
లిచ్చినాఁ డాఁకలియెఱిఁగి యన్నంబు । తెచ్చిన భుజియించి తృ_ప్తిగన్నాఁడు
చక్క_నివారిలోఁ జక్క_నివాఁడు । చుక్క_లదొర హసించుమొగంబు వాఁడు
ఆరాజతనయుఁ డెందరిగెనో కాక।యీరాసుతుఁ డెఱుంగఁ డిందొక్క_టియును
అనుమాట లాలించి యాసభఁ గొంద । అనఘు లీబాల మహాపుణ్యశీల
కల్లలాడదు కాళికాప్రసాదమున । వల్లఁభుఁ డెవ్వఁడువచ్చి పెండ్లాడి
పోయెనో యని రేయిపురుషుని నేయు।పాయంబునను గ్రహింపనగునో యనుచు
గొంద ఱాడఁగ నట్టికొలువులో వియ్య । మంద వచ్చినవార లలుకవెట్టుకొని
పోవఁగా గాంధారభూపాలుఁ డేల । నీవేళఁ గోపించి యేగెద రిటులఁ
బదిపూటలు సహించి పదరక నిలువుఁ । డిదిలెస్స శోధింత మింతలో ననుచు
వారి నిల్పినతరువాత మర్నాఁడు । కూరిమిసుతఁ గనుంగొని తండ్రి పలికె
వచ్చిన మేనబావను ద్రోసిపుచ్చి । యిచ్చోటఁ గనబడ కేఁగినవాని
వల్లఁభుఁడని ప్రేమవహియించియున్న । చెల్ల ఁబో యతఁడిందుఁ జేరెడి దెటుల
వాలాయమును జేతివానిని విడిచి । కాలివానిఁ బెనంగుకత యయ్యె ననిన
నాకన్యకామణి యనియె నోయయ్య । నాకడ కిపుడు కొందఱు ద్విజన్మ్లలను
రప్పింపవలెనన్న రాజు వేవేల । రప్పింపఁ గన్నె వారలకెల్ల ఁ ద్రొక్కి
యాకడఁ జిట్ల 'శయ్యాగాన' మనెడు । శ్లోకంబుసగము భాసురలీల ద్రావి
వెయ్యాఱు చీటు లావిప్రుల కొసఁగి । యయ్యలారా ! దీని కవలియర్థంబు
చదివిన పురుషుని జాతియు నీతి । సదనంబు దెలిసి యాజనుని మాయిఁటఁ

బరిణయంబై పైఁడిపల్లెరం బీవు । హరియించి తిదిధర్మమగునె యటంచు
నిడుబంది పెట్టి యూరెల్ల నెఱుంగ । జడుపువుట్టించి యిచ్చటికిఁ దోడ్తెండు
తెచ్చినవారికి ధేనుసహస్ర । మిచ్చెద నిష్కంబు లిచ్చెద వేయి
యని గ్రాసముల కిచ్చి యనిచిన వాఁడు । చని బహుదేశరాజసభాంతరముల
నలుగుఱు కూడియున్న ప్రదేశములను । జలిపందిభుల సత్రశాలలయందు
సగముశ్లోకం బదిచదివి యూరూఁది।సగము వచ్చునె మీరు చదువుఁడా యనుచు
నడిగి యెవ్వరికిరాదని వారలనఁగ । పుడమియెల్లఁ జరించి భూసురు లెల్ల
మగుడగా వారిలో మహిసురు లిరువు । రగణితవేదశాస్త్రార్థకోవిదులు
గోకర్ణమున కేఁగి కొన్ని నాళ్లుండి । యాకడ నొక్కనాఁ డంగడివీథి
నయశాలిరాజనందనుఁడునొండొరుల।శయములుగ్రహియించిచతురవాక్యములు
పలుకుచు నగుచు సంభ్రమముతోఁ జనఁగ।దిలకించి యాశీర్వదించి యాద్విజులు
వెంబడిఁ జని చదివిరి శ్లోకమున స । గంబుచదువఁగ నాకర్ణించి రాజ
తనయుండు మంత్రినందను చెయిఁజఱచి । పెనచి బెట్టుగనవ్వి పెక్కునాళ్లకును
వింటి మీశ్లోకంబు వీరిచే వాలు । గంటి నాఁడటు లొకకలలోన వీఁడె
లోపలఁ బొడిన శ్లోకంబుగాదె । యాపంకజాక్షి యేమయ్యెనో యనుచు
వగవ శ్లోకము కొదువసగంబు చదువఁ । దగునని భూసురోత్తములు ప్రార్థింపఁ
బులకలు మైఁబర్వ భూపాలసుతుఁడు । సలలితక్షితి దాను చదివినసగము
చదివిన ఘుంటం బొసంగి యీసగము । వదలక చీటిలో వ్రాయుఁ డటంచు
వ్రాయించుకొని ధరావరసుతుఁ బట్టి । యీయవనీసుర లానోయి రాజ !
మాయింట భుజియించి మాపల్లెరంబు।న్యాయంబుడించి మిన్నక ప్రుచ్చిలించి
కొనివచ్చి యిటఁ జెలంగుచు నున్నవారె । ఘనతచే నున్నాఱు కటకట మీఱు
తగునె! యీనీచకృత్యంబు లటన్న । జగతీశతనయుఁ డాసతి పల్లెరంబు
కడిగి పానుపుక్రిందగాఁ బెట్టెనపుడె । నిడుబండె వెట్టెద రేము దొంగలమె
మీఱు భూసురవరుల్ మిము దూఱరాదు।మీ రేమియూడిన మీకుఁ జెల్లుబడి
నావిని విప్రనందనులు నవ్వుచును । భావింప బంగారుపల్లెంబె కాదు
ఎఱపుపెట్టిన సొమ్ములెల్ల నెత్తుకొని । పఱవెత్తివచ్చుట ప్రభులక్షణంబె
అనిన నెవ్వఱు పెట్టు మనిరెఱ్ఱసొమ్ము।లని రాజసుతుఁ డమాత్యకుమారుఁ డనఁగ

విని తలయూరు లవ్విధము రాజునకు । వినిపింప వారలవెసఁ బిలిపించి
విజయసేనుని గారవించి మీరెంత । నిజముపల్కిన నిది నిక్కువం బనరు
వీరితో గాంధారవిభు ప్రోలుఁ జేరి । తీరిచికొనుఁడు సందేహమ్ము లెల్ల
మీవంటివారికి మిథ్యాపవాద । మీవహిల్లుట తగదని యతం డనుప
ద్విజులవెంబడిని మంత్రికుమారుఁ గూడి । విజయసేనుఁడు మీమవీటికిఁ జనియె
నతనిరాక ద్విజన్మ్ములపు డెఱిఁగింప । మతి రంజిలుచు రత్నమకుటభూవిభుఁడు
హితులతో వారల కెదురుగాఁబోయి।కుతుకంబుమీఱఁదోడ్కొని తెచ్చినిండు
కొలువులో నవరత్నగురుపీఠి నుంచి । కొలఁదిమీఱినప్రేమఁ గుశలంబు లడిగి
కమలరేఖాకన్యకను నాఁటిరేయి । సుముహూర్తమున నీవు క్ష్మోణీశతనయ
పరిణయంబై కనంబడక వంచించి । మఱునాఁడె పోవుట మర్యాద యగునె
అందున మాకు వియ్యంపువారికిని । సందళ్లుపుట్టె మీజాడ యెఱింగి
తోఁకొనితేర మత్పుత్రిక సగము । శ్లోకంబు వ్రాసి నల్చోట్లకుఁ బనిచె
నాకారణమ్మున నగపడినారు । గోకర్ణపురి మీరు కొదువలు తీఱె
మీదేశమెక్కడ మీతండ్రి యెవ్వ । రీదేశమునకు మీరేల వచ్చితిరి
మీకులంబెయ్యది మీనామమేది । యీకుమారకుఁ డెవ్వఁ డిదిగాక మీరు
యీరాత్రి యెటుల మీయంతఃపురంబు । చేరితిరి వివాహసిద్ధిఁ జెన్నొంది
వెలువడిపోవు టేవిధ మిదియెల్ల । తెలుపఁగావలయు సందియములు దీఱ
ననిన గాంధారధరాధినాయకునిఁ । గనిపల్కె కాంపిల్యకట కేశసుతుఁడు
జననాథ! మాది పాంచాలదేశంబు।ఘనుఁడు సుచంద్రుఁడన్ కాంపిల్య విభుఁడు
వినుఁడు మజ్జనకుండు విజయసేనాఖ్య । దనరుదు నితఁడు ప్రధానినందనుఁడు
నాజనకుఁడు పరిణయము గావింప । మోజనచేసిన మూహ నెఱింగి
సతి వరించినఁ గాళ్లసంకెల యిపుడె । క్షితియెల్లఁ జూచివచ్చెదగాక యనుచు
నీమంత్రితోఁ గూడి యేరితోఁ దెలుప । కేము వేఁటాడఁబోయెద మని రాజు
వారితో నని వేగవత్తురంగముల । నారోహణముచేసి యఖిలదేశముల
తిరిగి యీగాంధారదేశంబు చేరి । యరుగుదెంచితిమి సంధ్యాసమయమున
కాళికాంబాగృహాంగణమున కచట । మేలైనసరసి నమ్మెయి సంధ్యార్చి
నిదురచెందితి మంత నృప! నిశావేళ । నదియేమొ కాళిమాహాత్మ్యంబు వలన

నీయంతిపురిలోన నీపుత్రిఁ బెండ్లి । యై యందుభుజియించి హర్షించి నటుల
కలగంటికనుగొంటిగంధమాల్యములుపలుభూషణములుమోఁ బాయకుండుటలు
తెలతెలవారిన దేవిసన్నిధిని । నెలకొని యితని కిన్నియు నెఱిఁగింప
నిది దేవిమాయ నీకీయంబ పెండ్లి । చెదరని కరుణతోఁజేసెఁ గాఁబోలు
నయిన నిందుండరా దగుదెమ్మనుచుఁనయశాలి పలుక సైంధవముల నెక్కి-
యావలఁ బోయితి మవనీశ యనిన । భూవరుం డాత్మ నద్భుతము వహించి
దేవి మహామాయ తెలియరాదనఁగ । నావేళ నిట్లనె నాకాశవాణి
జననాథ నీకన్య సౌజన్యధన్య । యనుపమసౌందర్య యగుట వీక్షించి
యలసుండు మతిహీనుఁ డతిచంచలాత్మఁ। డలసువేగుఁడు తగఁడనియంబ తలఁచి
తనుగూర్చి పెక్కు-వ్రతంబులు చేసి । తనకు గాంభీర్యసౌందర్యచాతుర్య
కమనీయుఁడగు భర్తగావలె నన్న । కమలరేఖాకన్య కాంక్షలీడేర
నిజపాదసన్నిధి నిదురింపుచున్న । విజయసేనకుమారు వెసఁ గొనితెచ్చి
యిపెండ్లికొడుకున్నయెడ నుంచి యతనిఁ । దప్పక గొనిపోయి తనగుడి నుంచె
మఱిలఁ గన్యాకేళిమందిరశయ్య । నిరవొందు నిమ్మేటి నెప్పటిచోట
నిడి సువేగుని గొనియేఁగి యప్పుడుచు । పడకింటిలోఁ దగుపాన్పున నునిచె
దేవ నీకన్య పతివ్రతాభావ । మీవగ శోధింప నింత గావించె
పాంచాలసుతుఁడె నీబాలకు భర్త । యించుకేనియు సంశయించకు మధిప
కమలరేఖకుఁ బునఃకల్యాణ ముత్సు । వమునఁ గావించి కేవలవైభవమున
వారి యూరికిఁ బంపి వలసెనేనియును । వీరకేతుండన వెలయు నీయనుజు
కూరిమిసుత సువేగునికిచ్చి పెండ్లి । యూరూఢమతి వెలయనొనర్పు మనిన
నాకాశవాణి వాక్యము లాలకించి । భూకాంతమణి ముదంబుధి నోలలాడి
క్రమ్మఱఁ గమలరేఖను పెండ్లిఁజేసె । నెమ్మిఁ బాంచాలభూనేతపుత్రునకు
నల సువేగున కనుజాత్మజ నిచ్చి । చెలువొప్పఁ బెండిలిసేయించి పనిచె
నయశాలికిఁ బ్రధానినంపన సుముఖి । ప్రియపూర్వకంబునఁ బెండ్లిగావించె
బహుచతురంగముల్ బహుపదార్థములు। బహువిధాంబరములుబహుభూషణములు
నరణంబుగానిచ్చి యమ్మామ పనుప । తరుణితో మంత్రితోఁ దనపురి కరిగి
తను జూడఁగాన కెంతయుఁ జింతచెందు । జననీజనకులకు సతితోడ మ్రొక్కి-

వారి కొఁగిండ్లు దీవనలును బడసి । యూరూఢయౌవరాజ్యపదస్థుఁ డగుచు
విజయసేనుఁడు కీర్తివిభవంబు లొందె । గజయూన కమలరేఖయు దేవికరుణ
నెనమండ్రుపుత్రుల నెలమితోఁ గాంచి । తనరె భూమిఁ బతివ్రతారత్న మగుచు
నీపతివ్రతకథ యిష్టార్థ మియ్య । నోపు రవిజ్యోతి యొప్పున నమిత
పాపతమిస్రముల్ బాపు సజ్జనులు । బాపురే యన నిచ్చు బహుళసంపదలు
అని ఫలశ్రుతి దెల్ప నమ్మించుబోణి । విని పుణ్యకథ నేఁడు వినఁగల్గె ననుచు
చిలుకకు నభినుతిచేసి లోపలికి । నెలమితోఁ జనియె రాజేంద్రదూతికయు
కతలకారిని చిలుకను బొగడుచును । ప్రీతినేత కక్కథఁ జెప్పెనటంచు
శంభుఁ డందభవాచాజృంభమాణ । గంభీరగుంభనల్ గడలుకొనంగఁ
దెలిపినఁ బార్వతీదేవి సంతోష । కలితయై యవ్వలికథఁ దెల్పుడనియె
సారపతివ్రతాచరితంబునందు । నాఱవ కథయిది యతిశయంబయ్యె

పతియనుమతి గాంచిన సతికథ

శ్రీవిశ్వపతి దయాంచితసూక్తి గారి । కావలికథ యిట్టు లానతియిచ్చె
మఱునాఁడు దూతివెంబడివచ్చు వైశ్యతరుణి గన్గొని చిల్క తతసూక్తిఁ బలికె
కలికి మనోవచఃకాయకర్మముల । చెలువుని వంచనసేయక కీర్తి
వలను జెందిన పతివ్రతకథ యొకటి । గలదు తెల్పెద వినుఁ గౌళదేశమున
మాలినియను పురమణి యొప్పు నంశు । మాలిని భర్మహార్యప్రభాచ్ఛటల
నాలింగనము సేయునట్టి దభ్రోలు । పాలించుఁ గువలయాభరణుఁ డన్ రాజు
అతనికిఁ గర్పూరహాసిని యనెడి । సుతగల్గె శ్రీహరి శుభకటాక్షమున
చిన్నప్పు డాకన్నె చెలువలఁగూడి । చిన్నెలవన్నెల సింగార మెసఁగ
నాటలాడుచునున్న నయ్య వీక్షించి । బోటిఁ జెంతకుఁబిల్చి బుజ్జగించుచును
మన పురోహితుని కుమారునియొద్ద । ననబోణి చదువుకొన్న ఫలంబుగలదు
ఇయ్యాటల విశేషమేమి లెమ్మనుచు । సయ్యన గోవిందశర్మఁ బిల్పించి
సభ్యతెంచగఁ దనూజాతకు నటఁ । రాభ్యాస ముత్సవమమరఁ జేయించె
నారాజకన్యక కనుగులొ నృపకు । మారికలను పదంపడి జతచేసి

చదివించె గోవిందశర్మ నానాఁట । చదివె నక్క-న్యయుఁ జదువులు గొన్ని
పాటలాధర కావ్యపాటవంబూనె । నాటకాలంకారనై పుణ్య మెనసె
ప్రక్రియాకౌముదీపాండిత్యమున న । తిక్రమించె సుధీసుధీచమత్కృతులు
చిత్రాశువి స్తరస్థితుల మాధుర్య । పాత్రంబుగా రచింపఁగనేర్చెఁ గవిత
రీతి గుణంబులు క్రియ పాకవృ త్తి । చాతుర్యశయ్యారసంబులు గులుక
భావవిభావానుభావసంచారి । భావసా త్త్వికభావపద్ధతు లెనయ
గద్యపద్యాదులు గల్పనసేయు । విద్యాధికులు బాల్యవృ త్తి వహించు
భారతియేమొ యీబాలిక యనుచు । సారెకుఁ గీ ర్తింప జంత్రగాత్రముల
సంగీతవిద్యావిచక్షణ యయ్యె । సంగతానేకలాస్యప్రౌఢి మెఱసె
చదువున సామున సంగీతమునను । గొదువ లేకొప్పు నక్క-వలయేక్షణకు
నామోదహేతువై యీవనం బొదవ । కౌముదీవై భవక్రమ మొందె నగవు
ఒప్పెఁ బ్రబోధచంద్రోదయస్ఫూ ర్తి । నప్పాలంతి ముఖాబ్జ మలివేణి వేణి
వెలసెఁ గృష్ణవిలాసవిభ్రమంబూని । తళుకొ త్తె నభినయదర్పణశ్రీల
మానినిచెక్క-లు మత్స్యపురాణ । మానితద్యుతి గాంచె మగువ నేత్రములు
అతివ నున్‌బలుకు కర్ణామృతరీతి । నతిశయించె లతాంగి యధరోష్ఠకాంతి
నిరసింపసాగె మణిస్ఫురణంబు । హరిణాక్షి రదము లష్టాంగయోగా ప్తి
మెఱసి మించెను కురుల్ మేఘసంఘీశ । పరిణతి శ్రీరామపద మందెచెవులు
ననబోణి చనుదోయి నగె మంజరులను।ననువొందె నమరసింహానిరూఢి కౌను
రమణీయ శృంగారరస కళాగరిమ । కొమరయ్యె నూగారు గురుకటి జగతి
గతి మించె పెందొడల్ కడు మిటారించె । తతసువర్ణోద్దండదండకస్ఫురణ
రాణించెఁ గూర్మపురాణతేజంబు । శ్రేణిచేసె కృశోదరి ప్రపదములు
తరిమెఁ దారావళిఁ దలిరాకుబోణి । చరణనఖాంశువుల్ సకలవిద్యలను
తగినది గావునఁ దదవయవములు । పొగడొందె సత్క-ళాస్ఫురితంబు లగుచు
నీలీల రమణీయహేలావిలాస । శాలిత గన్న యాజవరాలిమిన్న
యొకనాఁడు గురుసుతు నొద్దికివచ్చి । ప్రకటవిశ్వాస మేర్పడ్రమొక్కి నుటుట
బటువు ముత్యాలపాపట నటియింప । కటి మేఖలాఘంటికాధ్వను లెసఁగ
వలను జిక్క-న జక్క-వల పెక్కు-వలర । జిలుగుహొన్ రవికలో సిబ్బెంపుగబ్బి

తగటుచెరగు పయ్యెద యొకింతజాఱి । బిగిగుబ్బచన్నులు పిక్కటిలంగ
నురుతారహారంబు లుబ్బూతలూఁగ।మెఱుఁగుచెక్కుల కమ్మ మించులుదొలఁక
చెంగట నిలుచున్న శృంగారవతి గ । నుంగొని యాద్విజన్ముఁడు త త్తరమున
రావే మిటారి దర్పకుని కటారి । క్రేవఁ గూర్చుండు మీక్రియఁ గొంకనేల
ననిచెంత నివసింప ననుమతి యొసఁగుఁ । గనకాంగి యతనిచెంగటనె కూర్చున్న
మగువ నేనొక్క సమస్య నిచ్చెదను । సొగసుగా రచియింపు శ్లోకంబటంచు
పరిపూర్ణయౌవనభ్రాజితయైన । తరుణి శృంగారంబు దర్శనీయమను
నర్థంబుగల సమస్య యొకండొసంగఁ । బార్థివసుత సిగ్గుపడి తలవాంచి
గురునాజ్ఞ ద్రోవక గూఢార్థకలనఁ । దరుణి శ్లోకం బాశుధార రచించె
అందున ముదమంది యవ్విపుత్రిఁ డనియె । నిందుబింబాస్యతో నేకతంబుగను
కురులు కూడనినాఁడె కోమలి నీవు । పరిచర్యసేయుచు భక్తి మావలన
సకలవిద్యలునేర్చి చతురతఁగంటి । వికఁ జనువుకొనంగ నిటరావు మాకు
హితమైన దక్షిణ యియ్యక యురక । వితపుచ్చి పోవుట విహితమే యనిన
కరములుమొగిచి యక్కన్యక పలికె । ధరణీసురోత్తమ దక్షిణయీక
యే రిత్తవోదునే యేమిగావలయు । కోరిననిచ్చెదఁ గోరికొండనిన
నతఁడు మోమలర నిట్లనె నీవు పసిఁడి । ప్రతిమచందంబున బాగొందఁజూచి
మఱుఁడైన వలఁచు నస్మాదృశు లెంత । గురుఁడ పురోహితుకొడుక నాశ్రితుఁడ
నిన్నె కోరినవాఁడ నీమీఁద మరులు । గొన్న చిత్తము త్రోయగూడదు తనకు
నేకతంబునఁ గౌఁగిలించి యొక్కపరి । చేకొని నన్నేలు చిగురాకుబోణి
యిదిదక్క దక్షిణ యే నేమియొల్ల । సదయత నాకోర్కి సమకూర్చు మనుచు
మోహాద్వైన్యంబులు ముడివడ నడుగు । కూహకు నతనిగన్గొని కన్య పలికె
గురురాయ! మీ రెఱుంగుదురు సర్వంబు । నెరవాదితన మెల్ల నేర్చియున్నారు
ఏ నెంతదాన మీ కెదురుమాటాడ । కాని కార్యము మీరు కాంక్షించినారు
ఇందునఁ గన్యాత్వ మెడయు దోషమగు।నిందయుఁ బ్రాపించు నియతి తొలంగు
అయ్యకు లేదు కన్యాదానఫలము । వెయ్యేల యిపుడు నన్ వేఁడినమాట
గైకొని మీపొందు గావింపఁజాల । ధీకంజభవ యొండుదెలిపెద వినుఁడు
నను నొకరాజనందనునకుఁ బెండ్లి।యొనరింప మాయయ్య యూహించినాఁడు

నెల రెండునెలల పెండ్లి ప్రయోజనమగు । వలదుసందియ మే వివాహమ్మై పిదప
మీ కోర్కిదీర్చెద మిథ్యగాదనిన । నాకలకంఠితో నతఁ డిట్టులనియెఁ
బూలివోని యీవనంబున మించు నిన్ను । వలచి నేనడిగిన వాంఛ పోనడిచి
ధవు నొక్కనివరించి తరువాత నన్ను । నవునఁటె పొందెదనని మందలింప
పురుషుని గలసినప్పుడె కన్నెతికము । దొరగె సారమడంగెఁ దొలిజవ్వనమున
నదిగాక పరకీయవైతి విట్లైన । ముదిత యప్పుడునిన్ను ముట్టనేరాదు
తేఁటియంటిన పువ్వుతెఱఁగైన నిన్ను । పాటించి కూడిన ఫలమేమి చెపుమ
నను గూడినంతఁ గన్యాదానఫలము । జనకుఁడు గనఁడని చర్చించినావు
దానపాత్రుండైన ధరణీసురునకు । మేనొసంగుట దోషమే ముద్దులాడి
కన్నెయీ కుంతి భాస్కరుఁ జేరలేదె । కన్నెతికము దానఁ గడతేరె నోటు
నామాట యిఁక చేకొనక యెంచితేని । నేమగునో దేహ మెఱుఁగరాదతివ
యింతకన్నను దోస మేమున్న దేల । పంతంబు సేసెదె బంగారుబొమ్మ
ఒక పెండ్లికొడుకు నిన్నొనఁగు మంచెన్న।టికివచ్చి యడుగు తండ్రియుఁదల్లి యొప్పి
యెన్నఁడు పెండ్లి సేయింతురు నీకు । కన్నెపాయము కొల్లగా పతి కొసఁగి
యితరుల వంచించి యేరీతి వత్తు । వతివ యెన్నఁటికి నన్నాదరింపుదువు
నేల దూరక్రియ లిది వట్టిజోలి । చాలింపు మనిన నజ్జలజాక్షి పలికె
పదర నేమిటికయ్య! బ్రాహ్మణప్రవర । యిదె పెండ్లి సాగెడి నే పతితోడఁ
గలకయమున్న నీకాంక్ష గణించి । సెలవుగైకొనియ వచ్చెదఁ గల్ల కాదు
నామాట నమ్ముడన్న భయంబుఁ జెంది । యీమహీసురుఁడను నతివ! మేల్మేలు
ఇపుడిఁ జెప్పితివేని నీనాథుఁ । డొప్పనె నిన్ను కోపోద్రేకమునను
దెగఁజూచు దన్ను మర్దింపఁదలంచు । దగ దీవిచారంబు దలిరువిల్కాని
బారిచే నిప్పుడే ప్రాణముల్ చనఁగ । నేరీతి నోరుతు నే నన్నినాళ్లు
నీకును నాకు హాని యొసంగుఁ దుదను । నీకాపురముచెడు నిక్కమ్ము సుమ్ము
గోర నోపని కేల గొడ్డలిఁ గొనఁగ । నీరహస్యపుఁ బను లెవ్వరితోడఁ
దెలుపరా దెటువలె దెలిపెదు పతికి । బళిబళి స్త్రీబుద్ధి ప్రళయాంత మనిన
గోవిందశర్మ కకోక్కమలి పలికె । నీవిచారములు మీరేలఁ జేసెదరు
అయ్య మీకునునాకు హాని రాకుండ । నొయ్యన పతితో హితోక్తి బోధించి

శయ్యఁ జేర్పకమున్నె సరగ నేతెంతు । నెయ్యంబువిడక మన్నించు నన్నతఁడు
నలుకసేయు నటంచు నానతియ్యకుఁడు । పలికినపలుకు దబ్బరగాక యుండ
మీపాలి కరుదెంతు మీపాదమాన । శ్రీపతియాన గౌరీపతి యాన
అనిన నేమోయని యనుమానపడుచుఁ।జనియె భూసురుఁ డాత్మసదనంబునకును
అంతిఁ గొన్నిదినమ్ము లరిగిన పిదప।శాంతుండు సుగుణనిశాంతుఁ డుత్తముఁడు
ధవళాశ్వుఁడనుయుగంధరధరావిభుఁడు। భువనమోహనకళాద్భుతమూ ర్తియనఁగఁ
గర్వారహాసినీకన్యావిలాస । మేర్పడ విని మోహ మిచ్చనెచ్చఁగను
బెద్దల నంపించి పెండ్లి కక్కన్య । నొద్దిక గావింప నుత్సాహమంది
కువలయాభరణుని కూఁతుఁ బెండ్లాడె । ధవళాశ్వనృపతి బాంధవులు మేలనఁగ
వలరాజు రతిని వివాహమైనట్ల । బలభేది పౌలోమిఁ బరిణయంబైన
లాగున విష్ణుండు లక్ష్మిఁ జేపట్టు । బాగున వారల పరిణయంబమరె
నీలీలఁ బెండ్లియై నృపసూతి యతఁడు । కేళికాగృహపరిష్కృతరత్నఖచిత
పర్యంకమునఁ బువ్వుఁబానుపు మీఁద । భార్యాగమాసక్తభావుఁడై యుండె
నంతలోఁ గర్వారహాసినీకాంత । వింతవింతగ బహువిధభూషణముల
కనకాంబరాదుల గంధమాల్యముల । తనచెలుల్ చేసేయ తనుగతసార
సౌరభంబులు నల్దెసల గ్రమ్మికొనఁగ । వారించి తనచెంత వచ్చు నచ్చెలులఁ
బనిచి తానొంటిగాఁ బతిసెజ్జ చెంత । వినయంబుతో నిల్చి వీడెంబొసంగి
చేకొని వ్యజనంబుచే కొంతవిసరి । యాకడఁ దొడనుంచి యతనిపాదములు
కరపల్లవంబులఁ గడుభక్తి నొత్తి । మెఱుఁగారు చిటిచాపమీఁదఁ గూర్చుండి
యింపుగా వీణెవాయించిన మెచ్చి । కంపితంబార! చొక్కంబయ్యె తావి
స్వరములు మేల్ శ్రుతిచాతురి మమ్మ! । పరిపరి తానముల్ బాగని విభుఁడు
అలరుపానుపు డిగ్గి యతివ క్రిందటనె । నిలనేల! రమ్మని నిజబాహుయుగళి
నక్కున గదియింప నతివయు లేచి । మ్రొక్కి కరంబులుమొగిచి యిట్లనియె
ప్రాణేశ యొకవిన్నపంబు గావింపఁ । బూనితి వెఱచి తెల్పుదునొ నాలోన
వెఱపులేకయ విన్నవింతునో యనిన । విరిబోణిరో నీకువెరవ నేమిటికి
నెఱిఁగింపు మప్పని యేనొనరింతు । దొరకొని యది యెంత దుర్ఘటంబైన
అని బుజ్జగించి రాజాత్మజుం డడుగ । ఘనవేణి శంకలేక మృదూక్తి ననియె

సకలవిద్యోపదేశ మొనర్చినట్టి । యకలంకుఁడు మదీయుఁడగు పురోహితుని
తనయుండు నను గురుదక్షిణ యొసఁగు । మనినఁ గోరిక దెల్పుమన ననె్నఁ గోరె
కోరిన మోకిట్ట కుత్సితక్రియలు । కారాదనుచుఁ బెక్కుగతులఁ దెల్పితిని
పతి యనుమతి లేక పరునిఁ బ్రాపెంప । సతి కనర్హంబు నాస్వామితోఁ దెలిపి
నీచెంత కరుదెంతు నిజమని యల్ల । నాచార్యసుతుమీఁద నాన వెట్టితిని
హృదయేశ నాసత్య మీఁడేర్చుకరుణ । యొదవిన ననుమతి యొసఁగు డాదృతిని
వల్లభ ! యటుపోయి వచ్చెదననిన । నల్ల రాజకుమారుఁ డాశ్చర్యమంది
పతితోడ నెటువంటి భామినియైన । నితరుని భోగింపనేఁగెద ననుచుఁ
దెలుపునొ యిదియేమొ దీనిభావంబు । సెలవిచ్చి పొంచి యిచ్చెలి వెంటనేఁగి
చూచెదఁగాక యీ వోద్యంబటంచు । నాచెల్వకనియె మహాభాగ్యమాయె
భూసురుతోఁబల్కి బొంకగాఁ దగునె । నీసత్య మీవేళ నిలుపుకొమ్మనుచు
ననుమతి యిచ్చిన నరమర లేని । మనసుతో నక్కాంత మగని వీడుకొని
జాళువా బంగారుశాలువు పైని । మేలిముసుంగిడి మెఱుపుతీఁగె వలె
తళుకుతళుక్కని తన మేను మెఱయ । నల మేడడిగ్గి యుద్యానమార్గమున
బయలుదేరి పురంబు బహిరంగణమున । రయమునఁ జనఁగ నారాజనందనుఁడు
నెలఁతచంద మెఱుంగ నెమ్మదిఁదలఁచి।పొలఁతివెంటనె మేలి బూర్నీసు ముసుఁగు
పెట్టుక చిఱుతయుఁ బెద్దక త్తియును । బట్టి పదత్రముల్ పదముల మెట్టి
యంతంత కనఁబడ కరుగుచునుండె । నింతియుఁ బురిక్రోట యిటువలె గడచి
అగ్రహారముత్రోవ నరుగుచున్నెడ ను । దగ్రవనస్థలి నశ్వత్థశాఖఁ
బాయక వసియించు బ్రహ్మరాక్షసుఁడు । కో యనియార్చుచుఁ గుంభిని కురికి
యాత్రోవఁజను కాంత కడ్డమై నిలిచి । యత్రాసవృత్తి నీయర్ధరాత్రమున
నెందుఁబోయెద వొంటి నిందుఁజిక్కితివి । యిందుబింబాస్య! నీకెటు పోవవచ్చు
నాఁకలిగొన్న నా కాహారమైతి । చేకొని నిన్ను భక్షింపకమాన
ని నోరుదెఱచుక యట ప్రిమింగవచ్చు । దనుజునిం గనుగొని ధైర్యంబువిడక
పాణియుగ్మము మోడ్చి పద్మాక్షి పలికె । పాణితమాధుర్యభాపానిరూఢి
రవితేజ యీనగరంబు పాలించుఁ । గువలయాభరణుని కూఁతుర నేను
క్రొత్తగాఁ బెండ్లాడి గురునకు ప్రొక్క । నిత్తటి నచటికి నేఁగెద ననఘ!

అతనిచెంగటి కేఁగి యతనిఁ బూజించి।యతని వీడ్కొని వేగ నరుగుదెంచెదను
మఱలివచ్చి మదీయమాంసర క్తములఁ । బరితుష్టిసేతు నిబ్ధిగా నీకు
నామాట మృషగాదు నమ్ముమటన్న । కామినిఁగని వాఁడు కవకవ నగుచు
నేటిమాటలు పల్కి దింతి నాచెంత । బూటకంబులుసేయఁ బొసఁగదు నీకు
విడిచిపెట్టిన నీవు విప్రనియిల్లు । విడిచివత్తువె బ్రుంగివేయు నాకడకు
నా విని యబ్బోటి నరభో క్త కనియె। నానచనంబేల నమ్మవు? నీవు
బ్రహ్మరాక్షసుఁడవై పాపంబుకతన । బ్రాహ్మణుండవె యిట్లు ప్రభవించినావు
కనుగొన్నయప్పుడే కానఁగారాదె । యనృతవాదుల సూన్యతాలాపపరుల
చదువులునేర్చి రాజకుమారి నగుచు । నుదయించి నే నసత్యోక్తు లాడుదునె
భూమి తిర్యగ్జాతిఁబుట్టిన బహుళ । కామధేనువురీతి ఖ్యాతి గైకొనదె!
ఆకథ వినవె నీ వాగమజ్ఞుఁడవు । నీకు సందియమేల నేఁబోయి యిపుడె
యావిప్రుతో మాటలాడి వచ్చెదను । పోవని మ్మిటురాక పోయితినేని
పతిని వంచనసేయు భూమిని గతిని । సతతంబు బుధుల నెంచనిదాని గతిని
గురువుల నిందిచుఁ గుత్సితగతిని । హరుదేవి గొలువని యంగనగతిని
వావి దప్పినయట్టి వనజాక్షిగతిని । దేవతాద్రోహ మొందినదంట గతిని
యెగ్గుసిగ్గెఱుఁగని యెబ్బెట్టు గతిని । నొగ్గి పాపమెసేయు యుజ్జారి గతిని
గొణుఁగుచుఁ దనుతిట్టుకొను చెట్టగతిని । ధృణముగాఁ బతిఁదిట్టు తెక్కలిగతిని
నింటిసొ మ్మదవగా నిడుమొప్పె గతిని।కొంఱయై మదిరక్షాగు గరాసు గతిని
పొందుదు సత్యమెప్పుడు దప్పవిడువ । నిందుండు నాబొంది యిది నీకువిందు
అని బహుళపదోక్తు లాయింతి పలుక । విని దైత్యుఁడోయమ్మ విడిచితి నిన్ను
చెచ్చెర రమ్మనిచెప్పి తాఁద్రోవ । యిచ్చిన నచ్చెలి యిచ్చలో నలరి
అద్దైత్య వీడ్కొని యవ్వలఁబోయె । పెద్దకోల్పులికిఁ దప్పినలేడి పగిది
నాయద్భుతము ధవళాశ్వుండు నూచి।మూయు రేయిది హెచ్చుమానిసియనుచు
నింతటంతటఁ జనియెడువేళ బాల । కొంతదవ్వేగ నంఘ్రుల నందియలును
మొలనూలిగంటలుఁ మొరయ మైతావి।నలుగడ నెరయ నెన్నడ ముద్దుగుమియ
నారామ చనియెడు నారామసీమఁ । జోరుఁ డొక్కరుఁడు జుంజురు సిగయందు
ముడిచిన మందుల మూలికవేళ్లు । కడు నల్లనగు మేను కన్నంపుగత్తి

NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D.P.R.I.
Acc. No. 77

దోపిన బల్‌దట్టి తోలుచల్లడము । వేపుల వాకట్టు వివిధాయుధములు
బలుసొక్కపొడిబుట్ట భ్రమరాలకోవి।ములుజోడు బలపంబు మాఱుక లిరుమును
గుడికేలఁ దగు నుక్కగుదియయు నుదుట।నిడిన కాటుకబొ ట్టదృశ్యంపు బూతి
గలిగి భయంకరాకారుఁడై త్రోవ । నిలిచి ముందరవచ్చు నెలఁత నీక్షించి
సరిలేని రత్నభూషణములు పూని । యరిగెడి నొంటి నియ్యంగన యొడలి
తొడవు లన్నియుఁబట్టి దోఁచెద వెంట । నడతెంచువాఁడ గనంబడ రంచు
నక్కన్య కడ్డమై యలివేణి యొంటి । నెక్కడి కేఁగెద వేగక నిలుము
నీమేని సొమ్ములన్నియు నిచ్చితేని । యేమి సేయక పోవనిచ్చెద నిన్ను
ఇమ్మాట్టు మల్లాడితేని నిన్‌బట్టి । సొమ్ములుగొందు నే సొడ్డుగా కిపుడె
గుట్టున దోపిమ్మ కొమ్మ ! నేమ్రుచ్చ । నెట్టిదిట్టలనైన నేపడంగింతు
నని ముట్టుకొనవచ్చు నమ్రుమ్రుచ్చుఁ జూచి।కనకాంగి యెచటసంగడమాయె!వీఁడు
వీనిరాయిడిఁ బడి వెతఁజెంద రాదు । వీనికి సొమ్మిక వీఁడు పోనీఁడు
సొమ్మెసంగెదనని నూన్యతోక్తులను । నమ్మించి యేఁగెద నాగుఱు కడకు
నని యాత్మఁజింతించి యబల యాదొంగ।కనియె నేరాజకన్యను గ్రొత్తపెండ్లి
కూఁతుర నోయన్న ! గుఱునకు మ్రొక్క । నీతఱి వచ్చితి నిదె పోయి మఱల
నఱుదెంచి నాసొమ్ములన్నియు నిత్తు । హరియింపవల దిప్పు డాభరణములు
నావిని యాదొంగ నగుచు నిట్లనియె । నీవు మ్రమ్మఱుపచ్చు నెక్కడ నాకు
నీసొమ్ము లిచ్చుట యెక్కడ నడుగు । బొసిన నక్కఱిబాసె నటన్న
వార్త యెఱుంగవే! వనజాక్షి నీవు । ధూర్తవు నన్నిట్లుదొసఁగులఁ బెట్టి
తప్పించుకొనఁజూచెదవు జూదగత్తె । విప్పలుమాయ లే నెఱుఁగుదు గొన్ని
లలితాంగి మీనుపిల్లకు నీఁత నేర్పు।వలెనె! యీగచ్చు లెవ్వరితోడ ననుచుఁ
దెఱువాటుగొట్టెడు తెకతేరకాని । పఱుపోక్తు లాలించి పడఁతి యిట్లనియె
అన్న నీతో కల్లలాడి నేనవలఁ । జన్న నేమిఫలం బసత్యంబు కంచె
కలదె పాపము జూదగత్తె నటంచుఁ । బలికినాఁడవు నీస్వభావంబు గనుక
నీటిబుగ్గనుబోలు నెమ్మేనికొఱకు । నేటి కసత్యంబు లెన్నేని వదరఁ
గను 'నానృతాత్పాతకంపర' మనఁగఁ । జను మహాశ్లోకార్థసంగతి గొంత
యీకాళరాత్రియు నీభూమిదేవి । యీకాశవాణియు హరిహరాదులును

సకలభూతంబులు సాక్షిగా నిదిగొ । యొకటి దెల్పెద విను మూర్వీసురేంద్రుఁ
గని వచ్చినపుడె నాకలసొమ్ములెల్ల । నినుఁజేర్చు వలదు సందేహ మిటుంచుఁ
బలికిన యక్కల్కి భావసంశుద్ధి । దెలిసి తస్కరుఁ డను తెఱువ నీవిన్ని
బరవసంబులు పల్కఁబాడియె ద్రోవ । నరుగుము వేగ బ్రాహ్మణవీథి కనుచుఁ
ద్రోవ యావలఁజూపి దొంగ నేమింప । నావెలందియు నగ్రహారంబు సొచ్చి
వినుకలిచేత నవ్విప్రగృహంబు । దనమది నెఱిఁగి తద్ద్వారంబు సేరి
తలుపుదట్టిన విప్రతనయుండు నిద్ర । దెలిసి యెవ్వరటన్నఁ దెలిగంటి యపుడు
తన పేరు సెప్పి మె త్తనియెలుంగడర । ననఘాత్మ తలుపుదీయందగు ననిన
వసుధాసురుఁడు మేను వడవడ వణఁక । నసమాంగి యీవేళ నరుదేరఁ దగునె
అపకీర్తి కిదిమూల మర్ధరాత్రమున । చపలాక్షి యీసాహసంబు సేయుదురె
అని తల్పు తెఱచి యయ్యతివ లోపలికిఁ । జనుదెంచి మ్రొక్కిన సత్పుత్రపతివి
గమ్మని దీవించి కన్నుల నీరు । గ్రమ్మ నవ్విప్రశిఖామణి పలికె
నమ్మ! నీ సత్యమాహాత్మ్యంబు వలన । నెమ్మదిఁ బ్రాపించె నిశ్చలత్వంబు
నీవె నాతల్లివి నీవె నాతోడు । నీవె నాపుత్రివి నిక్క మీమాట
మగువ నాతోనన్నమాట చెల్లించి । పొగడొందితివి సత్యమున సతీత్వమున
నీకు సాటిగలారె నీపతిఁగూడి । చేకొను మిష్టార్థసిద్ధు లనంగ
పంచనుబొంచి భూపాలుఁ డావిప్రు । నంచితవాక్యంబు లాలించి యలరి
వెలఁది యవ్విప్రుని వీడ్కొని యిల్లు । వెలువడు కదలిక వేగంబె తెలిసి
యవ్వలఁజని డాగె. నంతలో వెడలె । జవ్వని గురునివాసంబున నుండి
యొంటిగా నెటులేగెదో యిఁక దల్లి । వెంట నెవ్వరులేక విపినమార్గమున
నని వగచుచునుండె నవ్విప్రసుతుఁడు । వనితయు వేవేగవచ్చి తస్కరుని
గని పల్కె నామేనఁగల సొమ్ములెల్ల । గొనుమన్న యిచ్చితి గొబ్బున నన్న
నాదొంగబంటవురా! సత్యమని ప్ర । మోదంబు నొంది యమ్మునితకు మ్రొక్కి
నీవు మాయక్క-వు నేసహోదరుఁడ । దేవి నీసొమ్ములు తిరుగ నిచ్చితిని
చను మిఁక నగరికి జాగుసేయకుము । వనములోనని చెప్పి వాఁడటు చనియె
నవ్వింత గని ధవళాశ్వం డయూరె । జవ్వని సత్యభాషామహత్త్వమున
కరుణ యన్ పేరెఱుంగని మోషకునకు । కరుణ జనించె రక్కసిబారి యెటులఁ

గడచునో యీసాధ్వి కడపట ననుచు । నడిదంబు మఱువక యరుదెంచుచుండె
నావేళఁ గర్వారహోసినీదేవి । రావిప్రైఁ దగు బ్రహ్మరాక్షసుఁ జేరి
జేవెట్టి గాత్రమిచ్చితి భుజియింప । రావయ్య! తూథయెంత రగులుచున్నదియొ
తడవు చేసితినన్న దైత్యుఁ డుప్పొంగి । పుడమికి దిగివచ్చి ఫూబోణిఁ బొగడి
చాగురే! మాతల్లి సాధ్వీమతల్లి । నీ గురుభక్తియు నీ సత్యమహిమ
నీపతిభక్తియు నేర్తునే పొగడ । నీపుణ్యమునఁ బాపనిర్ముక్తుఁ జేసి
నన్ను రక్షింపవే ననుగన్నతల్లి । యన్న నచ్చెలిపల్కె నజ్ఞానవతిని
నిను నిరఘునిఁజేయ నేనెట్లునేర్తు । తనువు భుజింపఁగాఁ దలఁచిన నిందుఁ
జనుదెంచితి తూథాగ్నిఁ జల్లార్చికొనుఁడు । తనచేత నొండువిధంబు లెట్లగును
అనవిని రాక్షసుం డయ్యింతికసియె । జనయిత్రి నీసత్యసంపదలోన
నఱిపాలొసంగిన నఘములు వాసి । యరుగుదు దివ్యుండనై దివంబునకుఁ
దరళాక్షి దశరథధరణీశు చేత । సురథునిచే గయక్ష్మోణీశు చేతఁ
గ్రూరదానములు గైకొని యిట్టులైతి।నోరామ విను పెక్కుయుగముల నుండి
రాక్షసత్వంబు తీరక యున్నవాఁడ । రక్షింపఁదగునన్న రమణి యిట్లనియె
సగ మియ్యఁజాల నాసత్యంబునందు । సుగుణనిధాన యీసుద్దు లేమిటికి
పరకపాలిచ్చెదఁ బట్టుండటంచు । తరుణి జలంబుతో దారవోయుటయు
నసురభావము మానియమరుఁడైయతఁడు।వెసదివంబున కేగె వెలఁది నెన్నుచును
నచ్చోటు వాసి యయ్యలివేణి మరలి । వచ్చెఁ గేళీసౌధవాసమ్మునకును
అంతకుమున్నె దైత్యత్వమ్ము మాన్చి । యింతి వానికి స్వర్గమిచ్చిన తెఱఁగు
కని యిట్టిమహిమ లెక్కడఁగాన మనుచు।దనుమధ్యఁబొగడుచు ధవళాశ్వనృపతి
యామేడమీఁదికి నరిగి తన్మహిమ । లేమియు నెఱుఁగన ట్లైనయని నిద్ర
బెరయగా గురుకలు వెట్టుచునుండె । తరుణియు విభుఁడు చిత్తంబున నేమి
తలఁచెనోయని యాత్మఁ దలఁకుచు వచ్చి । చెలువుని చరణరాజీనయుగంబు
మెల్లనఁ బుణికిన మేల్కన్నయటుల । వల్లభుఁ డెవ్వఁడే వనిత వచ్చితివె
ద్విజునికోరిక తీర్చితే యని యడుగ । గజయాన దేవర కరుణావశమున
మహిసురుతో నన్నమాటఁ జెల్లించి । బహుమతి వచ్చితిఁ బ్రాణేశ యనిన
నాసతిగుణమున కానందమంది । శ్రీసతి కెనయైన చెలువవు నీవు

నాభాగ్యవశమున నాభార్యవైతి । వోభామ యింక నిష్టోపభోగములు
గైకొని సుఖయింతుగా కనిపలికి । పాకారి పౌలోమిబాళి నేలుకొను
తెఱఁగున వివిధరతిప్రసంగములఁ । గరఁగించి సకలసౌఖ్యములొంది యతఁడు
తనపురి కేగి కాంతామణితోడ । జనులు మేలనఁ బ్రాజ్యసామ్రాజ్య మేలె
పరమపతివ్రతాభావంబు వలన । దరళాక్షి కీమహత్త్వంబు ప్రాపించె
కర్పూరహోసినీకాంత చారిత్ర । మేర్పడు వినువారి కీప్సితార్థములు
చేకుఱునని చిలుక చెప్పిన వైశ్య । రాకేందుముఖ యనురాగంబు జెంది
యాతన్విఁ బొగడుచు నరిగె లోపలికి । దూతిక యాకథ దొరతోడఁ దెల్పె
నని శంభుఁడెఱిఁగింప నవ్వలికథలు । వినిపింపుఁడని గౌరి వేడ్కతో నడిగె

సనయపతివ్రతాచరితంబు నందు । ఘనసూక్తి సప్తమకథ సాంగ మయ్యె

తైల్లపాకకుండ శపించిన సాధ్వి కథ

శ్రీ విశ్వపతి సమంచితమతి గౌరి । కావలికథ యిట్టులని తెల్పఁదొడఁగె.
మనుజేనుఁ డనుపఁ గ్రమ్మఱి దూతిపిలువఁ । జనుదెంచు పుష్పమంజరి విలోకించి
రాచిల్క పల్కె సారసగర్భభామి । నీచారు పరివాదినీనినాదమున
తరుణి పతివ్రతాధర్మధూర్వహత । కరము దుష్కర మెట్టికాంతల కైన
నొదవు తద్గుణ మొకానొక పుణ్యసతికి । సుదతి జన్మసహస్రసుకృతంబు వలన
మగఁడు మన్నించినమన్నింపకున్న । మగువ పాతివ్రత్యమహిమంబు విడదు
ఇందుల కొకకథ యెఱిఁగింతు వినుము । చందనగంధి నిశ్చలబుద్ధి వగుచు
మద్రదేశంబున మణిమతీపురము । భద్రేభరథహయభటయుక్తిఁ దనరు
ఆపట్టణమున విద్యానిధియను మ । హాపుణ్యఁ డొకభూసురాగ్రణి గలఁడు
అతఁడు సదాచారుఁ డధ్యాత్మవేత్త।యతనికి దుర్మేధుఁడను పుత్రుఁ డొకఁడు
ప్రాదుర్భవించె నబ్బాలుఁ బోషించి । యైదేండ్ల కక్షరాభ్యాసంబు చేసి
జనకుండు రెండువత్సరములలోన । ఘనకావ్యములు నాటకంబులు నేర్పె
గర్భాష్టకమున దక్కక యుపనయన । మర్భకున కొనర్చి యాతరువాతఁ

జదివించె బుగ్యజుషములు శాస్త్రములు । పదునాలుగేండ్లలోపల నెటింగించె
స్వకులోచితములైన సకలధర్మములు । సుకుమారునకు నిట్లు సొలవక చెప్పి
కులరూపగుణములు గురువివేకంబు । గల సుశీలానామ కన్యాలలామఁ
దనకుమారునకు నుద్వాహంబొనర్చె । ననసాయకున కెన యని బుధులెంచఁ
గొన్నాళ్లు లాపుత్రకుఁడు సుశీలుఁడని । యెన్నఁగా దుశ్శీలవృత్తులఁ బోక
నినుఁ దుదయాచలం బెక్కకమున్న । చని పుణ్యనది చేరి స్నానంబొనర్చి
తగు నిష్ఠతోడ సంధ్యావిధుల్ దీర్చి । స్వగృహంబునకు వచ్చి సప్తార్చి గూర్చి
యుపాసనముఁ జేసి యటఁ బితృభక్తి । యేపార మ్రొక్కి వారెలమి దీవింప
శ్రుతులుశాస్త్రములుశిష్యులకుఁ దెల్పుచును।ప్రతిభాసమగ్రుఁడై పండితుల్ మెచ్చఁ
జతురోక్తి విద్యాప్రసంగముల్ సేయు।నతిథిపూజాపరుండగు తండ్రి యులరఁ
గ్రమమొప్ప మాధ్యాహ్నికము దేవపూజ।యమరఁ గావించి విద్యార్థులఁ గూడి
జనని వడ్డింపఁగా జనకునిబంతి । ననువంద భుజియించి యపరాహ్ణవేళ
మొనసి మాన్యక్షేత్రమును గృహారామ । మును బశుసందోహమును బరికించి
సాయంతనక్రియల్ సలిపి సద్గోష్ఠిఁ । బాయక సద్గ్రంథపారీణుఁ డగుచుఁ
గ్రమియించు కేలిత్తెఱంగున నతఁడు।శమదమాన్వితుఁడయి చరియించు నంత
దురహంక్రియలకు బంధువు వికారాంబు । పరిపూరితాంధువు పాపభూయిష్ఠ
మోహలతావాలము మదాన్వితము దు । రూహాస్పదము మన్మథోల్లాసములకు
పాళి మాచారప్రభావరసాల । సాలకుఠార మాశావనిసురభి
సురతవాంఛాబుదస్తోమనభంబు । గురువివేకజ్ఞానకుధరదంభోళి
అసతీహృదంబుజాహస్రరోదయము । మసృణకామక్రోధమాత్సర్యవసతి
నిండుజవ్వనము సంధిల్లె నానాఁట । నొండు సత్క్రియలయం దుత్సాహ మెడలె
ప్రొద్దెక్కి నదియేమి పొమ్మని యింటి । యొద్దనె సంధ్యాదు లొనరింపసాగె
ననువొందసేతు నాజ్యాహుతు లెల్లి । కనుచు నాపాసనంబతఁడు చాలించె
తన కాస్థలేమి నిత్యము దేవపూజ । యొనరింప విద్యార్థినొకని నేమించె
తలిదండ్రు లిదియేమి తామసంబనిన । నలిగి వారల కెదురాడఁగాఁ దొడఁగె
పరదేశులకు నన్నపానీయదాన । గరిమ లేదని వారి గద్దించి తరిమె
యీచందమున దుష్టహృదయుఁడై నిజకులోచితక్రియలెల్ల నుడిగి వెండియును

గొక్కొక మిదియని కొంచెలఁగూర్చి । యక్కఱ వారి కయ్యర్థముల్ దెలుపు
ఱుజంత చిత్తిని యానాతి హ_సి । నీజాతియని వీథినెలఁతలఁ జూచు
ఋతువైనఁ దద్దోషమెడయదే యితర । రతి సేయుఁడని యన్యరమణుల నడుగు
కనుగొనమే 'స్వర్గకామో యజేత'।యనఁగ వేశ్యాయు_కి నఘుమేమి యనును
దగదె 'సర్వంఖల్విదంబ్రహ్మ' యనఁగఁ । దగని కాంతయు గలదా యని పలుకు
తన పురాకృతదుష్కృతము తన్ను జుట్టి।కొని బెట్టు ।పేరేప గుణహీనుఁడగుచు
పరిహాసకులయొద్దఁ బలువలయొద్ద । విరిబంతు లమ్మెడివెలఁదుల యొద్ద
జూదంబు లాడెడిచోటులఁ జంద । నాదు లమ్మ్రుచునున్న యంగళ్లయందు
పగలు రేలును నెడఁబాయక తిరుగు । తగు నటవిటచేటతతులను గూడి
యే వేళ నింటికినేఁగునో యెపుఁడు । గావించునో భు_క్తి గనబడ దతఁడు
ఇంచుకసేపైన నింటిలో నిల స । హించక దినదినం బిటులఁ ద్రిమ్మరుచు
సవికెపుధోవతుల్ జాళువాసరులు । చెవులధరించిన చికిలిఘంటీలు
రాకట్టుపని యుంగరములు ముత్యాల । చౌకట్లు హొన్ బట్టుశాలువ మొలను
గనుపట్టు మేలిబంగరు మొలకట్టు । గొనబుగుండ్లు మెఱుంగుకుచ్చుల హెచ్చు
సన్న నూర్యపుటంపుసంచి బల్ వెండి । సున్నపుకాయయు సొగసుగాఁ బూని
పిడికిఁటనిండి శోభిలు తెల్లటాకు । లెడనెడ మడిచి సొంపెనయ విడెంబు
సేయుచు నొకనాఁడు చెలికాండ్ర జంటఁ । బాయక కేరి లోపలి కేఁగ నచట
సవరొందు వితవిదూషకగాయకాదు । లవుకార నాముద్దులయ్య వచ్చెనని
పొగడుచు వీథిలోఁబొసఁగునే యిచట । జిగిబిగిగుబ్బల చిన్నిప్రాయంపు
ననబోణి యొక తెయున్న ది చూతుగాక।చనుదెమ్మనుచు నొక్కచాన యింటికిని
తోకొనిపోయి యింతులమేలిబంతి । యీకుందరదన నీకే తగు ననుచు
దానిఁగీర్తించి చెంతలనిల్వ నదియు । నానోములు ఫలించె నాభాగ్యమలరె
నాపుణ్య మీడేరె నాచక్కనయ్య । నా పడకింటిలో నవనీయకుసుమ
శయ్యాయుండఁగఁ జిటిచాపపై నిచట । నయ్యలు నివసించుటర్హ మే యనుచు
సరసోక్తి శుషోపచారముల్ గొన్ని । తరచుగా నొడివి కైదండ యొసంగి
పానుపుపైనుంచి పజ్జ మేనొరయ । దానుండి కపురనెత్తావి బాగాలు
మరులు హెచ్చఁగనిచ్చి మడుపు లొక్కొకటి । పరమవినీతి నేర్పడఁ జుట్టిచుట్టి

యిచ్చుచు బిగిగుబ్బ లెగనెత్త మెల్ల । గ్రుచ్చి కౌగిటఁజేర్చికొని మోవి నొక్కి
పచ్చవిల్తునికేళిఁ బైకొని వలపు । ముచ్చటాడుచు మోము మోమునఁ జేర్చి
యొక్క ముద్దొసఁగ రా యోరి ప్రాణేశ । నిక్కమ్ముగా నేను నిను మాన లేను
వెలకొమ్మ ననకు నీవే భర్తవనుచు । పలికి కళల్ రేచి పరవశుఁజేసె
దానిపై మరులెత్తి ధరణీసురేంద్ర । సూనుఁడు తనయింటిసొమ్మొకకొంత
కోకలు రూకలు గొనిపోయి యిచ్చు । నాకె నెచ్చెలులకు ననుఁగుదమ్మ్మలకుఁ
దను దానిగూర్చిన తాపికాండ్రకును । దనివిదీఱఁగఁ గోరుద్రవ్యంబు నిచ్చు
తల్లిదండ్రుల నొకింతయుఁ గాననీక । నిల్లెల్ల చెనఁటిగా నెల్ల వస్తువులు
కొనిపోయి నటవిటకోటి కిచ్చుటలు । జనకుఁడు విని కోపసంతాపచలిత
హృదయుఁడై తనయింటికేఁగి పెట్టియలు । వెదకి తాఁదాఁచిన విత్తాదికములు
కొన్ని గానక జాలిగుంది ముంగిటనె । యున్న భార్యనుబిల్చియోసి! యిదేమి
పెట్టెలలో దాఁచిపెట్టిన ముడుపు । లిట్టేల విడిలిన నేది ? తద్ధనము
ధావళుల్ పట్టువస్త్రములు శాలువలు । నేవి? నీవెఱుఁగక యెందుఁబోయినవి
కుల ముద్ధరించినకొడుకు వేఁడికొన । నొళువరివై నీవె యొసఁగితో ! లేక
వాఁడె కొంపోయెనో! వంచకుండగుచు । నేఁడెఱింగితిమి వాని మహత్త్వమెల్ల
వేదశాస్త్రంబులు వెల్లిఁబో విడిచి । వైదికాచారమ్ములమ్మ గావించి
తెలిగంటి యింటిప్రతిష్ఠఁ బోకార్చి । వెలయాండ్ర యిండ్లలో విహరింపసాగె
నా సరివారిలో నగుబాటు వచ్చె । నీ సడికోర్చి నేనిఁక నిల్వఁజాల
సర్వంబు వర్జించి సన్న్యాసి నగుచు । నుర్వీ జరింతు నీవొండాడవలదు
ఊరకుండుమటన్న నువిద భీతిల్లి । తోరంపుగన్నీరు దొరుగ నిట్లనియె
ప్రాణేశ యిట్లేల పదరి యిల్వ్వెడలి । పోనెంచెదరు చెల్లబో! యల్క-తోడ
నలిగి యిల్ చిచ్చిడు మనువారు గలరె।కులనాపకుఁడు వాఁడుకొడుకె? తలంప
నేమాయనుచు నుంటినిది నే నెఱుంగ । నీమాట మీరానతియ్యగా వింటి
నిలువెడలఁగఁగొట్టుఁ డిఁకరెంటమాటఁ । దిలకించి నేను బోధించిన వినక
పుతకరితనములు మానఁడేనియును । బ్రతికెడి; మీకేలఁ బరదేశమరుగ
నని బ్రమొక్కి-ప్రార్థించి యకోపమణఁచి।వనిత వాఁడెప్పుడువచ్చునో యనుచు
నెదురుచూచుచు నున్నయెడఁ దండ్రిలేని।కదలికఁగని బ్రుచ్చుగతి నిల్లుసొచ్చె

చనుదెంచిన కుమారు జనని వీక్షించి।కనుదోయి మిణుఁగురుల్ గదుర నిట్లనియె
నోరి పితృద్రోహి యోరి నీచాత్మ । యోరి దురాచార యుచితమే నీకు
పగలుఁరేలు ప్రయాసపడి తండ్రి చీమ।పగిదిఁ గూర్చినసొమ్ము పట్టాంశుకములు
గొనిపోయి గొంటవై కొంఱెరండలకు । ననుదినం బిచ్చి కామాంధకారమునఁ
దిరిగెదవే మంచిది మఱేమి యేటి । కడుదెంచి తింటికి నడుగు మచ్చటికై
తోడి బాడబులెల్ల దొరకొని కేరఁ । గోడెపాయపు మత్తుగొని చరించెదవు
తులువవుగాన నీదోయిటిప్రాల । యెలనాగ యీడేరి యింట నుండఁగను
అక్కన్య నొక్కనాఁడైనఁ గన్నెత్తి । చక్కఁజూడవు దుష్టసంగతి మరఁగి
నిరతంబు చరియించు నీచర్య లెల్ల । నెఱిఁగి మీతండ్రి నేఁడింటికివచ్చి
చెడుగనో నిన్నుజూచిన దోషమనుచు । నెడఁద నాగ్రహము సహింపఁగాలేక
సన్న్యసింపఁగడంగఁ జాలఁ బ్రార్థించి । దైన్యంబుమీఱఁ బాదములపైఁ బడినఁ
గినుకమానక నన్ను గెలయుచుఁ జనియె । వినగదరోరి ! వివేకవిహీన
అని పెక్కుదుర్భాష లాడుచునున్న । జనని గనుంగొని శంకలే కతఁడు
ఆతల్లిఁ పదముల కవనతుండగుచు । జేతులుమొగిచి నిల్చిమృదూక్తి ననియె
జననిరో! వినుమొక్క సహవాసదోష । మున నట్టిదుర్గుణంబు జనించెఁ దనకు
దెలిసె మీరిపుడు బోధించుటఁ జేసి । కలనైన నట్టిమార్గములకేఁ జనను
నీమాట జవదాట నిక్కువంబనిన । నామాత కృపచేత నంగీకరించి
మమత నెప్పటియట్ల మజ్జనభోజ । నము లమరించి యున్నా ! బుద్ధిగలిగి
మీతండ్రి మనసు రా మెలఁగు మటన్న । నాతఁ డౌగాకని యవుడింట నుండె
ఉన్నమాత్రమె కాని యూహాలోఁగేరి । చిన్నారిపొన్నారి చెలువల యందు
గుమిగొనివెంటాడుకొంఱెలయందు । భ్రమణమందుచుఁదొట్రుపడుచువర్తించె
కొడుకు నిక్కువమంచిగుణి యాయె ననుచు।కడునమ్మితండ్రియుఁ గన్నతల్లియును
మంచిలగ్నమున సమర్తశోభన ము । దంచితమతిఁజేసి రక్కుమారునకు
కోడలికిని బందుగులు మేలనంగ । వేడుకల్ మీఱఁగా వివిధవైఖరుల
ప్రీతిలేక సమర్తపెండ్లికుమారి । చాతుర్యవతిగాదు జడురాలటంచు
వలసియొల్లక యింటివారి నిర్బంధ । మొలయఁగాఁ జేరసాల నున్నచందమున
గట్టివేసినయట్లు కకూర్తి నిట్టు । నట్టు పోఁగూడమి నారేయి గడపె

తన తండ్రితో సమిత్ప్రసవాదికములు । గొనితెత్తునని సానికూఁతురి నొకతె
నాతెరువునఁ జూచి యట చేతికెంపు । రాతియుంగర మిచ్చి రమియించి వచ్చె
తులసి తే నటఁబోయి దొమ్మరిపడుచుఁ । దిలకించి తాను రాతిరి ముల్లెవిడిచి
ణొన్న మాడలలోనఁ గొన్ని యొసంగి । పొన్నపూఁబొదలోన భోగించి వచ్చె
సానిమిటారికి జక్కు-లవారి । చానకుగనియారజంపుబి త్తరికి
కూతాడిదానికి గొంకక వలచి । యాతఁ డింటగ్రహించు నర్థంబులిచ్చి
తళుకు గెందమ్మిపొందళపు బల్‌రవుతు । కలన వినోదించి కమ్మక్రొవ్వీరులు
ణొన్ని పాట్లములతోఁ గొనివచ్చి యింట । నున్న విద్యానిధియొద్దఁ దా నునుచు
నొక వేళ ముదుపులోనున్న మాల్లెచ్చ।టికిఁ బోయెననుచుఁ దండ్రిగణించి యుడుగ
నల్ల యంగడిసెట్టి కప్పిచ్చినాఁడ । మల్లిసెట్టికి నూఱుమా ల్లిచ్చినాఁడ
సంతలో నున్న వసంతసెట్టికిని । గొంత యొసంగితిఁ గూడినవడ్డి
యిదె తెచ్చియిచ్చెద రివిగో! పత్రములు।చదువుకొండనుచు నిజముదోపఁ బలికి
దబ్బరచీటులు తండ్రికిఁజూపి । యబ్బారిగడచి వాఁడట్టునిట్టు జూచుఁగు
నేనేమి చిఱుతనె! యింటిసొమ్మేలఁ । బోనిచ్చెదను పాఱబోతనా! మీకు
సందేహమేలని జనసీజనకులఁ । మందెమేలంబున మసగప్పి యింటి
బీగముల్ సొమ్మును బెట్టెతాళములు । తాగొని వలసినధనముఁ బోకార్చి
ిల్లువాఁకిలి ధనంబెల్లను సేది । చిల్లరవెచ్చముల్ సేయక బుద్ధి
గలిగియుండిన బ్రతుకంగల వింటి । కులకాంతతో ధర్మకుశలుండు పగుచు
గార్హస్థ్యమువహించి ఖ్యాతిఁ జెందుమని।యర్హభంగి గణించి యలతండ్రికొంత
కాలంబు చన జరాక్రాంతుఁడై నొగుల । నాలోన నతనిభార్య క్రమించె మున్నె
సతిచన్న యేటిలో జనకుండుస్వర్గ । గతుఁడైన నగ్ని సంస్కారాది విధులు
గావించి పరవధూకాంక్షలు విడక । నావిప్రతనయుండు నావంకపరక (?)
చాటును దీఱెనన్ సామెత తనకుఁ । బాటిల్ల వలసిన పగిది వర్తించె
నిది తగు నిదితగ దిదిచెట్ట యనక । కదియు నెవ్వతెనైనఁ గామాంధుఁడగుచు
నది కారణంబుగా నాద్విజాధమున । కుదయించె వ్రణబాధ లుత్పాతముగను
నెడలేని వ్రణబాధ నిటువలె మూలఁ । బడిన భర్తను జూచి భార్య దుఃఖించి
యన్నినా ళ్లితఁడు వ్రయముసేయ మిగిలి।యున్న కొంచెపుధనం బువిద గ్రహించి

పరమపతివ్రతాభరణంబు గనుక । పురుషుని దుర్గుణంబులు లెక్కగొనక
తగిన వైద్యులఁదెచ్చి తద్వ్రణహరము । లగుమందు లిప్పించి యనువుగాఁ బథ్య
పానీయము లమర్చి పాటుపడంగ । మానె వ్రణంబులు మఱి కొన్ని నాళ్లకు
కతఁడట్లు వ్రణబాధ లనుభవించియును।సతి డాగురించి వెచ్చమునకై యున్న
వాణులుగొంపోయి వేశ్యలకిచ్చి దుష్ట । గుణమున గడియించికొనెఘోరరుజలు
గడియించికొని వాఁడు గాసిపడంగ । ... ...
నొదవిన వ్రణచేష్ట లొడల నూరంగ । పదియైదుమాఱు లుబ్బలపడి లేచి
స్త్రీగోష్ఠి మానమిఁ జేతులఁగాళ్లు । మైఁ గానఁబడె పొడల్ మాటికి రసము
చిప్పిల్లి నెత్తురుచీములు వడియ । గొప్పపుండ్లయ్యెఁ బైకొనెఁ జెడుకంపు
సూలనొప్పులు మించ స్రుక్కుచుఁ గుక్కు । కూలి లేవగలేక కొరలుచునుండె
రొసలు గారెడు పుండ్లు రోయక కడిగి । మసల కందులకగు మందులు జరిమి
కూలికిదంచఁ జేకుఱు తండులంబు । లావేళఁదెచ్చి చయ్యనవండి తనకు
నొడికంబుగాఁ బెట్ట నొకకొన్ని నాళ్లు । గడపె నయ్యధముండు కాంతప్రోవునను
ఆలు కూలికిదంచి యున్నంబు వెట్ట । నీలాగు కుంటియై యింటిలోనుండి
యొకనాఁడు తనపత్ని నొద్దికిఁ బిలిచి । శుకవాణి! నినువంటి సుగుణలు గలరె
కాపాడితివి పెద్దగాలంబు నన్ను । నీపట్ల మూఖ్యనై నే నడిచితిని
అదియేల నిపుడెంచ నాస యొండున్న । యది మది నదియేమి యని యంటివేని
విను దొల్త నేఁగూడి విహరించినట్టి । కనకాంగియును వేశ్యగల దీపురమున
దానితో నొకసారిఁ దమిగూడియున్న । గాని మనోవ్యధ గడతేర దబల
నీవు దానింటికి నిప్పుడెపోయి । నావిధం బెఱిఁగించి నను నేటిరేయి
పిలిచి యేలెదునట్లు ప్రియములు చెప్పి। యెలమి తోడెమువైఁడి యిచ్చిరమ్మనిన
పతిమాట దాటక పద్మాయతాక్షి । హితబుద్ధినను వైఁడి యేమున్నదిపుడు
గళమున నొక్క మంగళసూత్ర మున్న।దెలనాగ కదియిచ్చి యియ్యకొల్వెదను
మది మీరు సంశయింపక యుండుఁడనుచుఁ । జెదరని పతిభక్తిచే నాసుశీల
పురిఁజుట్టి పేటలోఁ బొసఁగెడి కేరి । కరిగి యక్కడఁ గనకాంగి యిల్లడిగి
వడిఁ జొచ్చిపోవ నవ్వామాక్షి మేని । బెడఁగు కన్నులతళ్కు పెద్దపిఱుందు
బిగి గుబ్బచనుదోయి బింబాధరంబు । తొగరేనిగేహ ముద్దు మొగంబుఁ జూచి

యింత చక్కనికాంత యెవ్వరో మాసి । యెంతయు లేమిచే నేగుదెంచినది
కమలయో పార్వతీకాంతయో యజునిరమణియో యింద్రునిరాణియో కాక
యిలనున్న కాంతల కీరూపు రేఖ । గలదె యం చెదు రేగి కనకాంగి యపుడు
రావమ్మ మాయమ్మ రతనాలబొమ్మ । యీవేళ నీవేల యిందువచ్చితివి
నీనామ మెయ్యేది నీభర్త యెవ్వఁ । డీసలఁకువ చెంద నేమికారణము
పసపు కాటుక బొట్టు పదివేల సొమ్ములసమాంగి నీవు బ్రాహ్మణకాంత వేమొ
అనియెంచి లోపలి కయ్యంతిఁ దోడు । కొనిపోయి మణిపీఠిఁ గూర్చుండఁబెట్టి
తగుభక్తిఁ గర్పూరతాంబూల మొసఁగ । మగువ యిట్లనియె నోమంజులవాణి
పేరు సుశీల నాప్రియుఁడు దుర్మేధుఁ । డూరిలో దొరలెల్ల నుపచరింపంగ
మనిన విద్యానిధి మా మామగారు । కనకాంగి వచ్చినకార్యంబు వినుము
మా యింటియాయన మగువ!నిన్ దొలుత।బాయకున్నాఁడట బహుదివసములు
నీమీఁదివలపున నిను నేఁడుదలఁచి । కోమలి యీరేయి కూడియుండుటకు
కామించి పనుప నిక్కడికి వచ్చితిని । నా మనవిది విని నామెడ పుస్తె
పైఁడిగాఁగొని పిల్వ ప్రాణేశు, నడువ । లేఁదు నేఁదెచ్చెద లేమ! యిందనిన
నా పతిభక్తికి నాశ్చర్యమంది । బాపురే! నీసాటిపడఁతులు గలరె
కలకాలమును నీమొగంబు చూడకయె । తులువయై తిరిగె నద్దోసి బాపండు
పొలఁతిరో యిపుడు ముప్పుల కెవ్వరైరి । కులకాంత నీవుగల్గుటగదా! బ్రతిక
నెందఱెందఱి కిచ్చె నింటిధనంబు । ముంద రెఱుంగఁ డేమును జెప్పి చెప్పి
వేసరితిమి సుమా! వివులాంగి యింత । గాసిలఁజేసెగాఁ గడపట నిన్ను
నాదోసకారి మోమైనను జూడ । రాదమ్మ ! నీవిందురా వానిఁబిల్వ
సమ్మతించితి నిదిసత్యమ్మ సుమ్ము।కొమ్మ యీరేయి తోడ్కొనిరమ్ము పొమ్ము
మాయింకఁ నీమెడ మంగళసూత్ర । మీయెడఁగొన నంతయెఱుక మాలితి న!
వలవదు పొమ్మని వనిత యావిప్రు । చెలువకు రవికయుఁ జీరయు నిచ్చి
పరిమళద్రవ్యముల్ బాగాలు నిచ్చి । వరుసదప్పక తలవాకిటి దాఁక
తావచ్చి పనిచిన దాన సంతోష।మావహిల్లఁగ నింటికరిఁగి యాత్మేశుఁ
గాంచి యివ్విధమెల్ల నగ్రముగాఁదెలుప।మంచిదంచు నతండు మది నుత్సహించె
వెలయాలిమిన్న యవ్విప్రునిచేత । వలువలు మాళ్లు నవ్వారిగా మున్ను

దోచినదగుట సద్గుణమువహించి । యాచెల్వ చెప్పినయందుల కొప్పె
నంతనిక్కడ సుశీలాంబుజాతాక్షి । కాంతుని తలయంటి కాఁగిననీళ్లు
కాఁగుల నిడి యటకలిఁబెట్టి పుండ్లు । రేగకుండంగ శరీరంబు దోమి
జలము సయ్యన సుఖోష్ణముగఁ దొర్లించి।జలకమారిచి మున్నె సవరగా నుతికి
యెండవేసిన వస్త్రమిడి తడియొత్తి । నిండుతావుల దిశల్ నించు గంధంబు
నల వెలయాలిచ్చినది మేన నలఁది । బలుపుండ్ల నీఁగలు పట్టకుండుటకు
చలువబట్టలు గట్టి శయములఁగ్రుచ్చి । చెలువు నెత్తుకువచ్చి స్థిరభక్తి హెచ్చ
మున్ను వండినయన్నమును గూరగాయ । లన్నెలంతుక వెట్టి యతఁడారగింపఁ
గరములు పాదముల్ గడిగి పానుపున । నిరవొందనిడి విడె మిచ్చి వాఁడనుప
ధవభుక్తశేషంబు తాను భుజించె । రవి యంతఁ జరమాంబురాశిఁ బ్రాపించె
చరమదిక్కామిని సంజకెంజాయ । సిరిదొట్టి కెంబట్టుచీర ధరించె
గాటంబుగా నిశాకాంత ధరించు । కాటుక యనఁగఁ జీకటి దిశల్నించె
బాహుగా గగనవాగ్భామ ధరించు । తారహారములొనా తాగకల్ మించె
బలురాత్రి యగు నీమెపలుక నింకేటి । పొలుపనిన ట్లబ్జములు ముకుళించె
కలకాలమును రాత్రి గాఁగలదనుచు । వలనొందెనన గలువలు వికసించె
జారచోరుల మానసము లుత్సహించె । సారెకు జక్కవల్ జడత వహించె
పతి తన్ను బ్రేరేపఁ బడతి యూరేయి । యతని వీపునఁబూని యంఘ్రిద్వయంబు
కరములమఁదుగా గ్రహియించి మించి । సరగ కేరిమిటారి సదనంబుచేరి
హెచ్చరించిన సైగయెఱిఁగి యచ్చాన । వచ్చితె రమ్మని వాఁడప్పుడున్న
తెఱఁగును మున్నటిస్థితియును దలఁచి । హరహరా యెంత లోనైతి నిలోన
అంటవయో! శ్రీమహాలక్ష్మిలీల । నింటిలోఁ గులకాంత యీమెవర్తిలఁగ
నీభాగ్య మటులుండె నీకేమిగలిగె । లాభంబు గణికాపిలాసంబు వలన
నిచ్చిన రమ్మందు మేమిలేదనిన । పిచ్చలవిడి నిల్లువెడలఁ ద్రోయుదుము
మామీఁది మరులేల మాన మిప్పటికి । నీమేని గవులేంది నీయున్కి యేంది
చాలు లెమ్మనిపల్కి శయ్యపైనతని । యాలు మెల్లనె డించి యవ్వలనున్న
కనకాంగి డగ్గతి కాంకులీడేర్చి । చనుమని పనిచిన శయ్యపైనున్న
పతిని మెల్లన వీపుపైఁ దాల్చి భక్తి । యతిశయిల్లంగ గాంధాంధకారమున

దెఱు వొకించుకతప్పి దిగ్భ్రమఁజెంది । యుఱుగ శ్మశానంబు నందొక్కచోట
ననపరాధినిఁ దలయాఱులు దెచ్చి । కనలువుట్టఁగ ధరాకాంతుతోఁ జెప్పి
వాని బల్‌కొ ర్తిపై వైచుటఁజేసి । ప్రాణాంతవేదనఁ బాల్పడివాఁడు
తనువు వీడఁగనున్నతఱి నవ్వధూటి । తనభ ర్తకాల్ కొ ర్తిదాఁక వేగమున
నరుదేర వాఁడా ర్తుఁడై కొఱ్ఱుదాఁకి । కరకరిఁబెట్టిన కష్టుఁడీ ప్రొద్దు
పొడుచునప్పుడె చచ్చుఁబొమ్మని తిట్టి । విడిచెఁ బ్రాణంబులు వింటివె బోఁటి!
అమ్మాటవిని భూసురాంగన బెదరి । యమ్మ నేఁజెల్ల! మాయాతండు ప్రొద్దు
పొడువఁ జావగనేల! పుడమి వైధవ్య । మడరఁ దానతిదైన్య మందగానేల
యినుఁ డుదయింపక యిదిమొదల్గాఁగ । ఘనతమోవృత నిశాకాల మాగాక
యేను బతివ్రతనేని లోకమున । భానురశ్మిలు గానఁబడ కుండుగాక
అని శాపమిచ్చి యయ్యంగన విభుని।గొని యింటికరిగి యెక్కుడుభ క్తి నతని
పరిచర్యసేయుచుఁ బాయకయుండె । ధరయు దిక్కులు వియ త్తలమును నిండి
కటికచీఁకటి సముత్కటముగా నెర।నటభానుఁ డుదయాద్రియాత్ర చాలించె
కనకాద్రి నపసవ్యగతి గ్రహశ్రేణి । వెనుకముందరలుగా విసువుచుఁ దిరిగె
కాలమర్యాదలు గడతేఱెగనుక । నాలోనఁ జంద్రోదయంబు గాదయ్యె
కమలగర్భుని దినకల్పమో యనఁగ । తమము గ్రమ్మినదని తలఁకిరి సురలు
మునివరుల్ నక్షత్రముల వీధు లరసి । యనువేదియుండుట కచ్చెరుపడిరి
యిట దీర్ఘదశ నొండె యీనిశ ద్దివ । ఘటన మెట్టిదొయని కలఁగిరి నరులు
స్నానసంధ్యావిధుల్ జపహోమనిష్ఠ । లేనలువున ఘటియింత మటంచుఁ
బెకఁ్రుగూడుక పెద్దల నడిగి । రొకఁ్రట బ్రాహ్మణు లూఱార నపుడు
దీపికల్ వెలుఁగఁగా దేశదేశముల । భూపతులడిగిరి బుధుల రావించి
యిది కాళరాత్రి యీనేని లోకముల । నుదధులేటికి ముంచకున్న వటంచు
ద్వీపాంతరముల వ ర్తిలు పెద్దలాడి । రాపట్లఁ జెలరేగియాడె భూతములు
వసుధఁ బిశాచముల్ వ్యాపించు ననుచు । మసలక రుద్రుండు మసనముల్గాఁ జె
చంద్రసూర్యాదులు సకలసంయములు । నింద్రాదిదేవత లెల్లదిక్పతులు
నిదియేమి యుత్పాత మిపుడుధాతకును । నిదురపట్టినదో!యన్వేషింత మనుచు
నందఱు గుమిగూడి యరిగి కొల్వున్న । బృందారకజ్యేష్ఠు పృథుయోగనిష్ఠు

కరుణాగరిష్ఠు సత్కాంతివరిష్ఠు । పరమేష్ఠిఁ గాంచి సద్భక్తి సేవించి
కరములుమొగిచి గద్గదకంఠు లగుచు । పరిపరివిధములఁ బ్రస్తుతుల్ చేసి
యో మృదూక్తిసనాథ! యోలోకనాథ । యీ మహానిశపుట్ట నేమికారణము
రవిచంద్రులకుఁదీఱె రాకయుఁబోక । యవని గాఢాంధకారావృత మయ్యె
హవదీక్షు లుడిగె బ్రాహ్మణనిష్ఠ లణఁగె।హవిరంశములు లేక యడలుచున్నాము
విపరీత మిదియేమి వివరింపవలయు । గృపనన్న రాయంచనెక్కి పద్మజుఁడు
కైలాసమునకేఁగి గరళకంధరున । కా లాగెతింగింప నతఁడును వెంట
గిబ్బత్తడి దుమికింపుచు రాఁగ । లిబ్బిగుబ్బెతఁ గౌఁగిలించి యేవేళ
వదలని తమిఁజొక్కు వైకుంఠవాసుఁ । గదిసి బ్రమొక్కి యిదేమి కటికచీఁకటులు
గ్రమ్మిన తెఱఁగన్న గలకల నవ్వి । యమ్మికుందుఁడుపల్కె నజరుద్రులార
పరమపతివ్రతాభరణ మొక్కరిత । వరు ప్రాణహాని యౌర్వక భానుఁడెపుడు
నరు దేరకుండుగాకని శాపమిచ్చె । నొరు లెఱుంగరు దీని నొకకొన్ని యేండ్లు
క్రమియించె నిఁక జాగు గావింపఁజనదు । ప్రమదాశిరోమణిపాలి కందఱము
పోద మిప్పుడెయని భోరునఁ గమల । కైదండ యియ్యగా బ్రక్కునలేచి
యాదండనున్న ఖగాధ్యక్షు నెక్కి । వేదండవరదుఁ డవ్వేల్పులఁ గూడి
మణిమతీపట్టణమహిఁ జేరి యువతి । మణి సుశీల వసించు మందిరాంగణము
ప్రాపించి యోపతివ్రతలమేల్బంతి । నీపాలి కిదెనేఁడు నిఖలదేవతలు
సకలమునీశ్వరుల్ చనుదెంచినారు । శుకవాణి మొగమెత్తి చూడరావమ్మ!
హరినేను హరుఁడితం డతఁడుపద్మజుఁడు।సురరాజితఁడు వారుసురలు సన్మునులు
వాఁకిట నిదె యున్నవార మటన్న । నాక్షాంత భయభక్తు లమర వే లేచి
పతి యనుజ్ఞను వారిపాలికి నేఁగి । నతులుపెక్కు లొనర్చి నయనాంబుజముల
సమ్మదాశ్రులుజాఱ శయములు మొగిచి । యమ్మహామహుల నిట్లని వినుతించె
హరికి దోషమదేభహరికి దయాల । హరికి నీకుఁ బ్రణామమయ్య ! లక్ష్మీశ
భవునకు వితతవై భవునకు విగత । భవునకు నీకిదెప్రణతి గౌరీశ
సురరాజ నిర్జితాసురరాజ! శరణు । సురలార కీర్తిభాసురులార! వినుతి
నను పెద్దఁజేసి యిందఱు నిందువచ్చి । కనుదోయివిందుగాఁ గనుపించినారు
మిముగూర్చి తొల్లి యేమితపంబు జేసి । తిమొ దంపతులమేము స్థిరతేజులార

బహురోగముల బాధపడి లేవ లేక।గృహి యింటనున్నాఁడు గృపచూడరయ్య!
నా మొఱి వినరయ్య ! ననుగావరయ్య।నామీఁదఁ గరుణచిందఁగఁ జూడరయ్య
అనిమ్రొక్కి ప్రార్థించు నమ్మహాసాధ్వి । గనుగొని హరిహరకమలజు లనిరి
అక్కరో! సూర్యోదయము గాకయుండ । నిక్కివడి శపింతుఁ ! యెవ్వరైన
త్రిభువనముల గాఢతిమిరంబు గప్పె । సభయులై రి మహానిశాప్రాప్తి జనులు
కర్మనిష్ఠలుజాఱె క్రతువులుదీఱె । ధర్మమా ! నీకివ్విధం బాచరింప
నినుఁ దుదయింప సెల్వీఁక నీఁగదమ్మ । యనిమిషానుల కభయ మొసంగవమ్మ!
యనినఁ గ్రమ్మఱ మ్రొక్కి యక్కొమ్మపలికె।ఘనులార! నేనూరక శపింపలేదు
తన యున్నకొర్తి నాధవు నంఘ్రిదాఁకె । నని తెల్లవారినయపుడె యీజనుఁడు
కడతేఱునని శూలగతుఁడాడఁ బ్రొద్దు । పొడువకుండెడుమని పూని నేనంటి
పతిప్రాణములు పెడఁబాసి నేనెటుల । బ్రతుకుదు విధవనై భవ్యాత్మలార !
కొఱితిఁ గూలినవాని కుటిలశాపోక్తి । పరిహరించి మదీయపరితాప మడఁచి
నానాథు నాయురున్నతుఁజేసి ప్రాణ । హాని పొందకయుండునట్లుగా మీరు
వర మొసంగిన వివస్వంతుండు పొడము । పరమార్థమిదియన బ్రహ్మాదు లలరి
యీ పతివ్రతఁజూచి యని రోపురంధ్రి! । నీపతి శూలాగ్రనిహతు శాపమునఁ
దపనుండు తోఁచినంతనె ప్రాణమెడలి । యపుడె లేచి సమున్న తాయురారోగ్య
శాలియై నిజబంధుసజ్జనాంభోజ । హేళియై పరలోకహితపుణ్యకర్మ
పాళియై యాచారపరతంత్రవిప్ర । మూళియై విహితధర్మంబులు విడక
వైదికాచారప్రవర్ధనుండగుచు । నా దేవఋషిపిత్యాదులు దీర్చి
కులకాంతవగు నిన్ను గూడి సత్పుత్ర । కులఁ గాంచి యాగముల్ కొన్నిగ్గావించి
వెలయాంధ్రతమిని గావించిన కలుష । ములను బశ్చాత్తాపమున నివారించి
కలిమియు భోగభాగ్యంబులు గలిగి । చెలువరో ! దేశప్రసిద్ధుఁడై వెలయు
నీకతంబున గుణాన్వితుఁడై తనర్చె । నీకతంబున ధర్మనిష్ఠుఁడై వెలసె
పడఁతి సౌశీల్యసంపద నీవుఁబతియు । గడపట బ్రహ్మలోకంబు జేరెదరు
అనిన సంతోషించి యప్పుణ్యసాధ్వి । యినుఁడిప్పుడే యుదయించుఁగా కనియె
అనినంత నుదయాద్రియను రాజు మూళిఁ । గనుపట్టు పద్మరాగకిరీట మనఁగ
రోదోంతరమునఁ గారొక్కను తమఃపటలి । భేదించి పద్మినీబృందంబునకును

నామోద మొదవించి యుక్కుండు పొడమె।భూమివారలకు నింపును సొంపెసంగ
నప్పతివ్రతమూఁద నలరులు గురిసి । రప్పుడుప్పొంగుచు నఖలదేవతలు
నావేళ బ్రాహ్మణుం డపగతప్రాణుఁడై వసుంధరవ్రాలి యమ్మహార్తమున
దేవతానుగ్రహదృష్టిచే బ్రతికి । కేవలదేహావస్థ్లేశము ల్వాసి
మునుపటికంటె సంపూర్ణప్రకాశ । మును శాంతిదాంతులు బుద్ధివై ఖరులు
గలిగి వేల్పులయంతికమునకు వచ్చి । పులకితగాత్రుఁడై భూమిపై వ్రాలి
అమితసాష్టాంగమ్ము లపుడాచరించి । సమధికభక్తి నంజలిచేసి పలికె
కమలామనోహరం కమలాయతాక్షు । మమృతస్వరూపిణ మహా మాశ్రయామి
శమనగర్వాపహాం చంద్రార్ధజూట । మమలమహేశ మహాం భావయామి
భారతీవల్లభం పద్మాసనస్థ । మారూఢతేజస మనిశం భజామి
యని ప్రస్తుతించిన నతని సుమేధుఁ । డని పిల్చి తద్భార్య నపుడు కీర్తించి
యెనలేని సిరులతో నిలమూఁద వెలయుఁ।డని యదృశ్యతఁజెంది రమ్మహామహులు
వార లేగినతరువాత నాద్విజుఁడు । తారుణ్యవతియైన తనభార్యఁ బొగడి
యత్యనురక్తుఁడై యామెతోఁగూడి । నిత్యకర్మంబును నిష్ఠఁదీర్చుచును
అష్టపుత్రులఁగాంచి యజ్ఞముల్ చేసి । శిష్టవర్తనలతో సిరులొంది వెలసె
నీసుశీలాఖ్యాన మెంతేనిభక్తి । వ్రాసినఁ జదివిన వరుసతో వినిన
వారికి సకలదేవతల కారుణ్య । గౌరవంబునఁ గల్గు కామితార్థములు
అని కీరతనుధారి యగు మహామాత్య । జనమూళి పుష్పమంజరి కెఱింగింపఁ
గీరమా! నీవుపల్కిన పల్కులెల్ల । సారంబులివి సుధాసారంబు లనుచుఁ
బొగడుచు నింటికిఁబోయె నవ్వెలఁది । జగతీశుదూతియుఁ జనె నగరికిని
అని శంభుఁడెఱిఁగింప నవ్వలికథలు । వినిపింపుమని గౌరి వేడ్కతో నడిగె
సారపతివ్రతాచరితంబునం దు । దారమై యెన్మిదియవకథ వెలసె
అని శౌనకాదిమహామునీంద్రులకు । వినిపించె సూతుండు విఖ్యాతలీల

మానవతి కథ

శ్రీవిశ్వపతి సమంచితమతి గారి । కావలికథ యిట్టులని తెల్పఁదొడఁగె
దూతికాహూత యగు తొయ్యలిఁ జూచి । యాతఱవాతఁ గీరాగ్రణి పలికె
పతులును సుతులును భ్రాతలు హితులు । సతుల మానముగావ శక్తులుగాఱ
తమ యభిమానంబు తామె కాచికొను । రమణులెపో పతివ్రత లిజ్జగమున
నిందులకొకకథ యేర్పడియున్న । దిందుముఖిమణి యెఱిఁగింతు వినుము
మాహురీపురమున మణికేతుఁడనెడి । సాహసోదగ్రుండు జనపతి గలఁడు
ఆనరేంద్రునకు దైవానుగ్రహమున । మానధనుండన్ కుమారుండు పొడమె
నతఁడింతయై యంతయై వృద్ధిఁబొంది । చతురవిద్యాభ్యాసశాలియై వెలసె
పుత్రుని యౌవనాభ్యుదయంబుఁ జూచి । ధాత్రీశుఁ డతని కుద్వాహంబుసేయ
సమకట్టి బంధురాజన్యకన్యకల । నమరింప ముదుసళ్ల నంపెడుచోటఁ
దనమాన మేతలోదరి తానెకాచి । కొను దానిగాని తక్కువెలందిఁ బెండ్లి
యాడ నొల్లనటన్న నాత్మజుఁజూచి । తోడిబాంధవులు మంత్రులువినఁ దండ్రి
పలికె నిదెక్కడిపల్కు పల్కెదవు । లలన మానంబు వల్ల భుఁడేఁదుగాక
తనమాన మెటువలెఁ దాను గాచికొను । వనిత, యిందులకునవ్వరె! యెవ్వరేని
అనవిని యటువంటియతివ లేకున్న । మనుజేశ యప్పెండ్లిమానుట మేలు
నిల నిట్టిసతి గలదేమొ నే వెదకి । తెలిసి వచ్చెద సమ్మతించి మీరిపుడు
అనుమతి యిచ్చిననని పుత్రుఁడనిన । జనకుఁడువిని మహాసంతోషమాయె
నీవెంటవచ్చు మంత్రిసుతుండు తగిన । శీవితో విభవపట్టిష్ఠుండ వగుచుఁ
జని నీవు దేశదేశంబుల నరయు । మని పీడుకొల్పిన నమ్మానధనుఁడు
ఆయాన్నృపాల సభాంతరమ్ములకుఁ । బోయి యమ్మాటదెల్పుటయును నగుచుఁ
దనమాన మెంతైనఁ దానెకాపాడు।కొను కాంతగలదె! యెక్కడుశక్తి మగఁడు
పగలునురేలు కాపాడకయున్న । మగువకు మాన మేమర్యాద నిలుచు
నటువంటి రాజకన్యక గానమిచట । నెటకైనఁజని కల్లెనేని శోధించి
పరిణయంబగుమని పలికిరి రాజ । వరులు కొందఱిదేమి వార్తలాడెదరు
కులము రూపును మంచిగుణమును గలుగు । నలివేణి వెదకి పెండ్లాడి పోరాదె
అని కొందఱాడి రిట్లఖిలదేశముల । జననాథులాడ వేసటలేక యతఁడు

వివిధదేశాధీశవితతుల నడిగి । యవల సౌరాష్ట్రరాజ్యమునఁ జెన్నొందు
భువనమోహనమను పురము ప్రాపించి । జవనాశ్వుఁడనురాజు సభఁజేరి యతని
చేతఁ బూజలుగొని స్థిరబుద్ధి మంత్రి । ప్రీతి మీకన్య నపేక్షించి యిటకు
మా రాజపుత్రుఁ డీమానధనుండు । చేరవచ్చెనటంచుఁ జెప్పినందులకు
ననురూపముగఁ దనయభిమాన మేఁది । కొను కన్యకామణిఁ గోరి వచ్చితిని
అని తానుదెల్పిన నారాజవరుఁడు । తనకన్నెయున్న యంతఃపురంబునకు
దగువారిఁ బంచినఁ దద్వచనములు । మగువకు దెల్పి రమ్మగువ హర్షించి
కామినిమాన మొకఁడు గావఁగలఁడె।యీమాట యతిసూక్ష్మ మెఱుఁగువారలకు
నేనెఱో నామాన మేలెడిదాన । నీనుడి తెలుపుడా నృపకుమారునకు
అని చెప్పిపంచిన నమ్మాట మాన । ధనునితోఁ దెల్పిరి తండ్రియు వినఁగ
వనితనామము మానవతీయని తెలిసి । కొనుట నక్రూతానుకూల్యంబు లరసి
పరిణయలగ్న మేర్పాటుచేసికొని । మరల రాజసుతుండు మాహురీపురికి
చనుదెంచి హితబంధుసచివా ప్తయు క్తి।జనకుఁ దోడ్కొనివచ్చి సకలోత్సవముల
మానవతీవధూమణిఁ బెండ్లి యాడి । యానాల్గుదివసంబు లరిగినపిదప
కారాదు స్త్రీసమాగమ మాఱునెలలు । దీఱిక యొకవ్రతస్థితి యిదియునుచు
మామగారికిఁదెల్పి మణికేతుతోడ । నామానధనుఁడేఁగె నాత్మీయపురికి
నరణమ్మ్నగొన కిట్టులరిగి యేడాది । జరిగినపిమ్మట జనకుననుజ్ఞ
పడఁతిఁదోడ్కొనియి దెపర తెంతుననుచు। నొడివిమిత్రా ప్తసందోహంబుగొలువ
సౌరాష్ట్రదేశంబు సరగునఁజేరి । వారల నొకచోట వసియింపఁ బనిచి
నవరత్నఖచితకుండలములు చెవుల । సవురొంద నిటలదేశమునఁ జూపట్టు
పట్టివర్ధనముపైఁ బట్టెడఱుతలు । పెట్టి జన్నిదములు పిడికెడుపూని
వలిప నీర్కావిధోవతి పింజపట్టి । తళుకుటంచులు ప్రపదములానఁ గట్టి
సరిగకుళ్లాయిమ స్తమున ధరించి । సరిలేనిహొంబట్టు శాలువుగప్పి
ఘన విద్వదాకారగరిమ శోభిల్లఁ । దనచంక నొక్కపు స్తకము వహించి
బ్రహ్మవర్చస ముట్టిపడ నేగుదెంచి । బ్రహ్మయో యితఁడని పౌరులీక్షింప
నీరీతి ద్విజరూపమేపార మామ । గారి పురోహితాగ్రణియింటి కరిగి
యతనికి భ క్తి సాష్టాంగం బొనర్చి । యతనిచేఁ బూజితుఁడై యర్ఘ్యభంగి

ననియె మహాత్మ యార్యావర్తదేశ । ముననుండి వచ్చితి మురహరిశర్మ
నాపేరు చదివికొన్నాఁడ శ్రుతుల్ మ । హాపురాణజ్ఞుండ నదిగాక శాస్త్ర
వైదుషిగలదు కేవలతీర్థవాంఛ । నీదిక్కు-నను జరియించి మాపురికిఁ
జనఁ ద్రోవగనక యిచ్చటికి వచ్చితిమి । యనిన రాజపురోహితాగ్రణి పలికె
శ్రమము దీఱంగ సత్రాణించికొనుఁడు।మము గృతార్థులసేయ మాగృహంబునకు
నేతెంచితిరి కదా యిటభక్తి సలిపి । స్నాతలేంద్రునిఁ జూడ మాపటివేళ
అందాఁకఁ జనుదెంచి యాశీర్వదించి । సందీప్తశాస్త్రప్రసంగంబు గొంత
గావించి యతనిసత్కారంబు వడసి । పోవలెనన మంచిబుద్ధి మీరేమి
యానతిచ్చిన నట్టులాచరింతు నని । యానృపతనయుఁ డాయన నివాసమున
నాఁడు మజ్జనభోజనము లొనరించి । నాడేలు రాజుచెంతకు మాపటింత
నాసాధుమతితోడ నరిగి వైఁబసపు । పూసిన కొంకాయఁబూని సమీప
గతుఁడైన నారాజుకనుగొని లేచి । యతిభక్తి నమ్రుఁడై యర్ఘాసనమున
నివసింపఁజేసిన నెమ్మివసించి । వివిధపూజలుగొని వేదమంత్రములు
ననువొందఁ బఠియించి యాశీర్వదించి । తనచేతికొంకాయ తదువాత నిచ్చి
సంగతోక్తులు సొంపొసంగ శాస్త్రప్ర । సంగంబు గావింపఁ జాల హర్షించి
యల్లుఁడౌటుఁగక యతఁడు మనీషి । వల్లభుండనియెంచి వసుధేశ్వరుండు
శతని నామము దేశ మల్లపురోథ । యతనిచేఁ దావిని నల్లెటింగింప
భాగ్యమాయె మఱేమి బ్రాహ్మణప్రవర।యోగ్యుఁడవదిగాకయుక్తిమంతుఁడవు
రవితేజ! భారతరామాయణములు । వివిధపురాణముల్ విన నిచ్చఁగలదు
మీచేత వినియెద మీరిందునిలిచి । వాచాలకతఁ దెల్పవలెనని వేఁడి
ధనవస్త్రభూషణోత్కరము లర్పింపఁ।గొని సమ్మతించి యక్కుహనాద్విజుండు
తన భార్యచిత్తంబు తాను శోధించు । పని కర్ణము పురాణపఠనం బటించు
మంచిలగ్నంబున మఱునాఁడె యుత్స।హించి రామాయణంబెలమిఁ దెల్పుటకు
వూని ప్రసంగింప భూపాలునాజ్ఞ । మానవతీకాంత మాతయుఁ జెలులు
తాను నవ్వలనుండి తగుభక్తి వినఁగ । నానాఁటి కాతఁడన్నగరి లోపలికి
పోవుచు వచ్చుచుఁ బొలఁతులు పూజ । గావింప వింత లేక చరింపుచుండె
నంతఃపురమున నిట్లతఁడు పురాణ । మెంతయుఁ బ్రౌఢిమ నెఱిఁగింపుచున్న

కొన్నిమాసముల కక్కువలయాధీశుఁ । డున్నప్రోలికిని మనోత్కటుండనెడు
నతని మేనల్లుఁ డుద్యదనేకసైన్య । యుతుఁడయి దిక్కులనున్న భూవిభుల
బలిమినిర్జించి కప్పములుగ్రహించి । యల మేనమామకన్యను మానవతిని
పరిణయంబగు వాంఛ భరియించి వచ్చి । పుర బాహ్యాగత వనభూమిని విడిసి
జవనాశ్వాచెంతకు సచివునిఁబంప । భువనమోహనపురంబున కాతఁ డరిగి
పేరోలగంబున్న పృథివీశుఁ జేరి । యారాజు మన్ననలంది సొంపొంది
యుచితాసనమునఁ గూర్చుండి యిట్లనియె।ప్రచురవిక్రముఁడు మీ భాగినేయుండు
అల మనోత్కటుఁడు నానావనీశ్వరుల । గెలిచి దిగ్భాసితకీర్తిచేఁ బొలిచి
మానవతీకన్య మమతఁ బెండ్లాడ । గానెంచి మీసముఖమునకు నన్ను
బనిచె మేనల్లుండు పటుబలాధికుఁడు । ఘనవాహభోగభాగ్యధురంధరుడు
అతనికంటె సమర్థుఁ డర్హుఁడౌనట్టి । పతి గలండోటు! నీబాలిక కనినఁ
జిఱునవ్వునవ్వి మాక్షితినాథుఁ డనియె । నెఱుగరో నాపుత్రి నేడాదినాఁడె
మానధనుండను మహినాథసుతున । కేనిచ్చి పెండ్లి సేయించిన తెఱఁగు
పరిణయంబైయున్న బాలిక మరలఁ । బరిణయార్థము వేఁడు బాంధవుల్ గలరె
తనకు గావలసినఁ దానల్లనాఁడె । నను బల్కరించి కన్యకఁ బెండ్లియాడి
పోవలదంటినె! పొలఁతులు తనకు । వేవేలుగలరు మున్ వెలఁది నిమ్మనుచు
నడిగించెనే యెన్నఁడైన నిదేమి । కడపగ్రమింగిన కళ్లకుఁ జవులు
వేఁడునే యెటువంటి వెఱ్ఱివాఁడైన । నేఁడేటిచింత మీనృపశిఖామణికి
నీ కార్య మెఱిఁగించి యిటకుఁదో డ్తెమ్మ్ని । రాక దవ్వుల లాఁతిరాజు చందమున
పుర బాహ్యమున వసింపుట పాడియగునె! । యరమరసేతురే యని మంత్రిమణికి
గంధమాల్యాదు లొక్కటనిచ్చి నీతి । బంధుఁడన్ మంత్రి వెంబడి ననుపుటయు
నతనిఁగూడి మనోత్కటామాత్యవరుఁడు । చతురోక్తి జవనాశ్వజనపాలమౌళి
పలికినపలుకు లేర్పడఁదెల్ప నాతఁ । డలిగి నాయెఱుకలే కన్యభూపతికి
గన్నె నేగతినిచ్చెఁ గలిమియు బలిమి।యెన్నఁడయ్యెను మామ యిదియెట్టులోర్తు
నవమతిచేసె న న్నతనిప్రో లతని । భవనంబు ముట్టుకోల్పట్టి రాజ్యంబు
గైకొన కేనూరకయ యేలపోదు । నీ కార్య మెఱిఁగింపు మీవని పలుక
జవనాశ్వభూపాలు సచివుఁ డిట్లనియె । సవినయోక్తుల నీభుజాశౌర్యమహిమ

మామపైఁజూపుట మర్యాదయగునె । ధీమంతుఁడవు నీకుఁ దెలియనిదొకటి
యున్నదె! సైరింపుమోయన్న యొక్క । కన్నియకొరకింత ఘాత సేయుదురె
యిన్ననాళ్లాయె నీ వీకన్నె నొసఁగు । మన్నది గలదె? నేఁడాత్మ నిదేమొ
యొకచింతపొడమి తెంపూన నెంచెదవు । వికటభావము మాని వీటికి వచ్చి
యత్తమామలఁగని యందుండి వారి । చిత్తంబు లలరించి సిరులుప్పతిల్ల
బహుమానములుగాంచిపఱతెంతుగాక। మహినాథ!యనిపెక్కుమాటలుదెలుప
నవివిని సైపక యుతని గద్దించి । యవివేకమతిగాన నవలఁ ద్రోయించి
శక లాటఘోటఘూర్జర సింధురాజ । నికరంబు వినఁబల్కె నేటరేపటనె
జవనాశ్వ పురము రాజ్యము గొనవలయు। జవనాశ్వకరిరథసహితుఁడై మీరు
కోట నల్లడల వంకుల నానికొనుఁడు । చేటుపాటొందుఁగఁ డీక్షితిపతి యనుచు
దారుణనిస్వానధణధణంధణమ । హారావములు మద్దళావళిజనిత
తతధింధిమింధిమిధ్వానముల్ శంఖ । శతకభుంభుంభూంప్రచండఘోషములు
కేతనపటపటాత్కృతులు తురంగ । జాత హేషలు మదస్తంబేరమోగ్ర
చటులఘీంకారముల్ స్యందనస్ఫురిత । పటుఘంటికార్భటుల్ భటసింహనాద
పటలంబు బ్రహ్మాండభాండమ్ము నిండ । నటఁ గోటనలుగడ లాక్రమించుటయు
నామూర్ఖ వృత్తాంత మంతయు మంత్రి । చే మన్నువిని కొంతచింత వహించి
జవనాశ్వమేదినీశ్వరుఁ డాప్తబంధు । నివహంబుగూడి దీని కుపాయమేమి
కఠినచిత్తుఁడు మదోత్కటుఁ డాప్తులెల్ల। శఠులు మహోచమూసమితితోఁగూడి
బహుదేశముల దొరల్ పఱతెంచినారు । గహనంబు వారితోఁ గలహింప మనకు
నుచితోక్తి వేఁడిన నూకొనఁ డతఁడు । కుచరితుం డిఁకనేమొకో యనుచున్న
వేళ వేఱొకదూత వెసఁబిల్చి మామ । పాలికిఁ బనిచె నప్పురుషవర్తనుఁడు
పనిచిన జవనాశ్వపాలికి వచ్చి । యనియె దూతమనుష్యుఁ డవనీశ! వినుము
మేనల్లునకును గూర్మికుమార్తె నిచ్చి । తేని కోపముమాని యాక్షణంబునసె
సేనలఁ దివియఁబంచి స్వదేశమునకు । దాను బోయెద నిది తథ్యం బటంచు
దెలుపుచున్నాఁడిది స్థిరబుద్ధిఁ దలఁచి । పలుకు మిమ్మాటకుఁ బ్రత్యుత్తరంబు
నావిని సభికులంద ఱిదేటిమాట । లీ వసుంధర విన మిట్టిదురుక్తి
యొకనిఁ బెండ్లాడినయుత్పలగంధి । నకట! గోరెడు దుర్మదాంధులు గలరె

పరిణయశ్రీగన్న బాలిక నెటుల । ధరణీశ్వరుఁడొసంగుఁ దానెట్లు లెనయు
నని పెక్కువిధముల నందఱుఁబలుక । విని దూతఁగని ధరావిభుఁ డిట్టులనియే
గారానిపనిఁబూని కఱకులుపలుక । నీరానివస్తువు లిచ్చుటయెట్లు?
పరకాంతగోరిన పాపవర్తనుఁడు । దురములో విజయమొందుట దుర్లభంబు
నెఱుఁగనయ్యెడి నిఁక నేల రేపటికి । నరుణోదయమువేళ ననికి వచ్చెదము
ఇమ్మాట మీదొర కెఱిఁగింపుమనుచు । నమ్మహీశుఁడు భూషణాదులొసంగి
దూత నంపించె నద్దూతచే నతఁడు । మాతులు నుడివిని మసలక యుండె
నాఁటి మాపటిపూట నరనాథపుత్రి । పాటి యెఱుంగని బావ దుర్నయము
వాని రాయిడికి నోర్వని తండ్రికలఁక । తా నదివిని యేకతంబున నున్న
జనకునిపాలికిఁ జనిమ్రొక్కి యతని । యనుమతి శయ్యచెంతను గూరుచుండి
నానిమిత్తంబున నరనాథచంద్ర । యీనెగులొదవె మీకిందులకేల
వనటఁజెందెద రొకవంచనోపాయ । మున మదోత్కటుగర్వము హరించుదాన
నాపనికై మురహరిభట్లఁ గొంత । సేపు నాచెంత వసించునట్లుగను
సెలవియ్యవలయు నాసేయు కార్యంబు । తెలిసెద రవల సందియమేల యనిన
నమ్మ! కానిమ్మని యప్పురాణజ్ఞు । సమ్మతిఁ బిలిసించి స్వామివారింత
తడవు నాపుత్రిచెంత వసింపుఁడనుచు । కడఁగి ప్రార్థించినఁ గానిమ్మటంచు
నాపద్మనయనతో నంతఃపురంబు । లోపలికరిగి తళ్కుకడాని పసిఁడి
గద్దియనున్న యాఘునుని చెంగటికి । ముద్దియవచ్చి కేల్మొగిచి యిట్లనియె
సద్యఃప్రసన్నతాసన్నస్వభావ! । విద్యానిధాన! నావిన్నపం బొకటి
యాలకింపఁగ వలె నల మదోత్కటుని । పాశంబునకు మీరుపయనమ్మె కదలి
యీరవ్వకాని నేకాంతంబునందుఁ । జేరి యీరేయి నచ్చిగురాకుబోణి
నినుగూడి వర్తించు నీవింకు నిలక । చనవలె మఱునాఁడె సైన్యమ్ముతోడఁ
బరకాంతనగుట నీపని రహస్యముగ । నెఱిఁగింపఁబంచితి నిది మనంబునకు
సమ్మతంబైన నిశావేళ వత్తు । నమ్మికయిమ్ము దుర్నయము సేయుఁనని
యిమ్మాట యెవ్వరి కెఱిఁగింపవలదు । నెమ్మదినిడుమని నేఁబల్కినట్టి
పలుకులుగాఁ బల్కి భాషాప్రమాణములుగొని యతివేగమునను రావలయుఁ
బనిపంపె నీరాచపడుచని కోప । మునుపకుండెడిదని యుపచరించుటయు

మనసు కలుక్కన మాయాద్విజుండు । వనితల నమ్మగావచ్చునే యకట
తనమాన మెప్పుడు దాఁగాచికొందు । ననియె సత్యంబేడ దన్నతోదరులకు
నిది జంతయననేల యిప్పుడిక్కయెల్లఁదుదముట్టఁగని మీఁదఁదోఁచిన యటుల
నాచరించెదనని యయ్యింతిమోము । చూచి యాదంభభూసురుఁ డిట్టులనియె
మంచియుపాయమ్ము మదిఁదలంచితివి । కాంచనగాత్రి ! యీక్రమమునఁ గాని
యీ డెప్పరముదీఱ దీమాటవిన్న । నీడేరెఁ దనకోర్కలెల్ల నటంచు
కామాంధుఁడగుమదోత్కటుఁడు హర్షించు।నేమినమ్మక మిప్పుడిమ్మన్న నిచ్చు
వానిచెంతకుఁ బోయినచ్చెద ననుచు । దాని వీడ్కొని వేషధారి రాసుఁతుడు
తటుకున నమ్మదోత్కటుదనుఁ జేరి।పటకుటీరంబులో బహున్నపుల్ గొలువఁ
గొలువున్నవానిఁ గన్గొని రెండుజంభ । ఫలము లాశీర్వాదపరిణతి నొసఁగి
దగ్గఱి కురుజవంట యతండు సూప । నగ్గురుమతిశాలి యందుఁ గూర్చుండి
మనుజేశ! మీమేనమామగారింట । చనవుమీఱఁ బురాణసంహిత లెల్ల
దినమును వినిపించు ద్విజుఁడ మాటాడఁ । బనిగలదు రహస్యపద్ధతి ననిన
నక్కటా నాద్విజన్మాగ్రణితోడ । గ్రక్కున నొక్కయేకాంత దేశంబు
చేరి యేమానతిచ్చెద రానతిండు । ధారణీసురకులోత్తమ! యన్న నతఁడు
మానవతీకాంత మాటలుదెలుప । నానందమంది వాఁడంతియచాలు
నొకయింతసేపు నాయొద్దఁగూర్చుండి । సకి ముచ్చటాడిన సకలసైన్యములఁ
దివియించి రేపె నాదేశంబుఁ జేర । నవనీసురోత్తమ! యరిగెద నిజము
నాగురువులయాన నాతండ్రి తోడు । వేగమ్మెతోడ్తమ్ము వివలాంగి ననుచు
బాసలుపెక్కులు పచరించి కత్తి । వేసిదాఁటిన హర్ష వివశాత్ముఁడగుచు
పడకింకి విరివల్లెపాన్పున నొంటి । నుడిగంబు లెవ్వరినుండగానీక
యలబలం బడచి యేకాంతభావమున । నిలువుమచ్చెలి నహర్నిశఁ దోడితెత్తు
నీకోర్కెలీడేరు నేఁడని పల్క । యాకించొసంగు రత్నాంబరాభరణ
గంధమాల్యాదులు గైకొనివచ్చి । సింధురయాన కాస్థితియెల్లఁ దెలిపె
తనపోఁగునకుఁజిక్క దర్పాంధుఁడనుచు।గనకాంగి యలరి యాఘనునితోఁబలికె
నేఁడు ప్రాల్మాలక నిద్దురమాని । వాఁడున్నయెడకు దేవరవారు నన్ను
దోడ్కొనిపోయి యంచులవింతలెల్ల । వేడ్కతోఁజూచి నావెంబడి మరల

రావలెనంచుఁ బ్రార్థనచేసి మసల । కావేళ జలకంబులాడి క్రొంజిలుగు
చలువవల్వ ధరించి సముచితాభరణములు దాల్చి యంతకమున్నె యేర్పఱిచి
లాహిరివస్తువు ల్బలువుగాఁ గూర్చి । దేహంబు మఱపించు తియ్యనిమదిర
నిండారఁ బసిఁడిగిండిని నించి మూసియుండుట నదివేఁతె యొకచే గ్రహించి
కపటభూసురు వెనుకనె పోయి పాళె । మఱుడు ప్రవేశించి యల మేనబావ
పడకిల్లుఁ జొచ్చినఁ బరితోషమంది । వెడవింటిమన్నీఁడు విరితూఁపు లేయఁ
గడుసొమ్మసిలిదాని గబ్బిపాలిండ్లు!నొడలిక్రొమ్మెఱుఁగులు నుదుటుచూపులును
దిలకించి పులకించి తెలిగంటికోర్కె । ఫలియించె నీవిందుఁ బఱతెంచినంత
రమ్మని కపటవిప్రసమేతయైన । యమ్మానవతిఁ జేరనరుదేర నగుచు
బావ! నీవెప్పటిపాన్పున నుండు । మీవిప్రవరునితో నిప్పీటలందు
నేము గూర్చుండెద మించుకసేపు । నీమదితమకమ్ము నిలిపికొమ్మనుచుఁ
బ్రేమగన్పడ నాడి పెండ్లాడియున్న । కోమలి నియ్యక కూడవటంచు
మామపై దండెత్తు మహిపతుల్ గలరె! । యేమనవచ్చు నీయెఱుక యటంచు
దగునేఱుపునఁ గొన్ని తచ్చనలాడి । వగకాఁడవౌదు బావా! భోజనంబు
చేసితివే! దప్పిచెందితి వేమొ । భాసిల్లు చక్కెరపానకం బిదిగొ
యనువొందఁబుచ్చికొమ్మనిగిండియొసఁగ । గొని యమ్మదాంధుఁడుకుత్తుకమోవఁ
ద్రావె నమ్మదిర యంతయు నిమిషమున । నావేళ నిదురమం పావహిల్లుటయు
లాహిరిఁ జొక్కి మొల్లలశయ్య వ్రాలె।మోహంబు తలకెక్కి మూర్ఛిల్లినటుల
నీవింతఁ జూచితిరే! మహీదేవ । తావకీన్య యటంచుఁ దరుణి నవ్వుచును
నొడలెఱుంగక పడియున్న యజ్జడుని । కడకేఁగి తలయంపి గనుపింప నంప
పొది కత్తివాతియమ్ము బరీనఁ దిగిచి । కొదకక మీసముల్ గొప్పగడ్డమ్ము
తలయు రేవులువాఱఁ దడయకగొరిగి । సొలవక మసిబొట్లు సున్నంపుబొట్లు
మొగమునఁనిడి వీనిమూర్ఖత కిట్టి । వగ సేయవలెనుమీ! వసుధామరేంద్ర!
ముగిసె మీసలు గడ్డము వికారమయ్యె । సిగపోయె నికవీఁడు క్షితిపతి ననుచు
నలుగురిలోనున్న నగుబాటుగాదె । తెలతెలవార నిద్దేశమ్ము విడిచి
యేకాకివైపోవు నెక్కడికేని । నీకడ నిలనేల యేగుదెంచ్ఛనుచు
మహిసురాకృతినున్న మగనిఁ దోడుకొని । రహిమీఱ నప్పతివ్రత యింటికరిగె

దాని పతివ్రతాధర్మంబు చూచి । మానధనుండు సమ్మదవార్ధిఁ దేలె
తెలతెలవారఁగా దేహంబు తెలిసి । యల మదాంధుఁడు నిల్వ్యాటద్దంబునందు
తనమోము గనుగొని తహతహఁజెంది।చెనఁటి యంతయునేర్చోఁ జీ లల్ల! యిట్టి
వైకృతంబున సరివారలు గేర । నేకైవడిఁ జరింతునింక నటంచు
పరిపరివగలఁ జేడ్పడి యట్టెలేచి । మురిమురిచీఁకటి ముసుఁగు వేసికొని
కలఁకతో నెవ్వరుగానక యుండఁ । దొలఁగి యప్పుడెపోయె దూర దేశంబు
తనువున భూతిభ్రూతయు మెడలింగ । మును గావిబట్టలు మొలనుధరించి
కకపాలమూని జంగమువలె వాఁడు । సకల దేశమ్ములఁ జరియింపుచుండె
వానిఁగానక హేల్ల వారిన వెనుక । సైనికుల్ హితులును సకలభూపతులు
మామ యింటను బరామర్శించి యచట । లేమియు దెలిసి బల్మిదొరంగి పురికి
పోయెనో! దొరలేనిపోకేల మసల । కీయెడనని తమయిచ్చగాఁ జనిరి
తనపుత్రిచే మదోత్కటుఁడు సిగ్గఱుట । విని జవనాశ్వుండు వేడుకఁజెంది
వెనుకఁజిక్కిన సేన వెన్నాడి తటివి । ఘనభూషణాంబరకరిరథాశ్వములు
కొని గెల్చుఁజేకొని కూఁతురి బొగడి । కొనుచుఁ బురాణసద్గోష్ఠి రంజిల్లె
తనభార్య హృదయశోధన మాచరించె।గనుక వేడుకఁగూడి కలఁక పోనాడి
మానధనుండు కోమలినేలు కాంక్ష । మానసమునఁ బొడమ నృపాలుతోడ
భూపాల! యూరికిఁ బోయివచ్చెదను । నీపజ్జ సుఖముచెందితిఁ గొన్ని నాళ్లు
అనుమతి యియ్యవే!యనియాతఁ డొసఁగు।కనకభూషణవస్త్రగంధమాల్యములు
నెలమిఁ గైకొని పురోహితున కొసంగి । యల మానవతికిఁ దదంబకుఁ జెప్పి
చని తనవారున్న స్థలముఁ బ్రాపించి । ఘన గజరథతురంగమ భటావళులు
నిరువంకఁ గొలువగా నెప్పటిరూపు । ధరియించి నవమన్మథవిలాసుఁ డగుచుఁ
గొన్ని దినమ్ములకును దనమామ । యున్న ప్రోల్ చేరి బాహ్యోద్యానసీమ
విడిసిన నవ్వార్తవిని జవనాశ్వుఁ । డడరెదువేడ్క మహావైభవమున
నల్లున కెదురేఁగి యతిభక్తి యుప్పు । తిల్ల నాతఁడుమ్రొక్కఁ దీవన లిచ్చి
కపుగిటఁ గదియించి ఘనరథారూఢుఁ । డవు నమ్మహాత్ముతో నాత్మీయపురముఁ
జేరి భద్రాసనాసీనునిఁ జేసి । వారి యోగక్షేమవార్తలు నడిగి
యంతఃపురంబున కతనితో నేఁగి । యింతికిఁ గూతురి కింపుసంధిల్ల

జామాతతోడ మజ్జనభోజనాదు । లామహీశుఁ డొనర్చె నత్యాదరమున
సీరీతి నల్లునినింట నుంచికొని । యా రాజదేవేంద్రుఁ డట నొక్కనాఁడు,
ఆ మానధనునితో నాత్మజఁ గూర్పఁగామించి తగు నిషేకముహూర్త మొకటి
హితపురోహితునిచే నేర్పడఁ దెలిసి । యతివైభవమునఁ బ్రయత్నంబుఁ జేసి
యమితదానములు బ్రాహ్మణభోజనములు।క్రమమొప్ప సేయించగా నాఁటిరేయి
బంగారు మేడపైఁ బడకింటిలోనఁ । జెంగల్వపాన్పునఁ జెలిఁ గరంగించి
పరిపరిరతులచేఁ బ్రౌఢఁ గావించె । నరున కాసతి మూఁడువలపులు వలచె
రతిమన్మథులవలె రమణీయు రమణుఁ । డితరేతరప్రేమ నినుమడించంగఁ
గొన్నాళ్లు వివిధభంగుల వినోదించి । రన్నాతిఁ దోడ్కొని యాత్మీయపురికిఁ
జన నిచ్చగించిన జామాత తలఁపు । గని జవనాశ్వుండు కరిరథహారులు
పరిపరివస్తువుల్ పరిమళపేటు । లరణంబుగా నిచ్చి యాత్మజామణికి
పసపు నిమిత్తమై పసగల యూళ్లు । లొసఁగి దాసీదాసయూథంబు తోడ
బహుపరిజన వీరభటసహస్రములు । రహినిచ్చి మాయమ్మ! రతనాలబొమ్మ
బుద్ధులప్రోడవై భూమిలోఁగడు ప్ర । సిద్ధిఁ జెందుము నీ సుశీలసంపదల
పెక్కండ్రుతనయులఁ బ్రేమతోఁగాంచి । చక్కగా నేలుము సామ్రాజ్యమనుచు
బాళిమై దీవించి పనుపఁ గన్దోయి । జాలువారెడు నశ్రుజలధారతోడఁ
గన్నతల్లికి మ్రొక్కి కౌఁగిలివడసి । యన్నాతి వీడ్కొని యాత్మేశుఁగూడి
కనకరథంబెక్కి కటకంబు వెడలి । వెనుకముందర సైన్యవితతులు గొలువఁ
చనుచుండిరొకదివసంబున రాజ । తనయుఁ డాసతిఁజూచి తరుణి యిద్దఱము
నుచ్చైశ్శ్రవమునుఁ బోలు నొకతేజి నెక్కి।ముచ్చటాడుచు సేన ముందరఁ బోవ
వెనుకఁబోవగఁ జాలవేడుక పుట్టె । ననినఁ గానిండని యదిసమ్మతించె
నంతట రాజాజ్ఞ నంగొక్క సాది । వింత కాంతులమించు విడికెంపుఱవల
జిగిహెచ్చు కళ్యంబు చికిలివజ్రాల । మొగచుట్టు సుప్రాణిముత్యంపుఁబనుల
మెచ్చైనజానంబు మేటికిరీటి । పచ్చరాపల్లంబు బంగారుతరటు
గొనబునీలముల రక్కొనుతలాటంబు । ఘనమైన గోమేధికపుదృష్టిదండ
మినుకు వైడూర్యంపు మేలంకవన్నె । యనువందు సింగాణి యస్త్రసంపూర్ణ
తూణంబు సరసబంధురగతుల్ గలిగి । రాణించు నొకయశ్వరత్నంబు దెచ్చి

ముందరనుంచి కేలొగ్గిచిన రాజ । నందనుఁ డరవిందనయనతో నెక్కె
సేనల ముందరఁ జెచ్చెరఁ బనిచి । మానినితోఁ దగుమాట లాడుచును
వెనుక నొంటిగఁబోయె విధివశంబెవరి । కినిఁ ద్రోయరాదు పంకేజాక్షి! వినుము
ఈరీతి నడవిలో నిద్దఱుఁజనఁగ । సారసాక్షికి డప్పిజనియించి నీళ్లు
కావలె ననిన నక్కడ నింతి డించి । యావలితరువున నశ్వంబు గట్టి
బంగరుగిండి చేపట్టి నీ ళ్లాకు । రంగట నరయుచు రాసుతుం డరిగె
పతి యొంటిఁ దనుడించి బలుకానఁ జొచ్చి।యతిరయంబునఁ జన్న నతివ భీతిలుచు
ప్రాణేశు నేనేలఁ బనిచితి నొంటి । గా నేలనిల్చితి! గహనంబునందు
కటకట దప్పియెక్కడఁబుట్టె! దైవ । ఘటన యేమో! బుద్ధికలఁగెడి ననుచు
నడలుచునుండగా నచ్చోటి కొక్క । గడుసుకిరాతుండు కామాతురుండు
భల్లాతుఁ డనువాఁడు పఱతెంచె జేత । విల్లనమ్ములు పూని వేఁటవేఁపులును
జనుదేర, వచ్చి యాసౌందర్యవతినిఁ । గనుగొని యాశ్చర్యకలితుఁడై పలికె
నెవ్వరిదానవే! యిగురాకుబోణి । యివ్వనంబున నొంటినేల యున్నాపు
నీ నామమెయ్యది నీకులంబేమి । నీనాథుఁ డెవ్వఁడు నిజముగా నిపుడు
వినిపింపుమనిన నవ్వాలఁది సౌరాష్ట్ర। జననాథు కూఁతుర సౌవీరనృపతి
మానధనుండు నామగఁడు మానవతి । నానొప్పుదాన నానాథుఁ డిచ్చోట
జలకాంక్షియై పోయెఁ జతురంగబలము । లలబలంబులు మీర నరిగెడి నవిగొ
యిదెవచ్చు నాపతి యీవెవ్వరనిన । మదమత్తుఁడై వాఁడు మదిరాక్షి దనకు
నిక్కట్టునను జిక్కి నిప్పుడె దీని । గ్రక్కునఁ గొనిపోయి కలియుదు ననుచు
నుల్లంబునఁ దలంచి యువిద! నాపేరు । భల్లాతుఁడండ్రు నాపాళె మిచ్చటనె
యెల్లకిరాతుల కెకిమీఁడ నేను । పల్లవాధర! భోగభాగ్యసంగతుఁడ
బహుధనాఢ్యుఁడఁ బ్రాణపదముగా నిన్ను।రహి నేలుకొనియెద రమ్ము నావెంట
నని పట్టికొనిపోవ నండకు రాఁగ । దన పతియునురాక తడసె సేనలును
దూరంబుచనె మదాంధుఁడు వీని నిచట । వారింపఁ గలిగినవా రెవ్వరనుచు
నలివేణి తలఁచి నన్నంటక యవల । నిలువుము వచ్చెద నీవెంట ననుచుఁ
గాంత ధీరోదాత్త గావున వానిఁ । జెంతఁ జేరగనీక చెచ్చెరఁ దేజి
నెక్కి బాటకుఁదోల నెడచొచ్చి బోయ । యెక్కడి కేఁగెద వింతి! నీవనుచు

ఖత్తులాణము వాగె గ్రహియించి పొదల।మొ త్తంబులోఁ బడి మొఱికుఁదనానఁ
జెట్టులు గట్టులు శిలలు వాగులును । బుట్టలుగడచి కొంపోయి తానున్న
పాళెంబు చేర్చినఁ బణఁతి చిత్తమునఁ । దాలిమివీడక తల్లడపడక
వానితో ననియె నోవనచరప్రవర! । నీనిలయమున న న్నిఁలుపగా వలదు
ఏ నొకవ్రతము వహించి యుండుదును । గాన వనస్థలిగాని గేహమున
వసియింపనొల్ల నావ్రత మాఱునెలలు । విసువక నాకుఁ గావింపఁగా వలయు
నేకవారము భుజియింతు హవిష్య । మేకాగ్రనిష్ఠ వహించి నిత్యంబు
బ్రాహ్మణపూజ సల్పుఁగ నెలఁ దగిన । బ్రాహ్మణజనసపర్య సేయవలయు
గౌరీవ్రతంబిది కడతేరుదాఁక । కోరికఁ బురుషునిఁ గూడగా రాదు
చందనమాల్యముల్ సమగూర్పవలయు । నెందఱు బ్రాహ్మణు లేఁగుదెంచినను
నందఱి కిష్టమృష్టాన్నముల్ పెట్టి । పొందుము కడపట భోగభాగ్యములు
బలిమిచేసితి వేనిఁ బ్రాణముల్ విడుతు । తెలియుము నావ్రతస్థితి నూతినీళ్లు
వెల్లువఁబోనె! నీవీఁటిలోఁ జిక్కి । చెల్లంబో! యిక నెందుఁ జేరెద ననుచుఁ
బలుకఁ బుళిందభూపతి సమ్మతించి । యెలనాగఁ దనయింటి యెలదోఁట నునిచి
వలసిన ధనధాన్యవస్తువు లొసఁగి । పలుమంది ద్విజులను బ్రాహ్మణస్త్రీలఁ
బిలిపించి వారి కభీష్టవస్తువులు । పలుమారు నిచ్చుచు భక్ష్యభోజ్యములు
బెరయ మృష్టాన్న ములు పెట్టుచు నిటుల।జరిపెఁ గాలము వ్రతచ్ఛలమున నతివ
అంత నక్కడ నీళ్లకరిగిన యవని । కాంతకుమారుండు గహనాంతరమున
బహుదూర మరిగి యప్పట్టున నొక్క।మహితాంబుపూర్ణమా మడువు వీక్షించి
యానిర్మలోదకం బలఁతఁబోఁ ద్రావి । చానకు గిండితో జలములు గొనుచు
పరువునవచ్చి యప్పట్టున సతిని । తురగంబు గానక తుందుడు కొంచె
చని చూతునని యెల్ల జాడలు వెదకి । కనుపడకున్న నక్కడ త్రోవఁదప్పి
భ్రాంతిఁజెందుచుఁ గాడుపడి నలుగడల । నెంతయుఁ దిరుగుచు నిమ్నహాటవుల
నెందని శోధింతు నెక్కడ కేఁగి । యిందునిభానన నీక్షింతు నేను
ముందరఁజను సైన్యముల జాడఁ బట్టి । చందనగంధి తాఁ జనియెనో యనుచు
సమ్మార్గమునఁ జని యటఁజను భటుల । నెమ్మి నీక్షించి కంటిరె! వాలుగంటి
యిచ్చోటి కరుదెంచెనే యని యడుగ । వచ్చుటలేదు భూవల్లభ ! యిటకు

మిమ్మెడఁబాసి యమ్మేఁలతయెందరిగె । నిమ్మహాటవి నన్న నెఱిఁగింతు మీకు
వెనుక మీరరుగుఁడు వెసనని వారిఁ । బనిచి సౌరాష్ట్రభూపతి యూరుసేరి
యక్కడి ప్రజలచే నలివేణి లేమి । నిక్కంబుగా విని నెగులొంది కుంది
యిఁక నేమిసేయుదు నింతినిఁ బాసి । యకట యొఁటిగ నూరి కరుగంగరాదు
మామయింటికిఁ జన్న మాటలు వచ్చు।కోమలి నెవ్వఁడు గొనిపోయె నొక్కొ
సతి నొంటిగా డించిచనిన రాఘవుని । కతయయ్యె మోస మేఘనులకు వచ్చు
నెవ్వరిచెంత కేనేల పోయెదను । నవ్వ రే! వినువారు నాబుద్ధి కనుచు
నారాజసుతుఁడు దేశాంతరంబరిగె । నారూఢగతి భిక్షుకాకృతిఁ బూని
మునుపుగాఁజని సైన్యములు మానధనుఁడు।వనజాక్షిగానక వనములోఁ దిరుగు
చందంబు మాహురీశ్వరునకుఁ దెలుప । నందను వెదుకఁ గొందఱిఁబంచె నతఁడు
జవనాశ్వుఁడును పుత్రి జామాత నరయ । నవని నల్దడలకు ననిపె చారులను
అంత నాలుగునెల లరిగినపిదప । కాంత లుబ్ధకునింటఁ గలధనంబెల్ల
వ్రతదంభమున విప్రవరులకు నొసఁగి । యతనియిల్ శుద్ధశూన్యంబు గావించె
కుడువక కట్టక కూర్చినధనము । పడఁతిపాల్ చేసితి భ్రాంతిచే ననుచు
వాఁడును మదిలోన వగచుచునుండె । నాదువారికి బ్రమయనివారు గలరె!
ధనహీనుఁడైన లుబ్ధకు కొల్వువిడిచి । చనిరి బోయలు పరస్థలముల కపుడు
భల్లాతునింట శోభనగాత్రి రాజ । పల్లవాధర చిక్కుపడి యున్న తెఱఁగు
ఆయింతి యన్నదానాది దానముల । సేయుచు నబ్బోయఁ జెందకయున్న
సౌశీల్యమును విప్రజనులచే హూణ । దేశాధిపతి బలద్విషుఁ డాలకించి
వైరిగావున వానివధియించి యప్పు।డోహహానన మెత్తు నుద్వృత్తి ననుచుఁ
జతురంగబలయుక్తిఁ జని యొక్కరేయి।యతని పాశెము ముట్టి యహితులఁ గొట్టి
పాళెంబు చూఱలుపట్టించి వాని । యాలయంబును గొల్ల లాడించి పొంచి
పట్టఁబోయినఁ బట్టువడక వాఁడులికి । యట్టె సందులఁబట్టి యడవిలోఁ బఱిచె
వానిగానక హూణవసుధేశ్వరుండు । మానవతీవభూమణి యున్నయట్టి
యెలదోఁటకేగి ప్రాణేశ్వరి వగుచు । నెలనాగ నన్నేలవే! యని బలిమి
సేయవచ్చిన నోరసిలి యోయి రాడ! । డాయకు నన్ను దృఢవ్రతం బొకటి
కల దాఱునెలలైనఁ గడతేరు పిదప । ఫలియించు నీకోర్కె పదరకు మనుచు

నల బోయతోడ మున్నాడి నట్లాడ । వలపున నన్నియు వాఁడొప్పికొనియె
మేలి యాణి సుపాణి మెఱుఁగుముత్యముల । పాలకిమ్మఁద నబ్బాలిక నునిచి
కొనిపోయెఁ దానేలు ఘోట్టాణపురికిఁ । గొనిపోయిదాని నిష్కుటవీధి నిలిపె
ముకురాస్యపైఁగల మోహంబు వలన । సకలంబు గోల్పడి శబరుఁడాలీల
పాళెంబువిడిచి పెన్ భయమున జోగి । వాలకంబునఁ బోయి వసుధఁజరించె
హూణుని తోఁటలోనుండి యక్కొర । వాణి నానాఁటికి వానింటఁ గలుగు
ధనముల మణుల గోధనములఁ బుచ్చి । కొని ధరాదేవతాకోటి కర్పించె
బంగాహచేటలు భవ్యహారములు । చెంగావికోకలు చీనాంబరములు
సలలిత రత్నభూషణ సహస్రములు । మలయజ మృగమద మాల్యాదికములు
పరమేశ్వరీసమర్పణముగా నిచ్చు । వరుసతో ముత్తైదువలకు నీమమున
నన్నదానమునకు నారాజువీట । నున్న యుగ్రాణంబు లూచముట్టుగను
గొని సెల్వుచేసె నెక్కుడుదానములకు।మునుకొని బొక్కసంబులు రుత్తఁజేసె
భద్రమా నీకని పౌరులకొసఁగి । భద్రేభశాలలు పాడుగావించెఁ
గనక రథాశ్వముల్ గడమ గాకుండఁ । దను నాశ్రయించు పెద్దలపాలు సేసె
నుత్తతిత్తిగ నిట్లు హూణేశు నగరు । రిత్తగావించె నార్నెలలకు మునుపె
ధనహీనుఁడైన యాధరణీశు విడిచి । చనిరి రాణువువారు సరిపోవు నెడకుఁ
గలిమియు బలిమియుఁ గడతేర్చెఁగనక । నలివేణి హూణుని యదటణఁగిపఁ
దలపోసి తమయూరఁ దగువిప్రు నొకనిఁ । బిలిపించి జవనాశ్వపృథివీశుపేరఁ
దనవ్రాల జాబేకతంబునవ్రాసి । పనిచిన నతఁడు భూపతికి నొసంగె
ఆ కమ్మనలన నిజాత్మజ తెఱఁగు । భూకాంతుఁడెఱిఁగి గొబ్బున సేనతోడ
ఘోట్టాణపురిఁ జేరి కోటలోఁ జొచ్చి । పట్టణంబంతయుఁ బొడు గావించి
హూణేశుఁ బట్టంగ నుద్యుక్తుఁడైన । త్రాణలేమి నతండు తలఁగె ముందరనె
తన వశంబుగ హూణధరణీశు దేశ । మును పురంబును గొని పుత్రికయున్న
ముక్కంటి సతిగృహంబునకు రాఁజూచి । యక్కన్య తనతండ్రి కానతయైన
అక్కున నిడుకొని యమ్మ! నీకెంత । యిక్కట్టువచ్చెనే! యేఁడె నీవిభుఁడు
యెక్కడికేఁగెనో యిది దైవఘటన । తక్కఁ కెవ్వరికైనఁ దప్పింప వశమె
నీవు వ్రాసినకమ్మ నేఁజదివికొని । యీవివరంబెల్ల నెఱిఁగియున్నాఁడ

మంచి దిక్కడనేల మనపురంబునకు । చంచలేక్షణ నీవు చనుదెమ్మటంచుఁ
గన్య రథారూఢఁ గావించి వివిధ । సైన్యసమేతుఁడై జవనాశ్వుఁ డరిగి
తన ప్రోలుచేరి యాత్మజ నాదరించి । పనిచె నల్లునియున్కిఁ బరికింపఁజరుల
నల హూణవిభుఁడు రాజ్యము గోలుపోయి । చెలువేది జంగమై సీమపై నరిగె
వింటివే! తదుపాతి వృత్తాంత మతివ । దంటనాఁ జను మనోత్కటుఁ డనువాఁడు
భల్లాక్షనామలుబ్ధకుఁడును హూణ । వల్లభుంజును నిట్లు వైభవం బెడలి
జోగులై ముగురును క్షోణిఁ ద్రిమ్మరుచు।బోగులఁగని మనంబున దుఃఖపడుచు
శివరాత్రి యేతేర శ్రీశైలమునకు । మువురును జని జంగములవలె ననికి
హరహరా! యని మల్లికార్జునుఁబొగడి।హరభక్తు లొసఁగు భిక్షాదులఁ దనిసి
యొక్కరొక్కరె దైవయోగంబు కతన।నొక్కదిక్కునఁ గూడి యోసరించకయె
పజ తెంచియొకమంటపమునఁగూర్చున్న।తటిమానధనుఁడుముందర నెయుచ్చోట
జంగమాకృతినున్క సవిధదేశంబు । నం గూరుచుండి ఖిన్నత నున్నవారిఁ
గని యాతఁడనియె నెక్కడనుండి యిటకుఁ।జనుదెంచి రీగురుస్వామి యెవ్వాఁడు
లింగముల్ సిగలఁదాలిచి భూతి యలఁది । జంగములౌటిది సంప్రదాయంబొ!
క్రొత్తటీక మొ యెఱుంగుట కడిగితిమి । చిత్తంబులం దల్క సేయకుఁడయ్య
అనినఁ దొల్తఁ బక్కీరియైన కేకయుఁడు । తను వినుమని మానధనుని కిట్లనియె
అనఘాత్మ! నేఁ గేకయక్షోణి యేలు।ఘనవిక్రముఁడ మదోత్కటుఁ డనువాఁడ
నా మేనమామ నందనయై తనర్చు । వామలోచన మానవతియను కన్య
మానధనుండను మాహురీశ్వరుని । సూనునిఁ బెండ్లాడి సొంపొందుచున్న
స్థితి యెటొంగియు బుద్ధిచెడి నన్నుహూని । యితరుని కీవచ్చునే! దీని ననుచు
మఱలెత్తి దండెత్తి మామపాలించు । పురము రోధించినఁ బొలఁతి యారేయి
ముందర నొకవిప్రముఖ్యునిఁ బనిచి । పొందు చేసెదనంచు బొంకి సారాయి
తెచ్చి త్రాగించిన దేహంబుపజచి । చచ్చినచందాన శయ్యపైఁ బడినఁ
గత్తివాయమ్మున గడ్డంబు మీస । లుత్తరించిన పై మనోద్ధతి తీఱి
సిగగోసి మోమునఁ జెక్కులయందు । వగవగ బొట్లిడి వడి నింటికేఁగెఁ
దెల్లవారినఁ దనదేహమ్ము దెలిసి । కల్లరియై యది గావించినట్టి
దుడుకులు గాంచి తుందుడుకు వహించి।సుడిఁబడి యెవ్వరు చూతురో!యనుచు

ముసుఁగిడి వేఁగుజామున లేచి సైన్య । విసరంబు రాజ్యంబు విభవంబు విడిచి
యీరీతి జోగినై యిలఁ జరించెదను । నారీతిలకమిట్టి నగుబాటు చేసె
నా తెఱంగిదియన్న నగి రాజతనయుఁ । డాతలనున్న భల్లాతు నీక్షించి
నీవిధం బేమి విన్పింపుమటన్న । నా వనచరభర్త యతని కిట్లనియె
నా మానవతియను నతివయె విపిన । సీమ నొంటిగఁదేజిఁ జెంతఁ గట్టికొని
బాటలోనున్న నప్పథమున నేను । వేఁటాడివచ్చుచు వెలఁది చెల్వంబు
గనుగొని భ్రమసి చక్కనిదొర యేయు।ననతూఁపులకు లొంగి నయము దొరంగి
యెవ్వతె వొంటిగా నేలయున్నావు । జవ్వని యివ్వనస్థలమున ననిన
జలము దే విభుఁడేఁగె సైన్యముల్ ముందె।యలబలంబులుచెంది యరిగెడి నదిగొ
వరుఁ డిదెవచ్చె నెవ్వఁడవు నీవనిన । మహలెత్తి యొంటి నిమ్మగువ చిక్కెనని
యల తేజిపై నెక్కి యవ్వలఁబోవ । చలమునఁ బోనీక సరగున వాగె
పట్టి తోడ్తెచ్చితిఁ బాళెంబుచేర । నట్టులఁజేరి యుద్యానంబులోన
నెలకొను వ్రతమను నేమంబుఁబూని । యిలు రత్తచేసె నింకేమనువాఁడ
నంతలో హూణదేశాధీశ్వరుండు । కాంతకై వచ్చి నాకటకంబు సొచ్చి
చెఱియుఁ జూఱియుఁబట్టి చెలిఁ గొనిపోయె । నెఱుఁగ నవ్వలికథ యేనిట్టు లైతి
ననిన హూణేశ్వరుం డతనిహస్తమ్ము । మునుకొని తనహస్తమున నప్పళించి
పకపక నగి బోయపాళెఁబువారి । యెకివీఁడవా! మఱి యేమి బాగాయె
నీవు చెడ్డటుల హూణేశుఁడు చెడియె । నావలికత విను మతఁడెపో! తాను
వ్రత మాఱునెలలని వచియించి యల్ల । సతి ధనధాన్యముల్ సకలవస్తువులు
పౌరులపాలొసి భ్రమయించి తండ్రి । గారి రప్పించి నాకటకంబుతోడఁ
గలరాజ్య మంతయుఁ గట్టించి పుట్టి । నిలుఁజేరె పగఱచే నేఁ బట్టుపడక
తప్పించికొన్నది దైవంబె యెఱుఁగు । చెప్పిడిదేమి యీ సిలుగులకత్తె
మొగమాయలకుఁజిక్కి మోసపోయితిమి।ముగురను గూర్చెగా! ముండదైవంబు
దక్కినయట్లుండి తటవటల్ చేసి । చిక్కక మనలను జెఱిచె నజ్జంత
చెంతఁ జేరగరాదు చేనంటరాదు । జంత గాదది మహాసాధ్వీమతల్లి
దానిఁ బెండ్లాడిన ధవుఁడెంతవాఁడొ । వానిదే భాగ్యంబు వానిదే ఘనత
అని వారుదెలుప నిజాంగన తెఱఁగు । విని మానధనుఁ డాత్మవికసింపఁ బలికెఁ

బరకాంతఁ గోరిన పాపకర్మమున । సిరులు దొలంగె నిచ్చేటు పాటిల్లె
నింక మీకు శుభమ్ములెనయు నెవ్వగల । నింకకుఁడన మువ్వ రెలమి నిట్లనిరి
ఇనతేజ ! నీనామమేమి నీవెవ్వ । రునికి యెక్కడ నేడనుండి వచ్చితివి
సిరులు మాకిఁక నెట్లుచేకూరు ననిన । దహహాసమున మానధనుఁ డిట్టులనియె
మానవతీవశూమణి కేను ప్రియుఁడ । దానిఁ బాసితి వనస్థలి నొంటివిడిచి
సతిఁ బాసి యూరికిఁజనఁగ శంకించి । వెతఁజెంది తిరిగెద వివిధదేశముల
మీరు దెల్పఁగవింటి మెలఁత క్షేమంబు । మీరు హితుల్ గారె మీ కీయలంత
యా కాంతకతమున నైనది గనుక । మీకు రాజ్యములిచ్చి మిముఁ బ్రోదిసేతు
నని వారినూరార్చి యా రేయి గడపి । తను వారుపొగడుచుఁ దనవెంట రాఁగ
మఱునాఁడె పైనమై మాహురీపురికి । నరిగి యమ్మగురితో నయ్యకు ప్రొయిక్క-
వారుచెందిన దురవస్థయుఁ దన యొ । యారి పాతివ్రత్య మంతయుఁ దెలుప
గుణవతియగు తనకోడలి మహిమ । మణికేతుఁ డాశ్చర్యమగ్నుఁడై పొగడి
ఆ మదోత్కటుని భల్లాతు హూణేశు । ప్రేమ లాలించి వారికిఁ గట్టనిచ్చి
యలఁతఁదీఱిచి భోజనాదు లమర్చి । పొలుచు నెప్పటివేషముల వారు గొలువ
మణికేతునృపశిఖామణి పుత్రుఁగూడి । గణుతింపరాని మూఁకిల జోక గూడి
భువనమోహనపుకంబున కేఁగి యచట । జవనాశ్వనృపతి పూజల సంతసించి
తన మాన మజ్ఞారె తాఁ గాచికొనియె'యనఘ నీసుత సాధ్వియాని ప్రస్తుతించి
యా మగువ నిమిత్తమై యాత్రఁ జెంది । రీముగురని వారి నేర్పడఁ దెలిపి
యిదిగొ! నీమేనల్లుఁ డీమనోత్కటుఁడు । ముదితచే నవమతి మొనసి కీడ్పడియె
ధవళాశ్వుఁడనెడి నీతమ్మునిపుత్రి । నవనీశ! పెండ్లి సేయఁగవలె ననుచు
నాయన కమోహనాంగినిఁ బెండ్లి । సేయించి రాజ్యమిచ్చి బహూకరింపఁ
బనిచి భల్లాతుని పాశేంబొసంగి । ధనకనకాదులఁ దనియించి పంపె
ఘోట్టాణపుర మేలికొను హూణదేశ । పట్టభద్రుండనై ప్రబలు మటంచు
నల బలద్విపుని హృష్టాత్మనిం జేసి । కలిమిబల్మి యొసంగి కరుణ వీడ్కొలిపె
గొడుకునుగోడలిఁగూర్చిసంతోష । మడరంగఁగొన్ని నాళ్లచ్చోటనుండి
వియ్యపురాజుచే వీడ్కొల్పు వడసి । యయ్యవనీశ్వరుం డఖిలసైన్యములు
గొలువ మాహురికేఁగి కొడుకు రాజ్యమున।నిలిపి కోడలిఁజూచి నెలఁత! నీవలనఁ

టుట్టినింటికిఁ గీ_ర్తిపొదలె నీచొచ్చి । నట్టియింటికి మహాఖ్యాతియు గలిగె
సతి యొక్కఁరిత మహేశ్వరుఁజెంది ఖ్యాతి । నతిశయంబొందె నీ వాబిడ వలెనె
సతియను పేరు ప్రశ_స్తంబు గాఁగ । క్షితి వెలసితి వతిశ్రీనిధులైన
పుత్రులఁగని శుభంబులు చెందుమనుచు। స్తోత్రంబు గావించి సుఖమున నుండె
ఆ దంపతులు నాయురారోగ్యభాగ్య । రాజితులై పుత్రరాజితో మునిరి
యీకథ వినువారి కిష్టార్థసిద్ధి । చేకుఱు హరుకృపచే నని చిఱుక
సరసో_క్తి పుష్పమంజరి కెఱింగింప । నరుదంది యక్కాంత యరిగె లోపలికి
దూతికచని రాజుతో నెఱింగించె । నాతటి నీయితిహాసం బటుంచుఁ
బరమేశ్వరుఁడు దెల్పఁ బార్వతి యలరి।తరువాతకథఁ దెల్పఁదగు దేవ! యనియె
సనయపతివ్రతా చరితంబునందు । ఘనత నేకాదశకథ పూర్ణమయ్యె

వివిధాతలకథ

శ్రీవిశ్వపతి దయాంచితమతి గారి । కావలికథ యిట్టులని తెల్పఁదొడఁగె
మఱునాఁడు దూతి వెంబడివచ్చు వైశ్య । తరుణి వీక్షించి చి_త్తజుతేజి పలికె
పతినిఁ బాసియు మానభంగంబు గాక । బ్రతికిన సతుల యుపాఖ్యానతతులు
వినఁదగు వినుతొల్లి విధివశంబునను । దనపతిఁబాసి వృథానిందఁ జెంది
యలమటఁబడి తుద నత్యంతసౌఖ్య । మొలసినసతి కథ యొక్కటి గలదు
అది యెట్టులన్న నార్యావ_ర్తభూమి । పొదలు రమాస్పదపుర మప్పురమునఁ
గనకధ్వజుండను క్ష్మాభ_ర్త గలఁడు । ఘనుఁడాతనికి గుణాకరుఁ డరిధ్వాంత
హరణోగ్రకరుఁడు రత్నాంగదుం డనఁగ । బరగు కుమారుండు భాసిల్లుచుండు
ఆరాజసుతుఁడు స్వయంవరవేళ । శూరసేనాధీశసుతను శుభాంగి
వరియించి రతిఁగూడి వలనొందు మరుని । కరణి శృంగారసంగతులఁ జెలంగె
వారిద్వారికి సరివలపులు గనుక । కూరిమి ముచ్చటల్ కొసరుమాటలును
జలిబిలినవ్వులు చిన్నారివగలు । కళలంటుహరువులు కలికిచెయ్వులును
బిగికౌగిలింతలు బెళకుచూపులును।సొగసువైఖరులును సొలపుమ్రొక్కులును

రతిఁజొక్కఁచిన్నెలు రాకొట్టువగలు । మితిలేనిమురుపులు మెలిగొన్నమేలి
తనువులహెచ్చరింతల వింతచూపు । లునెరయ ? హోరాత్రులును విహరింప
వినువీధిఁ జనుచున్న విధియు విధాత।యును వారిమమత లోహోశే! యటంచుఁ
గనుగొని రిట్టిసంగతు లెందుఁగలవె । యనువిధాతకు విధియనియె నవ్వుచును
నింత మోహమువహియించి యీకాంత । సంతతఁబును విడఁజాలకయున్న
రాకొమరునికి నీరసము పుట్టించి । నీకు మెప్పొనరింతు నిజముగా ననిన
నలివేణి వెతఁదీర్చి యధిపుతోఁ గూర్తు । గలదె పన్నిదమన్నఁ గలకల నగుచు
ఆవిధి పలికె నేసతివను రట్టు । గావించి పతిమతిఁ గలఁచిన వెనుక
నీయింతిఁ బతిఁగూర్చితేని నిన్వినుతి । సేయుచు దీనికిచ్చెదఁ బుత్రపౌత్ర
ధనకనకాదులు తగునై భవములు । నని ప్రతిజ్ఞయొనర్చి యరిగి రిర్వ్వురును
అంతఁ గొన్నిదినమ్ము లరిగినపిదప । కాంత శుభాంగి శృంగారమ్ముసేయు
వేళ నద్దములోన విధివశంబునను । జోలుమొగంబు జుంజురువెండ్రుకలును
కడుమిట్టనుదుట వంకరబుట్టముకుఁ । మిడిగ్రుడ్లు కొంకరమీసముల్ సొల్లు
గాతెడిసెలవులు కడుతొట్టిపెదవి । కాయమేనును మరకటపుమూఁతియును
నుల్లిగడ్డము వెలికురికిన పండ్లు । పిల్లికన్నులు క్రుక్కిబిగిదక్కియున్న
చెక్కిలు బలుదొప్పచెవులును గలుగు । నొక్కపీనుఁగురూప ముఁడుగకఁదోప
వెరగంది యదిచూడ వెఱచి యద్దంబు । పరకటవైచి యేపడఁతుల తోడ
నాచందమెఱిఁగింప కలివేణి యటయ । ధోచితస్థితి నుండె నొగిఁ గొన్ని నాళ్లు
ఉద్దంబు చూచినయపుడెల్ల నిటుల । ముద్దియకు వికారముఖము గాన్పింప
వేఱొకయద్దంబు వీక్షింప నందు । నారీతిఁ గన్పించునందున నులికి
యిది యేమిపాపమో! యేమిగానున్న।యదియొ యిందున నిట్టి యద్భుతంబెందు
కనివిని యెఱుఁగ నెక్కడనుండి తనకుఁగనబడియెడినొ!యీకష్టంపుమోము
బాళి నద్దముజూడఁ బాసె నటంచు । జాలి చెందుచునుండె సతి తనలోన
విపరీతగతి చెంది విధి యేపఁదలఁప । నపనయింపఁగ శక్యమా! యెవ్వరికిని
బలవద్విరోధులపై దండుపోవఁ । దలఁచి రత్నాంగధరణీశుఁ డపుడు
మెఱుఁగుబోణి వసించు మేడపైకరిగి।విరులపాన్పుననుండి వెలఁది నెమ్మోగము
మొగమున గదియించి ముద్దిడుకొనుచు । వగలాడి ! దండుపోవలసిన దిపుడు

నెలపదిపూటల నేనేఁగుదెంతు । నిలువనోపుదునఁబె! నిన్నిడఁబాసి
పరితాపము సహింపు పటుబుద్ధి ననుచు । తరుణి నూఅడఁబల్కి- తల్లిదండ్రులకు
నాకార్య మెటిఁగించి యతఁడు దండరిగె । వీఁక ననీకినీవితతి తన్గొలువ
పతి దండుపోయినఁ బడఁతి వియోగ । వతియాటఁ దాలిమివదలి చింతిల్లి
జలకంబులాడక చలువలుగట్ట । కలికభాగమునఁ జెన్నలరఁ గస్తూరి
తిలకమ్మ్రుదిద్దక తిన్నఁగాహీణ । పలికింప కెలదోఁటఁ బరికింపఁజనక
చెలులమచ్చటఁ జేవిఁజ్పిక కలికి । చిలుక లాలించక చిగురుపానుపున
నొడలుచేరిచి యసురుసురని యెపుడు । వెడవింటి దునెదారి విరవాది యంప
జడికిఁ దేఁటులయలజడికి లేగాడ్పు । వడికిఁ జిల్క-లగోరువంకల నుడికి
విరహాగ్నిసుడికి నావిభుఁ డెన్నఁడింక । బఱతెంచునో! యంచు బడలుచునుండె
నాతరువాత రత్నాంగదధరణి । నేత శాతకృపాణనిహతి నరాతి
జాతి నుగ్గొనరించి సంగ్రామరంగ । జేతయై జయలక్ష్మిచేత నుబ్బుచును
నేతెంచె తనపురి కెల్లసామంత । జాతంబు తన డంబు సంస్తుతుల్ సేయ
పతిరాకవిని ప్రియంపడి శుభాంగియును । వెతమాలి యవ్వేళ వేగఁబన్నీట
జలకమ్ములాడి మేల్సరిగ పైఁ ాణి । జిలుగువల్వ ధరించి చికిలిముత్యాల
గొనబు కుట్టడపు కంగుల మేలిరవిక।యును దొడిఁ కస్తూరి హొయలుగా నొసటఁ
దిలకంబుదిద్ది యందియలు మునైన । పలుసొమ్ములూని పైపై గుబాళించు
ఘనసారమిళితమా కలపంబు లలఁది । తనరుచు నిలువుటద్దంబున నీడ
చూడగా మునుదోఁచు చోద్యంపురూప । మాడనుండియు జకీలన దిగజాతి
బదుగుదనంబునఁ బడిన నప్పడఁతి । గడగడ వణఁకుచుఁ గన్నీరుదొరుగ
అమ్మనేజెల్ల! యీయద్ద మందుండి । యిమ్మెయి నిప్పీనుఁ గెక్క-డవచ్చె
నెవ్వరి కెటిఁగింతు నిఁకనేమి సేతు । నివ్విధం బరసిన నేమను విభుఁడు
బంగారువంటి నాబ్రదుకు దైవంబు । భంగమొందింప నిప్పనిఁ జేసెనేమొ
అని విన్నపై నాథుఁడరుదెంచు వేళఁ । గని చిటిచాపలోఁ గ్రక్కు-న శవము
చుట్టి గోడనుజేర్చి శోభనగాత్రి । పట్టభద్రున కెదుర్పడి చెలుల్ తెచ్చు
హారతులెత్తి యాయన బారసాచి । కూరిమి తనుగనుంగొని కౌఁగిలించు
కవుగింటితో సెజ్జకడఁజేరి యచట । నివసింపఁ బేదపెన్నిధిఁ గన్నయట్లు

నొడినిూఁద నిడుకొని యుదుటుచన్గుబ్బ । లెడఁదఁ జేరిచికొని యెలనవ్వు దేర
పుక్కిటి విడెమిచ్చి పొలఁతి! ని న్నాఁబ్బయ । నొక్క-నిమేషంబు యుగమయి తోఁచె
నీవెట్టులుంటివో! నెలఁత నన్ బాసి । యీవటికని పల్కు నెడ దయ లేని
పాపంపువిధి త్రోయ బడుగు మేనట్టి । చాపలోనుఁడియు జల్లున జాఱె
జాత్రిన మాయంపుశవము కాల్కలు । కారుమబ్బునుబోలు కాయంబుఁ జూచి
యింతమోమోహించియిదియేమియనుచు।నంతమోహాముమతీయంతరోషముగ
గద్దించి యడిగిన గడగడ వణఁకి । యెద్దియు ననలేక హెచ్చినభీతి
నూరకయుండిన నుర్వీశసుతుఁడు । దారుణకోపాగ్నిదందహ్యమాన
మానసుండై యోసి మటుమాయలాడి।యీ నీచమానవు నిందుఁ దెచ్చికొని
యిన్నాళ్లు భోగించి యేవచ్చువార్త । విన్నప్పుడే పట్టి వీనివధించి
చాపలోఁజుట్టి యిచ్చటి గోడమూలఁ । దాపెట్టి భీతియింతయు లేక నాకు
నెమరువచ్చితి నినాళీయంగఁ దొత్త! । యెద నిన్ను నమ్మోడి దెట్టుల ననుచు
శూరసేననృపాలసుతవని యేరి । కోరి వరించితిఁ గుటిలబుద్ధివని
యెఱుఁగక మోసపోయితినోసి! దోసి । యెఱపరికము లేక యీనీచనరుని
పొందెట్లు గోరితె పొలఁతుల మొఱఁగి । యిందెట్లు తెచ్చితివే! వీని, నకట
కరఖడ్గమున నిన్ను గడికండలుగను । నజకివేయక తీరునా ! కోపమనుచు
తరవారు నరమాసి తరుణికంఠంబు । నఱక నుంకించి యంతట దైవవశత
నొకశాంతి పుట్టిన నొర కత్తివై చి । చకితమృగీవిలోచన నింటిలోన
ననుచితంబు వధించుటడవిలో దీనిఁ।దునిమివేయుటకు మంత్రులఁ బంతు ననుచు
ఆ మేడదిగివచ్చి యయ్యకుఁ దెలిపి । భామిని గొనిపోయి బలుకాకలోనఁ
జంపిరండని మహాసచివుల భటుల । నంపిన వారుహార్మ్యము ప్రవేశించి
చెలి యేడుజేనలు జేనెడై యడఁగి । నిలలేక నిలువుననీరుగాఁ గరఁగి
నేలపైఁ బడియున్న, నీరేజభవుని । వ్రాలు దప్పింపఁగా వశమౌనె! యనుచు
సకలభూషణములు సడలింపఁబంచి । యొక కట్టెమంచ మందువిద నుంచికొని
పురజనుల్ పురపురఁ బొక్కి వాపోవ । గరిసింహశార్దూలగండభేరుండ
గండకశలశల్యఖడ్గాదిజంతు । కాండప్రచండమౌ కాననం బొకటి
చేరి యచ్చోట నచ్చువురాకుబోణి । నా రమణీమణి నానీలవేణి

నా జగన్మోహిని నాసాధ్వీ జూచి । యేజాడ నిన్నాతి కీయపఖ్యాతి,
వచ్చెనో దీనిభావము దైవమెఱుఁగు । నిచ్చటఁ జంపరా దీసతి ననుచుఁ
దమలోనఁ దలఁచి ప్రధానులు గొంద । అమలాంగి నొక్కమహాశిల నుంచి
భామరో ! నీవ్రాఁతఫల మెట్టులుండె।నామాడ్కిఁ జరియింపుమని యందు విడిచి
యువిదఁ జంపితిమని యొకమృగర క్త । మవనీశసుతుకడ కపుడె గొంపోయి
చూపిన నతఁడు సంక్షుభితాత్ముఁడగుచు । నాపద్మముఖియె యిట్లవగడమండె
నితరకాంతలఁ జెప్పనేల యటంచు । మతి వివాహపేక్షమాని వర్తించె
నారీతిఁ దను మహోగ్రాటవి విడిచి । వారుపోయిన తరువాత నన్నాతి
యామహోన్నత శిలయందువసించి । హా మనోహర ! హా శుభాకారధుర్య !
హా మేరుగిరిధీర హా కీర్తిసార । హా మహోదార! నాయందలిప్రేమ
మఅపించెగా నేఁడు మాయదైవంబు । దరిదాపులేక యీతను వోముచెట్లు
ఎవ్వరిదాననై యిందు వర్తింతు । నెవ్వీధి బ్రతుకుదు నెందుఁ జొత్తునని
వాపోవగా దైవవశమున నొక మ । హాపవనము పాదపావళి గూల
పుట్టలు పిరియంగఁ బొద లిట్టునట్టు । గొట్టుకపోవ దిక్కుల దుమ్మ్రగ్రమ్మఁ
జెరువులుదెగ నేర్లు చీకాకుపడఁగ । కరిసింహశరభముల్ గడగడ వణఁక
వినువీధి మేఘముల్ విచ్ఛిన్నములుగ । పెనుగట్టులను శిలల్ పెడపెడ జాఱి
నుద్ధతివిసరి యయ్యుత్పలగంధి । హృద్ధాటి గొనిపోయి యించుకలోన
పున్నాగవతియను పుణ్యవీధి వైచె । నన్నన్న ! విధికసాధ్యక్రియల్ గలవె ?
యీలీల పురవీధి నెలనాగ తేలి । గాలిచేఁ దూలి యక్కడమూర్ఛ సోలి
కూలి యుండఁగ గనుంగొని తత్పురంబు । పాలించు సురథభూపాలుని తల్లి
తనయొద్ది చెలులఁగొందఱఁ జూచి వీధిఁ । గనుగొంటిఁ బెనుగాడ్పునఁ దూలి
యెక్కడనుండియో యిటఁవచ్చిపడిన।దొక్క చక్కెరబొమ్మ యో కొమ్మలార
పరవశభావంబు పాయగాఁజేసి । తరుణిఁ దోడ్తెండు చూతము మాటలాడి
యసవిని నృపసూత యనుమతి నపుడె । చని చెలుల్ శిశిరోపచారసంగతుల
సతి మూర్ఛదెలిపి యోసఖి రాజమాత।యతికృపఁ దోడితెమ్మనె నిన్నరమ్మ
మావెంటనని సుధామధురవాక్యముల । నా విమలేందుబింబాస్యఁ దోడుకొని
తమ దొరసాని ముందర నిల్పవినయ।మమర శుభాంగి యాయమ పదాబ్జముల

వ్రాలి కన్నీరుజాఱంగ నిల్చియున్న । యాలేమఁ జూచి యిట్లను రాజమాత
గాలికొట్టినఁ బడి కలికి యిచ్చోట । గూలి తెవ్వ తెవు నీకులమేమి నీకుఁ
బేరేమి యెవ్వనిప్రియురాల వేల । నీహ కన్నులగ్రమ్మ నీవడలెదవు
ఏర్పడ నెఱిఁగింపవేయన్న మై చె । మర్సఁ గేల్మొగిచి యమ్మగువ యిట్లనియె
దేవి! నేను వసంతతిలకాభిధాన । నై వసుధేశుల యంగనలకును
సనరొందఁ గైసేసి సైరంధ్రినగుచు । నివసింతు వనవీథి నేఁడొంటిరాఁగఁ
జెడుగాలి గొట్టి నన్ జేడ్పఁడంజేసి । పడఁద్రోచె నిచట నీపంపునఁజెలులు
బ్రతికింప నీసమీపంబు చేరితిని । హితమతి ననుమతి యిచ్చితివేని
మీనగర వసించి మీకన్నెలకును । నేను శృంగారింతు నేర్పుదలిర్ప
మగవారి పనికిఁ బంపక యెంగిలిడక । తగవొప్ప నన్నవస్త్రంబు లొసంగి
సంతరింపుము నీవె జనయిత్రి ననిన । నంతరంగమున దయారసం బెసఁగఁ
దరుణి! నీతెఱఁగెల్లదాచి చెప్పెదవు । పరుల కెవ్వాహను నిబద్ధి దెల్పుదురె
యైన నందులకేమి యతివ మానగరి । లోన సైరంధ్రికొల్వు వహించి నిలుము
చావ! నీకన్నవస్త్రము లేమికొదవ। నీమది కింపైననియతి నుండుమని
లాలనచేసి సిల్పఁగ నామెయొద్ద । నాళీకనయన కొన్నాళ్లు వర్తించె
పతిఁబాసి నిండలపాల్సేసి యితర । సతులఁ గొల్పించి నీచత సంఘటించి
గాసిబెట్టిన విధి కాంతపైఁ గరుణ । బాసి విధాతతోఁ బలికె నిట్లనుచు
నింతియకాదుసుమీ యింతకేను । వింతబన్నము లొదవింతు నీవెటులఁ
దప్పించెదవో చూచి తప్పింపుమనిన । నప్పుడావిధి కిట్టులనియె విధాత
యేమేమి యాపద లీవుచేసెదవో । యామహాపదలెల్ల నట్టునిట్టనక
యిప్పుడెగావింపు మీకమీఁద నేను । దప్పించువిధ మిద్ధృతముగఁ జూచెదవు
అనినఁ గానిమ్మని యవ్విధివేఁత । తనమది నొకకుత్సితక్రియఁ దలఁచి
యారాజుభార్యకు నలశుభాంగికిని । గూరిమి మిగులనెక్కుడుగా నొనర్చి
పగలురేలు శుభాంగిపై రాజపత్ని।యగు కళావతికి నెయ్యము తియ్యమగుట
జలకంబువేళ భోజనవేళ వీణ । యెలమిమీఱెడువేళ నెలదోఁటకేగు
వేళ నిద్దురపోవువేళ శుభాంగి । తోలియ్యమై సురథు వధూటి యుండె
నరమరలే కీర్వురటుల వర్తిలఁగ । సురథునిసతి యొక్క శుక్రవారమునఁ

దలయంటఁగ శుభాంగిఁ దటుకునఁబిలిచి।కలభూషణములు గ్రక్కున సడలించి
యామెచేతికొసంగి యవి దాచుమనిన । గోమలి నట్టింటిగూటిలో నుంచె
అతివకుఁ దలయంటి యటకలి వెట్టి । చతురతఁ బన్నీటజలకమ్ము లార్చి
తడియొత్తి చిద్రవస్త్రమొసంగ తిలక । మిడి కలపమలంది హెచ్చుక్రొవ్వీధుల
సరులు వేనలిఁజుట్టి సతి ధరియించు । గురుభూషణము లున్నగూటి చెంగటికి
నాసాధ్వి చనుచున్న యటమున్నె గోడ । వ్రాసినయట్టి సిరాదేవి చెడ్డ
విధిపనుపున క్రమింగివేయుట వలన । నధికరత్నస్ఫురితాభరణములు
కనుపించకున్న క్రొక్కటపడి యిచట।నునిచిన సొమ్ములేమో కాన మనుచుఁ
దల్లడించగ రాజతరుణి యిదేమి । చెల్ల నీచేతికిచ్చిన భూషణములు
నీవెఱుంగకయుండ నెందుఁబోయినవి । యీవనఱికును లేని యీచెడ్డతనము
రానేల బోఁటి యూరక గుట్టుగాఁగ । మానితాభరణముల్ మసల కిమ్మనుచు
నయభయమ్ములువోఁప నరనాథుదేవి । యయిన కళావతియనిన శుభాంగి
మోము వెల్వోలఁబోవ ముకుళితహస్త । యై మేనుగంపింప నడలుచుఁ బలికె
బోఁటి యీసొమ్ము లప్పుడె నడియింటి । గూటిలోపల నుంచి గొబ్బున నీకు
దల యంటవచ్చి యిందాఁక నీకడనె । నెలకొనియుంటి నీనిలయంబు నేను
చేరితినే యింతసేపు నన్నిపుడు । మీరు సొమ్ములకుఁబంపిన వచ్చి గూటి
కడఁజూచి సొమ్ములుగానక దిగులు । పడి ముందువెనుకదోఁపక యున్నదాన
చనవరినై యుండి జడియక పాప । మనకయో! యిట్టిద్రోహంబు సేయుదునె
చెడుబుద్ధి ననురట్టుసేయఁగాఁదలఁచి।గడుసులెవ్వరు సొమ్ము గ్రహియించినారొ
అది పరామరిశింపు మదిగాక దైవ । మదయమై మునుజేసినందుకు దోడు
నిపుడేమి యిడుమల నిడఁదలఁచినదొ । కపటంబు ద్రోహంబు కల్లనావల్లఁ
గలుగ దిక్కడఁ గొంతకాలంబు మెలఁగఁ।దెలిసియుండుదువు నాస్థితి నీవటంచు
పలుకు నకో మలి పలుకుల కలిగి । చెలువ! నీమీఁదమోసిన సందియంబు
నగరిలోఁదిరుగు నందఱిమీఁదఁ బెట్టఁ।దగవౌనె! యీదొంగతనము లెవ్వరికిఁ
గలుగవిచ్చటఁ బెట్లుకట్లను బడక । చలముసేయక సొమ్మొసంగు మూరకయె
ముదితరో! ముచ్చుకె మూరెడునోరు । గద! సొమ్ము లెత్తుక కాఱులాడెదవు
అని గువ్వకరిగొని యందఱగ్రమ్మ । కొని దిసంతులుగొట్టఁ గొమ్మ మాఱాడ

నేరక ధృతిదూలి నిర్విణ్ణయగుచు । నూరకయుండె నెంతోముగ్ధ గనుక
వారిసందడి రాజవరుతల్లి విన్న । ధైరయంబునఁ బిల్వనంపి యిదేమి
సద్దని కూరిమిసకియల నడుగ । నద్దేవితోఁదెల్పి రదివిని వగచి
యలచెలిఁ బిలిపించి యంతరంగమునఁ । బలికె నేటికి రట్టుపడియెద వబల
చెల్లబో! చేతికిచ్చిన సొమ్ములొడిసి।యిల్లుమ్రింగెనో యట్టె యెగసి యెంతైన
తెక్కలువచ్చిపారెనో! విన్నవాహ । నిక్కమానందురో నిన్ను నమ్ముదురో!
యెక్కడ దాచినా వెఱఁగింపు మురక । నక్కటా యిదిసైచునా! రాజువిన్న
ప్రాణంబుపైవచ్చు పాపంబుసొమ్ము । చే నేమియగు నిది సిగ్గుచేటింతె
దిక్కులే కొంటి వీధినిబడి యున్న । నెక్కొనుకరుణచే నిన్ను దెప్పించి
యాదరించిన ఫలంబంతయుఁ గలిగె । నీదుర్గుణమెకాదె నిన్నింత చేసె
నని పెక్కుభంగుల నారాజమాత । తనుఁ బ్రబోధించినఁ దనువెల్ల వడఁక
నడలుచువచ్చి యయ్యమ్మ పాదములఁబడి దీనయగుచు నప్పడఁతి యిట్లనియె
నోయమ్మ నాయున్క నొర్వఁగాలేక । మాయపువిధి యిన్నిమతకముల్ పన్ని
నొరుల పంచలఁ బడియుండఁ జేసియును । గరికరి మాన కీగతి నేఁచసాగె
లెక్కింపరాని బల్వాలగల సొమ్ము । దక్కనే యది తప్పిదారి దాఁచినను
నిమ్ముగా సొమ్మొక్కయెడనున్నఁ బ్రజల।నమ్మమి యొక చోట నాటియుండు ననుమాట నీవెఱుఁగవే మాయమ్మ యనుచు । మాటిమాటికి బోఁటి మనికితపడఁగ
నమ్మాటలాలించి యులరాజు దేవ । ద్రిమ్మరి యిది నీలి దీని కెక్కడిది
తగవును ధర్మంబు దబ్బరదాసి । మొగమోడియుండిన మొఱకుదనంబు
మాని సొమ్మిచ్చునే మనకని కినుకఁ । బూని దుర్విధివశంబునఁ గృపమాని
దీమసంబునఁ బట్టితెప్పించి నిట్టి । గోమునఁబెరిగిన కొమ్మ కోమలపు
కరములురెండు వెన్కకుఁ దివియించి । కఱకుముప్పిరిత్రాళ్లఁ గదియకట్టించి
తరటులఁగొట్టించి తఱచు నెత్తురులు।దొరుగ హేయనియేడ్చు తొయ్యలిఁ గినిసి
యోసి! మాసొమ్మిచ్చి యూరక యిల్లు। బాసి పొమ్మొటకైనఁ బ్రాణంబుతోడ
సొమ్మొసంగక వడి సుళ్లఁ బెట్టినను।ముమ్మరమ్ముగ మేను ముడియఁగొట్టింతుఁ
జెక్కింతుఁగండలు చిద్రుపలుగాఁగ । గ్రక్కింతు నెత్తురుల్ గారలఁబెట్టి
కూడునీళ్లిడక మిక్కుటపుటూఁకటను । మాడింతునని యవమానపూర్వముగ

దుర్భాష లాసురఘుఁడు పల్క బాల । నిర్భరశోకాగ్ని నెఱిదకిఁ గ్రుక్కి
మాఱాడకున్న నమ్మానవేశ్వరుఁడు । కారాగృహమున సంకలెలఁ బెట్టించి
దినదినమ్మ్మును బట్టి తెప్పించి కొట్టు । చును బెట్టుబాధింప సొమ్మ్మి నేనెఱుఁగఁ
జంపినఁజంపుండి సడిదీఱి ననుచు । గంపితగాత్రియై కాంత వాపోయె
నిటుల నాలుగునెల లెల్లయాతనలు । ఘటియింప డప్పి నాఁకటఁ గుందికంది
సంకెళ్లఁబడి చెఱసాలలో నొగిలి । పంకనిర్మగ్నయౌ పద్మినివోలె
గాసిల్లఁగ విధాతఁగని విధియనెడు । దోసకారి ప్రతిష్ఠదోఁప నిట్లనియె
కంటివె యీవాలుగంటిని రాచ । యింటిలో వైచి నేనేచిన తెఱఁగు
సైరిణీయనునింద సమకూర్చి పతికి । నీరసంబొదవించి యిల్లెడఁబాపి
యడవిలోఁ బడఁద్రోచి యీయాస పెట్టి।కడపటఁదెచ్చి యొక్కనృపాలు నింటఁ
బనులుగావింపఁ బాల్పఱచి పైదొంగ।తనము మోపనొనర్చి తత్కారణమునఁ
బలు తిట్లగొట్లను భంగమొందించి । యలమటఁబెంచి కారాగారసీమ
సంకెళ్ల వేయించి జాలిఁగుందించి । బింకంబడంచి డప్పికి నీళ్లు, గుడువఁ
గూడు, నొక్కపుడు చేకుఱఁజేసి ప్రతిన।యీడేర్చుకొంటి నీవిఁక దీని దొంగ
తనముమానిచి నిందఁ దలగించిమగని। నెనయఁజేయుముచూతమిపుడు నీమహిమ
అనిన నవ్వి విధాత యవ్విధికనియె । గనికరంబేది యీకల్యాణి కకట
యిడరాని యలమటలిడి పెక్కువెతలఁ । బడఁజేసితివి దుస్స్వభావంబు తోడ
నింతియకాకింక నేమైనసేయఁ । జింతించితివొ తుదఁజెందెనో! ప్రతిన
తెలియఁజెప్పుమటన్న స్త్రీ కింతకంటె । కలదె! దుర్దశ సేయగల సేఁతలెల్లఁ
జేసితి అంకు ఱ్రుచ్చిమి కల్లఁజేసి । యీసతిఁ బతిగూర్చు సేఁప్రయాసమను
విధినిఁజూచి విధాత వెండియుఁబలికె । నధికసౌశీల్యగుణాన్వితయైన
మెఱఁతఅంకునుఱ్రుచ్చిమియుఁదొలంగించి।చెలువుగూర్తునొకింత సేపులోఁజూడు
మీ దంపతులకోర్కె లీడేర్తు ననుచు । గాదె తొల్తఁ బ్రతిజ్ఞ గావించి తీవు
నది మఱువకయుండు మరుగుదెమ్మ్మనుచు।సదయుఁడై యవ్వీట సకలదుఃఖముల
పాలై చెలంగెడు బాల లాలింప । నాలోచన మొనర్చె నమ్మఱునాఁడు
సురథునితల్లియు సురథునిసతియు । సురథభూపతియును జుట్ల నెచ్చెలులు
పరిచర్యసేయ నప్పటసాల నుండి । హరిరాణిఁ బూజించు నవసరమ్మ్మునను

అందు గోడను వ్రాయనమరు శ్రీదేవి। యందఱుఁజూడ శుభాంగి మున్నిడిన
మేలిసొమ్ములు దిగమ్రింగిన దగుట। నాలోన ఖంగుఖంగన వెళ్లఁగ్రాసె
నిది కళావతి సొమ్ములెల్ల మున్ మ్రింగినదియేమొ శ్రీదేవి యన్నియు మఱలఁ
గరుణించెనని చెలికత్తియల్ దెలుప। ధరణీశ్వరుఁడు వానితల్లియు సతియు
వెరఁగంది రానందవివశులై రంతిపురములోఁ గలసతుల్ పురుషు లందఱును
నిందీవరాక్షి! సొమ్మ్నాక్షించి యలరు। నందనుగని సునందాదేవి పలికె
పరదేశముననుండి పఱతెంచి మనల। నెఱనమ్మియిచ్చోట నెలకొన్నసాధ్వి
పైదొంగతనమిడి పాపంపుసొమ్ము। కై దుఃఖపెట్టితి మయ్యారో తరచు
మొదట నవిశ్వాసములకు నిధాన। మదిగాక కొలలకు నాలవాలంబు
తల్లిబిడ్డలనె భేదముసేయు నెలవు। కల్లలకెల్ల నాకరము ధనంబు
ఒదిగి కన్పడక సొమ్మొకచోట నున్న। నుదుటఁ నవిశ్వాస మొకచోట నుండు
ననిమున్నె నాతోడనాడె నబ్బోటి। వినియును దెలియ కివ్విధిఁ గలంచితిమి
పట్టభద్రుని కూర్మిపట్టికిఁ గాక। యిట్టిసౌందర్యాదు లితరకాంతలకు
గలుగునే! నిడువాలుగన్నుల బెళుకు।తళుకుచెక్కుల నెఱుక్క దానికే యమరు
చిలుకఁగేరెడు పల్కు చిఱునవ్వుగుల్కు।తలిరుమోవెడు మోవి దానికే యమరు
నే రాజుదేవియో! యిచ్చోటి కేమి। కారణంబున వచ్చి గాసిఁ జెందినదో!
తలిరాకుబోణికా! తరటుల పెట్లు। చిలుకలకొల్కికా! చెఱసాల నున్కి
చందఁగంధికా! సంకెళ్లతగులు। ఇందునిభాస్యకా! హేయంపుఁ దిట్లు
దొరసానికా! కూడుదొరకని మనికి। కరిరాజగమనకా! కడలేని నెగులు
పట్టింప కిటువంటి పాపంబు గట్టి। కొంటిమేగద తెల్విగూడి యింకైన
బందిగంబునఁ గాసిపడు కుందరదన।నిందు రప్పింపుమోయి కుమార యనినఁ
దల్లి మాటలువిని తల్లడపడుచు। నల్ల భూవల్లభుం డప్పుడె లేచి
చెలులు కొందఱుగొల్వఁ జెఱసాల కేఁగి। వెలఁదుక సంకెళ్లు వీడఁగొట్టించి
బయలుదేరిచి గాసివడి మాసి దీన। యయితలవాఁచి బిట్టడలుచునున్న
యాయింతి గనుగొని యకటసీమహిమ। లోయక్క! తెలియ లేకూరక నిన్ను
బాధలఁబెట్టి పాపము గట్టికొంటి। వేధ మున్ వ్రాసినవేధ నిట్లయ్యె
నింటిలోపలికి రమ్మ్నాకనని వాలు। గంటి యచ్చెలులసంగతి వెంటరాగఁ

డోడొక్కని వచ్చిన తొయ్యలిఁ జూచి । వేడ్క సునందాది విమలాంగు లెల్ల
నెదురేఁగి కౌఁగిటనిడి బుజ్జగించి । సదయత నామెకు జలకమ్ము లార్చి
సరసాన్న పానీయసంతుష్టఁ జేసి । కరములు వార్చఁగాఁ గపురంపు విడెము
గైరవ ల్లుదయభాస్కరు లుంచి యొసఁగి।నేరంబు సైపవే! నీకేజగంధి
రామ! నట్టింటి సీరాదేవి వలన । నీమహాపద జనియించె నీకనుచు
నా సొమ్మువచ్చిన దంతయుఁ దెలుప । నాసడి తీఱెగా! నాకంతె చాలు
నమ్మలార! యటంచు నామె నెమ్మనము।నిమ్మళించఁగ నుండె నెలపూట లచట
నాతలఁ గొన్ని నాళ్లరిగిన వైరి । జేత రత్నాంగదక్షితినేత సకల
దిక్కులు గెలిచి కీర్తిద్యుతుల్ విరుల।ప్రక్కులవలె నల్దిశలు గ్రమ్మ్కొనఁగఁ
దన బావయగు సురథక్షితీశ్వరునిఁ । దనదు కూరిమిసహోదరిఁ గళావతిని
గనుగొనఁ దలఁచి తత్కటక బాహ్యోప । వనమునఁ దన పరివారంబు నిలిపి
తగు మంత్రివరులతోఁ దా నేఁగుదేర । నగరబాహ్యమున కన్నరపతి వచ్చి
యతనిఁ గౌఁగిటఁజేర్చి యాప్తసామంత । హిత బంధుమిత్ర సమేతంబు గాఁగ
పున్నాగవతికి సొంపునఁ గొనిపోయి । యున్నత మణిసౌధ యూథంబు చేతఁ
బొలుచు నంతఃపురంబున హొన్నుపనులఁ।దళుకొత్తు నొక్కసౌధంబున నుంచి
వివిధోపచారముల్ వేడ్కఁగావించు । నవసరమ్మున సునందాన్వితయుఁగుచు
అక్క కళావతి యరుదేర లేచి । ప్రక్కున మ్రొక్కినఁ గౌతూహలమున
నక్కునఁ జేర్చి రత్నాంగదు వార । లొక్కట దీవించి రుచితవాక్యముల
నంతటఁ గుశలమ్ములడిగి యొండురులు । కొంతసేపచ్చటఁ గొలువుగా నుండి
ప్రొద్దువోయెను లెమ్ము భోజనమ్మునకు । నొద్దివారలకు సెలవ్వొసఁగు మటంచు
నల బావతెలుప నాయన మంత్రులకును । సెలవిచ్చి యమ్మేడఁ జెచ్చెర డిగ్గి
జలకమ్ములాడి భోజనశాలఁ జొచ్చి । యలరు బంతిని దమయప్ప వడ్డింపఁ
బరిపరి కూరల భక్ష్యభోజ్యముల । పరితుష్టులై పాణిపద్మముల్ వార్చి
పురతకాల్జముఖాణములపైఁ దివాసు । లొరుగుబిల్లలు గల యొక పటసాల
నిరవొంది యిరువంక నివురాకుబోండ్లు । సురటీలు మేలి వీచోపులు ప్రూని
యూడిగంబు లొనర్ప నొక ముద్దులాడి । వీడియంబొసఁగఁ బల్వోడుక నున్న
తరి శుభాంగీభామ తద్రత్నధామ । పరిసరంబున కొకపని నెపంబూని

పఱతెంచె నితఁడు నాపతియెు వేఱొకఁడొ । పరికింతు నిపుడను భావంబుతోడ
పఱతెంచి యతనిఁ దప్పక చూచె నొక్క-।మఱుగునఁనుండి కోమలి యిట్లుచూచి
యితఁడె నాప్రాణేశుఁ డిన్నాళ్ళ్కి కార । యితనిఁ గన్గొనఁగల్గె నెదతాప మణఁగ
మరుఁడు ప్రేరేప నిమ్మహిపతి యెదుటి।కరిగిన నలనాఁటి యవగడం బెంచి
యలుగునో!యలుక లేక దియేమియనుచుఁ।దెలియ నన్నడుగునో! తెలిసిన వెనుక
నెలమి లాలించి నన్నేలునో లేక । యిలువెడలిన సతి యిఁక నేల యనుచు
విడనాడి మోడిగావించునో! యిటుల । నెడయఁజేసిన ద్రైవ మిఁకమీఁద నైన
గృపయుంచిపతిఁగూర్చి యీ మనస్తాప।మపనయించక యున్నె! యీశంక యేల
నావల్ల నేరమున్నగదా తొలంగి । పోవలె నెదుటికిఁ బోయినఁ జూచి
యేమనునో చూత మిప్పుడపోక । తామసించినమీఁదఁ దప్పు గార్యమని
యీలోచనమొనర్చి యల్లన భూమి । పాలసూతి వసించు భవనంబుత్రోవ
నరుగుచునున్న రత్నాంగదుఁ డట్టె । పరికించి నివ్వెరపాటు వహించె
పులకలు మైఁబర్వఁ బూఁబోణి పాద । ములనీటు మీఁగాళ్ళ ముఱువు సన్నంపు
నడుము పీదటికంబు నాభి పొంకంబు । గడుసు పాలిండ్లబింకము బాహులతల
చెలువంబు తళుకు లేఁజెక్కుల నెక్కు-।సొలఁపు వాలుమెఱుంగుఁ జూపుల కైపు
కనుబొమల్ గన్నచక్కఁదనంబునుదుటి।గొనబుడాల్ నగుమోముగోమునెమ్మోని
మించు రాయంచలమించు నెన్నడల । సంచు వేమఱుగాంచి సౌందర్య మెంచి
యిందుబింబాస్య యిదెవ్వఁతో దీని । యందంబుగన్న శుభాంగి యట్లమరె
నచ్చోత్తినటుల నయ్యతివమై పుణికి । పుచ్చికొన్నటుల నిప్పాలఁతి యొప్పెడిని
నాయింతి యీనాఁడె యడవిపాలయ్యె । నీయెడ కదియెట్టు లేఁగుదెంచినది
దాని చక్కఁదనంబు దాని లేఁబ్రాయ । మీనెలంతకుఁ గల్గ నీక్షించినపుడె
యవుర!తోఁచె శుభాంగియను సంశయంబు।భువి లేరె మానిసిఁబోలు మానిసులు
నింత చిత్తిలనేల యీమె వృత్తాంత । మంతయు వినియెద నప్పచే ననుచుఁ
దన చెంతనున్న సోదరిమోమునఁ జూచి । యనియె నిచ్చెలి! యెవ్వ కలినీలవేణి
దీనికులంబేమి దీనిపేరేమి । యీనాతి పతియెవ్వఁ డెన్నినాళ్లాయె
నిచ్చటి కరుదెంచి యేపనిసేయు । నిచ్చంద్రముఖి తెల్పు మిదియెల్ల ననిన
నక్కళావతి పల్కె నన్న! యిక్కాంత । యెక్కడినుండియో యీపురవీథి

గాలివాటునఁ బడఁగని మనయత్త । చాలఁగూరిమి సఖీజనముచే దీనిఁ
బిలిపించి యూరేమి పేరేమి యనిన । జలజాక్షి సైరంధ్రిజాతి దా ననెను
తల్లిదండ్రులపేరు తనయూరిపేరు । వల్లభుఁ డెలుప దేవగను వేఁడినను
ఆనాఁటినుండి యియ్యతివ సైరంధ్రి।యై నన్ను బెడఁబాయ కనిశంబు మెలఁగు
గన్నెత్తిచూడ దెక్కడ మగవారి । నిన్నెలంతుక భుక్తి యేకవారంబె
దీని సౌశీల్యంబు దీని సద్గుణము । లేను నెచ్చెలులతో నెపుడు వర్ణింతుఁ
దిలకించెదము పెక్కుదినముల నుండి । తెలియంగఁ బరమపతివ్రత యిదియె
యిది యెవ్వరనుచు నన్నీవడిగితివి । యిదియేమి గుర్తెఱు కేమైనఁ గలదె
పలుమారు దీనిఁ దప్పకచూచు టేమి । కలను లేదింత నిక్కము డాఁచలదుఁ
నీకు నాతోడు విన్పింపుమటన్న । నాకూర్మితోడుతో నతఁడిట్టులనియె
అక్క నే మును వివాహంబైన యట్టి।యక్కన్యను శుభాంగి యందురు దాని
చిన్నెలువన్నె లీచివురాకుబోణి । కున్న నివ్వెరపడి యురక కన్గొనుచు
భ్రమసి నిన్నడిగితిఁ బరపురుషాభి । గమనంబు దానివంకను గానఁబడిన
నలిగి యమాత్యుల నంపితి నడవిఁ । బొలియింపుఁడని యట్ల పొలియించి వారు
చెలియరో నెత్తురుచీరఁ దెచ్చిరది । తిలకించి యాభ్రమ దీటి యుండితిని
నిప్పుడాసతి రూప మీకాంత యందుఁ । దప్పక కనుగొని తహతహఁ జెంది
యిది యేమిపొలిసినదెటులఁదోఁచినదొ।యదిగాదొ యిది లేక యన్యకామినియొ
అని వితర్కించెదనని యయ్యుదంత । మనుజుండు దెల్పఁగా నక్కజం బంది
యక్క యిట్లనిఁయె నన్నా! నీయమాత్య।లిక్కాంతను వధింప నేమిటి కనుచు
నడవిలో విడిచి నీకామాట మఱుగు।పడఁ దెల్పి రేమొ యీ పద్మాయతాక్షి
పరపురుషాపేక్ష భావంబు నందుఁ । బొరయ దొకప్పుడు బుద్ధి నూహింప
నీ సందియంబేల యేకాంతమునకు । నీసతిఁ బిలిపించి యీవడుగు మని
యనుజుని భర్మహార్మ్యమునకుఁ బనిచి । జనపతిదేవి యాసైరంధ్రిఁ బిలిచి
యలివేణి యీమేడకరిగి శీఘ్రమునఁ । గలపంబుగిన్నెయు గమ్మక్రొవ్వీరులు
గొనితెమ్ము పొమ్మన్నఁ గోమలి మంచి । దని పతితో రహస్యముగ మాటాడ
నెడ గల్గెనిపుడని యెంచి విధాత । కడుఁ దొరసేయ నొక్కట మేడయెక్కి
వినయంబు భయమును విశ్వాస మెనయ।తనప్రాణవిభుని ముందర నిలుచుటయు

మెఱమెఱ మదిగ్రమ్మ మెలఁత నీక్షించి।యరమర బెరయ నాయన యిట్టులనియె
యెవ్వరిదానవే! యిగురాకుబోణి । యెవ్వతెవీవు పేరెయ్యది నీకు
నీవిభుం డెవ్వాఁడు నీకులం బేమి । యీ వంతయునుదెల్పు మీవంత మాని
యూఁచక వాఁచక యున్న కార్యంబు । దాఁచక తెల్పినఁ దగవరి వనుచు
నిన్ను మెచ్చగవచ్చు నిజముగా ననినఁ । గన్నీరుమున్నీరుగా వెక్కి వెక్కి
యడలుచు నధిపుని యంఘ్రిపద్మములఁబడి యశ్రువుల నర్ఘ్యపాద్యంబు లిచ్చి
మఱలుతో నన్మానమగువను నన్ను । మఱువఁజేసెను గదా! మాయదైవంబు
నాపాలి పెన్నిధానంబవు నీవు । నాపేరు మఱచితె ! నాప్రాణనాథ
నే శుభాంగినిగానె నిన్నెడఁబాసి । క్లేశమందెద నన్యగృహమున నుండి
తొలిజన్మమున దంపతుల నెవ్వరెవరిఁ । జెలిమిమానిచి పాయఁజేసి యుండితినో
ఆపాపఫల మిప్పుడనుభవించితిని । నీపదాబ్జములాన నినుమాని యితర
పురుషుని నేస్వప్నమునన్నైనఁదలఁప । పరమేశ్వరుఁడె సాక్షి పలుమాట లేల
యట్టి పతివ్రతనై నచోఁ జూప । చుట్టి నాఁడొకపురుషుని దాఁచు టేమి
యని యడిగితివేని నాకథ వినుము । వినిపింతునని తనవృత్తాంత మెల్లఁ
బఱతుక తెల్పి నేఁ బడరాని బాధ । పడి నేఁడు మీపాదపద్ము ల్గంటి
ఁది యథార్థము నమ్మరేని మున్ సీత । సొదఁజొచ్చి నట్లగ్నిఁజొచ్చి వచ్చెదను
శూరసేననృపాలసుతనై జనించి । యీరట్టతోఁ బ్రాణమెటుల ధరింతు
బాస లేమిటికని వాటింప కలుక । చేసితిరేని మీశ్రీపాదయుగళి
చేరువ విడిచెద జీవంబనంగ । నారాజు మదిసందియము దీర కపుడు
వెరగంది యుండగా విధితో విధాత । యరుదెంచె నవరత్నహారాళి తోడ
మణికిరీటముతోడ మార్తాండతులిత । ఘృణి ధగద్ధగిత శౌరిరాభ తోడ
పరిపూర్ణ చంద్రబింబ సమానవదన । దరహాస చంద్రికాధవళిమ తోడ
పజ తెంచి యతనికిఁ బ్రత్యక్షమైన । నరుదంది లేచి సాష్టాంగముల్ చేసి
హేమాసనమున నయ్యిద్దఱి నునిచి । కై మోడ్పు నిటలభాగంబునఁ జేర్చి
భవ్యవచఃప్రౌఢిఁ బ్రస్తుతుల్ సేయ । నవ్యాహతైశ్వర్యమస్తు భూపాల
యే మెవ్వరమొ యని యీవెంచవలవ।దీమూఁడుజగముల హెచ్చుప్రాణులకుఁ
బొలుచు శుభాశుభంబులు పుణ్యపాప । కలనచే ఘటియింపఁగల దేవతలము

ఈ కాంతవిధి, వినుమీను విధాత । నేకాగ్రమతిఁ జరియింతు మిజ్జగతి
నీవు నీసతియున్న నెనరు మోహంబు । భావించి వీరలఁ బాయగాఁజేయఁ
దరమానె! యనిన మద్వచనంబు మెచ్చుకరరె! యిదెంతకార్యము వీరి నిదిగొ
యెడఁబాయగాఁజేసి యిఁక నీలతాంగి । నిడుములఁ బడఁజేతు నీక్షింపు మనుచు
నీవిధి నాతోడ హెచ్చుప్రతిజ్ఞఁ । గావించి యద్దంబు గనుగొను నపుడు
కనఁబడఁజేసె వికారంపురూపు । వనిత నందున నీవు సైర్వారిణి యనుచు
నిలు వెడలించితి విచటికివచ్చి । యలమట పడఁజేసినది విధికృతము
ఈ యపనమ్మిక లెల్లనడంచి । తోయజముఖిని నీతోఁ గూర్తు ననుచు
విధితోడఁ బ్రతినగావించితి నేను । మధురభాషిణి యిది మహనీయశీల
అతివ నీతో నిప్పుడాడిన మాట । క్షితినాథ! సిద్ధంబు సిద్ధంబు నమ్ము
మానాఁటి శవరూప మాయెడ మీఁదఁ । గానింపఁజెనె నీవుగంటివే మరల
నదిమాయగనుకదృశ్యంబయ్యె నపుడె।యిదిగొచూడుము దివ్యదృష్టి యిచ్చితిమి
అనిన రత్నాంగదుఁడు డానందమంది । తనలోనఁజూచి యెంతయు దబ్బఱగుట
తెలిసి వారలకు విధేయుఁడై పూజ । సలిపె నప్పుడు విధి సతిఁజేరఁ దిగిచి
యక్కునఁ గదియించి యక్క నావలనఁ।బెక్కాపదలుడాసెఁ బ్రియు నెడఁబాసి
యలమటఁబొందితి వడలకు మింక । నలరెద వైదువవై పెక్కుసమలు
బహుయాగకర్తయై ప్రబలు నీభర్త । బహుపుత్రకులఁ గాంచి పరగెద వీవు
బహు భోగభాగ్యసంపదలతో మీఱు । వహికెక్కుడని పెక్కువరము లొసంగి
యా రాజసుతు భావ నలకళావతిని । వారి బాంధవులను వారినెచ్చెలుల
నందఱఁ బిలిపించి యాశూరసేన । నందని చరిత మందఱు వినఁ దెల్పి
యపుడె పునర్వివాహంబు సేయించి । కృపతో విధివిధాత లేఁగి రవ్వేళ
సావిత్రికెనయైన సతిఁగూడి మోహ । మావహిల్లంగ రత్నాంగదుం డపుడు
అక్కయు భావయు నాదృతిసేయ । నక్కడఁ గొన్నినా ళ్లధివసియించి
వారి వీడ్కొని బహువాహినుల్ గొలువ।నాహూతమహిమ రమాస్పదపురము
తాఁ జేరి తల్లికిఁదండ్రికి మ్రొక్కి । నా జగన్నుతశీలయైన శుభాంగి
యత్తమామలకుఁ బ్రియంబున నెఱఁగి । యుత్తమసతివమ్మ యునిద నీవనుచు
వారెంచ నెచ్చెలుల్ వర్ణనసేయ । శూరసేనుఁడువచ్చి సుముఖుఁడై పొగడె

నెందునఁ గొఱఁతలే కెల్ల సౌఖ్యములఁ। జెంది భర్తనుగూడి సిరులొంది వెలసె
నీశుభాంగిచరిత్ర నెలమితో వినిన । ధీవిశాలులకు సుస్థిరభోగభాగ్య
మహిమ లిష్టార్థసంపదలు చేకూరు । మహనీయశీలలై మగువ లొప్పుదురు
అని శీరమణి తెల్ప నలరి యూరమణి । వినఁగల్గె సత్కథ వేఁడుక ననుచు
నాచిల్కఁ బొగడుచు నరిగెలోపలికి । నాచరిత్రము దూతి యధిపుతోఁ దెలిపె
నని శంభుఁడెఱిఁగింప నవ్వలికథలు । వినిపింపుమని గౌరివెండియు నడిగె
సరసపతివ్రతాచరితంబు నందు । ఘనమై పదేనవకథ పూర్ణమయ్యె

సులోచనకథ

శ్రీవిశ్వపతి సమంచిమతి గౌరి । కావలికథ యిట్టులని తెల్పఁదొడఁగె
బోఁటిరో! మఱునాఁటిప్రొద్దు మాపంటి । పూఁట దూతికపిల్వఁ బువుగుత్తిపేరి
చెలువ చెంగటికి వచ్చిన నాదరించి।యలచిల్క నునుతేనియలు చిల్కఁ బలికె
దన భక్తినిజమైన దైవంబుమెచ్చు । ననుమూట కొకయితిహాసమ్ము గలదు
అది పతివ్రతకథయై యొప్పు వినుము । మదిరాక్షి ! గౌళభూమండలం బేలు
తరణితేజుఁడు కీర్తిధాముఁడన్ రాజు । పరవీరసంహారపటుబాహుబలుఁడు
అతనికి మణిరేఖయను భార్యయందు । సుతయొక్కతె జనించె శోభనగాత్రి
ఆకన్యకు సులోచనాహ్వయం బిడియె।ఔర్మ్మికమనుఁడు సులోచనకాంతిఁ జూచి
యాసులోచన దాను లనిశంబు ప్రోఁది । చేసి పోషింపఁగాఁ జిగురువిల్కాని
చికిలి క్రొవ్విరితూఁపు చెలువున మించె।సుకుమార తనువిభా శోభిత యగుచు
నయిదేండ్లు నక్షరాభ్యాసవిలోల । యయి నేర్చె నేడేండ్లు నఖిలవిద్యలును
సంగీతవిద్య సాక్షాత్కారమా తె । అంగున జంత్రగాత్రము లభ్యసించె
పాట లాగతిఁదలిర్పఁగ నాట, నమర । పాటలాధరలకుఁ బ్రతి యన మించు
తా నభ్యసించు విద్యలలో మురారి । పూనిన త్రిభువనాద్భుతవిలాసములు
గనివిని యతనిపైఁ గాంక్ష జనించి । వనిత శ్రీహరినె వివాహమాడు నని
హరికథలె పఠించు హరినే తలంచు । హరినామమె స్మరించు హరినె భజించు

మాంపాహి లక్ష్మీశ మాంపాహి కృష్ణ!మాంపాహి గోవింద మాంపాహి శౌరి
యని యెన్నిదేండ్లప్రాయముగన్న మొదలు । వనజనాభుని నిట్లు వర్ణనసేయ
వినితండ్రి యిదియేమివిధము మాయమ్మ!కనకాంబరునివీఁదఘనభక్తిగ్రమ్మ
నతని గణించెద వాశయంబేమి! । మతిదాఁచక గణింపు మాతోడ ననుచుఁ
దొడవినీఁద నిమికొని తోరంపుఁబ్రేము । నడిగినఁ జెలి మందహాసచంద్రికలు
తన ముఖపూర్ణసుధాకరు నందుఁ । గనుపింపఁ బల్లవగ్రాస కషాయ
కలకంఠ కలకంఠిగతి నిట్టులనియె । తెలిపెద వినుమయ్య ధృతిజితాహార్య!
శ్రీలక్ష్మి నెడఁదనుంచిన మహామహుని । నీలమేఘముఁబోలు నెమ్మేనివాని
తత కటీతటబద్ధ తపనీయ వసను । సతతత్రిలోకరక్షణ గుణోల్లసను
హరి నుగ్రద్వైభవహారిని సుధాల । హరిని గేరుమృదూక్తి నలరుబాగరిని
వలచి పెండ్లాడగా వలెనని యెపుడు । దలఁతు నాభాగ్య మేదారి నున్నదియె
యనిన గొళనృపాలుఁ డలఁతినవ్వాలయఁ । దన ముద్దుకూఁతును దప్పకచూచి
తల్లి! నీవిదియేమి తలఁచితి వాత్మ । చెల్ల! నిన్నెటువలెఁ జేపట్టు శౌరి
ఫాలాక్షుఁ డజుఁడును భావింపలేరు । నీలవర్ణునిఁజూడ నీ నాతరంబె
బాలవుగావున భ్రమపుట్టె నేమొ । యేల చాలింపవే యీమాట లనిన
కన్నతండ్రినిఁ జూచి కలకల నవ్వి । యన్నీలవేణి యిట్లనియె నోయయ్య!
హరి నీవుచెప్పినయటుల దుర్లభుఁడు । పరమాత్ముఁడగు కనంబడఁ డెవ్వరికిని
నైన నమ్మినవారి కతిసులభుండు । వీనులవిందుగా వినుపింతు వినుము
గోపాలబాలికల్ గోరిన వారి । ద్రోపల్లెఁ జేపట్టి విహరింపలేదె
నయగుణబృంద బృందను నేలలేదె । దయ పదియార్వేల తరుణులు తన్ను
వలచినఁ బెండ్లాడి వారితోఁగూడి । యలరఁడే! నునుగంధ మర్పించెనను
మున్నుగుబ్బను మోహమున నేలికొనఁడె । వెన్ననిచర్యలు వినలేదె కృతుల
నతని భజింపఁగా నన్మదపేక్ష । హితమతి నొనఁగూర్ప కేల పోవిడుచు
ననిన మాయమ్మ! మహాభాగ్య మాయె!నని సమ్మతించి యాయన దానిమెచ్చి
ముద్దిడుకొనియె నమ్మునితకు నంత । నద్దిరా యనఁ బూర్ణయౌవనం బొదవె
గచనిచయము మధుకరరుచిఁ గేరె । కుచములతీరు లికుచముల మాఱె
చెక్కులు బంగారుచెక్కుల మించె । పొక్కిలి నునుపొన్నపువ్వు వాసించె

మోము పూర్ణేందుగోము నిరాకరించె। కామునిమేల్ తూఁపు గర్వించే జూపు
బింబంబునకుఁ బ్రతిబింబమై మోవి । డంబూనె భూమివిడంబించే బిఱుదు
గగనంబు సొబగు గ్రుంగఁగ నయ్యె కౌను।చిగురుల నడుగు లేచి గురుత్వ మందె
దాని లేఁబ్రాయంబు దర్శించువారి । కానందకందమై యతిశయం బందె
నంతట నొక్కనాఁ డలినీలవేణి । కాంతలు పెక్కండ్రు గదిసి కొల్వఁగను
నొక్క యుప్పరిగపై నోలగంబున్న । చక్కగవిల్తు మెచ్చని వన్నెకాఁడు
కమలాకరుండను క్ష్మాసురసుతుఁడు । కమలాసమాన నక్కన్యను జూచి
యిది రతియో ! లేక యింద్రుని సతియొ । యదిర! శృంగారసాధి దేవతయొ
యల్ల మోహినియొ ! రంభాదులకైన। జెల్లఁబో! యిటువంటి చెలువంబు గలదె
యని మోహావిభ్రాంతుఁడై యింటికరిగి । మనసిజ శరపరంపరలచేఁ గరఁగి
విహతాపంబున, వేదురుగొన్న । నరుని తెఱంగున నలఁకువ చెంది
యుచితక్రియల్ మాని యూరకయున్న।యచటికిఁ దత్సఖుండగు పురోచనుఁడు
విశ్వకర్మకులుండు వివిధశిల్పముల । విశ్వజనుల్ మెచ్చ వెలసినవాఁడు
చనుదెంచి యతఁడున్నచందంబు గాంచి । యనియె నిట్లని కమలాకర ! నేఁడు
నీవున్నవగయేమి నీకేల వచ్చె । నీవెత, నేఁగల్గ నేల యీజాలి
యెంత దుర్ఘటమైన నే ఘటియింతు । వంతఁజెందక వేగ వచియింపు మనినఁ
దనమోము తెలిసి యాతఁడు వేగలేచి । నెనరైన సఖుఁడవు నీకు దాఁపుదునె
యేపనియైన నీవేర్పడ వినుము । భూపాలు సదనంబుపొంత వచ్చుచును
మేలుప్పరిగవిఱాఁద మెలఁగుచున్న । బాల, సులోచనాభామను గంటి
కనుగొనినప్పుడె గాత్రంబు మఱచి । ననవిల్తునకుఁజిక్కి నలఁకువ స్రుక్కి
యిటువలె నున్నాఁడనేమందు ననిన । బటుబుద్ధి సొన్నారిపలికె నిట్లనుచు
నా రాజకన్య శ్రీహరిఁదక్క నితర । పురుషులను దాను బొందనటంచు
బాలత్వమునను నుండి ప్రతినపట్టినది । ప్రోలెల్ల నెఱుఁగు నెప్పుడు నీవువినవె
నిన్నేలఁ గామించు నృపకన్య యైన।నున్న దిందులకొక్క యుపమ యూహొనుము
నీయింటిధనమును నీకున్నమణులు । నాయింటిసొమ్మును నారత్నచయము
నొక్కటఁగూర్చి నేనొనరించు గరుడి । నెక్కి వెన్ననివేష మీవు ధరించి
వనజాక్షి మేడపై వ్రాలెడి నటుల । నొనరింతు సూత్రప్రయోగంబు వలన

నందున నిన్ను శ్రీహరియని యెంచి । మందయాన వరించు మరులావహిల్ల
దీమసమ్మున సొమ్మొదెమ్మని యతని । హేమరత్నావళు లెల్ల గ్రహించి
తన యింటిసొమ్మెల్ల దానొనగూర్చి । కనకమయంబుగా గరుడి నొనర్చి
మకరకుండలములు మహనీయరత్న । మకుటంబు కౌస్తుభమణిహారలతయుఁ
గంకణంబులు భుజాంగదనూపురములు । కింకిణీజాలసంకీర్ణ కాంచికయుఁ
గరమొప్పుఁ గృత్రిమకరములు రెండు । దరచక్రశార్ఙ్గగదానందకములు
కనకాంబరము శిల్పకలనఁ గల్పించి । దనుజారిరూపు ప్రత్యక్షమైనట్లు
గావించి మఱియు సింగారించి జాళు । వావన్నెపులుఁగుపై వాని నెక్కించి
యిరవొంద వినువీధికెగిరెడు సూత్ర । మెఱిఁగించి జడియక యేఁగుమటంచుఁ
బలికిన సూత్రంబు పాణిఁదెమల్చి । వినువీధికెగసి యవ్విప్రనందనుఁడు
బాలికయున్న యుప్పరిగపై వ్రాలె । నాలోనఁ జెలులమ్మ! హరి వచ్చెననుచు
భయభక్తి వినయసంభ్రమయుక్తిఁ దెలుప । రయమునలేచి యా రాజకుమారి
ముంగురుల్ సెదరనెమ్మోము సెమర్పనంగముల్ వణఁక హొన్నందియల్ మొరయ
కంగుల రవిక పక్కన ప్రక్కలుగను । శృంగారరసమెల్లఁ జిందఁ నేతెంచి
బలుకాంతి దిశలెల్ల బంగారుసేయ । ఛలవైనతేయుపై సవరొందు వాని
కరగతశంఖచక్రంబులవాని । హరువొందు కౌస్తుభహారమ్ము వాని
వలెవాటుగాఁ బదార్వన్నె పచ్చడము।చెలువొప్ప ధరియించి చిగురుకెమ్మోని
చిఱునవ్వువెన్నెలల్ చిలికెడువాని । నెఱిచందు నిరసించు నెమ్మోమువానిఁ
గనుగొని యితఁడె సాక్షాద్విష్ణుఁడనుచుఁ । దనువెల్లఁ బులకింపఁ దటుకున లేచి
పన్నిటఁ దత్పాదాబ్జంబులు గడిగి । కన్నుల హర్షాశ్రుకణములు దొరఁగఁ
దన పటాంచలమునఁ దడియొత్తి బత్తి । దనర నాదండ కైదండ యొసంగి
పడకింటిలోఁ బువ్వుబాన్పున నుంచి । తడయ కాతనిరాక తండ్రికిఁ దెలుప
నతఁడును హర్షించి హరి యల్లుఁడాయె । గృతకృత్యత ఘటిల్లె నిపుడని తలఁచి
తగువారితోవచ్చి దర్శించి పెక్కు । వగలఁ బూజలొనర్చి వైకుంఠవాస !
కేశవ ! మాధవ కృష్ణ ముకుంద । యీశ ! హృషీకేశ ! యిభరాజవరద !
నాకోర్కె లీడేరె నాతపంబలరె । నాకులం బతిపావనంబయ్యె ననుచు
వంది కైవడి పెక్కువగలఁ గీర్తించి । చందనగంధి నజ్జవరాలిమిన్న

చారులోచన సులోచన దారవోసె । నారూఢభ క్తిఁ గృష్ణార్పణంబనుచు
నందున నానందమంది యాద్విజుఁడు । మందహాసమున నమ్మనుజేశుఁ జూచి
తొలిజన్మమున మీరు దొడ్డతపంబు । సలుపుట నేను సాక్షాత్కరించితిని
నీకూర్మితనయ యిందిర యంశమునను । నీకుఁ గల్గుటఁజేసి నే వరించితిని
సకలదేశాధీశసమితి జయించి । యిఁక సుఖస్థితినుండు మిలరాయ! యనుచు
నా మామ వీడ్కొల్పి యతులగుణాభి । రామ సులోచనారామఁ జేపట్టి
యలరుఁబాన్పునఁ జేర్చి యంగజు కేళి । నలరించి వివిధసౌఖ్యము లందుచుండె
హరి యిల్లటపుటల్లుఁ డాయెనటంచుఁ । గరముద్ధతి వహించి గౌళభూవిభుఁడు
కురుమద్ర గాంధార కుకుర కాశ్మీర । కరహాట మరహాట కర్ణాటలాట
శకభోట చోళపాంచాల సాళ్వాది । సకలదేశాధీశసమితి గైకొనక
ప్రల్లదంబులుపల్కఁ ప్రాభవంబెసఁగ । నుల్లాసమున మించ నుర్వీశులెల్ల
జతగూడి గౌళదేశవిభుండు మనల । మతినించుకెంచక మత్తిల్లినాఁడు
హరి యల్లుఁడాయె నటంచుశౌర్యమున । వెరవక యందఱు వేధింపఁ దొడఁగె
హరియైననేల భయముఁజెంద మనకు । హరిచేతఁజచ్చిన నపవర్గ మొదవు
చావక గౌళభూజాని గెల్చిన మ । హావిభవఖ్యాతు లబ్బు నీక్షణమె
యని వితర్కించి సమస్తభూపతులు । ఘనగజరథతురంగ భటాళిఁ గూడి
బహుతరాక్షౌహిణీపరివృతులగుచు । నహితభీకరుఁడైన యగ్గౌళవిభుని
పురి చుట్టువిడిసి యాప్తులు నింగిముట్ట । మురజ వాదిత్రగోముఖ శంఖపటహ
భేరీధణంధణల్ పిక్కటిలంగ । వీరహుంకారముల్ విస్తరిల్లంగ
నని యొనరింప రమ్మని దూతనంప । విని కీర్తిధాముండు వెలవెలఁబోయి
వివిధదేశాధీశవితతి నొకండ । బవరంబుఁజేసి నేఁబరిమార్పఁగలనె!
వెతయేల నాయింట వెన్నుఁడున్నాఁడు।జితదైత్యుఁ డతనికి క్షితిపతు లెదురె!
హరి కెతెంగించెదనని లేచి యంతి । పురమున కరుగునప్పుడు రహఃకేళి
చెలియాకుమడుపు లిచ్చినఁ. బంటఁగొఱికి।వెలఁది!యీఁదగునంచు వేఁడెడువానిఁ
గపటమురారి వైఖరి నొప్పువానిఁ । జపలత గడియ కాజలజాక్షిఁ బిలువ
నాయింతితమయయ్యయ దెవచ్చెనను।నాయనకెతేఁగించియరుగుదెంచుటయుఁ
బరన్పపుల్ బహుసైన్యపరివృతులగుచుఁ।బురిఁజుట్టుకొన్నారుపూబోడియిపుడు

ఈమాట మురవైరి కెఱిఁగింపు మనిన భూమీశుమాట లప్పాలఁతి దెల్పుటయు
విని గుండెదిగ్గన విప్రనందనుఁడు । వినిశితాస్త్రము చెవి వేసినట్లైన
దిగులొంది యొక లేనిదిటవుదెచ్చికొని మగువ! దైత్యులఁద్రుంచుమచ్చక్రమునకు
నీనరాధము లెంత! యిందఱి నిపుడె । నేను శిక్షింతు మీనృపతి రక్షింతుఁ
గనుగొందుగాకని గ్రక్కునలేచి । కనకమయాకారగరుడుని నెక్కి
వలమురి డాకేల వలయంపుఁగత్తి । వలకేల ధరియించి వడి దివంబునకు
నల సూత్రమెగఁబట్టి హైరణ్యకాంతి । కలితగరుచ్ఛటల్ గగనాంతరమున
ధగధగలీనంగఁ దనుకుచు నాత్మ । జగతీసురుండు విచారింపఁ దొడఁగె
నిక్కంబు హరినని నృపతికుమారి । నిక్కివడి వరించి యిన్ని నాళ్లుండి
కడపటఁ బగవారిఁగని భీతిఁగూరి । విడిచి పోవగరాదు విడిచిపోకున్న
నీరాజుల జయింప నేసమర్థుఁడనె । యూరక పోనేల! యుడువీధి నుండి
హరిబిరుదులు కొన్ని యభినుతుల్ చేసి । వెరపించి చూచెద వీరుపోకున్న
మఱిమీఁద నేనొకమార్గంబు పట్టి । పఱచెదగాకంచు భావంబునందు
యోజన గావించి యగ్రుండ్రై యల్ల । రాజులఁ జూచి దుర్వారోక్తిఁ బలికె
నోరోరి! దుష్టసముద్యములార । యోరిదుర్మదులార! యోరాజులార!
యెటిఁగెఱిఁగియు మీర లేవసియించు పురముఁ జుట్టుకొనంగఁబోలునే! చెపుడ
నాశక్తి వినలేదె! నాచక్రధార । నాశమొందిన మురనరకాది దైత్య
వీరులకంటెను వీరులె! మీరు । చేరెఁగాలము మీకు సిద్ధ మీమాట
యిందఱి నొకపెట్ట నిదె గదాహతిని । ద్రుంది౦తునో! లేక మత్కరోద్దండ
కోదడనిర్ముక్తఘోరకాండముల । భేదింతునో! మహాసితఖడ్గధారఁ
గడికండలుగఁజేసి గండడంపుదునో । కడునడి నిపుడె చక్రము ప్రయోగించి
మీతలల్ ఖండించి మీజోళ్లుతోళ్లు చేతులు డొక్కలు చించి వ్రేయుదునో!
పలుమంది నూరక పరిమార్చ టేమి । ఫలమని కృపతేటపడఁ దెల్పినాఁడ
నామాటవిని పోయిన శుభంబు గలుగు । హామికఁ బోకున్న ననుభవించెదరు
మున్ను బ్రాఁజదువులు మ్రుచ్చిలించికొని మున్నీరుఁజొచ్చుసోముకునిద్రుంచితిని
కూర్మవైఖరిఁ దటిగొండనెత్తితిని । దుర్మదుఁ గనకాక్షుఁద్రుంచి యీభూమిఁ
గిరినై ధరించితిఁ గినిసి హిరణ్య । నరసింహమూర్తినై నఖములఁ జీఱి

యతని నందనునిఁ బ్రహ్లాదు నేలితిని । శతమఖుకొఱకు యాచనఁజేసి బలినిఁ
గొలిచితి మూఁడడుగుల ముజ్జగముల । నిలనున్న రాజులనెల్లఁ గ్రోధమున
ముయ్యేడుమారులు ముట్టి కేఁటడిచి । యియ్యనా! విప్రుల కీధరయెల్ల
దశరథరాజనందనుఁడనై పొడమి । దశకంఠుఁద్రుంచిన తత్కథ వినరె!
బలరామమూర్తినై పాపకర్ములను । గెలిచినకడిమియుఁ గృష్ణరూపమున
బూనిచేసిన మహాద్భుతకరక్రియలు । వీనులనిడరేమొ వికటాత్ములార!
బుద్ధరూపమునఁ ద్రిపురదైత్యహృతి స । మిద్ధతేజము గూర్పనే! కపర్దికిని
గలికినై యిఁకమీఁద ఖలుల నడంపఁ । గల క్రమంబెఱుఁగరె ! గర్వమిం కేల
నన్నెదిరించి యెంతటివారికైన । మిన్నకపోరాదు మిత్తిచేఁ బడక
ప్రాణముల్ వలసినఁ బారిపొండనిన । నానరేంద్రులు దుర్మదాంధులై యనిరి
జలజాక్ష! నీచేతఁజచ్చినఁ దమకుఁ । గలుగు వైకుంఠలోకము ధ్రువంబుగను
నిహలోకసౌఖ్యంబు లేము వర్జించి । యహిశాయి! నీతోడనాజి యొనర్ప
వలసివచ్చితిమి దేవరచక్ర మనిసి । గెలువు మందఱినంచుఁ గేకలువైచి
పరశు పట్టిస గదా ప్రాస శరాస । శర ముద్గర కృపాణ శక్తి త్రిశూల
చక్రాది బహువిధ సాధనకోటి । విక్రమంబునవైచి వీఁకఁ జూపుటయు
విప్రకునూరుండు వెలవెల నగుచు । నాప్రహరణముల కళు కావహిల్లఁ
బొడవుగా బంగారుపులుఁగు సూత్రమున । నుడువీధి కెగఁబట్టి యోదేవదేవ!
యోనందనందన! యోసదానంద! । నానెగుల్ దీర్పవే నలినాయతాక్ష!
హరియోఁడె బగవారి కనుపకీర్తి । హరియించికొమ్మని హరి స్మరింపుచును
బారిపోవఁ దలంపఁ బద్మతోఁగూడి । నారాయణుఁడు జగన్నాథుఁ డావేళ
నల్ల వైకుంఠమ్మునందు ద్యూతక్రి । యోల్లాసియైయుండి యొకనవ్వు నవ్వి
నగిన వెన్నునిఁజూచి నలినాక్షి లక్ష్మి। ఖగవాహ! నవ్విన కారణం బేమి
యానతివలె నంచు హస్తంబుఁబట్ట । శ్రీనివాసుఁడుపల్కెఁ జెలువగో ! వినుము
గౌళభూవిభు కూర్మికన్య నులోచ । నాలలనామణి నన్నె కామించి
యితరులఁ బెండ్లాడ నేనొల్ల ననుచు । సతిభక్తిఁ దలఁపగా నక్కన్యఁ జూచి
వలచి విప్రుఁడొకండు స్వర్ణకారకుని । వలనఁ గాంచనపక్షివర్యఁ బడసి
మచ్చిహ్నములె పూని మణిసౌధమునకు । వచ్చిప్రాలిన ధరావరపుత్రి చూచి

యలరె నేనని వాని నాత్మఁదలంచి । తలిదండ్రులకుఁదెల్పి తదనుజ్ఞ వడసి
యావిప్రసుతుఁ జూచి హర్షింపుచున్న । కావరంబువహించి గౌడభూవిభుఁడు
అల్లుఁడాయె ముకుందుఁడనిధరావిభుల।నెల్ల దూషింపుచు హెచ్చియుండఁగను
నారాజుపై వచ్చి యవనీశులెల్ల । వీరత్వమునహెచ్చి విడిసి మాతోడ
పోరికిరమ్మన్న భూసురాత్మజుఁడు । పారిపోవుచును నాపై భారమిడియె
నదివిని నవ్వినినన శ్రీదేవి । హృదయేశ! యవ్విప్రుఁడే మీరటంచు
నెరనమ్మి వరియించె నృపపుత్రి యతఁడె।హరియని పూజించి రత్తమూములును
పగతురెల్ల నితఁడె పద్మాక్షుఁడనుచు । జగడంబుగావింపఁ జనుదెంచినారు
ఈవేళ మీరింత కృపయుంచి విప్రుఁ । గావకుండిన నపఖ్యాతి మీకొదవు
హరి యోడిచనెనను నపకీర్తి యడఁగ । కరచక్ర మనుపవే ఖలుల ఖండింప
నా మనవాలించి నలినాయతాక్ష! । భూమిభారమ్ము బాపుము వేగ ననుచుఁ
గడవన్నె పొందమ్మిగద్దియ నుండు! పడఁతి దెల్పినవిన్నపం బాదరించి
కనకాంగి! యిదిమంచి కార్యంబు దెల్పి । తని పల్కి యాదినారాయణస్వామి
తనచెంత శతకోటితపనవిస్ఫూర్తి । యొనర వర్తించు నాయుధచక్రవర్తి
ఖలదానవచ్ఛిదాగతదివ్యకీర్తి । చలితార్తి శ్రీసుదర్శనమూర్తిఁ జూచి
యోసుదర్శనదేవ! యుద్ధతి నిపుడె । భూసురాత్మజుని పంపునఁ బోయినటులఁ
బోయి గౌడనృపాలుపురిఁ జుట్టికొన్న । దాయల నందఱి దగ్ధంబుఁజేసి
పఱతెమ్మ్ము పొమ్మనిపనిచిన నదియు । ఖరకరశతకోటికాంతులతోడఁ
బ్రళయకాలాభీల పాథోదజాల । గళదుగ్ర దీర్ఘనిర్ఘాత నిర్ఘోష
పాటిత బ్రహ్మాండభాండ ప్రణాశ । నాటోపయుత మనీషాయత భీత
భూతజాతసమేత భువనాద్భుతావ । దాతగరుద్వీతి దర్పకారాతి
పురుహూతముఖనుత స్ఫుటవిస్ఫులింగ । తరళీకృతాపారతారకంబగుచుఁ
బఱతెంచి వినువీథి బ్రాహ్మణసుతుఁడు । వెఱగందఁ దత్పాణి విడివడినటులఁ
గనుపించి పురిచుట్టు గలహించుచున్న । మనుజనాథుల క్షణమాత్రంబు లోన
పరిమార్చి రథముల భస్మీకరించి । కరులఁ గీటణగించి ఘనతురంగములఁ
జెండాడి సుభటులఁ జీకాకుచేసి । దండిజోదులఁగూల్చి ధ్వజముల వ్రాల్చి
ఛత్రచామరములఁ జక్కఁగావించి । గాత్రఖండముల నల్లడల నిండించి

నెత్తుఱుఁబేరు లన్నెలవులఁ బరపెఁ। గత్తులఁజేనికిఁ గలదె! దుర్ఘటము
ఈరీతి విమతులనెల్ల మర్దించి। యాయూథరుచి సహస్రారంబు మరలి
యావిప్రు వలగొని యందఱుఁ జూడ। శ్రీవల్లభునిచెంతఁ జేరె నవ్వేళ
హరికళ ద్విజపుత్రునందు వర్తించె। సిరి శోభగా విలాసినియందు నిలిచె
భావనాశక్తిచేఁ బతి విష్ణుఁజేసె। నావనితకుసాటి యవనిలోఁ గలరె!
తల్లియుఁదండ్రియుఁ దగినచుట్టంబు। లెల్ల సులోచన నెంచి రవ్వేళ
హరిమూర్తియై కమలాకరుం డలరె। గరిమతోఁ దనకుఁ జక్రము పంపుసేయ
ధరయెల్లఁ బోషింపఁ దనమూమ నునిచి। హరి యకారణకరుణాతిశయంబుఁ
బొగడుచుఁ గాంతతో భువిసౌఖ్యమంది।ఖగవాహుఁ బ్రాపించెఁ గడపట నతఁడు
శ్రీలక్ష్మిలోఁ బ్రవేశించె నాలేమ। వాలుగంటిరో! పతివ్రత సులోచనయె
యీసులోచనకథ యెవ్వరు వినిన। శ్రీసతి వారింట స్థిరలీల నిలుచు
హరికరుణయు గల్గునని చిల్కదెలుపఁ।బొరిఁబొరి హర్షించెఁ బుష్పనుంజరియు
నని శంకరుఁడుదెల్ప నవ్వలికథలు। వినిపింపుమని గౌరి వేడ్కతో నడిగె
సరసపతివ్రతాచరితంబునందు। గరిమఁ బదాఱవకథ సాంగమయ్యె

కాళిగుడిలో సతి పతినివరించిన కథ

శ్రీవిశ్వపతి సమంచితమతి గౌరి। కావలికథ యిట్టులని తెల్పఁదొడఁగె
మఱునాఁటి సంధ్యాసమయమున రాజ। వరుదూతి వెనువెంటవచ్చి నిల్చున్న
రంజితహాసవిభ్రమజితపుష్ప। మంజరి నప్పుష్పమంజరిఁ జూచి
చిలుక పల్కులఁదేనె చిలుక నిట్లనియె। కలకంఠి! పతి దైవగతి నెడఁబాసి
నలఁకువఁ బడియు మానము నిర్వహించు। వలనుచేఁ గామించువారి వంచించి
క్రమ్మఱఁ దనభర్తఁగలిసి వర్తిలిన। కొమ్మ సత్కథయొండు కోవిదుల్ దెలుప
వినియుందు నదినీకు వినుపింతు వినుము। వినవిన వీనులవిందుగాఁ దొల్లి
భోటదేశమున నపూర్వసంపదల। నీటొందు మాణిక్యనిధి యన్పురంబు
సుమనోవిలాస భాసురభోగ కలన। నమరావతినిబోలు నమ్మహాపురము

అలఘు పుణ్యజనేశ్వరానంద గరిమ । నలకాపురముబోలు నప్పట్టణంబు
ఉరుతరశ్రీపురుహో త్తమఖ్యాతి । హరిపురి కెనవచ్చు నన్నగరంబు
ఘనులు శతక్రతుక ర్తలు ధనదు । లనఁగ సత్వసమగ్రు లైశ్వర్యపరులు
గలుగుటవలన నెక్కడ నీడులేక । వెలయు నప్పురమేలు వీరసేనుండు
వినతాత్మపవ పరవీర సేనుండు । ... ...
నావీరసేనున కర్థాంగలక్ష్మి । యై విభాసిలుశోభనాంగి యన్ భామ
ఆభామ హరిభామ హరుభామఁ బోలి । యాభామనోజ్ఞయై యతిశయం బందు
పౌలోమిఁబాయని పాకశాసనునిఁ । బోలిరోహిణిగూడి పొలుచు పూర్ణేందు
క్రియు దోప శోభనాంగీసంగలోలుఁడయిసుఖించియు నపత్యములేమి నతఁడు
జాలిఁజెందఁగ నయాస్పదుఁడను మంత్రి । యేల చింతించెద వందువం శేంద్ర!
యిందుశేఖరుఁగొల్వ మిచ్చునీవలచు । నందను ననిన డెందముకందళింప
దినదినమ్మును భార్వతీపతిపూజ । లొనరింపఁదొడఁగె మహోత్సవం బెసఁగ
నంతటఁ గొన్ని నాళ్లరిగిన నొక ని । శాంతంబునందుఁ జంద్రావతంసంబు
నల్లనిమెడకప్పు నందివాహనము । తెల్లని మైచాయ దేవీసమేత
వామాంగభాగమ్ము వలనొప్ప వచ్చి । శ్రీమహాదేవుఁ డాక్షితిపతి మ్రొల
నిలచిన నతఁడు నెంతేభ క్తి వినయ । కలితుఁడై బహునమస్కారముల్ చేసి
వివిధార్చనములు గావించి కేల్మొగిచి । యవిరళపులకాంకురాంకితుం డగుచు
భవనాథ! విభవానుభవ! నాగహార । భవనాశ! కైలాసభవనాథ్య! శరణు
రాజీవముఖరూపరాజీవరాక్షి । రాజీవపూజ్య పరాజీవ శరణు
శరదరద్యుతి! మదాశర దరాపాది । శర! దక్షసూనదావశరద! పరాకు
నందనాపేక్ష డెందమునందుఁ జెంది । నందున వేఁడెద నపవర్గ మొసఁగ
గలనిన్ను కల్పవృక్షముఁజేరి కాయ । వలెనన్న వేదురువలె నందులకును
నిందుశేఖర! నగ కీయవే యొక్క । నందను సుగుణయా నందని నొకతె
ఖలుల నొంచంగల కరవాల మొకటి । వరయు మన్నింపవే! వరద యటన్న
నలరిశంభుఁడుమంచిదటువలెఁగలుగు।తోలుదో ల్తఁజంద్రాంగదుండనుసుతుఁడు
జననాథ! యామీఁద జంద్రరేఖయను । దనయ గల్గెడి నడిదం బడిగితివి
యిదిగో యిచ్చితి గొనుమిది పాపమతుల।విదళించు పుణ్యతావిమలమానసుల

నఱకిన తెగదందున నెఱింగికొనుము । నరుల పాపములు పుణ్యము లని తెలిపి
తరవారియెసఁగి యంతర్హితుండైన । హరుకృప కలరుచు నారాజవరుఁడు
తనయింతి కాశంభుదత్తవరంబు । వినిపించి సముచితవృత్తి వర్తిలఁగఁ
గొన్నాళ్ల కారాజుకొమ్మ గర్భంబు।చిన్నెలు వహియించి శివు కృపాస్ఫూర్తి
నవమమాసమున నందనుఁగాంచె నొకని।రవిచంద్రకవిగురుప్రముఖగ్రహములు
పదునొకండవచోట భాసిల్లువేళ । నిది సుజాతకమని హితు లార్యలెంచ
వహికెక్కఁ బుత్రోత్సవంబు గావించి । మహినేత జాతకర్మము మొదలై న
శుభకర్మము లొనర్ప సుతుఁడు వర్ధిల్లె । నభినవశ్రీలఁ జంద్రాంగదుండనఁగఁ
గనకాంగి చంద్రరేఖానామకన్యఁ । గనియెఁ గొన్నాళ్ల కాక్ష్మాపతికాంత
కలశాబ్ధివీచిక గన్నహిమాంశు । కళయె! మాధవలక్ష్మిగన్న చాంపేయ
కళిక యో! నవమల్లికావళిగన్న । యలరుగుత్తియె! రసాలానూనశాఖ
కాంచినచిగురాకో! ఖనిగన్నమణియె।యంచితకవిజిహ్వ నగు సూక్తిరమయె
కాదంబినీగర్భగతినుండి దోఁచు । సౌదామనీలతాచ్ఛాయయో ! యనఁగ
నాలీల నుదయించి యాబాల పెరిగె । బాలచంద్రునిరేఖ ప్రబలు చందాన
నడలునేరిచెఁ గొన్నినాళ్లకుఁ దొట్రు । పడుచుఁ దా జిలిబిపలుకులు నేర్చె
నాటలాడఁగనేర్చె నటమోఁద ముద్దు । పాటఁ బాడగనేర్చె ప్రతిభ వహించి
చదువుకోనేర్చె విశ్వాసంబుమదినిఁ । బొదువ మాధవశర్మపొంత నక్కన్య
యన్నివిద్యలు నేర్చె నాచంద్రరేఖ । యన్న చంద్రాంగదుం డలరువిల్కాని
చెన్నున యూవనశ్రీ తులకింప । గన్నతండ్రిఁ బ్రమోదకలితుఁడై చూచి
మాళవేంద్రుని పుత్రి మల్లికాగంధి । శ్రీలొప్పఁ బెండిలిచేసెఁ బుత్రునకుఁ
బెండ్లాడి తండ్రిచెప్పినరీతిఁ గొన్ని । యేండ్లు మిత్రామాత్య హితబంధుయుక్తి
వెలసి దోశ్శక్తి దిగ్విజయంబొనర్చి । కలిమియు బలిమియు గలిగి వర్తిలఁగ
నాసుపుత్రునకుఁ బట్టాభిషేకంబు । చేసి యంతట వీరసేనుఁడిట్లనియెఁ
బ్రజలఁబాలించుట పరమధర్మంబు । సుజనుల మంత్రులఁ జుట్టాల హితుల
నెఱిఁగి పోషింపుమేయెడఁ బ్రమాదంబుఁ।బొరయకు మార్యులబుద్ధుల వినుము
నీ కూర్మిచెలియలి నీలోత్పలాక్షి । శ్రీకాంతకెనయౌ సుశీల నేమఱక
యరయుము పెండ్లిప్రాయంబైన వెనుక । సిరులుల్లసిలఁ జంద్రసేనుపుత్రునకు

హేమవర్మనకె యిమ్మిట ఘనసార । నామపురం బొజనస్తుతుం డేలు
ననితెల్పి భార్యతోనతఁడు తపంబుఁ । బొనరించుటకు వనభూమికిఁ జనియెఁ
దల్లి యుఁదండ్రియుఁ దపమున కరుగ । నల్ల చంద్రాదగదుండర్మిలి తోడ
గురునిచెంగట నేర్చికొనె విద్య లెల్ల । పరిపరియాటలు పాటలు నేర్చె
బొలయయ్యును గళాప్రౌఢిమ వెలయ । నాలేమ కుదయించె నంతజవ్వనము
గమకమూపిఱుఁదుబంగరుచాయయొడలు।కొమరొందుపెందొడల్‌కులుకునెన్నడలు
సరసవిలాసముల్‌ సారెకుఁజూచి । మరులొంది యొకనాఁడు మాధవశర్మ
యేకతంబున నున్నయింతి కిట్లనియె । నీకుల్కు నీపల్కు నీమేనితళ్కు
నీయింపు నీపెంపు నీమోము సొంపు । నీయొడల్‌ నీతొడల్‌ నీచిన్ననడలు
నీచక్కదనమును నీదుజవ్వనము । చూచినఁ దమిమించె సొలపగ్గలించె
మాధుఁడు క్రూరుండు మదినిల్వనీఁడు । చేరరావే! నేఁడు చిగురాకుబోఁడి
పుక్కిటివిడెమిచ్చి పూఁపచన్దోయి । యుక్కున గదియించి యధరామృతంబు
దయచేసి నామనస్తాపంబు దీర్చి । ప్రియునిగా! నేలవే బింబోష్ఠి! యనుచు
బలిమితోఁ గెంగేలుపట్టిన నదిగొ । చెలివచ్చెనని యళ్కుచెందించి కేలు
విడిపించికొని మొక్కి వెనువెనకఁ గేఁగిపడఁతి యిట్లనియె నోబ్రాహ్మణప్రవర!
సకలవేదంబులు సకలశాస్త్రములు । సకలపురాణముల్‌ చదివిన మీకు
నీకుచ్చితపుబుద్ధి యేల జనించె । మీకూఁతురనుగానె! మీకు నన్‌గన్న
వీరసేననకును వేఱింత గలదె! । ఘోరపాతక మెంచికొన కల్పసుఖము
కొఱకు రద్దొడిగట్టికొనఁ దగదయ్య । గురుసార్వభౌమ! సద్గుణివి గదయ్య
పదరక నావిన్నపము వినవయ్య । మదిఁ గోపతాపముల్‌ మానగదయ్య!
యని నయవినయప్రియాలాపసరణిఁ । దను వేఁడుచున్న నత్తరుణిపై నలిగి
యా దుర్విచారుఁడిట్లనియె నోపడుచ! । నాదు ముచ్చటదీర ననున్నగైకొనక
వెడఁగుబుద్ధులు నొడివెదవేమె యిట్టి । చెడుమాట లెవ్వరిచే నేర్చినావు
నీకు గల్గినబుద్ధి నీవెంచునీతి । మాకులేదటె యోసి! మటుమాయలాడి
మంచిది నిను దుష్టమతియని తప్పు । లెంచి కాఱడవిఁ ద్రోయించక యున్న
యేను బ్రాహ్మణుఁడనే! యిఁకమీఁదఁ దెలియ । నౌనది నీకని యక్కొగోళముల
చిటచిట నిప్పుకల్‌ చెదర దంతములు । పటపట గొఱుకుచుఁ బ్రతినగావించి

యచ్చోటువాసి చయ్యన లేచిపోవు । కుచ్చితు నతనిఁగన్గొని చంద్రరేఖ
కరములు ముకుళించి గద్గదకంఠ । పరిణతస్వరమునఁ బలికె నిట్లనుచుఁ
దగవుదప్పినపని తలఁచిన మిమ్ము । తగదన్న నింతక్రోధము పూననేల?
మాయన్నతో దుష్టమతియని దెల్పి।త్రోయింతు నడవులందు నటంచుఁ బ్రతిన
చేసితి రీరేమిచేసిన, మీరు । డాసిన దెవరితోడను దెల్పనేను
నా భాగ్యమిటులుండె నన్నేమిసేయ । నీభూమి విధిసృజియించెనో! యటుల
ననుభవింపఁగవలె నన్యులు చేసి । రననేల! మీరాడినందుకు వెఱచి
కలుషంపుఁబని కొడిగట్టఁగా నోప । నలుక మీరేమిసేయఁ దలంచినారొ!
యవియెల్ల గావింపుఁడనిపల్క యతని । కవనతయై కన్య యరిగె లోపలికి
యొడుపుదప్పిన సర్పమోయన విప్రుఁ । డెడఁద ఘూర్ణిల నింటికేఁగె నంతటను
వనలక్ష్మి ప్రథమర్తువై భవం బెనయు । ననువునఁ గొన్నాళ్ల కాచంద్రరేఖ
ప్రథమర్తువై న వారంబు తారయును।దిథియు మంచిదియైన తెఱఁగెఱింగియును
మది మచ్చరముగ్రమ్మ మాధవశర్మ । యిది శ్రబ్రదిన మనియె నృపాలుతోడ
ననుజపైఁ బ్రేముడి నమ్మాట సరక।గొనక రాకొమరుఁ డెక్కుడుగ వేడుకలు
సేయుంచెఁ జెలినిగై సేయుంచె సదయుఁ।డై యెంచె తలిదండ్రులనిన వాక్యములు
శెండవపరియును బుతువయ్యె చంద్ర । మండలానన యొక మంచిలగ్నమున
నదియును గారానిదని రాజుతోడ । నదయుఁడై యెఱిఁగించె నాద్విజాధముఁడు
ఇందునఁ గీఁడేమి యెఱిఁగింపు మవని । బృందారకేంద్ర! యీబిసరుహగంధి
తగుపతిఁ బెండ్లాడి తనయులఁ గాంచి।పొగడొందదా! యన్న భూపాలసుతునిఁ
గని యేకతమున నాకష్టాశ్మఁ డనియె । మనుజేంద్ర! చెలి ప్రథమర్తుదినంబు
వారంబుతారయ వచియింపరాదు । క్రూర మీదినమంతకును విపత్కరము
ధనవస్తువాహన ధాన్యాదికముల । కినతేజ! హానియా నిదియింట నున్న
నిది సహోదరియని యింటనుంచికొని । యదవదఁ జెందక యతివ వంచించి
యడవిలో విడిచిరమ్మందున నీకుఁ । గడుశుభంబగు కల్లగాదు నాపలుకు
అన గుండెదిగ్గన నతఁడుశోకించి । యనియె విప్రునిఁజూచి హరిహరి! యెంత
పాపంపుఁ బనిసేయఁ బనిచెద వకట । నీపల్కుచేకోని నెనరింత లేక
చెల్లెలి నడవిఁద్రోసిన విన్నవారు । చెల్లఁబో! దూషణసేయ కుండుదురె

చూచికొందము మీఁద తోణీసుఁ గేంద్ర! । యూచెల్వచే నేమిహాని యయ్యెనని
నీవేళ మీరింటి కేగుఁడటన్న । నావిప్రుఁడు గలంగి యవనీశతనయ!
పొలఁతిపై కోపంబుపొడమి తెల్పితినె! । కలిగినమాట నికృముగఁ జెప్పితిని
యనఘ! బంగరుక త్తియని మెడఁగోసి । కొనవచ్చునె! యిదేమి కూర్మిచెల్లెలని
యాపద కొడఁబడనగునయ్య! యనుచుఁ । జూపిమోపి యతండుసుద్దులుగొన్ని
చెప్పిన నొకకొంతసేపు చింతించి । యొప్పినమనసుతో నుర్వీశసుతుఁడు
ఆలాగె రేపు వేఁటాడువ్యాజమున । బాలఁ దోకొనిపోయి భయదకాంతార
సీమలో దించివచ్చెద మీకుఁదెల్పఁ । దామసించుటలీక తగవుగాదనుచు
నావిప్రు వీడ్కొల్పి యరిగె లోపలికి । దైవికం బొకరికిఁ దప్పింపవశమె!
మఱునాఁడెప్రొద్దున మహిపాలసుతుఁడు । కరియూనఁ జంద్రరేఖను జేరఁబిలిచి
పొలఁతిరో! మజ్జనభోజనక్రియలు । సలిపి నేవేఁటాడఁజనియెద నిపుడు
నచ్చెదవే! చూచివత్తువుగాని । యచ్చటి మృగయావిహారవైఖరులు
అన విని చంద్రరేఖాంభోజవదన । తనమనంబున విప్రదందశూకంబు
నేమిబోధించెనో! యెన్నఁడులేని । దీమూట యితఁడాడ నేమికారణము
దైవసంకల్పంబు తప్పించికొనఁగ । నావశమే యని నగుమొగంబెత్తి
అన్న! మహాభాగ్యమాయె నీవేఁటఁ । గన్నారఁ గనుగొనఁ గడువేడ్కగలదు
పోయివత్తము రమ్ము బోరన ననుచు । నాయన కటు భోజనాదు లమర్చి
తానును భుజియించి తగు వస్త్రభూషణానూన గంధమాల్యములఁ జెలొంది
చంద్రాంగదునితోడ జవనాశ్వ మెక్కి।చంద్రాననామణి చనియెఁ గాననకుఁ
జని పొదల్ నదులును శైలముల్ గుహలు వనములు కొలఁకులు వల్మీకములును
జూచుచు శరముల నూటిదప్పకయె । రాచూలి మృగముల రంతడంచుటకు
మెచ్చుచు ఫలము లర్మిలి నన్న కోసి।యిచ్చినఁ జవిగొని యింపుఁ జెందుచును
శారికల్ పద్యముల్ చదువ నూకొనుచు । కీరికల్ పలుకఁ గోకిలములుగూయఁ
దుమ్మెదల్ మ్రోయ సంతోషించి వినుచు।గమ్మను వాసనల్ గ్రమ్మ పూఁబొదల
చెంతల నిలుచుచుఁ జెలి యన్నతోడఁ । గొంతసేపు చరించె ఘోరాటవులను
నెండచే వసివాడి యిగురాకుబోఁడి । యండఁబాయక తురంగాగ్రఘుఁడైన
యన్నఁ గన్గొని డప్పియయ్యెడి నిచట । నున్న దేనిఁ దటాక మొకటి చూపుమని

యడిగిన సోదరి నతఁడు వీక్షించి । పడఁతి! డస్సితివిదె పద్మాకరంబు
నిక్కడనున్న దేనెఱుఁగుదు ననుచు । నక్కన్యతో నొక్క యంబుజాకరము
చేరి గుట్టముడిగ్గి చెలియలి డించి । నీర నిర్మలమిది నెలఁత! త్రాఁవుమని
పలుకఁ గొలంకులోపల డిగ్గి పాద । ములకాంతి మెట్లు కెంపులమెట్లు గాఁగ
నిడువాలుఁజూపుల నిగ్గులందడరి । యెడనెడఁ గలువల నినుమడిసేయఁ
దన గుబ్బచనుదోయి తమ బంధుజాతి । యనుచు జక్కవపిట్ట లట్టె పైకెగయ
నీమాడ్క డిగ్గియ కింపుతో డిగ్గి । భామిని కరపదప్రక్షాళనంబు
గావించికొని యుదకము దప్పిదీఱఁ । ద్రావి యందమరు కెందామరల్ రెండు
కరదీప్తి కెనయాటఁ గైకొనె ననఁగ । ధరియించి వెలువడి తటభూమి నిలువఁ
దరువుల క్రోనీడఁ దళుకు తివాసి । పఱచి మున్పుగఁ బొంకపఱచినవాఁడు
గావున య్న యక్కరో! యింతసేపు । నీవిందు శయనింపు నీశ్రాంతి దీఱఁ
దరువాతఁ బోద మిద్దఱు మూరి కనుచు । తరుణికిఁ గపురంపుతావి వీడియము
ప్రియమున నొసఁగ హొన్ బెడఁగు తివాసి।పయి శయనించె నప్పద్మాయతాక్షి
యంతలో హాయికిఁదోయములు త్రాగించి।శ్రాంతిదీఱిచి తానుజలపాయియగుచు
నలరులతో జడయల్లు దంభమునఁ । జెలియలి నిదురఁబుచ్చె నృపాలసుతుఁడు
అడవిఁ బేరెండలో నటునిటు దిరిగి । బడలి నిద్దురవోయెఁ బడఁతి మైమఱచి
మంచి నిద్దురఁబోవు మానిని గాంచి । వంచకుఁడగు విధ్రువచనంబు లెంచి
చెల్లబో! నాకూర్మిచెల్లెలి నబల । కల్ల లెఱుంగని కమనీయశీల
పల్లవాధర గోల బాల నీలీల । నిల్లుఁబాపి దయావిహీనభావమున
నొంటి నిక్కా-నలో నుంచి నేనెటుల । నింటికేఁగుదు నిద్ర యింతలోఁ దెలిసి
నను చెంతగాన కన్నా! యెందుఁబోయి । తని యెంతగుందునో! యతిభీతిచేత
నెక్కడి కరుగునో! యెవ్వరిచేతఁ । జిక్కునో! యడవిలోఁ జెలి దిక్కులేని
యెడలిదియేలని యూహలోఁ గలగి।విడుచునో! ప్రాణముల్ విపినమార్గముల
నయ్యయో! పెండ్లిపాయముదాని నొకని।కియ్యక యడవిలో నిటు లొంటిడించి
చను నన్న గలఁడె! భూస్థలిఁ దానుదక్కి।నని పెక్కువగల నాయన వితర్కించి
యడవిలో విడిచి రమ్మని చెప్పె ద్విజుఁడు । విడువక పోరాదు విధి వ్రాసినటుల
నిది మెలంగెడు తెగి యింతకుఁబూని।తుదకు గొంచించుట దుష్కార్య మనుచు

నార్యులు దెల్పుదురని నిశ్చయించి । ధైర్యంబుపెంచి సోదరి నందు డించి
కరవాలమూని యాకడ నాలుగడుగు । లరిగి పోవుటకుఁ గాళ్లాడక తిరిగి
పఱి తెంచి నిదురించు బాలనీక్షించి । మరలె తేజీ నొక్కక్రమ్మాఁకునఁ గట్టి
యీ తేజిపై నెక్కి యెక్కడిక్కైన । రాతిరిఁబోవచ్చు రమణి కటంచుఁ
దనలోఁదలంచి యీతఁడుచన్న వెనుక । వనిత నిద్దుర లేచి వాలుకన్గొయి
విచ్చి నల్దిక్కు లన్వేషించి యన్న । నచ్చోటఁ బొడగాన కతిభీతిఁ జెంది
కొలఁకుల గెలఁకుల కుంజపుంజముల । పులినభాగంబుల భూరుహచ్ఛటల
చేరువ తోఁపుల శిఖరిదేశములఁ । జేరుచు బెట్టుగాఁ జీరుచు వేద
యడుగులు దొట్రిల నశ్రుపూరములు । జడిగొని చెక్కులఁ జాలువాఱఁగను
నన్న చంద్రాంగద! యయ్యయో యడవిఁనన్నొంటి డించి మిన్నకపోవఁ జనునె
పగదాననా యేమి! పలుకవు దైవ । మగచాట్లఁ బెట్టి నన్నడవి పాల్సేసె
నెక్కడ వెదకుదు నెక్కడఁజొత్తు । నిక్కాఁటడవి నొంటి నేనెట్లునిలుతు
దైవమా! విప్రుండు దలఁచిన యటుల । గావించి తాతఁడెగాబోలు! నీవు
కాకున్నఁ బ్రతిన యాఖలుఁ డూనినటుల । నీకానలోన నన్నేలఁ ద్రోసితివి
యని పెక్కుభంగుల నార్తయై వనరు । వనరుహనయనకు వామాంగకములు
చలియించె మఱి శుభశకునముల్ గొన్ని।తుళకించినవి చూచి తొయ్యలి మదిని
వెరగొంది యివిగొన్ని వింతలుపుట్టె । హరు వరంబునఁ బుట్టినట్టి నాకిట్టి
యడలు పుట్టంగరాదయ్యాశ్వరాజ్ఞఁ।బొడుమునో యిఁక మేలుప్రొద్దుగ్రుంకెడిని
కనువెలుంగునఁ యెక్కడిక్కైనఁ బోవఁ । జను తేజిపై నెక్కి "ఝూ" పరమేశ
యని వాగె గదలింప నది యేపథమునఁ।జనియెడినో యంచె చనియెద ననుచుఁ
దన యన్న వేషంబు తాను ధరించి । వనిత యశ్వమునకు వలగొని క్రమొక్కి
యెక్కి వాజి గదల్ప నించుక నిలక । జక్కఁ దూరపుబాట జరిగె నంతటను
రవి యస్తమించెఁ దోరపుసంజకావి । చివురుకెంజాయ పశ్చిమవీథి నించె
కటికచీఁకటులు దిక్తటు లావరించెఁ । బటుకాంతితోడ నంబరవీథి ముంచె
దైవమే శరణని తరళాయతాక్షి । యావేళఁ దేజిపై నటఁబోవఁబోవ
నడవిలో ముందట నందొక్కచోట । మిడుఁగురు పుఱుగుల మెఱుఁగు లేకముగ
వెలుఁగొందుగతి నొక్కవెలుఁగు గాన్పింప।నలివేణి యిదిసన్నమగు దీపరుచియై

ఖద్యోతకాంతియో!గదియంగఁ బోయి!యీద్యుతిఁ గనుగొందు నిఁకనని తలఁచి
పరువున నశ్వంబుఁబఱపి యచ్చోటి । కరిగిన నొక కాళికాయతనంబు
పొలుచు చతుర్ద్వారముల మించు బోధ।తలుపులతో సుధాధవళ కాంతులను
రాకేందునగు గోపురములతో గొప్ప । ప్రాకారములతో నభస్థ్సలి నొరయుఁ
దోరంపు సాంబ్రాణి ధూపవాసనల । తో రమ్యదీపపంక్తుల మించు గర్భ
గృహము వాకిళ్లతో కేవలవిభవ । మహిమతో నటఁగనంబడిన హర్షించి
యాశ్చర్యరసమగ్నయై తేజి డిగ్గి । పశ్చిమద్వారాగ్రభాగంబు నందు
దీపించు కొలనిలోఁ దేజికి నీళ్లు । జోపి తానును బరిశుద్ధాంఘ్రిపాణి
కమలయై స్వాదూదకంబులు ద్రావి । రమణి తత్తటమున రాజిల్లు తోఁపు
లోన గుఱ్ఱముగట్టి లోపలి కరిగి । యానందమునఁ గాళికాంబిక కెరఁగి
హస్తముల్ ముకుళించి యస్తోకఫణితిఁ । బ్రస్తుతించెఁ బరాకు భర్గప్రోయాల!
సాష్టాంగ మంబ! మహాదేవి! శరణు । యిష్టప్రదాయిని! యీశ్వరి వినతి
తల్లివినీవె నాతండ్రివి నీవె । యెల్లబంధులునీవె యేలిక వీవె
యనదనై చేరితి నంబ నీపాద । వనజముల్ నన్నెటువలె మనిచెదవో
యన్న నన్నొంటి కాఅడవుల విడిచి । చన్నాఁడు ననుగన్న జననీజనకులు
మున్నెపోయిరి బాల్యమున నిట్టియెడఁ।గన్న నన్నికఁ బ్రోవగదవె! మాయమ్మ
యని దీనయైమ్రొక్కి యశ్రుపూరములు।గనుగవ దొరుగ గద్గదకంఠి యగుచు
నడలుచునున్న నయ్యంబ కారుణ్య।మడరఁ బువ్వులురాల్చె నట దీపమునను
గాళిక ప్రేరేప గాళియుఁ బలికె । మేలగుపద్ధతి మెలఁత దేహమునఁ
బులకాంకురమ్ములు పొడమెఁ బూజారి।యలదేవిఁ బూజించి యంతకు మునుపె
చేరువఁ దనపల్లెఁ జేరుటఁ జేసి । యారేయి నెవ్వాఁడు నటలేమిఁ జేసి
విజనస్థలంబని వెఱచుచు దేవి । భజన మేమఱక మున్ బాహ్యనిబద్ధ
వాజిపైనున్న తివాసు మున్నుగను । దాజవంబునఁ దెచ్చి తద్గర్భగృహము
వాకిటఁ బఱచుక వరుసతో నాల్గు । వాకిళ్ల తలుపులువైచి బిగించి
అంబయె నాకు సహాయం బటంచు । నంబుజముఖి దివ్వెలారిపోకుండఁ
జక్కగానిడి తనశయ్య శయించె । దిక్కుమాలినచోట దేవుఁడే దిక్కు
ఆరేయి ఘనసారమను పురంబేలు । శ్రీరాజితుఁడు చంద్రసేనుని సుతుఁడు

హేమవర్మ్ముఁడు మహామృగయా వినోద । కామియై మంత్రిశేఖరపుత్రుఁడైన
యచలునితోఁగూడి యడవికి నేఁగి । యచట ననేకమృగావళి నొంచి
యిరువురు నొక్కచో నిరులుగల్పించు । కిరుల రెంటిని విలోకించి నీవొకటి
యేనొకటిని వధియింత మటంచుఁ । దాను ప్రధానినందనుఁడు నేర్పాటు
గావించికొని తురంగములపై నెక్కి । యావరాహముల నుద్ధని వెనుకొనిరి
యొకటి దక్షిణమున కుఱికిన మంత్రి । సుకుమారుఁ డతిజవస్ఫురణతోఁ దతిమె
తూర్పుఁబట్టిన పందిఁదునిమెడుఁ దమి ద । లిర్వ రాజసుతుండు లివ వెంబడించెఁ
జరమదిగ్వ్యాపినదేశం బదిచేర, । నరిగె భూవరసుతుం డట రవి గ్రుంకె
పాఱెడి నదెయిదె పందియటంచు । నారాజసుతుఁడు గాఢాంధకారమున
బాటయొక్కటి కనఁబడిన నాబాట । ఘోటకారూఢుఁడై కొదకక చనియెఁ
జని మూఁడునాల్గు యోజనములు గడచి । కనియె ముందట దీపికాప్రకాశంబు
గని యందుదీపంబు గాననయ్యెడిని । జనులెవ్వరైన నచ్చట నుందురనుచు
హయము నిబ్బరముగా నటఁ దతిమికొని।ప్రియమునఁ గాళికాగృహాభూమిఁ జేరి
చేరి తూరుపు సరసీతటంబందు । వారువం బతఁడు సత్వరమున డిగ్గి
యలసె గుఱ్ఱంబని యంబువుజోపి । కొలనిచెంగటి తోఁట గుఱ్ఱంబుగట్టి
తన దప్పిదీఱ నందలినీరు గ్రోలి । చనుదెంచి కాళికాసదనాంతరమున
తలుపుసందున దివ్వె తప్పకచూచి । జలజాక్షి గాజులచప్పు డాలించి
విరిబోణి యల్లుఁడు వినఁబడుచున్న । దిరవొందినా రీఁడ నెవ్వరో యనుచుఁ
దలఁచి స్వాంతమున గొంతభయంబుగదుర। నెలుఁగెత్తి యటులనే హేమవర్మ్ముండు
ఎవ్వ రిగుడిలోన నిపుడున్న పుణ్యు । లివ్వాకిలిపుడొకయింతఁ దీసినను
గొంతసేపిచ్చటఁగూర్చు నే వేఁగి । నంత నేఁగెద నూరికని పల్కరింప
నొంటి నున్నదిగాన నుత్పలగంధి । కంటికి నిదురరాక భయంబువలన
గుండె దిగ్గనవడంకుచు నేటిబ్రతుకు ! । కొండొకదానవై కూర్మనెచ్చెలులఁ
బాసి దాదులఁబాసి భ్రాతనుబాసి । భూసురకతమునఁ బొగిలెద ననుచుఁ
గలికి సంద్రమునీళ్లు గరిపెలఁగొలిచి । కొలిచి వేదనఁగుంది కుంది లోఁగంది
యున్నదిగాన ద్వారోపాంతసీమ । పిన్నయెలుంగుతోఁ బిలుచురాసుతుని
పలుకులు విని మాఱుపలుకక యున్న।నళుకుఁ జెందియుఁ జెంద కతఁడుపల్మారు

వాకిలిఁ దెరువుఁ డెవ్వరు పుణ్యులార! । రాకొమరుఁడఁగాని రాకాసిగాను
అడవిలోఁ గాడ్పడి యరుదెంచినాఁడ । బడలినానని పెక్కుభంగుల వేఁడ
నాపల్కు లాలించి యలివేణి యితఁడు । రాపట్టిననియె నేరాజనందనుఁడొ
తెలిసి వాకిలి మఱిఁ దీసెదననుచు । నలసి సిద్ధుర లేచి నటువలె లేచి
వాకిట నిటఁ బిల్చువార లెవ్వారొ! । నీకుఁ బేరేమి యానిశ నొంటి నిటకు
రాఁ గారణంబేమి రాజపుత్రుఁడవె । నాఁ గల్కితో రాజనందనుం డనియె
పురుషుఁడవో లేక పొలఁతివో తెలియ । దెఱిఁగింతు నావిధంబెల్ల నూకొనుము
ప్రాచ్యదేశ క్షమాపతి చంద్రసేనుఁ । డచ్యుత పదభక్తుఁ డతని కేసుతుఁడ
హేమవర్మాఖ్యుఁడ నిట వేఁటవచ్చి । యీమహాటవిఁ ద్రోవయెఱుఁగక తిరిగి
దీపంబువెలుతుర దిలకించి యలరి । యీపజ్జఁ జేరితి నెంతలేదనక
వాకిలిఁదెఱచి నావంతఁ దేలిచిన । నీకు మేలగునన్న నెలఁత హర్షించి
తనతండ్రి తెలిపిన ధరణీశసుతుఁడె । చనుదెంచె నిద్దేవి సత్కృప ననుచు
నండెలు ఘుల్లుమనఁ గరకంక । ణాందోళనార్భటు లందంద నిగుడ
వడి లేచివచ్చి యవ్వాకిటితలుపు । గడియలు తిగిచి రాఁగదవయ్య! యనుచు
నతఁడు లోపలికిరా నంతటిలోన । నతివ వాకిలిమూసి యవ్వల నిలిచె
నిలిచిన దాని పెన్నెఱికప్పుఁ గొప్పు । తళుకుఁజెక్కులు మోమునమ్మి మెఱుంగు
కెమ్మోవికావి పొక్కిటి చక్కదనము । నెమ్మనిచాయ లానృపసూతి చూచి
యిదిభద్రకాళియో!యిది దేవసతియొ।యిది మోహినియొ! లేకయీవిలాసములు
కలుగునే! మానవకాంతల కనుచు । దలఁచి భయంబునఁ దనువువడంక
నూరకనిలుచున్న నుర్వీశసుతు నొ।యీరంబు మొగముసోయగము పేరురము
విరివియుఁ దనుకాంతివిభవంబు బాహు । పరిఘుల నిడివియుఁ బలుచనిమోవి
హరువును బిడికిటనడఁగెడు నడుము । మురుపును జెవులతో ముచ్చటలాడు
నిడువాలుఁగన్నుల నీటు పెందొడల।బెడఁగును బలుమారుఁ బ్రియమొప్పఁ జూచి
తనువల్లి పులకించఁ దమకంబుమించ । ననబోణి మోహించి నాన వహించి
యితఁడె నాపతియైన నేనెకా! భాగ్య । వతినంచు నూహించి వడఁకుచునున్న
యితని భీతి యడంతు నిఁకనని యెంచి । యతివ దగ్గఱచేరి యతనిచే నున్న
జముకాణ మచ్చోట సవరొందఁబఱచి । భ్రమమాని కూర్చుండు పార్థివతనయ!

బడలికదీఱఁ గప్రపువీడె మిదిగొ । జడియక కొనుమని సరసో క్తి నొసఁగి
నన్ను గన్గొనినయంతనె చిన్నవోయి।యున్నాఁడ వదియేమియో!యని యడుగ
కలఁగిన హృదయంబు గట్టిచేసికొని । పలికె రాకొమరుఁ డోపద్మాయతాక్షి !
సరిలేని రత్నభూషణములు పూని । సరిప్రొద్దువేళ నీశాంభవి యొద్ద
నొంటిగానున్న నీయున్కిఁ గన్గొనిన । గెంటదే! ధైర్యంబు గిరిభేదికైన
నెవ్వఁతె వీవు పేరెయ్యది నీకు । జవ్వని యెక్కడ జన్మదేశంబు
తలిదండ్రు లెవ రొకింతయు భీతిలేక । నిలువఁ గారణమేమి నేఁడీస్థలమున
దబ్బఱాడక యథార్థము దెల్పుమనిన । నబ్బిసరుహగంధి యతని కిట్లనియె
జనవంద్య! భోటదేశం బేలురాజు । వినయనిధానుండు వీరసేనుండు
నాజనకుఁడు మజ్జనని శోభనాంగి । రాజశేఖరుని వరప్రభావమునఁ
జంద్రాంగదుండను సత్కుమారకునిఁ । జంద్రరేఖాభిఖ్య సవరొందు నన్ను
గని పెంచిరంత నాగాదిలియన్న । ఘనయౌవనస్ఫూర్తి గాంచి వర్తిలఁగ
నతనిఁ బట్టముగట్టి యరిగె మాతండ్రి।యతివఁ దోడ్కొని తపంబాచరించుటకుఁ
దలిదండ్రు లేఁగిన తరువాతఁ దండ్రి । వలెఁ బ్రోచెనను గారవమున మాయన్న
యూడేరినట్టి నన్ హేమవర్మునకు । వేఁడుకఁ బెండ్లిగావించెద ననుచు
మాతండ్రి యనుమతి మాయన్న దలఁచు।నాతఁడవో! లేక యన్యుఁడో! యెఱుఁగ
నింపు నేవచ్చిన హేతువు వినుము । మందరధీరుండు మాయన్న నేఁడు
వేఁటాడ రాఁ జూడ వేఁడుకపుట్టి । ఘోటకారూఢుఁడై కూడి వచ్చితిని
అల మహాటవిలోన నశ్వంబుడిగ్గి । సలుమొకంబుల వెంటఁబడి యాతఁడరిగె
నతనిగానక యొంటి నడవిలోనుంటి । నతిభీతి రవిగ్రుంకినందాఁక వినుము
అన్న రాఁడాయె నేడవిలో నొంటి । నున్న కీడగునని యుత్తమాశ్వంబు
పైఁ నెక్కివచ్చి యీభవనంబు చేరి । యేనున్నదాన నావృత్తాంత మిదిగొ !
అడవిలో దిక్కులేదాయెగా యనుచుఁ । గడు ఖిన్నమతి నుండగా నింతలోన
నీవు వచ్చితిగాన నెదభీతి మానె । నావిని చంద్రసేనతనూజుఁ డలరి
యయ్యింతితోడ నిట్లనియె నీకేల । యియ్యెడ సందేహ మిందీవరాక్షి
హేమవర్మాఖ్యుఁడ నేనె నాఖ్యాద । నీమదియున్నది నే నెఱింగితిని
తడవేల యింక గాంధర్వతంత్రమునఁ । బడఁతి ! నన్నిపుడె చేపట్టఁగా రాదె

యరుణోదయమువేళ నశ్వంబు నెక్కి । పురమునకేతెమ్ము పోద మిద్దఱము
మీాయన్న బలశాలి మృగభీతిఁ జెందఁ । డాయనకై ఖేదమంద నేమిటికి
నని కేలుగ్రహియింప నతివ లజ్జించి । చనునె! మహాకాళి సన్నిధానమున
నటువంటి పనులుసేయఁగ నుత్సహింప । గటకట నీవెఱుంగని నీతిగలదె
నీభార్యనే నీవునిజము నాపతివి । యీాభద్రకాళిక యెదుటనిల్పినది
నాభాగ్యమునఁ గన్గొనంగల్గె నిన్ను । శోభనోత్సవముల సొంపొందఁగలము
నీ యధీనంబు నానెమ్మోను నిండు । ప్రాయంబు తోఁచినపగిదిఁ జేపట్టి
యేలుకొమ్మని బాల యేర్పడఁబలుక । గాళికాంబాసమ్ముఖమున నాతఁడును
దగుబాసలిచ్చె నంతట నవ్వధూటి । మగవేషమూని యమ్మహిపాలసుతుఁడు
తేజినెక్కినఁ దనతేజి తానెక్కి । రాజీవసఖుఁడు పూర్వనగాగ్రసీమఁ
గనుపించకయున్న కాళికిమ్రొక్కి । ఘనసారపురికి నాఘనుఁగూడి చనియె
తెరువున వింతలుదెలుపుచు నతఁడు । సరసోక్తులాడుచు స్వపురమార్గమున
నక్కన్యఁ దోకొని యరుగుచునున్న । దక్షిణంబుననుండి తన్మంత్రిసుతుఁడు
అడ్డబాటను దురంగారూఢుఁడగుచు । దొడ్డవేగమునను ద్రోవకు వచ్చి
దొరదిక్కుఁజూచి యెందులకేఁగి యెచట।నిరవొందితివి రాత్రి యే నిన్ను వెదకి
కానక దంష్టి) చిక్కకపోవ నొక్క । కాన నిల్చితి నంధకారంబు నెరయ
మరల నిన్ గనుగొన్న మదిఖేద మణఁగె । నెఱిఁగింపు మీాఘనుం డెవ్వఁడటన్న
నా రాజసుతుఁడను నచలప్రధాన! । యీారాత్రి నాసఖుం డిరువుర కొక్క
కాళిగేహమున సఖ్యము సంఘటిల్లె । బాళితో నన్నెడఁబాయంగ లేక
యరుదెంచుచున్నవాఁ డర్ధరాత్రమున । నిరవుఁజూపె నితండు హితశీలుఁడనిన
నది నిజంబుగ నెంచి యమ్మంత్రి వెంటఁ । గదలిరా ఘనసారకటకంబుఁ జేరి
యీారాత్రి శుభలగ్న మార్యులుదెలుప । వారిజాక్షిని హేమవర్మ పెండ్లాడె
మఱునాఁడు మంత్రికొమారునితోడ । నెఱిఁగించె నక్కాంత వృత్తాంతమెల్ల
నీరీతిఁబెండ్లాడి హేమవర్మకు । మారమణుం డారమణితోడఁ గూడి
పరిపరివిధముల బంధభేదముల । సురతకేళినిదేలె సుఖలోలుఁడగుచుఁ
గేళిసౌధములందుఁ గృతకాద్రులందు । లీలావనములందు లేఁజిగురాకు
శయ్యలయందుఁ గాసారదేశముల । నుద్యానలందు మేలుప్పరిగలను

జంద్రశాలలయందుఁ జలువలుచిందు । చంద్రాశ్మవేదికాస్థలముల యందు
సాలవ కొండొరుఁజూచు సాలఁపుఁజూపులకు । జిలిబిలినవ్వులు చేరికల్ గాఁగ
గమకించు తమ నిండుకౌఁగిలింతలకు । సమరసవైఖరుల్ సహావాసములుగఁ
గళలుట్టిపడు తమ కలయికలకును । గళరవస్ఫురణంబె కైవారముగను
ముదువుమీఱిన తమ మోవినొక్కులకు । సరససీత్కారంబు సంబంధులుగను
దమకంబునఁదనర్చుతమముచ్చటలకు । సుముఖచుంబనగతుల్ చుట్టమ్ములుగను
నిరువురుఁ బెనగొను నింపుసొంపులకుఁ । బరవశభావంబు బలుభూషణముగ
చెక్కులు గొనగోళ్లఁ జెనకనిచ్చుటకు । పుక్కిటివీడియంబులె లంచములుగ
నొక్కటఁబొలయల్కలుడుగఁజేయుటకు।నొక్కకైమొక్కలేయుంకువల్ గాఁగ
నమ్మరుఁ డాడించునట్టి జంత్రంపు । బొమ్మలో! యనురాగములె వధూవరుల
యాకృతుల్ దాల్చెనో యన వేఱులేక । యీకైవడి రమించి రేడుగాలంబు
అంత దౌహృదవతియయ్యె నయ్యువతి । కాంతుఁడు సంతోషకంధి నోలాడ
నంతకుమున్నె చంద్రాంగదధరణి । కాంతునిపేరిటఁ గమ్మ వ్రాయించి
హేమవర్ణుఁడు పంప నెలమి నాలేఖ । నామహీశకుమారుఁ డటఁ జదివికొని
తనసోదరికి మున్నుదలఁచిన విభుఁడె । యొనగూడె నిది దైనయోగంబు గాదె
నాపుణ్యవశమున నాతోడు మంచి । కాపురం బూను టాకర్ణింపఁగలిగె
చెడుబుద్ధి విప్రుందుచెప్పిన గోల । నడవిలో విడిచితి నదయభావమున
మత్సహోదరి ప్రథమర్తుకాలంబు । కుత్సితంబని చాలఁగ్రోధించి తెలిపె
నాచంద మరసెదనని రహస్యముగ । ధీచతుర్ముఖులైన ద్విజుల రప్పించి
తనసహోదరి సమర్తదినంబు దెలుప । విని వారలిది మహావిభవప్రదంబు
ఆకన్య భోగభాగ్యములచే ధన్య । యై కుమారులఁగాంచి యభివృద్ధిఁ జెందు
మగఁడెల్లపుడును బ్రేమమున లాలింప । జగతిలో బహుకీర్తిసంపద లెనయు
చెలఁగి కీఁడని యిదిచెప్పిన యట్టి । ఖలులెవ్వరని వాహ ఘనశాస్త్రవిదులు
గావునఁ దెలుప నాకర్ణించి పటుహ । వావేశ చలితాత్ముఁడై పురోహితుని
తప్పిదం బొకదాది తన కేకతమునఁ । జెప్పిన నిప్పులుచెదరఁ గన్గొనల
నాపిప్రురప్పించి యలిగి కొట్టించి । వేవిధంబులఁ దిట్టి వెతలఁ గుందించి
యిలుముట్టుకోల్ వట్టియీయూరనుండ।వలదుపొమ్మనివెలువడఁగొట్టఁ బనిచెఁ

బుత్రమిత్రకళత్రములతోడఁ గూడి । ధాత్రీజనమ్ములందఱు నిందసేయ
నపకీర్తిఁగంది దేశాంతరంబందె । విపరీతమతికెందు వెతలందకున్నె!
యటుల మాధవశర్మ నార్తిఁగుందించి । తటుకున మఱఁదికిఁ దనసహోదరికి
బహురత్న భూషణాంబర వస్తువాహ । సహితంబుగా నొక్కజాబు వ్రాయించి
యనిచిన కరిహయస్యందన సుభట । జనకన్యకాసహస్రంబులఁ గొనుచు
నతనిమంత్రి సునీతి యరుదెంచి యుచిత । గతి హేమవర్మనిఁగని యరణంబు
మీభావ మీకుఁ బంపెనటంచుఁ బలికి।జాబొసంగిన సంతసముఁజెందె నతఁడు
నలచంద్రరేఖయు ననుఁగునెచ్చెలులఁ । గలసి మాధవశర్మ గాసి చెందినది
వాఱు దెల్పఁగ విని వసుధామఱునక । యో! అట్టుప్రాపించెనోటు నామీఁద
నురక ద్వేషించి నన్నూరికిఁ బాపె । మొఱుకుల కాపదల్ మొసయువే యనుచు
నన్న విచారించినందుల కలఱు । చున్నంతఁ గొన్నాళ్లకు కుత్సలగంధి
నవమాసములు నిండిన కుమారునొకని।ధవుఁడురంజిలఁ గాంచెఁ దదనంతరమున
దాదులు మిక్కిలివయ దయివార । నేఁద రాసుతుఁడు రెండేండ్లవాఁడయ్యె
మాణిక్యపురినుండి మరకతవజ్ర । మాణిక్యములు గొంచు మణిమర్మవిదులు
కొందఱు ఘనవర్తకులు చనుదెంచి । యిందురేఖాసమన్వితు హేమవర్మఁ
గాంచి చంద్రాంగదక్ష్మావల్ల భుండు । పంచిన మణులు తప్పక యొప్పగించి
యతని లేఖనొసంగ నదిగొని చదివె । పతిచెంత నక్కాంత బహుమానఘణితి
నందలివక్కణ యధిపుఁ డాలించి । యిందుముఖిమణి నీక్షించి పలికె
దనకు రాఁదీఱు కిత్తఱి నీవుగనిన । తనయుని నినుఁజూడఁదలఁచి మీయన్న
పరివారయుక్తి గొబ్బునఁ దనపురికి । నరుగుడెమ్మని వ్రాసియంపించెఁ గాన
పోయివచ్చెదవె! పూఁబోణి నీహృదయ।మీయెడ నెటులున్న దెఱిఁగింపు మనిన
నన్నాథ యిటులనె నధిప! మావదిన । నన్ను గనుగొన నాకాంక్షగలదు
కరిరథహయభటోత్కరము నావెంట । బఱతేర మాయన్న పట్టణమ్మునకుఁ
జని యట నొక్కమాసము నిల్చిమరలఁ । జనుదెంతు మీపాదజలజసన్నిధికి
నని త్వరఁజేసిన నొగాక యనుచు । దనభార్య వెంటఁ బ్రధానినందనుని
పొమ్మని పెలవిచ్చి భూరిచిత్రాంబ । రమ్ములు మణినికరమ్ములు వివిధ
వస్తువాహనము లవ్వారిగా నిచ్చి । సుస్తనీరత్నంబు సుతునితోఁ గూడ

ననుపమపల్యంకికారూఢఁ జేసి । పనిచెఁ జతుర్విధబలములతోడఁ
బనిచినఁ బతియాజ్ఞఁ బ్రమదాలలామ । ఘనసారనగరంబు గ్రక్కున వెడలి
దాదులు నెచ్చెలుల్ ద్వారపాలుర భ । టాదులు తనవెంటనంటి యేతేరఁ
గొన్నిగ్రామంబులు కొన్నిపల్లియలు । కొన్నిపట్టణములు గొన్నియేఱులును
గ్రమియించి యొకనాఁటి రాతిరిపూట । ప్రమద యందొక రెడ్డిపాళెంబుఁ జేరె
నయ్యూరు చంద్రాంగదాధీన మగుట । నయ్యెడఁ దగుకాఁపు లతిభ క్తియు క్తి
నెదురుగావచ్చి యయ్యింతికిఁ దగిన । సదనంబు విడిదియొసంగి కావలయు
నులుపాలు పట్టించి యున్నసేనలకు । వలయుఁ బదార్థముల్ వరుసనిప్పించి
యాదరంబొనరింప నచలుఁడన్మంత్రి । యాదేవి సౌందర్య, మాపె చిన్నారి
ప్రాయంబుగని మోహపరవశుండగుచు । నేయనువున దీనినెనయుదు ననుచుఁ
బురి వెడలినమొదల్ బుద్ధినూహించు । పరమదుర్జనుఁడౌట బైటిచావడిని
దగుగుఱికాండ్రతోఁ దానువసించి । తెగువమై నేటిరాతిరి యెట్టులైన
బొలఁతిఁ బ్రబోధించి భోగింతుఁ గదిసి । బలిమిగావింతు నొప్పకయున్న ననుచు
నలసి నిద్రించు నాయకులను భటులఁ । దిలకించి సేన లంతికమున లేమి
కరవాలహస్తుఁడై గ్రక్కున లేచి । తలవేచి ద్వారముల్ దాటివచ్చుటయు
వాకిటిగొల్లండు వైధేయుఁ డతని । రాకఁగన్గొని సత్వరమున లోపలికి
నీవేళవచ్చుట కేమికారణము? । దేవి భోజనవేళ దే మఱెవ్వరికిఁ
జనరాదు నిలుమన్న, సచివుఁడిట్లనియె । నను నివారించునంతటి బల్లిదుఁడవె
డౌవారికాఁపమ! తలఁగిపొమ్మనుచు । కావరంబున నొరకత్తి దూయుటయు
నంతఃపురము గాచునటువంటి నన్నొ । కింతఁ గైకొనక నీ వీనిశావేళ
రాణివాసముఁ జొచ్చి రావలదనఁ గృ । పాణంబు దూసితేపాటి దీబుద్ధి!
చూతము నఱికుమంచును జొరనీక । యాతఁడు గద త్రోవ కడ్డంబువైచె
నడ్డంబువైచియు నట్టె డాచేయి । యొడ్డిన నాతని యుప్పలవాయి
నఱకె నమ్మంత్రినందనుఁడు కరాసి । సొరిగి వాఁడిలఁగూలెఁ జొటజొట నచటఁ
దొరఁగె దోరమగు నెత్తురుకాల్వ లిటుల । నఱకి లోపలికేగి నరనాథుదేవి
సకియ వడ్డింప భోజనముగావింప । నొకయింత యళుకులే కుద్ధతివాఁడు
మగువచెంగటి పట్టెమంచంబు మీఁదఁ । దగవేది కూర్చుండి దర్పించిపలికె

భోజనంబిపుడఁటే పువ్వారుబోడి! । రాజులేఁ డేమికార్యముగ నిందాఁక
జాగు చేసితివి నీజవ్వనంబునకు । నీగుణంబునకు నీ నెఱితనంబునకు
హేమవర్ణుఁడు తగఁ డే వన్నెకాఁడ । నీమీఁద దయవాఁడ నీచి త్త మెఱిఁగి
కామతంత్రంబులఁ గరఁగింప నేర్తు । భూమికి బొక్కసంబునకు నే విభుఁడ
నీవు నన్ జేపట్టితేని యీఋణము । భూవిభుఁ బడఁబెట్టి భోగింతు నిన్ను
దొరసానిఁజేసి, నాదోఃప్రతాపంబు । తరుణి! నీవెఱుఁగ వెంతబలాఢ్యుఁ డైన
గడికండలుగఁ జేయఁగలఁ బోరిలోన । నెడసేయ కిపుడె నన్నేలికొమ్మనుచుఁ
బై బడవచ్చినఁ బకపక నవ్వి । యాబాల వీఁడు కామాంధకారమునఁ
దగవును ధర్మంబు తప్పియున్నాఁడు । తగదు కోపింప ని త్తఱిఁ బ్రియోక్తులను
దప్పించికొనుటగదా! నేరుపనుచు । నప్పుడు చింతించి యాద్రోహి కనియె
పదర నేమిటికోయి! ప్రజ్ఞానిధాన । మొదటనే మదవతీమోహనాంగుఁడవు
నెఱమంత్రి వదిగాక నెలఁతలభావ । మెఱిఁగి మగుల్కొల్ప నీవె నేరుతువు
నీవంటి సరసుండె నెఱిదక్కి వేఁడ । భావజుఁ డలుగులపాలు సేయఁగను
వలదనఁగలరె యేవనజాక్షులైన । చలచిత్తులకు మాకు సత్యమెక్కడిది
పట్టె మంచంబుపైఁ బవళించియుండు । మిట్టట్టనకఁ దాల్మి నించుకసేపు
యిదె భోజనంబాయె నే లేచివచ్చి । కదిసి నీకోరికఁ గడతేర్తు ననుచు
వలపుపుట్టఁగఁ బల్కి వాని వంచించి । చెలి భోజనమొనర్చి చేతులువార్చి
కడువడి నినుపపెన్ గడియల నమరఁబడకయిల్ సొచ్చి యెప్పటిఁ గవాటములు
బిగియించి యదరక బెదరకయున్న । వగలాడిఁ బేరొక్కని వాఁడిట్టులనియె
వంచనచేసి కవాటంబుమూసి । పంచాస్త్రిచేఁ గాసిబఁడ నన్ను ద్రోసి
యిచ్చోటువాసి నీవేఁగినఁ బోవ । నిచ్చెదనే! యోసి యిపుడని డాసి
తలుపుదట్టిన నభేద్యంబై యొకింత । చలియించకున్న నచ్చటఁ బాసిచనక
వనిత వాఁకిలితెరవక నన్నుసరకు । గొనకుండితేని నీకొడుకు నీఋణము
కరఖడ్గహతి గడికండలుగాఁగ । నఱకుదునన్న నన్నాతి భీతిలక
యోరి! స్వామిద్రోహి! యోరినీచాత్మ । దారుణక్రియలకుఁ దలఁకక నీవు
శిశుహత్య సేసినసేయుము క్రోధ । వశుఁడవై యిట్టి దుర్వ్యాపారఫలము
నెచ్చెర ననుభవించెద వింకమీఁద । మచ్చికగల నెరమంత్రి వటంచు

నినునమ్మి నావెంట నృపకుమారుండు । పనిచినంతయుగల్గెఁ బలుమాట లేల!
యేలినపతి కిటు లెగ్గొనరించు । కూళల నెందుఁగన్గొన మీవుదక్క
నిసువు నీచేత ప్రమందిన ప్రమందుగాక । యొసఁగుదునే! మానమోరి!నీకనుచుఁ
గెలసి తిట్టఁగ వాఁడు కినిసి చేకత్తి । జళిపించ హా! సాహసంబేల బాలు
డాయకుమనుచు నడ్డముపచ్చు దాదిఁ । ద్రోయుచుఁ గణఁతల దోఃకృపాణంపు
పరుజునఁ బొడిచి కోపమునఁ దిట్టుచును । బరవశఁగావించి బంగారుతొట్ల
నిదురించు బాలుని నిశితఖడ్గమున । నదయుఁడై ఖండించి యచ్చటఁబ్రజలు
కొందఱు పడిలేచి కూఁతలువేయ । నందుండవెఱచి వాఁడరిగెఁ జావడికి
సావడినాయకుల్ సందడియేమి । యీవేళననిన వాఁడేమి లేదనియె
వాఁడు పోయినతరువాత నప్పువ్వి । బోడి లోపలియిల్లు భోరనవెడలి
పటసాల కరుదెంచి పడియున్నదాది । నట ఖండితుండైన యర్భకు నవలి
వాకిటఁ ద్రెళ్లినవైధేయుఁ జూచి । యీకుటిలాత్మని హితుఁడని యెటుల
నమ్మెనో! రాజనందనుఁడని వగచి । క్రమ్మఱఁ బతిసమ్ముఖమున కాఱణమె
చననెంచి యుత్తమాశ్వముదేర సాధ్వి । పనిచి హొన్నరిగంచుపాగ ధరించి
పడదలోఁ గత్తికబ్బాయి మునైన । యడిమూలములను రౌతంగి వహించి
ధనరత్నభూషణోత్కరము లేమఱక । పెనుమూటగాఁగట్టి పెరటిలో మున్నె
సాదియుంచిన నిజాశ్వముమీఁద వైచి । యీపటఁ దక్కుపదార్థంబు లరయు
కొఱకింటిలోపలఁ గొంతసేపున్న । సరిప్రొద్దగుట డస్సి సాధ్వి నిద్రించె
అంతలో నొకచోరుఁ డాయింటివెనుక।నంతకుమును పె ద్రవ్యము ప్రుచ్చిలింపఁ
దటి వేచియునికి దత్తడిమీఁది పెరిక । హరియింపఁ జేరినయప్పుడె యక్కాంత
సరగునఁజనుదెంచి సాహిణియనుచుఁ । దురగంబుకడ నున్నదొంగను జూచి
యోరి సాహిణి! మనయూరికిఁ బోవు । దారిదప్పకయె ముందఱ నీవుచనుము
నీవెంటఁబఱపెద నేతేజి ననిన । నావంచకుఁడు మంచిదని వాజిఁ బట్టి
ఘనసారనగరమార్గంబు దప్పించి । తనయూరికేఁగు బాటను బట్టిచనియెఁ
దలఁతు రూకక మహోద్యమముల నరులు।తలఁచినయటులేల దైవంబుతలఁచు!
తప్పుద్రోవను ప్రుచ్చు దనుగొనిపోవ । నిప్పగిది లతాంగి యిది తనప్రోలి
తెరువనిచనిచని తెలతెలవారఁ । బెనుతోలు కుళ్లాయిపెట్టిన తలను

మందులముడి త్రాటములసిన సిగయుఁ । గందెనచాయయుఁ గలమేనివానిఁ
గని నీవుసాదివిగా వేటివాఁడ ? । వెనసిగుజ్జము వెంట నెటులవచ్చితివి ?
యిప్పుడీవచ్చిన దేయూరిత్రోవ । చెప్పరా? యని గరిసించి గద్దించి
యడిగినదానికి నవ్వాఁడు గొంత । జడిసి యిట్లనియె నేచౌర్యంబువలన
బ్రతుకును నలరెడ్డిపాళెంబులోన । వెతదీఱఁ గన్నంబు వేసి యనేక
ధనము గ్రహించిపోఁదలఁచి మీయింటి । వెనుకనుండెడి నన్నువీక్షించి సాది
మన యూరిత్రోవ నిమ్మాపు గ్రహించి । చనుమన్న మీయూరిజాడ నేపోక
తొరమీఁతిమా యూరిత్రోవఁదెచ్చితిని।దురగంబు,నన్నఁదుదుంఁకుఁజెందియును
గలికి ధీకోదాత్తగావున మదినిఁ । గలఁకచెందక చోరుఁగని యిట్లనియె
నోరి! నీయుండెడి యూరిమార్గమున । వారువమ్మ్ము గ్రహించివచ్చితి ననిన
సంతోషమయ్యె నిచ్చటికి నీపల్లె । యెంతదూరముగల దెఱిఁగింపు మనినఁ
బగటికి నేనున్నపల్లెకుఁ బోవ । నగు రావలయునన్న నౌనుగాదనక
వానివెంబడిఁ గొంతవడిఁ జని యెండ । యైన ముందరఁ గమలాకరం బొకటి
వనవీథిఁ గనుగొని వానితో ననియెఁ । జన దెండలోఁబోవ సరగున నీవు
నియ్యంతికపుఁబేట కేఁగికావలయు । బియ్యంబు పప్పును బెరుగును నెయ్యి
మొదలైనవి పదార్థములు గొనితెమ్ము । వడల కిక్కడ నేను వంటసేతు నని
వానిచేతికి నొక్కవరహా యొసంగఁ । బూని వాఁడదిగొనిపోయె పేటకును
నంతలో నిక్కాంత యాత్మరూపమునఁ । జెంతనున్న కొలంకుఁజేరి స్నానంబు
గావించి మఱి భద్రకాళిఁ దలంచి । దేవి యొక్కఖలుండు తెగటార్చె సుతుని
నీవొసంగిన బిడ్డనికి హానిపుట్ట । గావచ్చునే యనికరములు మొగిచి
సేవించి ప్రార్థనసేయఁగా మునుపె । దేవి మంత్రి కరాసిఁ దెగిన తత్సుతుని
గరుణతో బ్రతికించి గ్రక్కునవాని । పరిసరస్థునిఁజేసి పాలింపుచుండె
ఆ రెడ్డిపాళెంబునం దచలాఖ్యుఁ । డారాజమంత్రియు నఖలసైనికులు
తెల్ల వారకమున్నె దిగ్గనలేచి । యల్లరాజవధూటి నభ్యంతరమున
వెతకి కానక తొట్ల వెల్లువఁగొన్న । సుతునిరక్తముఁజూచి చోద్యంబు నంది
సతియేది!సుతుఁడెందుఁజనియెనో!యనుచు।వెతఁజెందనమ్మంత్రివికటాత్ముఁడగుట
వారితోననియె నివ్వనజాక్షి నిజము । గా రాజసతిగాదు కాళీగృహమునఁ

గని నదురేయి నిక్కము రాజకన్య । యని పిశాచినిఁ బెండ్లియై మనరాజు
బ్రమసెగదా! కాఁపురముచేసె కొన్ని।సమ లిందుఁదెలిసె రాక్షసియిది యగుట
తనకుమారునిఁ బట్టి తానెభక్షించి । తనద్వారపాలుని దాదిని గొట్టి
పడవైచి చనియె నిబ్బియిమ్మాట । పుడమిజేనికిని దెల్పుదను రండనుచు
సేనలతోఁగూడి చెచ్చెరఁ బోయి । మానవేంద్రున కాక్రమంబు దెల్పుటయు
నతఁడు మోహమున హాహాకార మెసఁగ।సుతునెంచి సతిమంచిసొబగు వర్ణించి
యడల, వాఁడనియె దయ్యముగూర్చి జాలి।బడనేల? భూపాల! భార్యయంచనిన
నది దయ్యమైనఁ జంద్రాంగదుండేల! । ముదిత సైదోడని ముదమొప్ప మాకు
నరణంబువనుచు రత్నాభరణములు । కరిరథాదులు, బోనగ త్తియ లేల
యడలెద! రక్క మమ్మందఱఁ బాసి । కడు గూర్మిమాని యెక్కడికేగి తనుచు
నిదమిత్థమని నిశ్చయింపరా దనుచు । నదవదపడఁగఁ గూహకపుమాటలను
దొర వంతమాన్చె నద్దుష్టమానసుఁడు । తరువాత గొల్లయు దాదియు నచట
జనములు సేదదేర్చఁగ మూర్ఛదెలిసి।కొని గాయములుమాని కొన్ని నాళ్లకను
దమయక్క విభునిచెంతకుఁ బోక యెందు । గమనించెనో యని కడుఖేద మంది
యరిగిరి దేశంబు లందరయుటకుఁ । గరియాన చంద్రరేఖ తెఱంగు వినుము
చోరునిఁ బేట కచ్చోప్పున ననిచి । వారిజానన సరోవరతీర వృక్ష
రాజికలోన వార్వము గట్టినైచి । వాజిపై బర్వ్వ లవ్వలివంక దాఁచి
యొక పొదరింటిలో నున్నఁ జోరుండు । సకలపదార్థముల్ సయ్యనఁ గొనుచుఁ
బఱతెంచిపొదలోనఁబదివన్నెహారొన్ను । మెఱుఁగులుమీఁబర్వ్వమాటొందుదాని
తళుకుఁజెక్కులదాఁ దలిరువిల్కాని । కలికి గేరెడుసోయగము గలదాని
నలకాంత నళికాంతరాక్రాంత చంచ । దళికాంత నైల్యభాగలకాంతఁ జూచి
యిది తలోదరియాట యెఱుఁగకీవఱకు । మది నక్కయుండితి మగవాఁడటంచు
వగపేల! ధనమణిప్రజముతో నిపుడు । జిగిబిగి గుబ్బలచేడియ దొరకె
నీవన్నెలాడితో నింటికినేఁగి । కేవలశ్రీలొంది క్రీడింతు ననుచుఁ
జేరవచ్చిన వానిచిత్తం బెఱింగి । యూరాజవదన యిట్లనియె నీకేల!
వెరగంద, నేరాచవెలఁదుక నౌదుఁ । దొరకితి నీచేతఁ దుందుడుకడిగి
యోయి!నన్ గొనుచునీయూరికిఁబొమ్మ్ని।పోయినప్పుడెయిత్తుపొసఁగమద్ధనము

నావిని శబరుఁడెంతయు సంతసించి । నీవుచెప్పినయట్ల నే మెలంగెదను
సందేహ మొందక చనుదెమ్మటంచు । మందలించిన మంచిమాటల వాని
నమ్మించి పోక యన్నముచేసి తాను । నెమ్మి భుజించి వానికిఁ దుష్టిగాఁగ
నన్నంబు వెట్టి కౌతంగు వహించి । యన్నళినదళాక్షి హయముపై నెక్కి-
భానుఁడు చరమాబ్ధిఁబడి మున్గువేళ । వానివెంబడిఁదదావాసంబుఁ జేరి
చేరి యశ్వాముడిగ్గి చెంతఁగట్టించి । భారముల్ డింపించి పడకయిల్లొకటి
వాఁడుసూపిన నందువసియించి మంచి । వేఁడిపాల్ చక్కెర వివిధఫలములు
తెచ్చి యర్పించినఁ దృప్తివహించి । యచ్చోరుఁడిలుసొచ్చి యరదేరఁ జూచి
వానితోననియె నీవలపు నే సతము । గానమ్మ్నటకు శంకగల దొండువినుము
నీసొమ్మ్నా సొమ్మ్న నీవునేననెడి । యాసలుభేదమ్మ్నలడఁచినఁగాక
మనసురంజిలదు నీమదివేఱులేక । యెనయఁగోరెదవేని యిదిగొ నాధనము
నీచెంతనుంచెద నీవుగడించి । దాఁచిన సొమ్మ్నతో దాఁచుమీక్షణమె
యనినఁ గోమలిమాట లక్ష్యాతురుండు । గనుకవాఁడూకొని కడుసంతసించి
తనయింటి ధనమెల్ల దాఁచక తెచ్చి । పెనుకుప్పగాఁ బోసె బిత్తరి యెదుట
పోసినఁ దనసొమ్మ్న ప్రోఁగుతోఁ గలిపి । యీసొమ్మ్నదాఁపు మీ వెచ్చోటనైన
మీఁద నీకొకటి నెమ్మి గణింతు ననిన।నా దొంగబంటు భాగ్యంబాయె ననుచు
నా గృహాంగణభూమి యటఁద్రవ్వి పెద్ద। కాఁగులో మణులు నిష్కములునుబోసి
జాఁమూఁతఁజేసి యేర్పడకుండఁ బాతి।యామన్నుపైఁగప్పి యరుగుదెంచుటయు
భామిని యాదొంగబంటును బిలిచి । యీమెయి నీకొక్క హితము దెల్పెదను
గోడచేర్పు తలాపుక్రోటి క్రిందటను । బైడికరాటంబు పాతి వచ్చితిని
అందులోపలఁ బదియీఱు వజ్రములు।పొందుగా నుంచి యెప్పుడుదాఁచి యుందు
నవి ప్రాణతుల్యంబు లందొక్కటొకటి । భువియెల్ల సేయు నిప్పుడె నీవు పోయి
రేపు మాఁపటికిఁ జేరి గృహాంతరంబు । కాపులు గనకుండఁ గన్నంబు వేసి
భరణి గైకొనివేగ పఱతెమ్మ టన్నఁ । బరితోష మొప్ప నప్పాటచ్చరుండు
తన యింటియాపె కత్తరళాక్షిఁ జూపి । మనదొరసాని యమ్మగువపై భక్తి
గలిగి యీయింతికిఁ గావలసినవి । యెలమితోఁ గొనితెచ్చి యిమ్మని చెప్పి
యా యర్ధరాత్రంబునందె వాఁడరిగె।త్రోయ నేర్తురె!పొలంతులమాయ జనులు

ఆరాజవదనయు నానదు రేయి । చోరునిసతి నిద్రచొక్కున నుండ
సరగున లేచి యాసకలధనంబు । పెరికలో వైచి యోపిక తేజిమీఁద
నల్లన నుంచి రౌతంగు వహించి । యల్ల గుట్టము నెక్కి యనిలవేగమున
నేమని చెప్పుదు నింతి యగ్గలిక! । యామద్వ్యయమున నాఁటామడఁ జనియె
నంత సూర్యోదయం బగుటయు నవని । కాంతకుమారునిగతి త్రోవఁ బట్టి
చనుచున్న నొకవణిగ్జనుఁడు తన్మార్గ । మున వెంబడించి యేభూపపుత్రుఁడవు
ఎక్కడికేఁగెద వీతేజి నెక్కి । యొక్కరుండవు భటవ్యూహంబు లేదె
యన విని మాసేనలన్నియు వెనుక । చనుదెంచుచున్న వెచ్చటికేఁగె దీవు
ఏజాతి నీది పేరెయ్యది యనిన । నా జలజాక్షితో నవైశ్యుఁ డనియె
అనఘ! నే వైశ్యుండ నర్థదత్తాఖ్యుఁ । దనరుదు రావు సౌదాసపట్టణము
సరకు లమ్మునకు నిచ్చటిపేట కరిగి।మరలి పోయెద రమ్ము మాయూరిత్రోవ
సకలపదార్థముల్ సమకూర్తు ననిన । ముకురాస్య మించిది ముందర నీవు
త్రోవఁ జూపుచుఁ బొమ్ము తోడ నేతెంతు।నీవెంట ననిపల్కి నిబ్బరంబుగను
నల తేజిఁ బఱుప మధ్యాహ్న మగుటయు।నలినాక్షి బడలి ముందర నొక్క సరసి
వనమధ్యమునఁ జూచి వైశ్యున కనియె । చనగూడ దవల నిచ్చట నిల్వవలయు
నలఁత పుట్టెడు తండులాది పదార్థ।ములు గొని యతిశీఘ్రముగను రాఁగలవే!
యిట భోజనము చేసి యేఁగుద మనుచు । బటుబుద్ధినొకకొంత పైకం బొసంగ
నావైశ్యుఁ డొకపల్లె కరిగి వంటకును । గావలసినవెల్లఁ గ్రక్కునఁ దెచ్చె
నంతలో మగవేష మాయింతి మాని । యంతికసరసి స్నానాదులు దీర్చ
నావైశ్యనందనుం డచ్చె వీక్షించి । యీవింత కని విని యెఱుఁగ మెచ్చటను
నిందాఁక నృపపుత్రుఁడే యని యుంటి । నిందుముఖీమణి యిది మోహనాంగి
దీనిఁ జూచినఁ జాలదే యింద్రపదవి । ద్దైన నిరర్థకం బది యెంచనేల!
యని నోరు దెఱచుక నట్టె చూడఁగను । వనిత క్రేఁగన్నుల వాని నీక్షించి
క్రూనిమహ్వన నుండి మది చోద్యపడుచు।మానక చూచుట మర్యాదయగునె?
జలములాడఁగ, రాచజాతి కోమలిని । వలదు సందియమంద వైశ్యకుమార!
వంటవారుపు లైన వడి భుక్తి సలిపి । యింటికిఁ దోకొని యేఁగుము నన్ను
నీవెంటఁ జనుదెంతు నీకోర్కెఁ దీర్తు । నావిని వైశ్యుఁ డానందంబుఁ జెంది

పొలఁతి మున్నుగ దాను భోజనక్రియలు । సలిపి పూరుషవేష సంగతి గన్న
యంగన తేజిపై నధుదేర మనసు । చెంగలింపఁగ వాఁడు చేరె మందిరము
మందిరమ్మునఁ జోరు మసగప్పినటుల । నిందుముఖిమణి యింటిసొమ్మెల్ల
దనసొమ్మ్మతో గూర్చి తగుపెట్టె నునిచి । వినుమిది సెల్వు గావింపఁగా రాదు
నీచేతి కొసఁగెద నేను ముమ్మ్మాల । ఈచెక్కడపు టుంగరం బొకటిపుడు
అదిగొని మణిదత్తుఁ డలరెదు జాల । పద మను నగరంబు ప్రాపించి యతని
చేతి కొసంగు మిచ్చినవేళ యెఱిఁగి । యాతఁడు నూఱువే లప్పుడె యొసఁగు
నది గొనిరమ్ము పొ మ్మని వీడుకొలుప । నదనమా ధనకాంక్ష నయ్యుంగరమ్ము
గొని వేగుజామున గొబ్బునఁ గదలి । చని రెండుజాలకు జాలపదమ్ము
ప్రాపించి యంగడిబచ్చులలోన । నేపొందు మణిదత్తుఁడితఁడని యెఱిఁగి
చెంగటఁ గూర్చుండి చేతియుంగర మొ । సంగిన నది చూచి సందేహమంది
యీయుంగరమ్ము నీకెక్కడ దొరికె । నోయి! వైశ్యకుమార యున్నదున్నటులఁ
దెలుపుము కొంక కీదేశాధినాథుఁ । డలఘువిక్రముఁడు చంద్రాంగదనృపతి
ధరియించు భూషణో త్తమ మిది యనిన। వెఱచి వైశ్యుఁడు వణిగ్విభున కిట్లనియె
నెవ్వరిదో యిది యెఱుఁగ నే నిన్న । జవ్వని యొక్కతె జవనాశ్వ మెక్కి
మాయిల్లుఁ జేరి యీ మణిభూష యొసఁగి । నీయొద్ది కిది గొని నేఁడె పొమ్మనఁగ
వచ్చితినన నవిశ్వాసంబు మదిని । హెచ్చఁ గోమలియెవ్వ? రెటుల నీసొమ్ము
నీచేతి కిచ్చె సందేహాస్పదంబు । రాచవారల యుంగరము గొనువాఁడ
గలరె! పోబడి యెఱుంగక నీవు పోవ । వల దుండు మని తలవడులకుఁ జూపి
యీవైశ్యనందను నప్పగించుటయు । దైవమా యని వాఁడుతల్లడింపుచును
చెఱసాలనుండె నచ్చెలి నాఁటిరేయి । సరిప్రొద్దుకడ లేచి జవనకంఖాణ
రత్నంబుపై ముత్తెఱంగుల ధనము । యత్నంబుతో వైచి హాయసమారూఢ
గతి దక్షిణపుఁద్రోవఁ గైకొని చనఁగ । లతకూన యెదుట భల్లాతకీవనము
గనుపించుటయుఁదురంగముచాల డస్సి।యునికియుబలుతమం బుత్కటం బగుట
తెరువు దోఁపక యున్న తెఱఁగును జూచి । తరుపరంపరలోనఁ దత్తడి డిగ్గి
బరువులు డించి నిర్భయవృత్తి నుండె । పరమేశ్వరీ! నీవె ప్రాఁపుదాఁపనుచు
నా యరణ్యమ్మ్మలో నశ్వత్థతరువు । పాయకుండెడు నొక్క బ్రహ్మరాక్షసుఁడు

తనచెంత నున్న కాంతమొగంబుఁ జూచి । యనియే నిట్లని వింటివా! పాలుగంటి
చిత్రపురం బేలు క్షితితలేశ్వరుఁడు । చిత్రవాహనుఁ డుగ్రసింహావిక్రముఁడు
ఆరాజు రేపు వైద్యావళినెల్ల । కారుణ్యరహితుఁడై కలుగానుగలను
పడవైచి హింసించు పనిఁబూనినాఁడు । కడుపాఱఁ దినవచ్చు క్రవ్యంబు మెదడు
నిక్కువం బనినవానికి వానిభార్య । యక్కజపడి పల్కె నయ్యయో! రాజు
పాఱులా వైద్యులఁ బట్టి చంపింపఁ । గారణం బేమయో! గణియింపు మనిన
ఆ బ్రహ్మరాక్షసాధ్యక్షుఁ డిట్లనియె । నబ్రాశిగంభీరుఁడైన యాతనికిఁ
గలకంఠి చిత్రరేఖానామ భామ । గల దావధూటి కుత్కటశిరోభార
వేదన యావిర్భవించె నందులకుఁ । గా దేశమున నున్న ఘనవైద్య వరులఁ
బెక్కండ్ర దొగ పిలిపించి యానొప్పి । యక్కఱపడి తీర్చునట్టి ధన్యునకు
సామ్రాజ్యరాజ్యంబులో నిత్తు । శ్రీమించ నేలింతుఁ జిత్రపురంబు
జనులెంచ నంచు హజారంబునందు । ఘనత భాషాలేఖ గట్టించినాడు
అయ్యాశ ప్రేరేప నౌషధం బెఱుఁగు । నయ్యలందఱు వచ్చి యైదాఱు నెలల
గడువు పెట్టుక నొప్పి గడతేర్ప బాధ । పడుచున్నవా రేమిపలికెద నతివ!
గడువు నిన్ననె తీఱెఁ గల్లుగానిగలఁ । బడవేయ ధారుణిపతి పూనె ననఁగ
నానొప్పి యొందున నావిర్భవించె । దాని కెయ్యది చికిత్స యెఱుంగ వలయు
నీడ నెవ్వాఁడు లే రెటిఁగింపు మనిన । వాఁడును ననొప్పి వచ్చిన తెఱఁగు
తెలిపెద వినుము పార్థివకాంత మున్ను । జలజాకరంబున సఖులతోఁ గూడి
జలకేళిఁ దేలెడి సమయంబు నందు । జలజమొక్కటి గొని సతి మూర్ఖునంగ
జెలగ యొక్కటి ప్రవేశించెఁ దన్నాస । మెలఁత కపాలంబు మెదడుఁ బ్రాపించి
పెల్లుగాఁ బిల్లలఁ బెట్టె నానాఁట । పిల్లలు మఱి పెక్కుపిల్లల నీనె
గులగుల తల నిండుకొని మెదడెల్లఁ । బలపలగా నవి భక్షింపఁ దొడఁగె
నందున నొప్పి మహాఘోర మయ్యె । నిందులకుఁ జికిత్స నెటిఁగింతు వినుము
చెప్పుతట్టాకు దెచ్చి రసంబు పిడిచి । యొప్పుగా నూనెతో నొకపరి కాఁచి
నాసికాపుటమున నస్యం బొకింత । చేసి యాతైలంబు శిరమునఁ బోసి
యుప్పుటాకునఁ జూర్ణ మొనరించి చేలగప్పి యప్పుగ వేయగా ముహూర్తమున
జలజల జలగలు జాఱు వేవేలు । తల నుండఁగూడ దాతైలంబువలన

నప్పాగచే నొక్కఁ డైనను నిలువ । కప్పుడె పడు నేల నవియెల్ల పడినఁ
దల చుల్కనగు నొప్పి తగ్గి హాయిమని । చెలికి నిద్దుర వచ్చు సిద్ధ మీమాట
యనిన నీక్రియ నెవ్వఁ డైనఁ గానరొకొ । యని బ్రహ్మరాక్షసునంగన పలికె
నావా ర్త లది రాత్రియగుట నాలించి । భూవరకాంత గొబ్బునఁ దేజి నెక్కి
యావిపినము దాఁటి యటు పోయిపోయి। దేవేంద్రుదిశ గ్రహాధిపుఁడు గాన్పింపఁ
జిత్రపురాంతికసీమకు నేఁగి । రాత్రితా నాబ్రహ్మరాక్షి వలన
వినిన యౌషధములు వెస సంగ్రహించి।కొని వైద్యవేషంబు కొమరొప్పఁదాల్చి
యిలరాయల పురోధ యిలు సేరి యతని।వలన రాజును గాంచి వైద్యులమీఁద
నలుగ నేఁటికి రాజ! యఁటనిమేషమునఁ । దలఁగింతు నీ దేవితలనొప్పి యనుచు
నాచికిత్స యొకింతయైనఁ దప్పకయె । యాచరింపఁగ దదీయఘ్రాణవీథి
దొరగె జలూకలు తోరంబుగాఁగ । పరిపరిరూపుల బహుసహస్రములు
జెలగ యొక్కటియైనఁ జిక్కకయుండ । వెలువరించిన శిరోవేదన దీటి
యాయిందుముఖి హాయిమని నిద్రఁ బోయె।నీ యద్భుతపువైద్య మెక్కడనైనఁ
గలదెయటంచుభూకాంతుండు మెచ్చి।పొలఁతియాఁ టెఱుఁగకపురుషుఁడేయనుచు
సిరులొప్పఁ బట్టాభిషేకంబుఁ జేసి।పురముతో సామ్రాజ్యమున సగం బొసఁగఁ
జిత్రపురం బేలెఁ, జిత్రవాహనుఁడు । చిత్రాంబరాదు లాచెలువ కొసంగి
యవల జయాస్పదంబను పురినుండి । పువుబోణితోఁ గూడి భువి యేలుచుండె
పగలెల్లఁ బురుషరూపంబు వహించి । మగువ కొల్వున నుండి మహిజనం బలర
రాజ్యంబు పాలించు రాతిరియైన । ప్రాజ్య విలాససంపద కాంత యగుచు
నంతఃపురంబులో నది వసియించుఁ । గొంతకాలం బిట్లు కువలయనయన
క్రమియించి పతిఁ బాసి కటకట యిటుల।కమలాక్షి బ్రదుకుట కడుకష్ట మనుచుఁ
దలఁచి యా పట్టణద్వారంబులందు । నలుగడల స్వకీయ నవనీయరూప
కలితలౌ ప్రతిమలఁ గావింపఁ బంచి । యలవాకిళుల నిల్వుఁడని నియోగించి
భటుల నాయూదాద్వారపాలురఁ జూచి । పుటభేదనద్వారములఁ జొచ్చి వచ్చు
పురుషు లెవ్వారైన బొమ్మలఁ జూచి । పరితపించిరయేని బహుమతి వారి
గొబ్బున నిటకుఁ దోడ్కొని రండటంచు । నబ్బురంబుగఁ జెప్పియంపిన వారు
హెచ్చరికై యున్నయెడ నొక్కనాఁడు । మచ్చరం బుడివోయి మాధవశర్మ

తన యాలుబిడ్డలు దనవెంట రాఁగ । జనుదెంచెఁ బురి ప్రాగ్దిశాద్వారవీథిఁ
జొచ్చి వేవేగవచ్చుచుఁదళుక్కు లొలుక। హెచ్చుబొమ్మనుజూచి యీయింతివలనఁ
గాదె విపద్దశ ఘటియిల్లెఁ దనకు । నీదెస కాయింతి యెటుల వచ్చినదో!
యిచ్చట నీబొమ్మ నేల నిల్పిరొకో! । యచ్చున వేసిన ట్లమరియున్న దని
భ్రమసి పల్కఁగ ద్వారపాలు రాద్విజుని । ప్రమదచెంతకుఁ బదంపడి కొనిపోవ
నతనిఁ కన్గొని లేచి యవనతయగుచు । నతిభ క్తి నర్ఘ్యపాద్యాదు లొసంగి
యుచితాసనంబున నునిచి క్షేమంబు । రుచిరో క్తి వేఁడి గురుండు మా కనుచుఁ
దన సభవారి కందఱికినిఁ దెలిపి । ధనధాన్యవస్తువుల్ దనియఁగ నొసఁగి
యునిచిన వెత దీఱియుండె నాద్విజుఁడు । వనితసౌశీల్యంబు వర్ణించికొనుచు
నంతటఁ గొన్నినా ళ్లరిగినవెనుక । నింతి యక్కట! యేడకేఁగెనో యనుచు
నల్ల గొల్లయు దాది యప్పురిఁ జూడ । నుల్లంబునఁ దలంచి యుత్తరద్వార
భాగంబు సొచ్చి యాబంగారుబొమ్మ । బాగు విలోకించి బాపురే! యిదిగొ
మనయక్కఁబోలు బొమ్మనుగంటిమనుచుఁ।గనుదోయిన శ్రులుగార నేడ్చుచును
గనుగొనుచున్న నక్కడిభటుల్ చూచి । చనుదెంచి మారాజుసన్నిధి కనుచు
వారిఁ దోడ్కొనిచన్న వారి నీక్షించి । వారిజానన హర్ష వారిధిఁ దేలి
గాయముల్ మాని యేకై వడి బ్రతికి । యీయెడఁ జేరితి రేమయ్యోమంత్రి ?
మనధరావిభుఁడు సేమమున నున్నాఁడె।ననుగూర్చి యేమనె? నాఁటి కార్యములు
వినియందురే యన్న వెలఁది కేకాంత।మున గొల్ల యనియెఁ గేల్మోగిచి సంప్రీతి
నమ్మ! మూర్ఛిల్లి గాయములతో నున్న।మమ్మ్ము గాపాడి గ్రామస్థులా ఘనులు
పనిచిన ఘనసార పట్టణమ్మునకుఁ । జని మీరు లేకున్నసన్న యెఱింగి
యాదుష్టమంత్రి కృత్యములెల్లఁ దెల్ప । రాదు రాజునకని రంతు సేయకయె
తిరిగి వచ్చితిమి నిన్ దేశదేశముల । నరయుటకొఱకన్న నతివ హర్షించి
వారి లాలించి భూవరునితో మంత్రి । దారుణక్రియలెల్లఁ దప్పక తెలుప
నున్నారు గద! మీర లుడుకేలయనుచు । మన్నించి వారి నెమ్మది చల్లఁజేసి
యెప్పటివలెఁ జెంత నిడుకొని ప్రోచె । నప్పద్మలోచన యంతటఁ గొన్ని
దినములు చన ప్రుచ్చు దేశదేశముల ।కనకాంగి వెదకి యెక్కడఁ గానలేక
నచ్చిత్రపురమున కట నొక్కనాఁడు । వచ్చి తాఁబశ్చిమద్వారదేశమున

నిలిపినబొమ్మ నెంతే భ్రాంతుఁ డగుచుఁదిలకించి యిటువంటి తెఱవయెకాదె
తనసొమ్ము గైకొని తను గాకుచేసి । చనియె మొట్టో యని జాలి చెందుటయు
వాని దుఃఖముగని ద్వారపాలకులు । భూనాథుకడకు గొబ్బున రమ్మటంచుఁ
దోకొనిచన్న నాదొంగ వచ్చుటకు । రాకేందుముఖ చాల రంజిల్లి పలికె
నేమోయి! నాయండ నిన్నినాళ్లేల । తామసించితివి రత్నము లబ్బెనోటు
నీసొమ్ము నాసొమ్ము నేను దెచ్చుటకు । గాసి చెందితివేమొ కటకటా! నిన్ను
వనటఁ గుందించితి వ్యర్థంబుగాఁగ । వినుము నీసొమ్ముఅవీసమ్ము లోదు
అంతఃపురంబులో నది దాఁచియున్న । దంతయు నొసఁగెద నడలకు మనుచు
వాని నూఱడఁ బల్కి వస్త్రాదు లొసఁగి । నానాఁటి కశనంబు నగరఁ బెట్టించి
యాదరింపంగ వాఁ డమ్మ! నీవనుపఁ । గాదన కారాత్రి గమనించి రెడ్డి
పాళెంబు చేరి యాపడకయిల్లెల్ల । గాలించి వజ్రముల్ గానక తిరిగి
వచ్చితి నింటికివనిత! నీవార్త । చెచ్చెరఁదెలుపనీ సీమలదిరిగి
దిగులొంది వచ్చి నిన్ దిలకించినపుడె!నెగులెల్లఁ దీఱె మై నిలిచెఁ బ్రాణములు
అని వాఁడు తెల్పఁగా నతివ లేనగవు । తన నెమ్మొగంబునఁ దళుకొత్తనున్న
తటిఁ గొన్నినాళ్ల కాదక్షిణద్వార । సరణి వైశ్యసుతుండు చనుదెంచి యచట
పొలుపొందు బంగారుబొమ్మ నీక్షించి । కళవళం బొదవ గద్గదకంఠుఁ డగుచు
చేరి నాయిలు చక్కఁజేసిన యమ్మ । గారి నిచ్చటఁ జూడఁగల్గెగా! యనుచు
కన్నీరు మున్నీరుగా నేడ్చుచున్న । యన్నగరస్వామి యార్తి వారించి
ద్వారపాలకు లేలవగచెదు రమ్ము । మారాజుకడ కని మసలక యతని
సభకుఁ దోకొనిపోయి స్వామి పరాకుఁసభయుఁడై యాసెట్టి చనుదెంచెననుచుఁ
బొడ గనుఁగించినఁ బొలఁతి లాలించి । యడలక కూర్చుండు మని సెలవిచ్చి
వానితో ననియె నోవైశ్యకుమార । నీనిలయముఁజేరి నీ యింటిధనము
సకలమ్ము దెచ్చి యిచ్చట దాచినార । మొకటియు సెల్వుగా దోడకు మన్న
నొరుల వంచనచేసి యున్న సొమ్ములు ।హరియించి తెచ్చిన యదియేమి? యనిన
గల దిందులకు నొక్క కారణం బదియుఁ।దెలియనొ మీకెల్ల దీమసంబుననె
యది యటులుండె నీ వానాఁడు జూల । పదమున కేఁగినపని యేమి యయ్యె
నెఱిఁగింపు మనిన వాఁడిట్లను నచటి । కరిగి యుంగరమియ్య నలవర్తకుండు

చెఱనుంచె నిది రాజుచేతి సొమ్మనుచు । దొరయు నీసొమ్మేడ దొరకె నటన్న
నెలనాగ యొక్కఁ తె యిచ్చిన దింట । నెలకొన్న దనిన నాన్యపతియు నిన్ను
పరికింప సుభటులఁ బనుప నిఁక చేరి । మఱి నీవు పోయినమాట యాలించి
యది జగజంత యెందరిగెనో మేము । వెదకెద విన్నావును వెదకు మటంచు
పోయి రవ్వారలు పోయిన వెనుక । నీయున్కఁ తెలియక నిఖిలదేశములు
తిరిగి యిచ్చటి కరుదెంచితి ననిన । హరిహరి ! నీవెంత యూర్ఖుఁ జెందితివి
నాకతంబున నని నలినాక్షి యతని । యూఁకలియును దప్పి యడఁగ మృష్టాన్న
పానీయము లమర్చి భ్రాతవు నీవు । నీనిఖలార్థంబు నీకొసంగెదను
ఈచోట వెతఁబడ కిరవొందు మనుచు । నాచిత్రవాహను నతని దేవేరి
మఱునాఁడె పిలిపించి మైత్రితో నంతి । పురమున నుంచి యాభూపతిఁ జూచి
సతి యాదినుండియుఁ జతురోక్తిఁ దనదు।కత దెల్పి మనవి యొక్కటి వినవలయు
మాయన్న పేరఁ బ్రేమమున జాబొకటి।వ్రాయించి యతని శీఘ్రమున నిచ్చటికి
రప్పింపుఁ డవలికార్యము మఱి మీఁదఁ । జెప్పెద ననవిని చిత్రవాహనుఁడు
దాని పతివ్రతా ధర్మంబునకును । దాని యౌర్యునకునకును దాని నేర్పునకుఁ
దన వధూమణియును దాను మెచ్చికొని । తనయవు నీ వేము తల్లిదండ్రులము
తలఁకకు చంద్రాంగదక్షితీశ్వరునిఁ । బిలుపింతుఁ గమ్మ పంపిఁచి యాక్షణమె
హేమవర్మని నిట కేఁబిలిపించి । నీమది రంజిల్ల నినుగూర్చ ననుచు
గారవించి ప్రియోక్తిఁ గమ్మ వ్రాయించి । యారాజసుతునకు నంపిన నతఁడు
తన సహోదరి దీనదశ గని వగచి । తన బంధుమిత్రసంతతిఁ గూడి వచ్చె
వచ్చిన భోటభూవర కుమారునకు । నచ్చిత్రవాహనుం డపుడెదు రేఁగి
యనుర క్తిఁ దోడ్తెచ్చి యంతఃపురమున।ననుజ ముందర నిల్ప నామె శీఘ్రమునఁ
జనుదెంచి యన్నకు సద్భక్తి మ్రొక్కి । కనుదోయి కాటుకకన్నీరు దొరుగఁ
నడలఁగా నూరార్చి యన్నాతి చెంత । నిడుకొని యనియె నాపృథివీశసుతుఁడు
అక్కరో ! నేఁ బిల్వనంపినఁ ద్రోవ । నక్కటా యక్కటిలాత్మనిచేతఁ
దనయుఁ గోల్పోయి దుర్దశల స్రుక్కితివి।కనుగొంటి నిను తొంటి ఘనపుణ్యగరిమ
వగవకు మని చిత్రవాహనుఁ జూచి । జగతీశ! శుభ లేఖ సయ్యన నిపుడె
వ్రాయింపు మా హేమవర్మన కనిన । నాయన నాపుత్రియగు హేమగాత్రి

నిను మహల్ గొన్నది నీకు వివాహ।మొనరించెదము మంత్రయుతముగ రేపె
రావలయును ముహూర్తము సమీపించె । భూవరాత్మజ చిత్రపురమున కనెడి
యరిదివక్కణ నేహుపమర వ్రాయించి । సరస హరిద్రాభ సమకూర్చి పెండ్లి
శుభము దెల్పెడుకమ్మ సూక్ష్మబుద్ధియగు।సుభటుచే నిచ్చి పంచుటయు వాఁడరిగి
ఘనసారపురము గ్రక్కునఁ జేరి యచట । ఘనసారనిభకీర్తి గరమొప్పువాని
నాత్మజాయా వియోగాగ్నిచేఁ గంది।యాత్మజాకృతి నెంచి యార్తుఁడౌవానిఁ
గని మ్రొక్కి కమ్మ చెంగటనిల్పఁ జదివి । కొని సంతసించి యగ్గురుశుభవార్త
సభవారి కెఱిఁగించి సపరివారముగ । నభినవోద్వాహ లీలాసక్తి నరిగె
తనకుఁ బాటిలుక్కీఁడు దాఁగాన లేక । జనియె నమ్మంత్రియు జననాథు వెంట
నీరీతిఁ దనసేన లెల్లను గొలువ । భేరీమృదంగ గంభీరఘోషముల
నచ్చిత్రపురము డాయఁగఁ బెండ్లికొడుకు । వచ్చిన విని చిత్రవాహనుతోడ
నెలమిఁ జంద్రాంగదుం డెదురుగాఁ బోయి।సలలితోక్తుల నుపచారముల్ చేసి
తోఁకొని తెచ్చి బందుగులతోఁ గలసి।యాకుచ్చితపుమంత్రి యురు దేరఁ జూచి
క్ష్మానాథ! నీమంత్రిసత్తముం డీతఁ । డేనా! మహామహుండే పో యటంచు
నలుకతోఁ బలుకుచు నంతఃపురంబు । చెలులు నివాళింప శ్రీలొందు నొక్క
భవనాంగణమున కేపగిదిఁ దోడ్తెచ్చి । నవరత్నఖచితాసనంబున వేడ్క
ననిచి తామందఱు నుచితాసనముల । ననుపమస్థితి నుండి రాసమయమున
నపుడు చంద్రాంగదుం డాడినమాట । విపరీతగతిఁ దమ వీనులసోక
వెగడొంది దిగులొంది విముఖుఁడై యుండె।తగపుమాలినయాప్రధానాధముండు
గొల్లయు దాదియుఁ గొలిచి వెన్వెంట । నల్లనఁ జనుదేర నాచంద్రరేఖ
ఘనభూషణాంబర గంధమాల్యముల । తనకాంతి దిక్కులఁ దళతళలీన
తనవల్లభునిఁ గాంచుతమకంబు మించఁ । జనుదెంచెఁ దనుజూచు సచివుని గుండె
దిగ్గుమనంగ నీతిఱున వచ్చి । యగ్గుణవతి పతియంఘ్రుల వ్రాలి
హారని యేడ్చె నయ్యుర్వీశ్వరుండు । జాఱు నశ్రువులతో సతిఁ జూచి యడలె
నీచందమున దైన్య మెనసినవారి । నా చిత్రవాహ చంద్రాంగదుల్ సూచి
యడలు వారించి యాయతివ తాఁగన్న।కొడుకును దిని కాళిగుడి దయ్యమగుటఁ
జనెనని నీమహాసచివుండు దెలుప । వినియది నిజమని వేదుకఁబట్టి

యితని మన్నించితి హితవరి యనుచు । మతిశాలి వితనిక్రమం బెల్ల నీవు
హేమవర్ణుఁడ! విను మీగొల్ల చేత । నాముద్దిచేనని యనియెడి వారి
పలుకులువిని గొల్ల పతిసమ్ముఖమున । నిలచి పరాకయ్య నృపసార్వభౌమ!
చనవరియని నమ్మి సతివెంట నితనిఁ । బనిచితి రల రెడ్డిపాళెంబు నందు
చావడిలోనుండి సరిప్రొద్దువేళ । నీవంచకుఁడు వేగ నింటిలోఁ జొచ్చి
వచ్చిన లోపలివాకిలి నుండి । యిచ్చోటి కీవేళ నేల వచ్చెదవు ?
రాతిరిపూటను రాణివాసమున । కేతేరఁ బనియేమి ? యిట నిల్వుమనిన
నొఱదూసి స్వకరాసి నుప్పలవాయి । నఱకె మూర్ఛిల్లితి నరనాథయనుచు
నవ్వలఁజని యీతఁ డాచరించినది । యవ్వ యీయమతెల్పు నవధరింపుఁడన
నాదాది చయ్యన నటకరుఁదెంచి । చేదోయి ముకుళించి క్షితిపతి కనియె
గొల్లను నఱకి యీకుటిలుండు జడియ । కిల్లుచొరంబడి యేతెంచు వేళ
నోరాజ! భుజియింపుచుండె మాయక్క । వీఱిడివ్రై వీఁడు వినయంబు మాలి
సతియొద్ది పట్టిమంచమునఁ గూర్చుండి । యతిగర్వమున నిప్పుడా! భోజనంబు
ఎలనాగ! యిందాఁక నేమిచేసితివి । చెలువుఁడు లేఁ డేమిచేసికోఁ గలవు
బాల! నన్నేలు భూపాలు మర్దించి । యేలింతు నీచేత నెల్లరాజ్యమ్ము
అని కొన్నిదుర్భాషలాడి పైఁబడఁగఁ । జనుదేర వారించి సతి యోసరించి
తఱిగాదుగానఁ గ్రోధము లోననడఁచి।తొరమీఱ లేచి చేతులు వార్చియట్టె
పడకయిల్ చొచ్చి లోపలితల్పు మూసి । గడియలు బిగియించి గద్దించి వీనిఁ
బలుతెఱంగులఁ దిట్టఁ బలుతల్పు ద్రోవ । నలవిగాకున్న వీఁడాగ్రహం బెసఁగ
వాకిలి తెఱవక వలచిననిన్ను । గైకొనకున్న నీ గాదిలిసుతునిఁ
గరఖడ్గమునఁ గడికండలు చేసి । యరుగుదునన జడియక నీపురంధ్రి
యోరి! స్వామిద్రోహి యులుకక నీవు । దారుణక్రియ లెన్ని తలఁచి చేసినను
మానమిత్తునె నీకు మర్యాదమాని । హీనాత్మ! చేసెడిదెల్ల సేయుమని
పలికినఁ దొట్లలోపల నిద్రవోవు । నలపట్టి తలపట్టి యడిదంబు దూసి
నఱకవచ్చిన బాలునఱకి నీవేల । నరకుఁడా! కూలెదు నరకాగ్ని ననుచు
నడ్డమై బిడ్డనినాఁగిన నన్ను । దొడ్డకోపంబునఁ ద్రోసి చేకత్తి
పరుజునఁ గణఁతలఁబట్టి వేపొడిచి । నఱకెను రెండుఖండములుగ సుతుని

హా యని యదిచూచి యశ్రుంబుదొరుగ।నోయయ్య మూర్ఛిల్లి యుర్వి గూలితిని
దదనంతరమున నీధర్మేతరాత్ముఁ। డదయుఁడై యచటఁ బాయకయుండ వెఱచి
యరిగిన తెఱఁగు మాయక్కయెఱుంగు । ధరణీశ! యాపెచేత వినుండటంచు
దాది తెల్పిన నశ్రుధారలు దొరుగ । నాదేవి సభవార లరుదందఁ బలికె
తనయుని నఱికుట దాసిమూర్ఛిలుట । గనుగొని యచ్చోటఁ గలదాసి జనులు
కుయ్యోమొర్రో యని కూఁతలువెట్ట । నయ్యెడనిలక వీఁడరిగె వెల్పలికి
పడినగొల్లని మూర్ఛపాలైన దాది । పొడగని యందుండఁ బోవదటంచు
నీవిధంబెల్ల మీకెఱిఁగింపఁ దలఁచి । యావేళఁ బైనమై యశ్వరత్నంబు
జత్తాయితముసేయఁ సాహిణిఁ బనిచి । యుత్తమమణి భూషణోత్కరంబెల్లఁ
గట్టి యత్తేజిపైఁ గ్రక్కునవైచి । యట్టిట్టు వలయుపదార్థముల్ గొనుచుఁ
జనుదెంచునంతలో సాది నిద్రించె । మనుజేశ! యీదొంగ మటుమాయలాఁడు
ఎక్కడినుండియో, యేతెంచి పొంచి । జక్కఁ జెంగటనున్న సాహిణి యనుచుఁ
దిమిరమ్మ్రగ్రమ్మ్రట తెలియగాలేక । నమర నేమున్నె కొతంగు వహించి
వచ్చి తేజీనెక్కి వాగెఁగదల్చి । హెచ్చరికై యీరికేఁగెడు బాట
తప్పక నీవుముందఱ నేఁగుమనిన । నొప్పి యాతస్కరుం డూరకతప్పు
తెరువునఁ దనయూరుదిక్కుగాఁ బోవ । నరుణోదయంబైన యంతటవానిఁ
జోరునిగాఁ దద్వ్యచోరీతి నెఱిఁగి । యీరి నేవత్తు నీయూరికి ననుచు
వానివెంబడిఁ బోయి వానివంచించి । యేనుబోయిన జాడయెల్లను మీకు
నేఁడె యింకిట విన్నవించు నటన్న । వాఁడు చేతులుమోడ్చి వసుధేశుఁ బలికె
మాయమ్మ చెప్పినమాట నిబద్ధి । యీయయ్య! మగరూప ముడిగి యీయమ్మ
తరుణియై సరసిలో స్నానంబుసేయఁ । బరికించి మోహించి పాకంబుసేయఁ
గోరుపదార్థముల్ గొనితెచ్చి యిచ్చి । యీరామ వెంటరా నింటికిఁబోయి
నాసొమ్ము నీసొమ్ము నా వేఱుగలదె । నీసొమ్ము దెమ్మని నెనరు గాన్పింపఁ
బలికి నాయింటిలోపలి ధనంబెల్ల । సొలవక గొని తనసొమ్ములోఁ గూర్చి
ధరఁ ద్రవ్వి పాతించితస్కర! యొకటి । మఱచివచ్చితినిన్న మాపటి పూటఁ
బడకింటిలోఁ దూర్పుభాగంబు నందుఁ।బుడమి మంచముక్రిందఁ బూడ్చివచ్చితిని
పదియాఱువజ్రముల్ పరుగునఁ బోయి।సదనమ్ముఁజొచ్చి వజ్రములు దెమ్మనిన

నే నిల్లుపెడఁబాసి యేఁగినయంత । మానిని సొమ్మిల్ల మసలక కొనుచుఁ
దురగమ్ము పైనెక్కి తొరమీఁజు నరిగె । మఱునాఁటి రే యల్లమందిరం బెల్ల
గాలించి వజ్రముల్ గానక మరలి । యాలయమ్మునకు రా నంతకు మునుపె
ధనమెల్లఁ గొనిపోయె తాటోటుక త్తెఱయని యింటియాబిడ యడలంగఁ దొడఁగె
నదివిని హోదై వమా యని యడలి । యెదబడి దేశంబులెల్లను వెదకి
యీయూరఁ జూచితి నీయమ్మవాఁ।మాయింటి నెడఁబాసి మఱియెందుఁ జనెనో
యెఱుఁగ నవ్వలికథ యేనన్న వైశ్య । వరుఁడు కేల్మొగిచి భూవరున కిట్లనియె
కాతువేషమున నీరమణి మాయమ్మ । యే తేరఁ జోరు నట్లేనునుఁ బ్రమసి
మనసుచలింపఁగా మత్పురంబునకుఁ । గొనిపోయి నేమున్ను గూర్చిన ధనము
నీయమ్మ ధనములోనిడి పెట్టెనునుప । నయ్యెడ నేమంచిదని సమ్మతించి
యువిద యాకే 'యొకయుంగరం బొసఁగి।నవనీశ! యదిగొని యల జాలపదము
బచ్చ చేతికొసంగి బందిగానఁ బడి । యచ్చట బడలి చంద్రాంగదువలనఁ
దప్పి యింటికివచ్చి ధనమెల్లఁగొనుచు । నిప్పద్మలోచనయేఁగిన తెఱఁగు
నింటివారలు దెల్ప నెదబడి యడలి । యొంటిగా ధరయెల్ల నుడుగక వెదకి
యిచ్చోటఁ బొడగంటి నిద్దేవి నవల । నెచ్చోటి కేఁగెనో యెఱుఁగ నేనని న
నాచెల్వ యనియె నే నర్ధరాత్రమున । భూచరఖేచరాద్భుతకరంబైన
జడితోపాకటి వీక్షించి భీతిలక । యాడనే వసియించి యక్షదంపతుల
వలన వింటిని చిత్రవాహను దేవి । తలనొప్పికగు నౌషధక్రియలెల్ల
విని వైద్యవేషంబు వెసధరియించి । కొని యిమ్మహారాజు కొమ్మయాదలను
నెలకొన్న జలగల నిమిషమాత్రమున । వెలువరించిన శిరోవేదన దీఱి
యలరెడు సతిఁజూచి యవనీశుఁ డితఁడు । పలుమారు మెచ్చి యీపట్టణంబిచ్చి
నగముఁరాజ్య మొసంగి సంప్రీతిఁ బ్రోవ।మగతనంబూని సామ్రాజ్య మేలెదను
వంచనచేఁ జోరవైశ్యుల ధనము । గొంచువచ్చిన దేమిగుణ మదియనిన
వంచింపకుండిన వారు మోహము వ । హించినవారాట నెడఁబాసి చనరు
వారిచే నాగుణవైఖరుల్ దెలయుఁ । గారణం బిదియని కపటమార్గమున
నిటుపలెఁ జేసితి నిది నావిధంబు । కుటిలుఁడౌ నీమంత్రి ఘోరకృత్యంబు
గావింప నినుఁబాసి ఘనవిపద్దశల । నీవగ బడలితి నిన్ని నాళ్లనుచుఁ

దనదేవి తెలుప నద్ధరణీశసుతుఁడు । కనలుతో నమ్మంత్రిఁగని ధిక్కరించి
చెంగటిభటుల నీక్షించి యీదుష్ట । సంగుని నీదురాచారునిఁ గ్రూరు
నీ యగమ్యాగంత నీబాలహంత । నీయధమాధము నీమహాచపలు
పట్టి కొంపోయి బల్బండపైఁబెట్టి । కొట్టి కండలు కోసికోసి గద్దలకు
గాకములకు శునకములకు నైచి । యీకష్టు నోటి కందిం డుప్పుచల్లి
యంత ఖరారూఢుఁడగు వీని నగర । మంతయుఁ ద్రిప్పి కుక్కచ్చులఁ బొడిచి
వెడలఁగొట్టుఁడటన్న విని వీరభటులు । కడుగినక్క నమ్మహాకష్టునిఁ గట్టి
కొనిపోయి కండలు కుక్కలకిడినఁ । దినవయ్యె! గ్రద్దలెంతే యోకిలించె
నరయ స్వామిద్రోహి యగువాని యెఱిచి । యరుచిపుట్టక తినునా! కుక్కలైన
రాజుచెప్పిన యత్తెఱంగునఁ జేసి । భూజనుల్ నిందింపఁ బురమెల్లఁ ద్రిప్పి
వెడలఁగొట్టిన వాఁడు వివశుఁడై యొక్కఁడడవిలోఁబడిపోయి యట హానిఁజెందె
చోరునిధనము వైశ్యునిసొమ్ము మఱల । నారాజముఖి తనయన్నయు విభుఁడు
గని మెచ్చ రెట్టింపుగా నిచ్చి తగిన । ఘనభూషణాంబరగంధమూల్యములు
కరుణించి ననుగూర్చి కడుగాసిఁ బడితిరఁటంచు డూళ్లకు నన్నలారా యటంచు
వారివీడ్కొని గుహస్వామిఁ బూజింప । గా రాజసుతు భద్రకాళి యవ్వేళఁ
దెచ్చి యొప్పింప నద్దేవికి ప్రమొక్కి । యచ్చంద్రరేఖ నిజాధీశుఁ గూడి
భయభక్తియుక్తి సపర్యలు సేయ । దయఁజూచి యక్కాళి ధరణీశుఁ బలికె
హేమవర్మనృపాల యీచంద్రరేఖ । సామాన్యయని తలంచకు మహాసాధ్వి
యీకాంత సౌశీల్యమెంచ సశక్య । మీ కుమారుని మంత్రి హీనుఁడై తునిమి
నపుడె నేఁబదికించి యధిప! యిన్నాళ్లు । నుపలాలనము సేయుచుండితి సుమ్ము
సతిగూడి సుతుతోడ సకలసౌఖ్యముల । నతిశయిల్లు మటంచు నానతిచ్చుటయు
నాహేమవర్మ హస్తాబ్జముల్ మొగిచి । గేహినీయుక్తిశక్తిని బ్రస్తుతించె
సభవారలెల్ల నాశ్చర్యంబు నొంద । నభినవ శృంగారహారిణి యైన
యీ కాళికాదేవి యంతర్ధిఁ జెందె । భూకాంతుఁ డింతితోఁ బుత్రుని మరలఁ
బడసి కృతార్థుఁడై బాంధవుల్ పొగడఁగడువేడ్క నక్కటకమునఁ గొన్నాళ్లు
నాచిత్రవాహ చంద్రాంగద సహితుఁ ! డై చంద్రరేఖతో నధివసియించి
వారి వీడ్కొని సైన్యవర్గంబు గొలువ । భోరున ఘనసారపురమున కేఁగి

యెనలేని భోగంబు లింతితోఁగూఁడి । యనుభవింపుచు సుఖమ్మొఁ బ్రవర్తిల్లె
నీకథ వినువారి కీప్సితార్థములు । చేకుఱు ననుచు రాచిలుక దెల్పుటయు
విని పుష్పమంజరి వెరగంది దూతి । యును చిల్కఁ బొగడుచు నుర్వీశుఁ జేరి
యీకథ వినిపించెనని చంద్రధరుఁడు । మాకామినికిఁ దెల్ప మఱి తరువాత
కీర మీకథ యెటోఁగించె నోకో! యొ । యీరి కక్కథ తెల్పుఁడని యడుగుటయు
సనయపతివ్రతాచరితంబునందు । నిది పదేడవకథ యిల ఖ్యాతిఁజెందె

* శ్రీవిశ్వపతి దయాంచితమతి గౌరి । కావలికథ యిట్టులని యానతిచ్చె.

కలభాషిణి కథ

శ్రీవిశ్వపతి సమంచితమతి గౌరి । కావలికథ యిట్టులని తెల్పఁదొడఁగె
నవ్వలినాఁటి సాయంతనవేళఁ । బువ్వుగుత్తి యభిఖ్యఁ బొరసిన బోఁటి
యవ్వతోఁ దనుజేర నరుదేరఁ జూచి । నవ్వుచుఁ గీరరత్నం బిట్టులనియెఁ
జెలి మనమును బల్కఁ సేత యొక్కటిగఁ। జెలువుని పరిచర్యసేయు సాధ్వికినిఁ
బ్రఖ్యాతిగల దిహపర లోకములను । సౌఖ్యముల్ గలుగు వాసవపుత్రి తొల్లి
యొక రాజసుతునకు నొద్దికై మనుజు । డకట యెట్టుల భర్తయగుఁ దనకనక
విలసిల్లె నక్కథ వినిపింతు వినుము । కలదుర్వి శ్యంగాటకంబను పురము
ఆపురంబేలు రత్నాంగదుం డనెడు । భూపాలుఁ డతనికిఁ బుత్రాష్టకంబు
ప్రభవించె నందులో భాగు వహించె । నభినవమన్మథుం డష్టమసుతుఁడు
అతనికిఁ బెండ్లిసేయఁ దలంచి తండ్రి । సుతు లేడ్గురును రూపసుందరీమణుల
వరియించి రింక వివాహంబు సేకుఁ । బరమోత్సవము దలిర్ప నొనర్పవలయు
నెటువంటి కన్యక నిచ్చయించెదవు । తటుకునఁ దెల్పుమా తనయ యంచడుగ
నతఁ డిట్టిదిట్టిని యన కూరకున్న । నతని యగ్రజు లేడ్గు రపహసింపుచును
నయ్యతోఁ బలికి రియ్యభినవమదనుఁ।డయ్య! యింద్రకుమారి యబ్బినఁ గాని
యితరకన్యల వరియింప నటంచు । వ్రతమూనినాఁ డందువలన నుత్తరము

---

* ఇచటఁగొన్ని కథలు లోపించి యుండవచ్చును

మీ కియ్యకున్నాఁడు మిన్నక యనిన । నాకొడుకులకు రత్నాంగదుం డనియె
పాలఁతుల చిత్తంబు పురుషుల భాగ్య । మలవియె! తెలియ బ్రహ్మాదులకైన
నరయ నీతనికి భాగ్యము గల్గియున్న । దొరకకయ యున్నె యింద్రుకుమారి యెంత
తరణికుమారియా తపతియన్ తరుణి । వరియింపలేదె సంవరణునిఁ దొల్లి
యమర గంధర్వ విద్యాధర నాగ । రమణులు వొందరే! రాజనందనులఁ
బరిహసింపనిఁకేల బాలుని మీఁద । లురకయం చలతనయుల నదలించె
నయ్యపల్కిన యుచితానులాపమ్ము । లయ్యన్నలను పరిహాసోక్తులెల్ల
నారాజనందనుం డాలించి యపుడు । మాఱుమాటాడక మౌని యట్లుండె
యిటువలెనుండి యయ్యెడ భ్రాతృకథిత।పటుతరారుంతుద భాషణాస్త్రములు
మదినాట నిద్దురమాని యూరేయి । యొడవిన కినుకతో నొకరీతిఁ గడపి
మఱునాఁడు ప్రొద్దున మసలక లేచి । శరచాప ఖడ్గాది సాధనోద్ధారి
యగుచు నుపజ్ఞాఖండై పోయిపోయి । జగదద్భుత తపఃప్రసక్తి వర్తించు
తృణభుజుండను రాజఋషి తపోవనము । గణకేతర ద్రుమోత్కర లతాభవన
భాసిత పల్లవప్రసవ మరంద । వాసనానూన పక్వఫల ప్రతాన
పరితుష్ట పరభృత భ్రమరకీరాది । భరితగీతవిభీత పాంథధావనము
పరికించి హర్షించి పటుతపోనిష్ఠ । భరియించి మించు నప్పారికాంక్షికిని
గరము భక్తిని నమస్కారముల్ చేసి । కరములు మొగిచి చెంగట నిలుచున్న
వాని సౌందర్యంబు వానిధైర్యంబు । వానిగాంభీర్యబు వానిశౌర్యంబు
గని మెచ్చి కూర్చుండఁగా నియోగించి । మునిపల్కె నోరాజముఖ్య కుమార
యేమి దలంచి నీవిందు వచ్చితివి । నీమనోభీష్టంబు నిజముగా మాకుఁ
దెలుపుమటన్న ధాత్రీనాథసుతుఁడు । పలికె మాయన్నలు బలభేదిసుతను
గాని వేఱొకకన్యకను బెండ్లియాడఁ । గా నొల్లఁడితని కడఁగి మాతండ్రి
సన్నిధిఁ దెగడినఁ జాలరోషమున । నన్నలు నవ్వినయటు లింద్రసుతను
వరియింతునని యిందువచ్చి మీపాద । సరసిజంబులు గంటి సంయమిప్రవర
కలదె! యింద్రునకుఁ జక్రనికన్య యిపుడు । గలిగినగాని నేకైవడి నైనఁ
గైకొనుపాటి భాగ్యము నాకుఁ గలదె!।మీకుఁ దెల్లముగదా మీ యోగదృష్టి
నరసి యానతి యియ్యనగు నయ్య! యనినఁ । గరుణతో నమ్మునిగ్రామణి పలికె

నరసి వచ్చినవాఁడ వవనీశతనయ! । నిలువుము మాయొద్ద నేటి కటంచు
నతిథిపూజ ఘటించి యలఁత వారించి । యతనితో ననియె నాయన మఱునాఁడు
వాయుభుక్కను మునీశ్వరుఁడు మాయన్న । యోయి యీడకు దశయోజనదూర
వనమున నున్నాఁడు వడినేఁగి యతనిఁ । గని నన్ను వేఁడిన క్రమమున నడిగి
శతమన్యుకన్యక చందంబు దెలియు । మతఁడుపాయము దెల్పునది లభించుటకు
నా విని యతనికి నతిఁజేసి కదలి । యా వాయుభోజను నాశ్రమంబునకు
మఱునాఁడె యభినవమన్మథుం డరిగి । గురుభక్తి నతనిఁగన్గొని ప్రణమిల్లి
యాత్మచరిత్ర మాద్యంతంబు దెలుప । నాత్మ రంజిల్లి యయ్యతి వాని కనియె
నితరుల కలవిగా దిప్పనిఁ బూన । క్షితినాథసుత నీవు జిష్ణుకుమారి
కామించినది హెచ్చుగలదు కారణము । సామాన్యులకుఁదలంచ వశంబె! యిటులఁ
గ్రతుశుల్కయను దేవకామినీమణికి । శతమన్యునకు మున్ను జనియించి వెలయు
మదనమంజరియన్ కుమారి యొక్కరిత । యది జగన్మోహిని యామంజువాణి
నీకు లోఁబడఁ జేయనేర్చు మాయన్న । లోకవంద్యుఁడు దయాళుఁడు సూర్యభోజి
యతఁడున్న వని పదియామడ దూర । మతివేగమున నేఁగుమని వీడుకొల్ప
భాగ్యమాయె నటంచుఁ బార్థివసుతుఁడు । బుగ్యజుసాది వరిష్ఠ మౌనీంద్ర
జనశరణ్యంబును జాతివైరములు । మొనయని ఖగమృగంబులకు నాకరము
పరమపావనమునై భాసిల్లు సూర్య । కిరణభుగ్వనము నీక్షించి సొత్తెంచి
యతని యంఘ్రులకు సాష్టాంగం బొనర్చి । యతఁడు దీవింపఁగ కరాంజలి యగుచుఁ
దన యభిలాష మంతయు విన్నవింప । విని యెంతపని యిది వీరాగ్రగణ్య!
యక్కన్య నీకు లోనగు నుపాయంబు । నిక్కంబు తెలిపెద నీవది వినుము
సకులతో మదనమంజరి కేళిసలుపు । నొకసరోవరమున నుదయవడి నీవు
చని పొంచి దాని వస్త్రవిభూషణములు । గొనిరమ్మ్ము నీవేఁటఁ గనుకుపద్ధ్వనను
అదివచ్చి కొన్నివాక్యము లాడు దాన । బెదరక తిరిగి యా బిసరుహానయన
దిక్కుఁజూడక చనుదేర నిన్వాలచు । నక్కడి కిపుడె నీవరుగు మటంచు
నేణాక్షి కొలఁకున కేగెఁడు త్రోవ । వేణుకాంతారంబు విధమును దెలిపి
పాదలేప మొసంగి పనిచిన నరిగె । నాదిత్యుఁడుదయించు నప్పుడె లేచి
యరిగి రానుతుఁడు మధ్యాహ్నమౌ నంత । నరుదైన వేణుమహాటవిఁ జూచె

చూచి యవ్వాకిలి సొచ్చి యవ్వలికి । నేచినతమి నేఁగి యింతులఁ గూడి
దీర్ఘిక జలకేళిఁ దేలెడిదాని । దీర్ఘవిలోల దృగ్దీప్తులదాని
కళకునెమ్మోయిచాయఁగమలాకరమునఁబొలుచుబంగరురంగుపసఁగించుదాని
చెలులు దోయిళ్లముంచి జలమ్ముఁజల్ల । నళుకక చల్లుపో రాడెడిదాని
భావజు మోహనబాణమో యనఁగ । యీవనలక్ష్మిచే నలరారుదాని
మదనమంజరిఁ గాంచి మాటున పొంచి । పొద నదిదాఁచిన భూషణావళులు
రవిక పావడయు జర్తారుచీరయును । జవమున గ్రహియించి చంక నుంచికొని
పరువిడఁ జూచి యబ్భామిని చెలులు । సరగున మదనమంజరిఁ జూచియనిరి
జవ్వని వస్త్రభూషణ సుచేలాదు । లెవ్వఁడో! గాని యదె యేఁగుచున్నాఁడు
భోరున వెనువెంటఁ బోవక యున్న । తీఱదు పొమ్మన దిగులొందె కన్య
స్వ కరసరోహ చ్ఛాదిత సుకుచ । లికుచయు విపులనాళీక పలాశ
బద్ధ కటీకభూభాగయునై వి । రుద్ధభాషణముల రోషమ్మునోఁపఁ
గొలను వేవెడలి పోకుము రాకుమార! । నిలునిలు మనుచు వెన్వెంట రాయంచ
కైవడినడ మించఁ గొనుచలించ । సౌవర్ణ రుచి తనుచ్ఛాయ రాణించఁ
బలికె నెక్కడ నిట్టిపౌరుషక్రియలు । గలవె! కాంతలు జలకములాడు వేళ
వత్తురే మగవారు వచ్చినఁ దొలఁగ । కిత్తెఱుంగున వల్వ లెత్తు కేఁగుదురె!
యే దుష్టబుద్ధి నీకిది ప్రబోధించె । మీఁదనౌ హాని యేమియుఁగాన వకట
యెంత దవ్వరిగెద వీవు మానవుఁడ । వింతలోనిదె సుర లెఱిఁగి రాఁగలరు
చెడిపోక నామాటఁ జెవినిడి విడుము । తొడవులు కోకలు దుడుకు లిండేల?
అని బెదరించి మాటాడు నవ్వెలఁదిఁ । గనుగొనె నిలిచి భూకాంతనందనుఁడు
నిలిచి కన్గొనువాని నెలఁత శపించె । బలుశిలవై యిందు పాదుకొమ్మనుచు
నెలఁత శాపమున దాని విభూషణములు । వలువలుఁ బడవై చి వాఁడురాయయ్యె
తన భూషణాంబరతతి ధరియించి । యనిమిషాంగన వయస్యలఁగూడి చనియె
నిలువురాయై వాఁడు నేలఁ బాఁతుకొని।నిలచియుండఁగ మౌని నిజశిష్యు నొకనిఁ
గనుగొని యదియేమొకాని రాసుతుఁడు । చన్నుదేరఁడయ్యె వాసవపుత్రి బెట్టు
కనలి మాటాడినఁ గడుభీతి మరలి । కనుగొని శాపంబు గాంచినాఁడేమొ!
తెలియుదమని యోగదృష్టి నీక్షించి । నిలువురాయైన వాని తెఱం గెఱింగి

వగచి మునిష్ఠుఁడన్ వరశిష్యుఁ బిలిచి । జగతీశసుతుఁడు పాషాణత్వ మందె
ఱారూప మణఁగించి రారూపమర్చి । భోరునఁ దోడ్తెమ్మ పొమ్మని యపుడె
జల మభిమంత్రించి చయ్యనఁబనుపఁ । గలశంబు చేకొని గ్రక్కున నరిగి
శిలయైన వానిపైఁ జిలికించినంతఁ । జెలఁగె నెప్పటిలీల క్షితిపాలసుతుఁడు
జటిలశేఖరు మంత్రశక్తి నెప్పంటి । పటురూపము ధరించి పఱతెంచె మఱల
నా సూర్యభుజునకు నభినుతిసేయ । నాసన్నగతుఁ జేసి యతఁ డిట్టులనియె
నేను దెల్పినమాట నేలపాల్సేసి । మానిని నేటికి మరలి చూచితివి ?
తిరిగిచూచిన నది తిట్టకేలుడుగు । వెఱతురే! కాంతల వికటభాషలకు
నెనిమిది దివసమ్ము లిచ్చోటనుండు । మనిపెదఁ బిమ్మట నతివ యున్నెడకు
నిన్నని తనచెంత నృపపుత్రు నునిచి । కొన్న నుండెనతండు కొమ్మచెల్వంబు
చిన్ని పాయంబును జిలుకపల్కులును । జిన్నెలువన్నెలు చింతించికొనుచు
వాసవపుత్రియు వానిశృంగార । హాస విలాస హేలాదులు దలఁచి
వెతఁజెందెఁ జక్కనివిభునిఁ గన్గొన్న । యతివ మనోజార్త యగుటబ్బురంబె.
తదనంతరంబునఁ దపనాంశుభుక్క । సదయుఁడై యెదుట రాజకుమారుఁ బిలిచి
భృగువాసరము నేఁడు పృథివీశతనయ । వగలాడి యల సరోవరమున నిపుడు
సకులతో జలకేళిసలుపుచు నుండు । నకలంక మామకీనౌషధశక్తి
నిప్పుడె నీవేఁగి యించుక కొంచ । కప్పుడంతి విభూషణాంబరావళులు
గైకొని యదియెన్ని కఱకు లాడినను । వీఁకతో బెదరించి వెఱపుఁ జూపినను
దీనత నెరపినఁ దిరిగిచూడక య । హీన సత్వరమున నేఁగుదెమ్మనుచుఁ
బనిచినఁ జని పురోభాగమ్మునందు । వినువీథి ముట్టిన వేణుకాననము
గని కవాటము నిరర్గళత భేదించి । ఘనఖడ్గహస్తుఁడై గ్రక్కునఁ జొచ్చి
పొంచి సరఃప్రాంతమున కేఁగి యచట । నుంచిన వస్త్రాదు లొకట గ్రహించి
చనుచున్నమదనమంజరియె యూహించి।యనుఁగునెచ్చెలులతోననియెనవ్వుచును
జెలులార! సొమ్ములు చీర లెత్తుకొని।యలనాఁటిమ్రుచ్చు నేఁడదె!పోవఁదొడఁగె
పాషాణరూపంబుఁ బాసి యాత్మీయ । వేష మెట్లందెనో వీఁడమ్మచెల్ల!
హరికిశోరమురీతి నతిజవస్ఫూర్తి । పరువుఁబాఱెడు వీనిఁబట్టి నాతగమె
యయిన నీతఱిఁ జూతమని మునుపట్ల । బయలుదేరి తదీయపద్ధతిఁ బట్టి

కొంతవవ్వేఁగి రాకొమర! యిదేటి । వింతఁజేసెద వాత్మ వెఱపింతలేక
సురసార్వభౌముని సుకుమారి ననుచు । నెఱుఁగవే! మొన్న నీ వీడుండగంబు
చేసి పాషాణతఁ జెందుట మఱచి । తే! సాహసక్రియ లియ్యెడఁదగునె!
మగువల వలచినమగలు వస్త్రములు । వగవగ సొమ్ములు వహి నొసంగుదురు
కట్టినకోకలు కలభూషణంబు । లిట్టుల నీవలె నెత్తుకేఁగెదరె!
నానుడి వినక మిన్నక పోయెదేని । నేను దిట్టకమాన నిఁకనని కెరలి
పలుకుచు వెంబడిఁబడి వచ్చుదాని । పలుకుల కళుకక ప్పార్థివసుతుఁడు
మునివరుని నిదేశమున ధైర్యమూని । చనుచున్న వాని నిశ్చయమాత్మనెఱిఁగి
ననబోణి వాని సౌందర్యరూపాభి । జన శౌర్యగాంభీర్య చాతుర్యములకుఁ
గరము సంతోషించి కాముని కుసుమ । శరపరంపర నొచ్చి సరసోక్తిఁ బలికె
నేల జాలియొనర్చె దెఱుఁగవు తగవు । బాలల వలపించు ప్రౌఢిమ యిదియె!
యలసితి వురక బిట్టరుగక నిలుము । వలచితి నీకు భావజుపాద మాన
నాకన్నులాన చెంతకు నేను వచ్చు । దాఁక పరాఙ్ముఖత్వంబున నైన
నెలకొను మచ్చోట నీవు గణించు । పలుకులు విని నీదుపనుపు చేసెదను
మాయయ్యయాన సుమా! యింక మించిపోయి తేని నృపాలపుంగవ! యనుచు
నానవెట్టిన నతఁ డవలిమో మగుచుఁ । జాన గన్గొనక నిశ్చలవృత్తి నుండె
అతనికి నెదురుగా నరిగి యబ్బోఁటి । యతిమోహపరవశయై తనగుబ్బ
చనుదోయి యతని వక్షస్థలి నొరయ। మొనసి కౌఁగిటఁజేర్చి మోమున మోము
గదియించి నీప్రియకాంతగా నన్ను । గొదకక యిఁక నేలికొమ్మని పలికి
యతఁడొసంగిన భూషణాంబర మాల్య।తతులు సుగంధముల్ ధరియించి మించి
యొక్క పూఁబోదరింటి కొయ్యన నేఁగి । చక్కెరవిలుతుండె సాక్షిగా నతని
వలచి గాంధర్వవివాహక్రమమునఁ । గలసి మన్మథరాజ్యకర్తనుఁ జేసి
యాజన్మమునకు విన్నివే నావిభుఁడ । వో జగన్మోహన! యూఱడు మింకఁ
దడవాయె వచ్చి మత్సఖు లల్లకొలని । కడ నున్నవార లక్కడికిఁ బోవలయు
మక్కువతో నన్ను మఱువకు మనుచుఁ।బుక్కటివీడియంబు గ్రహించి యతని
యధరామృతముగ్రోలియలఁతఁదీర్చికొని।మధురోక్తులాడునమ్మగువనెమ్మోము
ముద్దిడుకొని ప్రియంబున నతండనియె । ముద్దియ! ననుబాసి ముదితల డాసి

యీవు నీవీటికి నేఁగిన నెటుల । నే వసియింపుదు నిట నొంటిగాఁగ
హాయనత్రితయి మిత్రాదులఁ బాసి । యీయాస మొందితి నబల! నీకొఱకు
నిన్నాళ్లవలెగా దొకించుక సేపు । నిన్ను గానకయున్న నిలవు ప్రాణములు
నీయాన గజయాన! నిజ మిదియనిన । నాయింతి దరహసితాస్యయై పలికె
అభినవమదన! నీయందంబు గనిన । యిభయాన యెటు రతీశుభయానఁ బడక
ప్రాణముల్ వహియించిబ్రదుకునిన్నాబసి।యేనునీవలెఁగాదె!యెటులోర్వ్వఁగలను?
ఇందుల కొకచంద మెఱిఁగింతు వినుము । చింద మేనొకటి నీచేతి కిచ్చెదను
అది సుస్వరముగ నీవమర నూఁదినను । కొదకక వత్తు నీకోరిన యెడకు
నా శంబువు దలంచినప్పుడె వచ్చు । నీకరంబున కది నీవు పొమ్మనిన
నాకంబున కరక్షణంబులోఁ బోవు । నీకు దూతికయిదె నేఁడె పొమ్మనుచు
నల శంఖమిచ్చిన నతఁడు గ్రహించి । తలఁచిన యపు డతిత్వరత రమ్మనుచుఁ
గంబువుతోఁ గంబుకంధరి ననిచి । యంబుజా ప్తకరాశనాశ్రమంబునకుఁ
జనుదెంచి యమ్మునీశ్వరునకు ప్రమొక్కి । జననాథతనయుఁ డంజలిచేసి పలికె
స్వామి! దేవరకటాక్షమున నసాధ్య । యీ మహేంద్రకుమారి యబ్బె నాకిపుడు
నాకోర్కె- లీడేరె నావంత దీఱె । లోక స్తుతులు దయాళువు లైనయట్టి
త్ర్యాద్యశుల భజించువారు కృతార్థ । లౌదురన్మాట యథార్థంబు గాదె
యనిన సంతోషించి యతని సమీప । మున నుంచికొని సూర్యభోజనుం డనియె
వలువయెత్తుక నీవువచ్చుచో వెంట । నెలనాగ తావచ్చి యే మాటలాడె
తిరిగిచూడక దానిదెస నీవురాఁగఁ । దరుణి యెట్లగపడి తమకించి కలసె
వినిపింపుమనిన నావృత్తాంత మెల్ల । మనుజేశసుతుఁడు క్రమంబునఁ జెప్పె
నొక్క శంఖమొసంగి యూఁదిన వత్తు । నెక్కడనున్న నీయెడకన్న నుడియుఁ
దెలిపిన భ్రాంతిచెంది మునీశ్వరుండు । తెలివియుఁ దన విరక్తియు మత్తచేసి
ఆ శంఖమిమ్మ్ము మా కవనీశతనయ । యేశత్రుకోటులనేనిఁ గీటడఁచఁ
గల గదాదండ మొక్కటి యిత్తునీకు । నిలయెల్ల నందున నేలగాఁ గలవు
నొకకాంతవలన నీకొడవు మేలేమి । సుకుమార!యనిన రాసుతుఁడు చింతించి
తెక్కలివాని మతిభ్రమఁ జెందె । నక్కట! చూచితె! యంగన లనిన
నెంతటివారల కీరీతిఁ బొడము । భ్రాంతి, యీగద సుప్రభావమేర్పడఁగ

వినియెదగాకని వెండియుఁబలికె । ననఘు! యాగద శత్రుహతిఁజేసి మరల
నెవ్వరిఁజేరు నా కెఱిఁగింపు మనిన । నవ్వాయుభోజను నన్న యిట్లనియె
నీగద శత్రుల నేపణఁగించి । వేగంబె నినుఁజేరు విస్మయం బొదవ
గదయిత్తు శంఖంబు గ్రక్కున నూఁది । ముదిత రప్పింపు నాముందఱి కనిన
నా రాజసుతుఁ డింద్రజార్పితశంఖ । మారవం బొనరింప నతివలఁ గూడి
దివ్యయానంబుపై దేవి వచ్చుటయు । భవ్యమా దానిరూపముఁ జూచిమెచ్చి
గదయిచ్చియతనిశంఖముఁబుచ్చుకొనియె । ముదితయప్పుడుబొమముడిపాటుతోడ
నానృపాత్మజున కుపాయ మొకండు । తా నేత్రసంజ్ఞచేతనె తెల్పి చనియె
నాయుపాయ మెఱిఁగి యతియు ననుజ్ఞ । సేయ వీడ్కొని రాజశేఖరసుతుఁడు
కొంతదవ్వేఁగి యక్కటిలవిచారు । కంతువేదనఁ దీర్తు గదచేత ననుచు
బిరబిరఁద్రిప్పి యప్పెనుగద వైవ । దురుసుగా నదివచ్చి దుర్భావుఁడైన
మని కాళ్లుసేతులు మోమును దలయు । మునికొని తాఁకిన మూర్ఛిల్లి యతఁడు
కొంత తెప్పిఱి చాలు కొమ్మ యటంచుఁ । జెంతదాఁచినసంకుఁ జెచ్చెరవిడిచె
సంకుతో గద తనశయము బ్రాపింపఁ । నంకిలిదీఱి రాజాత్మజుం డవల
వాయుభోజను తపోవనముఁ బ్రాపించి । యాయనయడుగుల కధినతుండైన
పోయినపని యేమి భూపాలపుత్ర! । కాయమో పండో! నిక్కము దెల్పుమనిన
స్వామివారలదయాంచతక్కటాకుంబు।మామీఁదఁగలుగగా మత్పరీయోజనము
కాయయానే! పండుగాక యటంచు । నాయన కెఱిఁగించె నక్కార్య మెల్ల
నెఱిఁగింప సతిఁజూడ బుషివేఁడ నతఁడు।దరమూఁదినంతఁగాంతయుమింటఁదోఁచె
నా రూపసంపద కాతఁడు భ్రమసి । యోరాజసుత ! శంఖమొసఁగితి వేని
నక్షయకంథ నీకర్పింతు ననిన । నాక్షణంబున శంఖ మాతని కొసఁగి
యక్షయకంథ భుజాగ్రమం దమర । నాక్షితీశకుమారుఁ డవ్వలఁబోయి
గద మానిపైఁ బ్రయోగముచేసినంత।నది మోదె ముక్కు మోమంతయుఁబగుల
నందున భీతుఁడై యమ్మునీశ్వరుఁడు । చిందంబ! మీరాజుచేతికె పొమ్మ
తరళాక్షి నెయ్యంబు దయ్య మెఱుంగు । నెఱుఁగ కక్షయకంథ నిచ్చితినేను
తమయన్న భ్రమసి గదాదండ మిచ్చి । తమి మోసపోయినదారి నటంచు
దరముతో దరము ముందరఁ బనుచుటయు । శరణార్థి నతని నొంచక గద మరలె

గదయు శంఖముఁ జేరగ్రహియించి యతఁడు।ముదముతోఁ దృణభోజి ముందరికరిగి
గ్రమొక్కి కరంబులు మొగిచి నిల్చున్న । మక్కువ దీవించి మహీపకుమార!
నీకోర్కె ఫలియించెనే? మదగ్రజుఁడు । నీకుపాయము దెల్పెనే? యింద్రకన్య
నీవశంవదయయ్యెనే? యనియడుగ । నావార్తలన్నియు నతనికిఁదెలిపి
యువిద శంఖావాహూతయై వచ్చు । నవిధంబునకు మునీశ్వర! యన్న నతఁడు
నాశంఖ మూఁదుమన్నా! యెటువంటి । దో శక్రతనయ కన్దోయి రంజిలఁగఁ
గనుగొనియెదననన్నఁ గానిండటంచుఁ । దనచేతిశంఖ మాతఁడు సవర్ణముగ
నూఁదిన నగుచు నయ్యుత్పలగంధి । గ్రహాదిని సాకారయయ్యెనో! యనఁగ
ఘనపదలక్ష్మి సాక్షాత్కారమయ్యె । ననఁగ నంగజుని మోహనబాణశక్తి
స్త్రీరూపమై చనుదెంచెనో యనఁగ । సౌరకాంతామణి స్వర్ణవిమాన
మానితయై కనంబడిన మోహాంధుఁ । డై నీతిదలఁపక యన్నలు పడిన
పాఱెఱుంగక తృణభక్షణుండగుట । బోఁటిచక్కదనంబు భువనమోహనము
నిది వచ్చుటకు శంఖమిచ్చితి వేని । వదలక పాదుకాద్వంద్వ మిచ్చెదను
ఎందు నీవరుగ నూహింపుదు వాత్మ । నందుఁ గొంపోయి సయ్యన నిన్నుడించు
నిది తపశ్శక్తిచే నేను సాధించి । నదిసుమీ రాజనందన! యని యొసఁగఁ
గరమువేడుక పాదుకలుగొని యతఁడు । కరమునన్నున్న శంఖము మాని కొసఁగి
సురరాజసుత తన్నుఁజూచి మెచ్చికొన । నరిగి యొక్కెడనిల్చి యగ్గదవై చె
నది గదవలె మాని కార్తిగల్పింప । నిదిగద! తన బుద్ధిహీనత యనుచు
కకపాల నున్నశంఖము విసర్జించె । వికలతఁ దనకీర్తి విడిచినయటుల
శంఖంబు, గదయును సన్నిధియైన । శంఖంబువే గదాఖ్యకంఠలోదవె
యోగవాగలుగల్గె నొదవె నిష్టార్థ । మేఁగెద వలసినయెడ కిఁకననుచు
నాఘనుఁ డూహించి యమరేంద్రకన్య । గా ఘనస్తనయుగ ఘట్టితాత్మీయ
వక్షఃకవాటుఁడై వలసినపురము । లీక్షింపుచును మది కింపైనయెడల
నెలపదిపూటలు నిలుచుచు ధనము । వలసినవారి కవ్వారిగా నిడుచుఁ
బాదుకాద్వంద్వ ప్రభావంబు వలన । నాదట నెంతదవ్వైనఁ బోవుచును
నిందుకాంతంబన నింపొందు పురము । సందర్శనముసేయఁ జాల వాంఛించి
యాపురమధ్య దీవ్యచ్ఛివాగార । గోపురద్వారంబుఁ గోరి ప్రాపించె

ప్రాపించి తనమేని బడలిక తీఱఁ । దాపించ కురవక దాడిమీవకుళ
పనస తిందుక పారిభద్రాది వృక్ష । ఘనలతావృత సరఃకమల కల్హార
గంధబంధుర శీతగంధవాహాములు । మంథరగతిఁ బూన్పఁ మనసు రంజిలఁగ
నిరవొందియున్న నయ్యెడ నొకవేశ్య । విరిబంతిగొని గుడివెడలి యేతెంచి
యా రాజునందను నాకృతిఁ గాంచి । క్షీరవాహుఁడో! యని కేల్దోయిమోడ్చి
కరగతంబగు బంతికానుక యిచ్చి । తరుణీమనోజ్ఞ! యేస్థలమున నుండి
యేఁగుదెంచితిరి పేరెయ్యది మీకు । నాగవాసమున నున్నది మంజువాణి
యాటపాటలమేటి యబ్బోటిసాటి । బోఁటి లే దింద్రునిపురములోనైన
నది రూపవతియను నభిధాన మూని । నిదురకు వెయ్యేసి నిష్కములు దివియు
మిమ్మ్నుఁజూచిన నదిమెచ్చి రమించు । రమ్ము చూపెద నీకు రమణిగేహంబు
అనిన మంచిదియని యబ్బోటి వెంటఁ । జని రత్నఘుంట హజారమ్మునందుఁ
గని యది వాయింపఁగా విని వేశ్య । జనని కుచేష్టిత సౌజన్యరహిత
చేఁబేదయల్లుండ్రఁ జేరి రానీని । దూబ మందులమారి దుడుకుబజారి
మదిరచొక్కునఁ బెక్కుమాట లాడుచును । వదరుఁబోతని విటవర్గముల్ రోయ
జాతి మోకాళ్లపైఁ జన్నులు వ్రేల । సూరెల సెలవులఁ జొల్లు గాఱఁగను
పట్టినకోల చూపడ నమ్మగారి । పుట్టంబు గూనివీఁపునఁ గొంతజాఱఁ
బుక్కిటితమ్మ చప్పుడుమీఱఁ దినుచు । నొక్కట వాకిటి కుద్ధతినరిగి
రాకుమాహునిఁజేరి రావయ్య మన్న । థాకార! మాకుఁ బ్రత్యక్షమైనట్టి
భాగ్యదేవతవని పలుమాఱుఁ బొగడి । యోగ్యమె! యిచ్చోటనుండ నీయిల్లు
నీవాకిలియ్యింతి నీసొమ్ము వింత । గావింతురే ? యింత ఘనకీర్తిమంత
విచ్చేయుమన నవ్వి వేయివరాలు । పచ్చనిబట్టతో బాగుగాఁ గట్టి
యాముద్ది కొప్పించి యతివలు వెంట । రా మందిరముసొచ్చె రాజనందనుఁడు
నా సుహాపవతీలతాంగియు నెదురు । గా సఖీజనులతోఁ గ్రక్కున వచ్చి
యెనయఁగాఁ గైదండయిచ్చి బంగారు । పనుల రంగగు మేడపైకిఁ దోడుకొని
పోయి ప్రాఁగెంపులబోదెలు చందు । ఱాయరుగులు మగఱాకొణిగలును
సకినెలపట్టెమంచము దోమతెఱయు । జికిలి సూర్యపుటంపుజిగి తలగడలు
బలువౌ చతుష్షష్టిబంధచిత్రములఁ । దళుకొత్తుగోడలు తగు పదార్థములు

గలిగి చందనమాల్య కలితవాసనల । విలసిల్లు పడకయిల్ వేడ్కతోఁ జేరి
చలువపాన్పుననుంచి సరసకర్పూర । మిళిత తాంబూలంబు మెప్పురా నొసఁగి
చక్కెరవిలుకాని చక్కఁదనంబు । నెక్కసక్కెములాడు నేలికవీవు
నాపుణ్యవశమున నానివాసంబు । ప్రాపించితివి కోర్కెఫలియించె ననుచు
నుచితవాక్యంబుల నుపచరింపుచును । బ్రచుర వీణావాద్యపాటవం బూని
పాటల మాటలఁ బరవశుఁ జేసి । నాఁటిరే యొక్కతృణమ్ము గావించె
నభినవమన్మథుం డారూపవతికిఁ । బ్రభవింపఁజేసె నపారమోహంబు
నీరాజు నెడఁబాసి యెటువలె నిలువ । నేరుతు ననుబాళి నెలఁతకుఁ బొడమి
పదిపూట లిటు లెడఁబాయక నన్ను । మదనకేళిక నేలి మన్నింపు మనుచు
మనవిదెల్పిన దానిమాట లాలించి । మనుజేశసుతుఁడు నీమాతకు దినము
వేయివరాలీక వెలఁది నీపాన్పు । డాయఁగానీదన్నిటను జాణనీవు
నినుఁబాసి యవ్వల నేఁబోవఁ జాల । వనజాక్షి! పదివేలవరహాలు దెచ్చి
నీతల్లికొప్పించి నినుగూడి యుందు । నాతి! నీమేడపై నాకొక్కవిడిది
సమకూర్పు మచట నాసకలపదార్థ । సముదయం బునిచి స్వేచ్ఛఁ జరింతు ననిన
అలివేణి కడు భాగ్యమాయె నటంచు । నలరాసుతున కొక్కయఱఁ దల్లియాజ్ఞఁ
జూపి యచ్చోటవస్తువులు దాఁచికొని । భూపాలసుత! నన్నుభోగింపు మనినఁ
దలఁచినయపుడు చెంతలనిల్చు గదయు । వలమురియును దాఁపవలవదు గాన
నంతర్ధిఁజెందించి యారాజసుతుఁడు । గంతయు యోగవాగలు దాఁచి యునిచె
అంతటఁ గొన్ననాళ్లరిగిన నవని । కాంతకుమార రొక్కపు విజృంభణము
గని లగజతల్లి యేకతమునఁ బుత్రి । కనియె నీవిటుఁడు మహాధనాఢ్యుండు
నితని వస్తువులెల్ల నీయింటనునిచి । మతి నమ్మియున్నాఁడు మనల నెల్లపుఁడు
వీనివంచించి యీవిత్తంబుగొనఁగ । నేనొక యుపము చింతించినదాన
నది వానితోఁదెల్పునపు డనుకూల । హృదయవై వేఁడికొమ్మ్నావు నటంచుఁ
దొలుత గారాబుకూఁతురి బందుగట్టి।యల ముదిలంజ యొక్కపుడు రాసుతుఁడు
నుల్లాసము వహించియుండెడి వేళఁ । గొబ్బునకొల్లున దగ్గికొనుచు నేతెంచి
యతఁడత్త! రమ్మని యాదృతి సేయ । హితసూక్తిఁ బొగడుచు నిట్లనిపలికె
నాపెన్నిధానమ! నాముద్దులయ్య ! । నాపాలివేల్పువై ననుఁబ్రోచుసామి !

యొక విన్నపముగల దూకొనవలయు । సకలోకముల నసాధ్యముల్ మీకు
లేవని యెఱుఁగుదు లీలామనోజ! । దేవతాప్రార్థనఁ దీర్చుట లెంత!
నాగలోకమున సంతతముఁ జెలంగు । భోగవతీనది పొంతవసించు
హాటకేశ్వరునకు యామ్యభాగమున । నీటొందుఁ గారుణ్యనిధి హేమదుర్గ
సిరులిచ్చి దురితముల్ చెఱుపునాయమకు।* చెరుపులై దుదినాలుసేయింతుమనుచు
మ్రొక్కఁగొంటిమి పదుమూఁడేఁడు లాయె।నక్కాళి రేయి నృపాంతరమ్మ్నులను
బొడసూపి బెదరించి పోవుచునుండుఁ । గడుదూర మటకేము గదలి పోలేము
నీకెంతపని యిది నేఁడురేపటనె । యీ కాళిగృహమున కరిగి మాఁ మ్రొక్క
నెరవేర్చిన సురూపిణికి మహాసౌఖ్య । కర మగుననుచు నక్కల్లరి చొల్లుఁ
బొల్లుల కనురూపముగ బోఁటిదెలుపఁ । దల్లిబిడ్డల కుచ్చితం బాతఁ డెఱిఁగి
యిది మహాభారమా! యెల్లిప్రొద్దుననె । కదలి పాతాళదుర్గను జేరఁబోయి
పూజించి యెనిమిది పూటలలోన । నిజముగా మేడ కేనేఁగుదెంచెదను
నా దివ్యవస్తుసంతతు లిందు డాఁచి । పోఁదలంచితి హాని పొందకయుండఁ
బదిలంబుగా మీరు పరికింపుఁడనిన । ముదితయు నమ్మ్నోదిముండయు ననిరి
బీగంబువేసి యప్పెట్టియ నిడిన । మీగురువస్తువుల్ మేము ప్రాణముగ
మమత నెప్పుడు పరామరిసింపుచుండె । దము శంకవలదు మూర్ఖన్యకుమార!
నెమ్మదితో గమనింపుఁ డటన్న । సమ్మతించినవానిచందాన నతఁడు
నమ్మవచ్చునె! వెలనాతుల చెలిమి । మర్మదుష్కర్మజన్మస్థలుల్ వీరు
నా పదార్థములు మిన్నక కొనఁదలఁచి । యీపనిఁ జెప్పిరింతే దవ్వుఁబోవ
వీరి వంచనఁజేసి వెడలెద ననుచు । నారాత్రి శంఖగదాదులు పనిచి
పెట్టెల రాళ్లను బెళ్లలవైచి । గట్టిగాఁగట్టి బీగములుబిగించి
వాకిటిబీగంబు వైచి శీఘ్రముగ । వేఁకువ లేచి భావితదివ్యరత్న
పాదుకాద్వంద్వ విభాసిత సజప । పాదపయోజుఁడై పాతాళగంగ
స్మరణగావించి యచ్చట డిగ్గి సకల । దురిత హరాంబు బిందు పరీతశీత
వాతపోతములు పైవ్యాపింప దాన । వీత నూతన తనుస్వేదుఁడై యలరి
యీ మహానది గొనియాడి సేవించి । సామనస్యంబున స్నానంబుచేసి

---

* చెరుపు - ఆపదలను జెఱుపుటకుఁ జేసికొన్న మ్రొక్కుబడి

కాలోచితక్రియల్ గావించి యందుఁ । జాల మాటగు వికస్వర నవ్యకుముద
ధూటంబు హాటకాబ్జములు గ్రహించి । హాటకేశ్వరుని గేహంబున కేఁగి
యాలింగమునకు సాష్టాంగ మ్మొనర్చి । కేలుదోయిమొగిడ్చి కెందమ్మివిరులఁ
జెంగలువల పూజచేసి హరాయ । గంగాధరాయ దుష్కర్మహరాయ
శంకరాయ నమోఽస్తు సద్భక్తజనవ । శంకరాయ యటంచు సంస్తుతింపుచును
నాదేవు సన్నిధి నధివసియించి । శ్రీదనర జపంబుసేయుచు నుండె
పెట్టెలలో రాళ్లు పెళ్లలు చూచి । తిట్టుచునుండి రత్తెఅవ లిద్దఱును
అంతటఁ గొంతసేపరిగిన నటకుఁ । గంతుసమ్మోహనకాండంబులనఁగ
మెలుపొందు తొలకరిమెఱుపులో యనగ । కళలెఱింగిన చంద్రకళలో యనంగ
రతిదాల్చు రత్నదర్పణములో యనఁగఁ । బ్రతిలేని యపరంజిప్రతిమలో యనఁగ
నలఘు శృంగారరసాధిదేవతల । నలువున నెనమండ్రు నాగకన్యకలు
హరినీలవేణులు హరిణలోచనలు । కరిరాజగమన లొక్కట నేఁగుదెంచి
భోగవతీజలంబుల నీదులాడి । వేగంబె వెలువడి వివిధాంబరములు
మణిభూషలును గంధమాల్యముల్ దాల్చి।ఫణిహారు పూజకు పత్రముల్ విరులు
గొని భక్తియుక్తితోఁ గోవెల సొచ్చి । మనసిజహరుని నుమామనోహరుని
సేవించి పూజించి శివ మహాదేవ । దేవ 'సుశీలంపతిం దేహి' యనుచుఁ
బ్రార్థించి తత్పురోభాగస్థుఁడైన । యర్థేశసుత సమానాకారఘనుని
అభినవమన్మథు నట్టె దర్శించి । యిభయూనలెల్ల మోహించి మోములను
గళలుట్టిపడఁ బులకలు మేనఁబొడమఁ । గులుకు సిబ్బెపుగబ్బిగుబ్బ లుబ్బగను
గనుఱెప్ప లల్లార్చి గదిసి యొండొరులఁ । గనుగొని బలుతమకమున నిట్లనిరి
యీమన్మథాకారుఁ డీమహోదారుఁ । డీమహీశకుమారుఁ డెక్కడనుండి
యిచటికివచ్చెనో! యేణాక్షులార! । యచలకన్యాభర్త హాటకేశ్వరుఁడు
మనమీఁదఁ గృపయుంచి మరునకు మరలఁ । దనువిచ్చి తన సన్నిధానంబునందు
నిలుపుకొన్నాఁడొ! వింటిమె యిట్టిరూపు।గలచెలువునిఁ బొడఁగంటిమె! యెందు
మన మందఱము వీని మగనిగాఁ జేసి । కొని పెద్దలయనుజ్ఞ గూడియుండుదమె
యితఁడె వల్లభుఁడైన నీడేరుఁ గోర్కి । లతులసౌఖ్యము లబ్బునని నిశ్చయించి
యారాజసుతు డాసి యంజలుల్ చేసి।కోరికల్ దొలకఁ బల్కులఁ దేనెలొలుక

పలికి రోనవపంచబాణావతార! । చిలువకన్నెల మేము చిన్ని పాయంబు
పాలివోక చెలఁగెడు పువ్వుబోఁడులము । వలరాజు నగు నిన్ను వలచివచ్చితిమి
మా కెనమండ్రకు మగఁడవై మమ్మఁ । జేరొని యిష్టార్థసిద్ధి గాంచుమని
మనవిగాఁ దెల్పు నమ్మందగామినులఁ । గనుగొని యభినవకందర్పుఁ డనియె
నహికన్యలార! మీరుమందములె గనిన । వహియింపఁడే ప్రేమ వలరాయఁడైన
మిముఁజూచి నేను గామించుట లరుదె? । కమలలోచనలార! కాదన నొకటి
యెఱిఁగింతు మీ పెద్ద లెఱుఁగకయుండ।మరిగి మిమ్మొనయుట మర్యాదయగునె!
మీతండ్రు లెవ్వరు? మీకుఁ బేర్లేమి? । యీ తెఱం గిండ్లలో నెఱిఁగించి వారి
యనుమతి ననుఁ బెండ్లియాడిన మంచి । దనిన నాతనినీతి కలివేణు లలరి
యల రాజసుతునితో నని రెందుఁగన్య । కలకు స్వతంత్రంబు గలుగదు గాన
యాడితి వీమాట యైరావతాహి । చూడామణికి మేముసుతల మేగురము
అమలయుఁ గమలయు హరిణియు ధరణి।సుముఖయు ననుపేర్ల సొంపుచెందెదము
యిది ధృతరాష్ట్రఫణీశ్వరపుత్రి । మదవతి యిది సుకుమారి యన్ పేరి
కోమలి కర్కోటకుని కూర్మిపుత్రి । వామాక్షి యిది రక్తవర్ణునిపుత్రి
సుభగ మే మెనమండ్రుసుదతుల మెలమి । నభినవమదన! నిన్నభిలషించితిమి
మాతలిదండ్రులు మాయిచ్చవచ్చు । నాతనిఁ బెండ్లాడ ననుమతి మున్నె
యిచ్చినారది నమ్మవేని మాతండ్రు । లిచ్చోటి కిప్పుడె యేఁగుదెంచెదరు
అని తమతండ్రుల నహిసుతల్ దలఁపఁ । జనుదెంచి యాఫణీశ్వరు లాక్షణమున
శివునిసన్నిధిఁ బెండ్లిచేసి యల్లునకు । వివిధభూషణ రత్నవితతి యొసంగి
నర్మహార్మ్యముల నిన్నాతులఁ గూడి । కూర్మదేవేంద్రునికూఁతురి మీఁదఁ
గలప్రేమమున నేలగాఁదగు ననుచుఁ । బలికి మామలుచన్న పార్థివాత్మజుఁడు
అమలాది కమలాయతాక్షులఁ గూడి । సమబుద్ధి నంచఱి సౌఖ్యాబ్ధిఁ దేల్చె
మెలపుతోఁగళలంటి మిక్కిలిసొక్కి । చెలియోర్తు పైప్రేవాలఁ జెక్కిలినొక్కి
మునుకొని మోమునమోమును జేర్చి । యెనసి పుక్కిటివిడె మిచ్చి లాలించె
సరసత నిరువురిచనుమొన లలమి । పరిపరిచెయ్యాల భావంబు గఱఁచె
నక్కఱి నిద్దఱి నక్కున నుంచి । చక్కరకెమ్మోవి చవులాని మెచ్చె
నీరీతి నాతఁ డహీంద్రకన్యకల । మాహునికేళి వేమాహును గూడి

యిచ్చకువచ్చిన ట్లిట్టులఁ గ్రీడింప । నచ్చతురసిఁ జూచి యహివధూమణులు
నొకనాఁడు పలికి రోయుర్వీశతిలక! । సకలవనావళిఁ జరియింతుగాని
పడమటితోఁటలపజ్జకు మమ్మ్ । నెడఁబాసి యేఁగకు మేఁగితివేని
నైకృతంబొదవు మాటావచనంబు లాత్మఁ । జేకొనుమనిన మంచిదియని యతఁడు
అందేమివింతలో యరసెద ననుచు । నందఱి వంచించి యరిగె నొక్కఁడును
సరసాగ్రగణ్యుఁ డాజాడన తోఁట । కరిగి చంపకతరు లచ్చోటఁ జూచి
కనకప్రసూన మాఘ్రాణించినంత । మనుజేశసుతుఁ డొక్కమర్కటంబయ్యె
వానరత్వమునకు వ్యాకులపడుచు । నానరేంద్రకుమారుఁ డవ్వలనరిగి
మల్లెపూఁదోఁట సంభ్రమమునఁజొచ్చి।మల్లెవ్వొక్కటి మరలమూర్కొనియె
నామల్లికాఘ్రాణజానందవశతఁ । దా మున్నటట్ల సుందరవేషుఁడయ్యె
నిది యద్భుతంబని యిచ్చ నెంచుచును।బొదలు వేడుకఁ జొచ్చెఁ బున్నాగవనము
పొన్నపూవొకటి గొబ్బునఁ గేలఁజిదిమి।యన్న రేంద్రకుమారుఁడట్లెమూర్కొనిన
వికృతవేషుండయ్యె వినికనియెఱుఁగ । నకట! యద్భుతము లీయారామములను
గనఁబడె నీకనేమికలవో! శోధింతు । నని కేతకీవనం బవ్వలఁగాంచి
కోరి గేదఁగిపువ్వు గోసిఁ మూర్కొనినఁ । జారునిజాకారసంపద గలిగె
నందున నానందమంది యారాజ । నందనుం డీవిధుల్ నాలుగుతెగలు
గ్రహియించి కొనిపోయి గణికలఁ బ్లవగ । మహిళలఁ గావించి మానంబడంచి
యే నొకజోగినై యిల్లిల్లఁ ద్రిప్పి । దీనతఁ బొందింతుఁ దెగడ భూజనులు.
నన్ను వంచనఁజేసి నాసొమ్ముగొనఁగ । నెన్నిన జంతల నిటుసేయకున్న
యలుక యేగతిఁ దీఱునని యాత్మ నెంచి।యలసంపెగలు మల్లియలు పొన్నవిరులు
హొన్ను గేదఁగివిఱ లొకకొన్ని కోసి । యన్నియు నొకరహస్యస్థలి డాఁచి
నాగకన్యలఁజేరి ననబోణులార! । యేఁగంటి పడమటి యెలదోఁటలందుఁ
గొన్నివింత లదేమొకో! తెల్పుఁడనిన । నన్నెలఁతలు పల్కి రయ్యగో! నీవు
పడమటికేఁగి శాపగ్రస్తవనులు । పొడగంటివో యేమి భూపకుమార!
మున్ను చంపకగంధి మున్నైన చిలువ । కన్నెలు తపములకడ సేయుచున్న
తొడిబడ దైత్యులు దుడుకులుచేసి । పడసిరి కీశరూప కురూపకములు
సంపెగ మూర్కొన్న శాఖామృగత్వ।మింపుసొంపు దొలంగ నెవ్వఁడే నొందుఁ

బొన్న మూర్కొని కురూపుండగు మల్లె । క్రొన్ననఁ గేతకీకుసుమంబు వలన
నావికృతులు దీఱునని యనుగ్రహము । గావించి రాపుణ్యకాంత లట్లగుట
నందుఁబోవఁగ వలదంటి మటంచు । మందయానలు దెల్ప మనుజేశసుతుఁడు
న్నాఁడు మర్నాఁడుండి నాగకన్యకల । తోడ నిట్లనియె నోతొయ్యలులార!
యిందుకాంతంబన నెసఁగు పట్టణము । నందొకపనియున్న దట కేఁగవలయు
నే నాత్మఁదలఁచిన నెనయుండ్రు మీర । లేనున్నచోటికి నేఁగుదేవలయు
నని వారివీడ్కొని యాప్రొద్ది కదలి । జననాథతనయుఁ డాచంద్రకాంతాఖ్య
పురిఁ బాదుకాయోగమునఁ బ్రవేశించి । జరఠ యింటికినేఁగి సౌధాంతరమునఁ
దగు రూపవతిఁగన్న తల్లిబిడ్డలకు । దిగులుప్పతిలె నేఁగుదెంచెగా మరల
నీ రాజసుతుఁడని, యెదురుగానేఁగి । క్రూరచిత్తలుగానఁ గొంకుచు మ్రొక్కి
యల్ల పాతాళదుర్గాంబకు మ్రొక్కి । చెల్లించి మగిడివచ్చితె? సామి! యనుచుఁ
దెచ్చికోల్మచ్చిక దివిరిభూషింప । నచ్చతురుఁడు మీర లంపినపనికిఁ
బోయి దుర్గాంబికఁ బూజగావించి । యాయమ్మపాదమ్ము లందలివిరులు
కొనివచ్చినాఁడమూర్కొనుఁడనిముక్కి । లెనయ సంపెగలుంచె నిచ్చలోనగుచు
సంపెగవిరుల వాసన లానినంతఁ । బెంపరి తల్లియుబిడ్డయు నపుడు
పండుకోఁతివిధంబు ప్రాయంపుఁగోఁతి । దండిఁ జూపట్టిరి తాను పున్నాగ
కుసుమమా ఘ్రాణించికుత్సితాంగంబు।పొసఁగఁగ్రోఁతులఁద్రాళ్లఁబొదివిబంధించి
బలు భూతిపూఁతయుఁ బాములపెట్టె । తెలిసంకుఁగడెము సందిటఁ బ్రకాశింప
వంకరమైజోగి వాలకం బూని । చంకకోలయు నాగసర మొకకేలఁ
గొని వీథివీథులఁ గ్రోఁతుల రెంటిఁ । గునిసి యాడింపుచు గుంపులై జనులు
చూచుచు నవ్వుచు సూరెలనడువ । నీచిన్ని క్రోఁతి యెంతే నిద్దురకును
వెయ్యేసివరహాలు విటులచేఁ గొనుచు । నియ్యారఁ బేరువహించిన లంజె
యిప్పండుక్రోఁతి యయ్యింతితల్లి యని । చెప్పుచుఁ బ్రజలెంత చిత్రంబటంచు!
వెరగంద నయ్యార విహరింపుచుండె । తరళాక్షి వింటివె! తత్పురాధిపుఁడు
ఇంద్రసేనుఁడు శౌర్యహృతపరధారు । ణీంద్రసేనుఁడు దర్పమెచ్చ నిచ్చలును
సరిసాటినృపుల మెచ్చక గడిమన్నె । దొరల నెంచక వీఁకతోఁ బ్రవర్తిలఁగ
బరనృపాలురు సహింపక బహుదేశ । ధరణీశ్వరులఁగూర్చి దండెత్తివచ్చి

పటుతర నిస్సాణ భాంకృతు లెసఁగ । పుటభేదనము చుట్టు భోరన విడిసి
బవరంబునకుఁబిల్వ బంధుసామంత । నివహంబుతోడఁ జింతించి యానృపుఁడు
ధీరులై చపున్న దేశాధిపతులు । వీరత్వమున దండువిడిసియుండఁగను
వీరితోఁ బోరాడి విజయంబునొంద । నారుద్రునకునైన నలవిగాదేమి
కర్తవ్య మెఱిఁగింపఁగదరయ్య! యనిన । ధూర్తత్వమెసఁగ నేదొరలఁ జేకొనక
మనము చరింప నిమ్మాడ్కి- వీరెల్లఁ । జనుదెంచి రిందుఁ బొసంగదు సంధి
చెచ్చెర భేదంబు సేయగాఁగూడ । దిచ్చితీఱదు కలహింపగా లేము
ఈ యుపాయములు నాల్గిచ్చోటఁ జెల్ల।నో యింద్రసేన! యింకొక యుపాయంబు
గలదు నీపుత్రిక కలహంసయాన । కలభాషిణీనామ కాంతాలలామ
యీ నరనాథుల నేపణంగించు । వాని కిచ్చెదనని వాద్యముల్ మ్రోయ
నిప్పురిఁ జాటింప నేర్పాటుసేయు । మప్పుడె యొకపుణ్యఁ డహుదేరఁగలఁడు
అని మంత్రిసామంతు లాప్తులు దెలుప । విని మంచిదని భేరిఁ వేయించి నృపుఁడు
ఈపగతుఱఁ బోర హింసించు దోఃప్ర । తాపశాలికి నిత్తుఁ దనపుత్రి ననుచుఁ
జాటింపఁ బంచినజనులెల్ల నట్టి । యాటోపవంతుఁ డీయవనిలోఁ గలడె ?
యింద్రాదులం దొకఁడే తెంచె నేని । నింద్రసేనునిపూన్కి- యీడేర్చు ననుచు
గుమిగూడికొని యాడుకొనుచున్న మాట।లమితవిక్రమశాలి యభినవాంగజుఁడు
విని క్రోతులను గట్టివేసినక్రాడు । తనచేతఁ బూని ముందరవెన్కఁ బ్రజలు
చనుదేర ధరణీశుసభఁ జేరవచ్చి । యనియె గంభీరవాచాడంబరమున
జననాథ! నీకన్య సౌజన్య । నెనరుతో నాకుఁ బెండ్లియొనర్చె దేని
నరనిమేషమున నీయరిసేన నెల్లఁ । బరిమార్తు నిజము నీపాదంబులాన
యన నింద్రసేనుఁ డాయన కురూపంబుఁ । గనుగొని వీని కేకరణి నాసుతను
బరిణయం బొరింతుఁ బరజాతివాని । కరమరలేక కన్యక నీయదగునె?
యని వితర్కింపఁగా నతనిభావంబు । గనిన సువేదియన్ ఘనమంత్రి పలికె
నేకారణముననో యితఁడు వక్రాంగుఁ । డై కానిపించినాఁ డవనీశతిలక !
మహిమ లేకిటులఁ గుమారి నిమ్మనుచు।మహినాథ! యోడక మాటాడఁ డితఁడు
అనుమాన ముడిగి చయ్యనఁ బుత్రినిత్తు । నమమాటతో శత్రుహతికి సెల్వియ్మ్మ
నావిని ప్రియమంది నరనాథుఁ డతని । రావించి యాశత్రురాజుల నెల్లఁ

గీఁటడంచితి వేనిఁ గేవలప్రీతి । పాటించి నీకు నాపట్టి నిచ్చెదను
సభలోనఁ జెప్పితి సత్యమీమాట । శుభమొందెదవు వేయిసుద్దు లేలనిన
నభినవమన్మథుం డటులైన నధిప । సభనున్న యీమంత్రిసామంత బంధు
గణముతో నీవు మొగ్గరమున నిలిచి । రణము వీక్షింపు మూఁటఁజెంద ననిన
నానందకందళితాత్ముఁడై యింద్ర । సేననృపాలుండు సేనలఁ గూడి
కోట యీళ్వరికట్ట గొబ్బునఁనెక్కి । ఘోటక రథభట కుంజరచ్ఛటల
నలుగడల్ నిండియున్న విరోధిబలము । తిలకింపుచుండె నెంతే సంభ్రమమున
నభినవమన్మథుం డంతలో నొక్క । సుభటుచే నొకకమ్మచుట్టి యొసంగి
దక్షిణదిశనున్న తనయగ్రజులకు । నీక్షణంబున నిది యిచ్చిరమ్మనిన
నతివేగగతిని వాఁడరిగి యాలేఖ । యతనియగ్రజుల రత్నాంగదాత్మజుల
నినతేజులను గాంచి యిదిలెస్స చదువు । కొనుఁడని యిచ్చిన గొబ్బున వారి
యగ్రజుండగు సుధన్వాఖ్యు డందుకొని । జాగ్రదక్షరపంక్తి చదివె నిట్లనుచు
శ్రీమదనంత విశేషగుణాభి । రాములైన కళాధురంధరులైన
శ్రీనిధులైన రాజతకీర్తిశాలు । లైన సుధన్వాముఖ్య నృపాగ్రణులకు
తమతమ్మఁ డభినవదర్పకుం డెలమి । యమర ననేకసాష్టాంగదండములు
వెట్టి సేయంగల విన్నపంబేను । నిట్టలంబగు విశ్వాసమిద్ధ కటాక్ష
మహిమ నీవఱకు సేమమున నున్నాఁడ । వహిమించు మీశ్లేమవార్తలు మాకు
వ్రాయించి పంపించవలె మీరు తడవు । సేయ కీకమ్మఁజూచిన యీక్షణమునఁ
దొలఁగిపొం డామడదూర మవ్వలికిఁ । దెలిసిపిమ్మటఁ జనుదెంతురు గాక
యిదియ విన్నపమన హెచ్చువక్కణలు । చదివి సుధన్వుండు సహజులఁ గూడి
తనసేనలును దాను తలఁగి దూరంబు । చనియెనంతట నొక్కచక్కి క్రోఁతులను
గట్టివేయుచు నవకందర్పుఁ డట్టె । యట్టాలకంబెక్కి యరిసేనఁ జూచి
ప్రచుర ఘనాఘనార్భటి నిట్టులనియె । నిచటికి మీరింద జేలవచ్చితిరి?
ఓరాజవరులార! యుర్వీపై బ్రదుకు । వారైన మీమీ నివాసభూములకుఁ
దీసిపొండీరాజదేవేంద్రు మీఁది । యీసు దలంగిపో కిందుంటి రేనిఁ
గాలమృత్యువుఁ బోలుగద యిదెవచ్చి । యీలమ్మిలోన మిమ్మందఱిఁ గూల్చుఁ
జెప్పితి నీమాటఁ జెవిఁ జేర్చివినిన । దప్పుమృత్యువు సూనృతంబిదియనుచు

బలికిన నాతనిపలుకు లాలించి । కలఁగ కాన్నపులెల్లఁ గలకలనవ్వి
వంకరచేతులవాఁ డొకరుండు । కొంకక కోటపైఁ గూర్చుండి మనల
బెదరింపుచున్నాఁడు పెనుగద యొకటి । యిదెవచ్చి మిమ్మెల్ల హింసించు ననుచు
నీవింత గల్పించె నింద్రసేనుండు । తా వచ్చి మొనసి యుద్ధము సేయ లేక
మంచిది చూత మీమార్గ మటంచు । కొంచ కందఱు గుంపుగూడి రోషమునఁ
బటహ గోముఖ శంఖ పణవాది వాద్య । పటలార్భటుల నభోభాగంబు పగుల
నట్టహాసములు సేయఁగ నవ్వి రాచ । పట్టి గట్టిగఁ జలపట్టి బిట్టదరి
యగ్గదాయుధము దా నాత్మఁ దలంప । నగ్గలంబగు కాంతి నది చేరవచ్చె
చేరవచ్చిన బ్రమొక్కి చేకొని దాని । నీ రాజకోటుల నెల్ల నేపణఁచి
పటతెమ్మనుచు ఘోరభంగి మంత్రించి । బిరబిరఁ ద్రిప్పి దర్పించి వైచుటయు
నదియును బ్రళయకాలార్కబింబంబుఁ । బొదివెడు పరివేషము విధంబు దోఁప
గిఱగిఱఁ దిరుగుచు గిరిజేశ ఫాల । భరితదృగ్దీప్తుల బయ లావరింపఁ
గడలేని సంవర్తకాలమేఘములఁ । బొడము క్రొమ్మెఱుఁగులఁ బోలి భూస్థలిని
నిండి బల్మంటలు నెరయంగఁ గాల । దండ పాణింధమోదగ్రత వచ్చి
యరదంబుల నడంచి హస్తియూథముల । నుఱుముసేసి హయాళి నుగ్గొనరించి
భటుల గాత్రంబులు బ్రద్దలువాపి । కుటిలరాహత్తుల గొంతు లగల్చి
రథికుల నొంచి సారథుల వధించి । ప్రథనోర్వి మాప్టిల పలలంబు నించి
దొరల ఖండించి కేతువులఁ దుండించి । శర శరాసన పట్టిస ప్రాస ముసల
కరవాల శూల ముద్గర భిండివాల । పరశు తోమర గదా ప్రముఖాయుధములఁ
బొడిపొడిచేసి గుంపులమీఁద నురికి । కడికండ లొనరించి కలహోర్వి యెల్లఁ
గ్రొత్తనెత్తురులఁ వాఁగులువాఱఁ జేసి । యత్తఱి దివిజులౌరా! వింత యనఁగఁ
బాళెంబులన్నియు భగ్నంబు సేయ । నేలపాలైరి భూనేత లందఱును
గొందఱు పఱచిరి కొందఱు వెఱచి । యిందు శేఖరుఁడే మొ! యీజోగి యనుచు
శరణుసొచ్చిన వారి సదయతఁ బ్రోవ । మరలి యగ్గద రాకొమరుచేత నిలిచె
నామహాత్మ్యనిఁ జూచి హర్షాబ్ధిఁ దేలి । శ్రీమంతుఁ డయ్యింద్రసేన భూవిభుఁడు
తన పుత్రమిత్రబాంధవులతోఁ గూడి । చనుదెంచి కపటవేషమ్మున నున్న
యారాజసుతునకు నంజలిచేసి । వీరాగ్రగణ్య! నీవేషమ్ము గన్న

సందేహమొదవె నీచండప్రతాప । మెందు హీనులకుఁ దానెట్లు గల్గెడిని?
అని గ్రుచ్చిగ్రుచ్చి తన్నడిగిన నతఁడు । తనయూహపమిది యథార్థంబని పలికె
నందునఁ జింతించు నధిపుచందంబు । మందయానలు తత్క్షమారితోఁ దెలుప
నక్కలభాషిణి యయ్యనుఁ జేరి । మ్రొక్కి కరంబులు మొగిచి యిట్లనియె
నీమహాత్మకు రూప మీవు నీక్షించి । యీమాడ్కిఁ జింతింపనేల? భూపాల!
యితఁ డెట్టివాఁడైన నేమి? ముందరనె । యితని కిచ్చితివి నన్నితఁడె నావిభుఁడు
జాతిహీనుండైన జడమతియైన । నీతిదప్పిన నీక నిందింపఁదగునె?
యిదిగొ! వరించెద నీతని ననుచు । మదిరాక్షి యభినవమన్మథుఁ జేరి
పన్నీట నాతనిపాదముల్ గడిగి । హొన్ను పువ్వులదండ యురమున వైచె
దాని పతివ్రతాధర్మంబుఁ జూచి । యానందమంది రత్నాంగదసుతుఁడు
తన కురూపము వాయ దట్టిలో నున్న।గొనబు గేదంగిజేకుఁ గొని మూర్ఖునియె
నందున భువనమోహనమూర్తి యైన । మందరధీరు నమ్మహీపకుమారుఁ
గని మామ మొదలుగాఁగల బంధుజనులు।కొనియాడిరంతనక్షశలమానసుఁడు
తనయూరు తనపేరు తనమామతోడ । వినిపించి సంతోష వివశాత్మఁ జేసె
నప్పు డాప్తులఁబంపి యన్నల నెల్ల । రప్పింప నయ్యారిరాజు వారలకు
నెదురేఁగి బహుమాన మెలమిఁగావించెఁ । దదనంతరమున నుద్వాహలగ్నంబు
మఱునాఁటిరేయున్నమహిసురుల్ దెలుప।పురముతోఁదనయంతిపురముకై సేయఁ
బనిచి లగ్నము సమీపంబైన రాజ । తనయునిఁ గూర్మినందన నందముగను
శృంగారభంగి రాజిలఁజేసి రత్న । రంగవల్లికల విరాజితంబైన
బంగారు చవికెలోపలఁ బెండ్లిపీట । నంగజనిభు నవీనాంగజు ననిచి
స్వకులోచితాచారసరణి నాధన్య । నకు దారవోసెఁ గన్యక నవ్విభుండు
సకలప్రజానురంజనమహోత్సవము । లొకట నాల్గుదినంబు లొప్పె నప్పురికి
మామయు బాంధవుల్ మంత్రులు వచ్చి।యీమహామహుఁ జూచియభినవమదన!
పండుక్రోఁతియు నిండుప్రాయంపుఁగ్రోఁతి । పెండిలిలోఁ దమపెంపు దొరంగి
యలమటఁ బడఁజేయు టర్హంబె? యింకఁ । దిలకింపుఁ గరుణార్ద్రదృష్టి వీరి నని
మనవిచెప్పిన నవ్వి మనుజేశ! వీరు । చెనఁటులై వంచనచేసిన కతన
నీగతి చేసితి నింక నెప్పంటి । లాగు వహించి మెలంగఁ జేసెదను

కనుగొనుండని మల్లికాసమాఘ్రాణ । మొనరింపఁ బంచిన నుగ్మలులై రి
వారిద్దఱును వచ్చి వలగొని మ్రొక్కి- । నేరంబుసైచి మన్నింపవే! యనుచుఁ
జాలఁ బ్రార్థించిన జడియకయేఁగుఁ । డాలయంబునకని యనిచి తర్వాత
నురుశంఖరవసమాహూతయౌ నమర । పరివృఢకన్యను ఫణివరాత్మజలఁ
దలఁపున రప్పించి తత్సహవాస । కలితయౌ కలవాణిఁ గలసి నెయ్యమునఁ
గొన్నినా ళ్లామామ కూర్మిఁ బూజింప।నన్నెలవున నుండి యరణమ్మునఁ గొనుచు
నన్నలు వెంటరా ననున్నలఁగూడి । సన్నాహమున బహుసైన్యంబు గొలువ
శృంగాటకపురంబు చేరి తల్లియు న । నుంగుతండ్రియుఁ దన్ గనుంగొని యులర
వారికి సాష్టాంగవందనంబు లిడి । వారిచ్చు దీవనల్ వరుసఁ గైకొనుచుఁ
దన యన్నలును దాను దల్లిదండ్రులకు । ఘనవస్తువాహనోత్కరము లర్పించి
పదుగురుసతులతోఁ బ్రాజ్యసామ్రాజ్య।పదవిఁ బ్రోచుచు నింద్రుపగిదిఁ జెన్నొందె
నాకలభాషిణి యభినవమదను । వైకృతంబు సహించి వరియించెఁ గాన
నీకథ వినువారి క్లేస్రితార్థములు । చేకుఱు ననుచు శాచిలుక తెల్పుటయు
నాపుష్పమంజరి యానందకలిత । యై పోయె లోపలి కరిగె దూతికయు.
అని శంభుఁడెఱిఁగింప నవ్వలికథలు । వినిపింపుఁడని గౌరి వేడ్కతో నడిగె
సరసపతివ్రతాచరితంబు నందు । నిరువదియొకకథ యిది సాంగమయ్యె

బుద్ధికర్మముల కథ

శ్రీ విశ్వపతి సమంచితమతి గౌరి । కావలికథ లిట్టులని తెల్పఁదొడఁగె
మంజుభాషిణి పిల్వ మఱునాఁడు పుష్ప । మంజరి సంధ్యాసమయమునఁ జేర
వచ్చినఁ బీటల వసియింపఁ బంచి । యచ్చిలక్క నునుదేనియలు చిల్కఁ బలికె
వనిత తావలచిన వల్లభుం డెంత । యనదయైనఁ గురూపియైన దైవగతి
నంగహీనుండైన నలసుఁడైయున్న । వెంగలియైన సాధ్వీమణి విడదు
పాయదు వెతవహింపదు కలనైన । సేయ దవజ్ఞ లోఁ జిడిముడి పడదు
కల దిందులకు నొకకథ యది నీకుఁ । దెలిపెద నీవేళ స్థిరబుద్ధి వినుము

ఆరట్టదేశంబునందుఁ జెన్నొందు । భూరివైభవపరాభూతేంద్రపురము
నూత్న నభోరత్న నుతదీప్తియుక్త । రత్నగోపురము భద్రావతీపురము
అప్పురంబేలు మేలౌ కీర్తికలనఁ ! గప్పురంబు హసించు కమనీయమూర్తి
భద్రసేనుఁడు రణప్రతిహతారాతి । భద్రసేనుండు శుంభద్రసేనుండు
అద్రిధీరుండన నమరు నాయనకు । భద్రరేఖానామ భామిని గలదు
ఆ భద్రరేఖతో నవనిఁ బాలించె । సౌభద్రరేఖ నజ్జనపాలమౌళి
అద్ధరాపతి కమాత్యవరేణ్యుఁ డగుచు । బుద్ధిశరీరుఁడన్ బుణ్యుండు వెలయు
నతనిచేఁ జతురుపాయములు పంచాంగ । గతులు పాడ్గుణ్యవైఖరులు సప్తాంగ
రీతు లెఱింగి దుర్నీతి దొరంగి । యాతిబాధ లడంగి యిల సొంపుచెందఁ
బ్రజలఁ బాలింపఁగా బహుకాలమునకు । సుజనుల పూజచే సోమశేఖరుని
భజనచే నిత్యాన్నపానీయదాన । సృజనచే భాగ్యవిశేషంబు చేత
నిలఁజేని యువతిదౌహృదవతియయ్యె।ఫలియించె సుకృతముల్ ప్రభుమౌళికనుచుఁ
బరిచరుల్ పురజనుల్ ప్రస్తుతిచేసి । రరిగె నెలల్‌కొన్ని యత్తరువాత
నవమమాసమున కాంతామణి కనియె । నవమన్మథాకార నయగుణాధార
సుకుమార నొకని రాజు ప్రమోదవార్ధి । నొకటఁ దేలుచుఁ దత్సుతోదయవేళ
జాతకర్మ మొనర్చి సకలభూదేవ । జాతకమ్ములకు నొసంగిన ధేను
ధన వస్తువాహన ధాన్యంబు లిన్ని । యని ప్రస్తుతింపలేఁ డహిభర్తయైనఁ
బుత్రోత్సవంబిట్లు భూపతి చేసి । పాత్రదాత యనంగఁ బ్రఖ్యాతిడాసి
శృంగారనిధియనఁ జెలఁగు పుత్రునికి । శృంగారనిధి యనియెడు పేరువెట్టి
యలరుచు నున్నంత నక్కమారకుఁడు । చలువపొత్తుల మించు జాళువా మేలి
పని డోల దాదులు బాళితో నునిచి । తనుఁబాడి పోషించ తనుకాంతి మించ
సితపక్షమున వృద్ధిఁజెందు సుధాంశు । గతి వృద్ధిఁబొందె నక్కడ నొక్కనాఁడు
దైవజ్ఞుఁ డొకఁడు శాస్త్రరహస్యవేత్త । భూవిభు సమ్ముఖమ్మున కేఁగుదెంచి
యతనిచేఁ బూజితుఁడై కూరుచుండి । ప్రీతినాథ! దైవజ్ఞశేఖరుం డనఁగ
ఖ్యాతి చెందినవాఁడగాన నీసుతుని । జాతకమ్ము లిఖింతు సమ్మతియైన
సెలవొసంగుఁడటన్నఁ జెంగటి మంత్రి । నిలఁజేఁడు గనిన మేలిది రాజచంద్ర!
యీలాగె వ్రాయింపుఁ డందునఁ గీడు । మేలు నెఱుంగనో మీఁదనో శుభము

నాయుఃప్రమాణమ్ము నరయవచ్చు నన । నా యవనీశ్వరుం డవుగాక యనుచు
ననుమతి యిచ్చిన నతఁడుకుమారు । జననసక్షత్ర ముచ్చగ్రహస్థితులు
తప్పకచూచి జాతకము లిఖించి । యప్పార్థివునకు రహస్యంబుగాఁగ
వినిపింప మంత్రితో విని ధరావిభుఁడు । తనయుండు పదునెన్మిదవయేట నకట!
చోరశిక్ష ఘటిల్ల స్రుక్కునటంచు । ధారుణీసురకులోత్తముఁడు లిఖించె
నని విన్నవై యున్న యమ్మంత్రి పలికె । మనుజేశ! యవలిక్రమంబెల్ల వినుము
దండితుండయ్య నీతనయుండు పిదప । నిండువై భవముల నిఖలోర్వి యేలు
నని వ్రాసినాఁడన్న నతనికిఁ దగిన । ధనభూషణాదు లద్ధరణీశుఁ డిచ్చె
బాలుఁడు నానాఁటఁ బ్రబలుఁడై పెరిగి । యాలోన సకలవిద్యలు నభ్యసించె
శాస్త్రములు స్మృతులును సత్పురాణములు।శస్త్రీస్త్రపాండిత్యసంపదల్ నేర్చె
పదియురెండేడుల ప్రాయంబు చెంది । పొదలు వినీతితోఁ బుత్రుండు మెలఁగ
భద్రసేనుఁడు చూచి బాలుఁడింకే యు।పద్రవంబులకు లోఁబడి స్రుక్కునొక్కొ!
కన్నుల నది చూడఁగా నోపననుచు । విన్నవై మంత్రి కవ్విధమెల్లఁ దెలిపి
పట్టాభిషేకంబు పట్టి కొనర్చి । యిట్టి తీర్థములాడి యే వత్తుననుచుఁ
దన భార్యతోఁగూడి తాను ప్రోల్ వెడలి । తనయుని మంత్రికిఁ దా నప్పగించి
తల్లియుఁ దండ్రియుఁ దనుఁబాసి చనిన । నల్ల బుద్ధిశరీరు నాజ్ఞ రాసుతుఁడు
అవనిఁ బాలింపుచు నర్థరాత్రముల । భవనంబు వెడలి కృపాణంబు పూని
దట్టిచల్లడములు దాలిచి నీలి । పట్టు ముసుంగిడి పట్టణంబెల్లఁ
జరియించి మఱి వేఁగుజామున నెవ్వ । రెఱుఁగకుండఁగఁ బడకిల్లు ప్రాపించు
నడురేయి పురశోధనం బిట్లుసేయఁ । దొడరుట రాత్రి నిద్దురలేమి నతఁడు
కొలువున మంత్రితోఁ గూర్చుండి యుఱక । పలుమాఱు నావులింపఁగ విలోకించి
యామంత్రి యిటులేల నావులించెదవు । భూమీశసుత! నిద్రపోవటో! రాత్రి
యెందుఁ జరింపుదు? వేమి నీచర్య । సందియంబొదవె దాఁచక తెల్పు మనినఁ
బురశోధనంబు సల్పుదు రాత్రులెల్ల । దురితవిదూర! యందున నిద్రలేమి
నావులింతలు తఱిచయ్యె నటన్న । భూవరసుతుఁ జూచి బుద్ధిశరీరి
అన్న! రాత్రి చరించు టర్హంబుగాదు । పిన్నవాఁడవు వెంట భృత్యులు లేక
నొంటిఁద్రిమ్మరు టేమియుద్యోగ?మింక।నింటియొద్దనె యుండుమీ నేఁటిమొదలు

నోరాజనందన! యుడుగక రేలు । జారులు చోరులు సంచరింపుదురు
మొనయ భూతప్రేతములు పిశాచములు । దనుజులు తిరిగెడితఱి చరింపుదురె?
అదిగాక యొకరహస్యము గలదవల । నొదవు హాని యెఱుంగ వూరకుండుమని
పలికెడు నమ్మంత్రి పలుకుల కెదురు । పలుక కూరకయుండె పార్థివసుతుఁడు
తదువాత నగరశోధనము చాలించి । సరిప్రొద్దు దనుక శాస్త్రంబులు చదువు
తమిపుట్టి యొకనాఁడు తనజాతకంబు । క్రమమెల్ల నొకపుస్తకంబునఁ జూచి
యీరీతి! పదునెన్మిదవయేటఁ దనకు।జోరదండనము వచ్చునటంచు బుధులు
వ్రాసిరి మృష యసవచ్చునే? దీనిఁ।ద్రోసిపుచ్చు తెఱంగు దొరకదో!యనుచుఁ
దన బుద్ధిమహిమచేతను గొంతతడవు।మనమునఁ జింతించి మఱియొక్క యుపమ
గాంచి మర్నాఁ డోలగంబున కేఁగు । దెంచి కొల్వుండి బుద్ధిశేఖరుఁ బలికె
ఘనశీల! యొకపుస్తకమున మదీయ । జననపత్రిక చూచి చదివితి రాత్రి
పదునెన్మిదవయేటఁ బాటచ్చరునకు । నొదవు దుర్దశవచ్చు నుడుగ కటంచు
వ్రాసినా రదిగాంచి వందురి డానిఁ । ద్రోసివుచ్చుట కొకదొడ్డ చింతనము
గావించినాఁడఁ దత్క్రమ మెఱిఁగింతు । నోవివేకనిధాన! యూకొంచుగాక
అల క్షీరగిరిపై సదానందనామ । కలితుఁడౌ యోగి యొక్కరుఁ డున్నవాఁడు
అతని చెంగటికేఁగి యతనిశుశ్రూష । లతిభక్తిఁ గావించి యతనిఁ బ్రార్థించి
తదనుగ్రహమునను త్తమహఠయోగ।పదవిఁ బ్రాపించి యప్పటుమహత్త్వమునఁ
గర్మనిర్మూలనక్షముఁడనై పరమ । శర్మంబులొంది నేఁ జనుదెంతుఁ గనుక
రాజ్యరక్షణ మేమఱిక సేయుమయ్య! । పూజ్యమార్గమున నన్ బోవనీవయ్య!
వలదని యడ్డకాల్ వైవకుమయ్య! । యలఘుబుద్ధికి నసాధ్యం బేడదయ్య!
యని దైన్యమున వేఁడు నారాజసుతునిఁ । గనుగొని మంత్రిశేఖరుఁ డిట్టులనియె
నీమాట వినియెకాదే! భవజ్జనకుఁ । డోమహాత్మక! యీడనుండక చనియె
నీవు దలంచినదిది మంచితలఁపు । భూవరాత్మజ! యాత్మబుద్ధియే సుఖము
బుద్ధిచేఁ గర్మంబు పొలియింపరాదు।బుద్ధిచే యోగంబుఁ బొరయఁగావచ్చు
యోగాగ్నిచే నాశ మొందుఁ గర్మములు।యోగంబునకు సాటియున్నదె?యొకటి
యాయోగ మధికప్రయాససాధ్యంబు । నాయాసమున నెట్లు లభ్యసించెదవో!
నీకుఁ బదాఱేండ్లునిండె చేకూరు । గాక నీకోర్కె మార్కండేయమౌని

వరునకుఁబలె పోయివచ్చెదే! క్షీర । గిరి సదానందయోగి కటాక్షమంద
నిను నొంటిగాఁబంచి నేనెట్లు రాజ్య । మొనరింతు బాలుఁడ వొకచోటి కరిగి
యాయాసపడగలవా? యని వగచి । యాయన త్వరచూచి యనుమతి యిచ్చె
నీయనువున సెలవీయఁ బెండ్లికిని । బోయెదుచందాన భూపాలసుతుఁడు
ఆమంత్రి వీడ్కొని యైదునాళ్లకును । శ్రీమహితంబైన క్షీరాబ్ధిఁ జేరి
యందొకగుహాలో మహాయోగనిష్ఠఁ । జెంది బాహ్యము మఱచి సుఖించువాని
నుట్టిపడ్డట్లాత్మయోగసామ్రాజ్య । పట్టాభిషిక్తుఁడై భాసిల్లువానిఁ
గరువలితో మనోగతులు బిగించి । యెఱుక నంతర్లక్ష్య మీక్షించువాని
నాసదానందమహాయోగిచంద్రు । డాసి సాష్టాంగదండము పెట్టువేళ
కాదుగావున హస్తకములమ్ము మొగిచి।యాదట నిలుచుండె నారాజసుతుఁడు
అంత నొక్కముహూర్త మరిగిన శాంతి । మంతుఁ డాయోగి సమాధి చాలించి
కెలనఁ జాగిలిమ్రొక్కి కేల్దోయి మొగిచి । నిలుచున్న శృంగారనిధి నట్టిచూచి
రావోయి! యారట్టరాజకుమార! । దీవించితిమి నీకు దీర్ఘాయు వొదవ
పుట్టుభోగివి రాజ్యభోగముల్ విడిచి । యిట్టేలవచ్చితి? వింతదవ్వనిన
వినయవిశ్వాసముల్ వెలయ నారాజ । తనయుఁ డిట్లనియె నోతాపసప్రవర!
మీపాదములుగొల్చి మీకటాక్షమునఁ।బాపముల్ తాపముల్ పాపుకోఁదలఁచి
చేరవచ్చితి నన్ను శిష్యులలోనఁ । గూరిచి రక్షించికొండని మరల
మ్రొక్కినఁ గారుణ్యమున లేవనెత్తి । నిక్కంబు శృంగారనిధి వౌదువోయి!
యేకోర్కిగోరి మమ్మ్మావు చేరితివొ । యాకోరె్క చేకూరు ననుమాన మేల!
పురుషునికర్మంబె బుద్ధిఁ ప్రేరేచి । పారయించు సుఖదుఃఖములు గాలవశతఁ
బను లెంచినటులౌను ప్రాపించు సిరులుఁ।జను "ఫలంభాగ్యానుసారి" యనంగ
నీభాగ్యమున యోగనిష్ఠతో సకల । వైభవంబులు గల్గు వగవకు మనుచు
నతని నూఱడఁబల్కి యమ్మహాయోగి।యతని క్రీక్రమమున యమనియమములు
నాసనజయము ప్రాణాయామపరత । యా సాధకత మనోవ్యాపారహరణ
పాటవంబును షడ్జవిలోకనక్రి । యాటోపమును నాడికాధిశోధనము
పూరకకుంభకస్ఫురణలు రేచ । కారూఢతయు సుషుమ్నాభ్యంతరమున
నల పునఃపవనంబు లైక్యమై చొచ్చు।మెలుపు కుండలిశక్తి మేల్కొల్పు వెరపు

కలిగించి హఠయోగకలితమార్గమున । నెలకొల్పఁ గాళికానిలయంబునందు
శేలు వసించి నిద్రించుట లుడిగి । పాలోగిరము గురుప్రభునియోగమున
నంబఁబూజించు బ్రాహ్మణుఁడిడ దినది । నంబు భుజించుచు నలఁకువ లేక
ఆరాజసుతుఁడిట్లు హఠము సాధింపఁ । గా రెండువర్షముల్ గడచె నీరీతి
యెన్ని యోగములు వహించిన విద్య । లెన్ని నేర్చిన భక్తి నెటువంటి బుధులఁ
గని కొలిచిన తనకర్మఫలంబు । లనుభవింపక తీఱదవ్వల వినుము
పదునెన్మిదవయేఁడు ప్రాపించి నెలలు । పదియైనపిమ్మట పార్థివసుతుఁడు
నొకనాఁటి రే యాత్మయోగసమాధిఁ । బ్రకటమ్ముగాఁ గాళిభవనంబు నందు
సిద్ధాసనమున వసించి యుండంగ । నద్ధరాధరమున కానడిరేయి
కొందఱు దొంగలు కొదకకవచ్చి । యందలిదేవికి నందఱు మ్రొక్కి
దేవి! యీఘోట్టాణదేశవల్లభుని । యీవాసమున సొమ్ము లబ్బెనేనియును
నందులో సగము నీ కర్పించువార । మిందున సందేహ మెంచకుమమ్మ!
అని వేఁడికొనిచని యల్ల ఘోట్టాణ । జనపతి పాలించు సౌవర్ణపురము
ప్రాపించి నగరిలోపలికిఁ గన్నంపు । తూపరంబునఁ జొచ్చి దొంగలు హెచ్చి
బొక్కసమిండ్ల తల్పులుమీఁటి ధనము । పెక్కుమణుల్ గొని పృథివీశుకన్య
యగు మదాలస భర్మహార్యంబు సొచ్చి । మగువ స్వయంవరమణిహారవల్లి
యీవెన్క గ్రహియించి యీమేడడిగ్గి । యీవలఁజని కాళికాంబాగృహంబు
ప్రాపించి దేవి కర్పణముగా విసరి । యీపటుమణిహార మగ్గుడిలోన
వైచి తలారులు వచ్చుట బెదరి । యీచోరభటు లేఁగి రచలంబు డిగ్గి
తమకు లభించినధనము సామునకు । సమమని బహురత్నసంగతం బగుట
వాహ తీవ్రంబుగావైచిన రత్న । హార మచ్చోట యోగాభ్యాసనిష్ఠ
మొనయు రాసుతుకంఠమునఁదగులొక్కనియె।వినుమంత నచ్చోరవితతి వెంటాడి
ఘోట్టాణపతి భటుల్ కొందఱు జాడఁ । బట్టుక వచ్చి శాంభవిగుడి చొచ్చి
కరదీపికలు వెలుంగఁగ మూలమూల । లరసి యందొకచోట నఱుతహారంబు
వ్రేల యోగాభ్యాసవివశుఁడై యున్న । యీలోకనుతశీలు నారాజబాలుఁ
గనుగొని వీఁడెతస్కరుడు చిక్కెనని । కినుక నందఱు రెండుక్రేవల నిండి
మన మదాలస కంఠమూలిక వీఁడు । తనమెడఁ దగిలించి తపసివేషంబు

మొనయుఁదా కన్నులు మూసికొన్నాఁడు।ధనమెల్ల నెక్కడ దాఁచియున్నాఁడొ!
వీనిఁ బట్టుకపోయి విభుచెంత నుంచి । యీనరేంద్రుఁడు చెప్పినట్ల సేయుదము
అని మానమునన్న యతనిఁ బట్టికొని । పెనుత్రాళ్లచేఁ జుట్టి పెడచేతులంటఁ
గట్టి కొంపోయి రా కలకలం బెఱుఁగ । డిట్టలంపు సమాధి నెనసి తద్గురుఁడు
శృంగారనిధియు నంచితయోగనిష్ఠ । భంగపాటెఱుఁగ కెప్పటియట్ల యుండె
పరమమౌనవ్రతు బాలు నీరీతి । మొఱుకుతనానఁ గొంపోయి యారెకులు
దేవ! మ్రుచ్చును దెచ్చితిమటంచు సర్వ । జీవదయాపరు చెంత నిల్పుటయు
దివిటీలవెలుఁగునఁ దిలకించి యతని । కవనీశుఁడనియె మాటాడఁగదోయి!
నీనామమెయ్యది? నీకులంబేది? । యీనవ్యమణిహార మేరీతి దొరకె?
తోడిదొంగలునేరి? తోరంపుమాన । మీఁడకుఁ గొఱగాది దేమి? నీయునికి
యని పెక్కువిధముల నడిగిన యోగ । మునఁ బల్కఁగూడక మూఁగచందమున
నూరకుండిన దొరయొద్దివా రితఁడె । చోరుండు మునిముచ్చు జూటు తాటోటు
చలమునఁ జంపినఁ జంపనిమ్మనుచుఁ । బలుకకున్నాఁడని పలుమాటలాడ
వారిమాటలు విని వసుధేశ్వరుడు । హారంబు మెడనున్నయపుడె మ్రుచ్చయ్యె
కరపదచ్ఛేదంబు గావింపుఁ డితనిఁ । గొఱతవ్రేయకుఁడన్నఁ గొసిపోయి భటులు
నగరబాహ్యమున నున్నతవధ్యశిలను । జగతీశసుతు కరచరణముల్ దునిమి
పడవైచి పోయి రప్పట్ల నెత్తురులు । వడియగాఁ గరపదద్వయమునఁ బెట్టు
తీపులు దియ్యగా దేహంబుదెలిసి । హా! పరమేశ్వరా! యీవ్రాతఫలము
తప్పునే! యని యోగదార్ఢ్యంబు వలన । నొప్పి దలంప కెంతో తాల్మినుండె
నావేఁగుజామున నయ్యూరిలోనఁ । గోవిదస్తవనీయగుణధుర్యుఁ డనఁగఁ
దనరుచుండెడు ధర్మదత్తుఁడన్ వైశ్య । జనశిఖామణి విరుల్ శంభుపూజకును
గ్రహియించి స్నానంబుగావించి నగర । బహిరంతరుద్యానభాగస్థుఁడైన
శూలి సేవించి వచ్చుట కిల్లువెడలి । యాలోన మడిసంచి యంసదేశమున
వహియించి చనుచుఁ గ్రోవనుఱాతిమీఁద। బహుర క్తధారలుప్రవహింప మేను
మఱచియు మఱువక మాటిమాటికిని । హర! పరమేశ మహాదేవ! యనుచు
స్మరియించువాని సౌందర్యసంపదల । మరుమించువాని నెమ్మైచాయహొన్ను
నిరసించువాని నానృపసుతుఁ జూచి । వెరగంది డగ్గతి విమలేందురేఖ

ముఱవొందు నతనిమోమునఁ జూడ్కిఁజేర్చి । ... ...
యే దేశ? మేజాతి? యెయ్యది నామ? । మీదుర్దశ ఘటిల్లు టేమికారణము
నిన్నుఁ గన్గొనిన నెంతేదుఃఖ మొదవె । నన్న! నీస్థితిఁదెల్పువని వేఁడుచున్న
యాసైశ్యమణిఁ జూచి యారట్టదేశ । పావనుండనియె నో భవ్యచారిత్ర!
భద్రావతీనామపట్టణం బేలు । భద్రసేనుని కూర్మిపట్టిని నేను
పదునెన్మిదవయేటిఁ బ్రాపించు దొంగ । కొదవు కీడని యార్య్య లుగ్గడించినది
విని యది కడఁద్రోసివే సెద ననుచుఁ । జనుదెంచి శ్రీరాద్రిసంయమిఁ జేరి
యాయనకృప యోగ మభ్యసింపుచును । బాయక కాళికాభవనంబునందు
నివసించియున్న యీనృపు వీరభటులు । వివశుఁడనౌ నన్ను వెసఁబట్టి తెచ్చి
కరపదచ్ఛేదంబు గావించిరేమి । యరసిరో! యడియాల మది నేనెఱుంగఁ
గర్మంబు యోగమార్గమున జయించి । పేర్మిఁజెందెదని పెనుబాధ పడఁగఁ
బాలైతినని గణింపఁగ ధర్మదత్తుఁ । డేల శోకించెద? వినతేజ! నీకు
గురుకటాక్షమున నేకొదువయు లేదు । వెఱవకు హరుఁడు నీవెత దీర్చుననుచుఁ
బరిపక్వజంబీరఫలములు నూనె । సరగునఁ దెప్పించి జ్వాలనార్చిఁ గ్రాఁచి
కరచరణంబు లాఘటమునఁ గొంత । చుఱుకువుట్టఁగ నుంచి శోష హరించి
తనుగతనవరక్తధారలు గడిగి । నునుచల్వఁ గప్పి యాందోళిక నుంచి
తనయింటికపుడె సత్కరుణ నెత్తించి।కొనిపోయి మేడపైఁ గొమరొందు నొక్క
యరలోన మృదులశయ్యాస్థలి నునిచి । సరసాన్నగోక్షీరశర్కరాదులను
నాఁకలి దీఱిచి యరయుచునుండె । నీకరణి, వివేకులెంచ నవ్యాజ
కారుణికులుగదా! కరిరాజగమన! । యారాజసుతుఁ డిట్లు లతనిసౌధమున
పసియించు టద్ధరావల్ల భుఁ డెఱిఁగి । యసమానమతిశాలి యని ఖ్యాతిగన్న
ధర్మదత్తుండు బ్రముచ్చుఁదనయింటిలోనఁ।గూర్మినొంచుచునిల్పికొనియున్న వాఁడు
అదియేమి తనకు మర్యాదయే? యనిన।హృదయూళుఁడనుమంత్రి యిట్లని పలికె
గదిసిన జడునైన ఖలునైనఁ బ్రోతు । రెద వివేకంబు వహించు సజ్జనులు
అసమిచ్చి యెళువరిచ్చె వానిఁబ్రోచె । పసఁదప్పె నితఁడని భావించితేమొ?
అతఁడు సద్గుణమరయక వానిఁబ్రోవఁ । డితిహాస మొకటున్న దిందుల కధిప!
వినుతొల్లి గౌడభూవిభుఁడు సుద్యుమ్నుఁ।డను రాజుగలఁడు మహోకీర్తిధనుఁడు

ఆరాజు బొక్కసం బరయుచునాప్తుఁడై రాజిలు సుపణ్యుఁడనువై శ్యుఁడొకఁడు
నతనిమాటల కెమురాడఁడు రాజు । భృతివెట్టు రాణువకెల్ల నాఘనుఁడై
ఆవైశ్యుఁ డూరి బాహ్యమునఁ బూఁదోఁటశై వాలయము మహాసరసి గట్టించి
మన ధర్మదత్తునిమాడ్క వేకువనె । చని తోఁటపూలెత్తి సరసిలో మునిఁగి
గుడిలింగము భజించి గురుని దర్శించి । యెడపక జాములో నింటికివచ్చు
నీరీతి మెలఁగుచున్నెడ నొక్కనాఁడు।చోరుఁడొక్కఁడు శాతశూలాగ్రగతుఁడు
సరసికిఁజను వైశ్యచంద్రునిఁ జూచి । కొఅప్రాణములఁ దన్నుకొనుచున్న తనకుఁ
బుడిసెఁడుజలములు పోయవే! యనుచు । గడుదీనుఁడై వేఁడఁ గరుణాబ్ధి యగుట
వానితోనన గురుస్వామిఁ బ్రార్థించి । యేనొక ఘనమంత్ర మెఱిఁగికొన్నాడ
నది పఠింపుచునుండు నట నీళ్ల కరుగ । మదినెడ మంత్రంబు మఱచిపోవుదునొ!
నీ కదితెల్పెద నీవది మఱచి । పోక నేవచ్చినప్పుడె చెప్పుమనుచు
శివనామమొక్కటి చెప్పిన వాఁడు । శివయని పఠనమ్ము సేయుచునుండె
నంతఁ దోయము తెచ్చి యామంత్ర మడుగ । నెంతయుభక్తి వాఁడేర్పడఁ బలికె
పలికి తోయముగ్రోలి ప్రాణముల్ విడిచి। యల మంత్రపఠనమహత్త్వంబు వలనఁ
బ్రమథుఁడై దివ్యాభరణ దివ్యమాల్య । కమనీయ దివ్యాంశుకములు ధరించి
శివవిమానంబు వచ్చిన నెక్కి చనక । దివినుండె గురుహితస్థితిఁ గోరికొనుచు
శునక మొక్కటి వగర్చుచుఁ ద్రోవఁగూలి।తనువు వీడఁగనున్నఁ దద్వైశ్యుఁడరసి
శివశివా యని దానిచెవిలోనఁ బలుక । శివభటుండయ్యెఁ జచ్చినకుక్కరంబు
అది విమానఁబెక్కి హరువీటి కరుగఁ । గదిసి శైవత్వంబుగన్న ముచ్చనియె
తగునె? యీగురునకు దక్షిణ యియ్య । కగజేసు సన్నిధి కరుగంగ నీకు
నిచట నిల్వుముగురుహితముగావించి।యచలవై భవమొంది యరుగుద మనుచుఁ
గాచుకుండిరి కొండెగాండ్రంతలోన । నీచులై గాళభూనేత కిట్లనిరి
మన సుపణ్యుని మీరు మంచివిశ్వాసి । యని యుండితిరిగదా! యతఁడిదె నేఁడు
ముచ్చున కొళువిచ్చి ముచ్చు లాలించి।ముచ్చుతో నేకాంతములు కొన్ని పలికి
చచ్చిపోయెడువేళ జలములు డెచ్చి । యిచ్చినాఁడని పల్క నెంతయుఁ గినిసి
భవనమంతయుఁ జూఱఁబట్టి యాసెట్టి । నవివేకి తోడితెండని వీరభటులఁ
బనిచిన వారట్టిపని చేసి సెట్టిఁ । గన మింటనని రంతకయె మున్నతండు

శునకతస్కరులకు శుభదాయి యగుచుఁ । జని సరోవరమున స్నానంబుచేసి
శివదర్శన మొనర్చి శ్రీగురుచరణ । సవిధదేశము చేరి సద్భక్తి మ్రొక్కి
యతఁడు తత్త్వరహస్య మానతీయంగ।హితబుద్ధి వినుచున్న యింతలోపలను
భవనంబు ముట్టుకోల్పట్టి యాభటులు । శివు దేవళములోన సెట్టి యుండుటలు
విని నల్వురఁని నుద్వత్తిఁ బట్టుకొనఁ । జనుదేర శునకతస్కరు లుగ్రలీల
కాలకింకరసమాకారులై గదలు । కేల ధరించి వాకిట నిల్చి వారి
గుడిఁ జొఱనీకున్నఁ గోపించి భటులు । పొడువవచ్చిన గదాస్ఫురణ నిర్వురినిఁ
బడఁగొట్ట నిర్వురు పఱచి తెల్పుటయుఁ।బుడమి జేఁ డెనమండ్రఁ బొమ్మని పనిచె
నెనమండ్రలో నల్గురీల్గఁ బదార్గు । రినిఁ బంచె నెనమండ్రు రూపరి రందు
వారిఁ బంచిన వీరవరు లిట్లు దెగిన । ధారుణీపతి బలోద్ధతిఁ దానె వచ్చె
వచ్చిన సేనల వధియింప భీతి । హెచ్చి కోవెలఁజొచ్చి యేఁగి భూవిభుఁడు
గురుచెంత సెట్టిగన్గొని పాదములకు । నెఱిఁగిన నిదియేమి? యేమి భూరమణ!
నాకు మ్రొక్కినకారణముఁ దెల్పుమనిన।నీకూర్చుభటులు కంఠీరవార్భటులు
నాసైన్యముల నెల్ల నాశంబుఁ జేసి । యీసున ననుఁజంప నేతేర బెదరి
శరణుఁ జొచ్చితి నిన్ను నమిమియింపు తప్పు।కరుణాబ్ధి! యనిన నక్కజపడి యతఁడు
గురునితో రాజుతో గుడివాకిటికినిఁ । బఱతెంచి పటుగదాపాణులై రాజు
భూరిసేనలనెల్లఁ బొలియించి కినుక । నారక్తలోచనులైన యిర్వురినిఁ
గని మీరలిర్వు రిక్కార్య మిట్లేల । యొనరించితిరటన్న నురుభక్తి మ్రొక్కి
శునకచోరుల చెవుల్సోక మంత్రంబు । వినిపించి పరమేశు వీటికి మమ్ముఁ
బనిచిన గురునార్యభూముండ వగుట । నినుఁ గాకుసేయు నీనృపతి సైన్యముల
ఘనగదాహతి నొంచి కాకుచేసితిమి । విను మేను చోరుఁడ వీఁడు కుర్కురము
జలమిచ్చి మంత్రమొసంగి ప్రోచినది । తెలియక యొళవిచ్చి తీదొంగ కనుచుఁ
గొండెగాఁడెఱిఁగింపఁగోపించిభూవి।భుండుమొ ధనధాన్యములుచూఱఁగొనియె
మిముఁబట్టి భటులనంపిన నడ్డగించి । తిమి దానఁబుట్టె విద్వేషం బటన్న
మంచిది సేనల మరల రక్షింపుఁ । డంచు శ్వ్యఁడుపల్క నాక్షణంబునను
శివమంత్రమున నీళ్లు చిలికించినంత । నవనిఁగూలిన సేనలన్నియు లేచె
నాయిరువురు శైవు లతనికిమ్రొక్కి । పోయిరి కైలాసమునకు భూపాల!

నీసద్గుణ మెఱుంగనేరక తప్పుఁ । జేసితినని రాజు సెట్టినిఁ బొగడి
యెత్తిన ద్రవ్యంబులిచ్చి యనేక । విత్తంబు మణులును వినయోక్తి నిచ్చి
యెప్పటివలెఁ జనవిచ్చి మన్నించె । నిప్పగిదిఁ జరింతు రిల మహాత్మకులు
వారి భావ మెఱుంగవలవదే? యనిన । నారాజు హృదయాళు నౌనని పొగడె
నంతట నొక్కనాఁ డారాజతనయుఁ । డెంతయు విశ్వాసమెసఁగ వైశ్యుండు
కంటికిఁ గనుఱెప్పగతిఁ దన్నుఁబ్రోవ । మింటితో నొరయు నమ్మేడపై నుండి
పండువెన్నెలగాయఁ బానుపుమీఁద । నిండువేడుక శయనించి యాహరిని
హరిహరబ్రహ్మాదులైన కర్మంబు । హరియింపలేరను నర్థంబుగలుగు
శ్లోకంబు వీనులుసొగయఁ బాడుటయు । నాకర్ణనమొనర్చి యారాజకన్య
లావణ్యావతి మదాలస కూర్మిచెలులు । వేవురు గొలువగా విడికెంపుపనుల
గొప్పయుప్పరిగపైఁ గొలువున్నదగుట । నప్పాట కతివిస్మయాక్రాంత యగుచు
నెవ్వండె? పాడేటి యీవగకాఁడు । జవ్వనులార! వైశ్యవరేణ్యు నింట
గాయకులున్నారె? గంధర్వుఁడేమొ । యీయెడఁ దెలిసిరాఁ దే! యనిపలుక
వారిలో నొకచంద్రవదన వేఁబోయి । యీ రాకొమరుఁజూచి యప్పుడె తిరిగి
వచ్చి మదాలసావామాక్షి కనియె । నిచ్చ నేనెవ్వఁడొ యితఁడని యుంటి
వంచన నీస్వయంవరహార మది గ్ర । హించి కంఠమున వహించినాఁడనుచుఁ
గరపదచ్ఛేదంబు గావింపఁ బంచె । దొర వాని ధర్మదత్తుఁడు చూచి కరుణఁ
దనయింటనుంచి యేఁదగనుండి హావుసు। జనియించి శ్లోకంబుఁ జదివినాఁడిటులఁ
జెలియ! వానికిఁ గాళ్లుసేతులు నున్న । వలరాజు గేరు కేవలరాజసంబు
గల రాసుతుఁడుగాని గాఁడన్యశలుఁడు । కలికి! వానిమొగంబు గలువలఁబోనిఁ
గలకలనవ్వు సింగారమ్ములెల్లఁ । జెలువున రాశిగఁజేసి సృజియించెనేమొ!
వీని బ్రహ్మాయటంచు వివరింప, వారి । జానన వానిసోయగము ప్రాయంబు
కనుఁగొనవలయు నిక్కడికిఁ దెండనినఁ । గనకాంగియను చెలిక త్తె యిట్లనియె
దొర తొల్తనే వాని దొంగయటంచుఁ। గరపదంబులు గోయఁగా నియోగించె
నేవగింపుచునుండె నెటువలె నతని । నీవు దెప్పించెద? విచ్చోటి కనినఁ
బలికె మదాలస భయమేల? రాజు । సెలవునఁ దోడితెచ్చెద నీడ కతని
నీవేళ నని యప్పుడే లేచి సర్వ । జీవదయాపరు చెంగటి కేఁగి

కన్నతల్లియు నుండఁ గరములు మొగిచి।యున్న చిన్నికుమారి నొయ్యనఁదిగిచి
చేరువ నిడికొని చెక్కిలినొక్కి । కూరిమి శిరమునూరొక్కి ముద్దు లాడి
యీవేళ వచ్చినదేమి? తెల్పినది । గావింతుఁ నెటిగింపు కమలాక్షి! యనిన
నయ్య! పరాకు మీ రలనాఁడె నాకు। నెయ్యంబుమీఱఁ బెండ్లియొనర్పఁ దలఁచి
ధరగల రాజనందనుల నందఱను । బెరిమగల్గినవారిఁ బిల్వ నంపించి
చూపిన నారాజసుతులలో నొకని । రూపైన మెచ్చక రోసినట్లున్న
ననుఁజూచి నీనెమ్మోమున కింపైన । ఘనునిఁ బెండ్లాడు మేఁగాదన నిఁకను
రమణి! స్వయంవరరత్నహారంబు । రమణీయమహిమ నిర్మాణం బొనర్చి
నీకొసంగెద నది నీ వేమనోహ । రాకారు మెడనుంతు వతఁడె నీమగఁడు
అని యిచ్చితిరిగదా! యారత్నహార । మనఘుఁడొక్కఁడు కంఠమందు ధరించి
హారువొంద, ప్రుచ్చని యాజ్ఞ సేయించి । తి గతండు మనవైశ్యతిలకంబు మేడ
నెలకొన్నవాఁ డతని వమోవిలాస।ములకుఁ జొక్కి తి నిజంబుగఁ బెండ్లియాడఁ
దలఁచితి నతని నింతటినుండి చెంత । నెలమితో నిడుకొన నెదఁ గోరికొనెద
నెలవియ్యవలెనన్నఁ, జిన్నికుమారి । పలుకులు విని తండ్రి పరితాపమంది
యక్కటా! నినువంటి యంగనామణికి । నక్కించు మొండివాఁడగునటే? తల్లి!
వాఁడతిసౌందర్యవంతుఁడౌ నీవు । నాఁడె వేఁడిన దండనంబు సేయకయె
నీకుఁ బెండ్లియొనర్పనే? కాలుగేలు । లేకయుండెడివాని లేమ! కోరుదురె?
మాయమ్మ! మగపొడి మానె డమ్మొడినె?।పో!యి దేటితలంపు?పొసఁగదు వానిఁ
దలఁపకుమన్న న త్తరుణీలలాము । కలకల నగి తండ్రిఁగని యిట్టులనియె
మనసునఁ దలఁచితి మాటల నతఁడె । యనువైన మగఁడని యంటి నీతోడ
నింక నీతనిమాని యితరుఁ జెందెదనె? । శంకించె దేటికి? జననాథ! యనినఁ
దల్లి యిట్లనె దీని తలత్రాసినటుల । నుల్లంబునఁ దలంచె నుడుగు మటన్న
నుడుగ దెంతవిమోహమున్నదో! వాని । యెడ సెలొ్వసంగు మింకేల జాగనిన
నారాజు విని వినటుల్లు నీబుద్ధి । కేరీతిఁ దోఁచె నట్లింక వర్తిలుము
కాదన మనిన నక్కన్య తండ్రికిఁ బ్రమోదంబుతో ప్రొక్కి ముదితలు గొలువఁ
జని ధర్మదత్తుని సదనంబునందుఁ । దనరు రాజకుమారు ధారుణీవిభుఁడు
తోడితెమ్మనుచు నాందోళిక యంపి । నాఁడని యవైశ్యనకుఁ దెల్పఁబనిచి

యతఁడంప నాందోళికారూఢుఁ జేసి । యతనిఁదెప్పించె సౌధాంతరంబునకు
నీలీలఁ దెప్పించి యిందిరాసుతునిఁ । బోలు నాతని రూపమున కరుదంది
యెందునఁ గొదువ లేకింపొందు నతని । నిందఁబొందించి యన్నీచవిధాత
కరపదహీనునిఁ గావించె నేమి।కొఱంత యుండెనో! యయ్యగో ! వింత యనుచు
వగచి యుప్పరిగపై వలిపె క్రొంజలువ । సొగసుపాన్పున నుంచి సురటిచే విసరి
నాసామి! నినువంటి నవమన్మథునకు । నీ సడి వచ్చెగా! యేమందు విధిని
నాభాగ్యమహిమ ప్రాణములతో మీరు । శోభిల్లుటలె చాలు శుభము గల్గెడిని
అని చల్వపావడ నతని నెమ్మేన । మొనయు చెమ్మట హరింపుచుఁ గప్పురంపు
విడియంబొసంగుచు వినయంపుమాట । లాడుచుఁ బరమయోగాభ్యాసమునకుఁ
దగిన వివిక్తవితర్దిక నిడుచు । మగువలసందడి మాన్పుచుఁ జెంతఁ
జేరి శుశ్రూషలుసేయుచు తూత్తు । దీఱు క్షీరాన్నముల్ తెచ్చిపెట్టుచును
బగలు రేలిటు లెడఁబాయక యున్న । మగువ కారాజకుమారుఁ డిట్లయెఁ
గరపదహీనుండుగా! యీతఁడనక । తరుణి! నాయెడఁ జాల దయదాన వగుచు
సేవచేసెదవు నాచే నేమిసౌఖ్య । మావహిల్లెడిని? నీకైన నీభక్తి
మహిమచే సౌఖ్యసంపద దైవమిచ్చు।మహిఁ బతివ్రతలసామర్థ్యముల్ వినమె?
నీకతంబున నాకు నిజము మేలొదవు । నాకత వినుమని నరనాథసుతుఁడు
తన పుట్టుపూర్వముల్ దానితోఁ దెలుప । విని యది మిక్కిలి విస్మయంబంది
వృద్ధశ్రవోముఖుల్ విన బ్రహ్మకడను । బుద్ధికర్మములకుఁ బోరాట మొకటి
యక్కాలమునఁ బుట్ట నజునకు బుద్ధి । మొక్కి యిట్లనియె వాజ్మోహనాకార!
ఘనత నాదేయని కర్మంబు కలహ । మొనరించె నాతోడ నోహో! యిదేమి!
నీవెంత! నాచెంత నేదొడ్డదాన । నావిధం బెఱుఁగ వెన్న, వితండమేల?
తక్కువయెక్కువల్ ధాతనే యడిగి । యొక్కటఁ దెలియుద మొక రమ్మనిన
నిదె కర్మ మరుడెంచె నీవాద ముడుపఁ।గదవయ్య యన వారిఁగని బ్రహ్మపలికె
మీవాద ముడిగించు మిన్నక యొక్క । భూవరతనయుండు భూమికిఁ జనుఁడు
ఘోట్టాణనాథుని కూఁతురి యింటఁ । బట్టిమంచంబుపైఁ బవళించినాఁడు
శృంగారనిధి కాళ్లుచేతులు లేమి । నంగనప్రాపున నటుల నున్నాఁడు
గెలిచినవారు కాల్కేలు నొసంగి । యలరింపుఁ డతనిఁ బొండని వీడుకొల్పు

బుద్ధికర్మములు స్త్రీపురుషరూపముల । నద్ధరావరసూతి హార్మ్యంబు చేరి
తమదేహకాంతులు దశదిశ లొరయ । రమణీసమేతుఁడౌ రాసుతు నెదుట
నిలిచిన నతఁడు నెంతేభక్తి లేచి । చెలి ప్రయత్నంబున క్షితిఁ జాగిమ్రొక్కి
మ్రొక్కి యర్ఘ్యముపాద్యమును దగుపూజ । లక్కన్యచే వారికపుడు సేయించి
యున్నతాసనముల నుండెడివారి । కన్నపాత్మజుఁ డోదయానిధులార!
మీ దేహరుచులివి మిన్ననినండె । నే దేవతలో! మీరలిటఁ బిచ్చుగుంటు
పయిని భాగీరథి పాఱినట్లయ్యె । దయ నన్నుగదియుఁ బే ధన్యుండ నయితి
నిందు మీరరుదెంచు టేమన్న? రాజ । నందనుతో బుద్ధి నవ్వుచుఁ బలికె
నేను బుద్ధిని గర్మమీాయన యొక్కఁ । డేనన నితఁడు తానే యొక్కఁడనఁగ
నిక్కెవడి వివాదమెనసి మాహెచ్చు । తక్కువల్ దెలియ నిద్దఱము నీకడకు
వచ్చినారము వచోవల్ల భుఁ డనుపఁ । జెచ్చెరఁ దెలుపు మిచ్చెదము మేలనిన
రాకొమరుఁడు పల్కె రావమ్మ! బుద్ధి । నీకున్న ఘనత వర్ణింపనే రాదు
అన్నిటనేర్పు నీయందున్న దైన । నిన్ను గర్మమునకంటెను హెచ్చటంచు
నేన ననోప నదేమిటి కనిన । నానెగుల్ వినిపింతు నయమొప్ప వినుము
కర్మంబువలన రాఁగలకీడు బుద్ధి । పీర్మిచే నేను దప్పించికొనంగఁ
దలఁచి యోగాభ్యాసవశఁ బెక్కుదినము । లలసితి బుద్ధిసాధ్యంబైన యోగ
గరిమచేఁ గర్మంబు గడచితినోటు! । కరచరణంబులు ఖండించి రుఱక
కావునఁ గర్మంబె ఘనము కర్మంపు । ద్రోవఁ దప్పింపనే ర్తురె? హరిహరులు
పోరేల? మీకింక బుద్ధి కర్మాను । సారిణి గాదె! యేజాడఁ గర్మంబు
తిగుచు నాజాడ బుద్ధి చరించు బుద్ధి । కగపడునే కర్మ మాకర్మమునకు
నగపడు బుద్ధి సత్యంబిది యనిన । నగి కర్మ మారాజనందను మెచ్చి
బళిబళి! బుద్ధి దర్పంబడంచితివి । గెలిపించితివి నన్నుఁ గ్రేల్దోయి పాద
వనజంబు లెప్పటివలె వచ్చి శత్రు । జనహర్తవై ప్రాజ్యసామ్రాజ్యభోగ
పరుఁడవై యాపన్నపత్రాక్షుఁ గూడి । హరిఁబోలి కరుణాసమగ్రుండ వగుచుఁ
బ్రజలఁ బాలింపుమీ బహుకాల మనుచు।ఋజుమతినన జనియించె నాక్షణమె
కరచరణమ్ము లొక్కట లేఁజిగుళ్ళ । కరణి సరోజరాగశ్రీల బెరసి
పాణిపదంబులు ప్రభవించినపుడె । రాణితోఁగూడి యారాజేంద్రసుతుఁడు

ఆయిర్వ్వరికి ప్రమొక్కి యశ్శ్యాదు లిచ్చె।నాయెడ బుద్ధి యిట్లనియె నో యనఘ!
వర మొసంగెద నేమివలె వేఁడుమనిన । మరలక బుద్ధి ధర్మమునందె మెలఁగ
వలయునంచతఁడన్న వాని కవ్వరము।కలిమియు బలిమియుఁ గరుణించె నపుడు
స్త్రీపురుషాకృతుల్ చెందినవారి । నాపురాధీశ్వరుం డతివతో వచ్చి
సేవించి వారలచే వినె నల్ల । కోవెల జపనిష్ఠఁ గూర్చున్న రాచ
కొడుకు కంఠంబున గురుహారవల్లిఁ । బడనైచి దొంగలు పఱచినవిధము
అదిచూచి ప్రుచ్చని యాజ్ఞ వెట్టినది । విదితంబుగా విని వెతఁజెంది యతని
నాదరించిరి వేల్పు లంతర్ధిఁజెంది । రాదట భద్రసేనాత్మజుం డలరి
తనమంత్రిఁ బిలిపించెఁ దలిదండ్రులలరి।చనుదెంచి రతనిమేల్ సంయముల్ దెలుపఁ
దల్లిదండ్రులసేవఁ దనుపుచు వారి । యుల్లంబు రంజిల్ల నొకముహూర్తమున
నామదాలసఁ బెండ్లియై యరణముగ । మామ యొసంగిన మణిభూషణములు
చతురంగబలము లసంఖ్యలు వెలయ । నతఁడు భద్రావతికరిగి మంత్రియును
జననియు జనకుండు సంప్రీతిఁ బనుప । ననుపమశ్రీలఁ బట్టాభిషేకమ్ము
వహియించి సర్వ్వసర్వ్వంసహాభార । సహిత దక్షిణభుజాస్తంభుఁడై వెలసె
నతని పట్టపుదేవి యమ్మదాలసయుఁ । బతిభక్తి నెల్లశోభనములు గలిగి
ఘనులైన సుతులఁ బెక్కండ్రను గాంచి।తనరె బాంధవులెల్లఁ దను బ్రస్తుతింప
నీపతివ్రతకథ యెవ్వరు వినినఁ । బ్రాపించు వారికి బహువైభవములు
నని కీర మెటిఁగింప నలరి యూరవ్య । వనిత లోపలికేఁగె వసుధేశుదూతి
చనెనని శంభుఁ డీసత్కథ దెలుప । విని గౌరి యవ్వలి వృత్తాంత మేమి
యానతి యియ్యవే! యనవిని తెలిపె।శౌనకాదికులు మెచ్చుఁగ సూతసుతుఁడు
సనయపతివ్రతాచరితంబునందు । ఘనత నిర్వ్వదియవకథ పూర్ణమయ్యె

రాజశేఖరునికథ

శ్రీవిశ్వపతి సమంచితమతి యువతి । కావలికథ యిట్టులని యానతిచ్చె
మఱునాఁటిరాత్రి యమ్మహనీయగాత్రి । స్థిరకాంతి మణిపుత్రి శృంగారధాత్రి
యల రాజదూతితో నరుదేరఁ జూచి । వలరాజు మేల్వారువం బిట్టులనియెఁ

జెడుబుద్ధులు గణించి శీలప్రతిష్ఠ । లడఁగించి పరపురుషానురాగంబు
వొడమించి పతిభక్తిఁ బొలియించి చెఱుతు।రెడఁబాయ కబలల నిటువంటి కపట
జరతాంగనలు వీరిసహవాస మగునె? । తెఱవ! నీవంటి పతివ్రతామణికి
నిటువంటి దుష్కాంత లెంత సెప్పినను । బటుభక్తి గుణముదప్పరు పతివ్రతలు
దీనిఁబోలిన యొక్కదివ్యకాంత తొల్లి । ష్ణ్మానాథు నొక్కనిఁ జంపి తత్సతిని
వేఱొక్కనృపు నింట విడిచి భూజనుల । చే రట్టువడి ప్రముండెఁ జెప్పెద నీకు
నా కథావృత్తాంత మాలింపుమని మ । హాకీరమణి పల్కె నమృతంబుచిలుక
లాటోర్వి లక్ష్మీవిలాసమ న్వరము । నీటొందుఁ గలిమికి నెలవిది యనఁగ
నా నగరంబేలు నసమానకాంతి । భానుమంతుండగు భానుమంతుండు
ఆ జనాధిపు పుత్రుఁడై జ్ఞానవిభవ । రాజశేఖరుఁడొప్పు రాజశేఖరుఁడు
ఆ రాజతనయుఁ డర్థార్థిపోషణ ద । యారాజితనయుఁడై యఖిలవిద్యలను
జతురుఁడై శస్త్రాస్త్రసాధనక్రియల । నతిలోకుఁడై పూర్ణయౌవనస్ఫురణఁ
జెలువొందఁ దండ్రి రంజిలి పెండ్లిసేయఁ । దలఁచిన నారాజు తలఁ పతం డెఱిఁగి
యుద్వాహ మొనరించి యువరాజుఁ జేసి । విద్వద్గణేయుఁడై వెలయు మాతండ్రి
యాపటుభారంబు నిపుడె నాతలను । మోపనెంచెను బుత్రమోహంబు కతన
నిది కూడదనఁగరా దిపుడె యెంతైనఁ । గదలిపోయి ధరత్రిఁగల విశేషములు
చూచి వచ్చెదనటంచుఁ దలంచి యొకఁడె । యేచెలికానితో నెఱుకసేయకయె
ఒకనాఁడు మృగయాసముద్యమోత్సాహ। మొకటితండ్రికిఁదెల్పియూరు వెల్వడియె
వెలువడి హయముపై విపినమార్గమున । విలునమ్ములు ధరించి వేఁటలాడుచును
జనుచున్న యారాజచంద్రుని యెదుట । ధనురాది సాధనోత్కరము ధరించి
మృగయావశంబున మృగములఁజంపి । మృగయులచేత నామృగమాంస మెల్లఁ
బురికిఁబుచ్చి శ్రమంబువొందిన యొక్క । ధరణీశతనయునిఁ దా విలోకించి
యతని చెంగటికేగి యశ్వంబు డిగ్గి । హితవచోవైచిత్రి నిట్లని పలికె
నెయ్యది నీదేశ? మెవ్వఁడు తండ్రి? । యయ్య! నీపేరేమి యడవిలో మెలఁగు
మృగములనేల చంపెదు? తెల్పుమనిన । నగరాజధృతికి నాయనకతండనియె
ననఘ! యుశీనరాహ్వయదేశ మేలు।ఘనుఁడు సుధన్వుఁడన్ ఖ్యాతలేశ్వరుఁడు.
ఆయనసుతుఁడ జయంతుఁడ న్వాఁడ । మాయయ్య కీమృగమాంసమ్ము లందుం

నరుచిలే దెపుడెంతయైన భుజించు । నెఱచి దెమ్మనుచు నన్నేవేళ నడవి
వేఁటలాడఁగఁ బంపు వినుమన్న! యొక్కఁనాఁటిచందమున దినంబు మృగాళిఁ
దునుమ శక్యంబె? యిందున శ్రాంతిచెంది । చనియెద నెట్టకైన జనకునిసేవ
చాలునటంచు వేసరియున్నవాఁడ । నాలాగు వింటివన్నా! నిన్నుఁగన్నఁ
గనుపండువయ్యె నెక్కడికిఁ బోయెదవు? । నినుఁ గొల్చివచ్చెద నీవెంట నేను
నన్ను ఁదోకొనిపొమ్మనఁగ సంతసించి । యున్న రేంద్రకుమారుఁ డతని కిట్లనియె
జనకుని నెడఁబాసి చనియెడు నాకు । నినుఁ దోడుకొనిపోవ నీతిగాదైన
వేసటపడి నీవు వెంటవత్తు ననఁ । ద్రోసి పొమ్మనరాదు దొరబిడ్డ వగుట
వెంబడి రమ్మన్న విని జయంతుఁడు ప్రి । యంబున నీవె మాయన్నవు నేను
నీయనుజుఁడఁ జుమీ! నెనరుంచు మనుచు।నాయనతోఁబల్క యలరుచు నరిగె
నిద్దఱు నీరీతి నేఁగుచు రెండు । ప్రొద్దుల కొకమహాద్భుతవనం బెదుటఁ
గని చొచ్చిపోవ నక్కడ నొక్కరాజ । తనయుఁడు వింట నస్త్రములు సంధించి
గుఱి లేసి కడుడస్సి కూర్చుండఁబడిన । తఱిఁ జేరి భానుమత్తనయుఁ డిట్లనియె
నెవ్వరివాఁడ? వీ వేమి నీనామ? । మివ్వని గుఱి లేయనేల? యొంటిగను
అలసితి వూరికి నరుగంగవలదె? । తెలుపుము నా వాఁడు తెఱఁగొప్పఁ బలికె
సౌవీరనృప తనూజాతుండ నేను । ధీవిరాజిత! జయత్సేనుఁ డన్నాఁడ
నరుణోదయమువేళ నార్యుల యొద్దఁ । బరిపాటి శాస్త్రముల్ పఠియింపుచుందు
జామైన గరిడిలో సాధనసేతు । నామీఁదఁ గావింతు నస్త్రాభ్యసనము
మాపటిపూట శుంభచ్ఛుగుంభ । నాపారగద్యపద్యములు వ్రాయింతు
వల్లకీ డిండిమస్వర మండలాదు । లెల్లను రేలు వాయింతు వేర్వేఱ
నీవిద్యలం దొకయింత తప్పినను । భూవరుం డధయత్వమునఁ గొట్టుఁదిట్టు
నొక్కింతసేపైన నూఱటఁగాన । నెక్కడికేనిఁ బోయెదనని మదినిఁ
దలఁచియున్నాఁడ నీ తహతహ కోర్వఁ । గలనె? మీవెంబడిఁ గదలివచ్చెదను
నన్నుఁదోడ్కొనిపొండు నా నతండనియె।నన్న!విద్య లెఱుంగు మనుటక్రమంబె?
జనకునివిడిచి మీజాడ నీవెటులఁ । జనుదెంచెదనిన నీసహవాసమునను
సకలవిశేషముల్ సమకూరు నాకు । వికటోక్తులాడక వెంటఁబెట్టుకొని
పొండన్న భానుమత్పుత్రుండు వాని । నిండుమనంబున నెమ్మి లాలించి

తోకొనిచనె జయంతుఁడు జయత్సేనుఁ । డీకై వడిని వెంట నేగుదేరంగ
నారాజశేఖరుం డవ్వలఁ జనుచు । నాఁజువనాఁ డొక్కయడవి లోపలను
జెక్కిటఁ జెయిచేర్చి చింతాభరమున । నొక్కటఁ బరితాపమొందు రాసుతుని
నొక్కనిఁ గనుగొని యెయ్యనఁ జేరి । యెక్కడ నీపురం? బేమినీపేరు?
జనకుఁడెవ్వాఁడేల జాలి చెందెదవు? । వినిపింపుమనిన సద్వినయవాక్యముల
నారాజసుతుఁ డను ననఘ! చేదీశుఁ । డా రత్న కేతుధరాధీశసుతుఁడ
విజయుఁడందురు నన్ను వినుఁడు నా తెఱఁగు।ప్రజలఁ బ్రోవఁగ నన్నుఁబట్టంబుగట్టి
మాతండ్రి విపినసీమకుఁ బోఁదలంప । నీతలమో పేల? యిపుడె నాకనుచు
జనకు వంచించి యెచ్చటి కేనిఁ బోవు । పనిపూని యిటులఁ జేడ్పడి యున్నవాఁడ
మీ రెవ్వ రెచటికి మీరు పోయెదరు? । మీరు దయాళు లమేయవిక్రములు
నన్నుఁ దోడ్కొనిపొండు నాయన్నలార!।యన్న లాటధరాధిపాత్మజుం డనియె
నేను మువ్వురము వింటే! రాజతనయ!।యీమాడ్కిఁదండ్రులకెఱుక సేయకయె
వంచనచేసి వెల్వడి దేశములఁ జ । రించనెంచితిమి యీరీతి మాపెంట
నలమటకోర్చి నీవరుదేరఁ గలవె? । వలదన మరుదెమ్మ్ల వచ్చెదవేని
వంచనలేక కేవలమైత్రి ధాత్రి । సంచరించంగ నీశ్వరకటాక్షమున
నేమిగల్గిన నదియె విశేషమనుచు । ధీమహిమ గ్రహించి తిరుగుద మనుచు
నతనిఁ దోకొనిచనె నంత దిగంత । గతదురంతధ్వాంతగరిమకుఁ బెరిమఁ
జూపి జక్కవకవ శోకాబ్ధి ముంచి । యాపద్మినీకాంత కలమట పెంచి
పెనుమానికములేని పెట్టియ యోలె । వనజభవాండమ్ము వన్నెదొరంగఁ
జరమాబ్ధిఁగ్రుంకె భాస్కరుఁ డట్టివేళఁ । గరుణాబ్ధి రాజశేఖరుఁడు రాజేంద్ర
తనయుల మువ్వురఁ దనవెంటఁ దోడు । కొని చని కెలఁకునఁ గొలఁకొండు సూచి
చరమసంధ్యాక్రియల్ సవరించి యచటఁ । బరమేశ్వరి వసించు భవనంబుగాంచి
భయభక్తులమర నంబకుఁ బ్రణమిల్లి । జయ జగజ్జనయిత్రి! జయపుణ్యధాత్రి
శివ! ప్రణామము సదాశివపత్ని! వినతి । హవఫలదాయిని! సాష్టాంగమనుచు
సేవించి యద్దేవిచెంత జసంబు । గావించి తత్కటాక్షమున నర్చకుఁడు
ననువొందు భక్ష్యభోజ్యాదు లొసంగఁ । గొని భుజియించి నల్గురు తృప్తిచెంది
యందఱు నొకచో సుఖాసీనులైన । నందు లాటేశ్వరుం డనియె వారలకు

నరనాథసుతులార! ననుఁగూడి మీరు । సంచరించిన మేలొసంగు నీశ్వరుఁడు
వినుఁ డొకప్రతిన గావించెద మీకు । మునుపుగాఁ బెండ్లిండ్లు ముగురికిఁ జేసి
కాని నేనొకకన్యకను వరియింప । హానివృద్ధులకు లోనై మీరు నేనుఁ
జరియించువార మీశ్వరి సమ్ముఖమున । నెజఁగించితి నటన్న నెలమి వారనిరి
అన్న! నీవూహించినటుల నే మాత్మ । నెన్నుదు మిది సత్య మీదేవి సాక్షి
నీతోడివారము నీమేలు దలఁచి । యే తెంచుచున్నార మేల? సందియము
అని దేవిసన్నిధి నగ్నిసాక్షిగను । జననాథసుతు లిట్లు సఖ్యమ్ము సేయ
మంచిదియని బహుమానోక్తి వారి । నెంచి మీరలసితి రిపు డన్నలార!
నిదురింపుఁడని పలికి నృపసుతుం డంబ । పదపద్మచింతన భక్తితో సలుప
నానిశావేళఁ బ్రత్యక్షమై దేవి । యోనృపాలకుమార ! యుల్లంబునందు
తలఁచినయర్థంబు దయతోడ నిత్తుఁ । దెలియఁ బల్కుమటన్న దేవికి మ్రొక్కి
యా రాజశేఖరుం డనియె నోయంబ? । కోరినపనులు చేకూరు నట్లుగను
గరగతఖడ్గసంగతిఁ బ్రాణతతులు । చరియించునట్లును సముచితరీతిఁ
బలికినపలుకు నిబద్ధియా నటుల । బలిమియుఁ గలిమియుఁ బ్రాపించునటులఁ
గరుణింపవలెనన్నఁ గాళి యందొసఁగి । కరవాల మొక్కటి కట్టడఁజేసి
యాక్షత్తి తళతళ లెడసిన యపుడె । నీకు హానిఘటిల్లు నెటి నెప్పటట్ల
మెఱుఁగువెట్టిన నీ వమేయప్రకాశ । భరితగాత్రుండవై బ్రదుకుదు వనుచు
నంతర్ధిఁజెందిన నతఁ డొకమంట । పాంతరస్థలిని నిద్రాసక్తులైన
చెలికాండ్ర చెంతలఁజేరి నిద్రించె । కలువలు ముకుళించె కమలముల్ మించె
జక్కవల్ రహిమీఱె జాజెఁ జీఁకటులు।దిక్కులు జిగిఁబ్రోచె దినరాజు దోఁచె
నంతకుమునుపె నిద్రాసక్తులా జ । యంతాదికుల లేపి యందఱఁ గూడి
యవ్వలఁ జనియె రాజాత్మజుం డిటుల । మువ్వీరు దనుఁగొల్వ ముందరనొక్క
పురము గన్గొని త్రోవఁ బోయెడివారిఁ । బరికించి యేమి యీపట్టణాహ్వయము?
భూలోకనాకంబుఁ బోలు నీప్రోలు । పాలింపుచున్న భూపతి నామమేమి ?
యనిన ఝుంపాపురం బందురు దీని । ననఘ! సువిక్రముండను మహారాజు
పాలించు నిదియని పథికులు దెలుప । నాలించి పురిసొచ్చి యందు వర్తించు
నొక ముద్దియింటికి నొయ్యన నేఁగి । సుకుమారుఁ డారాజసుతుఁ డిట్టులనియె

నవ్వ! నల్వారము మేమాకట సొలసి । యివ్వీటి కరుదెంచి యెవ్వరికైన
నాకలిఁ దీర్పుదువని నిన్నువిసి మ । హాకాంక్ష నీయింటి కరుగుదెంచితిమి
వలయు నర్థముగొనివంటసేయు మని । పలికిన నమ్మ్రొద్ది పార్థివతనయ!
వంట సేయుటకేమి? వండెద నిపుడె । యింటిలో మంచినీళ్లిన్నియు లేవు
డూకొను మీయూరి కొక్కఁటే బావి । యీకడ నొకవ్యాఘ్రు మధివసించినది
పురబాహ్య మగుటందుఁ బోయినవారిఁ । బొరిగొనఁగా రాజు పోటరికాండ్రఁ
బెక్కండ్రఁ బంచినఁ బెంపేది వాసు । చిక్కిరి పులిచేతఁ జెప్పిడిదేమి?
పులి బావిచెంగటఁ బొంచియుండుటను । గలుగవు మధురోదకంబు లియ్యార
నుప్పునీళ్లను డప్పియుడుగునే? యనిన।నప్పల్కు లూకొని యనియె రాసుతుఁడు
నాలుగుకడవలు నలుగుర మూని । వాలాయ మిపుడె యీవ్యాఘ్రుంబుఁ జంపి
మంచిజలంబులు మసలక తెత్తు । మంచుఁ బల్కిన ముద్ది యలరి యిట్లనియె
పులినిఁ జంపఁగనోపు భూరిశౌర్యునకు । నెలమితోఁ దనపుత్రి నిచ్చెదననుచుఁ
జాటించఁబంచె నీజగదీశుఁ డట్టి । పోటుబం టీపురంబున లేఁడొకండు
మీలోన నొక్కఁ డామృగహంతఁ జంపఁ।జాలినవాఁడున్న క్షణములోఁ బెండ్లి
యతనికిఁ గావించు నాత్మజ నిచ్చి । క్షితిపుఁ డిమ్మాట ప్రసిద్ధ మిందనిన
మాలోన నొక్కఁ డమ్మా! పులిఁజంపఁ । జాలు సందియమేల చనియెద మిపుడె
యని కడవలుగొని యాజయంతాదు । లనుచరుల్తె రాఁగ నలప్రోలు వెడలి
పులియున్న యలబావి పొంతకుఁ బోక । బలు పొదనూటునఁ బాయక నిలిచి
యాజయంతునిఁ బిల్చి యన్న! హెచ్చరిక । తోఁ జని బెబ్బులిఁ దునిమలు చేసి
నీ విక్రమముఁజూప నృపమౌళి పెండ్లి । గావించు నీ కాత్మకన్యక నిచ్చి
యనినఁ బెండ్లికిఁబోవు నటు లుత్సహించి । యనుపమ రేఖాజయంతుఁడై, యలరు
నల జయంతుఁడు వామహస్తంబునందు । బలితంపు టొఱిదూసి బాకు ధరించి
వలకేల సితకరవాలంబు పూని । మొల దట్టి చల్లడంబులు డంబుగులుకఁ
గిలకిల నార్చుచుఁ గ్రేవలఁ బొంచి । పులి నెదిరించిన భోరున నదియు
గొటగొటధ్వనులు మిక్కుటముగా దిశలు।పటపటఁబగుల నుద్భటవృత్తిఁదోఁకఁ
దటతటఁ బలుమాఱు ధరఁ జఱచుచును।మిటమిటఁ జూచుచు మీసంబు లదుర
పైకిరాఁ దెఱనోట బాకు వేఁటుటిమి । చేకత్తి గ్రుమ్మి విజృంభించి మఱియుఁ

బొడిచిన బలుబాకుపోటు లంగిటను । బెడిదంబుగా నొచ్చి భిన్నాంగ మగుచుఁ
బులి త్రెల్లె నదిగాంచి పొదఁ బొంచియున్న।యలరాజసుతుఁడు జయత్సేనుతోడ
విజయునితో వచ్చి వీరుఁడ వీవె । భుజశక్తిఁ బులిఁ బడఁబొడిచితి వనుచు
నాజయంతునిఁ గొనియాడె నవ్వేళ । రాజశేఖరునాజ్ఞ రయమున నతఁడు
పులితోఁక తుదనఖంబులు దెగఁగోసి । బలు దట్టిపొర నుంచి పనివడి దాఁచె
నలుగురు రాసుతుల్ నాల్గుకుంభముల । జలములుగొని ముదుసలి యిల్లుచేరి
పులినిఁ జంపిన క్రమంబు గణింప నామె। యలరుచు వండి మృష్టాన్నంబు లిడిన
భుజియించి తద్గృహంబున శ్రాంతిదీఱి । బుజుమతుల్ వారు నిద్రించి రావేళ
నానాఁటి మునుమాపె యయ్యూరి భూమి।జాని దుకూలముల్ చలువలుసేయు
చాకి పెద్దసుతుండు స్వచ్ఛాంబరుండు । కోకలు మూటలు కొన్ని ఖరాళి
పై వైచి దొర వలిపంబుల మూట।దా వీఁపున ధరించి త్వర వచ్చుచుండి
దూరస్థుఁడగుచు శార్దూలంబు బావి । చేరువ నిపుడు వసించిన దేమె!
చూచెద ననుచు నచ్చో నిక్కినిక్కి । చూచుచుండఁగ వాని చుట్టంబులనిరి
యో రి శుద్ధాంబర! యో డక నీవు । దారుణవ్యాఘ్రుంబు దఱుమునో! యనక
యాదిక్కె చూచె దీ హామిక యేల! । పోదము రమ్మన్నఁ బోవక వాఁడు
వారి నిల్వఁగఁబంచి వటవృక్షు మొకటి । దారిలోనున్న సత్వరమున నెక్కి
బావిచెంగటఁ గూలఁబడి కాకజంబు । కావృతమై యున్న యప్పులిఁ జూచి
యిది డింకివేసిన దేమె? భీతిలక । గదిసి నిబద్ధిగాఁ గనివత్తు ననుచుఁ
దనవాఁడు వలదనఁ దరువు వే డిగ్గి । చని పొంచి యల్లన శార్దూలమున్న
యునికి తప్పకచూచి యో డక చేరి । తన తుప్పుపట్టిన తరవారిఁ బెఱికి
పులిమేనఁ బలుచోట్లఁబొడిచి బల్ గాయ।ములు చేసి కావరంబునఁ గిలార్చుచును
బులిఁ బొడిచితి నహో పురజనులార! । యిలఁ ద్రెల్లినది చూఁడుఁడీ! యని కూసెఁ
గునిసి మెత్తనిచోట గుద్దలివాడి । యనుమాట నిజముగా నటువలెఁ గూయు
కూఁతలు విని రజకులు పారుడెంచి । యా తెఱంగు నిబద్ధియగుట వీక్షించి
ఔర! యీపులి నెట్టులణఁచి? తీవెంత । శూరుండవని వాని స్తుతియించి మించి
చాకలివారెల్ల సంతోష మెసఁగ।మూఁకలై బహువాద్యములు పెల్లుగ్రమ్మాయఁ
బొడవడంగిన కోలుపులి నీడ్చితెచ్చి । పడవైచి రాభూమిపాలు వాకిటను

పడవైచి మాచిన్ని బాలుండు పెండ్లి । కొడుకయ్యె నీరాచకూఁతున కనుచు
వాని సింగారించి వలిపెంపుఁ జలువ । పానుపుపై నుంచి బాఱులు దీరి
మేళతాళములతో మెఱయుచునున్న । నాలో నృపాలుఁ డయ్యాశ్చర్యవార్త
విని చాకివానికి విక్రమక్రమము । జనియించుఁ బో మొ? యీజాతిహీనునకు
నాముద్దుకూఁతును నలినపత్రాక్షి । నేమాడ్కి నొసఁగుదు నివ్వార్త విన్న
సరికొరల్ నవ్వరె? శార్దూల మెచటఁ । బఱతెంచె? నేనేల ప్రతినచేసితిని?
హెచ్చిన యీవెత కేమిసేతునని । వెచ్చ నూర్చుచునున్న వేళఁ దన్మంత్రి
యగు నయార్ణవుఁడు సయ్యన నేఁగుదెంచి।జగతీశుఁగని పల్కె జాలి యేమిటికిఁ
జాకి యెచ్చట! మహాశార్దూల మెచట! । నీకార్య మపసత్య మిది నమ్మరాదు
చాకి నొక్కనినైన సాగి యెక్కడికిఁ । బోకుండ నడ్డగింపుఁడు పనిగలదు
కల్లయు నిజమును గాననయ్యెడిని । తెల్ల వారినవెన్క దేవర కనుచు
నతఁడు దెల్పుచునున్న యాసమయమున । నతివలు చని శోభనాంగి కవ్వార్త
యెఱిఁగింప వీణవాయించుట మాని । తరుణి నివ్వెరఁజెంది తహతహఁ గుంది
కళవళింపుచుఁ జెలికత్తెల కనియెఁ । బలుకులు తోఁట్రిల్ల భావంబు గలఁగఁ
విన్ననై నెమ్మోము వెలవెలఁబాఱఁ । గన్నుల శోకాశ్రుకణములు జాఱ
ననువంటి చెనఁటి యెన్నటికి నీజగతి । జనియింపవలవ దోజలజాక్షులార!
నిండుజవ్వనమేల? నెరనీటు లేల? । పండె నాతపమింకఁ బలుమాట లేల?
గరగరికలు కళాగరిమలు నేర్పు । లొరపులు వగలన్నియును గల్గఁజేసి
కడపట మొఱుకు చాకలివాని యింటఁ।బడుమని వ్రాసెఁగా! బ్రహ్మ నానొసట
నేల? వితా జాలి యీరట్టుఁ జెందఁ । జాల దేహంబు విసర్జింతు ననుచుఁ
బొగులుచునున్న నప్పూబోణు లేల । వగచెదవమ్మ! మవ్వపుఁ బువ్వుఁగొమ్మ!
నీపాలిదైవమ్ము నీకింపొనర్చు । భూపాలసుతుఁ గూర్చు బొంకుగాదనుచు
నూఱడింపుచునున్న నొక్కింతలోన । నారాజపుత్రికి నాప్తురాలగుట
నరుదెంచె నప్పేదరాలి పెద్దమ్మ । తరుణికి శోభనోత్సవవార్త దెలుప
నరుగుదెంచినముద్ది నటఁ జేరఁబిలిచి । విరులపాన్పున నుంచి వెలఁది యిట్లనియె
అవ్వారో! వింత నాదైన యభాగ్య । మెవ్వఁడో! యొకచాకి యీయూరివాఁడె
పులినిఁ జంపితినని పోటుబంటు వలెఁ । బలికెడునఁట! వానిపలుకు లాలించి

హీనుని కెటువలె నిత్తుఁబుత్రి నని । భూనాయకుం డాత్మఁ బొగులుచున్నాఁడు
ఇంతకు నోఁచితి నేమందు ననుచు । వంతఁజెందెడి దాని వదనంబుఁ జూచి
యావృద్ధకాంత యిట్లను నవ్వుకొనుచు । నోవెట్టి! నీకేల? యూఱక వగవ
వీరుఁడై పులిఁ జంపివేసినవాఁడు । వేఱె యున్నాఁడు నావీటిలో ననుచు
నారాజసుతుల వృత్తాంతమ్ము చాకి । వారి యాగడమును వరుసతోఁ దెలుప
నామెకుఁ గనకాంబరాదు లొసంగి । యామాట తమతండ్రి కప్పుడె తెలుపఁ
జెలులఁ బంచిన వారిచే విని రాజు । భళి! యని నగరిలోపలి కేఁగి ముద్ది
వలన రాజకుమారవరుల తెఱంగు । దెలిసి నయార్ణవు దీమసంబునను
బనిచిన నయ్యవ్వ భవనంబులోనఁ । దనరు రాసుతుల నందఱఁ దోడితెచ్చె
దశరథరాజనందనుల చందనమున । దృశల కింపుజనింప దీపించువారి
నలువురఁజూచి డెందము గందళింప । నల సువిక్రముఁడు సయ్యనలేచి వారి
నక్కున గదియించి యర్ఘ్యపీఠముల । మక్కువతోఁ నుంచి మధురోక్తినని యె
నేదేశమున నుందురెవ్వరితనయు । లీదేశమునకు రా నేమికారణము?
నలువుర కెయ్యవి నామంబు? లిచట । నలవునఁ బిలిఁ జంపినతఁ డెవ్వరనిన?
నారాజశేఖరుం డానుపూర్వ్విగ సు । ధారసలసదు క్తిఁ దమకథ యెల్ల
నారాజునకుఁ దెల్పి యయ్య! బెబ్బులిని । ఘోరాసి నఱికిన గురుబలాధికుఁడు
నితఁ డుశీనరదేశ మేలు సుధన్వ । సుతుఁడు జయంతాఖ్య శోభిల్లు ఘనుఁడు
మంచినీళ్లకుఁ బోయి మాపటింతల నొ । కించుక కొంచక హింసించెఁబులిని
పులినఖంబులు వాలమును దెచ్చినాఁడు । తిలకింపుఁడని సభాస్థితులెల్లఁ జూడ
ముందరనిడ ముదంబుధి నోలలాడి । రందలిజనులు జనాధీశ్వరుఁడును
జచ్చినపులిఁ దాను జంపితిననుచు । నిచ్చాకి భయములే కీరట్టు చేసెఁ
దల కొట్టివేయుఁ డిద్దారుణకర్మ్మఁ । దలఁక నీరజకుల దండుగల్ గొనుఁడు
అని సెలవిచ్చి నిజాత్మజామణికి । మనువు మంచిదిగల్గె మనభాగ్యమహిమ
నని మఱునాఁటిరే యంచితలగ్న । మున జయంతునకు నమ్మద్దుఁగూఁతునకు
నాసువిక్రముఁడు కల్యాణోత్సవంబుఁ । జేసి రాజ్యమున నిచ్చెను సగపాలు
తనచెలికాని కీదారిఁ గల్యాణ । మొనరించి కొన్ని నాళ్లుండి యచ్చోట
నాజయంతునిఁ జూచి యనియెఁ బ్రేమమున।రాజశేఖరుఁ డోయి రాజకుమార!

నీకుఁ బెండిలియయ్యె నృపకన్యఁ గూడి । యీకడ నీవుండు మేము ముందరను
జని జయత్సేన విజయులకుఁ బెండ్లి । యొనరించి పిదప నే నుద్వాహలీల
వహియించి మాక్షేమవార్తలు నీకు । నహితభీకర! తెలియంగఁ జేసెదను
ఆలస్యమేల? చయ్యనఁ బంపుమనిన । నాలోన బెగడి జయంతుఁడిట్లనియెఁ
దల్లిదండ్రులఁబాసి తగిన చుట్టముల । నెల్లను నెడఁబాసి హితులను బాసి
ఘనశీల! నిన్నేడుగడ యని నమ్మి । చనుదెంచు ననువిడి చనఁ బాటియగునె?
నీవులేకున్న యీనృపకన్య యేల? । నీవులేకున్న చో నీరాజ్యమేల ?
నేను నీవెంటనె యేఁగుదెంచెదను । రానియ్యవే! యేల రవ్వ చేసెదవు?
తమ్మునిఁ నని యశ్రుధార కన్దోయిఁ । గ్రమ్మఁ బాదములపై వ్రాలిన నతని
నెత్తి కౌఁగిటఁజేర్చి యేల చింతిలెదు? । క్రొత్తపెండ్లికుమారిఁ గూడి సుఖించు
కాలంబునం దిట్లు గాసిల్లి తిరుగ । నే లాభ మొనగూడు నేఁదెల్పుబుద్ధి
వినుము మూర్ఖించి నావెంట రావలదు।పనియున్న దిచటనే పాయక నిలుము
నామేలు గోరుమన్నా! సూరి యొకటి । క్షేమంబుదెల్పు నిచ్చెద నీకటంచు
నారాజసుతుఁడు జయంతున కొక్క । సూరికత్తి యొసంగి సుముఖుఁడై పలికె
నీకత్తి మెఱుఁగార కెన్నినాళ్లుండు । నా కన్నినాళ్లు ప్రాణము సుస్థిరంబు
జిగిదప్పి కత్తిమాసినఁ బ్రాణహాని । యగుట యెఱింగి యయ్యాపద గెడప
నేనున్న నగర మన్వేషించికొనుచు । క్ష్మానాథసుత! నీవు చయ్యనరమ్ము
వచ్చి నాచేకత్తి వన్నెలేకున్నఁ । జెచ్చెర । మెఱుఁగిడి జీవంబు లిమ్ము
ఈరహస్యం బేరి కెఱిఁగింపవలదు । ధీరుండవై సుఖస్థితి నుండు మనుచుఁ
దనచేతి హేతి యాతనిచేతి కొసఁగి । చనె జయత్సేనవిజయులతో నతఁడు
చెలికాఁడ్రతో రాజశేఖరుం డిటుల । నిలఁ జరింపఁగఁజన్న నిట జయంతుండు
నతనిమ్రోఁదిదె భాళిమై సూరికత్తి । ప్రతిదినం బరయుచుఁ బ్రజలు మేలనఁగ
నత్తమామలకు మహాహ్లాద మెసఁగ । నత్తన్విఁ గూడి రాజ్యము సేయుచుండె
కొమరుఁబ్రాయపు ముద్దుగుమ్మతోఁ గూడి । సమరసక్రీడలు సలుపగాఁ గలిగి
సరిలేని ప్రాజ్యరాజ్యసుఖంబు గలిగి । మఱువఁడు చెలికాని మది జయంతుండు
ఇలలో జయంతున కెనయైన సఖులు । గలరె? యవ్వలికథఁ గలకంఠి! వినుము
ఆరాజశేఖరుం డటువలెఁ బోయి । కారడవులు సొచ్చికటకముల్ గడచి

యేఱులుదాఁటి యనేకశైలముల । దారి క్రమించి ముందర నొక్క చోటఁ
గనియె మహోత్తాల ఘననీలసాల । కనకగోపురము శృంగాటకపురము
ఆపురిఁ జొచ్చి స్వయంపాకచతుర । యా పేదరాలిపెద్దమ యిల్లు చేరి
అవ్వ యాఁకలిగొని యలసివచ్చితిమి । మువ్వుర కిష్టాన్నములు పెట్టుమనిన
నారాజసుతున కాయమ యిట్టులనియె । నోరాజులార! యీయూరిలో వంట
చెఱుకులు లేవు తెచ్చిన స్వయంపాక । మరనిమేషంబులో నాచరింతు నన
నేల పుట్టవు కష్టె లిటనని? యవని । పాలపుత్రుఁడు వేఁడ బ్రాహ్మణి పలికె
నోరాజతనయ! యీయూరి చెంగటి మ।హారణ్యమున కొక్కయసుర యేఁ తెంచి
కష్టెలుకొట్టఁగా గమకించు వారిఁ । బట్టి పొట్టలుచీఁతి భక్షింపఁ దొడగె
వాని గెల్వఁగ నిక్కవలయేఁబుఁ దోప । కీనిశాటుని వధియింపఁగా నోపు
బలియునకిత్తు నాపట్టి నటంచుఁ । బలికె రాజ్యము సగపాలుతోఁ గూడ
సుముఖి వానికి లభించు నటన్న రాచ।కొమరుఁ డాజకరఁ గన్గొని యిట్టులనియె
బల్లిదుండగు దైత్యు భంజించు వాని । కిల్లాలిగాఁ బుత్రి నిత్తునటంచు
ప్రతినగావించె భూపాలకుం డంటి । వతివ! నాయనుజుఁ డీయన మహాబలుఁడు
ఈక్షణంబునఁ బొలియించు రాక్షసుని । నీక్షితిపతి తానె యెటోఁగెడి ననుచు
వేడ్క జయత్సేను విజయకుమారుఁ।డోడ్కొనిపోయి దైత్యుం డున్నయడవిఁ
జొచ్చి యిర్వురు నొక్కచో డాగియుండి । రచ్చెడుదైత్యున కావాసమైన
యవనీరుహచ్ఛాయ కాజయత్సేనుఁ । డవిరళోత్సాహసమగ్రుఁడై యేఁగి
యట్టహాసముచేసి యాగ్రహం బెసఁగ । ఘట్టించి రాక్షసాధమ! నిన్నుఁబట్టి
చట్టలుచీతి యిచ్చటి గృధ్రములకుఁ । బెట్టెద విందు చూపెట్టుక యున్న
పట్టణజనులకుఁ బ్రమదంబు వుట్ట । నిట్టట్టు వదరక యిందురాకోరి!
యని నారిసారించి యస్త్రాసనమున । ఘనశరమ్ములు ఘూర్ణ్వఁగాఁజూచి యసుర
గిటగిట రదములు గీటుచు లేచి । చిటచిట నిప్పులుచెదరఁ గన్గొనలఁ
బటుశూలహస్తుఁడై పటుతెంచి విలయ । చటులమేఘూర్ఛటి సంధిల్లఁ బలికె
నోరి రాజాధమ! యోడక చేరి । కాఱులాడెదవు నిక్కము బంటువలెను
నీవిక్రమమువాన్చి నిను సంహరింతు । నీవేళనని యాగ్రహించి యనేక
వృక్షముల్ పెకలించి వృష్టిగాఁ గురియ । నాక్షితీశకుమారుఁడ స్త్రసంహతుల

నవి చూర్ణములుచేసి యైదుబాణముల । దివిజారి శూలంబు తెగనేసి యార్చె
శూలంబు తునియ రక్షోవీరుఁ డలిగి । సాలమొక్కటి వైవఁ జక్కఁ గావించి
వాని బాహులురెండు వాఁడిబాణములఁబూని ఖండించి గొబ్బున శరంబొకటి
వింట సంధించి యవ్వీరశేఖరుఁడు । దంటయై వానిమస్తకము ఖండించె
కోటపై నిలుచుండి కువలయాఖ్యుఁడు ని । శాటసంహారు మహాబలోదారు
కరధృతకోదండు కదనప్రచండు । హరిహయప్రతిమాను నాజయత్సేనుఁ
గని సంతసించి యెక్కడనుండి యితఁడు । చనుదెంచెనో!యని సచివులఁ గూడి
వెస నెదుర్కొని లాటవిభు తనూజాతుఁ । డసమతేజుఁడు విజయకుమారుతోడఁ
జేరికయై జయత్సేనుఁడు రాఁగ । నారాజుఁ బొడగన్న నతఁ డాదరించి
యెవ్వరు? మీదేశ మెచటఁ బేర్మిమి । యివ్వనంబునకు మీరేల వచ్చితిరి.
చెప్పరే యన రాజశేఖరుం డనియె । నిప్పులాశను వధియించిన యతఁడు
సౌవీరదేశరాజన్యుని సుతుఁడు । ధీవిశ్రుతుఁడు జయత్సేనుఁ డన్వాఁడు
ఇతఁడు వివాహార్థ మిట కేగుదెంచె । సుతనిచ్చి సగపాలు క్షోణియు నిచ్చి
నీయొద్ద నెనరుతో నిల్పుకొమ్మనిన । నాయిలేశుఁడు భాగ్యమాయె నటంచు
నల లాటచేదిరాజాత్మజస్థితులు । తొలుతనే విని వారితో జయత్సేనుఁ
దన నగరికి మహోత్సవముతోఁ దోడు । కొనిపోయె నతనిభాగు సువర్ణసౌధ
వాసినియై చూచి వలచి రంజిల్లు । భాసురాంగి ప్రఫుల్లపద్మపత్రాక్షి
సుముఖి పూర్ణశశాంకసుముఖి నాఁ దేయి । నమర నాయనకుఁ గల్యాణం బొనర్చి
సగపాలు రాజ్యమొసంగి తత్సఖుల । కగణేయ రత్నభూషాదు లర్పించె
నా విజయునితో జయత్సేను విడిచి । పోవఁజాలక లాటభూపాల సుతుఁడు
కొన్ని నాళ్లుండి మక్కువ విజయునకు । నన్న! పెండ్లియొనర్ప నరిగెద ననిన
విని జయత్సేనుండు వెతతో జయంతు । ననువున వెనువెంట నంటిరాఁ దివుర
నొకవిధంబున వాని నొడఁబడఁ జెప్పి । వికచాబ్జమాలిక వింతగా నొసఁగి
యిప్పద్మమాలిక యెప్పుడు వాడు । నప్పుడె నన్నరయంగ రమ్మనుచు
వానితోఁ జెప్పి యవ్వలనేగె విజయు।తో నయాధ్యుఁ డతండు తొయ్యలి!వినుము
తనచెలికాండ్ర మేల్తనమే లటంచు । మనసులో నల భానుమత్సుతుఁ డెంచి
విజయునితోఁ గూడి వెసనేగి యవల । గజరథతురగవిక్రమఘోరవీర

భటసంకులంబైన పద్మినీనామ । పుటభేదనముఁ జూచి పొగడుచు డాని
కలిమి తద్రాజమార్గంబునఁ జనఁగఁ । గలశధ్వజుండను కటకేశు కూర్మి
తనయ సులక్షణాధవళాక్షి చేది । మనుజాధినాథకుమారుని విజయుఁ
గనుగొని వానిచక్కఁదనంబు వలచి । ననవిల్తుతూఁపుల నలుగుచునుండె
నావేళ లాటదేశాధీశతనయుఁ । డీవీట వంటలయి లేకడననుచు
నక్కడి జనముల నడుగుచుఁ బోయి । యొక్క శైవాలయం బొప్పెడి వీధిఁ
గడు పేదముద్ది యగారంబు చేరి । యిడు మన్నమవ్వ! మాయిద్దఱి కిపుడె
యన్న ! మహాభాగ్య మందులకేమి । యన్న ! కావలసినయన్న మే నిడుదు
నీయూరి కొకఘూోణి యిరుతలల్ గలది । రేయి యే తెంచి చరించు నెల్లెడల
ద్వారముల్ చొరఁబాఱు తలుపులువిఱుచుఁ।గోఱిలఁ జీఱు గన్గొన్న పౌరులను
నింగితో నొరయు దానిశరీర మార । యం గూడ దెగతబలాఢ్యుఁ డైన
మును శంభునియనుజ్ఞ మూషికాసురుఁడు । ఘనతపోనిష్ఠుఁడై గాండీవియున్న
యా యింద్రకీలాద్రి నగలించినట్లు । లీయూరు చొరఁబడి యెద భీతిలేక
రాయిడివెట్టెడి రాకాసియేమొ !। హాయి లేదయ్యెఁ బౌరాళికి దాని
చేత లేలని ముద్దిచెప్పిన మాట । లాతఁడు విని వరాహంబన నెంత !
యాచిన్నవానిచే నీరాత్రి దాని । పీచంబడంచి చంపించెదఁ జూడు
మెల్లి వేకువను నీవే మెచ్చువలయుఁ । దల్లిరో! యన ముద్ది తనరుచుఁ బలికె
చండవరాహంబు జడియక యితఁడె । ఖండించెనేని యాకలశధ్వజుండు
అనుఁగుఁగూఁతురుతోడ నర్ధరాజ్యంబు । నెనరుతో నిచ్చు సందేహంబు లేదు
ఈపని యిప్పుడె యెఱిఁగింతు నృపతి । కోపార్థివకుమార ! యోగిరం బాయె
భుజియింపలెమ్మని భోజనం బిడియె । విజయున కతనికి వినయోక్త లమర
నిష్టమృష్టాన్నంబు లిటుల భుజించి । తుష్టిఁజెంది శ్రమంబుదొరఁగ నిద్రను
నాయింటిలో నుండిరప్పు డమ్మొద్ది । పోయి సులక్షణపూర్ణేందుముఖికి.
నారాజసుతుల సాహసమహోద్యోగ । మేరుపాటుగఁ దెల్ప నెంతయు నలరి
తనమది విజయునిఁ దలఁచుచునుండె।నినుఁడుగ్రుంకెఁ దమంబులెనసె దిక్కులను
ఆరేయి లాటదేశాధీశసుతుఁడు । వీరాధివీరుఁడౌ విజయునిఁ జూచి
యయ్య!మాయాఘూోణి యరుదెంచువేళ।యయ్యె ధనుర్బాణహస్తుఁడవగుచుఁ

గవచాదులు ధరించి కదలి రమ్మేను । భవదీయశౌర్యసంపద గనుంగొనుచు
నంతనింతఁ జరింతుననిన నీకరుణ । కొంతగల్గినఁజాలు ఘోణి యదెంత
యనుచు జత్తాయత్తమై బయల్దేరి । తనశౌర్య మాధరాధవుఁడు సౌధమున
నెలకొని పుత్రితో నెమ్మోఁగన్గొనఁగ।బలియుఁడీతఁడు పందిఁ బడవేయు ననుచుఁ
బురజను లిండ్లతల్పులు బిగియించి । కొరలుభయంబున గుసగుస లాడ
నిటుల బయల్దేరి యెల్లవీథులను । జటుల మహాధనుర్జ్యాఘోష మెసఁగఁ
జరియించుచున్న నిశావేళ యందు । బఱతెంచె నలఘోణి పదహతక్ష్మోణి
పఱతెంచి యారాజబాలునిఁ జూచి । పొరిఁబొరిఁ జుఱుకుచూపుల నిప్పులురుల
గురుతరధ్వనులు దిక్కులఁ బిక్కటిలఁగ। బరుషదంష్ట్రాంకురప్రభలఁ జీఁకటులు
విరియఁ బ్రేఁబడిరాఁగ విజయుండు నవ్వి । శరపరంపరలు వర్షంబుగాఁ గురిసె
కురిసినశరములు కోఱలఁజీఱి । సరభసగతి మీఱి చనుదెంచు దారిఁ
గనిరాసుతుఁడురెండుకాండముల్ దొడిగి।తునిమెదంష్ట్రలునాల్గుతునియ్యలైరాల
నాతని బలుతూఁపు లంగరోమముల । చేత నల్గడలను జెదర విదిర్చి
కాఱు మొగిలోలెఁ గడురొప్పికొనుచు।మోరత్రోపునరాఁగముంగాళ్లు దునిమె
తునిమితూఁపులురెండుతొడితలల్ రెండు।వినిహతంబులుచేసి వెసఁ బేర్చియార్చె
గిరిశృంగములు గూల్చు గిరిభేదిరీతి । కిరిమస్తములు గూల్చి కేవలోద్ధతిని
విలసిల్లు విజయుని విజయంబు పొగడి । యల భానుమత్పుత్రుఁ డడ్డునఁ జేర్చె
కిరిరూపము దొరంగి ఖేచరుండగుచు । వరవిమానంబెక్కి వాఁడిట్లులనియె
నోవిమలాకార! యోమహాశూర! । యోవిజయకుమార! యొకమాట వినుము
కనకాంగదుండను గంధర్వవిభుఁడ । మునుదళాదుండను మునిశాపమునను
బెనుఘోణినైతిని బృథుబాణనిహతి । జననుత నాఘోరశాపంబు దీఱె
పోయివచ్చెద సుఖంబున నుండుమనుచు । నీయాప్తులందఱు నిర్జరాంశజులు
గావున నెచ్చెలికాండ్రితి రనుచు । భావికార్యముదెల్పి పతకం బొసంగి
కనకాంగదుఁడుచన్నఁ గలశధ్వజుండు । మనమున నలరుచు మంచిలగ్నమున
మఱునాఁడె కూర్మికుమారి నాయనకుఁబరిణయంబొనరించి ప్రాజ్యరాజ్యమున
సగమును గరిహయస్యందనసహిత । ముగ నరణంబిచ్చె ముద మెదఁబొదల
నల లాటనృపసూతి కంబరాభరణ । ములతోడ బహుమానములు పెక్కుఁజేసె

నకూర్మిసఖునిఁ బాయఁగ లేకవిజయుఁ।డొక్కఁడఁ దనుబాసి యేగునో!యనుచుఁ
గోరి పెండ్లాడిన కోమలిఁజేరఁ । డారయ మమత యెంతని యెంచవచ్చు
నీరీతి నహారహం బెడఁబాయకున్న । యారాజసుతుఁ జూచి యట నొక్కనాఁడు
భానుమత్సుతుఁడను ప్రాయంపుఁగొమ్మ।నౌనె యేలక రాత్రులటునిటు దిరుగ
నతివచిత్త మెటేంగి యనురక్తి నెరపు । మతకరింపకు ప్రేమమదియును గాక
నీవు నన్ బాయలే కిటునిల్పుకొన్న । నేవగఁ బెండ్లియా నిటమీఁదఁ దనకు
నీకు నాక్షేమంబు నిజముగాఁ దెలియుఁ । గైకొను మేనిచ్చు కల్హార మనుచు
నిచ్చి నెచ్చెలికాఁడ! యిది వాడినపుడె । వచ్చియన్వేషింపవలయు నన్నచు
నెట్టకేలకు వానియెద వంతఁదీర్చి । యట్టె తాఁబయనమై యవ్వలి కరిగె
నిటువలె నవ్వలనేగి యందొక్క । యటవిలోఁ జరియించు హరిణదంపతులు
దురపిల్లఁ దఱుము శార్దూలంబు నొకటిఁ । బరికించి యడ్డమై బాణాసనమున
సాయకంబొక్కటి సంధించి యేయఁ।గాయంబు దూసి వ్యాఘ్రము నేలఁగూలె
హరిణదంపతులు మహర్షిదంపతుల । కరణిన్హై రాజశేఖరు చెంతకేగి
దీవించి యోబలాధిక! వ్యాఘ్రభీతి । నీవలనఁ దొలంగె నీవుధన్యుఁడవు
ముందర బహుశుభంబులు నీకుఁగలుగు । నెందుఁజూచినఁ బరహితచర్య నీది
మూలికయిది గ్రహింపుము క్షుత్పిపాస । లాలస్యరోగాదు లడఁగించు ననుచు
నొక మూలికారత్న మొసఁగి వారరుగ । వికసితహృదయారవిందుఁడై యతఁడు
సరగున నవ్వలఁజని యొకచోటఁ । గరి మీఁద లంఘించు కంఠీరవంబు
నుద్యచ్ఛరంబున నుదుటార్పు నదియు । విద్యాధరాకృతి వెలయ నిట్లనియె
రాజశేఖర! దృఢవ్రతుఁడన్ దపస్వి । నాజడబుద్ధి కెంతయుఁ గోపగించి
పంచాస్యరూపంబు ప్రాపించుమని శ । పించి నేవేఁడ నీపే రుగ్గడించె
నీకతంబున శాపనిర్ముక్తి యయ్యె । నాకూర్మికన్యక నవమోహనాంగి
భువనసుందరియను పువ్వారుబోణి । నవనీశతనయ! నెయ్యమున నీకిత్తు
హింగుదీపురమేలు నిలఱేనిపుత్రి । యంగనామణి మోహనాంగియు నీకు
పత్నియౌనపుడె చేపట్టుము యువతి । రత్నంబు నాసుత రాజేంద్ర! యనుచు
నొక రత్నమాలికయును దివ్యశక్తి । యొకటియు నతనికి నొసఁగి వాఁడరిగె
పరహితచరితులౌ ప్రభువుల కిటుల । సిరులు తమంతనె చేకూరుచుండు

మునియుగంబిచ్చిన మూలికామహిమమున షడ్రసాన్నముల్ ముందరనిలువఁ
బరిశుద్ధుఁడై మెక్కి పాటలీవకుళ । కురవకమందారకోవిదారాది
తరుచయచ్ఛాయలఁ దనుగతశ్రాంతి । మరుదంకురంబులు మాన్ప నొకింత
హాయిఁజెందఁగ వినసయ్యె కుయ్యో మొ । రో యిందు దిక్కు లేదాయను కూఁత
అయ్యో ర్తరవ మతఁడాలించి లేచి । చయ్యన ధనురాది సాధనోత్కరము
ధరియించి బెట్టుకూఁతలు పెట్టు చోటి । కరుదెంచి యటఁ దస్కరావళిచేత
గడగడ వణఁకుచుఁ గన్నీరుదొరఁగ । సుడివడి నలుగడల్ చూచుచుఁ బ్రజల
రాక గోరెడువాని రతనాలసంచి । యీక పెనంగుచు నీడ్సులఁ బడెడి
వాని నొక్కని వృద్ధవైశ్యునిఁ జూచి । హా నిలునిలుఁడని యట్టహాసంబు
సేయుచు వారిభర్జించి యింకెందుఁ । బోయెదరని రోషమున నడ్డగించి
కరవాల మొరదూసి కడికండలుగను । నటికేఁ జోఁదులపదుంద్ర నొకింతలోన
ద్రుచ్చుల నివ్విధంబున వధించుటకు । నచ్చెరువడి వైశ్యుఁ డానందమొంది
యారాజతనయుని కంజలిచేసి । భూరివాగ్గుంభనంబుల నిట్టులనియెఁ
గరుణ శ్రీహరివొ? విక్రమమున హరివొ?।యురు తేజమున హరివొ?గనంబడదు
బలహరుండవొ?భాగ్యపటిమ రౌద్రమున।నల హరుండవొ? తెలియఁదరంబుగాదు
ఆ కుమారుఁడవొ? జయాప్తి చెల్వమున । శ్రీకుమారుఁడవొ? వర్ణింపఁగారాదు
పులిగుంపులోఁజిక్కి పొలుపరియున్న । యల లేడిఁబోలి తా నడలుచునున్న
కడువడి నాకస్మికంబుగా వచ్చి । యడలార్చి మోడకుమని గారవించి
చోరులఁ గ్రూరుల శూరుల దుర్వి । చారులఁ ద్రుంచి నాజాలి తీర్చితివి
నాయిలువేల్పవో! నాదుపెన్నిధివొ! । నాయాత్మరంజిల్లు నాగహారుఁడవొ!
నీరీతిఁ గననేర నిష్కారణోప । కారివి నీవంచు గణియించు వైశ్యుఁ
గనుగొని రాజశేఖరుఁ డాదరించి । యనియె సుధామధురాలాపములను
నెక్కడ నీపురంబేమి నీజాతి? । యిక్కడి కీవేళనేల వచ్చితివి?
నీనామమెయ్యది? నీవృత్తియేమి? । యానుపూర్వ్యగఁ దెల్పుమన నాతఁడనియె
బుధవంద్య! హింగుదీపురమను నగర । మధికవైభవమున నమరు నిచ్చిటికి
నామడదవ్వున నప్పురంబేలు । ధామార్యముఁడు సితధ్వజుఁడను రాజు
కల డానృపతి కొక్కకన్యలలామ । లలితాంగధామ హేలావతీనామ

యూరాపు విహరించు నారామసీమఁ । జేరి నిశావేళఁ జెలువ యొక్కరిత
యూరక విలపించుచుండును దెల్ల । వారినదాఁక నెవ్వరికిఁ గన్పడదు
దాని శోకముదీర్చు ధరణీశసుతునిఁ । గాని యన్యునిఁ బెండ్లిగానోప ననుచుఁ
బ్రతినచేసినది భూపాలకుమారి । యితరుల కలవిగా దింతి యేడ్పుడుపఁ
గొంద ఱుద్ధతులు రాకొమరులు వచ్చి।యందు సుందరిఁగాన కయ్యార్తరవముఁ
బాపగాలేక విభ్రాంతులై పోయి । రోపుణ్యపురుష! నీవోపు దప్పనికి
నల యింతి వెతదీర్చి యవనీశపుత్రి । నెలమిఁ బెండ్లాడి నేనిచ్చెడు సుతను
సుభగఁ గల్యాణమై సుఖమొందు మయ్య।శుభలీల నేనువైశ్యుఁడ నసంఖ్యేయ
ధనయుక్తుఁడ హిరణ్యదత్తుఁ డన్వాఁడ । ధనదత్తజుఁడ సితధ్వజుని యాప్తుఁడను
నచ్చినవా రియ్యనగు నర్థమడుగ । నిచ్చోటిపేట కేనేతెంచి మగిడి
వచ్చుచో మ్రుచ్చులువచ్చి ప్రాణములు । పుచ్చుకోఁ దివిరినఁ బొదివి యేదితివి
ప్రాణదాతవు భయత్రాతవు నీవు । దీనశరణ్య! నీతెఱఁగు నేవినఁగఁ
దగువాఁడనేనిఁ గొంతగణింపుఁ డనఁగ । నగుచు నారాజనందనుఁ డిట్టులనియె
నూరవ్యశేఖర! యుచితజ్ఞుఁడవు మ । హారాజవరులకు నాప్తుండ వీవు
విన న్వాఁడవుగావె! వినుము నాచర్య । యని తనవృత్తాంత మంతయుఁ దెలిపి
హింగుదీపురమునకేగె నవైశ్వ । పుంగవుతోఁగూడి భూపాలసుతుఁడు
ఈరీతి నప్పరి కెలమితో నేగి । యారాజశేఖరుం డనురక్తుఁడైన
యూరవ్యమణి యింటనుండె హితోప।చారంబు లతఁడునిచ్చలు నొనర్పఁగను
నతని శౌర్యప్రతాపాదు లయ్యారి । క్షితిపతి యవైశ్యుచే విని యలరి
యందలం బనిచి చయ్యనఁ బిల్వనంప । నందుపై నెక్కి పౌరావళి పొగడ
రాజుచెంగటికేగి రాజు పూజింప । రాజితమణిపీఠి రహిఁ గూరుచుండెఁ
గూర్చున్న యారాచకొడుకును దివ్య । వర్చస్విఁ గని సితధ్వజుఁ డిట్టులనియె
రాజశేఖర! పరాక్రమచిద్విలాస । రాజశేఖర! మహారాజవు నీవు
నీకెనయెవ్వారు నీరూపురేఖ । మా కుమారితచూచి మరులుచెందినది
అలకన్నెప్రతిన యెట్లైన నీడేర్ప । వలయు నీకవ్వింత వచియింతు వినుము
దయ్య మో? లేక భూత మొ? దేవసతియొ।యయ్యింతి తెలియరాదయ్య!యెవ్వతియొ?
నడు రేయి యేడ్చుచున్నది తోఁటలోన।బొడగానఁబడదందుఁబోయి చూచినను

దాని శోధించి పోదమిమ మీచేతఁ । గాని యన్యులచేతఁగాదు నిక్కముగ
ననిన మహాభాగ్యమాయె నీరేయి । చని దానితెఱఁగు విచారింతు ననుచు
నగరిలోనన నె యుండె నరనాథసుతుఁడు । మగువ హేలావతి మదిని రంజిలఁగ
నానడురేయి యుద్యాననంబు । లో నొక్కయేడ్పు పెల్లుగ వినంబడిన
దిగ్గన లేచి యుద్భ్రాత్తితో ధైర్య । మగ్గలంబుగఁ జంద్రహాసంబు పూని
పరమేశ్వరిఁ దలంచి భసితంబు నొసట।ధరియించి యట్టె యుద్యానంబు సొచ్చి
యొక మాధవీమంటపోపాంతసీమ । ముకురాస్య నొక జగన్మోహనగాత్రిఁ
బట్టి బెట్టుగఁగొట్టి బాధలఁబెట్టు । కట్టిడి రాక్షసిఁ గని యాగ్రహించి
చెంగటికేగి యోసి దురాత్మ్నరాల! । శృంగారవతినేల చెనకెద వనుచుఁ
జే సూరికత్తి దీసి భిరీన ముక్కు । గోసివేసిన నది కుయ్యో! యటంచు
నచ్చోట నిలువలే కటుపారిపోవ । నిచ్చటి కిఁకవచ్చి తేని నీశిరము
నసిధారఁ దెగవేతునని వెంటనంటి । వెసఁ దరిమిన భ్రమొక్కి వేఁడుచు బెగడి
పరువెత్తి నెన్నఁడీపడఁతిఁ జేరనని । మఱలి యేడ్పుడిగిన మానినిఁ జేరి
యడలకుమని కరుణాబ్ధి యూఘనుఁడు । జడుపుదీరిచి ప్రేమసంధిల్లఁ బలికె
నెవ్వతెవీవు? పేరేమి? నీతండ్రి । యెవ్వఁడు? నీవిటకేల వచ్చితివి?
యీదైత్యరాలు నిన్నేల బాధించు? । నేదిహేతువు దీని కెఱిఁగింపు మనినఁ
గన్నీరుగ్రుక్కుచుఁ గ్రక్కున లేచి । యన్నాతి భ్రమొక్కి యిట్లని విన్నవించె
నో యభినవమదనోజ్జ్వలాకార ! । యో యనాథజనావనోత్సకాధార !
నాకథవిను మగంధర్వులలో మ । హాకీర్తిశాలియై యమరేంద్రు నొద్ద
నలరాడు మణికంధరాఖ్యగంధర్వ । తిలక మాయనకు సతీరత్నమగుచు
నమఱు విభావతియను దేవకన్య । కమలాక్షునకు రమాకామినిఁ బోలి
వారికి నిటువలె వనరెడు నేను । గారాబుబిడ్డనై కలిగితి నధిప!
యిందురేఖకు సామ్య మెన్నఁదు రనుచు । నిందురేఖానామమిడి ప్రోఁదిసేయ
కలితగాంధర్వాదికళలెల్ల నేర్చి । యెలఁబ్రాయము వహించి యేనొక్కనాఁడు
చెలువలతోఁగూడి క్షితి మెలంగుచును।బులహాశ్రమమునకుఁ బోయి యచ్చోటి
తలిఱలు నలఱులు తఱచు గిల్లుచును । ఫలములుకాయలు వట్టి కోయుచును
దీవెలుభ్రమించుచుఁదిరుగు తత్పుత్రిఁ । గేవలనై శవక్రీడల నచట

నాడుచు మముఁదిట్ట నలిగి కొట్టితిమి । యేడిచెనది దానియేడు పాలించి
యప్పులహుఁడు వచ్చి యలుక కన్గొనల । నిప్పులురాల నన్వీక్షించి పలికె
నోసి దుర్మదురాల! యోడకపట్టి । యీసున నాపట్టి నేలగొట్టితివి?
యీనేరమున నీవు హింగుదీపురి మ । హానిశాటవధూటి కగపడి రేలు
నయ్యయో!యనువార లచ్చట లేక । న య్యయోముఖి కొట్టి యీపదఁబెట్ట
నేడాది గాసిల్లు మిదివిని దొడ్డ । వాఁడొకకాచూలి వచ్చి నిన్ బరచు
నానుతి నదలించి యసిదూసి ముక్క । గోసివేసిన నదికూయుచుఁ బరచు
వానిచేఁ దీఱ నీవంత నీకతఁడె । పో నాథుఁడగు నిఁకఁబొమ్మని చనియె
నమ్మాట కెదురాడ నళికి నన్గన్న।యమ్మయు మాతండ్రి యడలుచుండగను
నీ యయోముఖి రాత్రు లీడిచితెచ్చి । సేయు బాధలదేమి చెప్పఁగారాదు
తీరె రాకాసిచేతి యుపద్రవము ల । కారణకారుణికజనాగ్రగణ్య!
యని పల్కుచున్నెడ నక్కన్నెఁ గన్న । జననియు జనకుండు చదలెల్ల వెలుఁగ
హెచ్చు విమానంబు లెక్కి శీఘ్రమున।వచ్చి యాఘను ప్రభావము లెంచునపుడు
తనపుత్రి భువనసుందరినిఁ దోడుకొని । ఘనుఁడు విద్యాధరాగ్రణియు నేతెంచె
నంత సితధ్వజుం డరుణోదయమున । నంతఃపురము పురం బతివై భనమునఁ
గై సేయఁ బనిచె నొక్క ముహూర్తమున నె।భూసురానుజ్ఞ నా భూపాలతుఁడు
హేలావతీకన్య నిందురేఖా పి । కాలాప జ్యోతిర్ముఖాత్మజ యైన
భువనసుందరి వైశ్యపుత్రియా సుభగ । నవిరళోత్సవశాలియై పెండ్లియాడె
మణిసహస్రము లిచ్చె మణికంధరుండు । గుణశాలి జ్యోతిర్ముఖుం డిచ్చెఁ బెక్క
వగల సొమ్ములుసితధ్వజుఁ డిచ్చె నెమ్మి।సగము రాజ్యముతోడఁ జతురంగబలము
వివిధాంబరములతో వెలలేని వస్తు । నివహంబు లయ్యల్లునికి వైశ్యుఁడిచ్చె
రాజశేఖరుఁ డిత్తెఱఁగున నల్వురు ప । యోజగంధులఁ గ్రమంబొప్పఁ బెండ్లాడి
మామలు ప్రియమంద మణిమయసౌధ । సీమల వారితోఁ జెలఁగి క్రీడించెఁ
బుక్కటివిడెమిత్తుఁ బొలఁతి రమ్మనుచుఁ।జిక్కించుకొనియొక్కచెలిమోవినొక్క
దిద్దెదఁ గస్తూరితిలక మంచొక్క । ముద్దులాడి ముఖాబ్జమున మోమునఁ జేర్చు
గంధం బలందెద కలికి! యంచొక్క । చందనగంధి బల్‌చన్నొన లలము
పనియున్నదిటురమ్ము బాల! యంచొకస । ఖనిఁ జేరఁబిల్చి బిగ్గరఁ గౌఁగిలించు

నిటు లానవోఢల నెనసి పాంచాల । విటశిఖామణి లాటవిభుతనూభవుఁడు
విహరించు నొకవేళ విద్యాధరాంబు । రుహలోచనాకుచాద్రులఁ బవ్వళించి
యిరవొందు నొకపూట నిందుశేఖరాంబు । ధరకచాధరసుధాధారలఁ జొక్కి
కేళి యొక్కెడసల్పు కృతకాద్రిగతన్య । పాలబాలాస్యచుంబనగుంభనముల
నుల్ల'సిల్లు నొకప్పు డూరవ్యకన్య । కోల్లసన్నర్మమర్మోక్తి లూకొనుచు
నిచ్చవచ్చినరీతి నిటుల వర్తిలుచు । నచ్చతురాత్మకుం డటనొక్కనాఁడు
తనమామను హిరణ్యదత్తునిఁ జూచి । వినయోక్తి వింతలు వినఁగోరిపలికె
మామ! మీ రీయబ్ధిమధ్యాంతరీప । భూములు దేశముల్ పురములు వనులు
గనుగొని యుందురుగా బేరములకుఁ । జనుచు మీరెఱుఁగని స్థలములులేవు
గన్నని విన్నవి గలవె చోద్యంబు । లన్న హిరణ్యదత్తాహ్వయుం డనియె
వినవయ్య! మరకతద్వీపమన్ ద్వీప । మున రతనపుబేరములు సేయఁదలఁచి
నావపై నెక్కి కొందఱు వణిగ్జనులు । నావెంట రాఁబోయి నవ్యరత్నములు
నలదీవి గొని యూరి కరుదెంచువేళ । బలుగాడ్పుచేఁ గొట్టువడి త్రోవఁదప్పి
యోడ యద్భుతమైన యొకదీవిఁజేరె । పైఁడికోటలు గానఁబడియె నచ్చోట
బహుగోపురంబులు బహుసౌధములును।బహురత్న భవనముల్ పరికించి యచట
జీనివేసిన యోడఁ జెచ్చెరడిగ్గి । యానికటమునఁ బడ్డాకరం బొకటి
గని యందు వంటలు గావించికొనఁగఁ । జనుదెంచె నటకొక్క జాలరివాఁడు
చనుదెంచి యిటకేల చనుదెంచినారు।దనుజాధిపుఁడు వజ్రదంష్ట్రుఁ డన్వాఁడు
నికోటలోనుండు నిది వేల్పులైన । నిక్క చూడఁగలేరు నిక్క మీమాట
నరులుమీరెంత? వంటలుచాలు వేగఁ । బరువులెత్తుఁడు దైత్యపతి సింహళేశు
తనయఁ బ్రభావతిఁ దనపుత్రిగాఁగఁ । బెనుపుచుఁ దనతోడఁ బెనఁగి జయింపఁ
గలవానికిత్తు నక్కన్య నటంచుఁ । బలికినాఁడనుచుఁ దెల్పఁగ వానిమాట
విని మేముభయమంది వెసవంట లుడిగి । చనుదెంచితిమి నావఁ జయ్యన నెక్కి
మనుజేశ! దాని నిర్మానుష్యనగర । మని చెప్పఁగావింటి మను వైశ్యుఁజూచి
యారాజసుతుఁడను నద్దీవి కేగి । పోరాడి దనుజునిఁ బొలియించివాని
పెంపుడుకూఁతును బెండ్లాడి వత్తు ! నంపవేయన మామ యల్లుని కనియె
నిలరాయ! భువనమోహినులు గేహినులు । నలువుర నీపాదనలినంబు లెపుడుఁ

బాయఁజాలక ప్రియంపడి యూడిగములు । సేయ రాక్షసపుత్రిఁ జింతిపనేల
కొంచాన నిర్జింపఁగూడునే వాని । నెంచగూడని మాయలెఱుఁగు నయ్యసుర
యనిన వల్దనకుఁ డయ్యసుర నెట్లైనఁ । దునిమి ప్రభావతిఁ దోడ్తెత్తు ననుచు
నల్ల భూపతివేఁడ నవై శ్యుఁ డతని । యుల్ల ంబురంజిల్ల యోగీంద్రుఁ డొకఁడు
మును దనకిచ్చినమూలికల్ మూఁడు । నెనరుతోనిచ్చి వింటివె! రాజతనయ!
యిది యదృశ్యక్రియ యిదిఖేచరత్వ।మొదవించునది జయంబొసఁగుఁగయ్యముల
ఖచరమూలిక పాదుకలఁజెక్కి యొకిక్కి।యచటికిఁ జను మదృశ్యాకృతి ననుచుఁ
దెలిపిన నొకరత్నదీపిక సుభగ । కెలమితోనిచ్చి యోయింతి ! యీరత్న
దీపప్రకాశంబె తెలుపు నాక్షేమ । మేపొలంతులకిది యెటేఁగింపవలదు
అతిశీఘ్రమున వత్తుననిచెప్పి వైశ్య । పతి శుభోక్తులఁబంపఁ బాదుకల్ మెట్టి
బుద్ధి నిర్మానుష్యపురము దలంచి । యద్ధీరుఁ డసురకన్యక మేడ వ్రాలె
మేడపైవ్రాలిన మిహిరుఁబోల్ వానిఁ । జూడ వేడుకయైన సొబగులవాని
మొలకనవ్వులవాని ముద్దునెమ్మోగము।కళలఁ బూర్ణసుధాంశుఁ గడసించువాని
నారాజసుతుఁ జూచి యచ్చెరువంబు । కూరిమియును గడల్కొనఁ జేరవచ్చి
యాప్రభావతిపల్కె నంజలిచేసి । యోప్రభాకర తేజ। యోమహారాజ!
యెక్కడనుండుదు? రెద్ది మీనామ? । మిక్కడి కేరీతి నేగుదెంచితిరి?
నామచ్చటలుదీర్ప ననుఁ జేరు చంద । మామ యల్లుఁడవని మనసునఁ దోఁచె
నని యొప్పనడిగిన నచ్చెలి కతఁడు । తనతల్లి దండ్రుల తనయూరిపేరు
సంగతోక్తులఁదెల్పి చతురుఁడై పలికె । హింగుదీపురినుండి యింతి నిన్ జూడ
వచ్చితి మెచ్చితి వలచి నీచెలువ । మెచ్చటఁ గనివిని యెఱుఁగనిసాటి
మరువంపుమొలకవో? మన్మథుండెక్కి।నొఱపురాచిలుకవో? యెయ్యారి! నీవు
హొన్నుసలాకవో? యుల్లాసమెసఁగు । క్రొన్నెలరేఖవో? కోమలి నీవు
నీలవేణీమణి! నీచిన్ని మొగము । చాలదు నీగొప్ప జళుకుఁగన్నులకు
తరుణి యద్వీరహార్థితరణివై జాలి । హరియించి గాంధర్వమను వివాహమునఁ
జేకొని కౌఁగిటఁ జేర్చికొమ్మనిన । నాకన్నె సిగ్గున నోదలవాంచి
నామేను నాజవ్వనంబు నీసొమ్ము । సామి! చిత్తమునకు సరిపోవునటుల
దయసేయుఁడనుచుఁ గైదండ యొసంగి । ప్రియమునఁ దనకేళిగృహమున కతనిఁ

దోకొనిపోయి చెందొవలపానుపున । నేకాగ్రమతి నుంచి యింపువహించి
కప్పురవిడెమిచ్చి గమ్మను తావు । లుప్పతిల్లెడి గంధమొప్పుగా నలఁది
సురటి వీచుచునున్న సుదతినిఁ దిగిచి । యురమున నిడికొనె నుర్వీశ్వరుండు
నురము కుమ్మెలువోవ నుత్పలగంధి । గురుకుచాగ్రంబులఁ గ్రుమ్మి పైయాడి
కుమ్మెలువో రొమ్మ్రగ్రుమ్మిన ముద్దు।గుమ్మ చెక్కిలిమీఁది గోట భూవిభుఁడు
చెక్కిలి కొనఁగోరఁ జీరిన విభుని । చక్కెరకెమ్మోవి సరిపంట నొక్కెఁ
గెమ్మోవి నొక్కిన కిసలోష్ఠి మోము । మున్మ్మరంబగు ప్రేమ ముద్దాడె విభుఁడు
మొలకనవ్వుల మోము ముద్దాడు మగని । గళమున నఖరేఖలు నిల్పె నెలఁత
గళమున గోరుంచు కలకంఠి నీవి । చెలువుండు జార్చిన చెలువ సిగ్గునను
గ్రక్కునఁ గరములఁ గనుదోయి మూసి । పక్కలో నొదిగినఁ బైకొని యతఁడు
కలరవస్ఫురణల గళరవం బెసఁగ । వలిగుబ్బలలముచు వలపు రెట్టింపఁ
గళలంటి కరగించి గాఢపుంభావ । కలనఁ బ్రౌఢనుజేసి కడు గారవించె
నీరీతిఁ దనుఁగూడి యెడఁబాయకున్న । యారాజు నొక్క యేకాంతసౌధమున
నునిచి యచ్చెలి యుచితోపచారంబు । లొనరింపుచుఁ జరింప నొకకొంత వడికిఁ
దామసధరుఁ డతిత్వర నేగుదెంచె । నేమి చేసెదవమ్మ? యింటిలో ననుచు
నతివ మజ్జనభోజనాదు లమర్చి । యతని కెప్పటియట్ల హైమసౌధమునఁ
జలువపానుపుఁబన్న శయనించి కొంత । యలఁత దీరిచికొని యక్కన్నెఁ జూచి
కోకిలమెనయని క్రొమ్మావిచిగురు । టాకు కైవడిఁ దేటి కందగారాని
పూవుగుత్తివిధంబుఁ బొరసి యిన్నాళ్లు । నీవుంటి విపుడేమి నెలఁత! నీమోము
వాడిన దెవ్వఁడువచ్చి నీతోడఁ । గూడినాఁ డెఱిఁగింపు కొంకక యనినఁ
దెలిగంటియను హింగుదీపురి నుండి । బలవంతుఁ డొకరాచపట్టి యిచ్చటికి
వచ్చినాఁ డతనిచెల్వము చూచి వలచి । యిచ్చ నిన్ దలఁచి నీవేమి సేయుదువొ?
యనుభీతిచే విన్నయైయున్న దాన । ననిన బెట్టుగనవ్వి యసురేంద్రుఁడనియె
కామిని! ననుగెల్చికదమటి నిన్నుఁ । గామించఁదగు వానిఁ గనుగొనవలయుఁ
బిలుచుకరమ్మన్న బింబౌధరోష్ఠి । యల రాజసుతుఁజేరి యవ్వార్తఁ దెలుప
దానిచే నటమున్నె దైత్యుని బలిమి । యూనరేంద్రకుమారుఁ డాలించి యుసికి
నతివేగమున లేచి యటవచ్చి నిలువ । నతనియుద్ధతిఁ జూచి యసుర భీతిల్లి

యితఁడు నాతోఁ గలహింపఁగానోపు । ధృతిశాలియీనని యెద నిశ్చయించి
రావోయి!కూర్చుండు రాజకుమార!।యీవు నన్ మారొకనియెపుడు పోరెదవు?
పోరాడి గెలిచి నాపుత్రిఁ గైకొనుము । నా రాజతనయుఁ డోనక్తంచరేంద్ర!
యెల్లి ప్రొద్దునలేచి యీవును నేనుఁ । జెల్లుగా యుద్ధంబు సేయుద మనుచు
నొడఁబడఁజెప్పి యందుండి యారేయి । గడచి కాంతయనుజ్ఞఁ గదిసిన యసుర
నిద్దురమాని యాన్నపుఁ డాజిఁ బోరి । పెద్దనిద్దురఁ జెందెఁ బృథుఖడ్గనిహతి
నిహతుఁడై యాదైత్యనేత ఖేచరత।శుచి మోనియను మునీశుఁడు స్నానమునకు
నదికి వేకువనేగ నవ్వలకేను । పొదనుండి గర్జింపఁ బొలఁదిండి ననుచు
వెఱచిపారఁగ లేచి వికవిక నగిన । నెఱిఁగియోరి సుకంఠ! యిదిముచ్చటైన
మూడువేలబ్దముల్ మొఱకురక్కసుఁడ । వై డాక లోకుల కా ర్తిసేయుచును
జరియింపుమన్న నేఁ జాలఁ బ్రార్థింపఁ । గరుణించి రాజశేఖరునిచే నొచ్చి
యెప్పటిరూపు వహించెద ననియె । నప్పుడాడినయట్లు లడఁగె శాపంబు
ననుమతిచ్చిన నమరేంద్రునిపురికిఁ । జనియెద నాయెడ సౌహార్ద మునుపు
నా పుత్రితోఁగూడి నరనాథ! బహువి । ధోపభోగము లొందుచుండు మిప్పరిని
అని యాప్రభావతి నతని కొప్పించి । చనియె సుకంఠుడు జంభారిపురికి
ధనవస్తువాహన ధాన్యాదికముల । నెనలేని యప్పరి నింతితోఁ గూడి
నిఖిలభోగంబులు నెమ్మిఁ జెందుచును । సుఖియించె సురరాజుసొబగున నతఁడు
ఈరీతి నలరుచు నిలరాయఁ డాతఁ । డారామతోఁగూడి యారామకేళి
సలుపుముచ్చటలు హెచ్చుఁగనొక్కనాఁడు । నెలకొన్న వేడ్కనంతిపురంబువెడలి
పురి పశ్చిమమున నంభోరాశి చెంతఁ । బరగు సరోవరప్రాంతవన్యలను
మెలఁగుచు వింత లామెలఁతకుఁ బ్రేమఁ।దెలుపుచు శ్రాంతిచెందిన యింతిఁగూడి
యక్కొలంకున కేగె నపుడు ప్రాఁగెంపు।చెక్కడంపు మెఱుంగు చికిలిపాదుకలు
మెట్టుక మగరాలమెట్లపై డిగ్గి । తొట్టిన తృషదీఱఁ దోయముల్ ద్రావి.
వనజాక్షి వెలువడి వచ్చుచో జాతి । చని యొకపాదుక జలములోఁ బడియెఁ
బడి రత్నమయమకూటఁ బాదుక మునిఁగి । కడువడి సోపానగతి దూరమరిగెఁ
బడిన పాదుక యెత్తుపనిఁబూను మగనిఁ।బడఁతిమాన్చెప్రయాసపడనేల యనుచు
రవి యస్తగిరిఁజేరె రమణితోఁగూడి । భవనంబుఁజేరె నా ప్రభుశిఖామణియుఁ

దత్కాలమున శకంధరభర్త రివ్వలి । పత్కరుఁడు హిరణ్యబాహుఁ డన్ రాజు
తనవర్తకు మహార్థదత్తుని మణులు । గొనితేరఁ బనుపఁ గ్రక్కున నోడయెక్కి
పోసఁగు మణిద్వీపమున కేగి యచట । నసమానమణులకు నర్థంబు లొసఁగి
కొని యోడయెక్కి గ్రక్కున వచ్చివచ్చి । కనియె నిర్మానుష్యకటక మాజాడఁ
గని వెరగంది యక్కడ నోడడిగ్గి । వనజాకరము చేరువకుఁ బోయివిడిసె
నోడకళాసులం దొప్పెడి సరసి । నేడఁజూచిన లెక్కయిడరాని మీలఁ
జూచియొండొరులఁబిల్చుహెచ్చువలలు।వైచితియ్యఁగఁబ్రభావతివామపాద
పాదుక చిక్కనఁ బరికించి యెత్తి । మోదంబుతో వైశ్యముందర నిడిరి
అది వాఁడుదాచి నిజాధిపుచెంతఁ । బొదలువేడుక నుంచి పొడఁగన్న యపుడె
యప్పాదుక శకంధరాధినాయకుఁడు । తప్పక కనుగొని తనసభవారిఁ
బిలిచి పూరుషుఁ డంఘ్రిఁబెట్టెడి నదియొ?।మొలఁత పాదంబున మెట్టెడి నదియొ?
యిప్పావ యెవ్వరి దెఱిఁగింపుఁ డనిన । నప్పు డూరకయుండి రాసభవాహ
అంత నచ్చటికి శిల్పాచార్యుఁ డొకఁడు । వింతగా వచ్చి భూవిభున కిట్లనియె
నిది కాంతమెట్టెడి దిలరాయ! పురుష । పదఘట్టితముగాదు భావించినాఁడ
నా విని సతి చరణంబునమెట్టు । పావయే యింతసౌభాగ్యంబు గాంచె
దానిమూపెట్టిదో తర్కింపఁదరమె? । నా నవ్వి శిల్పి యన్నాతిరూపంబు
హొన్నునురతనంబులొసఁగినఁబ్రతిమ।పన్ని తెచ్చెదఁజూడుప్రభుచంద్రమనుచుఁ
దననేర్పు మెఱసి కుందనమునఁ బ్రతిమ । యొనరించి ముందరనునిచినఁ జూచి
కడుమెచ్చి శిల్పికిఁ గాంక్షితంబిచ్చి । వెడవిల్తునకుఁ జిక్కవిభ్రాంతుఁడగుచు
నిబ్బొమ్మఁ బోలినయింతి యున్నెడకు।గొబ్బునఁజని దానిఁ గొనివచ్చు ఘనుఁడు
గలిగిన వానికి ఘనత నాయేలు । నిలలోన సగమిచ్చి యేలింతు ననుచుఁ
జాటింపఁబంచిన జను లాలకించి । యేటిభ్రాంతి జనించె నీతని కనుచు
ననుకొని రెవ్వారు నప్పనికొప్పి । కొనరై రిది సురాధ్వకుసుమం బటంచు
భ్రాంతిహెచ్చుహిరణ్యబాహుఁడాకాంతఁ । జింతసేయుచునుండెఁ బ్రీతిపతియిటులఁ
జాటించినది విని జరభి పిశాచి । తాటోటుగత్తె భూతకివంటి గొంటి
కల్లరి జూటు బికారి కరాళి । చుల్లకురాలు ముచ్చు తుటారి బడుగు
చెడుగు బజారి కుచ్చితురాలు నీలి । గడుసు టక్కరి జోగి గ్రక్కునముడుసు

మటుమాయల పెడారి మందులమారి । కుటిలాత్మ్మరాలు వెక్కుఱు తక్కులారి
యిప్పాపజాతి యంచెల్లరు రోయ । నప్పురి దుశ్శీలయను వృద్ధవిధవ
పాయంబునాఁడెల్లఁ బలువికారములఁ । బోయి కావలసిన బొజ్జఁగులఁ గూడి
పలుగూళ్లు గుడిచిన పాపిష్ఠియగుట । కొలువున కేగి సంకోచంబు లేక
పలికె నోయి హిరణ్యబాహుండ! నీవు । వలచిన నిండుజవ్వని వెదకుచును
బోయి నిర్మానుష్యపురముఁ బ్రాపించి।యాయింతి నెలయించి యైదాఱునెలల
లోపలఁ దెత్తు నేలుదుగాక దాని । నీపనిచేసిన నేమి యిచ్చెదవు?
నిజముగాఁ దెల్పుము నీవన్న భూమి।భుజుఁ డును ముద్ది! యప్పాలఁతిఁ దోడుకొని
యరుదేర నీకిత్తు నర్ధరాజ్యంబు । సరగునఁ జనుమంచు జతయైన యోడ
మాలిమికాని వెంబడి నెక్కఁబనుప । నాయోడయెక్కి చయ్యన దీవిఁజేరి
యందు కళాసులకనియె నేవచ్చు । నందాక మరుగుగా నబ్ధిలో నావ
నిలుపుఁడి జీని సంధించి యటంచుఁ । బలికి రేవునడిగ్గి పద్మాకరంబు
కడఁ గొంతతడవుండి కమలబాంధవుఁడు । పడమటివార్ధిలోపలఁ బ్రగుంకువేళ
నాకోట డాయ నొయ్యనఁ బోయి తూర్పు । వాకిటిగవనిలో వసియించె నొదిగి
కడపలో వసియించి కపటశోకంబు । గడియించికొని బెట్టుగాఁ బ్రలాపించె
ఆప్రలాపము విని యననీశతనయుఁ । డోప్రభావతీ! యెవ్వతో తూర్పుగవని
వాకిటినుండి యేడ్వఁదొడంగె వింటె?।రాకాసియో? ముష్కరపుఁ బిశాచంబొ?
దాని శోధించి రోదనమువారించి । నేను వచ్చెదనన్న నిందీవరాక్షి
తానును వెంబడితగిలె నిర్వురును । దానిఁ జూడఁ దలంచి తలుపులుదెఱచి
యా సందెప్రొద్దున నిందేల యేడ్చె । దీ సీమ నీవెవ్వ రెఱిఁగింపు మనినఁ
గన్నుల మిథ్యాశ్రుకణములు దొరఁగ । నన్నీలికాన యిట్లనియె నేడ్చుచును
ధర్మైకనిధులార! దంపతులార! । నిర్మలమతులార! నే విప్రసతిని
అల శకదేశంబునందు వర్తింతు । కలఁడొకపుత్రుండు ఘనరూపయుతుఁడు
వాఁడు నన్నెడఁబాసి వైశ్యులఁగూడి । యేడకుఁ బోయెనో యేనది యెఱుఁగ
మున్ను మణిద్వీపమున వానిఁగంటి । మన్న వైశ్యులమాట యాలించి నమ్మి
యోడ యాదీవికి నొక్కటిపోవఁ । జూడఁగల్గునొ కూర్మిసుతు నీడ ననుచు
నా నావపైఁబోయి యారసి సుతునిఁ । గానక యడల నక్కడిపుణ్యుఁ డొకఁడు

నీయోడ యెక్కించి యిద్దరిఁ జేర్చి । పోయిన నిటువచ్చి పొగిలెద నిటుల
మాసీమయోడ క్రమ్మఱి వచ్చుదనుక । మీసదనంబున మెలఁగెద ననుచు
దయదోపఁ గడుదీనదశ వేఁడుదాని।ప్రియవాక్యములు విని బేల్పోయి పణఁతి
మంచిదిలే ముద్ది! మాయొద్ద నిలువు । మంచు నూరడఁబల్క- నారాజసుతుఁడు
నిదిచాల జగజంత యిలుసేర్వ వలదు।మదిరాక్షి! యనుచుఁ బల్మఱు దెల్పువినక
యనద యిదేమి సేయంగల దనుచు । వనితఁ దోడ్కొనిపోయి వాకిలి తెఱచి
కనకాంగి తానొంటిక త్తియ యగుటఁ । బనిపాటలకుఁ దోడుపడు నిది యనుచు
విధివశంబున గారవించి యద్దుష్ట । విధవ మంచిదియంచు వీటిలోఁ జేర్చె
నగరిట్లుసేరినంతనె కార్యమాయె । నగమని యాజంత సంతసం బంది
యనురక్తవలెఁ దిరుగాడు వారలకుఁ । దన కపటం బొకింతయుఁ గాననీక
యప్ప! యీపని సేతునాయని తానె । చెప్పని పనులందిసేయఁగాఁ బోవు
నతివినయము సేయు నారాజుఁ గనిన । సతియిది ధూర్తలక్షణమని తలఁప
నలివేణిఁ దలయంటి యటకలి వెట్టి । జలకమాడుచు మంచిచలువ లందించు
తిలకంబు కస్తూరిదిద్దుఁ గీలుజడ । నలరుసరుల్ చుట్టు నద్దంబుచూపు
నిరువురుఁగూర్చుండనిదె యూర తెత్తు । పరిపరివగల శోభనములు పాడు
రాజు మన్మథుఁ డీవు రతివి పూర్ణేందుఁ । డీజనవల్లభుండీవు రోహిణివి
హారియితం డీవెమహాలక్ష్మి వనుచుఁ । గరుణవుట్టఁగ నిచ్చకపు మాటలాడ
నాదంపతులకది యాప్తకాలయ్యె । నేదుర్మతులు చెంతనెనసి యుండినను
విశ్వసింతురు నీలవేణులు నృపులు । విశ్వస్త నటుగాన వేఱుసేయకయె
నెనరుసేయఁగ నాల్గునెలలయ్యె నంతఁ।బనియేమియునుజక్కఁబడదయ్యె ననుచు
వెతఁబడి యద్దుష్టవిధవ యొక్కపుడు । సతిఁజేరి యతిరహస్యముగ నిట్లనియె
పతిమర్మ మెఱుఁగని పణఁతికి ధైర్య । గతులెక్కడివి? సౌఖ్యగరిమ లెక్కడివి?
మగువ! నీపతి ప్రాణమర్మ మేకాంత । మగువేళ నడిగితో? యడుగనె లేదో?
యడుగకుండిన వెట్టివని ప్రబోధింపఁ । బడఁతి యానుడి చెవిఁబడిన భీతిల్లి
గుండెజల్లనఁ బలుకులు దొట్రువడఁగ।దండమోయవ్వ! యింతటి దుష్టమతివె
నీకేమిపని తెల్పు నృపుమగ్మ మడుగఁ । గాకుపనుల్ సేయఁగడగి వచ్చితివొ?
యడుగకు మిటువంటివని యాదలింప । వెడవెడ వెఱచినవిధము పాటించి

యలుఁగకుమమ్మ! నీకహితంబు సేయఁ । దలఁపనమ్మ హింతబెతలఁచి చెప్పితిని
యనికొన్ని వెడమాటలాడె నజ్జరభి । వనిత యూరాతిరి వసుధేశసుతుని
పక్కలో మక్కువఁ బవళించియుండి । యక్కటిల దురుక్తు లాత్మలోఁదోఁచి
యడిగెద నొకమాట యలుక సేయకయె!నుడువఁగావలయు మనోహర! యనినఁ
బ్రాణేశ్వరివి యింత ప్రార్థింపనేల । యేణీవిలోచన! యేమడిగెదవు?
అడుగుము దెల్వెదననఁ బ్రాణమర్మ । మడిగెఁ గోమలి యాతఁ డడిదంబుఁ బాయ
దొఱఁగినఁ బ్రాణముల్ దలఁగునంచనిన । వెఱఁగందిసతి పొంచివినియె నాజంత
విని నాఁడు మరునాఁడు వెతదీఱి యుండి । జననాథువా లొక్క సందెవేళఁ గొని
యొకగొందిలో దాఁచియువిదయుఁబతియు!సుకమునిద్రించుచోఁజొక్కమా వేళ
నక్కత్తిఁగొనిపోయిప్రొయ్యిలోవైచి । క్రుక్కెబూడిదలోనఁగ్రూరాత్మయగుచు
నడిదంబు జిగిఁబాయ నసువులువిడిచె । పడఁతి కౌఁగిటిలోన భానుమత్సుతుఁడు
వెలఁదియు దీపంబువెలుఁగున నతనిఁ । దిలకించి హానాథ! తేజస్సనాథ!
నన్నేలుకొనుసామి! నాముద్దులయ్య! । యెన్నిక కెక్కిన యేకాంగవీర!
నను నొంటిడించిపో నాయమే నీకు? । నినుఁగూడి వచ్చేద నేను నీవెంటఁ
దోఁకొనిపొమ్మని దుఃఖించుచున్న । నాకష్టురాలది యాలించి యలరి
యేతెంచి యేమియు నెఱుఁగనిదాని । రీతి నిట్లనియె నోశృంగారవల్లి!
యేల యేడ్చెదవేమి యితఁడున్నలాగు!నా, లోలనయన వంతయు రోస మడర
నాపాపజాతితో ననియె నోజంత! । నాపతిఁ బడఁబెట్టి నాకాపురంబు
చెఱిచిన చెడుగవు చీ! నిన్నుఁజూచి । యెఱిఁగి నావిభుఁ డప్పుడే దీని నిల్లు
చేరనీయకుమని చెప్పెఁ జాటించి । యారాజు నుడివిన కయ్యయో? నిన్నుఁ
జేకొన్నఫలమెల్లఁ జేసేతఁ గుడిపి । తీకడ నిలనేల యెటకేనిఁ బొమ్మ్ము
పతితోడవహ్నిలోఁబడియెదననుచు । సతిమోదుకొనుచు బాష్పకణంబులురుల
బెట్టుగా విలపింపఁ బ్రేముడి కలిగి । నట్టివిధాన నమ్ముది చేరవచ్చి
కరపద్మములుపట్టి కన్నీరుదుడిచి । పరవశత్వముమాన్చి పలికె నిట్లనుచు
నీపతిఁజంపితి నేనని నింద । మోపెదవేటికే మోహనగాత్రి!
శకదేశమున నొక్కసన్యాసి గలఁడు । సకలజ్ఞుఁ డాతఁడొసంగిన భూతి
యితనిఫాలమ్మున నిడనదే బ్రతుకు । లతకూన! తప్పతై లకటాహాముసను

బతిదేహముంచి నాబడి యేగుదెమ్మ్ని । వెతఁదీర్తు నామాట విశ్వసింపుమని
యాన లొట్లును బెట్టి యది మసగప్పి । మానిని నాకర్తిమాట యేమరిచె
ప్తె లఘుటంబున ధవుదేహ ముంచి । యాలయద్వారంబు లన్నియు మూసి
పురి దక్షిణద్వారమున బయల్దేరి । యరిగె విధిప్రేరితాత్మక యగుచుఁ
దరుణి యివ్విధమున దనవెంట రాఁగఁ । దరణివారరయ నత్తాటకోటుకత్తె
వేఁడుకఁ దనకొంగు విసరినఁ జేర్చి । రోడ నయోధ్యాడపై నువిదయుఁ దాను
నెక్కి శకంధరాధీశుని ప్రోలు । గ్రక్కునఁజేరి యక్కాంతఁ గొంపోయి
యునిచె హిరణ్యబాహునిచెంత నతఁడు । కనకాంగి రూపలేఖావిలాసములు
విన్నయట్లనె చూచి విస్మయంబంది । మన్నించి జరతికి మహి సగంబొసఁగి
యక్కాంతఁ గేళిహర్మ్యమునకుఁ బిలువఁగ్రుక్కుచుఁ గన్నీరు కొమ్మ్ని యిట్లనియె
నో రాజ! యొకవ్రతంబున్న దొవ్రతము । దీనిక పురుషులదెసఁ జూడరాదు
ఆఱునెలల్ సైపు మందాఁకఁ గేళి । కారామమున నుందుమని తోఁటలోన
వనితయు నంత నంబావ్రతవ్యాజ । ముననుండె బ్రాహ్మణపూజ సేయుచును
పతి ప్రాణవంతుఁడై బ్రదికి యెప్పుంటి । గతి వచ్చి కొనిపోవఁగావలె ననుచు
నలగౌరిఁ బ్రార్థించి యంబరాభరణ । ములఁ గాంత దంపతిపూజ లొనర్చె
నంత జయంత జయత్సేన విజయు । లెంతయురహి సఖుఁడిచ్చిన కత్తి
కమలమాలిక హల్లకము కాంతిమాసి । కమలిన దీక్షించి కడు వితర్కించి
ముగురును జతగూడి ముందరఁ బోయి । దిగులుతో నల హింగుదీపురిఁ జేరి
యందలి వైశ్యచే నారాజు చనిన । చందంబువిని రత్నసందీపకాంతి
మలఁగినదని తత్కనూరి దుఃఖమునఁ । దెలుపఁగా మూలికాదీప్రపాదుకలు
నాయూహజుఁ డొసంగ నలరి మెట్టుకొని । పోయి నిర్మానుష్యపురిఁ బ్రవేశించి
యంతఃపురంబెల్ల నరసి యందొక ని । శాంతంబుగని యానిశాంతంబు నందుఁ
ప్తె లకటాహంబు దర్శించి నిర్గ । తాలోకుఁడై చేష్టలన్నియు మాని
యందున్న చెలికాని నలరువిల్కాని । యందంబు గలవాని నట్టె వీక్షించి
హా రాజశేఖర! హా మహాతేజ! । నీరాజసంబును నీప్రతాపంబు
నెటుపోయె నిపుడని యేఁచ్చుచు నతని । పటుఖడ్గ మందలిభవనంబు లెల్లఁ
బరికించి కానక పాకశాలికల । నరసి యందొక ప్రాయ్యాయడుగున నెరయు

భసితంబులోఁ జిక్కువడి కాంతిమాసి । పసఁదప్పి కడు నల్లఁబడియున్న క్రొత్తి
గని పేదలర్థంబుగనినట్లు లెత్తు । కొని దానిమట్టెల్లఁ గోకను దుడిచి
చమురిడి తోమి స్వచ్ఛముఁజేసి కాంతియమర సానను బట్టినపుడె రాసుతుఁడు
నిదుర లేచినయట్లు నెటిమీర లేచి । బ్రదికించితిరి ప్రాణబంధువులార!
అన్న! జయంత! జయత్సేన! విజయ! । నన్నరయుచు వచ్చినది హెచ్చు మీరు
అని బయల్దేరిన యటకలిఁబెట్టి । యనువొంద జలకంబులాడించి వారు
ఘనవస్త్రభూషణగంధమాల్యముల । మొనసి కైచేసిన మూలికామహిమ
నిష్టమృష్టాన్నంబు లెల్లను గలుగఁ । దుష్టిమీఱఁగ వారితో భుజియించి
ప్రాసాదమున కేగి పడఁతిని గాన । కోసఖులార! మహోద్యోగమూని
యేను బెండ్లాడినయింతిని గాన । మానీలికాన బ్రాహ్మణి యెలయించి
యెచటికిఁ దోఁకొని యేగెనో యదియఱియచలద్యుతులక త్తి యట ప్రుచ్చిలించి
ప్రాయిలోన నిడి కాల్చిపోయిన దనుచుఁ।బయనంబుగాఁ దానువచ్చిన కథయు
దనుజుఁ జంపినయది తరళాక్షిఁగూడి।యునికియు బ్రాహ్మణి యొకతె వచ్చుటయు
నది మాయదారి యీాననియును దెలుప । విదితంబుగావిని విజయూచు లనిరి
ఆప్రభావతిఁ గొని యళుకింతలేక । విప్రభామిని యెందు వెడలిపోయినదో?
వెదకుద మరుదెమ్మ్ము వేషముల్ప్రూని । యదనిదియని మాటలాడుచు నున్న
నచటి కారాజు మున్నసుకత మాన్ప । ఖచరతనున్న సుకంఠుఁ డేతెంచి
వారు పూజలొనర్ప వారి దీవించి । చారురత్నాసనస్థలినుండి పలికె
రాజీవమిత్రనిర్భరతేజ! రాజ । రాజీవతంస! నీ రాజబింబాస్య
నాప్రియనందన నలినపత్రాక్షి । యీప్రభావతి జరత్తాహూత యగుచుఁ
బోయి సుకంధరపురి నున్న దంబి । కాయతవ్రతనిష్ఠ నారామసీమ
నాఱునెలల్ వ్రతంబని యెడఁబెట్టె । నారాజు వలచి సమస్తవస్తువులు
పనుపఁగా విప్రదంపతులఁ బూజించు । కొనుచునున్నది మేలుగోరుచు నీకుఁ
జనుఁ డందుఁ బొదుకాశక్తిచే ననుచు । జననుతు లాలాగె చనియెద ననుచు
నతని వీడ్కొని పాదుకాహూతులగుచు । హితులు వెంబడిరాఁగ నేగె నప్పురికి
నీరీతి నప్పురికేగి లాటఘ్ను । మారమణకుమారమణి తన రమణి
యెలదోటలో వసియించి భూదేవ । తల కైదువల కిష్టధనము లిచ్చుచును

వారి దీవెనలొందు వార్తలాలించి । యారామ సౌశీల్య మాయింతి తాల్మి
తలఁచి సంతోషించి తాను నకూర్మిచెలికాండ్ర నొక్కట ఋతిసురాకృతుల
ధరియించికొని వనస్థలిచేరి యందు । పరమేశ్వరీపాదపద్మముల్ మదిని
నెలకొల్పి తద్ధ్యానినిష్ఠల భుక్తి । సలుపక ఫలదశాశనవృత్తి మేను
మిగులఁ జిక్కఁగఁ దనమేలు గోరుచును । దగు శమదమములఁ దపసికన్నె వలె
నున్న ప్రభావతీయోషాలలామ । కన్నులరంజిల్లఁ గని మ్రొక్కి నిలువ
వారిలోఁ దనభర్త వైఖరి దెలిసి । జోరున నశ్రులు సోనలై కురియ
వడిలేచి పదములవ్రాలి కన్నీటఁ । గడిగి మువ్వురకు నర్ఘ్యంబు లొసంగి
యున్న తాసనముల నుంచిపూజించి । యన్నృపాత్మజులకు నంజలిసేసి
నానోములు ఫలించె నాభాగ్య మమరె । నోనాథ! క్రమ్మనినొప్పు నీయాపు
గనుగొన నోచితిఁగావున ననుచుఁ । జెనఁటియా జరఠచేసిన కృత్య మెల్ల
నుడివి శకంధరేంద్రుని యింటఁదెచ్చి । యిడిన నాతనిఁజేర కెడసి తానున్న
విధమునుదెల్పి యావిధవను బట్టి । వధియింపుఁ డఘ మిందువలన రా దధిప
యను ప్రియురాలివాక్యము లాలకించి । ఘనబుద్ధి రాజశేఖరుఁ డామిటారి
వెతదీర్చి యత్తోట వెలువడిపోయి । హితులతో యోజించి యామష్టురాలి
తనయు వేషంబు నేఁదాల్చెదమీరు । చనుదెండు విప్రవేషములతో ననుచుఁ
బలికి యప్పురి వెలుపటితోటఁ జేరి । మొల కావిధోవతి మూర్ధదేశమున
బలితంపుటోపియు ఫాలభాగమునఁ । దళుకొత్తు సితభసితత్రిపుండ్రంబు
గళమున రుద్రాక్షకంఠమాలికలు । పొలుపొందుకావడి బుజమునఁ బూని
నచ్చెలికాండ్రతో నహదేర వేగ । వచ్చి పురోత్తరద్వారంబు చేరి
యచ్చటిభటులతో ననియె నీసుతుఁడు । వచ్చినాడఁని రాజవరు ప్రాపుగన్న
యవ్వతోఁ దెలిపిరండని పంప వార । లవ్వార్త పరువెత్తి యావెతోఁ దెలుపఁ
బరమహర్షాబ్ధిలోపల నోలలాడి । యరరే కుమారకుం డర్థరాజ్యంబు
చేకూడినప్పుడె చేరె నాభాగ్య । మే కదా యిదియని యిలరాయనికిని
నావార్త యెటిఁగించి యందలంబెక్కి । వేవేగ బహుసైన్యవితతి తన్ గొలువ
నతఁడు నిక్కముపుత్రుఁడని యెదురొక్కినన । నతిభక్తిగలవాని యటుల నజ్జరభి
యడుగులపై వ్రాలి యమ్మ చిన్నపుడెఱి యిడఁబాసిచని కంటి నిపుడు నిన్ననని

నక్కమాహుని నెత్తి యక్కునఁ జేర్చి । చక్కనితండ్రి! యెచ్చటినుంటివీవు
నిన్నాళ్లు నినుగానకెంత గుందితినో । యన్న నేఁడావెత లన్నియుఁ దీఱె
సగముఁరాజ్యము నాకోసంగె నేఁజేయఁదగు నుపకృతికి నెంతయు మెచ్చి రాజు
ఈరాజ్యభోగంబు లెల్ల భోగింపు । మీరాజశేఖరులెల్ల నిన్నెంచ
నని యందలంబుపై నతని నుంచికొని । చనె తనయింటికి సంపదమెఱసి
తనచెలికాండ్రును దాను నచ్చెనఁటిఁబనుపఁ బోయి హిరణ్యబాహుని గాంచి
యతఁడు మన్ననసేయ నారామసీమ । వ్రతనిష్ఠఁదగు ప్రభావతి విలోకించి
ముందరిపని క్రమంబునఁ దెల్పుఁడనిన । నందఱాలోచించి యలివేణి కనిరి
యదరమున్ మూఁడు వియత్తలం బొరిసి।పరగునట్లుగ నొనర్పఁగవలె ననియు
నరద మొక్కంటికి నతివలు మువ్వు । రిరవొందనిడి ముద్దినెక్కించి దాని
సుతు హితత్రయముతో శోభిల్లనుంచి । క్షితినాథ! నీవునెక్కిన మంచిదనియు
మంగళద్రవ్యసమాజంబు గొనుచు । నంగజహరురాణి యావాసమున్న
పురబాహ్యవన్యకుఁ బోవలె ననియు । నెఱిఁగింపు మిప్పురాధీశున కనుచు
హితులతోఁ బతి తనకేర్పడఁ దెలుప । సతి మంచిదని ముద్ది సరగఁ బిల్పించి
యవ్విశేషములెల్ల నధిపునితోడ । నవ్వ! తెల్పుమటన్న నది తెల్పనతఁడు
ననిచె నాక్షణమె శిల్పాచార్యవరులఁ । బనిపూని వారు భూపతికుమారకుఁడు
చెప్పినచందానఁ జేసిరి రథము । లప్పుడె సూత్రంబు లమరించి రొకట
నాసూత్రమర్మంబు లాప్తులు దాను । రాసుతుఁడెఱిఁగి సంభ్రమలీల నుండెఁ
దన యన్నదమ్ముల తనయుల రాజ । తనయులఁగొమ్మంద్ర ధరణీశుఁడీయ
మువ్వురుకన్నెలు ముదితయుఁ దాను । నవ్విజయుం డెక్కి రందొక్క తేరు
ఆజయంత శకంధరాధిప కన్య । కా జనత్రయము క్తిఁగనె నొక్క తేరు
అల జయత్సేన వృద్ధాంగనా కన్య । కలతోడ నొక తేరు గరము రాణించె
ధరణీశసుతులు సూత్రము లెగఁబట్ట । నరిగె నంబరవీథి కారథత్రయము
అరుగుచో దేవాలయముదారి కొండ । చరియున్క నందులో జరఠను బట్టి
పడఁద్రోసె సౌవీరపార్థివతనయుఁ । డొడిసి హిరణ్యబాహునిఁ బట్టిత్రోసె
నడరుకిన్క జయంతుఁ డాచరిలోనఁ । బుడమిజనంబు లద్భుతమంది చూడ
విజయప్రభావతీవృతుఁడై స్వకీయ । భుజములుప్పొంగ భూభుజుఁడు హర్షించె

దిగువకు సూత్రముల్ దిగఁబట్టి కాళి । నగరివాఁకిట స్యందనంబులు డించి
యల్ల జయంతజయత్సేనవిజయు । లుల్లాస మంది రయ్యుర్వీశుఁ గూడి
యాప్రభావతి దేవి కర్చనలిచ్చి । విప్రులు దీవింప విలసిల్లెనంత
నాదేశ మాపురం బమరపూర్వైభ । వాదేశము గ్రహించి యాలాటవిభుఁడు
ముగురేసికన్యల ముదముతో నిచ్చి । ముగురికి సఖులకప్పుడె పెండ్లిచేసె
ఖచర గంధర్వశేఖర దత్తరత్న । ఖచిత విమానముల్ కడువేడ్క నెక్కి
యాప్రభావతితో జయంతాది సఖులు । సప్రియపత్నులై చనుదేర నేగి
దీమసంబున హింగుదీపురిఁ జేరి । తాము హిరణ్యసితధ్వజు లలర
హేలావతీకాంత యిందురేఖాపి । కాలాప జ్యోతిర్ముఖాత్మజ సుభగ
ప్రాణముల్ క్రమ్మఱిఁబడసిన యట్లు । లానందపరవశలై యున్న వారి
గారవించి హిరణ్య గాదిలిసుతు మ । హారత్నుని శకంధరాధీశుఁ జేసి
ప్రజల నెక్కించి నిర్మానుష్యనగర । మజరేంద్రపురనిభం బరయుఁడీ యనుచు
నాసితధ్వజుఁ బల్క యతనికుమారుఁ । డా శిఖిధ్వజునకు నప్పురం బొసఁగె
నయిదుగురింతులు నాప్తులుగొలువ । హయ గజరథ సుభటావళిఁ గూడి
చని విజయాదుల సతులతోఁ గూర్చి । కొనిపోయి తజ్జనకులచెంతఁ జేర్చి
యాదొరల్ తనగుణం బభినుతుల్ సేయ । నాదటఁ దమతండ్రి నతిభక్తిఁ జేరి
యతనిపాదములకు నభినుతుల్ చేసె । సతులతో నతనికి సంతోషమెసఁగఁ
గోడండ్ర దీవించి కొడుకు నెత్తికొని।చూడఁగల్గెను నేఁడు సుకుమార! నిన్నుఁ
గన్నులకఱవెల్లఁ గడఁజాఱె ననుచు । నెన్నుచుఁ గౌఁగిటనిడి గారవించి
యానందబాష్పధారావృతుఁ జేసె । నానరేంద్రుని భాగ్యమలవియె పొగడఁ
దల్లియు బాంధవుల్ తనసఖుల్ హితులు । నెల్లరు హర్షింప నెనలేని సిరులు
నాజయంతాదిసహాయులఁ గూడి । రాజులనెల్లను రణభూమి గెల్చి
వారిజాక్షులఁగూడి వసుధఁ బాలించె । నారాజశేఖరుం డలివేణి! వినుము
వనితలలోఁ బ్రభావతి పుణ్యశీల । గనుక ముజ్జగముల ఖ్యాతివహించె
నీపతివ్రతకథ యెవ్వరు వినినఁ । బ్రాపించు వారికి భవ్యసౌఖ్యములు
అని చిల్క వినిపింప నవ్వైశ్వకాంత । విని వింత యీకథావృత్తాంత మనుచుఁ
బొగడుచుఁ దన యంతిపురమున కేగె । జగదీశుదూతియుఁ జనియె నింటికిని

అని శంభుఁడెఱిఁగింప నవ్వలికథలు । వినిపింపుఁడని గౌరి వేడ్కతో నడిగె
పరమపతివ్రతాచరితంబు నందు । వరుస నిర్వదిమూఁడవకథ చెన్నొందె

కొండగుమ్మడికాయలకథ

శ్రీ విశ్వపతి సమంచితమతి గౌరి । కావలికథ యిట్టులని చెప్పఁదొడఁగె
మరునాఁడు దూతితో మాపటిపూట । నరుగుదెంచిన కల్క కచ్చిలక పల్కె
తన వలచినభర్త ధనహీనుఁడైన । ఘనభక్తిఁ జేకొని కలిమియు బలిమి
యొనగూర్చి సౌఖ్యంబులొందించు సాధ్వి । వినుమట్టి సతికథ వినిపింతు నీకు
బాహుదాపురమను పట్టణంబునను । శ్రీహరిశర్మనాఁ జెలువొందు నొక్క
ధరణిసురేంద్రుఁ డాతనికి నేమిగురు । వరసుతుల్ గలరు కేవలబాల్యయుతులు
తనయాలికిని మఱితనకు నచ్చిన్ని । తనయాలికిని మహాదారిద్ర్యమునను
గుడువఁగూడును గట్టఁగోకయు లేక।యడలుచుబడలి దైన్యమున నాద్విజుఁడు
దినదిన మేమూల్గుదిరిగి గ్రాసంబు । గనలేక ధనకాంక్షగదురఁ జింతించి
యొకనాఁడుప్రొద్దున నుచితకృత్యములు । ప్రకటించి తాఁదిరిపమునకు వెడలు
తఱి నందు సప్తముద్వారదేశమున । నురుతరధ్వనితోడ నొకగొళ్ళి పలుక
కలఁకదీరఁగ వామగొళ్ళి యీవేళ । పలపలఁబలికె నిప్పటి నిమిత్తమునఁ
బలుసిరుల్ తనకుఁ జేపడును నేఁడనుచు । నలరుచు ముందరనడిగి యచ్చోట
జనకుండు రణభూమి శత్రులచేత । మాను సమసిన వహ్నిముఖమున నతని
కాంతయుఁ బరలోకగతయైన కతన । నంతఃపురంబులో నడలుతత్సుతుని
బాలుని సుకుమారుఁ బరికించి వారి । పాల వర్తించు గోపాలుండు దెచ్చి
తనయింట నిడుకొని తద్దయుఁ గూర్చి । పెనుపఁగా యీవనస్పీతుఁడై యతఁడు
పసులమందలకుఁ దాఁగర్తయై యతని । నిసువనఁ గొన్నాళ్లు నెగడె నాగొల్ల
పరలోకగతుఁడైనఁ బశువుల కెల్లఁ । బరిపాలకత్వంబు ప్రాపించి తానె
వర్తించుఁగావున వానిపాలికి ని । జార్తిఁ బాపంగలఁడని యల్లద్విజుండు
నరుదెంచి పొడఁగాంచి యాశీర్వదించి । హరిశర్మ పలికె నోయవనీశతనయ!

యీవు సుయజ్ఞ రాజేంద్రపుత్రుఁడవు । దైవికంబున గోపతనయుండ వైతి
నీసురూపమునకు నీబుద్ధిమహిమ । కేసౌఖ్యకరమగు నీపశురక్ష?
నీకరపదముల నిజము సురేఖ । లాకీర్ణగతి నున్న వదిగాక నీకుఁ
బంచకల్యాణంబు బహురాజ్యలక్ష్మి । ప్రాంచితైశ్వర్యంబు ప్రాపించఁగలదు
నామాట నెఱనమ్మి నరనాథతనయ! । నీమంద నాకిచ్చినే ర్వాసియిచ్చు
నీచీటిఁ గైకొనియేగు ముత్తరము । చూచెదవపుడు నా శుభవాక్యగరిమ
చనినచో నేవిశేషము లేకయున్నఁ।జనుదెంచి మఱల గోచయము గైకొనుము
అనవిని సుకుమారుఁ డనుమాన మంది । యును హరిశర్మ సత్యోక్తులు నమ్మి
తనదొడ్డిపసుల నాతనికి నర్పించి । ఘనభక్తి నలచీటి గైకొని యరిగె
మందచేకూరిన మహిసురప్రవరుఁ । డందున సుగ్రాసమంది సుఖించె
సుకుమారుఁడాచీటి సొంపుతోఁ గొనుచు । శకదేశమున కేగె సత్వరగతిని
నాదేశభూనాథుఁ డణఁగుటఁ జేసి । మోపంబుతో మంత్రిముఖ్యుండు తానె
రాజత్వము వహించి రాజ్యమేలంగ । నాజాడ హూణదేశాధీశుఁ డెఱిఁగి
యలమంత్రి పైవచ్చుటది విచారించి । తలఁగిపోవ నతండుదలఁచి యాకేయి
మాననీయాకారమహనీయ యైన । మానవేశునిపుత్రి మదిని గామించి
సంకేతమొక్కటి సరగ బోధించి ।పంకజవదన గొబ్బున రాత్రివేళ
నటకు రమ్మనిచెప్పి యరిరాజభీతిఁ । బుటభేదనముఁ బాసిపోయె నమ్మంత్రి
పోయిన నమ్మంత్రిబుద్ధికి రోసి । యాయింతి యారాత్రి హాయమునై నెక్కి
యెచ్చటికైనఁ బోయెదఁ దుదవైవ । మిచ్చినపతి వరియించెద ననుచుఁ
దనకుఁ గావలసిన ధనమణిభూష । లనువొందఁ గైకొని హరువైన మంచి
మావుపై వేఱొక్కమార్గమ్ము వట్టి । పోవ నందొక వటభూరుహచ్ఛాయ
గొంగడిఁ బైఁగప్పికొని నిద్రవోవు । నంగజాకారుని నారాజసుతునిఁ
గనుగొని తేజిగ్రక్కున డిగి చాన । చనినంత మేల్కాంచి సవిధదేశమునఁ
దనమేనికాంతి రత్నవిభూషణాభ । ఘనతమఃపటలంబు గడఁద్రోయు దాని
నెఱనీటుచే రతినిరసించు సొగసు । నెఱికప్పుకొప్పు క్రొన్నెలగేరు నుదుట
మొలక లేనవ్వులు ముద్దుమొగంబు।తలిరుఁగెమ్మోవియుఁ దళుకుఁజెక్కులును
నిడువాలుఁగన్నులు నీలాలకములు । కడగి నవశ్రీల గదుముకర్ణములు

కటివంకబొమలు చక్కనిపలువరుస । సరసచంపకనాస చారుకంఠంబు
జిగిబిగిగుబ్బలు చిన్నారికౌను । తొగరాదుచేతులు తోరంపుపిఱుఁదు
పొగరుపాయము ననుపొన్నపొక్కిలియు।జిగిదేరు నూఁగారు చికిలిపెందొడలు
తిలకించు పులకించు దేహంబుతోడఁ । బలుకరించఁ దలంచు భావంబెఱింగి
వాని లేఁబ్రాయంబు వానిసోయగము । మానిని వీక్షించి మరులొంది పలికె
యెవ్వరివాఁడవోయి మనోహరాంగ! । యివ్వని నొంటిగానిటు పవ్వళించి
గొంగళిఁ బైఁగప్పికొని యుండుటేమి? । శృంగారనిధివి నీస్థితిఁ దెల్పుమసిన
నాసుకుమారుఁ డిట్లను నోలతాంగి! । నే సుయజ్ఞుండనునృపతి పుత్రుఁడను
గురునియాజ్ఞ వహించి కుంభినిఁ దిరుగ । నరుగుదెంచితి నన్ననతివ హర్షించి
శకదేశమేలు భూజానికుమారి । నకదూర! నేవిమలాంగి యున్దానఁ
దల్లిదండ్రులు లేమిఁ దగుపతి నరయు । నుల్లంబుతో సినాయో త్తమ మెక్కి
వచ్చితి నిచట దైవముచూపె నిన్ను । మచ్చిక హెచ్చె నమ్మైజిగిఁ గన్న
నన్నుఁ జేపట్టి మన్మథరాజ్య మేలు । మిన్ని తెల్పఁగనేల నీవేళ ననుచుఁ
దానుదెచ్చిన పదార్థముల భక్ష్యముల । నాని బడలిక యమ్మానిని దీర్చి
జ్ఞాతిభయంబున జవనాశ్వ మెక్కి । యాతతిఁ జనిచని యతిశీఘ్రగతిని
జాంపేయపురము నైషధదేశనరము । సొంపునఁజొచ్చి యచ్చో నొక్కయిల్లు
అద్దెకుఁగొని నిల్చి యారాజసుతుని । ముద్దియ గనుగొని ముదమొప్పఁ బలికె
నాభాగ్యవశమున నవమోహనాంగ! । నీభార్యనైతి మంత్రి యుపాధి దీరె
చాంపేయపురమేలు చంపకధ్వజుని । నింపుతోఁ బొడగని యీవేళ నీవు
వెలయంగఁ జేతికి వేయివరాలు । బలుజీతమిమ్ము నీపంపొనరింతుఁ
బోరానిచోటికిఁ బోనేర్తు ననుము । తేరానివస్తువుల్ తేనేర్తు ననుము
పొమ్మని పనిచిన భూనాథపుత్రుఁ । డమ్మానవతి పంప నటువలెఁ బోయి
యరిభయంకరఖడ్గహస్తుఁడై బ్రమొక్కి । ధరణీశ! నేబాహుదాపతి సుతుఁడ
సుకుమారుఁడనువాడ శూరశేఖరుఁడఁ । బ్రకటించి నీవెందుఁ బనిచిన నందుఁ
బోనేర్తుఁ బోవచ్చుఁ బోవరాదనక । తేనేర్తు నేదైనఁ దేఁగూడదనక
సెలవిమ్ము వేవరాల్ చేతికటన్న । నలరి భూపాలకుం డటువలె నిలిపె
నంతటఁ గొన్ననాళ్లరిగిన పిదప । వింతగా సుకుమారువెలఁది యిందుఁబు

బోనగ త్తెలు చూచిపోయి భూపాల! । యానిర్మలాంగి మోహనవిలాసములు
గనివిని యెఱుఁగ మెక్కడ దేవకన్య । యని తోఁచెనని తెల్ప నట్టె మోహించి
కామాంధుఁడై చంపకధ్వజుం డపుడె । యామహీవరపుత్రు నటకు రప్పించి
సుకుమార! యోమహాశూరావతార! । యొకఁడ వెచ్చటికైన నోపుదు నహగఁ
దేరానివ స్తువుల్ తేనే ర్తు నంటి । కోరికతోఁ గొండగుమ్మడికాయ
యెన్నాళ్లలోఁదెత్తు వెఱిఁగింపు మనిన । మూన్నాళ్లుగడువిడి మ్రొక్కి రాసుతుఁడు
తనపత్ని కెఱిఁగించి తద్విధం బెఱిఁగి । ఘనభక్ష్యములు పెరికలఁగొని యరిగి
గండభేరుండప్రకాండంబు లుండు । కొండకుఁ బోయి యకొండపై నుండి
చిలువయొక్కటి నిక్కి చెల్లెక్కి చనఁగఁ । దిలకించి దానిఁగ త్తినఁ దెగనఱికి
భేరుండశిశువులఁ బ్రేమ రక్షించి । భూరిభక్ష్యంబు లప్పుడు మెక్కనిడినఁ
జవిఁజొక్కి రాతిరి జననీజనకుల । కవిదెల్ప నప్పక్షు లతని లాలించి
కవ్వంపుఁగొండకుఁ గ్రక్కునఁ బోయి । మవ్వంపు కొండగుమ్మడికాయ తెగలు
వేవేలు తెచ్చిన వేడ్కతో నెట్లు । పై వైచి కొనితెచ్చి పతి కొప్పగించె
భళిరె! మూన్నాళ్లలోపల మందరాద్రి।ఫలములు దేనోపు బలియుండు గలఁడె?
యనిమెచ్చియునుమెచ్చకారాజు మహని।ననతూఁపులకుఁజొక్కి న్యాయంబుదక్కి
యల రాజసుతుని సభాంతరంబునకుఁ । బిలిపించి మంత్రిచెప్పిన యు క్తి ననియె
పులిజున్ను గావలె భూపాలతనయ! । తెలుపు మెన్నాళ్లలోఁ దేనోపు దనిన
నెనిమిదినాళ్లలో నేనది తెత్తు । ననిచెప్పి వీడ్కొని యలివేణి తెలుపు
హితబుద్ధి నీలాద్రికేగి యచ్చోట । సుతపుఁడన్ ముని భజించుటకు నె త్తనునఁ
జనుచోట నొకబిలస్థలిఁ బ్రవ ర్తించు । దనుజవీరుఁడు మదోత్కటుఁ డనువాఁడు
అడ్డమై యెటువోయెదని చేతిగండ్ర । గొడ్డలి నై చిన ఘోరాసిధార
నదిద్రుంచి వాఁడేయు నట్టి సాలములు । విదళించి తల యొక్కవ్రేటున నఱికె
నందున సంతుష్టులై కొనియాడి । రంచున్న వనచరు లచటిసంయములు
సుతపుఁ డాభూపాలసుతుని దీవించి । హితశీల! యిటకు నీవేల వచ్చితివి?
యెఱిఁగింపు మీడేర్తు నేకోర్కె యైన । సరగున ననిన రాజకుమారుఁ డనియెఁ
బులిజున్ను నన్నేలు భూపాలకుండు । వలెనన్న నినుఁ గొల్వవచ్చితి ననిన
నగివాని యొక్కమంత్రము సరహస్య । ముగఁ దెల్పి యీనిన పులిగుంపు లెల్ల

నీవెంటఁ జనుదెంచు నీవుపొమ్మనినఁబోవుఁ బాలు ప్రవాహములుగ వర్షించుఁ
జనుమన్న నమ్మంత్రశక్తి నయ్యడవిఁ । దనరు వ్యాఘ్రసముత్కరము దోడుకొని
పురముసొచ్చిన జనంబులు భయభ్రాంతిఁబఱచి రెల్లెడలకుఁ బనులఁ దోడుకొని
వచ్చినచందాన వహసతోఁ బులులఁ । దెచ్చె నీతండెంత తెగుదారి యనుచు
వెఱఁగంది నృపతి వేవేగ నిప్పులుల । మరలనంపుము సుకుమార! చాల్‌చాలు
పులిజున్ననిన మహోద్భుతమంత్రశక్తి । పులిగుంపు నాటుణంబునఁ బోవ ననిచె
జననాథుఁ డమ్మంత్రశక్తికి మెచ్చి । పనిచెనింటికిఁ దగుబహుమాన మొసఁగి
యంతటఁ గొన్ని నాళ్లరిగిన వెనుకఁ । గాంతపై భ్రాంతి నాఘనుఁ బిల్చిరాజు
అన్న! క్రౌంచాండమ్ము లౌషధంబునకు। నెన్నాళ్లలోఁ దెత్తు వెటిఁగింపు మనినఁ
బదిహేనునాళ్లలోపలఁ దెత్తు ననుచుఁ । బదిలుఁడై తనభార్యపంపున నేగి
గరుడాద్రిచేరి యక్కడ మోహనాంగి । వరసమాఖ్య వహించు వనచరకన్యఁ
జూచిననది వానిసొబగున కలరి । యోచెల్ల! యెక్క డనుండి వచ్చితివి?
కదుబాలకుఁడ వేమిగావలె? ననుచుఁ । బడఁతుక యడిగి తాఁ బలితుఁడన్నాని
గంధర్వసతియందుఁ గన్నాఁడునన్ను । సింధుసేనుండను చెంచు నన్‌బెనిచె
ననుఁ జేపట్టుము నరనాథతనయ! । నిన్ను సౌఖ్యంబు లొందించెద ననిన
గాంధర్వమునఁ దానిఁగలసి క్రీడించి । గాంధర్వితోఁగూడి కదలి యాటుణమె
హంసానువర్తినియును తటాకమున । హంసనీడములఁ గ్రౌంచాండముల్ గాంచి
యవిగొంచు చెంచెత నలగగుడాద్రి । నివసింప నియమించి నెమ్మివహించి
చంపకధ్వజుని దేశమునకుఁ బచ్చి । తెంపుమీఱుఁగఁ దాను తెచ్చిన గ్రుడ్లు
ముందరనిడిన నమ్మార్ధన్యుఁ డలరి । యెందునుబొడగాన మిటువంటివాని
భళి! సుకుమార! నీబలజవోన్నతులు। తెలిసెఁబూవనిపూలు తెచ్చి యిమ్మనిన
మాసద్వయంబున మసలక తెత్తు । నీసమ్ముఖమునకు నిజమని పలికి
మానినీమణియిచ్చు మంత్రవిభూతి । పూని యామణికర్ణపురమున కేగి
అట పేదరాలిపెద్దమ్మ యిల్ చేరి । కటకటపడు దానిఁగని యిదేమనిన
నాయవ్వపలికె నన్నా! యీపురాధి । నాయకుండై మించు నయగుణాభికుఁడు
మణికర్ణుఁడతనికుమారియై వెలయు।గణనీయ చంపకగంధి యన్‌కన్య
అది పుట్టిపెరిగి పదాఱేండ్లప్రాయ । మొదవిన మేడపై నువిదలఁ గూడి

నిదురపోవఁగ మహానిశఁ జెంతఁగూర్కొనుదతి యదృశ్యయై చూపడ కడఁగు
దినదిన మొకొక్కతెఱువ యడంగఁవిని తండ్రి యిదియేమివింతయో యనుచు
దానినింటను నిల్పఁదగదని యూర్తు । లైనమంత్రులు తెల్ప నౌగాక యనుచుఁ
బురబాహ్యవనసౌధమునఁ బువ్వుసెజ్జ । నిరవొంద నిలుప నయ్యింతి యెల్ల పుడు
నిదురమబ్బున శయనించియేయుండు । కదలదు మెదల దేకారణంబుననొ
సుత యొంటినున్నఁ జచ్చునొయని నృపతి।వెతఁజెంది యూరెల్ల వినఁగఁ జాటింప
నూరివా రింటింటి కొకరొక రరిగి । యూరాజకన్య శయ్యాసమీపమున
దినదినము శయించి తెల్లవారినను । గనఁబడ రధిప! యీక్రమమున జనులు
నడపఁగాఁ జనుదెంచె నాయిలువగుస । కొదుకు నంపఁగలేక కుందెదననిన
నాలించి నీపట్టికై నేనెపోయి । తూలింతు నచ్చటి దుష్టాత్మ ననుచు
నాయవ్వయిడిన మృష్టాన్నంబు మెక్కి । పాయని తుష్టి నప్పార్థివసుతుఁడు
చని పురబాహ్యదేశనివేశ మొంది । ఘనశయ్యపై నిద్రఁ గైకొన్నదాని
మరునిమోహనబాణమహిమంబుచెంది।మరువొందుసౌందర్యమునమించుదాని
మణిభూషణాంబరమాల్యసుగంధ । గణనీయమూర్తియై కరమొప్పుదాని
చంపకగంధి నచ్చటఁజూచి నిదుర । మంపొందు నవ్వధూమణి పక్కలోనఁ
జాయగాఁ దనవిల్లు చలువదువ్వలువ । పాయకుండఁగఁ జుట్టి పైరుమాల్ గట్టి
పురుషుండు పండినపోలిక నిలిపి । పరుల కదృశ్యుఁడై భసితప్రస క్తి
వెనుచక్కి నున్నచో వెసదాని నాసి । కను వెలువడె రెండుకాలసర్పములు
ధనువు మానవుఁడని దంష్ట్రికాహతుల।నినుమారు మున్మారు నిటునటు గఅచి
మరలిపోవఁగ సుకుమారుఁ డాలోనఁ । గరఖడ్గమంకించి కడిఁదిసర్పములఁ
దెగవేసి రెంటిని దీమసంబునను । బగఁబూని యంతలో బ్రహ్మరాక్షసుఁడు
రూక్షకుండనువాఁడు రోషభీషణత । రాక్షుఁడై వింటికి హస్తంబుసాప
కరఖడ్గమునఁ గేలుఖండించి వానిఁ । దటిమిన భీతిల్లి దైత్యుండు పఱచె
నల్ల చంపకగంధి యలయిక తీర్చి । యల్లన సుకుమారుఁ డామణికర్ణ
చెంతకుఁజని ఫణిచ్ఛేదనక్రమము । వింతగాఁదెలుప నివ్విధమేమొ యనుచుఁ
జింతింప నశరీరిచెప్పె గంధర్వ । కాంత నీసుత చంద్రకళికాభిధాన
చెలులతో నొకవనక్షితిఁ జరింపుచును । దిలకించె నచ్చోట దీప్తాంగుఁడనెడి

తపసిఁ దపోనిష్ఠఁదగు వానిఁజేరి । చపలత పూఁదీగె శయమునఁ జిదిమి
యది రెండుగాఁజేసి యమ్మానిమోము।గదియించి పాములుగఅచె నిన్ననుచు
బెదరింప నాయన బిట్టుల్కి చూచి । కొదమ్రాయంపుటుక్కునఁ జెలరేగి
చెడుగవై మమురవ్వసేయ వచ్చితివే? । పడుచ! నీవు నృపాలబాలవై పుట్టి
నీనుక్కులో రెండు నీలాహులుండి । భామకో! నీచెంతఁబండినవారిఁ
గఱచి హానియొనర్చుఁగాక నీవెంట । నరుదెంచి నవ్విన యీనర్తకుండు
దనుజుఁడై తత్క్షణిదష్టమానవునిఁ । దినిపోవునని బెట్టుదిట్టిన నడలి
శాపమోక్షంబు ప్రసాదింపుఁ డనుచు । నాపడఁతియు నటుం డడుగుల వ్రాలి
వేడిన బాహుదావిభుపుత్రుఁ డగుచుఁ । బోఁడిమిచెందిన భూపాలసుఁతుడు
పాములనఱికి శాపముదీర్చు దైత్యుఁ । డామహాత్మునకు నిజాత్మజ నిచ్చి
కరవాలనిహతాత్మకరముఁ బ్రాపించి।మఱి శాపముక్తుఁడౌ మదనుజ్ఞ ననుచుఁ
బనిచిన నాలేమ పట్టియై నీకు । జనియించెదీని నిచ్చతురాత్మకునకై
యిమ్మని యశరీరి యేర్పడఁదెలుప । నమ్మాన వేశ్వరుం డాశ్చర్యమంది
యాకన్నెనీవె పెండ్లాడు మటంచుఁ । జేకొని పెండ్లిచేసిన వేడ్కఁజెంది
యట నాల్గునాళ్లుండి యార్యోపదిష్ట।వటభూరుహాముచేరి వసుధేశసుతుఁడు
నామత్రితొట్టిలోనటఁ బ్రవేశించి । భూమీశతనయుండు పోయి ముందగను
నొక మహాకాసార మొప్పుగాఁ గాంచి । నికటవృక్షంబెక్కి నీళ్లలో దుమికి
చనిచని యచ్చోట సౌవర్ణరత్న । ఘనపురం బొక్కటిగని చొచ్చిపోయి
యది నిర్మనుష్యమహాపురం బగుట । మదినెంచి యొక రత్నమయసౌధ మెక్కి
యందుఁజెన్నగు నొక్క యరవిందముఖిని । మందగామిని సుకుమారాంగిఁ జూచి
వెఱఁగంది యొంటి నిశ్వాసలసౌధమునఁ । జరియించెదేటికి చంద్రబింబాస్య!
యని దానినడిగి శుభాంగియన్ పేరి । దనుజుని సుతయాట దానిచే నెఱిఁగి
యామహారాక్షసు హస్తం బొసంగి । మామగారని తత్క్షణాఁ బెండ్లాడి
యతఁ డఖిలవిద్యాసహాయతఁ బూన । మతినుబ్బి యొక భాట మసలకయరిగి
కనియె స్వర్ణపురంబు కలితగోపురము । చనియె స్వర్ణధ్వజు సదనంబునకును
పగడసాలాడి తత్ప్రభుని నోడించి । దుగదిగయని తాను దొడ్డుగాఁబి క్కు
చేసినఁ బుష్పహాసిని నవ్వోఁగనుక । హాసోదితంబులై యలరులుగురిసె

నానవ్యకుసుమంబు లపుడె గ్రహించి । దాని వివాహమై ధనవస్తుకోటి
నానరేంద్రుఁడొసంగ నయ్యింతిఁ గొనుచు। సేనాసమేతుఁడై చెలఁగి యవ్వలను
అల దైత్యపుత్రి శుభాంగిఁ దోడుకొని । పలలాశిగొలువఁ జంపకకేతు పురిని
విడిచి చంపకగంధి వేడ్కతోఁగూడి । వెడలి రథాశ్వేభవీరుల తోడ
గహుడాద్రికేగి యక్కడఁ జెంచురాజు । పరిపరివస్తువుల్ పడుచుతో నొసఁగ
నామోహనాంగి మున్నగుసతుల్ నలువు।రామోదమునఁ గొల్వనతివై భవమునఁ
జాంపేయనగరరాజము ప్రవేశించి । యింపుతో సతినవ్వ నెసఁగినపూలు
పూయకపూఁచిన వ్రాలివి యనుచు । నాయవనీశున కర్పించుటయును
వీని కసాధ్య మిర్విని లేదటంచు । నానరేంద్రుఁడు కుత్సితాత్ముఁడై యపుడు
తమ పితాళ్లనుజూచి తడయక రమ్మ । ప్రమదంబుతోనని బహులేఖ లొసఁగ
నవిగొని సతియుపాయంబున నగ్ని । జవమునఁ జొచ్చి భూస్థలిబిలం బొంది
ననబోణి దివ్యమంత్రమహత్త్వమునను । దనయింటినుండి పితాళ్లంపినట్టి
కమ్మలటంచు వక్కణలిడి వ్రాసి । యమ్మూఁడునెలలేగ నగ్నికుండమున
వెలువడివచ్చి భూవిభుఁ బొడగాంచి । యలవొప్ప మీపితాళ్లందఱు మీకు
కమ్మలువేర్వేఱఁ గ్రమమొప్ప వ్రాసి । యిమ్మహి కనిపినా రివిగో యటంచు
నతని మంత్రిపురోహితాప్త సామంత । చతురసేనాధిప జనములకెల్లఁ
గమ్మలొసంగినఁ గడువేడ్క వార । లమ్మూడ్కి పెద్దలనరసి వత్తమని
యనలకుండములలో నటఁజొచ్చి చచ్చి।చనిరి దుర్జనులకు సౌఖ్యముల్ గలవె?
సుకుమారుఁడును శకఘ్నీశుకన్ని । యకు వశ్యుఁడై మోహనాంగి మునైన
నలువురుఁ గన్నసన్నలఁ బలుల్ సేయఁ।గలిమియు బలిమియు ఖ్యాతియుఁ గలిగి
సకలదేశములకు స్వామియై వివిధ । సుకృతంబు లొనరించి సుఖలీల నుండెఁ
బతికి హితంబు సంపాదించినట్టి । సతి విమలాంగిఁ ప్రశంసింపఁ దగదె
యీపుణ్యకథ యెవ్వ రింపుతో వినిన । ప్రాపించు వారికి భవ్యసంపదలు
అని చిలుకతెల్పిన నవ్వైశ్యకాంత । విని విస్మయమునొంది వేగినయంతఁ
దనయింటి కేగ భూధవుకడ కేగె । తనపూనిక వితగాఁగ దాదియు నపుడు
అని మహేశుఁడు దెల్ప నవ్వలి కథలు । వినిపింపుఁడని గౌరి వేడ్కతో నడిగె
సరస పతివ్రతాచరితంబు నందు । గరిమ నిర్వదినాలుగవ కథ వెలసె

నీ 'ఎట్టిచూపునకు కొంగఁగా'నన్న సతి కథ

శ్రీవిశ్వపతి దయాంచితమతి యువతి । కావలికథ యిట్టులనియానతిచ్చె
దూతితో సందెప్రొద్దున మరునాఁడు । నాతి రా నక్కారణశుకంబు వలికె
భూతభావిభవత్ప్రభూతకార్యములు । నాతి! పురంధ్రీజనములకుఁ దెలియు
సకల మిల్లెఱిఁగిన సాధ్వీచరిత్ర । మొక టున్న దెఱిఁగింతు నూకొందుగాక
యవని విద్యాకరంబను నగ్రహార । మవితథ ద్విజనికాయం బొప్పు దొల్లి
ఆయగ్రహారంబునం దొక్కద్విజుఁడు । శ్రీయుక్తుఁడై యుండు శ్రీధరుం డనఁగ
నా విభార్యముభార్య యమితశోభార్య । భావితార్యసపర్య భవ్యసౌందర్య
వెలయు శ్రీసతియన వినయవివేక । సలలిత దాక్షిణ్య సౌజన్యవసతి
పతి కెదురాడదు పరులనిందింప । దతిథులఁ బూజించు నాడదు కల్ల
యలుగదు కలనైన నఖిలబాంధవులు । భళియనఁదగు నింటిపనికి వేసరదు
పతియె దైవంబుగా భావించుఁ దగిన । వ్రతములు పతిహితవాంఛ నొనర్చు
గలఁకచెందని శరత్కాలంబు కొలని । వలెఁ బతిభక్తిచే స్వచ్ఛతఁ గన్న
చిత్తంబుతో విలసిల్లుచు నున్న । మత్తకాశినికి సమ్యగ్జ్ఞాన మొదవె
తనయంత నేయది తలఁచినఁ దోఁచు । మనసున సాధ్వికి మలినత లేని
యద్దంబులో నీడయటువలె నిట్టి । ముద్దియ కెనయైన ముదితలు గలరె ?
ముజ్జగంబులనని మొనసి యెంతురు సు । హృజ్జను లయ్యింతి నెంచ శక్యంబె?
అక్కాలమున నమ్మహాగ్రహారమున । కొక్కవిప్రవరుం డహోరాత్రపఠిత
వేదవేదాంగుండు విహితాగ్నిమక్రి । యాదక్షుమతి కౌశికాభిధానుండు
చనుదెంచె వినుము భిక్షావృత్తిఁ బూని।తనుయాత్ర జరుపుచుఁ దరలక యుండె
నతఁడు నిత్యంబు కల్యమునన లేచి । హితమతి హరి స్మరియింపుచుఁ బోయి
కొలనిలో మునిఁగి యెక్కడునిష్ఠ నాత్మ । వెలయ సంధ్యాదిక విధు లొనరించి
జాముపర్యంతంబు జపము గావించి । యామిూఁదఁ దపనుని కభినుతుల్ చేసి
కృతకృత్యుఁడై రావిక్రింద నేకాంత । మతి నుండి పదమూ క్రమంబు గుణించి
మధ్యాహ్నమైన నేమంబున లేచి । యధ్యయనము మాన కగ్రహారంబు
చొచ్చి యింటింట భిక్షుకవృత్తిఁ దాల్చి । యిచ్చిన భిక్షాన్న మెలమి భుజించి

యొకమఠంబునఁ బండియుండి రేయెల్ల । నికటస్థులైన వర్ణశ్రేష్ఠులకును
బాడియుఁ బదమునప్పక చెప్పికొనుచు । నేడుకాలము క్రమియించె నీరీతి
నంతట నొకనాఁ డహర్ముఖవిధులు । శాంతి నొనర్చి యాసద్విజోత్తముఁడు
ఘనతరుచ్ఛాయను గ్రమము గుణించి।కొనుచున్న యతనిపైఁ గొక్కెర యొకటి
రెట్టవెట్టినఁ గోపదృష్టి నకొంగ । నట్టె చూచినయంత నది నేలఁబడియెఁ
బడినకొంగను జూచి బ్రాహ్మణుం డాత్మ।నడలుచు నిటులేల యలిగి చూచితిని
చేఁటెంచ కేల హింసించితి దీని । నేటితపం బిది యేటిపజంబు?
ఎక్కడి క్రమపాఠ? మెక్కడిశాంతి? । యొక్కడివ్రతనిష్ఠలివి యని పొగిలి
యెప్పటివలె భిక్షమెత్తికోఁ దలఁచి । యప్పారుఁ డయ్యగ్రహార వీథులను
నింటింట భిక్షాన్న మెత్తి యవ్వాలుఁ । గంటి యిల్ సేరి భిక్షాందేహి యనిన
నప్పతివ్రత భిక్ష మతని కొసంగఁ । దప్పక పాత్రశోధనము సేయఁగను
అంతలో శ్రీధరుండను తద్విభుండు । శ్రాంతుఁడై వచ్చిన సతి విలోకించి
యాపాత్ర యటువైచి యధిపుని శ్రమముఁ।బాపి స్నానమునకు బలుకాగులోనఁ
గ్రాఁగెడు జలములు గడువేగఁ దెచ్చి।మోఁగాళ్లు జానువుల్ మేను దోముచును
జలకమారిచి సువస్త్రంబు లర్పించి । పొలఁతి మాధ్యాహ్నికంబునకు నిళ్లొసఁగి
దేవపూజయు వైశ్వదేవం బతండు । గావింపఁదాను పాకము చేసినట్టి
శాకాదికములు భోజ్యములు వడ్డింప । నాఁకలిదీఱఁగా నతఁడు భుజించి
కరములు వార్చుకోఁగాఁ బాన్పమర్చి । తరుణి వీడియమిచ్చి తాళవృంతమున
బిసరుచు నతిథి సవ్వేళఁ దలంచి । మసలితి నక్కటా! మహిసురుం డెంత
యలిగెనో యనిభయంబడర భిక్షాన్న।మెలమితోఁ గొనివచ్చి యింటి వాఁకిటను
నిలిచి యుండెడి నతనికి నిడఁబోవ । నలఘురోషారుణితాక్షుఁడై యతఁడు
పలుకులఁ గలఁకదోఁపగ నిట్టులనియె । భళి! సాధ్వి! నీవెంత భక్తిశాలినివి
యెంతసేపాయె నేనిచటికి వచ్చి । శ్రాంతుండనగు నన్ను సరకుసేయకయె
జాగుచేసితి విది సౌజన్యగుణమె? । నేఁ గనుంగొన నెందు నీవంటి సతిని
కలిగిన భిక్ష గ్రక్కునఁ। బెట్టి పంప । వలయు లేదనిచెప్పవలెఁ గాకయున్న
నిందేమియును లేక యింటిలోపలను । సందడి నీవున్న సతి! యెట్లు తెలియు?
వరునిపై మమతో?యీవనగర్వమహి మొ?। తెఱువ!యిందునఁగాని తెలియన్రోయనుచుఁ

బలుమాటలాడ నాబ్రాహ్మణోత్తమునిఁ । దిలకించి యవ్వధూటీలక మిట్లనియె
నీవు పల్క–నపల్కు– నిజము తామసము । గావింపఁజనదు భిక్షాందేహి యనిన
ననఘ! నీవచ్చినయపుడె భిక్షాన్న । మునకుఁ బాత్ర గ్రహింపఁబోవు నాలోన
నాపతి వచ్చె నెంతయు శ్రాంతుఁడగుచు । నాపుణ్యునకు భోజనాదు లమర్చి
బడలికతోనున్నఁ బాను పమర్చి । విడెమిచ్చి సురటిచే విసరుచు నుండి
యప్పుడు జ్ఞాపకంబయిన నిన్ దలఁచి । యిప్పుడు దెచ్చితి నిదె భిక్షగొనుము
కోపంబు చనదు నీకు మహాత్మ నీదు । కోపదృష్టిని జావఁ గొంగనుగాను
క్షమ లేని తపసికి సౌఖ్యముల్ గలవె? । క్షమియింపవలయు వేసరక యిందులకు
క్షమ లేక యొకబ్రహ్మచారి పూర్వమున।సుమతియన్ వాఁడు చచ్చుటనీవు వినవె?
యాకథ యెటులన్న ననఘ! కృష్ణాన । దీకూలమున సుకీర్తినృపాలు చెంతఁ
గలఁ డురుశ్రవుఁడను తాపసుండొకఁడు।సులలితమతిశాలి సుమతి తత్సుతుఁడు
నాయింటిపొరుగుబ్రాహ్మణునికుమారుఁ । డై యొప్పుదుర్బుద్ధియనువాఁడొకండు
గోదావరీతటి గోవిందశర్మ । నాఁదగు విద్వజ్జనశ్రేష్ఠు చెంతఁ
జదువ వాఁడరుగఁగా జతచేసి సుతునిఁ । జదువుకొమ్మని యురుశ్రవుఁడును బనిచె
వీఁడు బాలుఁడుసుమీ! వీనికిఁ దోడు । నీడవై నీవు మన్నింపు మటంచు
జనకుఁడీరీతిఁ బంచఁగ వాఁడు మంచి । దని తోడుకొనిపోయి యాచార్యుఁ జేరి
యిద్దఱు సాష్టాంగమెఱఁగిన నతఁడు । పెద్దయు లాలించి ప్రీతిదీవించి
యన్నవస్త్రములిచ్చి యాత్మజుల్లేక । యున్నవాఁడగుట నెంతో వత్సలతను
జదివించె వేదశాస్త్రములు దుర్బుద్ధి । చదివె నాసుమతి యాచార్య శుశ్రూష
సేయుచు గురుపత్ని సెప్పిన పనులు । సేయుచుఁ దగుభక్తి సేయుచు నుండె
గురుని దోవతు లుదుకుచు వేగి లేచి । విరులును దులసియు విస్తరాకులును
ఫలసమిత్కుశలును బచ్చి లేఁగసవు।పాలపగూరలు దినంబును దెచ్చుచుండుఁ
బొసఁగ దూడలను మేపుచు సందెవేళఁ । బసులనుగట్టి తప్పక కసువిడును
ఆవులపాలు నిత్యంబును బిదుకు । కావలసిన వంటకట్టియల్ తెచ్చు
నీవిధమునఁ బనులెల్లఁ గావింప । గోవిందశర్మ యగ్గుణనిధిఁ జూచి
చదువుకో కిప్పనుల్ సతతంబుఁ జేసె । దిదియేమి తోడివాఁడిదిగొ వేదంబు
చదివెఁ గావ్యములందుఁ జతురతఁ గాంచె।నది నీకుఁబని లేదె? యన్న వాఁడనియె

మీకృపఁ గల్గిన మితసత్యవచన! । యేకంబుగా వచ్చు నెల్లవిద్యలును
నా కేమికొదువ యన్న గురుండు మెచ్చె । నీకిటువలెఁ దోఁచెనే వత్స! యనుచు
నంతట నయిదేడు లఱుగ దుర్బుద్ధి । కొంతవేదము మఱికొన్ని శాస్త్రములు
తనకు వచ్చుటఁజేసి తద్గురుస్వామి । కనియె నొక్కదినంబునం దేకతమున
గురురాయ! మీకృపఁ గొన్ని శాస్త్రమ్ము। లెఱిఁగితిఁ దడవయ్యె నిట కేము వచ్చి
వీని తల్లియుఁ దండ్రి వెతఁ జెందుచుందు । రేనేర్చినది యూరికేగిన వెనుకఁ
జెప్పెద సుమతికి శీఘ్రుంబె యూరి । కప్పనవెట్టుఁ డేమరిగెద మనిన
గురుఁ డాకుబుద్ధిఁ గన్గొని మంచికార్య । మరిగెద రీవిమూఢాత్మునిఁ గూడి
యూరి కేగినమీఁద నుపదేశ మిమ్ము । కూరిమి నీనేర్చికొన్నవి యెల్లఁ
బనివినుఁ డీశుద్ధపంచమినాఁటి । కని మూఁడునాల్గు నాళ్లటు మితివెట్టి
యూరాత్రి సుమతి నిజాంఘ్రులు తొడలఁ । జేరిచి యొత్తగాఁ జిత్తాబ్జమలర
వానికిట్లను వేకువనెలేచి నేను । స్నానంబు గావించు నదికేవు వచ్చి
నాకంటెమున్ను స్నానముచేసి సంధ్య । యేకాగ్రమతి వార్చి యీవు సహస్ర
గాయత్రి జపియించి ఘనభక్తినిష్ఠఁ । బాయక నావెన్కఁ బరివసింపుమని
యానతియిచ్చిన నట్లగావించె । నానిర్మలాత్మకుం డంత జామెక్కి
నాగురుమూర్ధన్యుఁ డంతకుమున్నె । తా గురునిష్ఠ సంధ్యావిధుల్ దీర్చి
।బ్రహ్మగాయత్రి జపంబు గావించి । బ్రహ్మణి నవదాతపద్మాసనస్థ
నతుల ప్రవాళనవ్య కరప్రవాళఁ । దతకటీర నిబద్ధ ధవళదుకూల
హారకర్పూర నీహారడిండీర । తారేశ తారాభ తరుణశరీర
వాణి వినమ్రగీర్వాణి వినీల । వేణి భావమున భావించి ప్రార్థింప
నాతత మంత్రమాత్రాహూత యగుచు । నాతనిమ్రోలఁ బ్రత్యక్షమై నిలిచె
నిలిచిన భారతీనీరజాతాక్షి । కలరుచు నతఁడు సాష్టాంగం బొనర్చి
యంజలిచేసి యీయర్భకుఁ గరుణ । రంజిల్లఁ జూచి సర్వకళాప్రవీణుఁ
జేసి రక్షింపవే శ్రీశారదాంబ! । భాసురోరునితంబ! భక్తావలంబ!
యని తనవెన్క నున్నట్టి యర్భకునిఁ । గనకగర్భనిరాణి కన్నుల యెదుట
నిలిపిన వాఁడు వినీతుఁడై మ్రొక్కఁ । దిలకించి యిఁకవీఁడు త్రిభువనములను
వెలయుఁ జతుష్షష్టివిద్యాధ్యుఁ డగుచు।గలిమియుఁ బ్రతి లేని ఖ్యాతియుఁ గాంచు

నని వానినాల్క బీజాక్షరత్రయము । నెనరుతో వ్రాసి యన్నిఖిలైకమాత
యంతర్ధిఁ జెందిన నర్భకుం డపుడు । వింతయౌ సూక్తి గోవిందశర్మాఖ్యఁ
దగు గురుఁ బొగడె శతశ్లోకములను । మిగుల వేడుకయుఁ గూర్మియు గౌరవంబు
ముప్పిరిగొన వానిమోము ముద్దుగొని । యప్ప! నీవిద్య బయల్ సేయ వలవ
దిచ్చోట మాయూరి కేగిన వెనుక । నిచ్చకై నటుల విజృంభింపు మపుడు
వినిపింపఁబోకు మీవిధము దుర్మతికిఁ । జనుత్రోవ వానితోఁ జర్చసేయకుము
అవని విద్యకు వినయంబె భూషణము । తివిరి యేసభల వాదించఁబోకు మని
కొన్ని బుద్ధులు సెప్పి గురుఁ డింటికరిగె।నన్నయూథ్యుఁడు వెంట నరుగుదేరఁగ
మరునాఁడు ప్రొద్దున మంచిలగ్నమున । గురుఁ డయ్యిరువుర నక్కున గారవించి
చలిదియు బత్తెంబు చాల నొసంగి । యల సుబుద్ధిని వాని కపు డప్పగించి
నీవిద్యలెల్ల వీనికి నేర్పునుచుఁ । ద్రోవ నింతయుఁ డానుదూరంబు పోయి
వారి వీడ్కొని విప్రవర్యుండు మఱలె । వారిద్దఱును గొన్ని వాసరంబులకు
మలలును నదులు గ్రామంబులు దేశ । ములు దాటి చనిరి ప్రమోదంబు మీఱి
సుమతి యేమెఱుఁగక శుంఠఁడాయెనను।ప్రమదంబు కుమతికిఁ బ్రభవించె మదిని
వీని మించితిఁగదా విద్యల ననెడి । యానంద ముదయించె నల సుమతికిని
నిటువలె నలరుచు నిరువురు నేగ । యటవిలో నొక్కనాఁ డాఁకట బడలి
యొక చెట్టుక్రిందఁగూర్చుండి యున్నపుడు।వికటాత్ముఁడు కుబుద్ధి వినరోరిసుమతి!
హెచ్చె దాహము తోయమెచ్చటఁగలదో?।యిచ్చట వెదకితెమ్మాక్షణంబునన
పాలుమాలక లెమ్ము బడలికఁ బూని । యీలాగు నీవున్న నేకార్య మగును
అనిన సుబుద్ధి యన్నా! నిన్నుఁబలెనె । వనవీథి నడిచి కేవల మలసితిని
యించుకసేపు సహింపుము వెదకి । కొంచు వచ్చెద నీళ్లు గొబ్బున ననిన
వాఁడల్గియపు డెన్నివడరెద వోరి । వేఁడుకొంటే చాల విజ్ఞుఁవీఁగెదవు
బొక్కపాలవు (?) పొట్టపొడిచిన నొక్క।యక్కరంబు నెఱుంగవతివిమూఢుఁడవు
లేచిపొ మ్మారక లేచిపోకున్నఁ । జూచెదు నాచెయ్యి శుంఠ! యటన్నఁ
దాళుకోలేక విద్యాగర్వమహిమ । బాలుఁ డిట్లనియె నోబద్ధకి! నీవు
విద్యాధికుఁడవైన వేఁడికోనేల । సద్యఃప్రభూతమౌ సలిలపూరమున
నీదపై దీర్చుకోనేర వే యనిసఁ । వాఁడుల్కపడి విద్యవచ్చువారలకు

వలసిన నీరెట్టు వచ్చురా! యనినఁ । గలకలనగుచు నాఘనుఁ డిట్టులనియె
నేను మూఢుఁడఁగదా నింగిఁబొంగెడి మ । హానదీజలములిం దావిర్భసింపఁ
జేసెద నపుడు మెచ్చెదవె? నన్ననిన । నీసుతో వాఁడను నీవె మున్నీటి
జలము దెచ్చెదవేని సాహాన్మహేశ । తులితుండవని నిన్ను స్తుతియింతు ననిన
విధినియోగమున గర్వించి యాసుమతి । యధికభక్తిని గురు నభినుతుల్ చేసి
కరములు ముకుళించి గంగాస్రవంతి । గరిమ నుతించె శ్లోకచతుష్టయమున
నాశ్లోకములు దీఱునంతట ఘుమఘు । మశ్లాఘనీయ సమగ్ర నిర్ఘోష
చలిత దిశావకాశంబై సుధాచ్ఛ । సలిలప్రవాహంబు జగతికి డిగ్గి
యక్కుమారునిమ్రోలనతలంబునొరసి।యొక్కటఁబ్రవహింపనోహో రె!యనుచు
నల్ల కుబుద్ధి మహాశ్చర్యమంది । చెల్లు నీకని స్తుతిఁజేసివాఁడంత
స్నానంబొనర్చె నాసలిలంబునందు । వానితో సుమతియు వరభక్తిమునిఁగె
యన్నీట మాధ్యాహ్నికాదులు దీర్చి । యన్నాదికములు సయ్యన వాఁడొనర్చి
యన్న! రమ్మలసితివని ముద్దుగాఁగ । నన్నంబువెట్టిన నతఁడు భుజించె
వాఁడును భుజియించివచ్చి నిద్రింత । మీఁడ నించుకతడ వీవు నే ననుచు
నతని నిద్దురఁబుచ్చి యట్టె యొమ్మెక్కి । సితఘుంటమున శిరశ్ఛేదంబు సేయఁ
బూన నిద్దుర లేచి భోరున సుమతి । యానీచు వారింప నలవిగాకున్న
మాతండ్రి నాదు క్షేమం బెఱుంగుటకు । వ్రాతు నే నాల్గక్షరములని వాని
చేఘుంటమున "నప్రశిఘు"యని యాకు । లో ఘునత్వర వ్రాసి లోఁబడి యుండె
ఘుంటంబు చేకొని కంఠంబు గోసి । కంటకవృత్తి నాఖలుఁడు తీవ్రముగఁ
దనువు పూడిచివైచి తనగ్రామమునకుఁ । జని యల్ల లేఖ తజ్జనకున కిచ్చె
నాయర్థమెఱుఁగక యవనీశుఁ జేరఁ । బోయి తెల్ప నతండు పురి సుధీజనులఁ
బిలిపించి యడిగినఁ బెద్ద లందఱును । దెలివి నార్చెలలకుఁ దెలుప లేరైరి
అందునఁ గోపించి యధిపుఁడు వారి । నందఱిఁ దెగటార్తునని బెదరింప
వారిలో నొకవిప్రవర్యుఁ డశ్వత్థ । ధారుణీరుహము చెంతల నున్న నొక్క
బహ్మరాక్షసుఁడు భార్యకుఁ దేటపఱిచె । బ్రాహ్మణతనయుండు ప్రాణాంతవేళ
వడి నప్రశిఘు యని వ్రాసి తన్ జంపు । చెడుగు చేతికొసంగ క్షితిపతి దాని
యర్థ మేమనిన మహాద్విజుల్ దాని । యర్థ మెఱుంగక యతిఖిన్నులైరి

వారల దండించువాఁడై నృపాలుఁ । డారంభ మొనరించె నదియేల యనినఁ
దనపుత్రి నాద్విజాత్మజునకు నొసఁగ । మనసునఁ దలఁచి వేమఱు వానిరాకఁ
గోరుచుండుటఁజేసి కుపితుఁడాయె నన । నారక్కసుని భార్య యయ్యర్థ మడిగె
నడుగఁ * జతుష్పాదమైన శ్లోకమునఁ । బడఁతిరో! ప్రతిపద ప్రథమాక్షరములు
తగె నప్రశిషు యన దానియర్థంబు । నిగదింతు వీనిచే నీపుత్రకుండు
వనమున నిద్రింప వాఁడిఘుంటమునఁ । దునుమగాఁబడె శిఖద్రొక్కి పట్టికొని
తల, యని యున్న దీతాత్పర్య మనిన।నల బ్రాహ్మణుఁడువిని యది మరునాఁడు
నృపతికిఁ దెలుప వాని వధించినట్టి । చపలునితోఁ జని చంపినచోటి
ధరణిలోఁ బూడ్చిన తనువును జూప । ధరణీశుఁడును వాని తల్లిదండ్రులును
బరితాపశిఖఁ గ్రాఁగఁ బ్రాజ్ఞు లిట్లనిరి । సరగున గోవిందశర్మ నిచ్చటికిఁ
బిలువ నంపించినఁ బ్రియశిష్యు ప్రాణ । ములువేఁగరప్పించు భూనాథ! యనిన
నాలాగె పిలుపింప నమ్మహామహుఁడు । వేళంబె యచటికి వేంచేసి సుమతి
ప్రాణంబు లిప్పించె భారతిచేత । వానికిఁ బుత్రి వివాహంబు చేసి
యానందవార్ధి నోలాడె సుకీర్తి । యానందనునిఁ జూచి యక్కునఁజేర్చి
తండ్రిదండ్రు లలరి రాదారుణహత్య । వలన దుర్బుద్ధి జీవవిముక్తుఁ డయ్యె
గోవిందశర్మాఖ్యగురునిఁ బూజించి । భూవిభుం డిష్టార్థములఁ దన్పెఁ బ్రజలఁ
గావున ఱేమమూని గర్వంబుఁబూన । నావహిల్లు విపత్తి యవనీసురేంద్ర!
సతులకుఁ బతిసేవ సలుపుట నీతి । యతిథిపూజనము దేవార్చనారతులు
మాకేల నింకొక్కమాట చెప్పెదను । జేకొని యటువలె సేయుము నీవు
లలితమానస! మిథిలానగరమున । నలఱు ధర్మవ్యాధుఁ డనుబోయ యొకఁడు
అతఁడు నీకెఱిఁగించునట్టి ధర్మముల । నతిశయించెదవు పొమ్మని యన్నమిడిన
యప్పతివ్రత తెల్వి కాశ్చర్యమంది । యప్పుడే మిథిలకునరిగి కౌశికుఁడు
పాలసమ్మ్నకొనియెడు బోయను జేరి । తెలిసి యాఘనుఁడు పతివ్రత నిన్నుఁ
బనుపఁగా నీతోడ భాషింపవలసె । జననియు జనకుండు సంతాపమంది
నినుఁగాన కడలుచెందెద రంధవృత్తిఁ । జని వారిఁ బ్రోవుము సద్భక్తియుక్తిఁ

---

* అనేనతవపుత్రస్య ప్రసుప్తస్య వనాన్తరే ।
శిఖామాక్రమ్య పాదేన ఘుంటేన నిహతం శిరః ॥

దల్లి దండ్రులకంటె దై వముల్ గలరె?।యెల్ల బంధువులు వా రేసుమీ యసఘ !
తలిదండ్రులను బూజఁ దనరించి యందు । వలన నాత్మజ్ఞానవంతుడ నైతి
నని తనపితరుల నతనికిఁ జూపి । యనుపమత త్త్వరహస్యముల్ దెలిపి
పనిచినఁ గౌశికబ్రాహ్మణో త్తముఁడు । తన తలిదండ్రులఁ దడయక చేరి
వారి శోకముదీర్చి వైవాహికక్రి । యారూఢి ధర్మాత్ముఁడై సౌఖ్యమందెఁ
గౌశికుం డీతెల్వి గను టప్పతివ్ర । తాశిరోమణి పూర్ణదయచేతఁ గాదె?
యీసతీమణికథ యెవ్వరు వినిన । వ్రాసినఁ జదివిన వైభవం బొదవు
పాపముల్ దొలఁగు నిబద్ధియటంచు । నావుప్పమంజరి కలచిల్క దెలిపె
అని శంభుఁడెఱిఁగింప నవ్వలికథలు । వినిపింపుమని గౌరివేడ్కతో నడిగె
సరస పతివ్రతాచరితంబు నందు । వరుస నిర్వదియైదవకథ చెన్నొందె

గంధర్వ కన్య కథ

శ్రీ విశ్వపతి సమంచితమతి గౌరి । కావలికథ యిట్టు లానతియిచ్చె
నావలినాఁటి సంధ్యావేళ దూతి । తో వచ్చు చెలికిఁ గంతుపటాని పలికెఁ
బరిహాసమునకు ఱాప్రతిమయా తన్నుఁ । బరిణయం బొనరించి బ్రహ్మచారికిని
ధరణీసుపర్వపుత్రకు లేగ నతని । వరియించిన సుపర్వవనిత చరిత్ర
నోయమ్మ! తెలిపెద నూకొందుగాక । మాయాపురము చెంత మణిసార మనెడు
నగ్రహారము తొల్లి యమరు ధరాకు । చాగ్రహారమురీతి నంచితశ్రీల
నాయూరనుండు మహాప్రజ్ఞనామ । ధేయుండు సకల శ్రుతిస్మృతి వేత్త
ఆమహామహుఁ డుపాధ్యాయుఁడై యచటి । భూమిదేవవరేణ్య పుత్రుల కెల్ల
వేదశాస్త్రంబులు వివిధాగమములు । నాదరంబునఁ జెప్పి యతివిచక్షణులఁ
గావింపుచుండ నక్కడికొక్కవటుఁడు । దేవశర్మాఖ్యుఁ డేతెంచి సేవించి
దేవ! గోదావరీతీరవాసుఁడను । నే వేదశాస్త్రముల్ నేర్చుకోఁ దలఁచి
వచ్చితి మీపాదవనజముల్ గొలువ । నిచ్చ మచ్చిక హెచ్చ నిదిమొదల్ నన్నుఁ

జేపట్టి శిష్యుఁగా శిక్షింపుఁ డనిన । నాపుణ్యుఁ డౌగాకయని సమ్మతించి
కారుణ్యమున శిక్షగావింప బ్రహ్మ । చారియు వేదముల్ చదువుచు నుండె
నాగురుం డనుప మధ్యాహ్నకాలమున । నేగి భిక్షాన్న మింటింటఁ దెచ్చికొని
భుజియించు దిన మొక్కపూట సద్గురుని । భజన మేమరక రేబవ లాచరించు
నందున నతఁడు విద్యావంతుఁ డయ్యె । నెందును విశ్వాసమే ఫలప్రదము
అంత నచ్చటివిప్రు లాత్మీయసుతుల । కెంతయు వేడ్కవహించి పెండ్లిండ్లు
సేయింప వారువచ్చిరి పెండ్లికొడుకు । లై యుపాధ్యాయుల కభినుతుల్ సేయ
వచ్చి మ్రొక్కిన శిష్యవరుల దీవించి । హెచ్చినకలిమి మీరెల్ల గృహస్థ
భావంబు గంటి రీబ్రహ్మచారి య య।యో! వివాహము లేక యెదిగి యున్నాఁడు
।పాపుదాపులు లేక పరిణయం బగునె?।యీ వేదకుఁ గుమారి నెవ్వఁ డిచ్చునని
యతనిపైఁగృప గురుం డాడఁగా వినుచుఁ।బ్రతి పల్కకుండి రా బాలు రందఱును
మఱునాఁడు విప్రకుమారకు లెల్ల । సరసిలో స్నానాదిసత్క్రియల్ దీర్ప
నరిగిరి తమవెంట నాబ్రహ్మచారి । యరుదేర వింటివె? యంతకు మున్న
లలితాబ్జరేఖా కళావతు లనెడి । చెలులు మువ్వురుగొల్వఁ జిత్రరథాఖ్య
గంధర్వకూఁతురుకనకరేఖ యను । సింధురయాన రాజితకళాధీన
యల సరోవరమున కరుదెంచి యచట । జలకేళి చెలులతో సలుపుచునుండి
యావిప్రతనయు లల్లంత రాఁ జూచి । పావడల్ కోక లాభరణముల్ మునుపె
తట సికుంజాంతరస్థలి డాఁచియునికి । నటకేగ ననువుగా కతిసత్వరమున
నీటిలో నట్టె మునింగి తాప్రతిమ । నీటొండె నదిచూచి నెలఁత లట్టిరి
తాతిబొమ్మలరీతి రమణు లీభాతి । లోఁదైన యానీళ్లలోడాగ వారి
కచభార ముఖ విలోకన కంఠ బాహు । కుచ రోమరేఖికా గురుజఘనోరు
చరణాగ్రములు భృంగ జల జాండజాబ్జ । వరబిస చక్ర శైవలలతా పులిన
కరికర కూర్మవైఖరులు వహించి । సరసిఁ బ్రాపించి యిచ్ఛాద్రఢిమమున (?)
తారూపులైరొనా రమణు లట్లున్న । ధారుణీసురసుతుల్ తాంనబు సేయ
బొమ్మలబంటి నీరు చొరంగ మొదటి । బొమ్మ నొక్కఁడుదాఁకి బోరునఁ బట్టి
బయటికిఁదెచ్చి యాప్రతిమ రూపంబు । నయనాంబుజముల కానందం బొనర్పఁ
జుట్టునుండెడి సహస్రోతలఁ బిలిచి । యిట్టి చక్కనిబొమ్మ నెక్కడనైనఁ

గంటిమే? యిదియ నిక్కము బోఁటివైన।వెంటనంటఁడె తుంటవింటిదంటయిన
మన దేవశర్మ కీమానినిఁ బెండ్లి । యొనరింతమే? నిన్న నొజ్జలు మనల
దూటిన దెఱుఁగరే? తొడిబడ నిపుడె । యారంభ మొనరింతమని వారినెల్ల
బ్రబే రేచి రమ్మని ప్రియమున బ్రహ్మ । చారినిఁ గైసేసి సమిధలు దర్భ
గంధంబు పువ్వు లక్షతలు దెప్పించి । యందు ముందుగను సమావర్తనాఖ్య
హోమంబు సేయించి యుచిత మంత్రక్రి।యామహత్త్వమునఁ గన్యావరణంబు
తలఁబ్రాలు కంఠసూత్రము మొదలుగను । వలసిన వన్నియు వన్యవస్తువుల
ఘటియించి యగ్ని ముంగల వెలుఁగొందఁ।దటుకున విహితకృత్యము లెల్లఁదీర్చి
యనలప్రదక్షిణం బాబొమ్మతోడ । నొనరింపఁగామించి యుద్వాహ మయ్యె
బ్రహ్మచర్యం బిఁక బనిలేదటంచు । బ్రహ్మచారికిఁ దెల్పి పరిహాసభంగి
బాలు రాశీర్వదింపఁగ వారిబలిమి । నాలోలచిత్తుఁడై యతఁ డూరకుండె
క్రొత్తపెండ్లికుమారకుఁడు దేవశర్మ । యుత్తమగృహమేధి యూరిలో నెల్ల
నీవార్త దెల్పుద మిఁకనని ప్రతిమ । నావేళఁ దోయమధ్యంబున నుంచి
చనిరందఱును బ్రహ్మచారియు గురునిఁ।గనుగొని యకోఁడిగములు దెల్పుటయు
నందఱిఁ గని మీప్రియమునకుఁ దగిన । చందానఁ బరిణయోత్సవము సల్పితిరి
ప్రాజ్ఞు లౌననుచుఁ గోపముఁజేసె నొజ్జ । లజ్ఞత నవ్వితిమనిరి వారెల్ల
నకోఁడఁ గనక లేఖాబ్జపత్రాక్షి । మొకోలివగ ద్విజన్మలసుతుల్ తన్ను
నవ్వటునకు వివాహము చేసి చనిన । నివ్వేరపాటుతో నిజరూప మూనఁ
దమతమ రూపముల్ దాల్చి నెచ్చెలులు । రమణికి వస్త్రాభరణగంధమాల్య
వితతిఁ గైసేసి యోవెలఁది! నీవంటి । యతివ కీవడుక వాఁడఁకె! మనోహరుఁడు
బాగాయె మతియేమి పడుచులఁగూడి । యాగడం బొనరింప నది నిజంబనుచుఁ
గలఁక చెందఁగనేల కానుగకాయ । గళమున నేటికిఁ గడవేయఁ గదవె!
యిక్కడఁ దడవేల యింతి విమాన । మెక్కవే మనయింటి కేగుద మనిన
నాచెలువలఁ జూచి యతివ యిట్లనియె । నీచందమున వచియింప మీకగునె?
వేదమంత్రములచే విప్రకుమార । లాదృతినై న హాస్యంబున నైనఁ
గట్టించి రఱుత మంగళసూత్ర మనుచు । నెట్టు విసర్జింతు నిది కాయయగునె!
యిదియె బంగరుపుస్తె యితరునినిఁక।మది నెంతునె యతండె మత్పతియుండనుచు

నలఘుపాతివ్రత్య మంతరంగమునఁ । జెలఁగ విమాన మచ్చెలులతో నెక్కి
తనలోకమున కేగి తల్లిదండ్రులకు । వినిపించె నప్పెండ్లి వృత్తాంత మెల్ల
వారది విని ధాతవ్రాసిన వ్రాఁత । యీరీతి నుండేనే యింతి! నీ కనుచు
వేదోక్తతంత్రంబు విడిపించ నైరి । కాదందురే వివేకజ్ఞులు శ్రుతులు
ఆరాత్రి తలిదండ్రు లనుప నయ్యనుప । మాయూష యీవనోదయ హేమరేఖ
చెలులు కై సేయ నంచితపదార్థముల । నలువొందు మణివిమానంబుపై నెక్కి
యలరుచుఁ జని యగ్రహారంబునడుమఁ । బొలుపొందనొక్క విప్రుని యింటిప్రక్క
నొక పంచపాకలో నురువుగా వాఁకి । టికిఁ బెనుతడిక గట్టిగ బిగియించి
తఱచుటల్లి కలచేఁ దగు నారికెడపు । విరిమోఁద దోవతి విస్తరించికొని
శయనించి చదివినశ్రమముచే సుప్తుఁడయియున్న ద్విజసూను నవసరం బెఱిఁగి
తన విమానము వంచి ధరకు లంఘించి । తనుకాంతులటఁ బర్వఁ దడిక గదల్చి
వనిత వాఁకిలి తెఱవగదోయి యనిన । విని యెవ్వరని వాఁడు వేడ కేపాడి
బొట్టు గట్టినయట్టి పురుషుండ వపుడె । యెట్టుల మఱచితి వేను గంధర్వ
కన్నెను గనక రేఖను నేనునీకు । నన్నియుఁ దెలిపెద నవల రానిమ్ము
నావిని తడికఁ గ్రన్ననవాఁడు దివియఁ । దావిగుబులొక్కనఁ దరుణిలోపలికిఁ
జని వాఁకి లెప్పటిచందాన మూసి । తనుదీప్తి సయ్యంధతమసం బడంచి
తనుఁజూచి వెఱచు నాతని భావ మెఱిఁగి । కనకకంకణములు ఘలుఘల్లు మనఁగ
జడియకుమని వెన్నుచఱచి నామేని । కొడయుండవని స్వకీయోదంత మెల్లఁ
జెప్పి గంధమలంది సిగ విరుల్ చుట్టి । యెప్పుకోకలు భూషలొసఁగి కైసేసి
తాను దెచ్చిన పదార్థములచేఁ దృప్తుఁ । డైన వానికి విడియము ప్రేమ నిచ్చి
యువిద నవోష యయ్యను బ్రౌఢకాంత । సవరున ముగ్ధుఁడౌ శ్మ్రాసురసుతుని
మేకొల్పుటకుఁ జెక్కుమీఁటి నున్గోటి । సోకులఁ దమికేచి సొంపు వుట్టించి
పుక్కిటివిడె మిచ్చు పొంకంబు నేర్పె । మ్రొక్కులతక్కులు ముచ్చటల్ నేర్పె
రాకొట్టి కౌగిట రహిమీఱఁ బెనఁగి । పైకొనుమని వేడు ప్రౌఢిమ నేర్పె
నీరీతినాతి యేమెఱుఁగని బ్రహ్మ । చారిని వలరాజు సామ్రాజ్యమునకుఁ
బట్టంబుగట్టి లేఁబ్రాయంబు కొల్లఁ । బట్టె నాతఁడును నేర్పరి యయ్యె రతుల
నేను వచ్చినరాక యెవ్వరితోడ । నైనఁ జెప్పెదునుమీ! యాత్మేశ! యనుచుఁ

గవకూడి రేలిట్లు క్రమియించి వేగు । నవసరంబున నేగు నాత్మీయపురికి
నీలీలఁ గొన్నినా ళ్లెలనాగ యతని । రేలెల్లఁ గోర్కెమీఱి రమించి చనఁగ
నా దేవశర్మ దేహమున సత్కాంతి । ప్రాదుర్భవించెఁ దప్తస్వర్ణ భాతి
మొగముపూర్ణేందుసోంపునిరాకరించెఁబొగరుప్రాయపువన్నెపొలుపుసహించె
నావింత గని యొజ్జ లాశ్చర్యమంది । యీవిలాసములకు హేతు వేమనుచు
దినదిన మడుగ నింతియనుజ్ఞ లేమి । వినిపింప వెఱచె నావృత్తాంత మతఁడు
గ్రుచ్చిగ్రుచ్చి దినంబు గురుఁ డిట్టు లడుగుటచ్చెలి కెఱిఁగించి యనుమతి గాంచి
యానుపూర్వ్యగఁ దెల్పె నతఁ డవ్విధంబు । వీనులవిందుగా విని గురుం డలరె
నొజ్జలు బోధింప నొక్కనాఁ డాతఁ । డజ్జలజాక్షితో నటగి స్వర్గాది
లోకంబులెల్ల నాలోకించి యంద । నేకసౌఖ్యములు చెందెడి ధర్మపరులఁ
గనుగొని సంతోషకలితుఁడై దాని । కనియె మాయొజ్జల కలిలేణి సుగతి
కలదొ లేదోయన్నఁ గలదనె నదియునలరి సంయమనిఁ దా నరయంగఁ బోయి
సత్పురుషులు గాంచుఁ సౌఖ్యముల్ గనుచుఁ । దత్పురి దక్షిణద్వారదేశమునఁ
బేడకుప్పలు రెండు పెనుగట్టు లట్లు । చూడఁ జోద్యమ్మునై చూపట్టఁ జూచి
యతఁ డివియేమి తొయ్యలి ! తెల్పుమనిన । సతిపల్కెఁ నీగురుస్వామి కుమారి
విధవ యున్నదిగదా వినుమది ముసలిబధిరుఁ డంధుఁడునౌ తపస్వి యొక్కరుఁడు
భిక్షువేడిన పేడఁబెట్టిన మరిగ । యీక్షించి కడుగక యెడ్డెతనాన
నందులోఁ గొనివచ్చి యన్నంబు వెట్టె । ముందరయకయున్న మోసంబు రాదె?
యదిగాన కంధసన్యాసి భుజించి । మడిఁగుండె నంత గోమయ మింతయయ్యె
నిది తినుమని దాని నీడిచి తెచ్చి । కొదుకక యమభటుల్ కొట్టనున్నారు
నింకమీఁదట నన్న నేణాక్షివదన । పంకజం బీక్షించి బ్రాహ్మణుం డనియె
నిప్పేడకుప్ప లింకెటువలె సమయు? । నప్పాప మణఁగు నుపాయ మేలాగు?
నెఱిఁగింపవే! దాఁచనేల నీకరుణ । గురుపుత్రి సుగతి చేకొని యేగుఁగాక
యనిన లేనవ్వుతో నక్కాంత పలికె । ననఘ! దైవతరహస్యము లడిగెదపు
అడుగ నీకునుదగ దదితెల్ప నాకుఁ । గడు హానిపదమగు కారాని దీవు
దీనత వేఁడగాఁ దెల్పక తీర । దానెలఁత యుపాధు లణఁగిపోవుటకు
నొక యుపాయము గల దూకొందుగాక । నిఁక రేపుమొదలుగా నిందీవరాక్షి

చలువకోక ధరించి సాయంతనమునఁ । జెలఁగి తాంబూలంబు చేత ధరించి
యెవ్వఁ డడ్డంబైన నేమోయి! యనుచు । నవ్వుచు నవ్వల నడచుచు నొంటి
నొకచోట నిలువక యూరిలో నున్న । సకలజనుల్ వ్యభిచారిణి యనఁగ
నెగ్గులేక చరించెనేని యిప్పేడ । తగ్గిపోఁ దట్టెఁడుతట్టెఁడు దిగిచి
వైతురు నిందించువారి కాభటులు । నాతి నిష్కలుషయై నాకంబు చేరు
మది తగుల్పొరయక మగలతో నగిన । సుదతి నిశ్చలయూట సోకదు కీడు
నీరహస్యము దెల్పువిూవు నీగురునిఁ । జేరి యంచు గణించి చెచ్చెర నతని
నురువిమానస్థు నయ్యూరిలో డించి । సురకన్య తానున్నచోటికిఁ జనియె
మరునాఁడుగురున కమ్మహిమముల్ దెలిపి।గురుపుత్రి నూరిలోఁగ్రుమ్మరఁబనుప
నద్దేవశర్మ వాక్యప్రకారమునఁ । బ్రొద్దుగ్రుంకిన నీటుపూని యవ్విధవ
యూరెల్లఁ దిరుఁగ నమ్మో! గురుపుత్రి । యీరీతిఁ జెడిపోయెనే యని కన్న
వారెల్లఁ దూషింప వడిసె నానాఁటి । కారాసులౌ గోమయం బద్భుతముగ
నంత సంయమనీపురాధీశుఁడైన । యంతకుఁ డొక్కనాఁ డాత్రోవ వచ్చి
కోటవాకిటఁ బేడకుప్పలు గాన । కాటోపమున దండహస్తుఁడై గణికుఁ
బరికించి పేడకుప్పలు గాన వేమి? । యెఱిఁగింపుమనిన వాఁడిట్లని పలికె
దేవ! గంధర్వపుత్రిక హేమరేఖ । దేవశర్మాఖ్యుఁడౌ ద్విజునిఁ బెండ్లాడి
తన విమానంబువిూఁదనె వాని నుంచి । కొని దేవలోకముల్ కొదుకక చూపి
యీలోక మంతయు నీక్షింపఁ జేసి । యాలోలమతి వాని యాచార్యపుత్రి
కొఱకు దాఁచిన పేడకుప్ప లడంగు । వెరపు దెల్పఁగ నిది విధవ పాల్గాక
నయ్యూరిప్రజల పాలయ్యె నటన్న । గయ్యాళి యిది యెంతకార్యంబు చేసెఁ
జూచితే!యని యర్కసూనుఁ డార్ద్ర । లోచనుండై మును ల్నుభటులు గొలువ
నమరేంద్రు కడకేగి యంజలిచేసి । కమలాక్షి కనకరేఖానామ భామ
చిత్రరథాత్మజ చేసిన యవ్వి । చిత్రకృత్యంబును జెప్పిన నలిఁగి
యాచిత్రరథుఁ బిల్చి యగభేది పలికె । నీచస్వభావయై నీకన్నపట్టి
యొకద్విజుఁ జేపట్టి యూర్ధ్వలోకముల । సకలదైవతరహస్యములును దెలిపి
చెప్పినదట యదిచేసిన యట్టి । తప్పు దలంచినఁ దాళదుమనసు
జడగతి సప్తయోజనదీర్ఘశిఖరి । యడుగునఁ బాషాణమై యుండుఁగాక

ఇంకిటనని శాపమిచ్చినఁ దాప । మంకురింపఁగఁ గంపితాత్ముఁడై యతఁడు
నా నిలింపాధీశు నడుగులు కెరఁగి । దీనుఁడై ప్రార్థించి దేవ! నాసుతకు
శాపమోక్షంబు ప్రసాదింప వలదె? । చేపట్టి తుద వీడఁజెల్లునే! యనినఁ
బాకశాసనుఁడను బలుప్రయత్నమున । నాకొండ భేదించి యందలిశిలలఁ
బ్రాకారగోపుర ప్రాసాదతతుల । నేకదీర్ఘికలు సేయించి యాక్రిందఁ
గనుపించు రాతి లింగమొనర్ప నందు । జనియించు నీపుత్రి స్వస్వరూపమున
నని యింద్రుఁడాడిన నచ్చిత్రరథుఁడు । తనకుమార్తక కవ్విధం బెఱిఁగించి
దేవమర్మములీవు ద్విజనకుఁ దెలుపఁగావచ్చె నిర్వ్యక్తి గడద్రోయ వశమె?
యైన నొక్కయుపాయ మానిప్రసుతుని । తో నీవుచెప్పి వైద్యుని వేషమూని
చిత్రపురంబేలు చిత్రధ్వజాఖ్య । ధాత్రీకళత్రు చెంతకుఁ బంపు మనుచు
నొక్క మందులసంచి యొసఁగి కుమారి।నకున్క గదియించి యడలుచుఁ బనిచె
ననిచినఁ గనుదోయి నశ్రువుల్ దొరఁగ । గనకరేఖ ద్విజన్మకడకు నారాత్రి
యరుదెంచి బాష్పధారావళి నతని । చరణముల్ గడుగుచు జంభారిరాణి
శాపమిచ్చినకథ సకలంబు దెలిపి । తాపంబుచెంద నతండు ధైర్యంబు
వదలక గంధర్వవనిత కిట్లనియె । మదిరాక్షి! నీవేల మదిని గుందెదవు
మాగురుస్వామి కీమాట విన్పించి । వేగంబె దేవతావిభుని రప్పించి
నీశాపమణఁగించు నేర్పు సంధింతు । నీశ వాణీశ లక్ష్మీశుల నైన
ఘనమంత్రశక్తి నాకర్షింపనోపు । ననఘుండు మద్గురుండన నింతి పలికె
నాఁటి గావింపుఁడది వలదనను । నీపాలి కనుపుచు నేఁడు మాతండ్రి
యెఱిఁగించిన యుపాయ మేర్పడ వినుము । సరగఁ గహకాశదేశంబున కేగి
చిత్రపురంబేలు క్షితినాథు పద్మ । పత్రాక్షి గుల్మంబుఁ బాపఁగా నోపు
నౌషధంబుల సంచి యమర ధరించి । భైషజ్య మొనరించుసని యావహించి
వైద్యవేషమున నవ్వసుధేశుఁ గాంచి । యుద్యదౌషధశక్తి నువిదరోగంబుఁ
బాపెద నిక్కొండ బ్రద్దలుచేసి । గోపుర ప్రాకారకోటి గట్టించి
శివలింగమాక్రింది శిలను సేయింప । నవునె? నీచే నని యతఁ డొడంబడిన
నానొప్పి యప్పరమౌషధశక్తి । మానుపు మని చెప్పి మందుల సంచి
యీయనకొప్పించిహానాథ!నిన్నుఁబాయఁజేసెనెవిధిపగయాళి(?)(పగఁబూని)యను చు

వెక్కి వె క్కేడ్చుచు విభుఁ బాసి పోయి।యక్కల్కి కొండఱాయై యుండె నంత
దైవ మించుక దయ దస్పినఁ బాసి । పోవకుండుదురె స్త్రీపురుషు లెందైన?
నానాతి యీరీతి నరిగిన భీతిఁ । బ్రాణేశ్వరీ! యెడఁబాసితే నన్ను
నినుఁగాన కెటువలె నే నిర్వహింతు।నినుఁ బాసి యేలాగు నిలుచుఁ బ్రాణములు
నని దేవశర్మ దుఃఖాతురుం డగుచుఁ । జని తనగురున కాశాపక్రమంబు
వినిపించి వగచిన వెత చెంద నేల? । ననిమిషపతిశాప మతిశీఘ్రు గతిని
దీర్చి వేసెదఁ జనుదెమ్ము నావెంట । నర్చింత మింద్రుని నాత్మాంబుజమునఁ
గాళిందిదరి కని కదలి ప్రభాత । వేళ నన్నదిఁ గ్రుంకి విహితసత్క్రియలు
నపుడె యొనర్చి జంభారిమంత్రంబు । జపియింపు మని దేవశర్మకు నొడివె
నామంత్ర మతఁడు మధ్యాహ్నంబు దాఁక । నేమంబు భక్తియు నెరయ జపింప
దివిజాధినాథుఁ డెంతేఁ బ్రీతి నిక్క । చెవులనీలని నెక్కి చెచ్చెర వచ్చి
యాయనమ్రోలఁ బ్రత్యక్షమై నిలిచి । నీయభష్టము దెల్పు నెరవేర్తు ననిన
వడి లేచి సాష్టాంగ వందనత్రయము । కడుభక్తి నొనరించి కరములు మొగిచి
యా విప్రవరసూనుఁ డభినుతుల్ చేసి । యో విశ్వజనరక్షణోపాయదక్ష!
నాపాలఁ గలిగి గంధర్వకుమారి । శాపంబు దీర్పవే సరగున ననిన
వజ్రాయుధుఁడు పల్కె వసుధామరేంద్ర! । వజ్రతీక్ష్ణత కాసివారి టంకముల
నిలిపెద గిరిశిలానికరంబు లెల్లఁ । బలు తున్క-లగు దానఁ బదిరెండు నెలలు
గోపురప్రాకారకోటులు కొలఁకు । లాపిమ్మటన్ విను మైదేండ్లకగును
భవలింగ మెనసి సప్తమవత్సరమున । నువిద వెల్వడివచ్చు నుజ్జ్వలాకృతిని
సతి నీకుఁ దెల్పిన చందాన వైద్య । గతిని బ్రయత్నంబు గావింపు మనుచుఁ
దెలిపి యంతర్ధి చెందిన దేవశర్మ । యలరుచు గురువుల యనుమతి వడసి
రత్నకుండల ముదురత్నహారములు । రత్నాంగుళీయక రాజిధరించి
నిలువుటంగి ధరించి నెమ్మో నెసంగ । కళుకుబంగరుపట్టు కబ్బాయి దొడిగి
మిహి బుధసాపాగ మీఁద నెంతేని । రహి మున్ముయంపుఁ దురాయి రాణింప
మంచి సూర్యపుటంపు మందుల సంచి।యుంచిన నడికట్టు హొయలు మీఱంగ
గొడుగువాఁడును భటుల్ గుజ్జంబు వెంట । నెడఁబాయ కేతేర నడపంబువాఁడు
గొనబుపావడవాఁడు కుంచియవాఁడు । గునుకుపర్వున రాఁగ గొబ్బునఁ బోయి

చిత్రకేతుని పూజ చెంది కూర్చుండి । ధాత్రీశ! యభినవధన్వంతరి యనఁ
బరగు వైద్యుఁడ ఋయూపస్మారకుష్ఠ । శరదభ్రభంజన జంఝూనిలుండ
జ్వరతాపగుల్మాద్రి శతకోటి యందు । రెఱుఁగుము నాచేత నింపొందు మందు
నీకాంతగుల్మంబు నెలలోనఁ దీర్తుఁ । జేకొని నాపూన్కి చెల్లింపఁ గలవె?
యని సప్తయోజనాయతశైలభేద । మును గుల్మ గోపురంబు లొనర్చుపనులు
శివలింగము ప్రతిష్ఠసేయుకార్యంబు । వివరింప నతఁడొప్పి వేడ్క నిట్లనియె
నోవైద్యకులచంద్ర! యోదయాసాంద్ర! । యీవు సెప్పిన పనులెల్లఁ జేసెదను
సగము రాజ్యంబు నొసంగెద నీకు । మగువరోగము మాన్చి మావెత దీర్పు
ఖ్యాతియు నందునఁ గలిగెడు ననిన । నాతనినాతికి నౌషధం బిచ్చి
పదునైదుదినములఁ బాపె రోగంబు । మది నుబ్బి సగము సామ్రాజ్యంబుతోడఁ
జతురంగబలముతో సగఁబాలు నిచ్చి । క్షితిపతి యావైద్యసింహుఁ డన్నట్లు
ధరఁ గాసివారి నందఱిఁ బిలిపించి! దొరకొని యక్కొండఁ దొలుచఁ బంచుటయు
ధరవైరి తరవారి ధారానిశాత । తర భూరిటంక ప్రతాన నిర్దళిత
శిఖరి శిలాకోటిచే విష్ణుశంభు । ముఖ దేవతాగృహంబులు గట్టి రంత
నాఱేండ్ల కాశిల్పు లటులద్రిఁ గొట్టి । యూరూరఁ గోవెల లురుగోపురములు
కడు నేర్పున సృజించి కడనెట్టినైన । యడుగుఱాత నొనర్చి రభవలింగంబు
నాలింగ మద్రికన్యామణికృత ద్రు । ధాలింగ మొక హరువో దేవళమున
నుంచి పూజలు సేయుచున్న నందుడి । కాంచనరేఖాఖ్య గంధర్వకన్య
చంచలానిభతనూచ్ఛాయ వెల్వడియెఁబంచాస్త్రి మోహనబాణమో?యనఁగ
హరుజటాచ్ఛటలకెం పధరాధరమునఁ । బరమేశునెలరేకు బాగు నెన్నుదుట
రుద్రగాంగతరంగరూపంబు వళుల । నద్రిజామాతృకంఠాభ వేనలిని
భవహస్తహరిణ విభ్రమము చూపులను । శివుహారవల్లికాశ్రీ రోమరాజి
శూలివామేక్షణస్ఫురణ మోమునఁ గ । పాలిపాండురదేహప్రభ లేనగవున
సంధిల్ల శివవిలాసములతో నిటుల । గంధర్వకామిని గానిపించుటయు
విరహాగ్నిఁ దపియించు విప్రనందనుఁడు । పరితోషవార్ధిలోపల నోలలాడె
కాంతుని దర్శించి గంధర్వసతియుఁ । గంతుతాపమునకుఁ గడచీటిఁ బంపి
చిత్రరథాదులు సేవింప నపుడు । సుత్రాముఁ డరుదెంచె సురల సన్నిధికి

పరమోత్సవమున నాబ్రహ్మవంశ్యునకు । మరలఁ బెండ్లి యొనర్చె మానినీమణిని
చిత్రకేతునృపాలశేఖరుం డాత్మ । పుత్రియౌ సుచి నప్పుడె పెండ్లి చేసె
బలభేదికరుణచే బహుభోగభాగ్య । కలితుఁడై కనకరేఖయు సురుచియును
బరిచర్యలొనరింప బ్రాహ్మణోత్తముఁడు।చిరకాలము సుఖించె సిరు లుల్లసిల్ల
గావునఁ బతిభక్తిగల సతిమణుల । కేవెఱపులు గల్గ వీస్పితం బొదవు
నీకథ వినువారి కెల్లసంపదలు । చేకుఱు శివుకృపాంచితదృష్టి ననుచుఁ
జిలుక తెల్పె నటంచు శివుఁడన గౌరి । యలరి యవ్వలికథ యానతిం డనియె
పరమపతివ్రతాచరితమిం దిరువ । డాఱవకథ యిది యమరోక్తి నమరె
ననుచు సూతుఁడు శౌనకాదిమానులకు । వినిపించె నీకథావృత్తాంతమెల్ల

లోపాముద్రకథ

శ్రీ విశ్వపతి సమంచితనూక్తి గౌరి । కావలికథ యిట్టులని తెల్పఁ దొడఁగె
నలినాక్షి! విను మఱునాఁటి సాయమున । నలదూతితోడ నైశ్యాంగన వచ్చి
చెంగట నిలిచినఁ జిలుక యిట్లనియె । బంగారుపీటపైఁ బడఁతి కూర్చుండు
దూతికతో నీవు తొంటి పతివ్ర ! తాతిలకముల కథల్ వింటి గాదె?
యింక నొక్కటి వచియింతు నాలింపు।మంకించి పేరొక్కన్ననది పాపహరము
అనఘ! మిత్రావరుణా మోఘతేజ । మున కలశంబున మున్ను జన్మించి
బ్రహ్మచర్యమునఁ దపంబు గావించె । బ్రహ్మవర్చస ముట్టిపడ నగస్త్యుండు
దివినుండి వచ్చిన దివ్యునిఁ జూచి । శవపలాశిత మాన్చి సౌఖ్యం బొసంగె
కాలకేయాది రాక్షసుల కిమ్మైన । యీలవణాబ్ధి నీరెల్లఁ దాఁ గ్రోలె
మత్తుఁడై తనకవమానం బొనర్చ్చి । క్రొత్తవేలుపురాజు క్రొవ్వు వారించె
నామునిమహిమ లెనై న్నను గలవు । భామిని పెక్కేండ్లు పరిణయాపేక్ష
చెందక వైరాగ్యశీలుఁడై భూమి । యందెల్లఁ దిరుగుచు నంకొక్కనాఁడు
అడవియొక్కటి చొచ్చి యానట్టనడుమ । పడియఁ బండొక్కటి పరికించి చేరి

తొంగిచూచిన నందధోముఖులై కృ । శాంగులై గరికవే ళ్లమరఁ బట్టికొని
వ్రేలుచుండెడి తపోవృద్ధులఁ జూచి । యేల తపించెద? రిది యేటితపము?
నాకిది తెలుపుం డొనర్తు నేను నన । నాకలశఁజఁ జూచి యమ్మును లనిరి
ఇది విను తపముగా దేమియుఁ గాదు । పొదవిన వెత నధోభువనాంతరములు
ప్రాపించు తెరు విది భవ్యాత్మ! మేఘు । నీపితృవరులము నీవు పెండ్లాడి
పుత్రులఁ గాంచక భూమిఁ ద్రిమ్మరఁగ । మిత్రాత్మజుం డిఁకమీఁద మమ్మెల్ల
నెరయ దుఃఖములు పొందింపఁ దలంచి । పజ తెంచి మూషకభావంబు గాంచి
యేడాది కొక్కవే తెడపకఁ గొఱుకు । నాఁడు నేఁడిటువలె నలఁకువ చెంది
నీతోడఁదెల్పఁ జింతించి యుండఁగ । నే తెంచితివి కోర్కె లీడేరె మాకు
నాలస్య మొనరింప కనువై నచోట । బాలికఁ బెండ్లాడు ప్రభవించు సుతుఁడు
అని పితృదేవత లర్థిఁ బ్రార్థింప । వినతుఁడై ఘటసూతి విమలాత్మ్మలార!
మీరు సెప్పినపని మేకొని చేతు । వైరాగ్య మిఁకమీఁద వదలెద ననుచు
వారి వీడ్కొని చని వసుధఁ ద్రిమ్మరుచు । ధారుణీశుల సభాస్థలముల కరిగి
తాను బెండ్లాడఁగాఁ దగుకన్య నడుగ । నేనరేంద్రులు తమయింట లేదనిరి
అంతవిదర్భేశుఁ డగురాజుఁ జేరి । యెంతయు రహి నాతఁడిచ్చు పూజలను
జేకొని కన్యని చ్చినఁ బెండ్లియాడు । నాకాంక్ష వచ్చితి ననఘాత్మ! నీకుఁ
గన్నెయుండిన నిత్తుగా కన్న భక్తి । నన్నరేంద్రుఁడు పల్కె నట్టిభాగ్యంబు
గలవాఁడఁగాను నీకరుణచేఁ బుత్రి । గలిగినఁ బెండిలిగావింతు నీకు
ననినఁ గానిమ్మని యతఁ డిష్టి యొకటి । జననేతచేత నాఁపణమ సేయించి
యనలప్రదత్త పాయసము తద్భార్య । కనురక్తి నిచ్చిన నామె చూలయ్యె
నీదేవియందు జన్మించిన కన్య । నాదిసు మ్మని మునినాథుండు చనియె
నవమమాసమున నందన నోర్తుఁ గనియె । ధవళాయతాక్షి విదర్భేశురాణి
యటులఁ బుట్టిన పట్టి కాకాశవాణి । పటుగుణోన్నిద్ర లోపాముద్ర యనుచు
నామధేయ మొనర్ప నవమోహనాంగి । యీముద్దుకన్య నిజాంబ పోషింప
సవరొందె శుద్ధపక్ష సుధాంశురేఖ । సవతున నానాఁట సత్కళల్ హెచ్చ
శైశవంబు క్రమింప జవ్వనం బొదవె । నాశశిముఖ, కగస్త్యమునీంద్రుఁ డలరె

నెలరేక బలుజోకనిరసించు దీని । యళికంబు భళి! కంబు వౌర! కంఠంబు
బెళుకుమాఱుచుఁ గదా బెళుకు బేడిసలఁ । గలకంఠి జళుకు వాల్గన్నుల డాలు
నుదిరిబంగఱునక్కఁ లువిదలేఁజెక్కఁలదిర! పూర్ణేందుసోయగ మోము మోము
చివురుఁదివి హసించుఁ జెంగావి మోవి । కవజక్కవల కెక్కఁ గడచు చందోయి
నలచీమపరి మీఱు నాతినూఁగారు । కలదో లేదో కాని కనరాదుకౌను
ప్రతిబింబ ముర్వికి భామనితంబ । మతివపెందొడలు హొన్ననఁటుల తడలు
రాయంచనడల నౌరా! యెంచ దింతి । యీయూనవై ఖరి యెంతైనఁ గలదె!
అని కనుగొన్నవా రభినుతి సేయ । మనసిజ ప్రాజ్యసామ్రాజ్యలక్ష్మివలె
నాయతగుణరాశియై మించె నిండు । పాయంపుకలిమి లోపాముద్రయపుడు
ఘటజున కలికి యాకలికి నిమ్మనుచు । నట రాజులెవ్వరి నడుగ రారైరి
కాంత యీడేరుట గస్త్యుండు నెఱిఁగి । సంతసించి విదర్భజనపతిఁ జేరి
యతనిపూజలఁ దృప్తుఁడై యిట్టు లనియె । క్షితినాథ! నీపుత్రి శృంగారధాత్రి
యీడేరినపుడె మాకిచ్చెద నంటి । వీడేరెఁగద పెండ్లి యిఁకఁ జేయఁదలఁతె
పలుకరే బుధులు శుభస్యశీఘ్రమని । మలయజగంధికి మాకు నీరాత్రి
గావింపు పెండ్లి లగ్నము మంచి దనిన । నావిదర్భాధీశుఁ డాత్మఁ జింతిలుచు
నంతఃపురంబున కరిగి పట్టంపు । టింతినిఁ బిలిపించి యిట్లని పలికె
కలశజుం డేతెంచి కన్నెనిమ్మనుచు । బలవంత మగుతమిఁ బలుకుచున్నాఁడు
ఎటువలె నొసఁగుదు నీపువ్వుబోణి । జటిలున కిచ్చిన సౌఖ్యముల్ గలవె?
అంటినఁ గందు నియ్యతివమే నితని । వెంట నెట్లు చరించు విపినభూములను
మేలి రాజాన్నముల్ మెసవెడు ముద్ద । రాలెట్లు కందమూలాదులు మెక్కుఁ
గనకాంబరంబులు గట్టులతాంగి । వనట వల్కలము లేవగ ధరియించు
నీపంకజానన నీమోహనాంగి । నీపల్లవాధర నీమంజువాణి
నీవేదతపసికి నీజటాధారి । కేపొలుపున నిత్తు? నియ్యలే ననిన
శపియించిపోవు నీసంయమీశ్వరుఁడు । తపసికి ముక్కమీఁదనె కోప మెనయు
ననిన నాతనిదేవి యమ్మనేఁజెల్ల । మునికిచ్చు టెట్లు? నాముద్దుకుమారి
నిప్పఁ డియ్యఁ బొసఁగ దింతి నటంచుఁ । జెప్పిరమ్మా! మునిశ్రేష్ఠున కనుచుఁ
బలికెడిపలుకు లోపాముద్ర కెలన । నిలిచి యాలించి తండ్రికిఁ బ్రొక్కి పలికె

యిది యేటియోజన లిపుడు చేసెదహ । మొదట నిచ్చెద నని మునివరతోడ
నీవు పల్కితివఁట యెఱుఁగవే! పెండ్లి।గావింపు మనిన నక్కట! బొంకఁ దగునె?
యామహామహుని మహత్త్వంబు వినవె?।యేమికొఅంత? యీబుషిశేఖరునకు
నత్తపోనిధికి నయ్యా! నేను పూర్వ । దత్తనై వేఱొక్కధవునిఁ జెందుదునె?
యతఁడె నాప్రాణేశుఁ డతఁడె నాదైవ । మతని కిప్పుడ వివాహము సేయుఁ డనిన
నయ్య సంతోషించె నంబ మెచ్చికొనె । నయ్యెడ మునిపాలి కరిగి భూవిభుఁడు
అనఘ! కన్యాదాన మాచరించెదను । జనుదెండు లగ్ననిశ్చయము గావించి
యనిన నగస్త్యమహర్షి యారాత్రి । యనుకూలలగ్న మున్నది యనేఁ గనుక
పురము నంతఃపురంబు నలంకరింప । వెరవరులగువారి వేవేగఁ బంచి
తఱచుగా శోభనద్రవ్యముల్ గూర్చి । పరమోత్సవ మొనర్చి బంధుల సఖుల
హితుల మంత్రులఁ బురోహితుల రావించి।సుత పెండ్లికూఁతురై సొంపు వహింప
ఘనభూషణాదులఁ గైసేయఁ బంచి । మునికి ఔరాభ్యంగములు మజ్జనంబు
నావేళఁ గావింప నలరి యాతఁడు స । మావర్తనాఖ్యహోమం బాచరించి
తనమామ కన్యను దారవోయుటయు । ననురక్తి పాణిగ్రహణము గావించె
స్వకులోచితాచారసరణి నీరీతిఁ । బ్రకటవిభూతి లోపాముద్రఁబెండ్లిఁ
జేసి యల్లునిఁ బూజచేసి రంజిల్లఁ । జేసి కుండినభర్త క్షితిసురాదులకు
ధనకనకాదులు తనియఁగా నిచ్చె । దినములునాలు గీతీరునఁ గడపి
కలశోద్భవుఁడు రాజకన్యకఁ బిలిచి । చెలువ! నావెంట వచ్చెదవేని మేన
నీవుధరించిన నిఖలభూషణము । లీవేళ సడలించి యింటిలో వైచి
తాటిబొట్టును గమ్మతాటలు దాల్చి । బోఁటి! నావెంటను భోరున రమ్మ్ని
అనిన స్వామిప్రసాద మని యప్పురంధ్రి । తనమేనిసొమ్ము లత్తఱి సడలించి
మునిగణించినక్రమంబున నారచీరె।యును బూనె మెడపుత్తెయును వీనుదోయి
మెఱుఁగుకమ్మ లెసంగ మిక్కిలిభక్తి । నెరయఁ దల్లికిని దండ్రికి నెచ్చెలులకుఁ
జెప్పియుఁ జెప్పక చెచ్చెరరాఁగ । నప్పడంతిని జూచి యతఁ డిట్టు లనియె
నలివేణి! ననుఁ బెండ్లియాడినఫలము । గలిగెఁదోడ్తోడ నేగతిన న్న వినుము
చారుదుకూలముల్ సడలించి నార । చీర గట్టఁగనయ్యె చెలువ! నీకటిని
తొడిగినతొడవులఁ దొడిబడ నవలఁ । బడవైచి నిరుపేదపడుచు చందమునఁ

గరములఁ గాచకంకణములు పుట్టె । యఱుత నల్ల లుప్పూన నయ్యోనీకరణి
ఇందున నీడెంద మెంత కుందినదో? । యిందుముఖిమణి! యీసొమ్ము లూని
యింట నుండెదొ? వెంట నేగుదెంచెదవో! । జంటగా నీకెద్ది సరిపోవు ననిన
నక్కన్య భయముతో హస్తముల్ మొగిచి।మిక్కిలి మధురోక్తి మించనిట్లనియె
స్వామి! మీపాదదర్శనము సేకుఱిన । నేమియు నేటికి? నీసొమ్ము లేల?
తలిదండ్రు లేల? సందడిసేయు చెలుల । వలన నేమగు నింక వారి నేనొల్ల
మీవెంట వచ్చుచె మిగుల భూషణము । మీవచనము విని మీపనుల్ సేయఁ
గలుగుచె యుభయలోక సుఖప్రదంబు । నెలమి మీ రున్నచోటే త్రిదివంబు
పరమేశ్వరుఁడవు నాపాలికి నీవె । పరికింప నీవె నా ప్రాణబంధుఁడవు
అనిన సంతోషించి యమ్మునీశ్వరుఁడు । తన యత్తమామలఁ దగవొప్పఁ బిలిచి
తపసుల కిండ్లలోఁ దగదు వర్తింప । విపరీతమై తోఁచు వెలఁదిఁ దోడుకొని
యడవికి నేగెద మాత్మజఁ దలఁచి । యడలకుఁ డని వారియాజ్ఞ వారించి
పురి వెలువడి దూరముగ నేగి యచట । నిరుత్రోవ వీక్షించి యింతి కిట్లనియె
నలివేణి! యీత్రోవ నరిగినఁ గరులు।పులులెలుంగులు సింహములు ముళ్లు రాళ్లు
గలవు కార్చిచ్చుకాకలు హెచ్చి యుండు । నలయిక జనియించు నతిదుర్గమంబు
ఎలనాగ! యిటు చూడు మీత్రోవఁ జనినఁ।జలువలు వెదఁజల్లు చల్ల తెమ్మెరలు
పూఁచి కాఁచి ఫలించి పొదలు వృక్షములు । నేచక్కఁ జూచిన నింపావహించు
పన్నీటి కాల్వలు పచ్చకప్పురపుఁ । దిన్నెలు కిన్నరస్త్రీ వితానముల
తానముల్ గానముల్ దగు నివ్విధమున । మానక పోదమా మతి తొల్ల నేను
చెప్పినత్రోవనె చెలువ! పోవుదమొ । యిప్పథద్వయి నేది యిష్టంబు నీకుఁ
దెలుపవే! యనిన నద్దేవి యిట్లనియె । నలఘు తపస్యామహత్త్వ నిధాన
యీత్రోవలందు మీ కేది యభీష్ట । మీత్రోవఁ జనుఁడు నన్నడుగ నేమిటికి?
స్వామివా రరుగుత్రోవయె సత్పథంబు । నా మునినాథుండు నగుచు నందొక్క
సరసపథంబునఁ జని పూర్వదిశను । గరము రంగాఱు గంగాద్వార మెనసి
యందుఁ దపోనిష్ఠ నచలుఁడై యుండె । సుందరి యలయక శుశ్రూష సలుప
నాయమ మృదుభాష లామెశుశ్రూష । లాయమ్మపతిభక్తి యలవియె పొగడ
నీరీతిఁ బెక్కేఁడు లేశాగ్రనియతి । ఘోరతపంబు గైకొని చేసిచేసి

చాలించి యొకవేళ సన్నిధి నున్న । నాలేమ నవయౌవనాస్థానసీమఁ
గనుగొనియా మెమొగముచక్కఁదనము।నునుమోమురవుకన్నులబెళుకుముఱవు
కప్పుదేఱెడి కొప్పు గబ్బిపాలిండ్లు । యొప్పు సన్నపుఁగౌను హొన్‌జాయ మేను
దళుకుచెక్కుల చెక్కు తన కనురాగ । విలసనం బొనగూర్ప వెడవింటివాని
బారికిఁ జిక్కి విభ్రాంతుఁడై సొక్కి । హేరాళ మగుతమి నిట్లని తలఁచెఁ
గనికరంబున దీనిఁ గాఁగిటఁ జేర్పఁ । జనుదోయి నాయురస్థ్సలిఁ గ్రుమ్మదేమొ?
చిక్కించికొని దీని చెక్కిలి నొక్క । చక్కిరలొలుక ముచ్చటలాడదేమొ ?
మొనపంట దీనికెమ్మోవి నొక్కినను । గనుఁగవ మొగిచి సీత్కారమ్ము లెసఁగ
నా యెదసై వ్రాలి ననురతిఁదేల్చి । యీయెడఁ దగుబాళి నేలుకోదేమొ?
అని యెంచి వైదర్భి హస్తంబుఁ బట్టి । కొనిన నచ్చెలి మానికోరిక యెఱిఁగి
కరములు ముకుళించి కడుభక్తిఁ బలికె । వెఱచి వచింతునో వెఱవక మీకు
విన్నవింతునొ? సద్వివేకనిధాన? । యున్నది మది కోర్కి యొక్కటి వినుఁడు
కృతకాచలమ్ములు కేళికాగృహము । లతులసౌధములు లే వాభరణములు
చారుదుకూలముల్ స్రక్చందనాది । సౌరభ్యములు లేవు సఖులును లేర
తగు హంసతూలికాతల్పముల్ లేవు । సొగసువింజామరల్ సురటీలు లేవు
భజియించుటకునొక్క భటుఁడును లేఁడు। భుజియించుటకుభక్ష్యభోజ్యముల్ లేవు
ఎట్టుల సౌఖ్యమా నీనారచీరఁ । గట్టి జటీభూతకైశిక నగుచు
నేపోడుములు లేక హృదయేశ! మిమ్ము । నీపర్ణశాలలో నెనసి క్రీడింప
నిది మీకు సరిపోవునేని మేకొనుఁడు । మది నాకుఁ దోఁచినమాట తెల్పితిని
అదిగాక భువనమోహనమూర్తి దాల్చి । సదమలవస్త్ర భూషణ గంధమాల్య
ధారివై రత్నసౌధముల నన్ గూడి । భూరిభోగమ్ములు పొందుట లెస్స
యీముచ్చటలు దీర్చ లెచ్చుగా దరయ।మీమహిమ కటంచు మెలఁతుక దెలుప
నాముగ్ధకోరిక లాలించి నగుచు । ధీమంతుఁ డామునితిలక మిట్లనియె
చెలువ! నీయిష్టార్థసిద్ధి గావింపఁ । దలఁచిన నాతపోధనము వ్యయంబు
సేయఁగావలయుఁ గించిదోభగములకు । నాయాసపడి చేసినట్టి తపంబు
వ్యయ మెట్టుగావింతు వనజాక్షి! విషయ । చయవాంఛ వదలిన జటిలుఁడ నేను
నైన నీకోరినయటులఁ గావింతు । నేను యాచనచేసి యిలయెల్లఁ దిరిగి

నండాఁక యిందుండు మని ముని సతులఁ । గొందఱితోడుగాఁ గోమలి నునిచి
సతిఋతుకాలంబు చనకముందరనె । యతివేగమున వత్తు ననునిశ్చయమున
యాచనగావింపనరిగె కుంభజుఁడు । భూచక్రమున ఘనంబుగ ధనంబున్న
యవనీశు లెవ్వరో యని వెదకుచును । శివశివ! యొంతలేసి మహాత్ములకును
నడుగఁగావలసె నర్థార్థనాపేక్ష । విడువశక్యమె? తక్కు విషయాతురులను
నిటుల నగ్ని యనేకభూములకుఁ । బటుగతిఁ జని శ్రుతపర్వుఁడన్ రాజుఁ
గని రాణువకు నీకు గ్రాస మేఁడాది । కినిగల్గఁ జూచి మిగిలియున్న ధనము
మాకొసంగు మటన్న మహినాథుఁ డనియె । మీకేల నిచ్చోట మిగిలిన నేమి
మిగులకుండిన నేమి మీకుఁ గాంక్షింప । నగు ధనంబిచ్చెద నదిగొని చనుఁడు
నావిని యమ్మునినాథుఁ డిట్లనియెఁ । గావలయు ధనంబు కక్కర్తిఁ జేసి
కొనిపోవరాదు నీకుఁ గలంతధనము । వినుగణికులఁ బిల్చి వివరింపుమనినఁ
గరణంబు లనిరి బొక్కసమున ధనము । పరికింప నున్నది పదిమాసములకుఁ
జాలదుకొదువమాసంబుల కనిన । నా లేనిదొరవుగా వీలేనినిన్ను
వేధింపరాదు నావెంటనె రమ్ము । సాధుపీడ యొనర్పఁ జన దని యతఁడు
నతనితోఁ దద్రస్యుఁడను రాజుఁ జేరి । శ్రుతపర్వ నడిగినచొప్పున నడుగ
మానీంద్ర! తొమ్మిదిమాసంబులకును । నానిలయమున నున్నది ధనం బనిన
నీవు దరిద్రుండ వేమియిచ్చెదని । యావసుధేశుండు ననుచహం డగుచుఁ
గొలిచిరా ముని పుడుకుత్సకుమాఱ । నిలయంబుఁ జేరి యాన్నృపుల నిర్వారను
నడిగిన ట్లాతని నడుగ బొక్కసముఁ । దడవి యేడాదికి ధనము లేదనఘ!
యొకనెల కొదువగా నున్న దటన్న । పకపకనగి ఘటప్రభవుండు వారి
మువ్వురఁ గని ధనంబు సమగ్రముగను । నెవ్వనికున్నది యెఱిఁగింపుఁ డనిన
స్వామి! వాతాపియిల్వలుఁ డను దైత్య । లీమణిమత్పురం బేలుచున్నారు
వారు మహాధనవంతులు వారిఁ । జేరిన నిష్టార్థసిద్ధియౌ మీకు
ననిన సంతోషించి యాన్నృపుల్ వెంటఁ । జనుదేర దనుజుల సదనంబునకును
ఘటనూతి పోయినఁ గని వార లలరి । పటుభక్తి నర్ఘ్యంబు పాద్యంబు నొసఁగి
యయ్య! యిప్పుడు విందవై వచ్చినాఁడ । వియ్యిలాధిపులతో నీవు మాయింట
భోజనం బొనరించి పొసఁగ వచ్చినప్ర। యోజనంబు గణించి యొనగూర్చికొనుము

అనిన భోజనమున కమ్మునిఁ యొప్పి । కొనియె వాతాపిని గొట్టెను జేసి
యఱవఁగా మెడఁ గోసి యయ్యల్వలుండు।పరిపక్వముగ వండె భక్ష్యభోజ్యముల
తోడ నమ్మాంసంబు దొర లదియెఱిఁగి । వీఁడు దుర్మార్గుండు విందులు చెప్పి
వాతాపి వేఁటగా వధియించి విప్ర । జాతులకిడి వారిఁ జంపి యాపొలసు
తమ్ముఁడు దానును దగిలి భక్షించు । నమ్మరా దీభోజనము మాని వీని
నడిగి వీఁడిచ్చు మహార్థంబు గొనుచుఁ । గడువేడ్కఁ బోదము కటకంబులకును
నానిని వాతాపి నన్నేమిసేయు । నో వీఁడు సేయు దంభోపాయవిధులు
సూతము సైచు డంచు నగ స్తి పలికి । వాతాపిమాంస మిల్వలుఁడు వడ్డింప
భోజ్యముల్ బహుభక్ష్యములుచోష్యములుగ।నాజ్యధారలతోడనశనంబుగొనియె
నారగించి సుతుష్టుఁడై యగస్త్యుండు । వారిధారలఁ గరద్వయి వార్చి యొక్క
వేదిపైఁ గూర్చున్న వేస నిల్వలాఖ్యుఁ । డౌదానవుం డామహాత్మ్యని మహిమ
యెఱుఁగక వాతాపి యేగుదె మన్మినఁ । జిఱునవ్వుతో మహర్షిప్రవరుండు
తనపొట్ట నివిరి వాతాపి జీర్ణించె । నని త్రేన్చి జఠరాగ్ని కాహుతి చేసె
నిల్వలుం డదియెల్ల నెఱిఁగి భీతిల్లి । నిల్వరా దితని సన్నిధి నల్లనేని
దగ్ధంబు సేయు నెంతటివాని నైన । స్నిగ్ధతేజుఁ డటంచుఁ జేతులు మొగిచి
స్వామివా రిచటికి వచ్చిన కార్య । మేమి? సత్కృప నానతియ్యవే! యనిన
వానితో నమ్మునివల్లభుం డనియె । నీనరేంద్రులు ధనహీనులు వీరి
ధనికులఁ జేయుము తరువాత మాకు । ధనకనకాది వస్త్రవిభూషణములు
తఱుచుగా నిమ్మన్న దైత్యుండు పసిఁడి । యరదంబు బహుధనం బమ్మునికిచ్చె
నతఁడు తెల్పినయట్లు లవనీశ్వరులకు । విదితార్థరాసులు వేర్వేఱ నొసఁగె
మణులు భూషణములు మహితాంబరములు।గణనీయవస్తువుల్ గైకొని మాని
యామువ్వురు నృపాలు రతిభక్తిఁ గొలిచి । రా మణిస్యందనరాజంబు నెక్కి
వై దర్భి యుండెడి వనము ప్రాపించె । నాదొరల్ వివిధహర్మ్యములు సౌధములు
పటసాలలు విచిత్రభవనముల్ గట్టు । నటులఁ జేసి మనోహరాంగసంగతులఁ
జెలులవేవేల నిచ్చిరివి దర్భేశుఁ । డలకుమారికి వివిధాభరణములు
చిత్రాంబరములు నెచ్చెలుల నొసంగె । ధాత్రీశు లేగిరి తమదేశములకు
మతి దలంచినయట్ల మహితసంపదలు । పతి యిట్లుమర్వ లోపాముద్ర యలరి

తొడి కట్టి పూసి యెంతోప్రకాశింప । జడదారి తద్దృగుత్సవమూ ర్తి దాల్చె
నింతితోఁ గేళికా గృహాములయందు । మంతనంబునఁ బైఁడి మాడువులందు
శృంగారవనులందుఁ జిత్రబంధముల । నంగజప్రాజ్యరాజ్యము మాని యేలె
నందున గర్భిణియై సంతసమున । సుందరి వెయ్యేండ్లు చూలు ధరించి
కనియెఁగృతాశ్వుఁడన్ ఘనపుత్రునొకనిఁ।దనరనాతఁడునువేదములుశాస్త్రములు
తల్లిగర్భమునందె తా నభ్యసించి । ముల్లోకములఁ గీర్తి మొనయ రాణించె
నతనికిఁ దేజస్సి యనుపట్టి యొడమె । పితరులు సద్గతుల్ బెరసి రందునను
వెలఁది లోపాముద్ర వెంబడిరాఁగ । నల మాని వింధ్యాద్రి నడఁగిపోఁ గ్రొక్కెఁ
దరుణి పతివ్రతాధర్మంబువలన । మెరసెఁ ద్రైలోక్యంబు మెచ్చ నవస్థాని
తపసి కీలేమని తలిదండ్రులనఁగఁ । గుపితయై వారించి కుంభసంభవునిఁ
జెట్టబట్టంగ నోచిన పతివ్రతల । పట్టంపుఁదల్లినిఁ బ్రణుతింపఁ దగదె?
యిట్టి లోపాముద్ర హితగుణోన్నిద్రఁ । దొట్టినభక్తితో స్తోత్రంబుసేయు
వారికిఁ దత్కథ వర్ణించువారి । కారోగ్యభోగభాగ్యములు సిద్ధించు
నని చిలుక తెల్పిన నవ్వైశ్వకాంత । తనువల్లి పులకింపఁ దనయింటి కరిగె
చిలుక నెంచుచు దూతి క్షితిపతిఁజేరి । తెలిపె నక్కథ సుధాధికమృదూక్తులను
అని శంభుఁడెఱిఁగింప నవ్వలికథలు । వినిపింపు మని గౌరి వెండియు నడిగె
సనయ పతివ్రతాచరితమం దిఱువ । దెనిమిదియవకథ హితసూక్తి నమరె

కేయూరబాహుని కథ

శ్రీ విశ్వపతి సమంచితమతి గౌరి । కావలికథ యిట్టులని తెల్పఁ దొడఁగె
దూతితో మరునాఁడు తొడఁబుట్టుజాతి । నాతి చేరినఁ గేరి నగి కీర మనియె
పుష్పమంజరి! దుష్టబుద్ధులౌ చెలులు । దుష్పురుషులు తప్పుత్రోవఁ జూపినను
ఆత్రోవఁ జనదు మహాపతివ్రతలు । స్తోత్రపాత్రచరిత్ర ధూర్వహులగుట
ఇందుల కొకకథ యెఱిఁగింతు వినుము । మందారమకరంద మాధుర్యధుర్య
ధారాళ వాక్చమత్కార మింపూర । సారపూరుజ్జ్వలసౌభాగ్య మహిమ

సవరా త్రిగర్తదేశమున శృంగార । భవనమన్ పురము భూభామనూపురము
నాపురవర మేలు నహితభూపవ్ర । తాప దావానలతాప నిర్హరణ
దారుణ శరవర్ష ధారాధరుండు । భూరిపేణుం డను పుణ్యమూనసుఁడు
ఆరాజవర్య భార్యామణి యగుచుఁ । జారుశీలానామసాధ్వి రాణించు
నతనిచెంత సుకీర్తి యనుమంత్రి గలఁడు । చతురబుద్ధి వివేకసౌజన్యధనుఁడు
ఆమంత్రితోఁ గూడి యఖిలభూప్రజల । సౌమనస్యంబున సతతంబు ప్రోచుఁ
దనయాజ్ఞ వినతు లౌదలఁ దాల్పు విశ్రు । తనయాప్తి వెలయు నద్ధరణీశ్వరుండు
తనయులు లేకున్క తహతహ చెంద । మనుజేశుఁ జూచి తన్మంత్రి యిట్లనియె
మనయూరి కాళికాంబను గొల్వు మిచ్చు । ఘనుఁడైన తనయుని గాంభీర్యధనుని
ననిన మంచిది యని యారాజవరుఁడు । దినదిన మమ్మహాదేవిఁ బూజింపఁ
గలలోన నొకనాఁడు కాళికాదేవి । యలరాజమణికిఁ బ్రత్యక్షమై యొక్క
యాణిముత్య మొసంగి యధిప నీకూర్మి । రాణిగర్భమున నీరత్నంబుఁబోలు
పట్టి జనించు దోర్బలశాలి యట్టి । పట్టికిఁ గేయూరబాహుఁ డన్ పేరు
పెట్టి పోషింపుము భీకరాసురులఁ । బట్టి మర్దించు వైభవమున మించు
నిది నిజంబని తిరోహితయైన రాజు । ముద మంది పత్ని కమ్మ్రొత్తియం బొసఁగె
నది శిరోరత్నమై యమర నద్దేవి । తదనంతరంబునఁ దాల్చె డౌహ్యాదము
గర్భలక్షణములు గని సంతసించె । నర్భకుం డుదయించు ననువేడ్క నృపతి
పదునొకండవలనెలఁ బ్రభవించె శుభము । నొదవించు తావులనుండి సుకేజ్య
కవిబుధశశిముఖ గ్రహముల్ శుభేక్ష । నవలోకనము సేయునపుడు పుత్రకుఁడు
ఆవేళఁ బుత్రోత్సవాదు లొనర్చి । శ్మ్మావరుఁ డానందజలధి నోలాడెఁ
బట్టికిఁ గేయూరబాహుఁడన్ పేరు । పెట్టి శాంభవియాజ్ఞఁ బృథ్వీశ్వరుండు
అతఁడు జన్మించిన యయిదవనాఁడె । ధృతిమంతుఁడగు సుకీర్తికిఁ గుంభి వుట్టె
వాఁడు పుట్టెడువేళ వక్రించి గ్రహము । లేడును రెండు క్రూరేక్షు నీక్షించె
నేటఁ బెంచినవాని కెలమితో నొక్క । పూటఁ బెంచిరటన్న పొలుపు దీపింప
దాము లారాజనందనునిఁ బోషింపఁ । బ్రోదిచెందె నతండు పున్నమనాఁడు
కళలచే విలసిల్లు కలువలరాజు । చెలువునఁ గళ లభ్యసించె నానాఁట
గరిడిసాధన నేర్చెఁ గార్ముకవిద్య । లెఱిఁగి హయస్యందనేభావరోహ

గతుల యుద్ధము సేయు కదలికల్ వొరసె। చతురుఁడై యౌవనసంపద మెఱసె
నీతి లేఁబ్రాయ మెనసిన నృపకు। మాఱుతోఁ గూడి యమ్మంత్రినందనుఁడు
కుంభి సౌశీల్యాది గుణకుంభినీజ। కుంభి తాను నెఱింగికొనెఁ గొన్నికళలు
కుచ్చితుండని మంత్రికొడుకు నెఱుంగ। కచ్చిన్నిరాజు వాఁడాప్తుఁ డటంచు
నెనరుతో నెపుడు మన్నించు సమీప। మున నుంచికొని తాను భుజియించువేళ
విహరించునెడ నెల్ల వేళల యందు। బహుమైత్రి నిటు లెడఁబాయక యుండి
యొకనాఁడు నగరబాహ్యోద్యాన భూములకు వానితో నరాళము పోవఁ దలఁచి
లలిత చతుర్విధాలంకార మూ ఱు। లలఘు బాణాస సాయక ఖేటకాది
వివిధ సాధనసమన్విత పాణు లగుచు। జవనాశ్వములు రభసంబున నెక్కి
యిరువురు చనిచని శృంగారవనులు। సరములు కేళికాశ్లైలముల్ నదులు
గాంచుచు ముందరఁగాంచి రుత్తుంగ। కాంచనప్రాకార ఘటితకవాట
ధవళగోపుర విచిత్రధ్వజ రత్న। నివహ తోరణ సుమాన్వీత వితాన
చలదళి ఝుంకార శారికాకీర। కలకంఠ కలనాద కలనా విశాల
లీలావనంబు కాళీభవనంబు। భూలసత్కవనంబు బుధజీవనంబు
కాంచి పురోవీథిఁ గనుపించు కొలని। యంచెల, నెక్కిన హయముల డిగ్గి
సరసీజలములఁ బ్రక్షాళితహస్త। చరణులై వెలువడి శాంభవీదేవి
గోపురద్వారంబు గురుభక్తిఁ జేరి। రాపట్ల కుంభి చయ్యనఁ గూరుచుండి
కాళి నప్పుడె కనుగొంటి నోభూమి। పాలనందన! చాలబడలియున్నాఁడ
నీగుఱ్ఱముల చెంత నేవసియింతు। వేగ నీవేగి దేవీదర్శనంబు
చేసి రమ్మనిన మంచిదియని యట్టె। రాసుతుం డాగోపురద్వారమునఁ నె
కరముల మోడ్పుతోఁ గన్నుఁదామరల।దొరగు ముదశ్రుబిందువులతో భక్తి
పరవశత్వంబుతోఁ బ్రతిపదోచ్చరిత। భరిత దేవీస్తోత్రపఠనంబు తోడ
నలరుచు నవ్వలనరిగి ముమ్మారు। వలగొని దేవి దేవళము ప్రాపించి
భావించి సేవించి ప్రాంజలి యగుచు। నావిశ్వమాత నిట్లని ప్రస్తుతించె

నిరోష్ఠ్యము

జయ జగత్కారణి జయ దయాధరణి। జయ దృశాహారిణి కాసర సాల కరిణి
జయ నీలగాత్రి దాసజనేష్టదాత్రి। జయ చిల్లతాధాత్రి జయ కాళరాత్రి

NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. No.

జయ శాస్త్రసిద్ధాంతసంతతాక్రాంత । జయ గల్లశశికాంత జయ నిత్యశాంత
నిశాంతి నీకాంతి నేర గణింప । నాశాస్యదాయిని యని శతానంద
హరిహరాదిక నిర్జరాళికీర్తింప । నరసిగట్టించిన యాదయయ్యంశ
నాయెడ నిడి యేదినన్ గీర్తికల్గ । దే యని గణియించి యేకాగ్రనిష్ఠ
నావల గర్భగృహ ప్రదక్షిణము । గావింపుచున్న నక్కడ నొక్కచోట
దట్టమా కెంజడల్ తలదిండుగాఁగఁ । జుట్టి విభూతి నచ్చుగఁ ద్రిపుండ్రంబు
ఫాలభాగంబునఁ బఱఁగు రుద్రాక్ష । మాలికల్ తలచుట్టు మణిబంధములను
గళమున విలసిల్లఁ గై జపసరము । చెలువొంద గోడఁజేర్చిన త్రిశూలంబు
కడఁ గకపాల చొక్కపు భూతిసంచి । నిడుదలాతము మణినివహమ్ము పెట్టి
దీపించ నాసాగ్రదృష్టితో స్వస్వ । రూప చింతా సుధారుచిఁ జొక్కుదాని
వినత చతుష్షష్టివిద్యా సపద్య । చతురతాసూచ్యర్థిచే సడిసన్న దాసి
నొక సిద్ధయోగిని నుత్కంఠఁ జూచి । ముకుళితహస్తుఁడై ముందరి కేగి
యతిభక్తి క్రమొక్క నాయమ యెప్పలె త్తి।యతని నీక్షించి మాయన్న! రావోయి
భూరిపేణకుమార! పుణ్యసంచార! । చేరి కూర్చుండు మిచ్చెద నభీష్టములు
నీదేవికృప జనియించినాఁడవు శు । భోదయుండవు గాన నొదవు శ్రేయములు
దేవియాజ్ఞ హితోపదేశంబు నీకుఁ । గావింతునని మేను కరమున నిమిరి
విను నీకు శస్త్రాస్త్రవిద్యలు చాల । కునికి కృతాస్త్రసేయుటకు వచ్చితిని
సకలదివ్యాస్త్రశస్త్రము లొసంగెదను । నికట కమండలు నిర్మలాంబువుల
మనుచర్య శుద్ధాచమానంబు సేయు । మన నాతఁడటువలె నాచరించుటయు
వలనొప్ప మంత్రపూర్వముగ దివ్యాస్త్రములును దివ్యాయుధంబులు ప్రసాదించె
బహుకవచములిచ్చెబ్రాహ్మ్యకౌద్రాస్త్ర।సహితంబుగాఁగవైష్ణవబాణమొసఁగె
నిటులఁ బ్రత్యక్షమా హేశ్వరి యగుచు । నట గానుపించిన నద్దేవి వలన
వారుణాగ్నేయ వైవస్వత సౌర । మారుత కౌబేర మానవాస్త్రములు
గారుడ పైశాచ ఘనతమఃపర్వ । తోరగేంద్రా సురాత్యుగ్ర బాణములు
నాదిగాఁ గలుగు దివ్యాస్త్రముల్ వడసి।యాదిత్యుల కజేయుఁడై యాఘనుండు
నురుభక్తి తత్పరియోగోపసంహార । గరిమ లెల్ల నెఱింగి క్రమ్మఱ ద్రొక్కి
కరములు మొగిచి చెంగట నిలుచున్న । మఱుల నయోగినీమణి యిట్లు లనియె

దేవీకృపాదృష్టి దివ్యాస్త్రవిద్య । లీవు నేర్చితివిది యెవ్వరితోడ
నెఱిఁగింపఁ బోకుమీ యీకుంభితోడ।మఱచి తప్పియు వచింపకు వీఁడు చెడుగు
తలఁపులో శస్త్రాస్త్రతతు లివిమెలఁగు । కలన రక్కసులఁ బెక్కండ్ర నుక్కణఁచి
బహుభామల వరించి బహుభోగ భాగ్య।మహిమనింద్రునిఁబోలి మహి యేలగలవు
ఊరికిఁ బొమ్ము మేలొదవు నీకనుచు । నారాజసుతుఁ బల్క యంతర్ధి చెందె
మాయమ్మయైన శాంభవియె కాఁబోలు । నీయమ్మ గాకున్న నీమహామహిమ
యితరయోగినులయం దెసఁగునేయనుచుఁ।బ్రతిమూర్త్వమూనియప్రతిమానకాంతిఁ
దనరు నద్దేనికి దండప్రణామ । మొనరించి దేవళం బొయ్యన వెడలి
గోపురద్వారస్థుఁ గుంభినిఁ జేరి । రాపోద మూరికి రవి క్రుంకవచ్చె
తడయనేలనిన నాతం డింతసేపు । గుడి నుండుటేమి రాకొమర! నీవనిన
నచ్చటి చోద్యము లచటిచి త్తరువు । లచ్చటి గర్భగృహాంతర స్ఫురణ
లచ్చటి మంటపాయత వితానమ్ము । లచ్చటి చందుఱాయరుగులు గనుచు
నినుఁ దలఁచితినయో నీవు రావైతి । వని తనకొదవు దివ్యాస్త్రలాభంబు
వానితోఁ జెప్పక వంచించి వాజి । పై నెక్కి వాఁడు వేంబడి నేగుదేరఁ
దనతేజి తానెక్కి త్వరమీఱఁ బురికిఁ । జని సుఖస్థితినుండె జనపాలసుతుఁడు
అంతట నొక్కనాఁ డమ్మంత్రిసుతుని । మంతనమ్మునఁ జూచి మనుజేంద్రసూతి
వేఁటాడఁ బోదమే? విపిన దేశముల । కాటవికులు మెచ్చనని మందలించి
మందుర్రలో నున్న మంచి యశ్వములఁయం దేర్పఱచి యొక్కహయముపై నెక్కి
ఘోటకాకూఢుఁడై కుంభిము రామ । హాటోపమున నేగి హరికరి శరభ
శల శల్యఖడ్గాది సత్త్వసంతతులఁ । బొలియించి విశ్రాంతి పొంది యందొక్క
సాలతరుచ్ఛాయ శయనించి యున్న । యాలోన నచ్చోటి కనతిదూరమునఁ
జరమదిక్పథమునఁ జతురంగసైన్య । పరివృతుఁడై మహాబాహు విక్రములు
రాజకుమారులు రథములనీఁద । వాజులపై మదావళముల మీఁద
నాందోళికల మీఁద నతిచిత్ర శకటి । సందోహముల మీఁద సంప్రీతి నెక్కి
కరిష్ణుంకృతులు రథఘుర్ఘురధ్వనులు । హరిహేషితములు భటార్భటుల్ సెలఁగఁ
జటుల బలోద్ధూత జగతీపరాగ । పటలంబు దశదిశాభాగమ్ము లొరయఁ
గదలిపోయెడి వారిఁగని కుంభిఁ జూచి । పదపడి కేయూరభాహుఁ డిట్లనియె

నీరాజనందను లెటకేగుచున్న । వారలో యాసైన్యవర్గంబుఁ గూడి
వీరిచందము నీవు విశదంబుగా వి । చారించి యిప్పుడే చనుదెమ్మ్ పొమ్మ్
నా విని యమ్మంత్రినందనుఁ డరిగి । యావేళ నెక్కడి కేగుచున్నారు
మీరని యడిగిన మృదువచోరచన । వారిలో నొకమంత్రివరుఁ డిట్టులనియె
ధీరాత్మ! బాహ్లికదేశంబు నందు । సారస్వతంబు నాఁజను పురియేలు
విక్రమసేనుఁడన్ విపులాధినేత । శక్రసమానుఁ డాజగతీశ్వరునకుఁ
గలదు శృంగారరేఖానామ కన్య । సలలితగుణమాన్య సౌజన్యధన్య
యావిలాసినికి స్వయంవరోత్సవము । గావించు వార్త లాకర్ణించి సకల
భూపాలనందనుల్ పోవుచున్నారు । రేపుమాపటికిఁ జేరెద మందటంచు
నెవ్వని కబ్బునో యిందీవరాక్షి । యివ్వచ్చుదొరలలో నెవ్వఁ డెఱుంగు
కలిమియుఁ జెలువంబు గలవాఁడ నేను । బలసమగ్రుఁడ నేను ప్రాజ్ఞుండ నేను
నన్నేవరించు ననాతి యటంచు । నెన్నుచు హామికలెసఁగ నొండొరుల
మెచ్చుక వీరెల్ల మెలఁతపై మోహ । మెచ్చ నేగెడి త్వర యాక్షింపు మనిన
నామంత్రివాక్యంబు లాలించి కుంభి । తామసించక యేగి తమరాజసుతుని
తోడ బాహ్లికరాజ దుహితృస్వయంవ । రాడంబరాలోకనార్థులై సకల
జననాథతనయులు చనియెద రనుచు । వినిపింప నాతఁడు విని సంతసించి
మనమును బోదమె మంత్రికుమార! । మన రాజువారికి మన పయనంబు
వినిపింపఁబనుతము వేఁటకాండ్ర ననియనిచె నాక్షణమె హయారూఢుఁడగుచుఁ
దనుగూడి మంత్రినందనుఁ డశ్వమెక్కి । చనుదేర ముందరఁ గలసేనఁ గలసి
పోవుచునుండఁగా భూపాలతనయు । లా విపులోరస్కు నాదీక్ష్ణబాహు
నామన్మథాకారు నట్టె వీక్షించి । యీమహీశకుమారుఁ డెవ్వఁడో వీని
శారీరకాంతు లిచ్చటనెల్ల నిండె । నౌర! లేఁబ్రాయ మయ్యారె! సోయగము
వీనిఁజూచిన కాంత వేఱొక్క వన్నె । కానిఁ గామించునె! కంటిమే యిట్టి
యందచందము లింక ననుమాన మేల । నిందుబింబాస్య బాహ్లికరాజపుత్రి
వీని వరించు వేవేల రాసుతులు । దానిఁ గామించిగదా మోహవశత
దూరభారము లేగఁ దొడగి రటన్న । నారాజనందనుం డామాట లెల్ల
విని యెలనవ్వుతో వెంబడి చనియెఁ । బనిపూని బహుదేశపతు లివ్విధమునఁ

జేరిరి విక్రమసేనుని పురము । వారిరాక యెఱింగివారి కందటికి
నులుపాలు విడుదులు నొనగూర్చి కలిమి । వెలయ భాహ్లికధరావిభుఁ డాదరించె
వారిలోఁ జాఱులావణ్య నైపుణ్య । పారీణుఁ గేయూరభాహునిఁ జూచి
తగిన సన్మానముల్ తప్పకచేసె । జగతిలోఁ గల రాజసంఘంబు లెల్ల
నేలయీనిన భంగి నిలిచె నాస్థాల । నాలో స్వయంవరార్హదినంబు నందు
శృంగారమెల్ల రాశిగఁ జేసినట్లు । బంగారుబొమ్మ సప్రాణ మైనట్లు
అంగజు మాయ ప్రత్యక్షమైనట్లు । శృంగారరేఖ నెచ్చెలిగుంపు గొలువ
నమరు బంగరుగచ్చుటరిగెల నీడ । రమణీయగతిఁ జేరె రంగమంటపము
దాని చక్కఁదనంబు దాని లేఁబ్రాయు । మానరేంద్రకుమారు లందఱు చూచి
బ్రమసి మారునిబారిఁ బడియున్న వేళఁ । గమలలోచనఁ జేరి కలకంఠి యొకతె
యా యానృపాలుర యన్వయ నామ । ధేయ తేజోబలస్థితు లెఱిఁగింప
నెవ్వరిపై దృష్టియిడక యబ్బోటి । యవ్వలవ్వలఁబోయి యగ్రభాగమున
మంచెపై వసియించు మహనీయరూప । పంచాస్త్రుఁ గేయూరబాహునిఁ జూచె
చూచినప్పుడె దాని సుమధన్వి యేఁచెనాచెల్వ చెలువ మాయన చూచి యలరె
నొండొరులకుఁ బ్రేమలుత్పన్న మగుట । నిండెఁ గ్రొంబులకలు నెమ్మేనులందు
నితఁడె నాపతియని యిందీవరాక్షి । యతని చెంగటికేగి యలరుఁ బన్నీటఁ
నడుగులు గడిగి మోహమ్మ్ర్ర రెట్టింప । నిడెఁ గంఠమునఁ బైడియిప్పపూదండ
కేయూరబాహు నీక్రియ వరియించి । యాయింతి లోపలికరిగిన వెనుక
నచ్చటి నృపులెల్ల నలరి రిచ్చెలువ । కిచ్చెలువుఁడు దగు నిచ్చెలువునకు
నచ్చెల్వ దగునని యానాఁటిరేయి । హెచ్చులగ్నంబున నెలమి నిర్వారికిఁ
గావించెఁ బెండ్లి విక్రమసేన నృపతి । యావివాహోత్సవ మలనిమై పొగడ
వచ్చిన ధారుణీశ్వరులకు నెల్ల । నిచ్చి భూషణములు హేమాంబరములు
దినములు నాల్గు నిత్తెఱఁగున బంధు । జనులు మెచ్చఁగ మహోత్సవములు జరిపె
మామగారింట నమ్మనుజేశసుతుఁడు । కోమలితోఁగూడి కొన్ని నాళ్లుండి
యరణ మిచ్చిన కరివాజి రథసుభట । పరిచారికాంబరాభరణాదికములు
గైకొని జవనకంఖాణంబు మోఁద । నాకన్య నిడుకొని యఖిలసైన్యములు
ముందర నిజపురంబున కేగఁబనిచి । చెందినరహి కుంభిచేరువ రాఁగ

నొక పయనమున నయ్యగ్నిలితోడ । నకలంకగతి మాటలాడుచు రాఁగ
వెనుక వచ్చుచుఁ గుంభి వికటాత్ముఁడగుటఁగనకాంగి మేని శృంగాగంబు చూచి
యారాజు వంచించి యేభంగి నైన । నీరాజబింబాస్య నెనయుదు ననుచుఁ
దగవు ధర్మముమాని తలఁచె దుష్టాత్మ । లగువారి నమ్మి కెట్లాప్తు లటంచు
నీచండమున మది నేమేమొ తలఁచు । నాచెడుగు తలంపు లాతఁడేమియును
దెలియక రాజపుత్రికిఁ ద్రోవలోనఁ । గల విశేషమ్ము లొక్కటఁ దెల్పికొనుచుఁ
గొంతదవ్వరిగి కన్గొనియె ముందర ని । రంతర దానధారా పూరఘోర
కరటి బృంహిత రవాకర్ణనోద్వేగ । పరిగత పంచాస్య పటురవ శ్రవణ
సరభసాయాతోగ్ర శరభనినాద । పరుషతా శ్రుతిసముద్భవ రుషోద్దండ
గండభేరుండ ప్రకాండఘోష ప్ర । చండమా నొకవనస్థల మివ్వీధమునఁ
గని చొచ్చిపోవ నక్కడ నొక్కచోటఁ । గనఁబడెఁ దుంగశృంగ గతాభ్రసంఘ
చంచల చ్చంచలా చ్ఛాయాప్రపంచ । చంచ దధిత్యకాస్థలమైన యొక్క
నీలాచలంబు దాని యుపత్యకా వి । శాలమార్గంబున జవనకంఖాణ
రాజంబు బరపఁగా రాజకుమారి । యాజగజ్జనరంజనాకృతిఁ జూచి
విధివశంబునఁ బల్కె నినుము ప్రాణేశ!।యధిక మైనది దాహ మంబువు లిచట
దొరకవో మంత్రిపుత్రునిఁ బంపి నీళ్లు । సరగునఁ దెప్పించి శ్రాంతి తీర్పుఁడన
నామంజువాణి వాక్యము లాలకించి । దీమసంబున మంత్రిదిలకించి యతఁడు
హయమునిల్వఁగఁబట్టియనియెనిప్పద్మ।నయనదాహమున నెంతయుశ్రాంతిఁ జెందె
నడవి నెక్కడనైన నంబువుల్ వెదకి । కడువేగఁ దెమ్మిందుఁ గదలక నేను
నుండెద ననినఁ గామోద్రేక మాత్మ । నిండియుండుటఁ జేసి నీచుఁడై వాఁడు
కేయూర బాహు నీక్షించి యిట్లనియె । నోయి రాజకుమార!యొకయడు గిడఁగఁ
జాల మహాపథశ్రాంతితోఁ జాలఁ । దూలియున్నాఁడ నెంతోదప్పి మించె
నడవిలో నేఁదిరుగాడ నోపుదునె । కడఁకతో హొన్గిండి గైకొని నీవె
విపినభూమిని నీళ్లు వెదకి వేఁదెచ్చి । యపనయింపుము దాహమని దీనవృత్తి
వంచకుఁడై పల్కు వాని నీక్షించి । మంచిది నిన్ను కేమసలకయేగి
తెచ్చెద రాజపుత్రిక సమీపమునె । హెచ్చరికై యుండుమిదె వత్తు ననుచు
నా రాజతనయుండు హయముపై నున్న । నీరజాక్షుని డించి నికట భూరుహము

నీడ నిల్వఁగఁ బంచి నిజమంత్రిసుతుని । నాడఁ గావలిపెట్టి యురిగె నీళ్లకును
నీటికందువఁ బట్టి నృపసూతి యమ్మ । హాటవిఁ జొచ్చి యట్లరిగిన వెనుక
కుంభియన్ దుష్టాత్మకుం డొంటినున్న । కుంభికుంభ స్తని గొబ్బునఁ జేరి
తమకంబుతోఁ బల్కెఁ దరుణీలలామ! । సుముఖివి సుగుణవు సుమతివి నీవు
తగునె నీకీనరాధముఁడు రాజనుచు । నిగురుబోణిరొ! మది నెంచినావేమొ
కులహీనుఁ డదిగాక గుణవిహీనుండు । పలచి వృథా వీని వరియించి తీవు
తెలియు మేకులగుణాధికుఁడ సమస్త । కళలఁ బ్రవీణుండ ఘనుఁడ నన్ గూడి
కోరికలీడేర్చికొమ్మని మరుని । భారికి నెరయూచు బటువు సిబ్బెంపు
బలు గుబ్బచన్దోయి పయ్యంట జార్పఁ । దలఁచి కేల్సాచినఁ దలఁగి యాలేమ
యావల నిలచి హాహాకార మెసఁగ । నీవింత ద్రోహివౌ టఱుఁగక నిన్ను
నాచెంతనిడి రాజనందనుం డరిగె । నీచెడ్డపని కేల నిచ్చగించితివి
కటకటా! విశ్వాసఘాతుకవృత్తి । నెటువలె నొడిగట్టి తెఱుఁగవే బుద్ధి
జలములు దెమ్మన్నఁ జనక నీవిందు । నిలిచినయపుడె సందేహంబు దోఁచె
పరుషాత్మ! నినుగన్నఁ బాతకం బొదవు । కరకరిఁ బెట్టక కడనుండు మనినఁ
గామాంధుఁడై నీతిఁ గడద్రోసి భీతి । యేమియు లేక వాఁ డెలనాగ డాసి
జడఁబట్టి తీసి భూస్థలిఁ ద్రోసి మీఁదఁ । బడఁ దమికించినఁ బడఁతి నెన్నడుము
గడగడ వడఁక నంగము చెమ్మరింపఁ । గడు భీతిమించ నొక్కట మోదికొనుచు
హారముల్ తెగిరాల హానాథ! యిట్టి । క్రూరకర్మునిచెంతఁ గూర్చుండఁ బెట్టి
యెందుఁ బోయితివి రావే! మానహాని । పొందకుండఁగ నన్నుఁ బ్రోతువు గాని
నేనేలఁ బొమ్మంటి నీళ్లకు నిన్ను । నానోట శనియుండె నాసామి ! యనుచుఁ
గాటుకకన్నీరు కాల్వలై పాఅ । గాటంపువెత బెట్టుగా మొఱఁబెట్టె
నా మొఱియాలించియచటరక్తాక్షు।నాముఁడౌ రాక్షసనాథుఁడొక్కరుఁడు
గిరిగుహా నుండి నింగికి నుగ్గమించి । పఱతెంచి యయ్యింతి పైఁబడఁ దివురు
పాపకర్మునిఁ గుంభీ బదహాతిఁ దన్నెఁ । గోపంబుతో రెండుక్రోసుల మేరఁ
బడ నిట్లుదన్ని యప్పట్ల గుట్టములు । పిడిపించికొని పాఱ వికవిక నగుచుఁ
దన ఘోరరూపంబు దర్శించి భీతి । మునిఁగి మూర్ఛిలిన యమ్ముదిత నెత్తికొని
పఱతెంచె నుడువీథిఁ బంక్తికంధరుఁడు । ధరణిజఁ గొని వియద్గతి నేగినట్లు

శృంగారరేఖ నీరీతి నెత్తికొని । నింగికి నెగసి యన్నిశిచరోత్తముఁడు
ఆకొండగుహ నున్న యాత్మీయపురికి । రాకాసు లరుదంద రయమున నరిగి
మును చెఱఁదెచ్చిన ముదితల చెంత । నునిచి కావలియున్న యుగ్రరాక్షసుల
నెచ్చరికై యుండుఁడీ యని చెప్పి । యిచ్చ వేడుక హెచ్చ నేగె లోపలికి
యంతఃపురమున కిట్లరిగి యయ్యసుర । చెంతకువచ్చి నిల్చిన తనభార్య
నీలాంగిఁ జూచి వింటివె వాలుఁగంటి! । శైలాంతికమున లేజవ్వని యొకతె
పసునిచే నిటు పట్టువడి బెట్టుగూయ । నరుదంది వినిలేచి యచటి కేఁబోయి
వానిఁ గూలఁగఁదన్ని వనితఁ దెచ్చితిని । మానవాంగనల కామహితలావణ్య
విభవంబు గలుగ దవ్వేడవింటివాని । యభినవ సమ్మోహనాస్త్ర మట్లమరె
తొయ్యలుల్ తొంబదితొమ్మిదిమంది । యయ్యుండి రిన్నాళ్ల కక్కొడఁ దీర్ప
నూహింపఁగా దైవ మొనగూర్చె నిమ్మ । నోహరగాత్రితో నూరుగు రైరి
వీరి నేనొక శుభవేళఁ బెండ్లాడి । యోరామ! నీదాస్య మొనరించు నటులఁ
జేసెదఁ బ్రాభవస్థితి నుండుమనిన । నాసురాహితు మాట లది విని పోయి
కారాగృహంబునఁ గన్నిగుజాఅ । నూరక యేఁచుచునుండెడు దాని
శృంగారరేఖ నీక్షించి యచ్చెలి తె । ఱుంగది తెల్ప సర్వము విని మఱిలఁ
బతిఁజేరి పలికె నోప్రాణేశ! దాని । పతి మేటి కేయూరబాహునాముఁ డఁట
శాంభవీ కరుణాప్రసాదంబు వలన । సంభవించిన మహోచారుమూ ర్తి యఁట
వివిధశస్త్రాస్త్ర కోవిదుఁడఁట వాని । బవరంబులో జయింపఁ దరంబు గాదు
వనితఁగొంపోయి యవ్వనములోడించి।చనుదెమ్ము బహువధూజనములుండఁగను
దీని వీడినఁ గాంక్షదీఱదే మున్ను । జానకిచే లంక సమసినయట్లు
నిక్కాంతచే నశియించు నీపురము । రక్కసుల్ తెగుదురు రణభూమిలోన
నోనాథ! మదిమదినుండి యేమిటికి । హీని చెందెదవన్న నసురేంద్రుఁ డనియె
పటురమా ఘటితేంద్రపౌలస్త్య నేత్ర । పుట భేదనంబు నాపుటభేదనంబు
నమరభీకరము నా నతిశయం బొందె । నమరాసురుల కశక్యము దీనిఁ జొరఁగ
శరభసింహ వ్యాఘ్రసైరిభ వ్యాళ । కరిముఖావరణముల్ గల వెన్నిదిచట
నీవాకిళులు దాఁటి యీపురి సొచ్చి । రా వశమే! యొక్క రాజపుత్రునకుఁ
దప్పి వచ్చిన మత్ప్రధానుల నెదిరి । యెప్పగిది జయించు నిందఱి గెలిచి

వచ్చెపో ననోన్నర్వవశమె? నీదృష్టి । హెచ్చ నిచ్చునె శౌర్యమెల్లఁ గైకొనక
యింతి! మీతండ్రినీకి చ్చినవర మ । దెంతయు మఱచితివే జాలియేల
నూరకుండు మటన్న నువిద మాఱాడ । నేరక యాత్మఁ జింతిల్లుచు నుండె
నంత నక్కడ నరణ్యాని రాసుతుఁడు । కాంతకై స్వాదూదకంబులు గొనుచు
వచ్చుచుఁ గ్రోవలో వడిదక్కి యల సి । యచ్చర ద్వేషి పాదాహతి నొచ్చి
పరవశుఁడై నేలఁ బడియున్న కుంభిఁ । బరికించి యాశ్చర్యపడి చేరఁబోయి
శిశిరోపచారముల్ చేసి యన్నిచ । దశ మాన్చి యల్లన దాహంబు దీఱి
బంగారు గిండిలోపలి జలంబొసఁగి । శృంగారరేఖ నోయీ! యెంటి నడవి
డించి నీవిచట నేటికిఁ గూలినాఁడ? । వెంచిచూచిన హేతు వెయ్యది లేదు
ఈయార్తి నీకిపుడేల వాటిల్లె? । నాయింతి యేమాయెనని యడుగుటయు
దీనముఖుండై విధేయుని మాడ్కి । నానీచమానసుం డతని కిట్లనియె
నయ్య! నీవిచటికి నరుదెంచినంతఁ । దొయ్యలి చెంత నెంతో ప్రయత్నమున
హెచ్చరికై యుంటి నెచ్చటినుండి । వచ్చెనో కరిమబ్బు వన్నియవాఁడు
నిడుద కోఱలవాఁడు నీలాద్రికంటెఁ । బొడవైనవాఁడు నిప్పులకుప్ప లొలుకు
చుఱుకుచూపులవాఁడు శోణాభ మెఱయు । కఱకుజుంజురు వెండ్రుకలు గలవాఁడు
గిరిబిలంబునఁ జిల్వక్రియ దెల్పునట్లు । తెఱనోట నాలుకత్రిప్పెడు వాఁడు
నాకసం బగలించు నట్టహాసమున । నాకస్మికముగ ఘోరాసురుం డొకఁడు
పఱువునవచ్చి యప్పణఁతి కేనడ్డ । మఱదేరఁ గరినాంఘ్రిహతిఁ బాఱఁదన్నఁ
దన్నినచో నింతదవ్వుల ద్రెళ్లి । యున్నాఁడఁ గొనిపోవ కుండునే చెలిని
నాకట్టిఁడి నిశాటుఁడన్న! నీవచట । లేకున్కిఁ గ్రొత్తపెండ్లికుమారి యసుర
పాలయ్యెనని వాఁడు పలికినపలుకు । లాలించి క్రోధశోకాక్రాంతుఁ డగుచు
నారాజనందనుం డాపదఁబడియు । ధీరుఁడై యమ్మార్గ్గుఁ దిలకించి పలికెఁ
దురగంబుతో ధనుస్త్రాణముల్ చనియె । నరయఁగావలెఁ గానలం దటుగాక
బోటి నెత్తుక యెందుఁబోయెనో యల ని । శాటుని వెదకినేఁడవనిఁ గూల్పకయొ
నేనన్నము భుజింప నీవె చూచెదవు । మానైన నావిక్రమక్రమం బనిన
నక్కటిలవిచారుఁ డను మనతరమె? । రక్కసుల జయింప రాజకుమార!
యీయుగ్రసాహసంబేల? చేఁదప్పి । పోయిన పూఁబోణి పోలునే మఱల

సాధింప నూరికిఁజని క్రమంబున వి । రోధి ననేషించి రోధించి వాని
బలములతో గెల్చి భామఁ జేకొనఁగ । వలెఁ బదరిన హానివచ్చు నిక్కముగ
రావణుపై రఘురాముఁ డొంటరిగఁ । బోవక క్రోఁతిగుంపులఁ గూడిచనఁడె?
యని కొన్ని వక్రోక్తులాడిన వానిఁ । గినిసి మిక్కిలి వివేకివి చాలుచాలు
చెఱనున్న భార్యడించి పురంబుఁజేర । నహగుదెమ్మని పల్క నర్హమే నీకుఁ?
బాలుమాలినఁ బొమ్మి పట్టణమ్మునకు । బాల శోధింప కప్పలలాశిఁ బట్టి
పరిమార్ప కేనేల పఱతెంతు ననుచుఁ । ద్వర నొంటినేగు నాతని వెంటనంటి
యక్కచ్చితుఁడు నేగె నపుడరణ్యమున।కొక్కదిక్కున ధైవయోగంబు కతన
ధనురాది సాధనోత్కరముతో హయము । గనుపింప రాచూలిగని సంతసించి
వాగె గ్రక్కునఁబట్టి వదనంబు నివిరి । తాఁగన్న కొలనిలో దానిదాహంబు
దీఱ నీరముఁజోపి దిగ్భాంతి మాన్పి।యారోహణమొనర్చి యపుడు తా నింతి
నునిచినచోటి కత్యుద్ధతిఁ బఱపి । తునిఁగిన గాజులతునుకలు తెగిన
హారముల్ నెరసినయలకలు బాష్ప । ధారలఁ దడిసినధరయును జూచి
చేరినవానితోఁ జెలువ హారాదు । లీరీతిఁ దెగిరాలు టేమియో యనినఁ
దానొనర్చిన యకృత్యము వాఁడుదెలుప।కానిశాచరుఁడు రాయడిసేయ జాలె
హారాదు లిచ్చోటనని తెల్ప వగచి । హా! రాజముఖి కెంతయాపద వచ్చె
ననువంటి రాజనందనుఁ బెండ్లియాడి । దనుజుఁ బ్రాపింప ధాత లిఖించెనేమొ?
యతిన ఫాలమ్మ్మనని కొంత సేపు । మతిలోనఁ జింతించి మంత్రినందనునిఁ
గని చూత మొకసన్న గ్రామంబు చేరఁ।జనుదెమ్మ్మి నావెంట జడియక యనుచుఁ
బలికి యగ్గిరి యుదగ్భాగంబు వెదుక । బిలము లయ్యెడఁ గానుపింపక యున్నఁ
దూరపుకడఁ జూచి తోరంపుఁ జలులఁ । జేరఁగారాని దక్షిణపుదిక్కరసి
చలులగట్టున నిజాశ్వమునిగ్గి వాగె । కరమునఁబట్టి యొక్కవిధాన జరిగి
తడయక పడమటితట్టు ప్రాపించి । యెడనెడ గుహలున్న వేమొ యటంచు
నాడాడ శోధించి యంకొక్క చెట్టు । నీడ నాఖలుతోడ నిలిచె రాసుతుఁడు
కడు శ్రాంతుఁడయ్యును గార్యభారమున । బడలిక యెఱుఁగ కప్పార్థివసుతుఁడు
ఆయరణ్యాని మధ్యమున నుండఁగను । బోయలు కొందఱు భూరిమాంసముల
కావల్లుపూని శీఘ్రమున నేతెంచి । భూవరతనయునిఁ బొడగని యనిరి

యిం దేలవచ్చితి? రెవ్వాడమీాఱ? । బృందారకులకైనఁ బొరయరా దిందు (?)
రక్తాక్షుఁడనుపేరి రాక్షసుం డతుల । శక్తిసమగ్రుఁ డీశైలమధ్యమునఁ
గరమొప్పు నమరభీకరమను పురము । పరిపాలనమొనర్చుఁ బ్రాభవం బెసఁగ
నీచెంతలను జేర రెంతవాఁడైన । రాచబిడ్డలొ? యిందురాఁ గతం బేమి?
యెఱుఁగక వచ్చితిరేమొ? యేమాయెఁ । బరువెత్తుఁ డీక్రోవఁబడి యింకనైన
నేమీలవేసిన నేతెంతు రసుర । లీమాంసభారమ్ము లెత్తుక పోవ
నావిని యారాజనందనుం డనియె । నోవనచరులార! యొకమాట మిమ్ము
తెలియఁగనడిగెదఁ దెలిపిపొండనినఁ । బలలభారంబు లప్పలభోజనులకు
నొప్పించి వచ్చెద మొకకొంత దూర । మిప్పుడుచని నిల్వుఁడిచ్చోటు నిడిచి
యనిన గుట్టంబుతో నలకుంభిఁ గూడి।మనుజేంద్రసుతుఁ డొక్కమాటున నుండె
నాకొండగుహ వాతికరిగి కిరాతు । లేకకంఠమ్మునా నీలవెట్టుటయు
గుహవాతిజాయిగ్రక్కునఁగడఁద్రోసి।బహురాక్షసులువచ్చిపలలముల్ గొనుచు
వాకిటనెప్పటివలె జాయిగ్రోసి । యాకడకేగిన నవ్వనచరులు
పటుతెంచి కేయూరబాహునిఁ జేరి । రెఱుకలందున ముదియెఱు కొక్కరుండు
వారిలోమేటి యవ్వాసుమతీశ్వర కు । మారునిఁ గని నీవు మమ్మేమి యడుగఁ
దలఁచితి వడుగుము తక్కింబేను । దెలిసిన దంతయుఁ దెలిపెద ననిన
నానృపుఁడనియె నీయసుర యెవ్వాని । సూనుఁడు నీ తేజోమహత్త్వంబు
వీని పురస్థితి వీనికిఁగలుగు । సేనల వినఁదలంచితిఁ దెల్పుమనిన
నావృద్ధశబరుఁ డిట్లను మయపుత్రుఁ । ..... యీతఁడుండుటకు
యిగ్గిరిలో సృజియించెఁ బ్రో లాతఁ । డగ్గిరిభేది ప్రో లదియెంత యనఁగ
నది త్రిమోజనదీర్ఘ మంతియ వెడలు । పెదిరించు వైరుల కీక్షింపరాదు
అమరభీకరము నా నమరు నప్పురికి । సమబలుల్ వేవురు సచివులుగలరు
పదివేల రాక్షసుల్ పాయక కొలుతు । రదిగాక కరి కిరి హరి శరభాహి
సైరిభ వ్యాఘ్రాగ్నిసమితి పాలించు । ద్వారంబు లెనిమిది తగు నిప్పురమున
నవ్వాఁకిళులు దాఁటి యరిగిన నుండు । నవ్వల నీలాంగియనువాని భార్య
దానిదృక్పథమునఁ దగిలినయద్రుఁ । డైన దుర్బలుఁడగు నన్యు లేపాటి
యది చూడకుండిన నవలఁ బోవచ్చుఁ । బదియవవాఁకిట బలసి వర్తిల్లు

పదివేల దనుజుల భంజించుటరిది । కదనశూరులు వారఁ గదియరా దవల
మంతురుల్ వేవు రమర్త్యల నైన । నొంతురు మనుజాశనులు వారిచెంత
మానవుల్ నిలుతురె మనుజేంద్రచంద్ర! । యీనిలింపవిరోధి కిపుడొక్క బుద్ధి
జనియించె నెటులన్న జగతిలోఁ గలుగు । మనుజాధినాథకుమారి కామణులఁ
జెఱపట్టి తెచ్చి యుంచినవాఁడు నూరు।గురికి నొక్కవధూటి కొదువయై యున్న
నేఁడొకకన్య నన్వేషించి తెచ్చి । నాఁడఁట వీరినందఱి నొక్కనాఁడె
వరియింతునని యున్నవాఁడఁట నేఁడు । తరుణిఁ దెచ్చుటకు నద్దనుజుని భార్య
యడరిబుద్ధులుచెప్పెనఁటవాఁడువినక । కడుఁబ్రబేలెనఁటయిందుఁగలవిశేషములు
అడవిలో నొకదైత్య నడుగఁగా వాఁడు।నొడివె దాపక వాఁడునుడివిన క్రమము
నీకుఁ దెల్పితినన్న నృపపుత్రుఁ డలరి । యాకిరాతు నుతించి యస్మద్వధూటిఁ
జెఱఁదెచ్చినాఁ డీనిశీథినీచహనిఁ । బొరిగొందునని యిందుఁ బొంచియున్నాఁడ
నెనిమిదివాఁకిళ్ల నెసఁగు సత్త్వములఁ । దునిమి నీలాంగి కన్గ్రోయి భేదించి
రాక్షససేనతో రక్తాక్షుఁ ద్రుంచి । రక్షింతుఁ జెఱనున్న రాజకన్యకల
ధనకనకాములఁ దనియింతు మిమ్ము । ననుఁజూడుమనిన నందఱు గెల్వుమనిరి
కుంభిచెంగటఁ దనగుజ్జుంబు నిల్పి । శాంభవీ యోగినీశ్వరిఁ బ్రశంసించి
సవిధతీర్థంబులో స్నానం బొనర్చి । శివమంత్రము జపించి శ్రీకాళికరుణఁ
గన్న దివ్యాంబర గంధమాల్యములు । నున్నత మకుటకేయూర హారములు
ధరియించి కవచ ముత్కటలీలఁ దొడిగి । స్మరణాగతామోఘ శస్త్రాస్త్ర కోటి
వినయంబుతోఁ గొని విల్లు సజ్యముగ । నొనరించి కవదొనలూని యాత్మీయ
తనుకాంతి దిక్కులఁ దళతళ లీనఁ । దనుఁజూచి సుర లద్భుతముచెంది పొగడ
నీమహామహిమ వీఁడెట్లొండె ననుచు । నామార్థుఁ డెదఁబడి యట్టె కన్గొనఁగ
నిచ్చోట గుజ్జుంబునిడికొని యుండు । మెచ్చటి కేగక యిదెవత్తు ననుచు
వానితోనసఁ బదద్వయిఁ బదత్రములు । పూని పదాతియై పురహంతుకాను
కామాంతకునిఁ బోలి ఖరసేన కడహ । రామునివలె నవక్రపరాక్రమమున
నసహాయశూరుఁడై యరిగి యొక్కరుఁడె।యసుర గుహాద్వార మలుకతోఁ జేరి
కోదండశింజినీ గుణనినాదమున । రోదసి పగుల నార్చుచుఁ బెచ్చు పెఱిగి
కులిశ బాణమున నగ్గుహవాతి జొయి । పలుతునుకలుచేసి బలువిడిఁ జొచ్చి

కరులు ఘీంకృతులతోఁ గదిసిన వాని । కరములు శిరములు గాళ్లును దోళ్లు
ఖండించి యచ్చోటుగడచి వరాహ । కాండములో పొదివిన కాండప్రకాండ
హతులతోఁ బలుద్రుంచియంగముల్ చించి । గతులడంగించియాఁకటివిజృంభించి
కహకహార్భటుల సింగములు పైకురుక । సహియింప కతిఘోర శారభాస్త్రములఁ
బ్రక్కలు డొక్కలు పదములు రదము।లొక్కటఁ జక్కాడి హుంకార మెసఁగ
నవ్వలఁజని శరభానీక మడరఁ । గ్రొవ్వాఱి గండభేరుండ బాణములు
పఱపి నుగ్గొనరించి బహుపిశాచములు । నురగంబు లవ్వల హుంకారఘోర
బహుళఘూ త్కారముల్ పరగఁబై ఁబడఁగ।నహిమాంశుశరములనప్పిశాచముల
గండడంచి మహోగ్ర గారుడాస్త్రములఁ।గుండలిప్రచయంబుఁ గూల్చి పెల్లార్చి
సైరిభరూపులై చనుదెంచు నసుర । వీరులఁ గ్రూరుల వెస నిరోధించి
పరశు తోమర కుంత పట్టిసప్రాస । పరిఘాసుల వధించి పటుశక్తి మించి
సప్తమద్వార దేశము చేరి యచట । దీప్త నఖోదార దీధితుల్ మెఱయ
గొట టధ్వనులతోఁ గ్రోల్పులుల్ డాయఁ। జిటచిటమిణుఁగురుల్ చెదరఁగన్నులను
దలలు డొల్లఁగనేసి తద్వ్యఘ్రకోటిఁ । బొలియించె నొక్కటిఁ బోవనీ కవల
నీరీతిఁ బులులను హింసించి యవలి । ద్వారంబు చొగఁబోవఁ దత్పదేశమున
భుగులుభుగుల్లనఁ బొగలుప్పతిల్ల । ధగధగమంట లెంతయి విస్ఫరిల్లి
సెగలతోమిణుగురుల్ చెదరిది క్తటులు।సగులమ్రోయుచు హేమపర్వతాకృతుల
నిప్పులకుప్పలై నెగడఁ గాలాగ్ని । యెప్పున మండుచునుండు దావాగ్ని
గని నవ్వుచును గార్ష్మకగుణంబు దీటి । మనమున యోగినీమణి సంస్మరించి
వారుణబాణంబు వడిఁ బ్రయోగింప । నాతె గుప్పునఁ వహ్ని యవ్వారిధార
జ్వాలనార్చి యాలీలఁ జల్లార్చి యవలి । నెలవున మణిపీఠి నీలాంగి యునికి
యెఱిఁగి వారునఁ జెంత కేగక గోడ । మఱుగుననుండి దీప్తమున రెండు
శరముల దాని లోచనములు రెండు । హరియింప హూరున నడలుచు నదియు
శయములఁ గన్ను లాచ్ఛాదించ కుపిత । యయి తననేత్రంబు లడఁచిన ఖలుఁడు
కరపద హీనుఁడౌగాక యార్నెలలు । నరుగక ముందర నని శాపమిచ్చె
నా లేమ శాపోక్తి నాలించి ధరణి । పాలకుమారుండుఁ బలికె మరేమి
పరభామలను జెఱల్ వట్టెడు నీచ । చరితుని సతివౌట శాప మిచ్చితివి

మీసేయు కర్మంబె మిముఁబట్టి యిట్టి । గాసి నొందించె నొక్కఁరిఁ దిట్టనేల?
నీవెంతతిట్టిన నీపతిఁ బట్టి । యీవేళఁ దునుమక యేనేలవిడుతు
ననిన మాటలువిని యందుండ వెఱచి । దనుజకాంతలఁ గూడిదానవి చనియె
చని సౌధగతుఁడౌ నిశాచరవిభునిఁ । గని నేత్రగత రక్తకణముల వాని
యడుగులు దడుపుచు నడలుచుఁ బలికె । చెడుగాల మదగుదెంచిన నా సుబుద్ధి
వినక బలాఢ్యతో ద్వేషంబు చేసి । కొని వృథా కులమెల్లఁ గూల్ప బూనితివి
యిఁకనాల్గు వాఁకిళ్ల నిభకిరి సింహ । శరభాది మృగములఁ జంపి దావాగ్ని
యార్చి కీలార్చి రెండస్త్రముల్ దొడిగి । తీర్చెఁ జూచితివె! మదీయ నేత్రములు
మును శూర్పణఖ ముక్కు మొవలంటఁజెక్కి।దనుజులఁ దునిమిన దాశరథివలె
మనవాఁకిళులు దాఁటి మనుజాశనులను । దునుముట కీతఁ డుద్యోగించినాఁడు
అతనితోఁ బగయేల యజ్ఞాతి నిచ్చి । బ్రతుకుము నాపల్కు పాటింపుమయ్య!
యని వేఁడుచున్న నీలాంగినిఁ జూచి । దనుజేంద్రుఁడనె నేల తల్లడిల్లెదవు?
పదివేల దనుజ లుద్భటశౌర్యధుర్య । లిదె వానిఁ బరిమార్చి యేగుదెంచెదరు
యూరక చనుమని యుగ్మలిఁ బంబి । యార క్తలోచనుండై యాగ్రహమున
నార క్తలోచనుం డపుడు వేవుర మ । హారాక్షులఁ బంచె నతనిఁ ద్రుంపుఁడని
వారు శస్త్రాస్త్రసుర్వాహులైవచ్చి । యారాజసుతుఁ దాఁకి యసిగదా ముసల
పరశు తోమరముఖ ప్రహరణతతులు । పటిపిన నవియెల్ల భంగ మొందించి
కేయూరబాహుఁ డాగ్నేయబాణమునఁ । బాయ కయ్యసురుల భస్మీకరించె
నావార్త విని దైత్యుడత్యుగ్రకోప । మావహిల్లఁగఁ బంచె నపుడాఱువేల
నక్తంచరుల వారు నరనాథసుతుని । శక్తిత్రిశూలాది సాధనకోటి
ముంచిన నవి చూర్ణములుగఁ గావించి । పంచాస్యతులితుఁ డాపార్థివ సుతుఁడు
తనవింట దోగినీదత్త కౌద్రాస్త్ర । మనుసంద సంధించి యట్టె యేయుటయు
దాన ననేకాయుధమ్ములు వొడమి । నానాముఖముల దానవసేన నడఁచె
హతశేషు లదితెల్ప నద్దైత్యవిభుఁడు।ధృతి మించ ననిఁ బంచెఁ ద్రిసహస్రభటుల
నాభటు లభ్రతుల్యార్భటు లగుచు । భూభర్తపై శైలములు వృక్షములును
గుప్పిసినఁగెరలి నుగ్గుగఁజేసి యతఁడు।సురుద స్త్రమునవారి మహిఁగూల్చి కూల్చె
పదివేల దైత్య లీపగిదిఁ గూలుటకు । మది నచ్చెరువునంది మనుజాశనుండు

తన చెంతనున్న ప్రధానిశేఖరుల । ననలాక్షు యూపాక్షు హరిదక్షుముఖుల
వేపురఁగని మీఁద వేవేగ నేగి । యావిమతునిఁ ద్రుంచి యతనిమాంసంబు
పలలాశనుల కిచ్చి పఱతెండు పొండు । కలహాసన్నద్ధులై కడిమితో ననిన
స్వామి యానతియని వాహ రథాశ్వ । సామజ కరిసింహ శార్దూలశరభ
కాసరాదుల నెక్కి ఖడ్గదీధితులు । వాసరప్రభు విభావైభవం బడఁపఁ
బఱతెంచి కేయూరబాహునిఁ దాఁకి । శరపరంపరలు వర్షంబుగాఁ గురియ
నవియెల్లఁ దనుమూడి యామ్నబాణమున । దివిజులుమెచ్చ మర్దించె వారలను
దనవద్ది దైత్యులందఱు నిట్లువడిన । దనుజాధినాథుఁ డెంతయు నాగ్రహించి
కనకరథంబెక్కి కవదొన లూని । ధనురాది సాధనోత్కరముతో వచ్చి
కేయూరబాహు నీక్షించి యిట్లనియె । నోయి రాజకుమార! యుగ్రాహవమున
నసురులఁ గొందఱు నడఁచితి ననుచుఁ । బూసఁగ దహంకృతిపూన నాచెంత
నిలువుము నాయస్త్రనిహతి కటంచు । విలునారి సారించి విలయకాలార్క
కిరణనిభాస్త్రముల్ క్రిక్కిఱియఁగఁ । బఱపిన నవి తన బాణసంహతుల
ఖండించి రక్తాక్షుకవచంబు నిశిత । కాండ కాండముల నొక్కటఁ జెక్కుసేసి
ధనువుద్రుంచినవేఱెధనువె త్తివాఁడు । సునిశితాస్త్రములు వైచుటయుఁదుండించి
తురగ కేతన సారథుల నుగ్గుచేసి । యురమునాఁటగ నొక్క యుగ్రాస్త్ర మేసె
నందున వివశుఁడై యవనిపైఁ ద్రెళ్లి । బృదారకారి యొకింతలోఁ దెలిసి
మాయావియై నభోమార్గంబుఁ జేరి । మాయలు పన్నిన మనుజేశసుతుఁడు
ఆఖిల మాయాధ్వంసనాశుగం బనల । శిఖలు గ్రమ్మఁగ వైచి చిత్రవైఖరిని
మాయలు మాయింప మఱియొంటి నెఱువ । కాయసురాధీశుఁ డవనికి డిగ్గి
కేడెంబు కత్తియుఁ గేలఁగీలించి । యోడక పైకిరా నుంకించుటయును
బలకయుఁ గత్తియు బాణవ్యయమున । నలవుమై ఖండించి యైంద్రాస్త్ర మేసి
మకుటకుండల దివ్యమానమా మ స్త । మొకట నుద్ధరించి యుర్విపైఁ గూల్చె
నప్పుడు గురియించి రమరులు విబుధులు । మెప్పుగా నాడిరి మింట నచ్చరలు
నొప్పె సుగంధి వాయుప్రచారములు । తెప్పలుగా ద్రిమోసె దేవదుందుభులు
నఱచిరి దుఃఖిత లై దైత్యసత్తులు । పఱచిరి హత శేష పలలభోజనులు
గోలభుండను లుబ్ధకుఁడు బహు శబర । జాలంబుతోఁ జేరఁ జాల మన్నించి

వానికి ధనము లవ్వారిగా నిచ్చి । రానవేంద్రుని యింట ధన కనకములు
ప్రతిలేని భూషణాంబర బహువస్తు । తతులు మోపులచేఁ దన పురంబునకుఁ
బనుప నుద్యోగించి బరువు లమర్చి । తనకాంత బహురాజతనయుల తోడ
చెలిసాలఁ బడి జాలిచెందుట లెఱిఁగి । యరిగి యచ్చట దైన్య మాకృతిగన్న
గతి నడలుచునున్న కాంత నూరార్చి । వెతఁదీర్చి తన రూపవిభవంబుఁ జూచి
కామించిన నృపాలకన్యల నెల్లఁ । బ్రేమ లాలించి వారికి ముత్తియంపు
పాలకు లొనఁగూర్చి భార్యతో దనుజు।ప్రోలు వెల్వడి మంత్రిపుత్రునిఁ గాంచి
యీ పల్లకులవెంట నీసొమ్ము దెచ్చు । మోపర్లఁ దోఁకొని ముందరఁ బోవు
మనసేనఁగలసియీమగువఁదోకొనుచుఁ । జనుచుండుమి దెనేనుజనుదెంతువెంట
నని ప్రియురాలి హాయీహూఢఁ జేసి । పనిచినఁ గుంభి పాపప్రయత్నంబు
కాంతుతో వివరింపఁగా నజ్జగాక । యింతి యూరక చనియె హాయంబుమీఁద
మునుకొని పల్లకీల్ మోపర్ల మంది । చనియెఁ ద్రిగర్తదేశము జొడఁబట్టి
చని ముద్దియటఁబోవు సైన్యంబు గలసి।కొనియే నిక్కడ రాచకొడుకు దానవుని
భవనంబులో నున్న బహుపదార్థములు । వివిధ రత్నాంబరవితతులు శబర
కోటిచే మోయించికొని జయల్దేరి । బాట చేకొని తనపత్ని పోయెనని
పల్లకీల్ చనుత్రోవ పట్టుక చనియె । నల్ల కుంభి దురాత్మఁ డంతకమున్నె
శృంగారరేఖ తేజీమీఁద నెక్కి । యంగనల్ చనుత్రోవ నరుగుచునున్న
పోనీక యడ్డమై పొలఁతి ! నామాట । వీనుల నిడ కెందు వెడలిపోయెదవు
ఇరువుర మేగెద మెటకేని రమ్ము । మరులొండె బహువధూమణులపై నితఁడు
సరకుసేయఁడు నిన్ను సకియ! నేనెపుడు।నురముపై డించక యుంచి యేలెదను
అని వాగెఁబట్టి చయ్యనఁ దప్పుత్రోవఁ । గొనిపోవ వానిఁ గన్గొని పతియచట
లేకున్క పల్లకీల్మించిపోవుటయు । నాకల్క యెఱిఁగి యిట్టట్టనరాదు
వీనితో నూరక వెంబడి నంటి । రానిచ్చి మాతండ్రి రాజధానికినిఁ
జనిన పిమ్మట వీనిశాసింపఁ బనుతు । ననియెంచి వానితో ననియె నవ్వుచును
నాలాగె నావెంట నరుదెమ్ము నీకుఁ । బోలినచందాన భోగింతు గాక
త్రోవలోఁ గొఱగాని దుడుకులు సేయ । రావలదని తేజి రయమునఁ బఱపెఁ
బ్రొద్దుగ్రుంకకమున్నె పోయె వీటికిని । దద్దయువడిఁ గుంభి దానివెంబడిని

వగరింపుచును గుక్కవలె పరుగెత్తి । మగువపై మోహంబు మట్టుమీఱంగ
నీరీతిఁ దమయింటి కేగి యబ్భోటి । క్రూరుఁడై చనుదెంచు కుంభి నివ్వలికి
రానీకుఁడనుచు ద్వారపులతోఁ దెలిపి । తానేగె వేగ నంతఃపురంబునకు
నితఁడు వెంబడివచ్చు టేమి? నీవొంటిఁ । బతిఁబాసి యిటువలెఁ బఱతెంచు టేమి?
యెఱిఁగింపుమని తండ్రి యేర్పడ నడుగఁ । దరుణి యాకుంభి చైదము లెఱిఁగించె
నీనృశంసుని విచార లేమియు ననకుఁ । డాన కేంద్రకుమారుఁ డరుదెంచుడాఁక
వెలుపటితోఁటలో విడిది గావించి । నిలువుఁడు బహుమాన నిరతిచే ననినఁ
గానిమ్మనుచు బాహ్లీక క్షమావరుఁడు । వాని మహోద్యాన వనభూమి నునిచి
భటులఁ గొందఱిఁ గొల్వఁబనిచి మన్నింప।నటనుండె వాఁడు రాజల్లుండ ననుచు
నంత నక్కడఁ ద్రిగర్తాధీశసుతుఁడు । సంతోష మెసఁగ రాత్రిను నింటిసొమ్ము
సకలమ్ము గ్రహియించిసాగించి పంచి।శకటోష్ట్రములు మహోక్షములు మోపర్లు
చను పథంబునఁ దాను జవనాశ్వ మెక్కి । చనిముందుగా నేగు సైన్యంబు గలసి
పల్లకీ లేగుట పరికించి యలరి । యల్లసైన్యములోఁ బ్రియాంగన వెదకి
యెక్కడఁ బోయెనో యిందీవరాక్షి।యక్కుంభియును లేఁడయారె! ముందుగను
బురమున కేగిరో? పోలేక వెనుక । నడుదెంచుచున్నారొ? యలసమానమున
నని వితర్కించి నిజాప్తుల నడుగ । జనవంద్య! వార లిచ్చటికి రాలేదు
వెనుకఁజిక్కిరొయన్న వినిమంచిదన్ని।యునుగాననయ్యెడినొకముహూర్తమునఁ
బదుఁడని శృంగారభవనంబుఁ జేరి । కొదమపాయపు ముద్దుగుమ్మలతోడఁ
గరిహయ రథభటోత్కరములతోడ । సరిలేని రత్నభూషణ రాజితోడ
ధనముతో నమితగోధనముతో దాస । జనముతోఁ గనకభాజనములతోడ
మరకత వైడూర్య మరకత వజ్ర । కురువింద విద్రుమ గోమేధికాది
ఘనపేటికలతోడఁ గన్నతండ్రికిని । జనయిత్రికిని భక్తి సాగిలి మ్రొక్కి
రమణీయ రత్నాంబరములఁ బూజింపఁ । బ్రమదంబుతోఁ గూర్మిపట్టి దీవించి
యక్కుననుంచి వారంగంబు నిమిరి । యెక్కడఁ బోయితి విన్నాళ్లు వత్స!
యీకాంత లెవ్వార లీధనం బెచటఁ । జేకూరెఁ దెలుపు మాచెవుల కింపుగను
వినియెదమని ప్రేమ వేఁడు వారలకుఁ । దనకథ యెల్ల నాతఁడు వినిపించె
శృంగారరేఖ బాహ్లీకరాజసుతఁ దు । రంగమెక్కించి పురంబున కపుడె

పనిచితిఁ గుంభియుఁ బటి తేరఁడయ్యెఁగన కాంగి మఱల నెక్కఁడఁ జిక్కువడెనొ !
యీవిచారము మది హెచ్చె నటన్న । భూవరుఁ డయ్యంతి పుట్టినింటికినె
చనినేమొ తెలియుము చారులఁ బనిచి । యని వేగువారల ననిచె నాక్షణమె
తొంబదితొమ్మండ్రు తోయజాక్షులను । ... ...
తగు సౌధములనుంచి తలిదండ్రు లలర । జగతీజనులు తనశౌర్యంబు పొగడ
జనకునికడనున్న సమయంబు నందుఁ । జనుదెంచి వారితోఁ జారు లిట్లనిరి
అవధారు దేవ! నీయాప్తుఁడౌ కుంభి । చివురాకుబోడి నాశృంగారరేఖఁ
గామించి యేమేమొ కాఱులాడంగ । నామిటారి సహింప కశ్వమ్ము నెక్కి
తన పుట్టినింటికిఁ దరలిన వెంటఁ । జని రాజ! నేనె నీజామాత ననుచు
వంచన శృంగారవనములోపల వ । సించినాఁ డాయింతి చెడుగు వీఁడేడ
నీయల్లుఁ డున్నాఁడు నిశిచరాంతకుఁడు । కేయూరబాహుఁడు కీర్తివర్ధనుఁడు
ఐన నాతఁడు వచ్చునందాఁక వీనిఁ । బోనీకుఁడని రాజపుంగవుతోడఁ
బల్కిన నారాజు భటులఁ గొందఱను । గొలువఁగ నియమించి కుంభి నేమరక
నిలిపికొన్నాఁడు వానిప్రభుత్వ మెంచ । నలవిగా దేనె రాజల్లుండ ననుచు
నందలంబెక్కి వాహ్యాళిగా, వీథు । లందు వందిజనమ్ము లభినుతుల్ సేయఁ
జరియించు నొక వేళఁ జననీయఁ డంతి । పురమున కారాజు పూఁబోణి మదిని
బొగులు చున్నది నిన్నుఁబొడఁగానకునికిఁ దగదు మీరిక నిందుఁ దామసింపఁగను
నేఁటి కేపటఁ బోయి నీచుఁ డాకుంభి । యాటోప మడఁగించి యతివఁ దోడుకొని
రావలెనని న తెఱుంగెల్లఁ దండ్రి । తో వివరించి యా దోర్బలాధికుఁడు
నొకదినంబున దైవయోగంబు కతన । నొకరుండె చేత నాయుధ మేమి లేక
ప్రచ్ఛన్న వేషుఁడై పఱ తెంచెఁ గుంభి । తుచ్ఛత శోభింపఁ దోయ్యలి! వినుము
రాక్షసాంగన పతివ్రతగాన దాని । యక్షీణశాపోక్తి యటులఁ బ్రబేరేపఁ
బురబాహ్యమున వచ్చు భూపాలపుత్ర । వహుని సరాళంబు వచ్చిన కుంభి
ఫరికించి తనయొద్ది భటులతో వీని । కరపదచ్ఛేదంబు గావింపుఁ డనుచుఁ
బనిచి తానిల్వక పట్టణమ్మునకుఁ । జనెఁ గృతఘ్నునకు దోషవిచార మేల?
నామూర్ఖుఁ డనిచిన యటుల నబ్భటులు।భూమీశసుతునిఁ గొంపోయి దవ్వులను
నెలదోఁట చెంగట నిరవొందు వధ్య । శిల నుంచి కరపదచ్ఛేదం బొనర్చి

పడవైచి పోయి రాపలలాశిరాజు । పడఁతి శాపమున దుర్బలునట్లు లడల
వనపాలుఁ డపు డాత్మవనితతో వచ్చి । కనుగొని యతని శృంగార వైఖరికి
నివ్వెఱపడి యేమినేరంబుఁ జేసి । తివ్విధి వ్యథనొంద నేమికారణము?
రాజపుత్రుఁడవేమొ రమణీయ తేజ! । యే జడుం డొనరించె నింత యక్రమము?
నెఱిఁగింపుమనిన రాజేంద్రనందనుఁడు । హరహరా! యెవ్వరిననఁ బనియేమి?
కుంభిరూపమున నాఘోరంపువిధి వి । జృంభించి యిటువలెఁ జేసెనటన్న
నావనపాలుఁడు హా! యని వగచి । వేవేగఁ దనభార్య విపణికి ననిచి
నూనెయు నిమ్మపండులును దెప్పించి । పూని పావకముఖంబునఁ గాఁచి యొత్తి
యానొప్పి దీర్చి యుద్యానవనంబు । లోనున్న తనయింటిలో నొక్కశయ్య
పైనుంచి పోషించె బహుదివసములు।హానియొక్కఁడు సేయనరయు నొక్కరుఁడు
అలఱుల సరముల నప్పటప్పటికి । నల రాజతనుజాత కవ్వనపాల
కామిని గొనిపోవుఁగావున నతని । కామెచెందెడు విరహాము దెల్పుచుండు
వాహ లేనప్పు డావనభూమి తానె । యూరయుచుండు నయ్యవనీశసుతుఁడు
రాత్రులు వారప్పురంబున కరుగ । ధాత్రిపై కుఱికి యుద్యానవీథులకు
నెవ్వరిఁ జొరనీక యెలుఁగిచ్చుచుండు । నివ్వగ నెలలు నాల్గేగిన వెనుక
నొకనాఁటిరేయి మహోక్షుంబు నెక్కి । మకరాంకవైరి నిర్మలదేహరుచులు
వెలసి దిక్కులు పండువెన్నెలల్ గాయ । జిలువరా తాళీలజిగిదేరు మణులు
ధగధగ వెలుఁగ ముందరవెన్కఁ బ్రమథులగజేశ! శంకర! హర! పరాకనుచు
హెచ్చరించంగఁ జండీశుఁడు కేలి । పచ్చబ్రద్దనె బరాబరులు గావింప
రహిఁ గెంజడలు సాంధ్యరాగంబు గూర్ప । బహు రుద్రకన్యకావ్రతతి సేవింప
వామాంకమున హైమవతినుంచి యామె। మోమునగ్గొనిప్రేమముచ్చటాడుచును
నావనమార్గంబునందు రా శివుని । దేవి కన్గొని మహాదేవ! పరాకు
ఈవనం బతిరమ్య మించుకసేపు । నీవు నే నిచట నెంతే వేడ్కనుండి
యవలఁ బోదమటన్న నౌగాక యనుచు । శివుఁడు ప్రవేశించె శృంగారవనము
దేవియు దేవుఁ డీతీరున వనము । లోవచ్చి డిగ్గు టాలోకించి యతఁడు
కాయంబు పులకింపఁగా మఱి సద్దు । సేయక సెజ్జ చెచ్చెర డిగ్గి నేలఁ
బడి పొరలుచుఁ బోయి బలుపొదరింటి । కడ మానువలె కూలి కదలకయుండె

శంభునితోఁ గూడి శాంభవీదేవి । రంభాఁ ద్ర జంబు కురంటకాశోక
పనస మధూక పిప్పల పారిజాత । కనకాది తరుసముత్కరముతో నెనయు
మాలతీ మల్లికా మాధవీలతల । నేలకితీఁగెల నెలమిఁ గన్గొనుచు
నల పొదరింటిచాయకు వచ్చి యచట । శిలవలెఁ బడియున్న ఋతివరాత్మజుని
వీఁపునఁ బదముంచి విహలుగోయంగ । నాపట్లఁ బులకించె నతని నెమ్మేను
అంతనఁ దెలిసి యయ్యంబ యెవ్వాఁడ।విం దేలఁ బడియుండె దెతీఁగింపు మనఁగ
నంతలోఁ బరమేశుఁ డచటికి వచ్చి । యింతి! నీసేవకుం డీరాజసుతుని
నెఱుఁగవే? యెతీఁగియు నెఱుఁగనియటులఁ।గరుణచూడక వేడఁగానేల? యనిన
గిరిజ సయ్యనడ్డి కేయూరబాహ! । వెఱవక శివుని సేవించికొమ్మనిన
మొద్దుచేతులు రయంబున బారసాచి । యద్దేవదేవుని యంఘ్రులు శిరము
గదియించి "ఓంనమోగరళకంఠాయ । సదయాంతరంగాయ సర్వేశ్వరాయ
శంభవే శూలినే శశిశేఖరాయ । దంభూత వామాంగధారిణే పాహి
పాహి" యటంచు సద్భక్తిఁ గీర్తించి । దేహిమే కరపదద్వితయం మహేశ!
తవ దర్శనా దహం ధన్యోస్మి యనఁగ । శివ! కటాక్షించి యచ్చిన్ని బాలునికిఁ
గరపద యుగళముల్ గరుణింపుఁడనిన । హరుఁ డట్టులౌగాక యని వరంబిచ్చెఁ
జిగురుటాకులలీలఁ జేతులుగాళ్లు । నగజేశ్వరులకృప నావిర్భవింపఁ
గ్రక్కున లేచి యగ్గారి యంఘ్రులకు । మ్రొక్కి హస్తంబులు మొగిచి యనేక
విధముల వినుతించి వినుఁ డొకమనవి । యధికవాత్సల్య కల్యాత్మలై మీర
కావలసినవేళఁ గరము లంఘ్రులును । రావలె వలదన్న రాకుండవలయు
నటు ప్రసాదింపరే! యన్నఁ దలంచి । నటుల యూనని వారలంతర్ధిఁ గనిరి
మరునాఁటిరేయి నమ్మనుజేశసుతుఁడు । విరులు తానెగ్రహించి వింతగా బంతి
కట్టి పంపిన రాజకన్యక కిచ్చె । నట్టె యవ్వనపాలికాబ్జపత్రాక్షి
యీవింత పూబంతి యెవ్వరు గట్టిరో! వెలందుక! యన్న నొక మొండివాఁడు
వనిఁజేరి యున్నాఁడు వాఁడిట్లు గట్టి । పనిచెనటన్న నబ్బాలిక పలికె
మొదటనే యంటివి మొండివాఁడనుచు । నిదియెట్లు గట్టినాఁ డేల మొండయ్యె?
వినిపింపుమనిన నవ్వెలఁది యిట్లనియె । ననబోణి! కుంభి యన్వాఁ డకారణము
కరపదహీనుని గావించె నతఁడు । చిఱుత పాయపువాఁడు శృంగారమూర్తి

యతని నొప్పి హరించి యరసితి మేము!సతి! యన్నఁబూబంతి సడలించి యందుఁ
గేతకీదళ సంలిఖిత వర్ణపంక్తి । యాతలోదరి చూచి యది చదివికొని
యతఁ డాత్మవిభుఁడౌట నప్పుడెఱిఁగి । పితృసమీపమునకు భీత యై యరిగి
యాచీటి చదివి రక్తాక్షాది బహుని । శాచరవీరుల సమయించినట్టి
గురువిక్రమాఢ్యుఁ డీకుంభిచే సిట్టులఁ । గరపదహీనుఁడై గాసిల్లె ననుచు
నడల విక్రమసేనుఁ డాకన్యశోక । మడఁచి మిత్రులు మంత్రు లాప్తులు గొలువ
బాలికఁ దోఁకొని భార్యయుఁ దాను । గేళీవనముసొచ్చి కేయూరబాహుఁ
గరపదహీనునిఁ గని చాలవగచి । యెఱుఁగక నిల్పితి మీకుంభి నీకుఁ
బరమాప్తుఁడని యెంత పాపాత్మఁ డనుచుఁ।గరమల్లి వానినక్కడకుఁ బిల్పింప
నరుదెంచె భటులు హేయపుమాట లాడఁ । బడిభవం బొదవ దే!పాపిష్ఠి కిటుల
వచ్చి యచ్చటఁ దలవాల్చి నిల్చున్న । యచ్చెడుఁగును జూచి యలరాజకన్య
పలికె నిక్కజనుండు బాటలో నన్నుఁ । దలఁబట్టి పడఁదోయుఁ దమకించి మీఁదఁ
బడిరాఁగ నేభయంపడి మొఱయిడినఁ । గడు వేగవచ్చి రాక్షసుఁడు ముంగాల
నీమూర్ఖుఁ దన్ని నన్నెత్తుక పోయె । నామీఁదఁ దేజిపై నరిగెడు నన్నుఁ
బోనీక యెట కేనిఁ బోదము గమ్మ్ము । మానినీశతము నీమగని కుండఁగను
నిను సడ్డనేయునే! నెఱనీటుకాఁడ । నను వరింపుమటంచు నానావిధముల
వరుచుఁ దప్పుత్రోవను గొనిపోవ । నిది తటిగాదని యెంచి మాపురికిఁ
జనుదెమ్ము నీకోర్కి సఫలమౌ నచట।నని వాగెవదలించి హయము దోలికొని
వచ్చితి నిచటికి వై ధేయుఁడెదిగి । వచ్చె నావెంబడి వడి నిట్లువచ్చి
తానె జామాత నీధరణీశ్వరుఁకు । శ్రీనిధి తనభార్య శృంగారరేఖ
యని వదరుచుఁ దిరుగాడు నిప్పుడిని । నిను నొంటిరాఁ జూచి నెనరింతలేక
తునిమించెఁ గాళ్లుచేతులు క్రూరుఁడగుచు । గనివిని యెఱుఁగ మేకడ నిట్టిఖలుని
నీకృతఘ్నునిఁ బట్టి యెంతచేసిన ధ । రాకాంతతనయ! తీఱదు కోప మనుచు
నందఱువినఁ దనయంగన పలుక । ముందరనున్న యమ్మొఱకు నీక్షించి
కేయూరబాహుఁ డాక్షేపించి పలికె । నోయికుంభీ! యెంత యుగ్రకర్ముఁడవు!
చెలికాఁడవని విశ్వసించితి నిన్ను । భళిభళిరా! యెంతపని చేసినావు
నీతోడఁ బలికిన నినుఁ గనుంగొనినఁ । బాతకం బొదవు నిబద్ధిగా ననుచుఁ

బలుక బాహ్లికభూమిపతి యాగ్రహించి । తులువ నాఁజను వీనితో మాటలేల?
నెదురుగాఁ జెంగట నిడుకొని యనుచుఁ।గుదియంగఁ గట్టించి కూలఁ ద్రోయించి
బండిపైనిడి వీనిబలుకండ లెల్ల । ఖండించి కాకులు గ్రద్దలు దినఁగ
వ్రేయుఁడు కళలెత్తి వ్రేయుఁడు తునిమి । వ్రేయుఁడు కరపదద్వితయంబు ననుచు
సెలవొసంగిన నట్లచేసిరి కొంత । బలవంతులగు వీరభటు లంతలోనఁ
గరపదములు కోయఁగా వలదనుచుఁ । గురుణతో రాజశేఖరుఁ డద్దురాత్మ్ము
విడిపించెఁ గాకాదివిహగముల్ వాని । యొడలి కండలు తిన కోకిలించికొనె
ధర నట్లుగాదె కృతఘ్ను ర క్తంబు । కొఱగానిదని క్రక్కఁ కోనుఁ గుక్క లైన
గడురోసి సిగగోసి కన్నులుదీసి । విడిచిన వాఁడొక విపినంబులోనఁ
బడిపోయెఁ గేయూరబాహుని నంత । నడరువేడుక బాహ్లికావనీశ్వరుఁడు
పచ్చల పల్లకిపై నిడికొని భ । టోచ్చయంబులు మంత్రు లుర్వీజనములు
గదిసి కొల్వఁగఁ దనగారాబు పట్టి।మదవతుల్ గొలువఁగా మగనిఁ గ్రమ్మఱిను
గనఁగల్గెనని కౌతుకంబు వహించి । జననితో ననుచురాఁ జని పురిఁజొచ్చి
మగఱాల మేడ జామాతను నిలిపె । నగణిత గుణగణ్య యారాజకన్య
కరపదహీనుండుగా యని యాత్మ । నెఱబాటికము లేక యెంత లేదనక
పాలుమాలక వెతఁబడక పోషణల । కాళీజనముఁ బంప కహారహం బెనసి
మమతతో నతని నేమరక పోషించెఁ । గ్రమ మెఱింగిన పతివ్రతగాన యిటుల
స్థిరబుద్ధి నొకనెల సేవలుసేయఁ । దరుణి భక్తికి మెచ్చి ధరణీశసుతుఁడు
నేకతంబున దానికిట్లని పలికె । నీకేమికావలె నీలోత్పలాక్షి!
యెఱిఁగింపు మడిగిన నిచ్చెద ననిన । నరవిందలోచన యానందమంది
నను మెచ్చితేని మానవనాథతనయ! । మునుపటివలెఁగరంబులు పాదములును
వహియింపుమనియెఁగావలసినకోర్కె!।మహిమాఢ్యుఁడవుతుచ్చమనుజుఁమాడ్క
నిట్టులుండుట పాడియేయని వేడు । పట్టంపుదేవి నున్ బలుకుల కలరి
నీతలిదండ్రుల నీసహోదరుల । నీతోడిసకియల నీబంధుజనులఁ
బిలిపింపుమిచటి కంబిక కృపాకలనఁ । దెలిగంటి! నీదు పాతివ్రత్యమహిమఁ
గరములు చరణముల్ గలిగెడు ననినఁ । దరళాక్షి వారినందఱఁ బిలిపించె
నత్తమామలు మొదలైనవారలకుఁ । జిత్తంబు రంజిల్ల క్షితివరాత్మ్మజుఁడు

హరహర! శంభో! మహాదేవ! యనుచుస్మరియింపఁ గరపదాబ్జము లుద్భవించె
నాయద్భుతము చూచి యచటివారెల్లఁ గేయూరభాహునిఁ గీర్తించి రపుడు
అత్తమామలు బంధు లత్తలోదడియు । బత్తిసేయుంగ శోభనలీల నచట
గురుతరోత్సవములఁ గొన్ని నాళ్లుండి । తరళాక్షిఁ దోడ్కొని తనయూరి కరిగి
తొంబదితొమ్మండ్రు తోయజాక్షులఁ బ్రి । యంబునఁ బెండ్లాడి యందఱఁగూడి
యెందునఁ గొదువ లేకెల్ల భోగములుచెంది తండ్రియనుజ్ఞ నీతిఁ బ్రోచుటకును
బట్టాభిషిక్తుఁడై ప్రజ జయవెట్ట । నిట్టలంబగు ప్రేమ శృంగారరేఖ
వలనఁ బుత్రులఁగాంచి వన్నెయువాసిగలిగి శాంభవి కటాక్షమున సొంపొందె
శృంగారరేఖాచరిత్రంబు వినిన । సంగతిఁ జదివిన సత్పురుషులకు
నాయురారోగ్య భాగ్యంబులు గలుగుశ్రీయుప్పతిలునంచుఁజిలుక తెల్పుటయు
నాపుష్పమంజరి యలరుచు నేగె । లోపలి కలనృపాలుని దూతి చనియె
నని శంభుఁడెఱిఁగింప నవ్వలికథలు । వినిపింపుఁడని గౌరి వేడ్కతో ననియె
సరస పతిప్రతాచరితంబు నందు । నరయ నిర్వదితొమ్మిదవకథ యమరె

శుకగాంధర్వ కథ

శ్రీ నిశ్వపతి సమంచితసూక్తి గౌరి । కావలికథ యిట్టులని తెల్పఁదొడఁగె
చెలి మఱునాఁడు పశ్చిమదిశాకాంత । బలు సంజకెంజాయపట్టు ధరించు
వేళ దూతికపిల్వ వెనుకొని వచ్చు । బాలఁగన్గొని చిల్కపల్కఁ నప్పుచును
బతిని వంచనజేసి భామలు చెడిన । కతలవి యెన్నైనఁగల వెంచనేల
నతిరహస్యంబైన యర్థంబు దెలిపి । పతిగుట్టు దెల్పిన పడఁతి చరిత్ర
యొక్కటి గలదది యూకొందుగాక । యక్క! పరాకులే కాదికాలమున
వంగరాజ్యంబున వాసంతికాఖ్య । రంగారు నొకనగరము రమాకరము
నింద్రుఁడు దివిఁబోలి యేలు నప్పురము । చంద్రధ్వజుండను జగతీశ్వరుండు
ఆదొరకు వరాంగుఁడను కుమారకుఁడు । ప్రాదుర్భవించె రూపజితాంగజుండు

అతనికిఁ బరిపూర్ణ యౌవనోల్లాస । మతిశయింపకమున్నె యమ్మహారాజు
గావించెఁ బెండ్లి చక్కనిదాని మత్స్య । భూవల్లభుని పుత్రిఁ బున్నాగగంధి
నక్కన్యకను బెండ్లియాడిన మొదలు।చక్కఁ జూడఁడెకదా స్వగృహమ్మునకును
దోడితెమ్మని నిజాప్తులఁ బంపఁడొక్కనాఁడై నఁ బుట్టినింటనె యుండె నదియు
పుట్టినింటనె యున్నఁ బొలఁతిపాయ మది । యెట్టానొయని సంశయింప కీరీతి
రాచూలి యున్నఁ బరదార్వరయయ్యె । నోచెల్వ! యిదిమీఁద నుగ్గడించెదను
ఆవరాంగకుఁడిట్లు యౌవనోజ్జ్వలిత । యౌవరాజ్యమునకు నభిషిక్తుఁడగుచుఁ
దమతండ్రినుడి జవదాటక యున్న । సమయంబున వివేకశాలియౌ నొక్క
ద్విజకుమారుఁడు దూరదేశంబు లేగి । స్వజనమ్ములున్న వాసంతికాపురికి
నరుదెంచి యొక్కనాఁ డావరాంగకునిఁ । బరిజనసహితునిఁ బ్రాభవోన్నతుని
సభలోనఁగని రెండు జంబీరఫలము । లభినవాదృతి నిచ్చి యాశీర్వదించి
యతనిమన్ననగాంచియర్హపీఠమున । హితగోష్ఠినుండియోయివరాంగ!సుతులు
గలరె నీకని చెలికాఁడౌట నడుగ । నెలనవ్వుతో నమ్మహీశనందనుఁడు
బొట్టుగట్టిన మొదల్ పూబోణిముఖము।దెట్టులుండునొ! చూచియెఱుఁగ నటన్న
నల కమలాకరుండను పిన్నవయసు । నలినాక్షిఁ బుట్టినింటనె నిల్పనగునె?
పొగరుఁ బ్రాయపుటాలిఁ బుట్టినయింట । దిగవిడిచిన కుబుద్ధికి నొక్కతిట్టు
తనధనం బన్యుచే దాఁచగానిచ్చు । చెనఁటికి నట్ల చెచ్చెరఁ దానుపోవు
పనికి వేఱొక్కనిఁ బనిచిన పాల । సున కొకతిట్టను సుజనోక్తి వినవె ?
యనిన వరాంగుఁడట్లైన నప్పరికిఁ । జని దానిశోధించి చనుదెంతు ననుచు
భోరునఁజని మత్స్యపురి గోపవేష । ధారియై యొకవైశ్యధామంబు చేరి
వానిచేతికి నూఱువరహాలు దాఁచఁ । గానిచ్చి నగరివెన్కను గణేశ్వరుని
గుడి నున్నచోఁ బ్రొద్దుగ్రుంకిన నాల్గు । గడియల కయ్యారుగాఁచు తలారి
కొడుకు పావలుమెట్టుకొని కత్తి చంక । నిడుకొని తెలిహుమా లిమ్ముగాఁ గట్టి
వలిపదుప్పటి వలెవాటుతో నీటు । గులుక నుద్ధతివచ్చి గుడి నెవ్వరనుచుఁ
బలుకరించుటయు గోపాలకవేష । మొలసిన నృపనూనుఁ డోయన్న! నేను
పరదేశి గొల్లండఁ బండియున్నాఁడ । నరుగలే నెక్కడికనిన వాఁడోరి!
యీరాయి వడిఁద్రిప్పి యివ్వలఁబెట్టి । రార నావెంట శీఘ్రంబున ననినఁ

బిళ్లారిముందరఁ బెనురాయి తిగిచి । యల్లన కడఁబెట్టి యందొకబిలము
గనుగొని యిఁక నేమి గావింతు ననినఁ । దనచేతి విరిసరుల్ తావిగంధంబు
వక్కలాకులు నిచ్చి వాఁడు నావెంట । నిక్కడి కరుగుదెమ్మివిగొని యనుచు
నన్నేలమాళిగె యతనితోఁ జొచ్చి । పున్నాగగంధి పాన్పుసమీపమునను
నవియెల్లఁ బెట్టించు నప్పుడయ్యింతి । యవలికి నత్తలయారినిఁ బిలిచి
వీఁడెవ్వడని భీతివేడిన గొల్ల । వాఁ డేలవెఱచెదు వగలాడి! యనుచు
నిటువంటిశావుల కీవింతవాని । నెటువలె తోతెచ్చి తెఱుఁగవే బుద్ధి
యిప్పుడే చంపించు మీవేషధారి । తప్పిన మనలకిద్దఱకు మోసమగు
ననునెడ దానిరాజాత్మజ యనుచుఁ । గనుఁగొని తెలిసి భూకాంతునిసుతుఁడు
నిది తఱిగాదని యేమనకుండె । నొదిగి తలారి యయ్యువిద పంపునను
నారాజసుతుతో బయల్దేరి వీధి । బాహులై చను తనభటుల కందఱకు
గమికాడయినవానిఁ గ్రక్కునఁ బిలిచి । నిమిషంబులోన వీనిశిరంబు త్రెంచి
యల వధ్యశిల నుంచి యరుగుదెమ్మనుచు। నెలవిచ్చి యొప్పగించి బిరీనఁ జనియెఁ
జెడుగులా కులటలఁ జేపట్టినట్టి । జడుల కాపదలిట్లు సంధిల్లకున్నె !
ఆగమికాఁడు వరాంగకు నిట్లు । వేగంబె పెనుత్రాళ్ల విఱిచి కట్టించి
కొనిపోవ వారికిఁ గూడిమివుట్ట । వినయోక్తులాడి యోవిమలాత్మ! నీకు
శతనిష్కములు చేనొసంగెద నిపుడె।ప్రతికింపుమని చాలఁ బ్రార్థించి యొక్క
వరవీరభటు నంపి వైశ్యుఁడు నూఱు । వరహాలొసంగెడి వడిగఁ దెమ్మనుచు
ననిచిన వైశ్యుఁడాయన నెవ్వఁడెఱుఁగు।నిను నెవ్వఁడెఱుఁగు కంటివెవరాలతఁడు
నాచేతి కొసఁగ మిన్నక పొమ్మనన్న । రాచబిడ్డని కత్తెఱఁగు వాఁడుదెలిపె
దెలిపిన నొరునిచేతికి నర్థమొసఁగు । ఖలునకుఁ దిట్టన్నకత నిజంబయ్యెఁ
బుట్టినయింట నంభోజాక్షి నిడిన । యట్టివానికి నట్లయగుట కాన్పించెఁ
దనపని కొరునంపఁ దగదనితాన । చనియెఁ దలారులు జతగూడి రాఁగఁ
జని శెట్టిచేతి నిష్కము లట్టెపుచ్చు । కొని తలారికొసంగి గుట్టునవాఁడు
పురబాహ్యమున డించిపొమ్మన్న నవల । నరిగె తూర్పున భానుఁ డంతటఁదోచె
నరుణోదయమున సంధ్యావిధుల్ దీర్చి । తరుణిపైఁ గ్రోధమత్సరములు హెచ్చ
మామచెంగటి కేగి మామ! కన్గొనుము । నీముద్దుకూఁతురి నిలయం బటంచు

నానేలమాళిగ యతనికిఁ జూపి । దానికిఁ బ్రియుఁడైన తలయారికొడుకు
తెఱఁగును దాను రాతిరిగన్న విధము । నెఱిఁగింప నతఁడుగ్రహించి తలారి
కొడుకు నాఋణమునఁ గొ ర్తవేయించి । పడుచును నూతిలోపలను ద్రోయించి
యతనికిఁ దమ్ముని యాత్మజునొసఁగ । మతినెంచ సమ్మతింపక యూరికేగి
ద్విజసుతుఁ గని నీవు తెల్పినదెల్ల । నిజమాయె నని యతని బహూకరించి
మగువలనింక నమ్మఁగరాదు వారి । తగు లొల్లనని విర క్తస్వాంతుఁ డగుచుఁ
బరిణయస్పృహావహింపక యవ్వరాంగుఁడుఁ బ్రకయుండఁగఁదండ్రియునుమంత్రివరులు
నీడేరిన మిటారి నిఁకనీవుపెండ్లి । యూడవేనియు నుపాయము వినుమొకటి
యనివారలొక యుపాయము దెల్పమంచి।దని సమ్మతించి చయ్యనఁ దమతండ్రి
యనుమతి గర్భిణులగురాజు సతుల । నెనరుగల్గిన వారి నెమ్మిఁ బిల్పించి
నగరిలో నిడికొని నానాఁటి కుచిత । మగురీతిఁ బ్రసవ పర్యంతంబునరయ
వారిలోఁ జేది భూవరకాంత యొకకు । మారిని గనియె మన్మథు చికఁటారిఁ
బోలినదాని నాభూవరసుతుఁడు । బాళిమైఁ జేకొని భర్మసౌధమున
నేకతంబుననుంచి యెవ్వరి నటకు । రాకుండ నేమించి రాతిరిపగలు
కనికరంబునఁ బ్రోవఁగా దాదినొకతెఁ । బనిచి తా నప్పటప్పటి కేగి యేమి
వలసిన నిచ్చుచు వాక్రువ్వరాని । యెలమితోఁ బ్రోఁదిసేయించెఁ గొన్నాళ్లు
నేడెనిమిదియేఁడు లేగిన నేడు । మేడల కవ్వలిమేడపై నుంచి
దాదిని రానీక దానికి మజ్జ । నాదులు భోజనం బాదిగాఁ గలుగు
పనులెల్లఁ దానెతప్పక యొనర్చును । బెనుతల్పులన్నియు బీగముల్ వేసి
బయలుదేరుచుఁ బాట పదమును జదువు।ప్రియమొప్పఁ దానెచెప్పి నిరంతరంబు
నించియు మంచియు నిడుచు నలంక । రించుచు రత్నపరిష్కారములును
వలువలు నవిక పావడ గంధమాల్య । ములు దెచ్చియిచ్చుచు మూలనే దాఁచి
నోరూర దాని మనోరమ యనుచుఁ । జేరుచుఁ జెక్కిలిఁజేరుచు మోము
ముద్దిడుకొనుచు సొంపున నదితెలుపు । సుద్దు లాలింపుచు సుముఖుఁడై యుండె
సుమమంజరికిఁ దావిసుడిసిన ఠీవి । కొమరుపాయమువచ్చె కోమలి కపుడు
వెలఁది కొప్పునకొక వింతకప్పాదవే । జెలికన్నుఁగవకు హెచ్చిలెవింతబెళుకు
కలికి చెక్కులకుఁ జక్కనికాంతి మొనసె । నెలఁత మోమున కొకనీటు వాటిల్లె

బాలిక గబ్బిగుబ్బల కుబ్బువొడమె । నీలవేణికి మేన నెఱిమించు మించె
నాతి వాతెఱకెంపు నాడెంబుగాంచె । నాతలోదరికిఁ బాయుపువన్నె మించె
నీలీల నెలఁబ్రాయ మెనసిన దాని । జాళువా మేడపై సకినెలకోళ్ల
పట్టెమంచము మీఁదఁ బఱచిన విఱుల । దట్టంపుఁ బాన్పుపైఁ దమి యుగ్గలింప
వలరాజు సాక్షిగా వనిత గాంధర్వ । కలనఁ జేపట్టి యంగము పులకింపఁ
గలసి మన్మథకేళికాలోలుఁ డగుచు । నలరెఁ దాఁబడిన ప్రయాస మంతయుఁను
ఫలియించె నిపుడని పార్థివసుతుఁడు । దలఁచి రేలెల్ల నత్తరుణితోఁ గూడి
క్రీడించుఁ బగలు వాఁకిళ్లెల్ల మూసి । వేడుక గొలువులో విభవంబు మెఱయు
మసలక వసియించు మధ్యాహ్నమైన । వెసఁ బోయి వాఁకిళ్ల వేసిన యట్టి
బలుబీగములు దీసి భవనముల్ సొచ్చి । తలుపులు గడెలు భద్రంబుగా వేసి
కక్ష్యాంతరంబులు క్రమియించి చని మృగాక్ష్యనురాగ లోలాత్ముఁడై యుండు
నంతట నొక్కనాఁ డలినీలవేణి । కాంతుఁడు పేరోలగమునకుఁ జన్న
నొంటిగా మేడపై నుండగా లేక । యింటి చెంగట నొప్పు నెలదోఁట నడుమ
చెన్నొందు సురపొన్న చెట్లలో వ్రేలు । చున్న బంగరుతూఁగు టుయ్యాల లోనఁ
బికములు తన జిలిబిలి తేటపాట । లకు గుంపుగూడి కెలంకుల మెలఁగ
నెరయ ముంగురులతో నెక్కొని నుదుట।హరువుగాఁ జేర్చుకక్క యల్లలనాడఁ
గంగుల అనికపై గబ్బిపాలిండ్ల । రంగారు రత్నహారములు చలింపఁ
గరకంకణధ్వనుల్ కాంచికార్భటులు।చరణ నూపుర ఝుళంఝుళ లైక్యమందఁ
జక్కని నెమ్మేనిచాయ నల్లెసలఁ । గ్రొక్కారు బల్ మెఱుంగుల రంగు గూర్పఁ
గేళి సల్పెడుదాని కిలికించితాది । హేలలు వినువీథ నేగుచునున్న
కనకాంగదుండను గంధర్వవిభుఁడు।కనుఁగొని యాశ్చర్య కలితాత్ముఁ డగుచుఁ
దన విమానము వియ త్తలమున నిలిపి।వనలక్ష్మియో? యిది వలరాజుసతియొ?
యనిమిషాంగనల కీయందముల్ గలవే? । యని దానిచెంగటి కరుదెంచి పలికె
నొంటిగా నుయ్యాల లూగెడు వాలు । గంటి! నీవెవ్వరికాంతవు? చెపుమ
కళలీను నీనెమ్మొగము గనుంగొనినఁ । బొలఁతి! ముద్దాడనే బుద్ధిపుట్టెడిని
వనజాక్షి! నీకెంపువాతెఱఁ గనిన । మొనపంట నొక్కనే ముచ్చటయ్యెడిని
కలికి! నీబిగిచన్నుఁగవఁ జూచినంత । నలమి కౌఁగిటఁజేర్వ నాసగ్రమ్మెడిని

చెలువ! బంగరుబొమ్మ జిగిఁబన్ను నిన్నుఁ । దిలకింప భోగేచ్ఛ తీవ్రపెట్టెడిని
చిలుకలఁ దరుము నీచిన్నారిపలుకు । వెలఁది! నావీనులు వినఁ గోరెడిని
పలుకవే! కపురంపుఁబలుకులు గులుకఁ । దలయెత్తి చూడవే! ధవళాయతాక్షి!
యనిన గంధర్వుని యాకారరేఖఁ । గనిమరుల్గొని తనకథయెల్లఁ జెప్పి
వైవంబె నినుఁదెచ్చె ధవుఁడు మధ్యాహ్న । మావేళ నిటువచ్చు నంచాక నీవు
ననపుతో నాజవ్వనము కొల్లలాడు । మని వానిఁజేకొని హర్మ్యంబుఁ జేరి
చలువపానుపుమీఁద శయనింపఁ బంచి । వెలఁది కర్పూరంపు వీడియం బిచ్చి
తమిఁ బెనంగొని పేరెదను గుబ్బలొత్తి । సమరసక్రీడలఁ జతురత చూపఁ
గడుమెచ్చి వాఁడును గళలంటి దాని । నుడివోని సురతసౌఖ్యోదధిఁ దేల్చె
వలచె గంధర్వుఁ డాపనితయు మూఁడు । వలపులు వలచె నీవగ దినదినము
నేఁడు వచ్చినవేళనే వచ్చి నన్నుఁ । గూడి సుఖంపు మేగుము నేఁటి కిదిగొ
పగలయ్యె నాపతి పజ తెంచి కన్నఁ । బగలయ్యెఁ నటంచు బాళితో వాని
మోము మోమునఁజేర్చి మోవి గ్రోలుచును।గామిని పనిచిన గంధర్వుఁడరిగె
చెలువంబు నేర్పులు చిన్నెలు గలిగి । కళల మర్మమెఱుంగు గంధర్వసుతుఁడు
వచ్చి భోగించిన వలవకయున్నె । యెచ్చంద్రముఖియైన నిదియేమి యరుదు
పగటిదాఁక నెలంతఁ బాయకయుండి । గగనయానంబున గంధర్వుఁ డేగ
వాఁకిళ్లు దెఱచుకవచ్చి యావెనుక । భూకాంతతనయుండు భోగించుదాని
నీరితిఁ గొన్ని నాళ్లేగిన నాడు । కీరంబవై రమ్మ ఖేచర యనుచు
వాని నియోగించి వగలాడి తోఁటలో నాడుచిల్క పొల్పున వాఁడు మెలఁగ
వగపుతోఁ జేవోడు వాదోడు లేక । నగరిలో నొంటినుండ వశంబె యనుచుఁ
బతిఁజూచి యాచిల్కఁ బట్టియిమ్మనిన । నతఁడు కానిమ్మది యాడుచిలైకనఁ
బట్టియిచ్చెదనని పలికి శోధించి । పెట్టయైయునికి సంప్రీతితోఁ బట్టి
యిచ్చె నచ్చిలుకయు నెప్పుడెప్పుడని । యిచ్చ నెంచుటఁజేసి యిటునటుఁ జనక
చెచ్చెగ నాయనచేతికిఁ జిక్కి । కుచ్చితుల నెఱుంగఁగూడ దెవ్వరికి
నాకపటోపాయ మారయలే కి । లాక్షాంతుఁడది నిజాలకుఁ జిల్క యనుచు
దీనినెప్పుడు ఱొమ్మ్మదింప కేదుమని । యానీలికొప్పించి యరిగె కొల్వునకుఁ
గలకలనగి కల్క గంధర్వ! యెపుడు।చిలుకను ఱొమ్మ్మదించెదు సుమా! యనుచు

సెలవిచ్చెఁ బతి యట్లచేసెద రమ్ము । కలువపాన్పున కని గంధర్వుఁడైన
వానితోఁ దన యిచ్చవచ్చిన యటుల । నానావిధక్రీడనముల రంజిల్లెఁ
బలివచ్చునందాఁక పతిరీతి ఖచర । పతిఁదాను సమరతిప్రౌఢిమఁ దేల్చు
పతి యిల్లుచేరినఁ బంజరకీరి । గతిఁ గల్కిపల్కుల గంధర్వుఁ డలరుఁ
గతిపయాబ్దములిట్లు గడపె గంధర్వ । సుతుఁ డామనోరమాసుదతిని గూడి
తత్కాలమున సభాస్థలిలో వరాంగుఁ । డుత్కంఠ నొక్కనాఁ డోలగంబున్న
బలుచేప నొకటి శంబడివాండ్రు దెచ్చి । కెలఁకున నుంచి మ్రొక్కిన వారిఁజూచి
మగమీనొ? యిదియాడుమత్స్యమో? తెలిసి । మగమీనమైనమామందిరంబునకుఁ
గొనిపోకుఁ డనినఁ బక్కనఁ జేప నవ్వె । విని సభాసదులెల్ల విస్మయపడిరి
చచ్చినచేప యీసభ నేలనవ్వె? । నిచ్చిత్ర మూహించి యెఱిఁగింప రయ్య
యని దొర మంత్రులనడిగిన వారు । జననాథ! యిది తెల్ప శక్యమే యిపుడు
ఆలోచనము చేసి యందఱమొక్క । వేళ మీతో వచ్చి విన్నపించెదము
గడు వారునెల లియ్యఁగావలె ననిన । నొడఁబడ కొకరీతి నొప్పె భూవిభుఁడు
ఆ మంత్రు లైదుగుర గ్రప్రధానుఁ । డౌ మహాబుద్ధి గృహంబున కరిగి
యోజనసేయుచు నున్న నాతని త । నూజుఁడౌ కార్యవంతుఁ డిదేమి మీరు
చింతచేసెదరన్నఁ జెప్పి రాకార్యమంతయు గడువుతో నమ్మంత్రివరులు
కాలోచితజ్ఞుఁ డాఘనుఁ డదివిని యి । దేల యొప్పితిరి? నూఱేఁడులకైనఁ
జేప నవ్వినవ్వు చెప్ప శక్యంబె? । యీపని తెలియుట కేడాదిదాఁక
బట్టు భూపతికి నప్పని తెల్పుఁడనుచు । నట్టె వారునుదారు నవనీశుఁ జేరి
యేడాది గడువియ్య కిప్పని తెల్పఁ । గూడదటంచుఁ బల్కుటయు నారాజు
నొకగతి నొప్పిన నున్న యమాత్య । నికరంబు నిల్పి తండ్రి యనుజ్ఞ వడసి
యసమానమతులౌసహాయులఁగూడి । వసుధఁద్రిమ్మరఁగార్యవంతుఁడుచనియెఁ
జని ప్లేచ్ఛ బర్బర శక పుళిందాది । జనపదంబులు దాఁటి సౌగంధికాఖ్య
పురవర మమ్మార్గమున నొండుగాంచి । పరిసరోర్వి రసాల పాటలీ వకుళ
కురవక మరువక కోవిదారాది । తరువుల మొనయు నుద్యానంబుఁ జొచ్చి
యా వనవీథి వయస్యులఁ గూడి । పూవులుచిదిమెడి పువ్వారుబోణి
కలకలనగు నెమ్మొగము గలదానిఁ । గులుకు గుబ్బలదానిఁ గోకిలానీక

కాకలీకలనచేఁ గడు నొప్పుదాని । రాకన్నె నొకతె సారసరేఖ యనెడి
దానిఁ గనుంగొని తద్వయోరూప । మానిత సౌభాగ్యమహిమ మెచ్చుచును
ననుచరసహితుఁడై యాత్రాశ్రమంబు । చన నొక వటతరుచ్ఛాయ వసించె
నాలోన నేడాకులనఁటుల లోన । నాళీసమేతయై యక్కన్య మెలఁగ
బాలనాగము మెట్టఁబడి మెట్టదమ్మిఁ । బోలు దానిపదంబు భోరునఁ గఱచె
కఱచినంత విషాగ్నిక్రమ్మిన దేహ । మెఱుఁగక మూర్ఛిల్లె నిగురాకుబోణి
యది చూచి జనులు హాహాకార మెసఁగఁ । గదిసి బిట్టడలఁగాఁ గార్యవంతుండు
నచ్చోటి కరిగి మహామంత్రశక్తి । నచ్చెల్వఁ బ్రతికించె నర్ధక్షణమున
బ్రతికి దిగ్గనలేచి బాల యమ్మంత్రి।నుతుని చక్కఁదనంబు చూచి మోహించె
నక్కన్య బ్రతికిన దయ్య యెఱింగి । గ్రక్కున బిలిపించి కార్యవంతునకుఁ
బరిణయం బొనరించెఁ బరమోత్సవమునఁ।దరుణితోఁగూడి యతండు సుఖించె
నంతట నొక్కనాఁ డనఘుఁ డక్కార్య।వంతుఁ డప్పుర బాహ్య వనవీథి మెలఁగ
నొక వన్యగజము మహోద్ధతిఁ దరుమఁ । జకితాత్ముఁడై భీతిఁ జారుపణ్యుఁడను
నూరవ్యుఁడొకఁడుకు యో్య మొఱోయనుచుఁ । బాఱు తేఱఁగనడ్డపడివనేభంబుఁ
గరము కరాసి నొక్కటఁ జక్కఁచేసి । పొరిగొని వైశ్యునిఁ బ్రోచె నవ్వేళఁ
బ్రాణదాతకు నీకుఁ బ్రత్యుపకార । మేను సేయంగల దేమున్న దనుచుఁ
జారుపణ్యుఁ డమాత్యజన శిఖామణికిఁ । జారుగాత్రీనామ సత్పుత్రి నొసఁగె
నవనీశపుత్రియు నచ్చారుగాత్రి । సవినయస్థితిఁ బరిచర్యలు సేయఁ
బదినెల లయ్యూరఁ బాయక నిలిచి । తుద మత్స్యహాసన హేతువు గాన లేక
పరితపించుచు వణిగ్బాలతోఁ దెలుప।నెఱుగనయ్యెడిఁ త్రోవ యిందేల మసలఁ
బయనమైరండుమీపట్టణంబునకు । దయఁబ్రోచుమిమ్మఁగాత్యాయనియనుచు
నద్దేవి నోము లెనై్నను నోమి । తద్దయు భక్తిచేఁ దగిలెను గనుక
పతిఁ బ్రబోధించి భూపతిచే ననుజ్ఞ । నతఁడుగాంచి రథేభ హయ భటావళులఁ
గూడి రాసుతను దోకొని యేగుదేఱఁ । బైఁడిపల్లకి యెక్కి పద్మాయతాక్షి
యాడంబర మెసంగ నరుదెంచె నతఁడు।నాఁడె ప్రొల్వాడలి తిన్నని పయనములఁ
జని త్రోవ నొకచోట శాంభవినగరుఁ । గని తత్సమీప సంగత వనస్థలిని
సేనల విడియించి చెలువలతోడ । నానిశి కాళీగృహంబున నుండె

నృపకన్యయు నతండు నిద్దురవోవ । నపుడు లేచియ యుండె నవై శ్యకన్య
కాళికాంబ యదంభకరుణావలంబ । పాలితార్యకుంటుంబ భవశైలశంబ
నామగం డొకమీను నవ్విన హేతు । వేమియుఁ దెలియలే కెదఁ గలంగెడిని
ఆహేతు వెఱఁగించి యడలార్పవమ్మ।త్రాహి పాహి యటంచు దాస్యంబొనర్తు
నని వేడుకొనుచుండె నంతకుమున్నె । తనవెంట భూతబేతాళ పిశాచ
శాకినీ ఢాకినీచయములు గొలువ । నాకాళికాంబ సయ్యన బయల్దేరి
స్వారిగాఁజని వేగుజామున మఱలి । దారుణార్భటుల భూతములు గీర్తింప
నరుదెంచి కోవెల నవై శ్యకన్య । వరునితో నునికి భావమున నెఱింగి
నాభక్తురాలుగాన భయంబు లేక । యీభవనంబులో నిరవొంది నన్ను
నల చేప నవ్వినయట్టి కారణము । దెలుపవే! యనుచుఁ బ్రార్థింపఁగాఁ దొడఁగె
దీని కవ్విధమెల్లఁ దెలిపెద ననుచు । మానసంబున నెంచి మందిరద్వార
ఘటిత కవాటంబు కరములఁ జఱచి।యిట నెవ్వరని యాగ్రహించు భూతముల
వారించి యచ్చెరువనె తగు కొలని । తీరంబునందు వర్తించి నెయ్యంపు
సకియ నొక్కతెఁగాంచి శాంభవీదేవి । ప్రకట వచోవిజృంభణ మొప్పఁ బలికె
మాతృకామణి వినుమా! వంగరాజ్య । నేతయైన వరాంగనృపతి కేపటికిఁ
దన మంత్రివరుల నందఱి నాజ్ఞ సేయు । ననిన మాతృకపల్కె నంబ! యిదేమి
పనికి మంత్రులఁ జంపఁబనుచు భూవిభుఁడు । వినిపింపవలెనన్న విశ్వైకజనని
యాకాళి వైశ్యకన్యక వినవలసి । యాకర్ణనము సేయుమని బోటి కనియెఁ
దొలుత మత్స్యనృపాలు దుహితఁ బెండ్లాడి।చలచిత్తయైన యాసతి నుజ్జగించి
చుట్టంపుసతి గన్న సుందరి నొకతెఁ । బుట్టినప్పుడె గొని పోషింపఁ బనిచి
యానాతి నిండుపాయము సెంద నతఁడు । దాని వరించి సౌధంబుపై నుంచి
బోలుతల్పులు బీగములు బిగియించి । యోలగంబున దినంబుండు నట్లున్న
యా లేమ యొంటి నాహార్మ్య మంచుండు । నాలోన నొక్కనాఁ డాకాశవీథిఁ
జను నొకఖచరుఁ డాజవ్వని రూపు । గని విమోహాంధుఁడై కదిసి నేరుపున
మేకొల్పి దాని రమించి మాయాశు । కాకృతిఁ బిమ్మట నధిపు ననుజ్ఞఁ
బక్కబాయకఁ జేయుఁ బవలు వర్తించె।నక్కతవ మెఱుఁగఁ డారాజవరుఁడు
తా వచ్చినపుడు గంధర్వుఁడె చిలుక । యై వసించుట సాధ్వియని దానినమ్మి

చచ్చిన బలుమీను జాలరుల్ సభకుఁ । దెచ్చిన యచ్చేపఁ దిలకించి యతఁడు
మగమీనొయిదియాడుమత్స్యమో తెలిసి।మగమీన మైనమామందిరంబునకుఁ
గొనిపోవ వలదన్నఁ గొలువువారెల్ల । వినఁగఁ జచ్చినచేప వికవిక నవ్వో
తన విమూఢతకిట్లు దైవంబు నగిన । మనుజేశుఁ డెఱుఁగక మంత్రులఁ జూచి
చెప యేటికినవ్వోఁ జెప్పుఁడటన్న । నాపని దెలియలే కమ్మంత్రివరులు
నేడాదిలోపల నెఱిఁగింతు మనుచు । వేడిన గడువులో వినిపింప రేని
నందఱఁ బొరిగొందునని బెట్టిదముగ । మందలించిన వారు మంచిదటంచు
సమ్మతించిరి నవ్వుజాడ యెఱుంగ । కుమ్మలించెద రిప్పుడుడివో యె గడువు
ఏడాది తప్పిన హింసింతునన్న । వాఁడు గావున రాజు వారి నందఱను
బట్టి బందిగమునఁ బడవైచినాఁడు । గట్టిగా రేపొకకార్యంబు నడచు
నీమర్మ మెవ్వరి కెఱుఁగనౌ ననిన । నామాతృకామణి యాశ్చర్య మంది
చాఱు పణ్య కుమారి శాంభవీసూక్తి । నారహస్యము విని యద్దేవిఁ బొగడి
కొలని కావలఁ గాళికొలువున్న యజ్ఞ । దెలిసి భర్తను సవతిని లేపికొనుచు
గుడివెనక్కఁ దగుసేన గొలువ వేకువనె । పడమటితెరువునఁ బతివ్రతలు చేరె
గడువులోఁజనుదెంచెఁగార్యవంతుఁడని । పుడమిఁజేనికిహితుల్ పోయి తెల్పుటయు
నావరాంగకుఁడు మహామాత్య వరుల । తో వచ్చి కార్యవంతుని నాదరించి
యారసి వచ్చితివఁట చేపనగిన । కారణంబనిన నకార్యవంతుండు
కాళి తెల్పఁగఁ జారుగాత్రి యాహేతు । వాలించినానని యటఁద్రోవ ననఁగ
విన్నవాఁడగుట నవ్వివిమలాంగి నిలిచి । యున్న యత్తెఱఁచెంత నుర్వీశు నునిచి
యాచంద మెఱిఁగింపుఁడనిన ఖేచరుఁడు । రాచిల్కయైన తెఱంగు రేవగలు
పక్కఁబాయక యున్న బాళియుఁ దెలిపె।నక్కల్కి, యదివిని యతఁడు కోపంబు
తాపంబు వెఱఁగును దనమదిఁ బొదల । నాపడఁతికి భూషణాదు లొసంగి
కార్యవంతునిఁగూడి గంధర్వసుతు న।వార్యశౌర్యంబున వధియింతు ననుచుఁ
దలుపులు తెఱచుక తావచ్చు రాక । తెలిసి గంధర్వుఁ డత్తెఱవనెత్తికొని
ఘనవినూనం బెక్కఁ గగనమార్గమునఁ । జనియె వరాంగుండు సంతాపమందె
నతని తాపముదీర్తునని కార్యవంతుఁ । డతుల మంత్రనిరూఢి నమరవల్లభునిఁ
గూర్చి జపంబు నాల్గుదినంబు లూని । యర్చింప వజ్రి ప్రత్యక్షమై నిలచి

యావరాంగునిఁ బిల్చి యలుగకు మాత్మ । భూవర! గంధర్వపుత్రుని మీఁదఁ
గారణం బటులుండెఁగద త్రోవవశమె! । యారామకంచె మహారూపరేఖ
గల సులోచనయను గంధర్వకన్య । నెలమి నిచ్చెదనిది యెంతేని సాధ్వి
దీని వరించి సుస్థిరధైర్యశౌర్య । మాననీయుల సత్కుమారులఁ బడసి
ధర యేలుమనుచు గంధర్వకుమారిఁ । బరిణయం బొనరించి బలభేది చనియె
చారుగాత్రీశాంత సౌశీల్యమహిమ । పౌరులు ధీరులు ప్రణుతించి రపుడు
పతిని వంచించిన పాపంబువలన । నతివ మనోరమ యాతనఁ బడియె
జారునితోడ మత్స్యనృపాలపుత్రి । తీఱినకథయు సాధ్విరో! వింటిగాదె!
పతిభక్తిగల చారుపణ్యకుమారి । కత డాని సౌశీల్యగరిమయు వేడ్క
వినినవారికిఁ గల్గు వివిధసౌఖ్యంబు । లనినఁ జిల్కను గొనియాడి పూబోణి
యాపుష్పమంజరి యరిగె లోపలికి । భూపాలదూతియుఁ బోయె నింటికిని
అని గిరీశుఁడు దెల్ప నమ్మహాదేవి । యనఘ! యవ్వలికథ యానతిమ్మనియె
సనయ పతివ్రతాచరితంబునందు । ననఘుమా ముప్పదియవ కథ వెలసె

కిరాత సతి కథ

శ్రీ విశ్వపతి దయాంచితమతి గౌరి । కావలికథ యిట్టు లానతి యిచ్చె
చిలుక మర్కాఁడు వచ్చిన వైశ్యసతిని । దిలకించి పలికె దూతికయును వినఁగ
అక్క! పతివ్రత లగువారి కథలు । పెక్కుపాపంబులఁ జెడఁ బాప నోపు
పతిదేవతామణుల్ పరద్వైవతములు । క్షితి వారివలన రక్షితయై తనర్చు
నేకులంబున నుదయించిన ఘనత । యే కాక సాధ్వికి హీనత లేదు
వినుమింక నొకకథ వినిపింతు నీకుఁ । గనకాంగి! మున్ను కేకయదేశమునను
జంద్రప్రభా పురస్వామియై వెలయు । చంద్రసేనుండను జనపాలమౌళి
యతనికి శుభమతియను సతి కలదు । సతిఁబోలు గుణవతి సౌజన్యవసతి
భార్యతో నీశ్వరోపాస్తి యొనర్చి । యార్యవర్ణితుఁ డతం డచిరకాలమునఁ
బడసె సుచంద్రుఁడన్ పట్టి నొక్కఁడని।జడతయు శతతఁ గాంచని పుణ్యధనుని

సకలకళాభ్యాస చతురుఁడై యాతఁడొకట నొచ్చెము లేక యొప్పుచుండియును
సూక్ష్మధర్మంబేమొ శోధింపవలయు । లక్ష్మీశ గౌరీశులకుఁ దక్కనట్టి
వర సూక్ష్మధర్మ మెవ్వారికిఁ దెలియు । ధరణిలోఁ దిరిగి యేతద్విశేషంబు
తెలిసి వచ్చెదనని దృఢబుద్ధిఁ దలఁచి।తలిదండ్రులకు నొక్కతఱిఁ దెల్పుటయును
జనకుఁ డానుడి విని చాలఁ జింతించి । యనియెఁ గుమారుతో నన్నిధర్మములు
గడు శ్రేష్ఠతరములుగా నెంచు శ్రుతులు।పుడమిఁద్రిమ్మర నేల?బుధు లిందు లేరె?
వారి నొక్కటఁగూర్చి వారిచే నీకు । దారున దెలిపింతు ధర్మసూక్ష్మంబు
పరిణయం బొనరించు పనిఁబూని మేము । పరికింపుచున్నాము పడుచుల ననిన
గురునిమాటకుఁ బ్రతికూలంబు లాడ । దొరకొన కాతఁ డాందోళింపు చుండి
యొకనాఁడు వేటాడు నుత్సాహ మూని । యొకఁడును జనిచని యొక వనవీథిఁ
బసినొక్కని శమదమశాలిఁ జూచి । కృప ధర్మసూక్ష్మ మెఱింగింపుఁ డనిన
నా మోగి యను నుత్తరాభిముఖుండ । వై యేఁగు మందొక్క యడవిలో నీకుఁ
బటు సూక్ష్మధర్మ మేర్పడఁ గానిపించ । నిటునటుఁ దిరుగాడ నేమిటి కనిక
స్వామి! హసాదని చాఁగిలి మ్రొక్కి । యాముని వీడ్కొని యతఁ డాశ్రమమున
ధనువు భుజంబునఁ దగిలించి వీపు । నను దూణయుగ మూని నాణెంపు పసిఁడి
పరుజుచేఁ దళకించు బలుపట్టెసంబు । చిఱుతకట్టెయుఁ బూని చికిలిధట్టియును
బలుచల్లడంబును బాగొప్పఁ దాల్చి । తల బొమిడికపు క్రొందళుకులు గులుక
నుత్తరాయణమున నొదవు భానువలె । నుత్తరాపథ మందె నుర్వీశసుతుఁడు
నదములు నదులును నానాసరములు । పొదలును పల్లెలు పుట్టలు గిరులు
చెరువులు దొరువులు శృంగారవనులు । తెరువునఁ జూచుచు దిగ్భ్రాంతిలేక
వాణాసీ పథవర్తియై చనుచు । నా రాజసుతరత్న మట నొక్కనాఁడు
ప్రొద్దున లేచి గొబ్బున పోయిపోయి । యద్దెస విభ్రాంతుఁడై త్రోవఁదప్పి
బలుకానలోఁబడి బాటయుఁ గాన । కలమటఁ గండ్లుముండ్లరు దైన పొదలు
గట్టులు పుట్టలు గడిచి సందీని । చెట్టులగుట్టలఁ జీకాకుపడుచు
బడలికతోఁ దిగ్మభానుండు మింటి । నడిమికి వచ్చునందాఁక చరించి
యెడయాని పొడలు చెట్లింతలింతలుగ । బెడిదంపు టడిదంపు పెక్కువ నటికి
త్రోవ గల్పించుక దురుసుగాఁ బోయి । యావల నొక్కబయ ల్గానుపింప

నిచ్చోట నీళ్లు లేవేమొ యటంచు । హెచ్చిన డప్పి నోరెండి నల్లడల
నరయుచు: జనిచని యగ్రభాగమున । యరుణ వర్ణంబైన యచలంబుఁ జూచి
యప్పర్వతముప్రక్క హరువొండు చలువ । చప్పరంబును జూడ సౌకర్యమైన
యిల్లును సున్నంపు సొజమంటి పట్టె । లుల్లసిల్లఁగ నిదియొక విప్రగృహమొ?
చలివెందరయొ? చేరి శ్రాంతిఁ బాపికొని । యలరుచు రేపటి కరిగెద నవల
నని యాగృహము చేర నరుగుచున్నఁ।గనకాంగి యొక్కతె గజరాజయాన
పసపు కాటుక బొట్టు పచ్చని అవిక।కుసుమగర్భితపుఁ గీలొక్కప్పు మెప్పొసఁగఁ
జిన్నారికౌనుతో చేరలంతేసి । కన్నులతో సోయగపు మోముతోడ
సరిగంచు చీరయు సందిదండలును । గరకంకణంబులు కడియములు మెజయ
నుదకముల్ గొనితేర నొకకుండ చంకఁ।గుదురుగా నొకకుండ కుతికలఁ బూని
చదుదేర నెదురుగాఁజని రాజసుతుఁడు । వినయంబు గావించె విప్రకాంత యని
యక్కాంతయును వాని యాకార రేఖ । తక్కక గని తనతమ్ముని లీల
నున్నాఁడ వెక్కడనుండి వచ్చితివి? । యన్న! నీ పేరేమి? యయ్య యెవ్వాఁడు?
బడలినట్లున్నది బాట దప్పించి । చెరుతెరువున నెట్లుచేరితి విందుఁ
బసిబిడ్డఁడవు మన్నప్రజలను బాసి । దెసచెడి యడవులఁ దిరుగ నేమిటికిఁ?
బుట్టుభోగివి నిన్నుఁ బొడగన్న నెట్టి । కట్టిఁడికై.నను గరుణ రాకున్నె!
యెందెన నొకచోటి కేగ కిట్లలసి । యిందేల చనుదెంచి తిది పాపభూమి
యనిన రాకొమరుఁ డిట్లనియెఁ గేల్మొగిచి।కనకాంగి!మాయమ్మకరణి నున్నావు
భూసురకన్యవో! భూపకన్యకవొ! । నీసుశీలత్వంబు నీరేఖఁ గన్న
వెఱఁగయ్యె నిచ్చోటి విషయ మిందేల ।యరుదెంచితని పల్కఁతా విధంబేమి?
చంద్రసేనుండను జనపాలసుతుఁడఁ । జంద్రాస్య! నేను సుచంద్రుఁ డన్వాఁడఁ
దల్లిదండ్రులఁ బాసి ధర వారణాసి । యెల్ల రెంచఁగఁ జూచునిచ్చ వచ్చితిని
ఉదకాయలమున నేఁడొకయూరు వెడలి । పదరి కాఱడవిలోఁబడి త్రోవఁ దప్పి
కరపదములఁ గంటకములు గాడఁగను । ఖరకిరణుని యెండకాఁకల గ్రాఁగి
మొయిల్లుఁ జూచితి మెలఁత! నీనామ।ధేయ మేమందు? రెద్దియు మొకులంబు?
ప్రాణేశుఁ డెవ్వఁ డేర్పడఁ దెల్పుమనిన । నానీలవేణి యిట్లనియె నాయనకుఁ
గలఁ డీయడవి సర్వభూతుకుం డనఁగ । వెలయు కిరాతుండు విక్రమోన్నతుఁడు

అతని గేహంబిది యనఘ! నేనతని । సతిని జాబిలియను శబరాబ్జముఖిని
నిందొంటి నీవురా నీక్షించి జాలి । చెందితి నేలన్న చెప్పెద వినుము
జనులెవ్వరైన నీజాడఁ బట్టుకొని । చనుదేరఁ గనెనేని సర్వభూతుకుఁడు
పడఁగ్రుమ్మి పైనున్న బట్ట సైతముగ । వడి దోఁచుకొను పాపవర్తనం బనఁడు
అతని దుష్క్రియ లెన్నియని యుగ్గడింతుఁ।బతినింద సేయుట పడఁతికిఁ దగదు
నిన్నిందుఁ జూచిన నేఁడేమి సేయ।నున్నాఁడొ యొకగొంది నొదిగి యుండుమని
కరుణతో గద్గదకంఠియై పలుకు । తరళాక్షిఁ గని రాజతనయుఁ డిట్లనియె
అక్క! యిందులకు నేనళుక దాహమున । స్రుక్కితి నుదక మిచ్చోటఁ గల్గినను
జూపితేనియు మహాసుకృతమా దేహ । తాపంబు దీఱిన తరువాత నవలి
పని జూచికొనియెదఁ బదరకు మనిన । వనిత భాగ్యంబాయె స్వాదూదకములు
నీకుఁ జూపెద రమ్ము నృపపుత్ర! యనుచు । నాకడ నెఱ్ఱని యచలంబు చెంతఁ
బ్రవహించు విమలనిర్ఝరవారిఁ జూపి । సవిధామలక తరుచ్ఛాయలఁ గొంత
వడి విశ్రమింపుము వనినుండి విభుఁడు।తడయ కింటికివచ్చు తఱి యయ్యె నిలువఁ
జనదని కుండల జలములు ముంచి । కొని యుసిరికపండ్లు గోసి రాసుతుని
చేతి కొసంగుచుఁ జెచ్చెరఁ జనియె । నాతఱి రాసుతుం డామలకములు
భక్షించి యమృతంబువలె నున్న నీర । మక్షీణకాంక్షి దాహముడీఱఁ ద్రావి
యాదరి తోఁపులో నటు శయనించి । సేదదేరఁగ నిద్రచెందె నంతటను
అక్కడ శబరేంద్రుఁ డడవి వేఁటాడి । పెక్కుమృగంబుల పీచం బడంచి
కావడితో మాసంఖండముల్ గొనుచు । వేవేగఁ దన గూఁటీఁపు చలింప
మిడిగ్రుడ్లుకెంజాయమీసముల్ దోనె।కడుపుజేగురుబల్ మొగముబొక్కిలొమ్మ్రి
మసిరాసి నగు మోము మైలచల్లడము।పసరంబుతోల్ కాసె బలుమోటుకత్తి
కఱకు జుంజురు వెండ్రుకలు రెండుకాళ్లుఁ । బొరసిన కారెనుబోతు చందంబు
గలిగి యింటికివచ్చు కాంతునిఁ జూచి । యెలనాగ సద్భక్తి నెదురుగాఁ బోయి
కావడి వడిడించి కలశోదకముల । చే వానికాళ్లు మచ్చికఁ హెచ్చుఁ గడిగి
పయ్యదఁ దడియొత్తి పాణి గ్రహించి । చయ్యనఁ దోకొనిచని చప్పరంబు
నడిచక్కి తిన్నె నందంబొ తివాసి । కడ మించుతలగడల్ గలచోట నుంచి
సురటిచే విసరుచు సొలపువాల్చూపు । మరుతూపు నిరసింప మరులు పుట్టించి

బలుతావి కపురంపుబాగా లొసంగి । తెలి యాకుమడుపులు తిన్నగాఁ గొన్ని
మడిచి యొసంగుచు మమత గాన్పింపఁ । బొడఁగని వాఁడును బోఁటి! నీవేమొ
మనవి దెల్పఁగవచ్చు మార్గంబు దోఁచె । వినిపింపు నీవేమి వేఁడిన నిత్తు
కల్లగా దీమాట కాక్షేనియాన । చెల్లుగా నీకోర్కె- చెప్పవే! యనిన
నాయింతి వానికి హస్తములు మొగిచి।నాయఁడా! నేఁడొక్క నరనాథసుతుఁడు
నా తమ్ముఁగుట్టి చందమున నున్నాఁడు । భీతిల్లి త్రోవదప్పి కడింది డప్పి
గూరి యిందేతెంచెఁ గూరిమి నతని । కేఁయసూపితి నీరమిదిగొ గ్రోలుమని
యసుహసుర్వై డసెన్ నాఁకటిచేత । నుసిరిక తోఁపులో నున్నవాఁ డిపుడు
అతని యాఁకలిదీర్చి యన్నం బొసంగు । మతినుకృతఫలంబు లబ్బు ప్రాణేశ!
యేమందువో విని యీమాట కనుచు । నామదిలోన నిందాఁక కొంకితిని
అనినఁ బుళిందుఁ డత్యానంద మంది । వనిత! నీతమ్మునివలె నున్నయపుడె
యతఁడు భావమఱింది యయ్యె నింకేల।మతి శంక తోడి తెమ్మా! వేగ నిటకు
వడిచెడి యింటికి వచ్చినవాని । యెడఁ గీడుదలఁచు ద్రోహి ధరిత్రిఁ గలఁడె!
యనుమానపడక పొమ్మని త్వరసేయ । ననబోణి వానిచే నమ్మిక వడసి
యారాజసుతుఁడున్న యారామసీమ । చేరి లేవన్న! రాజితగుణోత్పన్న!
నినుఁ దోడితెమ్మనె నీభావ వచ్చి । చనుడెమ్మ్ నావెంటఁ జయ్యన ననిన
అక్క! మహాభాగ్యమాయె నటంచు । గ్రక్కున లేచి యాక్ష్మావరసుతుఁడు
తన యంపదొన లాయుధము విల్లు గదయుఁ।గొని యామెవెంబడి కొంచ కేతేర
నెదురువచ్చి కిరాతుఁ డెంతేని మమత । నెదఁజేర్చి కైదండయిచ్చి తోడుకొని
పోయి యాజముఖాణమున నుంచి వినుతి । సేయుచు నేనొనర్చిన సుకృతమున
నాయింటి కరుదెంచినాడవు పండు । గాయె నేఁడేను గృతార్థుండ నైతి
నోరాజసుత! వట్టి యుపచారములను । దీయునే యాఁకలి దీమసంబునను
లెమ్ము వండుకొనంగ లీలామనోజ! । కొమ్మ పదార్థముల్ గొనితెచ్చు నటకు
నని కాంతఁజూచి తొయ్యలి! సన్నబియ్య।మును కందిపప్పును బాలును బెరుగు
తగు కూరగాయలు తప్పెల లర్వా । మగు పదార్థంబులు నన్నియుఁ గొనుచు
నత్తోటలోపలి కరిగి వండికొన । నిత్తరి పొయిలు నీవేర్పాటు చేసి
యింగలంబును రాజనిడి వంటయైన । సంగత సురభిళ సద్యోఘృతంబు

భోజనఁ గొనిపొమ్ము భూపాలతనయుఁ । డారగింపకయ నే నశనంబు గొనను
అనిన నత్తెఱఁగున నతివ యమర్చె । ననువుగా నతఁడు స్వయంపాకి యగుచుఁ
బదునైదు కూరలు పప్పుపాయసము।మొదలుగా బహుభక్ష్యములతో నొనర్చి
యప్పుడు గాఁచిన యావులనెయ్యి । తెప్పలుగా నామెతెచ్చి యియ్యఁగను
మెచ్చుచు భుజియించె మీఁగడ పెరుగు।హెచ్చిన తనశ్రాంతి యెల్లఁ బాపగను
నతఁడు భోజనము సేయఁదొడంగె ననుచు । సతి తెల్ప మతిపోయి జలకంబులాడి
చలువలు ధరియించి జాయ వడ్డింపఁ।గలమాన్న ఘృతమాంస కలితంబు గాఁగ
భుజియించె నంతలో భూపాలసుతుఁడు।భుజియింపఁ దచ్ఛేషములు గొంచు వచ్చి
శబరకామినియు భోజన మాచరించె । శబరుండు సరసభోజన తుష్టుఁడగుచుఁ
దను జేరవచ్చిన ధరణీశసుతునిఁ । గనుగొని మణిపీఠిక వసింపఁ జేసి
ఘనసార కాశ్మీర గంధసారములు । తనువున నలఁది పూదండలు పెక్కు-
సిగయందుఁ జుట్టి మంచిదుమాలు చుట్టి । వగవగ సొమ్ములు వస్త్రంబు లొసఁగి
కర్పూర వాసనా కలిత తాంబూల । మర్పించి యభ్యంతరాగార సీమఁ
గనుపట్టు మణిహోలికను శయనింపఁ । బనిచి వీవనఫూని భామిని విసర
నుయ్యల చెంగట నుండి యూఁచంగ । నయ్యెడ నిదురించె నారాజసుతుఁడు
అతిథికి నిటువలె నాతిథ్య మొసఁగి । కృతకృత్యుఁడై బోయ యింతయుఁ దాను
స్థిరబుద్ధి నద్దినశేషంబు గడపె । మఱి భానుఁ డస్తమింపఁగ నిద్రలేచి
యారాజసుతుఁడు సంధ్యావిధుల్ దీర్చి । వారి చెంగటఁ దాను వసియించి కొన్ని
కతలు దెల్పుచు రేయి గడపఁగా నంత।శతమఖుదిశఁ దోఁచె జలజబాంధవుఁడు
చలువలు వెదఁజల్లసాగె తెమ్మెరలు।బలియురుంకృతులతోఁబరగె తుమ్మెదలు
కలువల జిగిదీఱె కమలముల్ మీఱె । తెలివి జక్కవగూరె తిమిరంబు జాఱె
నంతకమున్నె ప్రయాణసన్నాహ । వంతుఁడై లేచి భూవరకుమారుండు
అక్కకుఁ దెలిపి బావా! నన్నుఁబనుపు । మెక్కడ పరుసపోయెడు కాశితెరువు
నావిని శబరుఁడన్నా! నేఁడు నిలిచి । పోవరాదే యన్నఁ బోవలె నిచటఁ
దడవు సేయఁగరాదు దయయుంచు మనుచుఁ।గడు త్వరఁజేసినఁ గానిమ్మటంచు
నతఁడు మార్గము చూప నరుదెంచె వెంట।సితఖడ్గ మొకటైనఁ జేతఁ బట్టకయె
బోయముందర నిట్లుపోవఁగా వెంటఁ । బోయె రాసుతుఁడును భూరివేగమునఁ

బరువునేల క్రమించి బడలి కిరాత । వరుఁడు నీరిడె క్రావి వచ్చెద ననుచు
నాచెంతఁ గొలనికి నరిగె శీఘ్రమున । రాచకొమాహ మార్గంబున నిలిపి
కొలనిలో నీరుత్రాఁగుచునున్నఁ గోలు । పులి ఘుటఘుట రవంబున వచ్చి వాని
గళ మట్టె విఱిచి రక్తముద్రావి చనియే । నలవియే తప్పింప హా! దైవఘటన
గడియసే పల్లమార్గంబున రాచ । కొడుకుండ నిదియేమొకో తామసించె
బావ యటంచు గొబ్బున గుంటకేగి । యావల శార్దూలహతుఁడైన వానిఁ
గని గుండెదిగ్గనఁ గన్నీరు దొరుగఁ । బనవుచు నిటువంటి బలవంతునకును
వచ్చెనే యాక్రీఁడు వ్యాఘ్రుంబు చేత । నిచ్చంద మామెతో నెటు లుగ్గడింతు
నాకొఱ కరుదెంచి ననుబెట నుంచి । యాకొలనికి వచ్చి యిటులైతి వకట!
నేనేల వచ్చితి నీవున్న చోటి । కీనెగు లెటులోర్తు నేమిసేతునని
వగచుచుఁ బరువునవచ్చి యవ్వార్త । దగ దొట్టికొనఁగ నత్తరుణితోఁ దెలిపి
కన్నీరు మున్నీరుగా నేలవ్రాలి । యున్న రాకొమరుని నొయ్యనఁ జేరి
జాబిలి పలికె విచార మేమిటికి । నాబోయరాజు కృతార్థుఁ డైనాఁడు
నీకతంబున నాతనికి శుభం బొదవె । నీకొండగుహలో ననేకధనంబు
బహురత్నరాసులు బహుభూషణములు।బహుపదార్థములు నాపతి దాఁచినాఁడు
తెరువాటు గొట్టి సాధించిన ధనము । లెఱుఁగుమీ ధనరాసులెల్ల నీవశము
పరుల పాల్గాకుండఁ బాలించి దీని । ధరణీశసుత! బహుధర్మంబులకును
వినియోగములుసేయువిసువకయిపుడె । వనచరోత్తమునితోవహ్నిఁజొచ్చెదను
జనుదెమ్ము నావెంట సహజుండ వీవె । మనమున భేదంబు మానుమటంచు
నతఁడు రానింటి పదార్థమ్ము లెల్ల । సతి గుహాలోనుంచి చట్ట బిగించి
కొన్నికోకలు మణుల్ కొంతధనంబు । సన్నుతగాత్రి సుచంద్రుచే నిచ్చి
యివి కాశిలో వసియించు నైదువల । కవనీసురేంద్రుల కర్పింపు మనుచు
వివరించి యతనితో వేగఁ బ్రాణేశు । శవముచెంగటి కేగి సాధ్వి కన్గోయి
తడిఁబెట్ట కీమహాధర్మంబు చేసి । కడతేఱితివిగదా కాంతుఁడా! నేఁడు
పరహితచర్య స్వప్నంబున నైన । నెఱుఁగని నీకుదయించె సద్బుద్ధి
అంతునఁ దెలిసితి నప్పుడె నేను । భ్రమందిపోవు నితండు మనఁడని మతిని
నాజన్మ మీడేరె నాథ! యటంచు । రాజపుత్రునిఁ జూచి రమణి యిట్లనియె

సొద చేర్పవలయు నిచ్చోట నాడాడ । వెదకి కాష్ఠంబులు వెసఁ గూర్పవన్న
యేనును దోడ్పడియెద నని యడవిఁ । దానును గాష్ఠసంతతు లేర్చి తెచ్చె
నమ్మ! నావలన నీయగచాట్లు నీకుఁ।గ్రమ్మోఁగా యని సొద ఘటియించె నతఁడు
ననలమ్ము దెప్పించి యటఁ బ్రజ్వరిల్ల । నొనరించి సడలించి యొడలి సొమ్మెల్లఁ
గొలనిలో మునిగి గ్రక్కున హొన్నుపట్టు।వలువ ధరించి పావకునకు మ్రొక్కి
చితిఁ జొచ్చి నలుగడ శిఖ ప్రజ్వరిల్లఁ । బతిదేహ మెదఁజేర్చి పడఁతి రాసుతునిఁ
బిలిచి యిట్లనియె నోపృథుధర్మనిరత!।తలఁచినాఁడవు సూక్ష్మధర్మంబుఁ దెలియ
నిందునఁ దెలిసెద వికఁ గాశిఁజేరి । యందుండి యొక్కయేఁ డారాజు తోడఁ
బలుకుము నీకొక్కపట్టి పుట్టునని । పలికినట్టుల రాజభార్య గర్భంబు
ధరియించి మఱి తొమ్మిదవనెల నొక్క । వరసుతుఁ గను పదివాసరములను
బురుడుచ్చునప్పు డబ్బుడుతని నడిగి । మఱువక సూక్ష్మధర్మ మెఱింగికొనుము
అతఁడె తెల్పెడు మదీయస్థితి కాశి । పతిపుత్రి నీకిక భార్య కాఁగలదు
అతఁడు పుత్రులులేమి నడలుచు నుండ । వెతఁదీర్చ నీవందు వేగఁ బొమ్మనుచుఁ
బలికి శిఖజ్వాలఁ బ్రాణముల్ విడిచె । నలరాజసుతుఁడు హాహాకార మెసఁగ
నన్నీటిలోఁ గ్రుంకి యక్కొమ్మ సొమ్ము । లన్నియుఁ గొని కాశికరిగి యచ్చోట
మణికర్ణికావారి మజ్జనం బాడి । మణులు సొమ్ములును గోమలి చెప్పినటుల
ద్విజదంపతుల కిచ్చి వీథి నేతేర । నజకేంద్రసుతుఁ బోలు నతని రూపంబు
కాశిరాజు కుమారి గాంచి మోహించి।యాశ్చౌరిసుతు శరాహతిఁ దాల్మి డించి
యున్న చందము తల్లి యును దండ్రి యెఱిఁగి।యున్న కేంద్రకుమారునపుడె పిల్పించి
బహుమాన మొనరించి బాంధవ్య మెఱిఁగి।మహిత వైభవ!మక్కుమారినిచ్చెదను
పరిణయం బగుమన్నఁ బార్థివుఁ జూచి । ధరణీశ! యేడాదిదాఁక పెండ్లాడ
నింతలో సుతుఁడుదయించు నీకొకఁడు । చింతదీతినఁ బెండ్లి సేయుము మాకుఁ
దేవతామహిమచేఁ దెలిసిన వాఁడ । నీవిధంబిఁక సంశయింపఁగా వలదు
అనవిని కాశిరా జాశ్చర్య మంది । తనవద్ద నాన్నపాత్మజు నుంచికొనియె
నంత రెండవనెల నక్కాశిరాజు । కాంతాశిరోమణి గర్భిణి యయ్యె
నెలలు తొమ్మిదియును నిండిన వెనుక । లలితాంగి యొక శుభలగ్నంబు నందుఁ
గనియెఁ గుమారు నొక్కని శుభాకారు । జనకుండు సంతోషజలరాశిఁ దేల

పురుడుచ్చునప్పు డప్పుత్రుని యొద్ద । నిరవొంది కేకయాధీశ నందనుఁడు
జనులు దాదులు మహోత్సవముల మెలఁగు।చునికి నేకతమూట నోయి కుమార!
మహి నెద్దిసూక్ష్మధర్మము దెల్పువనిన।నహహా!యనుచునవ్వియూ బాలుఁడనియె
నొకపూట నీకన్న మొసఁగిన యట్టి । సుకృతవై భవమున సుజనులు మెచ్చ
సకలదోషమ్ములు క్షణములోఁ బాసి।సుకలుండనై మహాశుభమూ ర్తి నగుచు
నీ కాశిలోపల నీపురం బేలు । భూకాంతునకు నేను పుత్రుండ నైతి
సర్వఘాతుకుఁడను శబరుండఁ గానె । యుర్వీశతనయ! నీవూహింపు మాత్మ
నాఁకొని వచ్చిన యతిథికి నన్న । మేకాగ్రమతి నెవ్వఁడిడు వాఁడె సుమ్ము
పరమపుణ్యుఁడు మహాపాపనిర్ముక్తుఁ।డెఱుఁగు మిందునఁ బోల వేధర్మములును
క్షితిఁ బెకుఁక్రతువులు చేసిననేమి । యతిథిపూజను బోల వాయజ్ఞతతులు
క్షితిఁ దీర్థయాత్రలు చేతుహఁగాక । యతిథిపూజను బోల వాతీర్థతతులు
శ్రుతులేల స్మృతులేల శోధనలేల । నతిథిపూజను బోల వవియెల్లఁ గూడి
యతిథిపూజ మహాత్త్వ మరసితి వింత । క్షితిపాలసుత! పూజసేయుము వారి
నవని జాబిలికిని ననుజుఁడ వగుట । భావవైతిపుడు నిబద్ధిగా నాకు
నాకాంత కాశ్మీరమను దేశమేలు । భూకాంతునకు నింకఁ బుత్రియై పుట్టి
నన్నె పెండ్లాడు నంతయు నిఁకఁబోఁదఁ । గన్నారఁ జూడఁగాఁగలవు నీవనుచుఁ
బలికి యూరకయుండె బాలకుం డింకఁ । బలుక నీతోనని, పద్మాక్షి! వింటె
యాసూక్ష్మధర్మ మాయన విని యలరి । భాసురాంగినిఁ గాశిపతి కుమారికను
ధవళాక్షిఁ బెండ్లాడి తలిదండ్రు లలర । వివిధ వైభవముల వెలసి యావెనుకఁ
దమతండ్రి కేకయధరణీశ్వరుండు । విమలచిత్తుఁడు కాశివిభుఁడును గూడి
తనవెంట రా శోణధరమున కేగి । వనచరు ధనమెల్ల వారికిఁ జూపి
చలివెందరలు సత్రశాలలు దేవ । నిలయముల్ తోఁపులు నిర్జలస్థలులుఁ
జెరువులు దొరువులు క్షితిసురపూజ । లరుదుగా సేయించె నవని నెల్లెడల
శబరకామిని మహాసాధ్వీలలామ । విబుధ వర్ణితధామ విఖ్యాతసీమ
యట్టె కాశ్మీరరాజాత్మజ యగుచుఁ । బుట్టి సుద్యుమ్నాఖ్యఁ బుట్టిన విభుని
కాశీశ్వరాత్మజు ఘనతఁ బెండ్లాడి । యా శచీదేవి యట్లలరుచు నుండె
వింటివే యాసాధ్వి విజ్ఞానమహిమ । కంటివే యొండైనఁ గాంతలయందు

యీ సతీమణికథ యెవ్వరు వినిన । వ్రాసినఁ జదివిన వారికి శుభము
ప్రాపించునని చిల్క-పల్క-న నలరె । నాపుష్పమంజరి యని మహేశ్వరుఁడు
నానతి యిచ్చిన నవ్వలికథలు । ప్రాణేశ! వినిపింపుమని గౌరి యడిగె
సనయ పతివ్రతాచరితంబు నందు । ఘనత ముప్పదియొక కథ సంగమయ్యె

ద్రౌపదీదేవి పూర్వజన్మకథ

శ్రీ విశ్వపతి సమంచితమతి గౌరి । కావలికథ యిట్టు లానతి యిచ్చె
మఱునాఁటి సాయంసమయమున దూతి । సరణి రాఁ బుష్పమంజరికనె చిలుక
వనిత! యింకొక పతివ్రతకథ నీకు । వినిపింతు వీనులవిందుగా వినుము
మున్ను మూర్ధల్యుఁడన్ మునివరుం డొకఁడు । సన్నుతవ్రత తపస్యాశాలి కలఁడు
వలిగాలి యొండయు వానయు మంచు । గలవేళలఁ జలించక జపం బొనర్చు
యమ నియమా సనాద్యష్టాంగ యోగ । సమధికనిష్ఠల సతతంబు మెలఁగ
శమ దమాదిక గుణసంపత్తి హత్తి।యమనస్క- నియతి బ్రహ్మధ్యాన మూను
శోకమోహాములను క్షుత్పిపాసలను।గాకుచెందఁడు వృద్ధికార్శ్యంబు లొలయు
తనువుపై మమత యింతయిన వహింపఁ।డనయంబు పూజించు నభ్యాగతులను
ఆమహాత్మునకు నాలాయనీ నామ । భామాశిరోమణి భాగ్యమై వెలయు
నాభామ యుమ నంబుజాలయన్ బోలు । నాభామ కింద్రసేనాఖ్యయుఁ గలదు
ఆయింతి పతిభక్తి కామె ప్రియోక్తి । కాయమ యనురక్తి కామాని యలరి
గృహమేధియై ప్రవర్తించె బెక్కేండ్లు । విహిత సత్కర్ములు విడువక నియతి
ననుకూలవతియైన యతివ కావలయు । పను లొనరింప నేపట్ల నేక్రియలు
గావింపవలయుఁ దత్కర్ములు చేసి యా । విమలవిచారుఁ డతిశయం బందె
నంతఁ బ్రారబ్ధ కర్మాప్తి నమ్మునికిఁ । గొంతకాలమునకుఁ గుష్ఠురోగంబు
ప్రాపింప మేనెల్లఁ బగిలె నసహ్య । మై పూతిగంధ మంతంతకు మించె
చీము నెత్తురు వడిసెను వ్రేళ్లుదునిసె । పామ జనించె బైపై గోకవలసె

కరచరణంబులఁ గ్రమ్మోఁ బగుళ్లు । ముడికి గాఁకొడంగె ముదిరెఁ జర్మంబు
కడువివర్ణంబయ్యెఁగార్శ్యంబుమొనసె।వడియడంగెమొగంబువాచెఁగూర్చున్న
యెడ లేవలేఁడయ్యె నెందుండె నందె । విడువసాగె మఱేమి విష్టాజలములు
నావికారము లెన్నియని యుగ్గడింతు । జీవచ్ఛవము రీతిఁ జేరరా కుండె
దఱచైన ముదిమిచేఁ దలయెల్ల నరసెఁ।బొరసె నుంగోపంబు పొదలె నిద్రయత
యట్టి వెతల్ చూచి యల్లపుఁబ్రొద్దు । యిట్లుండెగా నాయదృష్టం బటంచు
నప్పతిఁజేరి కోయక లేవనెత్తి । యెప్పుగా వేన్నీట నొడలెల్లఁ గడిగి
మందులు నూతి వేమఱు మైనలంది । గంధంబు పూసి దుర్గంధంబు మాన్చి
సారెకు నోటికిఁ జివిపుట్టఁ గూముఁ । గూరయుఁ గావించి కొద్దికొద్దిగను
వడ్డించి చెంగట వసియించి వేగ । నడ్డిసేయక సామియూరగింపుడును
నారగించిన నోరు హస్తముల్ గడిగి । నేరుపుతో నెత్తి నికట సంఘటిత
మృదుతల్పమున నుంచి మేనెల్ల నిమురుఁ।బదములు తొడనుంచి భక్తితో నొత్తు
నొకమాఱు రెండుమార్లొసఁగువీడియము। మొకముద్రిప్పక మలమూత్రంబులొత్తు
బడలక వేసటఁబడక రేబవలు । పడఁతి యిట్లుపచరింపఁగ నొక్కనాఁడు
ముని భుజింపఁగ నన్నమునఁ జీముతోడ । పెనుబ్రేలు పడె వీడి బింబోష్ఠి చూడ
నాకూడు భుజియింప కతఁడు లేచుటయు । రాకేందుముఖి వేగిరమునన బ్రేలు
కడవైచి రోఁత లేక భుజించె భర్త । విడిచిన యన్నంబు వింత వాల్గంటి!
ఆయమృతము చూచి యవమాన్మని మెచ్చి।మాయురే! గుణవతి మజ్జాతి! సాధ్వి
నీ మనోద్రఢిమకు నే మెచ్చినాఁడ । నేమికావలెఁ గోరు మిచ్చెద ననిన
నవనతవదనయై యతనికి బ్రమొక్కి । యువిద యిట్లనిపల్కె నోమహాభాగ!
మదనసంజీవని మహనీయసౌఖ్య । పదవి మనోరథ ప్రాబల్యధాత్రి
సకలేంద్రియానంద సందోహదాత్రి । స్వకన ద్రవిణలోభ వల్ల్యసిపుత్రి
కామోపభోగసంగతి గాన దాన । మామకహృదయంబు మగ్న మెయుండు
నేనుశరీరంబు లీవూన వలయు । నానాఁటికిఁ బ్రియంబు నాటికొనంగ
నభినవమదన మోహన విలాసమున । శుభకరాకార విస్ఫురణ వహించి
నావాంఛ దీర్పవే! నాస్వామి! యనిన । భూవినుతుం డాతపోనిధి పలికె
నీవాంఛ యెఱుఁగుదు నీరేజగంధి! । యీవు గోరినకోర్కె యీడేర్తు నిపుడె

ప్రారబ్ధ మనుభవింపక తీఱదెంత । వారికిఁ గాన నీవ్యాధి త్రోయకయె
యిన్నినాళ్లును గృశియింపఁగా వలసె । నన్నెగుల్ తీఱె శుద్ధాత్ముండ నైతిఁ
గంతునిఁగేరు శృంగారంబు దాల్చి । యింతటనుండి నిన్నెనసి క్రీడింతు
నంగన! వెతమాను మనుచు నాకాశ । గంగా తరంగిణీ కనకారవింద
సంగత మకరంద సౌరభాభంగ । రంగత్తరంగ పారంపరి కెగసి
యరవిందబాంధవు నపరంజిచాయ । యరదంబుపై నెక్కి యతిభక్తిఁ జొక్కి
యందుఁ గృతస్నానుఁడై దుర్వికార । సందోహముల నెల్ల జాడించి విడిడి
మనసిజోపమ భాసమాన విలాస । ఖనియై మనోహర గంధమాల్యములు
బహురత భూషణాంబరములుదాల్చి । మహనీయమహిమతో మహికేగుదెంచి
నాలాయనకి భూషణ దుకూల కుసుమ । మాలికా కర్పూర మలయజశ్రీలు
కల్పించి దానితోఁ గలసి సంతాన । కల్పక మందార ఘన పారిజాత
హరిచందనాముల కాస్పదం బగుచు । హరువొందు నందనోద్యానంబు నందు
శశధరకిరణ ప్రసార విస్తార । శిశిర స్థలములందు సింధుతీరములఁ
గైలాసగిరియందుఁ గనకాద్రియందు । నీలాచలమునందు నిషధాద్రియందు
మందరగిరియందు మాల్యవంతంబు । నందుఁ జైత్రరథంబునందు ననేక
కాలముల్ సురతసౌఖ్య రసాంబురాశి । నోలలాడుచు దాని యుమటుపాలింప్లి
కవుగిలింతలు శైలకటకంబులందు । నువిద వాతెఱ తేనెయూట త్రావుల్లు
కుసుమ మరంద భాకుంజన్మ్నులందు । నసమాంగి నునుచెక్కు టద్దంపు నొక్కు
వేడుకల్ శశికాంతవేదికలందుఁ । జేడె కీల్జడవ్రేట్ల చిన్నెలు మత్త
మధుకర నికర సమ్మర్దవల్లికల । విధుముఖ ముచ్చట వినికి కందర్ప
వాహ వికస్వరస్వర భాస్వరాతి । మోహన మాకందముల నీడలందుఁ
డెక్కు-లాడి కటీతటీ విహారముల । యెక్కు-వల్ మిన్నేటి యిసుకతిన్నెలను
వహియించి శృంగారవనుల దీవులను । బహు సహస్రాబ్దముల్ భామినిఁ గూడి
విహరించి మనమున విసివి యమ్మాని । సహజ చిదానంద ఝురములోఁ దేలి
బ్రహ్మాదులునుతింపబ్రహ్మానుభవత। బ్రహ్మభూయుండయ్యబ్రహ్మాఖ్యుఁడగుటఁ
బ్రాణంబు వాసిన పతిమేను డాసి । యేణీవిలోచన యేడ్చుచు నతనిఁ
బరిరంభణము చేసి బాష్పాంబుధార।దొరుగ హా ప్రాణేశ! తొలఁగిపోయితివె!

చాలించి నాతోడి జంజాట మెల్ల । నేలీల నిఁక నిర్వహింపుదు నేను
నినుఁ బాసి నీతోడ నేఁడగ్నిఁ జొచ్చి । కనియెదఁ బరలోకగతుని నిన్ననుచు
సాదపేర్చి పతిమేను సాదమ్మోఁదఁ జేర్చి।సుదతి యగ్నిజ్వాలఁ జొచ్చి యాఘ్రాణమె
చిరతర ధ్యానవిశేషంబు వలనఁ । బరమాత్మునఁ బ్రాపించెఁ బతిభక్తి యసదె!
తనువు వీడెడువేళఁ దనుణిభోగేచ్ఛ । తనమదిఁ బాయని తత్కారణమున
నాకళ కాశిరాజాత్మజ యయ్యె । సౌకుమార్య విలాసంపదల్ హెచ్చ
నతివ దౌర్భాగ్య మేమనవచ్చు రాజ । సుతుఁ డొకఁడైన నీసుదతి నిమ్మనుచు
నడుగరాఁడయ్యె నయ్యయె యిత్తునని।నొడఁబడ రెవ్వరిట్లొక కొన్ని యేండ్లు
కడచిన నక్కన్య కడువెత నొంది । తడయక పతికాంక్ష తనుఁ దీవరింప
నొక తపోవనమున నుగ్రునిఁ గూర్చి । యకలంకభక్తి మహానిష్ఠఁ బూని
ఘోరతపంబు గైకొని సేయుచుండె । నారామకడకు ధర్మానిలశక్ర
నాసత్య లొక్కొకనాఁడు వేర్వేఱ । నాసతో వచ్చి దేహాంతరంబునను
దమకిది పత్నిగాఁ దగునని తలఁచి । గమనించి రది కొంతకాలంబు జలము
గాలి యాహారమ్ముగాఁ గొని కొంత । కాలంబు పర్ణభక్షణ మాచరించి
పనివడి కొన్నాళ్లు పంచాగ్నిమధ్య । మున నిల్చి యొకపాదమునఁ గొన్ని నాళ్లు
నెలకొని కొన్నాళ్లు నిరశన యగుచు । సలిపె నుగ్రతపంబు సంయముల్ మెచ్చ
నాయుగ్రతపమున కభవు డింపొంది । కామజ భసిత రంగన్మూర్తి తోడ
గాలిమేపరి పదకంబుల తోడఁ । గాళిమ గులికెడు కంఠంబు తోడ
మొఱికులఁ గెడపు ముమ్మొనవాలు తోడఁ।బరిచర్య సలిపెడు ప్రమథుల తోడ
నందివాహనమెక్కి నగుమోము తోడ । ముందర నిలిచిన ముదిత హర్షించి
కరములు ముకుళించి కడుభక్తి మించి । హర! నీలకంఠ! మహాదేవ! రుద్ర!
శంకర! భక్తవశంకర! నాగ । కంకణ! ధృతగాంక్ష ? కంకణ! శరణు
దేవ! మే కృపయూ పతిం ప్రదేహ్యన్య।థా వాంఛితం నాస్తి ధవళాంగ!యనుచు
నామాటయే బోటి యైదుమార్లనిన । వామదేవుఁడు నవ్వి వామాక్షి కనియె
మగలు నీకపరజన్మమున నైదుగురు । వగవక పొమ్మన్న వనిత యిట్లనియె
మగవాని కెందఱు మానినులున్నఁ । దగుగాక బహుపతుల్ తగుదురె సతికి?
నీవరం బేనొల్ల నిభచర్మవసన! । నావుడు శివుఁడనె నలినాయతాక్షి!

యేనుమాఱులు పతినిమ్మని కాంక్ష । తో నన్నువేడి తైదుగురి నిచ్చితిని
నీవేల వగచెదు నిన్ను నిందింప । రీవసుమతి వార లీకమ్మోద నీకుఁ
బతు లనురక్తులై బహువిధ సౌఖ్య । గతు లొనఁగూర్తురు గలుగు భాగ్యంబు
ప్రత్యేక సహవాస పరిణతు లొదవు । నిత్యకుమారీత్వ నియతి మించెదవు
పతులపై భక్తిసౌభాగ్యంబు గలిగి । యతిశయించెదవన్న నది సమ్మతించి
శివుని యనుజ్ఞచే జిష్ణునిఁ బిలువ । నవలఁ బోయి సురాపగాంతికభూమి
నెలకొని యేడ్వఁ గన్నీరు సువర్ణ । జలసుహృకృతి గాఁగ జలములఁ దేల
దాని తపోమహత్త్వంబున కద్భు । తానంద కందళితాత్ముఁడై వచ్చి
వాసవుండిందేల వగచెద వతివ! । నీసోయగమునన్న నెమ్మది యులరె
నీవిధం బెఱిగింపు నిజముగా వనిన । నావెంటఁ జనుదెమ్ము నాకలోకేంద్ర!
నావెతఁ దీర్చునంత కటాక్షమున్న । నావిని దానివెంటనె వచ్చెవజ్రి
వచ్చియకొ్కండపై వరుణరూపంబు । హెచ్చఁ బార్వతితోడ నేకాగ్రవృత్తి
నెత్త మాడుచునున్న నీలకంధరుని । నత్తటి గనుగొని యలిగి వాసపుఁ డు
నిదియేమి వరుణ నీకీగర్వ మేల । యుదయించె నెత్త మీయుమ తోడనాడఁ
దగవౌనె కొండనెత్తంబున నుండి । బెగడవు లేవవు పేర్మి నన్ జూచి
... ... । ఘనబాహు విక్రమక్రమము గల్గినను
పెలుచ నీశిఖరంబు పెల్లగింపుమని । పలికిన నింద్రుండు పటుమహాసత్త్వ
పర్వతశిఖర ముత్పాటించి ... । ... ...
... ధరశృంగకుహర । మున నల్వొరున్న యద్భుతమంది యతఁడు
వీరెవ్వరోయని వికలతఁ జెంద । నారుద్రుఁడనియె మీరైదుగు రుర్వి
... ... । పతి నియోగించిన నభవుని యాజ్ఞ
ననుపమాకృతి నింద్రు లైదుగు రిలను ।
వైవస్వ తానిల వాస వాశ్వినుల । పావనాంశములతోఁ బాండురాజునకు
మగువలౌ కుంతికి మాద్రికిఁ బొడమి । పొగడొంది రాయింతి భూతేశుఁ డనుప
శ్రీమూర్తియై యాజ్ఞ సేని యనంగ । హోమానలంబున నుద్భవం బంది
ద్రౌపదీనామంబు ధరియించి వెలసి । నాపాండవులు ధర్మరాజాదు లేవు
రాపణఁతికిఁ బతులై ప్రవర్తిలిరి । భూపాలు రెల్ల నద్భుతమంది చూడ

నల యర్జునుఁడు మత్స్యయంత్రంబు నేసి । విలసిల్లెఁ గర్ణాదివీరుల నోర్చి
పాండవులకు ధర్మపత్నియై యాయ । ఖండ పాతివ్రత్య కలిత పాంచాలి
హరు ననుగ్రహమున నతిలోకకీర్తి । భరియించె హరికృపఁ బడసి రంజిల్లె
నతితపశ్శక్తి దూష్యతలేక వెలసె । నితరకామినుల (యందీ శక్తిగలదె?)
కౌరవుల్ మానభంగము సేయఁ దివుర । శౌరి యక్షయవస్త్ర (శాలినిఁజేసె)
పాంచాలి సౌశీల్యపరిణత గాదె । యెంచ నద్భుతమైన యీకథ వినిన
వారికిఁ జదివినవారికి వ్రాయు । వారికిఁ జేకూరు వరశుభోన్నతులు
అని చిల్కతెల్పెనంచ భవుండు దెలుప । వనజాక్షి గౌరి యవ్వలికథ యడిగె
నని శౌనకాది మహామునీంద్రులకు । వినిపించె సూతుండు విపులవాక్పాఠి
సరస పతివ్రతాచరితంబు నందు । వహుస ముప్పదిరెండవకథ చెన్నొందె

శ్రీ. శ్రీ. శ్రీ.

శుద్ధపత్రిక

పుట.	పంక్తి	తప్పు	ఒప్పు
1	20	విశ్వైకర్త	విశ్వైకభర్త
2	16	సెప్పఁదొడింగె	సెప్పఁదొడంగె
4	1	వలగొనిమ్రొక్కి	వలగొనిమ్రొక్క
6	24	శాపమునన్నొక్కయడవి	శాపముననొక్కయడవి
6	25	నాహరింవుచును	నాహరింపుచును
6	27	రత్నావతీకటంబు	రత్నావతీకటకంబు
9	8	రాజుఁబ్రార్థింప	రాజుప్రార్థింప
12	5	కింకణీ	కింకిణీ
12	13	భైరవస్ఫూర్తి	భైరవస్ఫూర్తి
17	9	గిరిహాంతరవీథి	గిరిగుహాంతరవీథి
19	23	చెట్టుక్కునెడ	చెట్టెక్కునెడ
20	11	మిద్రావతి	మింద్రావతి
23	13	నింద్రపాభ	నింద్రగోపాభ
29	13	చంద్రసాల	చంద్రశాల
31	19	కింపై చక్కని	కింపైన చక్కని
31	19	బలిపించి	బిలిపించి
31	27	చలువగలుగట్ట	చలువలుగట్ట
35	12	నమ్మోన్మిత్రాల	నమ్మోన్మిత్రాల
41	27	కంతుపట్టవు దేవి	కంతుపట్టపు దేవి
42	7	వెఱఁగింవు	వెఱఁగింపు
46	12	నొదేవతాగ్రణి	నోదేవతాగ్రణి
50	16	దులకెంచు	దులకించు

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
50	21	గీలొన్నకతన	గీలొక్కన్నకతన
54	16	మూర్ఖొచు	మూర్ఖొనుచు
55	17	జిలుకన్నై	జిలుకవై
57	19	గెలయు	గెలియు
59	6	శయాగాన్యం	శయ్యాగానం
60	25	అభినవమందనుండ	అభినవమదనుండ
62	23	జగన్మోహనుండు	జగన్మోహనుండు
63	5	చాతుర్యళయొ	చాతుర్యకళయొ
81	19	వాంఛాబుద	వాంఛాంబుద
86	11	జరిమి	చరిమి
86	16	మూర్ఛనై	మూర్ఛనై
98	25	యిమ్మాట	యిమ్మాట
104	16	బలిపించి	బిలిపించి
108	10	డిదెవచ్చ	డిదెవచ్చు
111	25	రత్నాంగధరణీశు	రత్నాంగదధరణీశు
119	8	దుఃఖపెట్టితి	దుఃఖపెట్టితి
121	24	నిచ్చెలి!	నిచ్చెలి
124	20	నందని	నందన
131	26	వర్ష్యఁబడసి	వర్ష్యనిఁబడసి
134	23	నందని	నందన
136	3	చంద్రాదగ	చంద్రాంగ
167	22	నొల్లఁడితని	నొల్లఁడితఁడని
169	11	కరసరోహ	కరసరోరుహ
176	7	నపారహ	నపార
183	14	రాజత	రాజిత
184	16	రాహత్తుల	రాహుత్తుల

పుట.	పంక్తి	తప్పు	ఒప్పు
192	14	వసుధేశ్వరుడు	వసుధేశ్వరుండు
221	18	మెనయని	మేయని
222	12	ననియె	వనియే
224	1	తక్కులారి	తక్కులాఁడి
228	6	యటకలి	నటకలి
228	7	కైచేసిన	కైసేసిన
229	21	వచ్చినాడని	వచ్చినాఁడని
229	23	అర్థరాజ్యంబు	అర్ధరాజ్యము
229	27	యిడఁబాసి	విడఁబాసి
229	27	నిన్ననని	నిన్ననిన
229	26	జరభి	జఱభి
232	23	ద్విజుండు	ద్విజుఁడు
248	9	యెదిగి	యెదుగి
253	27	యీయన	యీయన
254	12	యభష్టము	యభీష్టము
262	18	నృపుల	నృపుల
266	8	మూరు	మూర్తి
274	24	నెతుక	నెత్తుక
276	2	శెలమధ్య	శైలమధ్య
278	13	గొటటధ్వనుల	గొటగొటధ్వనుల
279	14	బంబి	బంచి
279	23	దానవనేన	దానవసేన
279	24	సహాస్ర	సహాస్ర
281	1	రానవేంద్రుని	దానవేంద్రుని
282	16	నిజాపుల	నిజాప్తుల
283	5	జగతీ	జగతీ

V. R. NARLA MEMORIAL LIBRARY
V. R. NARLA
P. R. I.
Acc. No.

పుట.	పం_క్తి	తప్పు	ఒప్పు
294	3	బలివచ్చునందాఁక	బతివచ్చునందాఁక
296	26	బక్కఁబాయకఁ	బక్కఁబాయక
297	5	చెప	చేప
297	25	గగనమూగ్గమున	గగనమార్గమున
300	17	యెందెన	యెందైన
300	23	ఉదకాయలమున	ఉదయకాలమున
302	15	రాజితగుణోత్పన	రాజితగుణోత్పన్న
308	15	బింబోషి	బింబోష్ఠి
309	7	విడిడి	విడిచి
311	13	వాసపుడు	వాసవుఁడు

ముద్రణ ఫాండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA104B139
పుస్తకం పేరు	పతివ్రతాచరిత్రము
తారీఖు	31 December 2025
ముందు అట్ట	no
వెనుక అట్ట	no
మొత్తం పేజీలు	
పెద్ద సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	
లేని పేజీలు	
తయారు చేసినది	
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	anusha
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good